# ఎష్ట్రకరణము తో ్రా ాచరిత్ర

## తెలుగు - పార్ట్ 2 - పేపర్ 3

## బి.ఏ. తృతీయ సంవత్సరం


***రచయితలు***

**డా॥ నాగభైరవ ఆదినారాయణ** ఎం.ఏ., పిహెచ్.డి.
రీడర్ & ప్రిన్సిపాల్
బి.ఎస్.ఎస్.బి. డిగ్రీ కళాశాల
తాడికొండ, గుంటూరు జిల్లా

**డా॥ చింతపల్లి సత్యనారాయణ** ఎం.ఏ., పిహెచ్.డి.
రీడర్
ఆర్.వి.వి.ఎన్. కళాశాల
ధరణికోట, గుంటూరు జిల్లా

**డా॥ కౌతా సుబ్రహ్మణ్యశాస్త్రి** ఎం.ఏ., పిహెచ్.డి.
రీడర్ & ఆంధ్ర శాఖాధ్యక్షులు (రిటైర్డ్)
హిందూ కళాశాల
గుంటూరు

**డా॥ రామినేని పద్మావతి** ఎం.ఏ., పిహెచ్.డి.
రీడర్
శ్రీ శారదా నికేతన్ ఓరియంటల్ కాలేజి
గుంటూరు

**డా॥ వి. నాగ రాజ్యలక్ష్మి** ఎం.ఏ.(తె), ఎం.ఏ.(సం), పిహెచ్.డి.
రీడర్
ప్రభుత్వ మహిళా కళాశాల
గుంటూరు

**డా॥ డొక్కు కృష్ణ డిటెక్టివ్** ఎం.ఏ., పిహెచ్.డి., ఎల్.ఎల్.బి.
లెక్చరర్ (తెలుగు)
యస్.పి. మహిళా హిందూ కళాశాల
మచిలీపట్నం, కృష్ణా జిల్లా

***ఉపసంపాదకులు***

**డా॥ నాగభైరవ ఆదినారాయణ** ఎం.ఏ., పిహెచ్.డి.
బి.ఎస్.ఎస్.బి. డిగ్రీ కళాశాల
తాడికొండ, గుంటూరు జిల్లా

***సంపాదకులు***

**ఆచార్య తేళ్ళ సత్యవతి** ఎం.ఏ., పిహెచ్.డి.
డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు అండ్ ఓరియంటల్ లాంగ్వేజెస్
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

***డైరెక్టర్***

**ఆచార్య వి. చంద్రశేఖర రావు,** ఎం.కామ్., పిహెచ్.డి.



## సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
నాగార్జుననగర్ - 522 510
**Ph: 0863-2293299, 2293356, 08645-211023, Cell:98482 85518**
**Website : www.anucde.com , e-mail : anucde@yahoo.com**

మాదిరి ప్రశ్నాపత్రము

# బి.ఏ. తృతీయ సంవత్సరం

# వ్యాకరణము & భాషా చరిత్ర

## తెలుగు పేపర్ - III

Time : Three hours — Max Marks : 100

'అ' 'ఆ' విభాగములలో ప్రతి భాగం నుండి రెండు ప్రశ్నలకు తక్కువ కాకుండా
మొత్తం ఐదు ప్రశ్నలకు సమాధానాలు రాయండి.
10వ ప్రశ్నకు తప్పక సమాధానం రాయాలి. అన్ని ప్రశ్నలకు మార్కులు సమానం.

అ - విభాగం

1. ఈ క్రింది సూత్రాలలో నాల్గింటికి సోదాహరణ వ్యాఖ్యలను రాయండి.

(ఎ) దీర్ఘము మీద సాధ్యపూర్ణము లేదు.
(బి) సంస్కృత ప్రాకృత తుల్యంబగు భాష తత్సమంబు
(సి) సమాసంబునందు ద్రుతంబునకు లోపంబగు
(డి) అన్యంబులకు సహిత మిక్కార్యంబులు కొండొకచోఁగానంబడియెడి.
(ఇ) కద్రువ నాగమాత
(యఫ్) ఐకారంబీతుల్యంబు
(జి) సమాస పదంబునందు సంయోగంబు పరంబగునపు డెల్లచో ఖండ బిందువునకుంబూర్ణంబగు.
(హెచ్) ఇయకు మారుగా నామాంతంబున కెత్వంబు బహుళంబుగా నగు.

2. క్రింది వానిలో నాల్గింటిని విడదీసి సంధి కార్యాలను సూత్రానుగుణంగా వివరించండి.

| | |
|---|---|
| ఎ) మాయమ్మ | బి) వచ్చి యిచ్చెను |
| సి) తావినె | డి) కట్టకడ |
| ఇ) పిడికిళులు | యఫ్) వజ్రాలు |
| జి) కొలకులు | హెచ్) జూలు |

3. ఈ క్రింది వానిలో నాల్గింటికి సంధి చేసి సూత్ర సహితంగా వివరించండి.

| | |
|---|---|
| ఎ) జవ + ఆలు | బి) కూర + కాయ |
| సి) దూత + ఇతడు | డి) ఇందున్ + జనులు |
| ఇ) తే + లు | యఫ్) గోను + లు |
| జి) హరి + లు | హెచ్) శ్రీ + ను |

4. క్రింది పారిభాషిక పదాలలో అయిదింటిని సోదాహరణంగా వివరించండి.

ఎ) ద్రుతంబు
బి) సాధ్య పూర్ణము
సి) బహుళము
డి) స్వత్వము
ఇ) వృత్తి
యఫ్) ఆమ్రేడితము
జి) అవసానము
హెచ్) వర్ణకము
(ఐ) తపరకరణము
(జె) ఔప విభక్తికములు

5. క్రింది వానిలో రెండింటిని వివరించండి.

ఎ) సంధి
బి) తద్భవము
సి) ద్విరుక్తము
డి) ఉత్తు

ఆ - విభాగం

6. ఆంధ్ర పదం వ్యాప్తిని గురించి వివరించండి.

7. ఆర్య భాషలపై ద్రావిడ భాషల ప్రభావాన్ని పరిశీలించండి.

8. తెలుగులోని అన్యదేశ్యాలను గురించి రాయండి.

9. తెలుగు లిపి పరిణామాన్ని గురించి వివరించండి.

10. క్రింది వానిలో నాల్గింటికి సమాధానాలు రాయండి.

ఎ) తెలుగు శాసనాలు - వాక్య నిర్మాణం
బి) తెలుగులో సంధి
సి) గ్రాంథిక భాషలో కారకాలు
డి) తెలుగులో సర్వనామాలు
ఇ) తెలుగులో అర్థవిపరిణామం
యఫ్) తెలుగులో మాండలికాలు
జి) సంఖ్యావాచకాలు
హెచ్) తెలుగులో ధ్వనుల మార్పు

-------------

# బి.ఏ. తృతీయ సంవత్సరం

# **వ్యాకరణము & భాషా చరిత్ర**

## **తెలుగు - పార్ట్ 2 - పేపర్ 3**

### సిలబస్

ఎ) వ్యాకరణము

బాల వ్యాకరణములు - 1) సంజ్ఞ, 2) సంధి, 3) తత్సమ, 4) ఆచ్ఛిక పరిచ్ఛేదములు

బి) తెలుగు భాషా చరిత్ర

1) ఆంధ్ర, తెనుగు, తెలుగు పదాల వ్యాప్తి, చరిత్ర
2) తెలుగు భాష - యుగ విభజన
3) తెలుగు లిపి - పరిణామము
4) ద్రావిడ భాషలు - తెలుగు స్థానము
5) తెలుగులో ధ్వనుల మార్పు
6) సంధి స్వరూపము
7) గ్రాంథిక వ్యావహారిక భాషావాదాలు
8) తెలుగులో అన్యదేశ్యాలు
9) తెలుగులో మాండలికాలు - ప్రమాణభాష
10) అర్థ పరిణామం
11) శాసన భాషా పరిణామం
12) కావ్య భాషా పరిణామం

ఆధార గ్రంథాలు


1) తెలుగు భాషా చరిత్ర - తులనాత్మక పరిశీలన, తెలుగు అకాడమీ, హైదరాబాదు.
2) తెలుగు భాషా చరిత్ర - ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి, ప్రచురణ - తెలుగు విశ్వ విద్యాలయము, హైదరాబాదు.
3) తెలుగు భాషా చరిత్ర - స్ఫూర్తిశ్రీ టి. భాస్కరరావు, గుంటూరు.

# విషయ సూచిక


| పాఠం | | | |
|---|---|---|---|
| 1. | సంజ్ఞా పరిచ్ఛేదం (సోదాహరణ వ్యాఖ్యలు - 1 నుండి 23 సూత్రాలు) | ... | 1-18 |
| 2. | సంధి పరిచ్ఛేదం (సోదాహరణ వ్యాఖ్యలు - 1 నుండి 27 సూత్రాల వరకు) | ... | 1-12 |
| 3. | సంధి పరిచ్ఛేదం (సోదాహరణ వ్యాఖ్యలు - 28 నుండి 55 సూత్రాల వరకు) | ... | 1-13 |
| 4. | సంధి పరిచ్ఛేదం - పారిభాషిక పదాలు - వ్యాసరూప ప్రశ్నలు | ... | 1-12 |
| 5. | సంధి పరిచ్ఛేదం - రూప సాధన | ... | 1-15 |
| 6. | తత్సమ పరిచ్ఛేదం (సోదాహరణ వ్యాఖ్యలు - 1 నుండి 38 సూత్రాల వరకు) | ... | 1-16 |
| 7. | తత్సమ పరిచ్ఛేదం (సోదాహరణ వ్యాఖ్యలు - 39 నుండి 66 సూత్రాల వరకు) | ... | 1-17 |
| 8. | తత్సమ పరిచ్ఛేదం (సోదాహరణ వ్యాఖ్యలు - 67 నుండి 87 సూత్రాల వరకు) | ... | 1-18 |
| 9. | తత్సమ పరిచ్ఛేదం - పారిభాషిక పదాలు - వ్యాసరూప ప్రశ్నలు | ... | 1-16 |
| 10. | ఆచ్ఛిక పరిచ్ఛేదం - పారిభాషిక పదాలు<br>(సోదాహరణ వ్యాఖ్యలు - 1 నుండి 14 సూత్రాల వరకు) | ... | 1-13 |
| 11. | ఆచ్ఛిక పరిచ్ఛేదం (సోదాహరణ వ్యాఖ్యలు - 15 నుండి 27 సూత్రాల వరకు) | ... | 1-10 |
| 12. | ఆచ్ఛిక పరిచ్ఛేదం (సోదాహరణ వ్యాఖ్యలు - 28 నుండి 38 సూత్రాల వరకు)<br>వ్యాసరూప ప్రశ్నలు | ... | 1-12 |
| 13. | (1) ఆంధ్రము-తెనుగు-తెలుగు పదాల చరిత్ర - వ్యాప్తి<br>(2) తెలుగు భాష యుగ విభజన | ... | 1-21 |
| 14. | (1) తెలుగు లిపి - పరిణామం<br>(2) ద్రావిడ భాషలు - తెలుగు స్థానం | ... | 1-20 |
| 15. | (1) తెలుగులో ధ్వనుల మార్పులు<br>(2) సంధి స్వరూపం | ... | 1-17 |
| 16. | (1) గ్రాంథిక వ్యావహారిక భాషావాదాలు<br>(2) తెలుగులో అన్యదేశ్యాలు | ... | 1-19 |
| 17. | (1) తెలుగులోని ప్రధాన మాండలికాలు<br>(2) ప్రామాణిక భాష<br>(3) అర్థ పరిణామం | ... | 1-45 |
| 18. | (1) శాసన భాషా పరిణామం<br>(2) కావ్య భాషా పరిణామం | ... | 1-35 |

# పాఠం - 1

# సంజ్ఞా పరిచ్ఛేదం

పాఠ్యనిర్మాణక్రమం

1.0 లక్ష్యం
1.1 పారిభాషిక పదాలు
1.2 సోదాహరణ వ్యాఖ్యలు (1 నుండి 23 సూత్రాలు)
1.3 వ్యాసరూప ప్రశ్నలు
1.4 సమీక్ష
1.5 ప్రశ్నలు
1.6 ఆధార గ్రంథాలు

## 1.0 లక్ష్యం

బాల వ్యాకరణంలో సంజ్ఞా పరిచ్ఛేదంలోని పారిభాషిక పదాలను, సూత్రాలకు భావాలు, విశేషాంశాలు, వివరాలు తెలియజేయడం.

## 1.1 పారిభాషిక పదాలు

1.1.1. అచ్చులు : వర్ణమాలలోని 'అ' కారం నుండి 'ఔ' వరకు గల అక్షరాలను అచ్చులు అంటారు.

అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఌ, ౡ, ఋ, ౠ, ఎ, ఏ, ఐ, ఒ, ఓ, ఔ, అనే 16 అక్షరాలు అచ్చులు.

1.1.2. హల్లులు : వర్ణమాలలో 'క' నుండి 'ళ' వరకు గల అక్షరాలను హల్లులు అంటారు.

క, ఖ, గ, ఘ, ఙ, చ, ౘ, ఛ, జ, ౙ, ఝ, ఞ, ట, ఠ, డ, ఢ, ణ, త, థ, ద, ధ, న, ప, ఫ, బ, భ, మ, య, ర, ఱ, ల, వ, శ, ష, స, హ, ళ, అనే 37 అక్షరాలు హల్లులు.

1.1.3. వక్రాలు : వక్రంగా వ్రాయబడే అక్షరాలను వక్రాలు అంటారు.

వర్ణమాలలోని ఎ, ఏ, ఒ, ఓ, లను వక్రాలు అంటారు.

1.1.4. వక్రతమాలు : మిక్కిలి వక్రంగా వ్రాయబడే అక్షరాలను వక్రతమాలు అంటారు.

వర్ణమాలలోని ఐ, ఔ, లను వక్రతమాలు అంటారు.

1.1.5. సాధ్యపూర్ణం : వ్యాకరణ కార్యం ద్వారా సాధింపబడిన పూర్ణబిందువునకు (నిండు సున్న) సాధ్యపూర్ణం అనిపేరు.

ఉదా :- పూచెంగలువలు.

ఇందులోని సున్న శబ్దంలో సహజంగా ఉన్నా, సున్న కాదు. ఆదేశ సరళాలకు ముందున్న ద్రుతం వ్యాకరణ కార్యం ద్వారా పూర్ణబిందువుగా మారింది. కనుక ఇది సాధ్యపూర్ణం.

1.1.6. పరుషాలు : పరుషంగా ఉచ్చరించబడే అక్షరాలను పరుషాలు అంటారు.

క, చ, ౘ, ట, త, ప, అనే హల్లులు పరుషాలు.

1.1.7. సరళాలు : సరళంగా ఉచ్చరించబడే అక్షరాలను సరళాలు అంటారు.

గ, జ, ౙ, డ, ద, బ, అనే హల్లులు సరళాలు.

1.1.8. స్థిరాలు : పరుష సరళాలు కాక మిగిలిన హల్లులు స్థిరాలు.

ఖ, ఘ, ఙ, ఛ, ఝ, ఞ, ఠ, ఢ, ణ, త, థ, న, ఫ, భ, మ, య, ర, ల, వ, శ, ష, స, హ, ళ .. అనే అక్షరాలు స్థిరాలు.

1.1.9. దంత్యాలు : దంతాలు ఉత్పత్తి స్థానంగా ఉండే అక్షరాలకు దంత్యాలు అని పేరు.

త, థ, ద, ధ, న, మొదలయిన అక్షరాలు దంత్యాలు.

1.1.10. తాలవ్యాలు : తాలువు ఉత్పత్తి స్థానంగా ఉండే అక్షరాలను తాలవ్యాలు అంటారు.

చ, ఛ, జ, ఝ, ఞ, మొదలయిన అక్షరాలు తాలవ్యాలు.

1.1.11. ఉపధ : ఒక పదంలో చివరి అక్షరానికి ముందుండే అక్షరానికి ఉపధ అని పేరు.

ఉదా : (వీచి) వ్ + ఈ + చ్ + ఇ. ఇందు చివరి అక్షరం ఇ. దానికి ముందున్న అక్షరం చ్. కనుక ఈ పదంలో 'చ్' అనేది ఉపధ.

1.1.12. తత్సమం : సంస్కృత, ప్రాకృత తుల్యమైన భాష తత్సమం. అంటే సంస్కృతంతో గాని ప్రాకృతంతో గాని సమానమైన తెలుగు శబ్దానికి తత్సమం అని పేరు.
ఉదా : 'రామః' అనే సంస్కృత శబ్దానికి 'రాముడు' తత్సమం. 'ధేనుః' అనే సంస్కృత శబ్దానికి 'ధేనువు' తత్సమం. 'అగ్గీ' అనే ప్రాకృత శబ్దానికి 'అగ్గి' తత్సమం. 'సిరీ' అనే ప్రాకృత శబ్దానికి 'సిరి' తత్సమం.

1.1.13. తద్భవం : సంస్కృత ప్రాకృత భవమైన భాష తద్భవం. అంటే సంస్కృత ప్రాకృత భాషల నుండి పుట్టిన భాష తద్భవం.
ఉదా : 'ఆకాశం' అనే సంస్కృత శబ్దం మార్పు చెంది 'ఆకసం' అనే తద్భవంగా మారుతుంది.
'చంద్రవి' అనే సంస్కృత శబ్దం మార్పు చెంది 'చందురుడు' అనే తద్భవంగా మారుతుంది.
'అచ్ఛరా' అనే ప్రాకృత శబ్దం మార్పు చెంది 'అచ్ౘర' అనే తద్భవంగా మారుతుంది.
'లచ్చీ' అనే ప్రాకృత శబ్దం మార్పు చెంది 'లచ్చి' అనే తద్భవంగా మారుతుంది.

1.1.14. దేశ్యం : త్రిలింగ దేశంలో వాడుకలో ఉన్న భాష దేశ్యం.

ఉదా : ఊరు, పేరు, ఇల్లు, ముల్లు, కోట, పేట, దూడ, మేడ, కోత, లేత, తాలి, మోవి మొదలైనవి దేశ్య పదాలు.

1.1.15 గ్రామ్యం : వ్యాకరణ శాస్త్రానికి విరుద్ధమైన భాష గ్రామ్యం.

ఉదా : వస్తాడు, తెస్తాడు, వచ్చేవి, తెచ్చేవి, వచ్చేవాడు, తెచ్చేవాడు, వచ్చేటివాడు, తెచ్చేటివాడు.

ఒకప్పుడు ఈ భాష గ్రంథ రచనలో ఉపయోగించడానికి యోగ్యమయింది కాదు అని భావించేవారు.

1.1.16 ద్రుతం : ద్రుతం అంటే లోపించునది అని అర్థం. లోపించినా పదం యొక్క అర్థం మారకుండా ఉండే ప్రత్యయాత్మం, ఆగమాత్మకం, అవ్యయాత్మకం అయిన 'న' కారానికి ద్రుతం అని పేరు.

ఉదా : నన్ను<u>ను</u>, నా చేత<u>ను</u>, ఎంతయు<u>ను</u>

ఇందలి 'ను' అనే అక్షరాలు లోపించినా అర్థంలో మార్పు ఉండదు గనుక ఈ 'ను' అనేది ద్రుతం.

1.1.17 ద్రుతప్రకృతికం: ద్రుతాంతాలు అయిన పదాలు ద్రుతప్రకృతికాలు. అంటే ద్రుతం చివరలో ఉన్న పదాలను ద్రుతప్రకృతికాలు అంటారు.

ఉదా : నన్నున్, నా చేతన్
వత్తున్, వచ్చెన్
వచ్చెడున్, కావుతన్
కొట్టుచున్, కొట్టగన్
నేను, తాను, వలె మొదలయినవి ద్రుతప్రకృతికాలు.

1.1.18 లఘువు : తేలికగా పలుకబడే అక్షరాలు లఘువులు.

ఉదా : 'హరి<u>యు</u>తడు' లోని ఆగమ 'య' కారం తేలికగా పలుకబడుతుంది గనుక అది లఘువు. 'పెరుగు' లోని 'ర' కారం, 'తల' లోని 'ల' కారం, 'అతడు వలికె' లోని ఆగమ 'వ' కారం లఘువులు.

1.1.19 అలఘువు : ఊది పలుకబడే అక్షరాలు అలఘువులు.

ఉదా : 'కాయ' పదంలోని శబ్ద సహజమైన 'య' కారం. 'మెఱుగు' లోని శకటరేఫం, 'త్రాళులు' లోని ఆదేశమైన 'ళ' కారం, 'తావి' లోని శబ్ద సహజమైన 'వ' కారం అలఘువులు.

## 1.2 సోదాహరణ వ్యాఖ్యలు (1 నుండి 23 సూత్రాలు)

1.2.1 సూత్రం : సంస్కృతమునకు వర్ణము లేబది.

పదవిభాగం : సంస్కృతమునకు వర్ణములు ఏబది.

భావం : సంస్కృత భాషకు 50 అక్షరాలు ఉంటాయి. వాటిలో 'అ' కారం మొదలయిన అక్షరాలను అచ్చులు అని, 'క' కారం మొదలయిన అక్షరాలను హల్లులు అని అంటారు. అచ్చు, హల్లుల విభాగం (అజ్ఝ ల్విభాగము) తర్వాత సూత్రాలలో ఇలాగే గ్రహించాలి.

వివరణ : సంస్కృత భాషలో అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ, ౠ, ఌ, ౡ, ఏ, ఐ, ఓ, ఔ, అం, అః, క, ఖ, గ, ఘ, ఙ, చ, ఛ, జ, ఝ, ఞ, ట, ఠ, డ, ఢ, ణ, త, థ, ద, ధ, న, ప, ఫ, బ, భ, మ, య, ర, ల, వ, శ, ష, స, హ, ళ, అనే 50 అక్షరాలున్నాయి. వీనిలో అకారం మొదలయిన వాటికి అచ్చులని, కకారం మొదలయిన వాటికి హల్లులు అని పేరు.

1.2.2 సూత్రం : ప్రాకృతమునకు వర్ణములు నలువది.

భావం : ప్రాకృత భాషకి 40 అక్షరాలున్నాయి.

వివరణ : ప్రాకృత భాషలో అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఏ, ఓ, అం, అః, క, ఖ, గ, ఘ, చ, ఛ, జ, ఝ, ట, ఠ, డ, ఢ, త, థ, ద, ధ, న, ప, ఫ, బ, భ, మ, య, ర, ల, వ, స, హ, ళ, అనే 40 అక్షరాలు ఉన్నాయి. హ్రస్వ వక్రాలయిన ఎ, ఒ లు కూడా ప్రాకృతంలో ఉన్నాయని కొందరు అంటారు. వక్రతమాలు అని పిలువబడే ఐ, ఔ లు కూడా ప్రాకృతంలో ఉన్నాయని మరి కొందరు అంటారు. వక్రాలను, వక్రతమాలను కూడ గ్రహిస్తే ప్రాకృతానికి వానితో కలిపి 44 అక్షరాలవుతాయి.

1.2.3 సూత్రం : తెనుగునకు వర్ణములు ముప్పదియాఱు.

భావం : అచ్చ తెనుగు భాషకు 36 అక్షరాలు ఉంటాయి.

వివరణ : అచ్చ తెనుగు భాషలో అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఎ, ఏ, ఐ, ఒ, ఓ, ఔ, అం, అఁ, క, గ, చ, ౘ, జ, ౙ, ట, డ, ణ, త, ద, న, ప, బ, మ, య, ర, ల, వ, స, హ, ళ, అనే అక్షరాలు ఉంటాయి. అచ్చ తెనుగులో ఉండే ఎ, ఒ, ౘ, ౙ, లు సంస్కృత భాషలో కనిపించవు.

1.2.4 సూత్రం : ఋ, ౠ, ఌ, ౡ, విసర్గ, ఖ, ఛ, ఠ, థ, ఫ, ఘ, ఝ, ఢ, ధ, భ, ఙ, ఞ, శ, ష లు సంస్కృత సమంబులను గూడి తెలుగున వ్యవహరింపంబడు.

భావం : పైన సూత్రంలో చెప్పబడిన ఋ, ౠ, నుండి శ, ష వరకు ఉన్న అక్షరాలు సంస్కృత సమాలతో కూడి తెలుగు భాషలో వ్యవహరింపబడుతూ ఉంటాయి. పై పందొమ్మిది అక్షరాలు తెలుగు పదాలలో ఉండవని, సంస్కృత భాష నుండి తెలుగు లోకి వచ్చే తత్సమాల్లో మాత్రమే ఈ అక్షరాలు ఉంటాయని భావం.

ఉదా : ఋతువు, పితౄణము, క్లుప్తము, ౡకారము, దుఃఖము, ఖడ్గము, ఘటము, ఛత్రము, ఝురము, కంఠము, ఢక్క, రథము, ధరణి, ఫణము, భయము, పఙ్క్తి, ఆజ్ఞ, శరము, షండము.

సమన్వయం : పై పదాల్లో క్రింద గీత గీయబడిన అక్షరాలు సంస్కృత సమాలతో పాటు తెలుగులో వ్యవహరింప బడుతున్నాయి. తెలుగు భాషలో ఈ 19 అక్షరాలతో ఉన్న పదాలు సంస్కృత సమాలుగా గుర్తించవచ్చు.

1.2.5 సూత్రం : క చ ట త ప లు పరుషంబులని, గ జ డ ద బ లు సరళంబులని చెప్పంబడు.

భావం : వర్ణమాలలోని క చ ట త ప లను పరుషాలని, గ జ డ ద బ లను సరళాలని అంటారు.

వివరణ : పరుషంగా ఉచ్చరింపబడే అక్షరాలను పరుషాలని, సరళంగా ఉచ్చరించబడే అక్షరాలను సరళాలని అంటారు. వర్ణమాలలోని క చ ట త ప లు పరుషాలు. గ జ డ ద బ లు సరళాలు.

1.2.6 సూత్రం : ఇతరములగు హల్లులు స్థిరములు.

భావం : వర్ణమాలలోని హల్లులలో పరుషాలు, సరళాలు తప్ప మిగిలిన హల్లులను స్థిరాలు అని అంటారు.

వివరణ : ఖ, ఘ, ఙ, ఛ, ఝ, ఞ, ఠ, ఢ, ణ, థ, ధ, న, ఫ, భ, మ, య, ర, ల, వ, శ, ష, స, హ, ళ, అనే హల్లులను స్థిరాలు అని అంటారు.

1.2.7 సూత్రం : దంత్య తాలవ్యంబులయిన చ జ లు సవర్ణంబులు.

భావం : దంత్య తాలవ్యాలైన చ కారాలు సమానమైన అక్షరాలు. అలాగే దంత్య తాలవ్యాలైన జ కారాలు సమానాలు. తాలవ్య చ కారం దంత్య చ కారానికి, తాలవ్య జ కారం దంత్య జ కారానికి సమానమని అర్థం.

వివరణ : చ కారాన్ని దంత్యంగా, తాలవ్యంగా ఉచ్చరిస్తారు. అదే విధంగా జ కారాన్ని కూడా దంత్యంగా, తాలవ్యంగా పలుకుతారు. తాలవ్య చ కారానికి విధించే వ్యాకరణ కార్యాలు దంత్య చ కారానికి వర్తిస్తాయి. అదే విధంగా తాలవ్య జ కారానికి విధించే వ్యాకరణ కార్యాలు దంత్య జ కారానికి వర్తిస్తాయి. దంత్య చ కారం పరుషమయితే తాలవ్య చ కారం కూడా పరుషమవుతుంది. అలాగే దంత్య జ కారం సరళమయితే తాలవ్య జ కారం కూడా సరళమే అవుతుంది.

1.2.8 సూత్రం : ఇ, ఈ, ఎ, ఏ, లంగూడిన చ జ లు తాలవ్యంబులు.

పదవిభాగం : ఇ, ఈ, ఎ, ఏ, లన్ + కూడిన చ జ లు తాలవ్యంబులు.

భావం : ఇ, ఈ, ఎ, ఏ, అనే అచ్చులతో కూడిన చ జ లు తాలవ్యాలు.

ఉదా : చిలుక, చీమ, చెలి, చేమ, జిల, జీడి, జెట్టి, జేజే.

సమన్వయం : తాలువు ఉత్పత్తి స్థానంగా ఉండే అక్షరాలు తాలవ్యాలు. అచ్చ తెనుగు శబ్దాలలో ఇ, ఈ, ఎ, ఏ అను అచ్చులతో కూడిన చ, జ లు తాలవ్యాలుగా పలుకబడతాయి. చిలుక, చీమ, చెవి, చేమ ల్లోని చ కారాలు ఇ ఈ ఎ ఏ లతో కూడినవి గనుక ఆ చ కారాలు తాలవ్యాలు. అలాగే జిల, జీడి, జెట్టి, జేజె ల్లోని జ కారాలు ఇ ఈ ఎ ఏ లతో కూడి ఉన్నాయి కాబట్టి వాటిని తాలవ్యాలుగా పలకాలి.

1.2.9 సూత్రం : అ, ఆ, ఉ, ఊ, ఒ, ఓ, ఔ లంగూడిన చ జ లు దంత్యంబులు.

పదవిభాగం : అ, ఆ, ఉ, ఊ, ఒ, ఓ, ఔ లన్ + కూడిన చ జ లు దంత్యంబులు.

భావం : అ, ఆ, ఉ, ఊ, ఒ, ఓ, ఔ అనే అచ్చులతో కూడిన చ జ లు దంత్యాలు.

ఉదా : చలి, చాప, చుక్క, చూపు, చొక్కు, చోటు, చౌక, జముడు, జాతర, జున్ను, జూలు, జొన్న, జోలి, జౌకు.

సమన్వయం : దంతాలు ఉత్పత్తి స్థానంగా ఉండే అక్షరాలు దంత్యాలు. పై ఉదాహరణలో చ కార జ కారాలు అ, ఆ, ఉ, ఊ, ఒ, ఓ, ఔ అనే అచ్చులతో కలిసి ఉన్నాయి కాబట్టి వీటిని దంత్యాలుగా ఉచ్చరిస్తారు.

విశేషాంశాలు : ఐ దంతాలైన అంటే ఐ కారం చివరలో ఉండే చ, జ లు (చై, జై అనేవి) అచ్చ తెనుగు భాషలో లేవు. చై, జై లతో కూడిన చైత్రం, జైనం మొదలైన పదాలు సంస్కృత సమాలుగా గుర్తించాలి.

1.2.10 సూత్రం : సంస్కృత సమములం దికారాంతములయిన శబ్దముల యుపధా చ జ లు బహువచనంబు పరంబగు నపుడు దంత్యములగును.

భావం : సంస్కృత సమాల్లో హ్రస్వ ఇకారం చివర ఉన్న శబ్దాల్లో ఉపధ స్థానంలో చ జ లు ఉంటే, బహువచనం పరమయ్యేటప్పుడు ఆతాలవ్య చ జ లు దంత్యాలుగా మారతాయి.

ఉదా : ఆర్చి (చకారం తాలవ్యం) ఆర్చులు (చకారం దంత్యం). అట్లే రోచి - రోచులు, వీచి - వీచులు, రాజి - రాజులు, వాజి - వాజులు.

సమన్వయం : సంస్కృతంలో దంత్య చ జ లు లేవు. ఆర్చి, రోచి, వీచి, రాజి, వాజి మొదలైన పదాల్లోని చ, జ లు తాలవ్యాలు. వీనికి బహువచనం పరమయ్యేటప్పుడు ఆర్చులు (ఆర్చి + లు) రోచులు (రోచి + లు) ఇలాంటి రూపాలు ఏర్పడతాయి. ఇలాంటి బహువచన రూపాల్లో ఉండే చ, జ లు దంత్యాలుగా ఉచ్చరింప బడతాయి.

విశేషాంశాలు : సంస్కృత పదాల్లో రాజు శబ్దంలోని జకారం దంత్యంగా కనిపిస్తున్నది. చంద్రుడు, చామరం చోరుడు, జయం, జాతి, జుగుప్స మొదలైన తత్సమ పదాల్లోని చ జ లు అన్నీ తాలవ్యాలే.

1.2.11 సూత్రం : నకారంబు ద్రుతంబు.

భావం : ప్రత్యయాత్మకం, ఆగమాత్మకం, అవ్యయాత్మకం అయిన 'ను' అనే వర్ణంగాని, 'న్' అనే వర్ణంగాని ద్రుతం అనబడుతుంది.

ఉదా : నన్ను<u>ను</u>, నాచేత<u>ను</u>, ఎంతయు<u>ను</u>,

నన్ను<u>న్</u>, నాచేత<u>న్</u>, ఎంతయు<u>న్</u>

సమన్వయం : పై పదాల్లో క్రింద గీతలుంచిన 'ను', 'న్' అనే వర్ణాలు ద్రుతాలు. వీనిని తొలగించినా అర్థాల్లో మార్పు ఉండదు.

1.2.12 సూత్రం : ద్రుతాంతములయిన పదములు ద్రుత ప్రకృతికములు.

భావం : ద్రుతమైన నకారం అంతంలో ఉన్న పదాలు ద్రుతప్రకృతికాలు.

క్రింది పదాలు ద్రుత ప్రకృతికాలు.

1. ప్రథమ కయిపట్టి యొక్కేతరములయిన విభక్తులు.

ఉదా : నన్నున్, నా చేతన్, నా తోడన్, నాకున్ మొదలైనవి.

2. ఉత్తమ పురుష ఏకవచనాలు.

ఉదా : వత్తున్, వచ్చెదన్

3. భూత ప్రథమ పురుష ఏకవచనాలు.

ఉదా : వచ్చెన్.

4. తద్ధర్మా ద్యర్థక ప్రథమ పురుష ఏకవచనాలు.

ఉదా : వచ్చున్, వచ్చెడున్.

5. ఆశీరాద్యర్థకాలైన యెడు, త వర్ణకాలు

ఉదా : ప్రసన్నులయ్యెడున్, కావుతన్.

6. శతృ తుమానంతర్య చేదాద్యర్థకాలు.

ఉదా : కొట్టుచున్, కొట్టన్, కొట్టగన్, కొట్టుడున్, కొట్టినన్.

7. నేను, తాను పదాలు.

8. వలెన్, ఎంతయున్, పోలెన్, అయ్యున్, మొదలయిన అవ్యయాలను ద్రుత ప్రకృతికాలు అంటారు.

1.2.13 సూత్రం : ద్రుత ప్రకృతులు గాని శబ్దంబులు కళలనంబడు.

భావం : ద్రుత ప్రకృతికాలు కాని శబ్దాలను కళలు అంటారు.

ఉదా : రాముడు, రాములు, హయము, గోడ, మేడ, అయ్య, అమ్మ, రామునికయి, జ్ఞానముఁబట్టి, నాయొక్క, వచ్చిరి, వచ్చితివి, వచ్చితిరి, వచ్చితిమి, రాడు, రారు, రాదు, రావు, రాము, కొట్టక, తిట్టక, ఎత్తిలి, ఒత్తిలి, ఊరక, మిన్నక, బళి, అక్కడ మొదలయినవి కళలు.

సమన్వయం : రాముడు మొదలైన పదాల్లో చివర ద్రుతమైన నకారం లేదు కాబట్టి ఇవన్నీ కళలు.

1.2.14 సూత్రం : హ్రస్వము మీది ఖండ బిందువునకు పూర్ణబిందువు వైకల్పికముగ నగును.

భావం : హ్రస్వం తరువాత అరసున్నా ఉంటే అది వైకల్పికంగా నిండు సున్న అవుతుంది.

ఉదా :

| | | |
|---|---|---|
| అడఁకువ | - | అడంకువ |
| అరఁటి | - | అరంటి |
| ఎఱుఁగుట | - | ఎఱుంగుట |
| బలఁగము | - | బలంగము |
| మగఁటిమి | - | మగంటివి |

సమన్వయం : హ్రస్వం తరువాత ఉన్న అరసున్న నిండు సున్నగా మారుతుంది. వైకల్పికం అనడం చేత అరసున్నా

రూపంకూడ ఉంటుంది. కనుక అడఁకువ, అడంకువ అనే రూపాలు రెండును సాదురూపాలే. ఇలాగే మిగిలిన ఉదాహరణలను గ్రహించాలి.

1.2.15 సూత్రం : దీర్ఘము మీద సాధ్యపూర్ణము లేదు.

భావం : దీర్ఘమైన అక్షరం తరువాత వ్యాకరణ సూత్రం ప్రకారం వచ్చే పూర్ణబిందువు ఉండదు.

ఉదా : వాఁడు.

సమన్వయం : ఇందు 'వా' లోని 'ఆ' దీర్ఘం. దీని తరువాత వ్యాకరణ సూత్రం అనుసరించి వచ్చే నిండు సున్న ఉండదు. అంటే వాండు అనే రూపం సాధువు కాదు. అరసున్న ఉన్న వాఁడు, రాఁడు, లేఁడు, కాఁబోలు, కాఁబట్టి, గోఁగులు, రేఁగులు మొదలైన పదాల్లో అరసున్నాలే ఉంటాయి. నిండు సున్నాలు ఉండవు.

1.2.16 సూత్రం : సంస్కృత సమేతరములయిన తెలుగు శబ్దములయందు పరుష సరళములకు ముందే బిందువు కానంబడుచున్నది.

భావం : సంస్కృత సమాలు కాకుండా ఉన్న తెలుగు శబ్దాల్లో అంటే అచ్చ తెనుగు శబ్దాల్లో పరుష సరళాలకు ముందు మాత్రమే బిందువు కనిపిస్తుంది.

ఉదా : వంకర, కలఁకువ, మంచు, త్రాచు, దంట, దాఁటు, కొంత, కోఁత.

సమన్వయం : పై ఉదాహరణల్లో ఖండ బిందువు (అర సున్న) గాని పూర్ణ బిందువు (నిండు సున్న) గాని పరుషాలకు ముందే ఉన్నది. అలాగే చెంగు, రెండు, ముందు, కంప మొదలైన అచ్చ తెనుగు శబ్దాలో సరళాలకు ముందు మాత్రమే బిందువు కనిపిస్తున్నది.

స్థిరాలకు ముందు అచ్చ తెనుగు శబ్దాల్లో బిందువు ఉండదని, ఏదైనా శబ్దంలో స్థిరాలకు ముందు బిందువు ఉంటే ఆ శబ్దం సంస్కృత సమమని గ్రహించాలి.

ఉదా : హంస, శంఖం.

1.2.17 సూత్రం : యకారంబును, వు, వూ, వొ, వో లును తెలుగు మాటలకు మొదట లేవు.

భావం : 'య' గుణింతంలోని అక్షరాలు గాని, వు, వూ, వొ, వో అను అక్షరాలు గాని అచ్చ తెనుగు మాటలకు మొదటి అక్షరాలుగా ఉండవు.

వ్యాఖ్య : ఎవడు, ఎక్కడ, ఏల మొదలైన శబ్దాలను యెవడు, యెక్కడ, యేల, అని వ్రాస్తూ ఉంటారు. అదే విధంగా 'ఊరు'ను 'వూరు' అని, 'ఒకడు'ను 'వొకడు' అని కూడా వ్రాస్తారు. ఇలాంటి చోట్ల మాటకు మొదట అచ్చులు తప్ప య గుణింతంలోని అక్షరాలు గాని, వు, వూ, వొ, వో, లు గాని కాదని ఈ సూత్రం ద్వారా చెప్పబడింది. క్రింది తప్పుల సహజ రూపాలను సూత్రం ద్వారా తెలుసుకోవచ్చు.

| తప్పు | ఒప్పు |
|---|---|
| యెవడు | ఎవడు |
| యెక్కడ | ఎక్కడ |
| యేమి | ఏమి |
| యేల | ఏల |
| వుండ | ఉండ |
| యూరు | ఊరు |
| వొకడు | ఒకడు |
| వోడ | ఓడ |

విశేషాంశాలు : హరి యతడు, నిద్ర వోయే అనే చోట్ల య, వో అనే అక్షరాలు పదాలకు మొదట ఉండే అక్షరాలు అని భావించకూడదు. అవి సంధి వశం చేత వచ్చిన యకారం, వకారం తప్ప సహజమైన యకార వకారాలు కాదు.

హరి + అతడు = హరియతడు (యడాగమసంధి)
నిద్ర + పోయె = నిద్రవోయె (గసడదవాదేశసంధి)

సంస్కృత సమాల్లో కూడా వోఢృ, వోఢవ్య శబ్దాల్లో మాత్రమే 'వో' పదాదిలో కనిపిస్తుంది. ఇవి తప్ప సంస్కృత సమాల్లో వు, వూ, వోలతో ప్రారంభమయ్యే శబ్దాలు లేవు. తెలుగు లోని మిగిలిన సంస్కృత సమాలను ఈ క్రింది విధంగా వ్రాయాలి.

ఉదా : ఉదకము, ఊర్మిళ, ఓదనము.

పై పదాల్లోని ఉ, ఊ, ఓ లను అచ్చులుగానే వ్రాయాలి తప్ప వు, వూ, వో లతో వ్రాయకూడదని భావం.

1.2.18 సూత్రం : య ర ల వ లు లఘువులని య ల ఘు వు లని ద్వివిధంబులగు.

భావం : య, ర, ల, వ అనే నాలుగు అక్షరాలు లఘువులుగా, అలఘువులుగా రెండు విధాలుగా ఉచ్చరించ బడతాయి.

వ్యాఖ్య : లఘువు అంటే తేలికగా ఉచ్చరించబడేది. అలఘువు అంటే ఊది పలుకబడేది. య ర ల వ అనే అక్షరాలు కొన్ని చోట్ల తేలికగా, మరికొన్ని చోట్ల ఊది పలుకబడుతూ ఉంటాయి. ఈ నాలుగు అక్షరాలను ఎక్కడ తేలికగా పలకాలో, ఎక్కడ ఊది పలకాలో క్రింది ఉదాహరణల ద్వారా తెలుసు కోవచ్చు.

యకారం : హరి + అతడు = హరియతడు. ఇక్కడి యకారం సంధి కారణంగా వచ్చిన ఆగమ యకారం తప్ప శబ్ద సహజమైన యకారం కాదు. వ్యాకరణ కార్యం ద్వారా వచ్చిన ఆగమ యకారం లఘువుగా అంటే తేలికగా ఉచ్చరించాలి. కాయ, మాయ మొదలైన శబ్దాల్లో ఉండే శబ్ద సహజమైన యకారం అలఘువుగా అంటే ఊది పలకాలి.

రకారం : విఱుగు, మెఱుగు మొదలైన శబ్దాల్లో ఉండే రకారం అలఘువు. దీనినే శకట రేఫ అని కూడా అంటారు. ఈ శకట రేఫం తత్సమాల్లో గాని, తద్భవాల్లో గాని ఉండదు.
పెరుగు, కరుగు మొదలైన పదాల్లో ఉండే రేఫం లఘువుగా పలుకబడుతుంది.

లకారం : ఏరు + లు = ఏళులు. పాలు + లు = పాళులు, త్రాడు + లు = త్రాళులు. ఇలాంటి చోట్ల బహువచనం పరమయ్యేటప్పుడు ర, ల, డ లకు బదులుగా ళకారం వస్తుంది. ఇలా ఆదేశంగా వచ్చే ళకారం అలఘువు. తల్ల, నెల్ల, మొదలైన పదాల్లోని లకారం లఘువు.

వకారం : అతడు + పలికె = అతడు వలికె. పకారానికి గసడదవాదేశసంధి ననుసరించి ఆదేశంగా వచ్చిన వకారం లఘువు. శబ్దంలో సహజంగా ఉండే వకారం అంటే వల, వాగు మొదలైన పదాల్లో ఉండే వకారం అలఘువు.

విశేషాంశం : వర్ణమాలలో ళకారం ఉంది. ఇది లకారానికి ఆదేశంగా వచ్చిన అలఘు ళకారం కాదు. కళ, మంగళం మొదలైన చోట్ల ఉండే ళకారం వర్ణమాలలోని ళకారం మాత్రమే.

**1.2.19** సూత్రం : సంస్కృత ప్రాకృత తుల్యంబగు భాష తత్సమంబు.

భావం : సంస్కృతంతో గాని, ప్రాకృతంతో గాని సమానమైన భాషకు తత్సమం అని పేరు.

వ్యాఖ్య : సంస్కృతంలో ఉండే కొన్ని శబ్దాలు తెలుగు ప్రత్యయాలతో తెలుగులోకి వచ్చాయి. రామః అనే సంస్కృత శబ్దం ఉత్వడుజులు చేరి రాముడు అని తెలుగులోకి వచ్చింది. ఇది సంస్కృత సమమైన తత్సమం. కొన్ని సంస్కృత శబ్దాలు ప్రాకృతంలోకి ప్రవేశించి, ఆ ప్రాకృతం నుండి తెలుగులోకి వచ్చాయి. అగ్నిః అనే సంస్కృత పదం మార్పు చెంది అగ్గీ అనే ప్రాకృత పదంగా రూపొందింది. అగ్గీ అనే ప్రాకృతం రూపం 'అగ్గి' అని తెలుగులోకి చేరింది. ఇది ప్రాకృత సమమైన తత్సమ శబ్దం.

సంస్కృత ప్రాకృత శబ్దాలకు ప్రాతిపదికలో ఏ విధమైన మార్పులు జరుగకుండా తెలుగులో ఉండే విభక్తి ప్రత్యయాలు మాత్రం చేరి తెలుగులోకి వస్తే వాటిని తత్సమాలు అంటారు. మరి కొన్ని తత్సమ శబ్దాలు - విద్య, హరి, ధేనువు, భువి, జగము, పిత, గోవు, నావ, దివి, హృది, అగ్గి, ఆడి, ఓలి, కోము, గారవము, జడ, మేర, జముడు, రాణి, సింగారము, సిరి.

**1.2.20** సూత్రం : సంస్కృత ప్రాకృత భవంబగు భాష తద్భవంబు.

భావం : సంస్కృతం నుండి గాని, ప్రాకృతం నుండి గాని పుట్టిన భాషకు తద్భవం అంటారు.

వ్యాఖ్య : సంస్కృత శబ్దాలు, ప్రాకృత శబ్దాలు వ్యవహారంలో కొన్ని మార్పులకు లోనవుతాయి. ఆ మార్పులు పొందిన తర్వాత తెలుగులో ఉన్న శబ్దాలను తద్భవాలు అంటారు.

'ఆకాశః' అనే సంస్కృత శబ్దం ఎలాంటి మార్పులు కలుగకుంటా తెలుగులోని ఏకవచన ప్రత్యయం 'ము' చేరి 'ఆకాశము' అని అయింది. ఎలాంటి మార్పులు కలుగలేదు గనుక ఇది తత్సమం. అలా కాకుండా 'ఆకాశః' అనేది మార్పులకు లోనై 'ఆకసము' అనే రూపంగా మారితే అది తద్భవం అవుతుంది.

<u>మరికొన్ని సంస్కృత భవరూపాలు</u>

| | | |
|---|---|---|
| కుడ్యమ్ | - | గోడ |
| చంద్రః | - | చందురుడు |
| తమంగః | - | తమగము |
| తామరసమ్ | - | తామర |
| నారాచః | - | నారసము |
| వక్రః | - | వంకర |
| సముద్రః | - | సంద్రము |
| స్మరః | - | మరుడు |

సంస్కృత శబ్దాలు ప్రాకృతాలుగా మారి, ఆప్రాకృతం నుండి మార్పులకు లోనై తెలుగులోకి వస్తే అవి తద్భవాలు అవుతాయి.

'అంగారః' అనే సంస్కృత శబ్దానికి తత్సమ రూపం అంగారము. 'అంగారః' అనే శబ్దం ప్రాకృతంలో 'ఇంగాలో' అని మార్పు చెందింది. అది మరిన్ని మార్పులకు లోనై తెలుగులో ఇంగలము అయింది. అందుచేత 'ఇంగలము' అనేది ప్రాకృతభవమైన తద్భవం.

<u>మరికొన్ని ప్రాకృత భావరూపాలు.</u>

| | | | | |
|---|---|---|---|---|
| అప్సరాః | - | అచ్ఛరా | - | అచ్చర |
| ఆశ్చర్యమ్ | - | అచ్ఛేరం | - | అచ్చెరువు |
| ప్రయాణమ్ | - | పయాణం | - | పయనము |
| మత్సరః | - | మచ్ఛరో | - | మచ్చరము |
| లక్ష్మీః | - | లచ్ఛీ | - | లచ్చి |
| వైద్యః | - | వేజ్జో | - | వెజ్జు |

1.2.21 సూత్రం : త్రిలింగ దేశ వ్యవహార సిద్ధంబగు భాష దేశ్యంబు.

భావం : త్రిలింగ దేశ వ్యవహారంలో పుట్టి ప్రసిద్ధి పొందిన భాషకు దేశ్యం అని పేరు.

వ్యాఖ్య : శ్రీశైలం, కాళేశ్వరం, దక్షారామం అనే మూడు శివక్షేత్రాలను కలిగి ఉన్న ప్రదేశం త్రిలింగ దేశం. ఈ త్రిలింగ దేశంలో వ్యవహారంలో ఉండే భాష దేశ్యం. ఈ దేశ్య శబ్దాలకు సంస్కృతంలో గాని, ప్రాకృతంలో గాని మూలరూపాలు ఉండవని అర్థం.

ఉదాహరణ : ఊరు, పేరు, ముల్లు, ఇల్లు, కోట, పేట, దూడ, మేడ, కోత, లేత, తావి, మోవి మొదలైనవి దేశ్య శబ్దాలు. ఈ శబ్దాలు తెలుగు దేశంలో పుట్టి, వ్యవహారంలో స్థిరపడి ప్రామాణికత్వాన్ని పొందాయి.

1.2.22 సూత్రం : లక్షణ విరుద్ధంబగు భాష గ్రామ్యంబు.

భావం : వ్యాకరణ లక్షణాలకు విరుద్ధంగా ఉండే భాషను గ్రామ్యం అంటారు.

వ్యాఖ్య : వ్యాకరణ లక్షణాలకు అనుగుణంగా లేని భాషను గ్రామ్యం అంటారు. ఈ భాషను గ్రంథాల్లో ఉపయోగించరు.

ఉదాహరణ : వస్తాడు, తెస్తాడు, వచ్చేవి, తెచ్చేవి, వచ్చేవాడు, తెచ్చేవాడు, వచ్చేటివాడు, తెచ్చేటివాడు.

పైవన్నీ గ్రామ్యాలు. ఇవి వ్యాకరణానికి విరుద్ధమైన ప్రయోగాలు.

**1.2.23** సూత్రం : ఆర్య వ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు.

భావం : పెద్దలు కావ్యాల్లో ప్రయోగించిన భాషలో గ్రామ్య శబ్దాలు ఉంటే, వాటిని కూడా స్వీకరించవచ్చును అని భావం.

వ్యాఖ్య : ఏదయినా ఒక గ్రామ్యమయిన శబ్దం కవుల కావ్యాల్లో కనిపిస్తే, దానికి నిత్య వ్యవహారంలో ప్రసిద్ధి ఉందని అర్థం. శిష్ట జన వ్యవహారంలో ఉండే అలాంటి శబ్దాలే కావ్యాల్లో చోటు చేసుకుంటాయి. లోక వ్యవహారంలో స్థిరపడి, కవుల ఆదరానికి పాత్రమయిన అలాంటి గ్రామ్య శబ్దాలను గ్రహించవచ్చునని తాత్పర్యం.

ఉదా - కఱకంఠుడు

సమన్వయం : "కేవల సంస్కృత శబ్దం వికృతితో సమాసం కాదు" - అనే నియమానికి విరుద్ధంగా పై సమాసం ఏర్పడింది. ఇందలి పూర్వ శబ్దం తెలుగు. ఉత్తర శబ్దం సంస్కృతం. కనుక ఇది దుష్ట సమాసం. కాని కవుల ప్రయోగాల్లో కనిపించడం చేత దీనిని గ్రహించవచ్చు.

ఇలాగే ప్రాణగొడ్డము, జీవగఱ్ఱ, కపిల కన్నులు, కపిల గడ్డము, కపిల జడలు అనే సమాసాల్లో పూర్వ పదాలన్నీ సంస్కృతాలు. ఉత్తర పదాలు తెలుగు పదాలు. కనుక ఇవన్నీ దుష్ట సమాసాలే. అయినా పూర్వ కవి ప్రయోగాల్లో ఉన్నవి కనుక వీనిని గ్రహించవచ్చు.

## 1.3 వ్యాసరూప ప్రశ్నలు

### 1.3.1 తెలుగులోని బిందువు

బిందువు అంటే సున్న. దీన్ని అనుస్వారం అని కూడా అంటారు. సంస్కృతంలో, ప్రాకృతంలో పూర్ణ బిందువు మాత్రమే ఉంది. ఆ భాషల్లో ఖండ బిందువు అంటే అరసున్న లేదు. తెలుగులో పూర్ణ బిందువు, ఖండ బిందువు ఉన్నాయి. ఇవి మరల సిద్ధం, సాధ్యం అని రెండు రకాలు.



| | | | |
|---|---|---|---|
| సిద్ధపూర్ణ బిందువు | : | శబ్దంలో సహజంగా ఉండే నిండుసున్న. | ఉదా. చెంబు. |
| సాధ్యపూర్ణ బిందువు | : | వ్యాకరణ కార్యం ద్వారా సాధింపబడ్డ నిండు సున్న. | ఉదా. పూచెంగలువలు. |
| సిద్ధఖండ బిందువు | : | శబ్దంలో సహజంగా ఉండే అరసున్న. | ఉదా. చీఁకటి. |
| సాధ్యఖండ బిందువు | : | వ్యాకరణ కార్యం ద్వారా సాధింపబడ్డ అరసున్న. | ఉదా. పూచెఁగలువలు |

- సంస్కృత సమేతరమయిన తెలుగు శబ్దాల్లో పరుష సరళాలకు ముందే పూర్ణ బిందువు, ఖండ బిందువు ఉంటాయి. అంటె పైన చెప్పిన నాలుగు విధాల బిందువులు పరుషాలకు, సరళాలకు ముందే తెలుగు పదాల్లో కనిపిస్తున్నాయి. స్థిరాలకు ముందు ఉండవని అర్థం.

ఉదా. వంకర, మంచు, త్రాఁచు, కోఁత, పూచెంగలువలు, పూచెఁగలువలు.

- దీర్ఘం తర్వాత వ్యాకరణ కార్యం ద్వారా సాధించబడే పూర్ణ బిందువు ఉండదు. అరసున్న మాత్రమే ఉంటుంది.

ఉదా. వాఁడు, వీఁడు, రాఁడు, లేఁడు, కాఁబోలు, కాఁబట్టి, గోఁగులు, రేఁగులు.

- హ్రస్వం తర్వాత ఖండ బిందువు ఉంటే అది వైకల్పికంగా పూర్ణ బిందువు అవుతుంది. అంటే ఖండ బిందువుతో రూపం, పూర్ణ బిందువుతో మరో రూపం ఉంటాయి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| అడఁకువ | - | అడంకువ | అరఁటి | - | అరంటి |
| బలఁగం | - | బలంగం | మగఁటిమి | - | మగంటిమి |

- అఁట, ఇఁక, చుఁడు శబ్దాలలో తప్ప మిగిలిన శబ్దాలలో మొదటి హ్రస్వం తరువాత అరసున్న ఉండదు. వ్యాకరణ కార్యం ద్వారా సాధింపబడిన అరసున్న నుడి తొలి హ్రస్వం తర్వాత రావలసి ఉన్నా, అట్టి రూపం ఉండదు.

ఉదా. అఁట, ఇఁక, చుఁడు

### 1.3.2. తెలుగులోని దంత్య తాలవ్య చ జ లు

సంస్కృతంలోని చ జ లు ఏ అచ్చుతో కూడి ఉన్నా తాలవ్యాలే అవుతాయి. సంస్కృతంలో దంత్య చ జ లు లేవు. అందుచేత సంస్కృత సమాలలోని చ జ లన్నీ తాలవ్యాలే.

ఉదా. చంద్రుడు, జగత్తు, చోరుడు, జాతి.

అచ్చ తెనుగు భాషలోని చ జ లు దంత్యాలని, తాలవ్యాలని రెండు విధాలు.

తాలవ్యాలు : తాలువు ఉత్పత్తి స్థానంగా ఉండే అక్షరాలను తాలవ్యాలు అంటారు. ఇ, ఈ, ఎ, ఏ అనే అచ్చులతో కూడిన చ జ లు తాలవ్యాలు అవుతాయి.

ఉదా. చిలువ, చీమ, చెవి, చేమ,
జిల, జీడి, జెట్టి, జేజె

దంత్యాలు : దంతాలు ఉత్పత్తి స్థానంగా ఉండే అక్షరాలను దంత్యాలు అంటారు. అ, ఆ, ఉ, ఊ, ఒ, ఓ, ఔ అనే అచ్చులతో కూడిన చ, జ లు దంత్యాలు అవుతాయి.

ఉదా. చలి, చాప, చుక్క, చూపు, చొక్కు, చోటు, చౌక

జముడు, జాతర, జున్ను, జూలు, జొన్న, జోలి, జౌకు

- సంస్కృత సమాల్లో దంత్య చ జ లు లేవు గాని రాజు శబ్దంలోని జ కారం మాత్రం దంత్యంగా కనిపిస్తున్నది.

సంస్కృత సమాల్లో ఇకారాంతమైన శబ్దాల్లో ఉపధలుగా ఉన్న తాలవ్య చ జ లు బహువచనం పరమయ్యేటప్పుడు దంత్యాలు అవుతున్నాయి.

| | ఏకవచనం | బహువచనం |
|---|---|---|
| | తాలవ్యం | దంత్యం |
| ఉదా. | ఆర్చి | ఆర్చులు |
| | రోచి | రోచులు |
| | వీచి | వీచులు |
| | రాజి | రాజులు |
| | వాజి | వాజులు |

- దంత్య చ జ లకి, తాలవ్య చ జ లకి ఉచ్చారణలో భేదమున్నా అవి సవర్ణాలే. అంటే తాలవ్య చ కారానికి విధించిన వ్యాకరణ కార్యాలన్నీ దంత్య చ కారానికి వర్తిస్తాయి. అలాగే తాలవ్య జ కారానికి విధించిన వ్యాకరణ కార్యాలన్నీ దంత్య జ కారానికి వర్తిస్తాయి.

ఉదాహరణకు 'కచటతపలు పరుషాలు'. దంత్య తాలవ్య చ జ లు సవర్ణాలు అనడంవల్ల తాలవ్య చ కారంతో పాటు దంత్య చ కారం కూడా పరుషమే అవుతుంది. అలాగే గజడదబలు సరళాలు. దంత్య తాలవ్య చ జ లు సవర్ణాలు అనడం కారణంగా తాలవ్య జ కారంతో పాటు దంత్య జ కారం కూడా సరళమే అవుతుంది. దీని వలన దంత్య తాలవ్య చ జ ల భేదం ఉచ్చారణలో తప్ప మిగిలిన అన్ని వ్యాకరణ కార్యాల్లో సవర్ణాలని తెలుస్తుంది.

### 1.3.3 ద్రుతప్రకృతికములు

ప్రత్యయాత్మకం, ఆగమాత్మకం, అవ్యయాత్మకం అయిన న కారాన్ని ద్రుతం అంటారు. ద్రుతం చివర ఉన్న పదాలను ద్రుతప్రకృతికాలు అంటారు.

<u>తెలుగులోని ద్రుతప్రకృతికాలు</u>

1) ప్రథమ, కయి, పట్టి, యొక్క తప్ప మిగిలిన విభక్తులు ద్రుతప్రకృతికాలు.
ఉదా. నన్నున్, నా చేతన్, నా తోడన్, నా కొఱకున్, నా వలనన్, నా కంటెన్, నాకున్, మా లోపలన్, మా యందున్.

2) ఉత్తమ పురుషలోని ఏకవచనమైన నేను కర్తగా గల క్రియలు ద్రుత ప్రకృతికాలు.
ఉదా. వత్తున్, వచ్చెదన్.

3) ప్రథమ పురుష ఏకవచనమైన వాడు కర్తగా గల భూతకాల మందలి క్రియలన్నీ ద్రుత ప్రకృతికములే.
ఉదా. వచ్చెన్.

4) ప్రథమ పురుష ఏకవచనమైన వాడు కర్తగాగల తద్ధార్మార్థకము మొదలైన వాని యందలి క్రియలు.
ఉదా. వచ్చున్, వచ్చెడున్.

5) ఆశీస్సు మొదలగు అర్థములు గల ఎడు, త అనే ప్రత్యయములు గల పదములు.
ఉదా. ప్రసన్నులయ్యెడున్, కావుతన్.

6) శతృ ప్రత్యయార్థకమైన 'చు' ప్రత్యయం అంతంలో ఉన్న క్రియారూపాలు.
ఉదా. కొట్టుచున్.

7) 'తుమున్' ప్రత్యయార్థకమైన 'ను' ప్రత్యయం చివర ఉన్న క్రియారూపాలు.
ఉదా. కొట్టన్, కొట్టగన్

8) ఆనంతర్యార్థకమైన 'డు' ప్రత్యయం చివర ఉన్న క్రియారూపాలు.
ఉదా. కొట్టుడున్

9) చేత్ శబ్దం యొక్క అర్థంలో ధాతువుకు చేరే నవర్ణకంతో కూడిన పదాలు.
ఉదా. కొట్టినన్

10) నేను, తాను అనే సర్వనామ పదాలు.

11) వలె మొదలైన అవ్యయాలు ద్రుత ప్రకృతికాలు.
ఉదా. వలెన్, ఎంతయున్, పోలెన్, అయ్యున్.

తెలుగులో పైన పేర్కొన్న పదాలన్నీ ద్రుతప్రకృతికాలు.

### 1.3.4 తెలుగులోని కళలు

ద్రుతప్రకృతికాలు కాని శబ్దాలు కళలు. అంటే నకారమైన ద్రుతం అంతంలోని శబ్దాలన్నీ కళలే.

తెలుగులోని కళలు

1) ప్రథమ, కయి, పట్టి, యొక్క విభక్తులు చేరిన శబ్దాలు.
ఉదా. రాముడు, రాములు, హయము, విష్ణువు, గోడ, మేడ, అయ్య, అమ్మ, రామునికయి, జ్ఞానముఁబట్టి, నాయొక్క.

2) భూత ప్రథమ పురుష బహువచన క్రియలు.
ఉదా. వచ్చిరి.

3) భూత మధ్యమ పురుష ఏక, బహు వచన క్రియలు.
ఉదా. వచ్చితివి, వచ్చితిరి.

4) భూత ఉత్తమ పురుష బహువచన క్రియలు

ఉదా. వచ్చితిమి

5) వ్యతిరేక క్రియలు.

ఉదా. రాడు, రారు, రాదు, రావు, రాము.

6) వ్యతిరేక క్త్వార్థకములు.

ఉదా. కొట్టక, తిట్టక

7) క్రింది అవ్యయాలు

ఉదా. ఊరక, మిన్నక, బళి, అక్కట, ఏల

### 1.3.5 లఘువులు - అలఘువులు అయిన యరలవలు

యరలవ అనే అక్షరాలు లఘువులని, అలఘువులని రెండు రకాలుగా విభజించవచ్చు.

లఘువు - తేలికగా పలుకబడే అక్షరాలను లఘువులు అంటారు.
అలఘువు - ఊది పలుకబడే అక్షరాలను అలఘువులు అంటారు.

య, ర, ల, వ అనే అక్షరాలు కొన్ని సందర్భాల్లో లఘువులుగా, మరికొన్ని చోట్ల అలఘువులుగా ఉంటాయి.

| అక్షరం | లఘువుగా ఉచ్చరించబడే సందర్భం + ఉదాహరణ | అలఘువుగా ఉచ్చరించబడే సందర్భం + ఉదాహరణ |
|---|---|---|
| య | హరియతడు మొదలగు చోట్ల యడాగమ సంధి ద్వారా ఆగమంగా వచ్చిన యకారం లఘువు<br>ఉదా. హరి<u>య</u>తడు | శబ్ద సహజమయిన యకారం అలఘువు<br>ఉదా. కా<u>య</u> |
| ర | సాధురేఫం లఘువు<br>ఉదా. పె<u>రు</u>గు, క<u>రు</u>గు | శకటరేఫం అలఘువు<br>ఉదా. వి<u>ఱు</u>గు, మె<u>ఱు</u>గు<br>ఈ శకటరేఫం తత్సమ తద్భవాల్లో ఉండదు. |
| ల | లకారం లఘువు<br>ఉదా. త<u>ల</u>, నె<u>ల</u> | బహువచనంలో ర, ల, డ లకు ఆదేశంగా వచ్చిన ళ కారం అలఘువు<br>ఉదా. ఏ<u>ళు</u>లు, పా<u>ళు</u>లు, త్రా<u>ళు</u>లు. |
| వ | ప్రథమావిభక్తి మీది పరుషాల్లో ప కారానికి ఆదేశంగా వచ్చే వ కారం లఘువు<br>ఉదా. అతడు + పలికె - అతడు<u>వ</u>లికె | శబ్దంలో సహజంగా ఉండే వ కారం అలఘువు<br>ఉదా. తా<u>వి</u>, మో<u>వి</u> |

పై పట్టిక ద్వారా య ర ల వ అనే అక్షరాలలోని లఘు - అలఘు భేదాలను తెలుసుకోవచ్చు.

### 1.3.6 తెలుగు భాషా పదాలు - భేదాలు

తెలుగు భాషలోని పదాల్లో కొన్ని సహజంగా భాషలో ఉన్నాయి. కొన్ని సంస్కృతంనుంచి, ప్రాకృతంనుంచి తెలుగులోకి వచ్చాయి. తెలుగు భాషలోని మొత్తం పదాలను లాక్షణికులు ఇలా విభజించారు.

1. తత్సమం : సంస్కృత ప్రాకృత తుల్యమైన భాష తత్సమం - అంటే సంస్కృతంతో గాని, ప్రాకృతంతో గాని సమంగా ఉన్న తెలుగు శబ్దం తత్సమం. సంస్కృత ప్రాకృత శబ్దాలు ఏ మార్పు చెందక తెలుగు విభక్తులతో కూడి తత్సమాలు అవుతాయి.

సంస్కృతసమాలు : సంస్కృతంతో సమంగా ఉన్నది సంస్కృత సమం. ఉదా. రాముడు, గోవు, హరి.

ప్రాకృత సమం : ప్రాకృతంతో సమంగా ఉన్నది ప్రాకృత సమం. ఉదా. అగ్గి, జముడు, రాణి.

2. తద్భవం : సంస్కృత ప్రాకృత భవంబగు భాష తద్భవం. సంస్కృతం నుంచి, ప్రాకృతం నుంచి పుట్టిన భాష తద్భవం. సంస్కృత ప్రాకృత శబ్దాలు మార్పులు చెంది తెలుగులోకి చేరితే వాటిని తద్భవాలు అంటారు.

సంస్కృతభవం : సంస్కృతం నుండి పుట్టిన భాష సంస్కృత భవం. ఉదా. చందురుడు, తామర, సూది.

ప్రాకృతభవం : ప్రాకృతం నుండి పుట్టిన భాష ప్రాకృత భవం. ఉదా. అచ్చెరువు, లచ్చి, వెన్నుడు.

3. దేశ్యం : త్రిలింగ దేశ వ్యవహార సిద్ధమైన భాష దేశ్యం. త్రిలింగ దేశంలోని జనుల వ్యవహారం నుంచి ఏర్పడిన భాషకు దేశ్యం అని పేరు. ఉదా. ఊరు, పేరు, ఇల్లు, ముల్లు.

4. గ్రామ్యం : లక్షణ విరుద్ధమైన భాష గ్రామ్యం. వ్యాకరణానికి విరుద్ధంగా ఉన్న భాషను గ్రామ్యం అంటారు. దీనిని కావ్యాల్లో ఉపయోగించకూడదు. ఉదా. వస్తాడు, తెస్తాడు, వచ్చేవి, వచ్చేవాడు.

నన్నయ మొదలైన మహాకవులు కావ్యాలలో కనిపించే భాష గ్రామ్యమయినా, దానిని గ్రహించవచ్చు. ఆర్య వ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు.

ఉదా. కటకంరుడు, ప్రాణగొడ్డము, జీవగఱ్ఱ, కపిల కన్నులు, కపిల గడ్డము, కపిల జడలు.

ఈ పదాలు గ్రామ్యాలు. లక్షణ విరుద్ధాలు. కాని మహాకవులు ప్రయోగించారు గనుక ఈ శబ్దాలను గ్రహించవచ్చు.

## 1.4 సమీక్ష

సంజ్ఞా పరిచ్ఛేదంలోని పారిభాషిక పదాలను గురించి తెలుసుకున్నారు. సూత్రాలకు సోదాహరణ వ్యాఖ్యలు గ్రహించారు. వ్యాసరూప ప్రశ్నలకు జవాబులు తెలుసుకున్నారు.

## 1.5 ప్రశ్నలు

1. క్రింది పారిభాషిక పదాలను సోదాహరణంగా వివరించండి.
   (ఎ) సాధ్యపూర్ణం, (బి) ఉపధ, (సి) వక్రతమాలు, (డి) పరుషాలు, (ఇ) తాలవ్యాలు, (యఫ్) తద్భవం,
   (జి) ద్రుతప్రకృతికం, (హెచ్) అలఘువు, (ఐ) స్థిరాలు.

2. క్రింది సూత్రాలకు సోదాహరణ వ్యాఖ్యలు వ్రాయండి.
   ఎ) దంత్య తాలవ్యంబులయిన చ జ లు సవర్ణంబులు.
   బి) దీర్ఘము మీద సాధ్య పూర్ణము లేదు.
   సి) ఆర్య వ్యవహారంబుల దృష్టంబు గ్రాహ్యంబు.
3. క్రింది వానిని వివరించండి.
   ఎ) తెలుగులోని బిందువు స్వరూపాన్ని వివరించండి.
   బి) తెలుగులోని దంత్య తాలవ్య చ జ లను వివరించండి.
   సి) ద్రుతప్రకృతికములయిన పదాలేవి?
   డి) తెలుగులో కళలయ్యే పదాలేవి?
   ఇ) యరలవల్లోని లఘు, అలఘు భేదాలను నిరూపించండి.
   యఫ్) తెలుగు పదాలలోని భేదాలను ఉదాహరణ పూర్వకంగా వివరించండి.

## 1.6 ఆధార గ్రంథాలు


1. బాల వ్యాకరణము - శ్రీ పరవస్తు చిన్నయ సూరి
2. రమణీయము - శ్రీ దువ్వూరి వేంకటరమణ శాస్త్రి
3. బాలప్రౌఢ వ్యాకరణ సర్వస్వము - శ్రీ టి. భాస్కరరావు



డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ
ఎం.ఏ., పిహెచ్.డి.
రీడర్ & ప్రిన్సిపాల్
బి.ఎస్.ఎస్.బి. డిగ్రీ కళాశాల
తాడికొండ, గుంటూరు జిల్లా -522 236

# పాఠం - 2

# సంధి పరిచ్ఛేదం

పాఠ్యనిర్మాణక్రమం

2.0 లక్ష్యం
2.1 సోదాహరణ వ్యాఖ్యలు (1 నుండి 27 సూత్రాల వరకు)
2.2 సమీక్ష
2.3 ప్రశ్నలు
2.4 ఆధార గ్రంథాలు

## 2.0 లక్ష్యం

ఈ పాఠంలో సంధి పరిచ్ఛేదంలోని కొన్ని సూత్రాలకు సోదాహరణంగా వ్యాఖ్యానం తెలుసుకుంటారు.

## 2.1 సోదాహరణ వ్యాఖ్యలు (1 నుండి 27 సూత్రాల వరకు)

2.1.1 ఉత్తున కచ్చు పరంబగునపుడు సంధియగు (సంధి 1. సూ).

పద విభాగం : ఉత్తునకు అచ్చు పరము అగునపుడు సంధి అగు.

భావం : హ్రస్వమైన ఉకారానికి అచ్చు పరమైనచో సంధి జరుగుతుంది.

ఉదా. : రాముఁడు + అతడు = రాముడతడు

రాముడు అనే పదంలో 'ఉ' అనేది పూర్వ స్వరం. అతడు అనే పదంలో 'అ' అనేది పరస్వరం.

ఈ పూర్వ పర స్వరాలకు బదులుగా పరస్వరం ఏకాదేశంగా రావడాన్ని సంధి అంటారు. పరస్వరం రావడం వలన రాముడతడు అనే రూపం ఏర్పడుతుంది. దీనిని ఉత్వసంధి అంటారు. హ్రస్వమైన ఉకారాన్ని ఉత్తు అంటారు. ఇలా తవర్ణాన్ని చేర్చి పలకడాన్ని తపరకరణం అంటారు. దీని వలన చెప్పదలచుకున్న అక్షరం హ్రస్వమైతే హ్రస్వం. దీర్ఘమైతే దీర్ఘం స్పష్టంగా చెప్పినట్లవుతుంది. దీనికి తోడు సోముడితోడు మనముంటిమి. అతడిక్కడ, ఇతడొకడు అనేవి మిగిలిన ఉదాహరణలు.

విశేషము : ఇది నిత్య సంధికి ఉదాహరణ. కాని అ, ఇ, ఉ అనే అచ్చులలో ఇది మూడవది. కాని చిన్నయసూరి ముందుగా నిత్య సంధిని చెప్పాలని, ఈ సూత్రం చెప్పి ఉండవచ్చు.

2.1.2 ప్రథమేతర విభక్తి శత్రర్థ చువర్ణంబు లందున్న యు కారమునకు సంధి వైకల్పికముగా నగును. (సంధి 2. సూ).

పద విభాగం : ప్రథమ ఇతర విభక్తి శత్రర్థ చువర్ణములందు ఉన్న 'ఉ' కారమునకు సంధి వికల్పముగ అగు.

భావం : ప్రథమావిభక్తి కాక మిగిలిన విభక్తులలోను అసమాపక క్రియారూపమైన శత్రర్థకంలోని 'చు' అనే అక్షరంలోని ఉ కారానికి వికల్పంగా సంధి జరుగుతుంది అని అర్థం.

ఉదా. : నన్నున్ + అడిగె = నన్నడిగె, నన్నునడిగె
వచ్చుచున్ + ఉండెను = వచ్చుచుండెను, వచ్చుచునుండెను

విభక్తి ప్రత్యయాలలో ను, కొఱకు, కు అందు అనేవి ఉదంతాలు. ఇవి ప్రథమేతర విభక్తి ప్రత్యయాలు. శత్రర్థకం అసమాపక క్రియారూపం. ఇక్కడ క్రియకు చున్ అనే ప్రత్యయం చేరుతుంది. 'చు' చివర 'ఉ' త్తు వుంది. కనుక ఇక్కడ కూడా వైకల్పికంగా సంధి జరుగుతుంది. సంధి జరిగినపుడు రెండచ్చుల మధ్య ఉన్న ద్రుతం లోపిస్తుంది. జరగనట్లైతే ద్రుతంతో కలిపి రూపం ఏర్పడుతుంది. నన్నడిగె, నన్నునడిగె ఇలా రెండు రూపాలు ఏర్పడతాయి. ఇంకా చతుర్థి, షష్ఠీ, సప్తమీ విభక్తులలోనున్న ఉకారానికి కూడా సంధి వైకల్పికమే. అలానే, వచ్చుచుండె, వచ్చుచునుండె, తదితరాలను గ్రహించాలి.

2.1.3 సంధి లేని చోట స్వరంబు కంటెంబరంబయిన స్వరంబునకు యడాగమంబగు. (సంధి 3 సూ.)

పద విభాగం : సంధి లేని చోట స్వరము కంటెను పరమైన స్వరమునకు యడాగమము (యట్ ఆగమము) అగును.

భావం : సంధి జరగనట్లైతే పరస్వరానికి 'య' అనేది ఆగమంగా వస్తుందని అర్థం.

ఉదా. : మా + అమ్మ = మాయమ్మ

ఇక్కడ పూర్వ పదానికి చివర పర పదానికి మొదట అచ్చులున్నాయి. కాని సంధి జరగలేదు. పూర్వ స్వరం 'మా' అక్షరంలోని 'ఆ' దీనికి తిరిగి 'అ' అనే అక్షరం పరమైంది. మీ + ఇల్లు. ఇక్కడ 'ఈ' అనే అక్షరానికి 'ఇ' పరమైంది. మా + ఊరు. ఇక్కడ 'ఊ' పరమైంది. ఈ మూడింటిలోనూ, పూర్వ స్వరం 'ఆ'. ఒక్క ఆమ్రేడిత సంధిలో తప్ప దీర్ఘం మీద సంధి జరగదు. కనుకనే యడాగమం వస్తుంది. ఆగమం అంటే వర్ణాధిక్యం. ఒక వర్ణానికి మరొక వర్ణం అధికంగా వచ్చి చేరినట్లైతే దాన్ని ఆగమం అంటారు.

2.1.4 అత్తునకు సంధి బహుళముగానగు. (సంధి 4 సూ.)

భావం : హ్రస్వమైన, అకారమునకు సంధి బహుళముగా వస్తుంది.

ఉదా. : మేన + అల్లుడు = మేనల్లుడు, మేనయల్లుడు.
అమ్మ + ఇచ్చెను = అమ్మ యిచ్చెను
వెల + ఆలు = వెలయాలు

బహుళం అంటే అనేక విధాలుగా అని అర్థం. వ్యాకరణ నియమం ప్రకారం ప్రవృత్తి, అప్రవృత్తి, విభాష అన్య విధం అనే నాల్గింటిని కలిపి బహుళం అంటారు. ప్రవృత్తి అంటే సూత్రం చేత చెప్పబడిన కార్యం నిత్యంగా జరగడం. ఉదా. రామ + అయ్య = రామయ్య. కొన్నిచోట్ల జరుగక పోవడం. అమ్మ + ఇచ్చెను = అమ్మయిచ్చెను. ఇది స్త్రీ వాచకం. కనుక సంధి రాదు. దూత + ఇతడు = ఇందులో దూత తత్సమం. చెలువుడ + ఇందము = ఇందులో చెలువుడ అనేది సంబోధనాంతం. కనుక వీటికి కూడా యడాగమమే వస్తుంది. ఇవి అప్రవృత్తికి ఉదాహరణలు. వెల + ఆలు అన్నప్పుడు వెల అనే శబ్దం స్త్రీ వాచకం కాదు, తత్సమం కాదు, సంబోధనాంతం కాదు. అయినప్పటికీ సంధి జరగదు. యడాగమం

వస్తుంది. ఇది అన్య విధానికి ఉదాహరణ. అలానే, ఒక + ఒక = ఒకానొక అవుతుంది. ఇక్కడ పూర్వ స్వరానికి దీర్ఘమూ నుగాగమమూ రెండూ వచ్చాయి. కనుక ఇవి అన్య విధానికి ఉదాహరణ.

2.1.5 ఏమ్యాదుల యిత్తునకు సంధి వైకల్పికముగా నగు. (సంధి 5 సూ.)

పదవిభాగం : ఏమి ఆదుల ఇత్తునకు సంధి వికల్పముగా అగును.

భావం : ఏమి మొదలైన పదాలలో చివరగల హ్రస్వమైన 'ఇ' కారానికి అచ్చు పరమగునపుడు సంధి వైకల్పికముగా జరుగుతుంది. సంధి జరగవచ్చు. జరుగకపోవచ్చు. సంధి జరిగితే పరస్వరమూ జరగకపోతే యడాగమం వస్తాయి. కనుక ఏమి + అంటివి = ఏమంటివి, ఏమియంటివి అని రెండు రూపాలు ఏర్పడతాయి. ఇంకా మరి + ఏమి = మరేమి, మరియేమి, హరికిన్ + ఇచ్చె = హరికిచ్చె, హరికినిచ్చె. ఇది ద్రుప ప్రకృతికం కాబట్టి యడాగమం రాదు. ఇంకా అది, అవి, ఇది, ఇవి, ఏది, ఏవి, మొదలైన పదాలలో చివర ఉన్న ఇత్తునకు సంధి వైకల్పికంగా వస్తుంది.

2.1.6 క్రియా పదంబు నందిత్తునకు సంధి వైకల్పికముగా నగు. (సంధి 6 సూ.)

పదవిభాగం : క్రియా పదములందు ఇత్తునకు సంధి వికల్పముగా అగు.

భావం : ఇత్తు అనగా హ్రస్వమైన ఇకారం అంతంలో ఉన్న క్రియా పదాలకు అచ్చు పరమైనట్లయితే, సంధి వైకల్పికంగా నగును.

ఉదా : వచ్చిరి + అప్పుడు = వచ్చిరప్పుడు, వచ్చిరియప్పుడు.
వచ్చితిమి + ఇప్పుడు = వచ్చితిమిప్పుడు, వచ్చితిమియిప్పుడు.

వచ్చిరి అనేది ప్రథమ పురుష బహువచన క్రియ. భూతకాలం. దీనికి, ఇత్తు అంతంలో ఉంది. కనుక, దీనికి అచ్చు పరమైనపుడు సంధి జరుగవచ్చు. జరుగక పోవచ్చు.
వచ్చితిమి అనేది ఉత్తమ పురుష బహువచన క్రియ, భూతకాలం. ఇత్తు అంతమందున్న దీనికి కూడ అచ్చుపరమైనట్లైతే రెండు రూపాలు ఏర్పడతాయి.

విశేషం : ఇందులో ప్రథమ పురుష ఉత్తమ పురుష క్రియలు మాత్రమే చూపించబడ్డాయి. మధ్యమ పురుష క్రియలు చూపించబడలేదు.

2.1.7 మధ్యమ పురుష క్రియల యందిత్తునకు సంధియగు. (సంధి 7 సూ.)

పదవిభాగం : మధ్యమ పురుష క్రియల అందు ఇత్తునకు సంధి అగును.

భావం : ప్రథమ, ఉత్తమ, మధ్యమ అను మూడు పురుషలకు క్రియలు 3 రకాలు. నీవు, మీరు అనే వియుష్మదర్థకాలు. ఇవి మధ్యమ పురుషలు. ఈ మధ్యమ పురుష సర్వ నామాలకు వచ్చే క్రియలను యుష్మదర్థక క్రియలు అంటారు. మధ్యమ పురుష క్రియలని కూడా అనవచ్చు. ఈ క్రియలు భూతకాలంలో ఏకవచనంలోను, బహువచనంలోను ఇదంతాలై ఉంటాయి. కనుక ఇకారసంధి క్రిందికి వస్తాయి. వీటికి అచ్చు పరమైనట్లయితే సంధి నిత్యంగా జరుగుతుంది. ఏలితివి అనేది భూతకాల మధ్యమ పురుష క్రియ ఏకవచనం. దీని కచ్చు పరమైనపుడు -

ఏలితివి అపుడు ఏలితివపుడు

ఉదా : ఏలితివి + అపుడు = ఏలితివపుడు
ఏలితి + ఇపుడు = ఏలితిపుడు
ఏలితిరి + ఇపుడు = ఏలితిరిపుడు - అవుతాయి.

ఈ మూడింటిలోనూ సంధి నిత్యంగా జరుగుతుంది.

2.1.8 క్త్వార్థంబైన ఇత్తునకు సంధి లేదు. (సంధి 8 సూ.)

పదవిభాగం : క్త్వార్థంబు అయిన ఇత్తునకు సంధి లేదు.

భావం : క్త్వార్థము = భూతకాలాన్ని తెల్పే అసమాపక క్రియ. ఇందులో క్రియకు చివర ఇత్తు వస్తుంది. మరి దీనికి అచ్చు పరమైతే ఇకారసంధి వర్తించదని భావం.

ఉదా : వచ్చి + ఇచ్చెను = వచ్చియిచ్చెను

వచ్చి అనే క్రియా పదం చివరిలో ఇత్తు ఉంది. కనుక ఇది క్త్వార్థం. దీనికి అచ్చు పరమైనపుడు సంధి జరగలేదు. కనుక దీనిని నిషేధ సూత్రం అంటారు. "సంధిలేని చోట స్వరంబు కంటె పరంబయిన స్వరంబునకు యడాగమంబగు" అనే సూత్రం ద్వారా వచ్చియిచ్చెను అనే రూపం ఏర్పడుతుంది.

ఈ విధంగా సంధి పరిచ్ఛేదంలోని 5 వ సూత్రం నుండి 8 వ సూత్రం వరకు ఇకారసంధులను గురించి చెప్పడం జరిగింది.

2.1.9 ఇఁకాదులకుఁదప్ప ద్రుతప్రకృతికములకు సంధి లేదు. (సంధి 9 సూ.)

పదవిభాగం : ఇకఁ ఆదులకు తప్ప ద్రుతప్రకృతికములకు సంధి లేదు.

భావం : ఇకఁ, ఇఁగ ఎట్టకేలకు, ఎట్టలేని అనేవి ఇకాదులు.

వీటికి మాత్రం సంధి వైకల్పికంగా జరుగుతుంది. ఇక మిగిలిన ద్రుతప్రకృతికాలకు సంధి జరగదు. 'న' కారం అంతమందు కలిగిన పదాలను ద్రుతప్రకృతికాలు అంటారు. ఈ ద్రుతప్రకృతికాలకు అచ్చు పరమైనపుడు సంధి చేయగూడదని అర్థం.

ఉదా : వచ్చున్ + ఇపుడు = వచ్చునిపుడు. వచ్చు అనేది తద్ధర్మార్థకం. ద్రుతప్రకృతికం. ఇక్కడ సంధి రాదు. ఇలా ద్రుతప్రకృతికాలకు వేటికిని సంధి జరగదని సూత్రార్థం. కనక ఇది నిషేధ సూత్రం అనుకోవచ్చు.

కాని సంధి పరిచ్ఛేదం రెండవ సూత్రం ప్రకారం ప్రథమేతర విభక్తి. శత్రర్థక చువర్ణమునందున్న ఉకారానికి సంధి వైకల్పికంగా జరుగుతుందని చెప్పడం జరిగింది. కనుక దానిని నిర్వహించేందుకు ప్రథమేతర విభక్తి విధి నిరవకాశం కాబట్టి దీనిని బాధించెడు అని సూరి చెప్పారు. కనుక తాను నిరూపించిన రెండూ, నియమాల క్రిందికే వస్తాయి. కనుక, రెండవ సూత్రం నందలి ఉదాహరణలు

మరి ఇక, ఇంగ ఎట్టకేలకు, ఎట్టకేని అనే పదాలు తప్ప మిగిలిన ద్రుతప్రకృతికాలకు సంధి రాదు.

2.1.10 అచ్చున కామ్రేడితంబు పరంబగునపుడు సంధి తఱచుగనగు. (బాల.వ్యా. 10 సూ.)

పదవిభాగం : అచ్చునకు ఆమ్రేడితము పరమగునపుడు సంధి తరచుగా అగును.

భావం : ఆమ్రేడితం అచ్చుతో ప్రారంభమై అది మరొక ఆమ్రేడితానికి పరపదంగా వచ్చినట్లయితే సంధి చాలా సార్లు జరుగుతుంది.

ద్విరుక్తం యొక్క పరరూపం ఆమ్రేడితం. అంటే ఒక మాటను రెండు సార్లు ఉచ్చరించినట్లయితే రెండవసారి ఉచ్చరించినదాన్ని ఆమ్రేడితం అంటారు.

ఉదా : ఔర + ఔర = ఔరౌర. సంధి నిత్యంగా జరిగింది.

సూత్రంలో తఱచుగ అని అనడం వల్ల ఏమి + ఏమి అనే చోట ఏమేమి, ఏమియేమి అనే రెండు రూపాలు ఏర్పడతాయి. కాని ఏగియేగి అనే చోట ఇది క్త్వార్థం కాబట్టి సంధి జరగదు.

విశేషం : సంధి పరిచ్ఛేదంలోని యితర సూత్రాలకు దీనికి ఒక తేడా ఉంది. మిగిలిన సంధులలో ఎక్కడా హ్రస్వానికే గాని దీర్ఘానికి సంధి వర్తించదు. కాని ఆమ్రేడిత సంధిలో దీర్ఘానికి సైతం సంధి వస్తుంది. ఆహా + ఆహా = ఆహాహా. అలానే ఓ అనే అచ్చు ఆమ్రేడితంలోనే చూపబడింది. ఓహో + ఓహో = ఓహోహో.

2.1.11 అంద్వవగాగమంబులందప్ప అన పదాది స్వరంబు పరంబగు నపుడచ్చునకు సంధి యగు. (సంధి 11 సూ.)

పదవిభాగం : అందు, అవక్ ఆగమములందు తప్ప అపద ఆది స్వరము పరము అగునపుడు అచ్చునకు సంధి అగు.

భావం : అందు, అవ అనేవి ఆగమాలుగా వచ్చినపుడు ఈ సూత్రం వర్తించదు. ఈ రెండు గాక మిగిలిన అపదాలుకు పరమైనట్లైతే తొలి అచ్చులకు సంధి జరుగుతుంది అని అర్థం. కనుక, పరపదం అపదమయి ఉండాలి. పదం కానిది అపదం. ప్రకృతీ ప్రత్యయం కలిసి అర్థవంతమైనది పదం. ఇలా కానిది అపదం. సాధారణంగా విభక్తి ప్రత్యయాలు అపదాలు.

ఉదా : మూర + ఎడు = ఇందులో ఎడు అనేది అపదం. కనుక సంధి జరుగుతుంది. ఇలాంటిదే అర్థించు = అర్థ + ఇంచు.

ఇక అందు, అవ అనే పదాలు పరమైనట్లైతే రూపాలు ఎలా ఏర్పడతాయో గ్రహించాలి. రాముల + అందు = రాములందు, రాములయందు. ఎనిమిదవ + అది = ఎనిమిదవది, ఎనిమిదవయది. కనుక ఇక్కడ వైకల్పికంగా సంధి జరిగింది. కాని మిగిలిన వాటికి మాత్రం నిత్య సంధి జరుగుతుంది. ఈ సూత్రంతో చిన్నయ సూరి సంధి పదానికి చెప్పిన నిర్వచనం ముగిసింది.

2.1.12 కుఱు, చిఱు, కడు, నడు, నిడు శబ్దముల ఱ, డ, ల కచ్చు పరంబగు నపుడు ద్విరుక్త టకారంబగు. (సంధి 12 సూ.)

పదవిభాగం : కుఱు, చిఱు, కడు, నడు, నిడు, శబ్దముల ఱ, డ, లకు అచ్చు పరము అగునపుడు ద్వి ఉక్త టకారము అగు.

భావం : కుఱు, చిఱు అనే పదాలలోని ఱ కారమునకు కడు, నడు, నిడు అనే శబ్దాలలోని డ కారానికి ప్రక్కన మరొక అచ్చు వచ్చినట్లైతే వీటికి బదులుగ ట్ట్ ఆదేశంగా వస్తుంది.

ఉదా : కుఱు + ఉసురు = కుట్టుసురు. కుఱు అను శబ్దంలోని చివరి అక్షరం ఱ్ + ఉ = ఱు. దీనికి ఉసురు అనే శబ్దంలోని 'ఉ' పరమైనపుడు కుట్ + ట్ + ఉ + ఉసురు అవుతుంది.

ఇక్కడ ఉత్వసంధి వస్తుంది. దానితో కుట్టుసురు అనే రూపం ఏర్పడుతుంది. అలానే నడు + ఇల్లు కూడ నట్టిల్లు అవుతుంది.

మొత్తం ఐదు శబ్దాలలోను ఒకే రూపం వస్తున్నట్లు చిన్నయ సూరి అభిప్రాయం.

విశేషం : సూత్రంలో చిన్నయ సూరి, ద్విరుక్తటకారము నిత్యంగా వస్తుందని చెప్పాడు. కాని కట్టెండ అనే రూపం మాత్రం నిత్యం కాదు. కడున్ + ఎండ = కడునెండ అనే రూపం ఉంది. మహాభారతంలో నన్నయ చాలా చోట్ల ఇలా ప్రయోగించాడు.

2.1.13 ప్రథమ మీఁది పరుషములకు గసడదవలు బహుళముగా నగు. (బాల.వ్యా. 13 సూ.)

పదవిభాగం : ప్రథమ మీది పరుషములకు గసడదవలు బహుళముగాన్ అగు.

భావం : ప్రథమా విభక్తికి పరుషాలు పరమైనట్లైతే వాటికి వరుసగా గ, స, డ, ద, వ లు బహుళంగా వస్తాయని ఈ సూత్రానికి అర్థం. ప్రథమా విభక్తి ప్రత్యయాలు 'నాలుగు'. అవి డు, ము, వు, లు. వీటిలో మొదటి మూడు ఏకవచన ప్రత్యయాలు. నాల్గవది బహువచన ప్రత్యయం. ప్రథమావిభక్తి ప్రత్యయాలకు పరుషాలు పరమైనట్లయితే వాటి స్థానంలో బహుళంగా గ, స, డ, ద, వ లు వస్తాయి.

ఉదా : వాఁడు + కొట్టి మొదలైన చోట్ల వికల్పంగా 'గ' వస్తుంది. కనుక వాడుగొట్టి, వాడుకొట్టి అనే రెండు రూపాలు ఏర్పడతాయి. ఈ విధంగా ము, వు, రు అనే ప్రత్యయాలకు సైతం ఈ నియమం వర్తిస్తుంది. ఇవి కాక బహువచన ప్రత్యయాలతో కూడిన క్రియలకు సైతం ఈ నియమం వర్తిస్తుంది. కనుక

రారు + కదా = రారుగదా, రారుకదా అవుతుంది.

సూత్రంలో బహుళం అని చెప్పినప్పటికి ఉదాహరణలు విభాషకు మాత్రమే సూరి చూపించాడు. కాని రారు, వత్తురు అనే క్రియా పదాలను సైతం నిరూపించాడు. కనుక ఇవి అన్య విధానికి ఉదాహరణలు.

2.1.14 తెనుఁగుల మీది సాంస్కృతిక పరుషములకు గ, స, డ, ద, వ, లు రావు. (సంధి 14 సూ.)

భావం : పూర్వపదం తెనుగై పరపదం తత్సమమైతే గ, స, డ, ద, వ లు రావని ఈ సూత్రానికి అర్థం. దీనిని నిషేధ సూత్రం అంటారు. తొలి పదం తెలుగు పదమై ఉండి రెండవ పదం సంస్కృత పదమైతే అక్కడ పరుషాలు వచ్చినప్పటికి గ, స, డ, ద, వ లు రావు.

ఉదా : వాఁడు + కంసారి = వాఁడు కంసారి.

ఇందులో కంసారి తత్సమము. అసలు తెలుగు శబ్దాలలో బిందువు (సున్న) పరుష సరళాలకు ముందే వస్తుంది. స - స్థిరము కాబట్టి ఇది తెలుగు పదం కాదు. 'గ' రాదు. అలానే వీడు చక్రపాణి, ఆయది టంకృతి, అది తథ్యము, ఇది పథ్యము - ఇవన్నీ తత్సమాలే కనుక ఈ నియమం వర్తిస్తుంది.

2.1.15 ద్వంద్వంబునం బదంబుపై పరుషములకు గ, స, డ, ద, వ, లగు. (సంధి 15 సూ.)

పదవిభాగం : ద్వంద్వమున పదము పైన పరుషములకు గ, స, డ, ద, వ లు అగు.

భావం : ద్వంద్వ సమాసంలో పూర్వ పదము మీద పరుషాలు వచ్చినట్లైతే నిత్యంగా గ, స, డ, ద, వ లు వస్తాయని సూత్రానికి అర్థం.

ఉదా : కూర + కాయ = కూరగాయలు. ఇది ఉభయ పద ప్రాధాన్యం కలిగిన ద్వంద్వ సమాసం. రెండూ ఆచ్ఛిక పదాలే కాబట్టి ఆచ్ఛిక పదాలకే ఈ నియమం వర్తిస్తుంది.

కాలు + చేయి = ఇవి రెండూ తెలుగు పదాలు. కాబట్టి కాలుసేతులు అని గసడదవాదేశ సంధి జరిగి ద్వంద్వ సమాసం ఏర్పడుతుంది. అలానే టక్కు డెక్కులు, తల్లిదండ్రులు, ఊరు వల్లెలు అనే ద్వంద్వ సమాసాలు సైతం దీనికి ఉదాహరణలు. దీన్ని ప్రవృత్తి సూత్రం అంటారు.

2.1.16 ద్రుత ప్రకృతికము మీఁది పరుషములకు సరళములగు. (సంధి 16 సూ.)

పదవిభాగం : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములు అగును.

భావం : ద్రుతాంతమైన పదం ద్రుతప్రకృతికం. ద్రుతమంటే నకారం. దీనికి ప్రకృతిగా ఉండే దాన్ని ద్రుతప్రకృతికం అంటారు. అంటే పూచెను, తోచెను, చేసెను మొదలైన పదాలన్నమాట. వీటికి పరుషాలతో (క, చ, ట, త, ప లు) ప్రారంభమయ్యే పదాలు పరమైనట్లైతే ఆ పరుషాలన్నీ నిత్యంగా సరళాలుగా మారతాయని అర్థం.

ఉదా : పూచెను + కలువలు = ఇందు పూచెను అనేది ద్రుతప్రకృతికం. కనుక 'క' అనే పరుషం పరమైంది కాబట్టి ఇది సరళంగా మారి కలువలు, గలువలు అని మారుతుంది. పూచెనుగలువలు అనే రూపం సిద్ధిస్తుంది. మిగిలినవి కూడ అలానే అవుతాయి. చుక్కలు, జుక్కలు అని, టక్కులు డక్కులు అని తమములు, దమములనీ, పద్మము బద్మము అని మారతాయి.

2.1.17 ఆదేశ సరళములకు ముందున్న ద్రుతంబునకు బిందు సంశ్లేషంబులు విభాషనగు. (సంధి 17 సూ.)

పదవిభాగం : ఆదేశ సరళములకు ముందు ఉన్న ద్రుతమునకు, బిందువు సంశ్లేష విభాషగా అగును.

భావం : ఆదేశంగా వచ్చిన సరళాలను ఆదేశ సరళాలంటారు. పూర్వ సూత్రం వల్ల పరుషాల స్థానంలో వచ్చిన సరళాలే ఆదేశ సరళాలు. ఇలాంటి సరళాలకు ముందు ద్రుతం ఉంటుంది. ఈ ద్రుతానికి ఈ సూత్రం వల్ల మూడు రూపాలేర్పడతాయి. అవి, 1. నిండు సున్న, 2. అర సున్న, 3. సంశ్లేష. సంశ్లేష అంటే ప్రక్కనున్న హల్లుతో కూడికొని పోవడం.

ఉదా : తోచెన్ + చుక్కలు = ముందు తోచెనుజుక్కలు అవుతుంది. ఇక్కడ 'జు' అనేది 'చు' స్థానంలో

వచ్చింది కాబట్టి ఇది ఆదేశ సరళం. దీనికి ముందు ఉన్న ద్రుతము స్థానంలో పూర్ణ బిందువు వస్తే తోఁచెంజుక్కలు అని, అర్థబిందువు వస్తే తోఁచెఁజుక్కలు అని అవుతుంది. సంశ్లేష వస్తే తోఁచెన్జుక్కలు అని అవుతుంది. ఈ మూడు రూపాలు విభాషగా వస్తాయి. అంటే ఇవి రాకపోతే ద్రుతానికి స్వత్వం ఉంటుంది. స్వత్వం అంటే ప్రకృతి భావం. అంటే ఉన్నది ఉన్నట్లుగ ఉండిపోవడమని అర్థం. కనుక తోఁచెనుజుక్కలు అవుతుంది. మిగిలిన ఉదహరణలు కూడ ఇలానే స్వీకరించాలి.

**2.1.18** ద్రుతంబునకు సరళ స్థిరంబులు పరంబులగు నపుడు లోప సంశ్లేషంబులు విభాషనగు. (సంధి 18 సూ.)

పదవిభాగం : ద్రుతమునకు సరళములు, స్థిరములు పరములగు నప్పుడు లోపమును, సంశ్లేష, విభాషన్ అగు.

భావం : గజడదబ అనే సరళాలు గానీ, పరుష సరళాలు గాక మిగిలిన వైన స్థిరాక్షరాలు గాని ద్రుతానికి పరమైనట్లైతే అంటే పరపదం మొదటి అక్షరాలుగా ఇవి ఉన్నట్లైతే ద్రుతం లోపించడం లేక సంశ్లేష రూపం విభాషగా వస్తుంది అని అర్థం. ముందు సూత్రంలో పరుషాలు పరమైతే ఏమి జరుగుతుందో చెప్పడం జరిగింది. తర్వాత సరళాలు, స్థిరాలు పరమైతే ఏం జరుగుతుందో చెప్పబడింది.

ఉదా : వచ్చెను + గోవులు = ఇందులో గోవులు అనే పదంలోని గకారం సరళం. కనుక ముందున్న ద్రుతం లోపిస్తే 'వచ్చెగోవులు' అవుతుంది. సంశ్లేష వస్తే 'వచ్చెన్గోవులు' అవుతుంది. సూత్రం ప్రవర్తిస్తే ఈ రెండు రూపాలు ఏర్పడతాయి. మరి విభాష అనడం వల్ల సూత్రం ప్రవర్తింపకుండ గూడ ఉండవచ్చు. అప్పుడు మామూలుగానే స్వత్వం వస్తుంది. వచ్చెను గోవులు అనే రూపం సిద్ధిస్తుంది. అలానే సరళాలు కాకుండా స్థిరాలు పరమైనా ఇలానే జరుగుతుంది.

**2.1.19** వర్గ యుక్సరళములు పరములగునపు డొకానొకచో ద్రుతమునకుఁ బూర్ణ బిందువును గానంబడి యెడి.(సంధి 19 సూ.)

పదవిభాగం : వర్గయుక్ సరళములు పరములు అగునపుడు ఒకానొకచో ద్రుతమునకు పూర్ణబిందువు కానంబడి యెడి.

భావం : వర్గ యుక్కులు గానీ, సరళాలు గానీ పరములైనట్లైతే ద్రుతానికి బదులుగా నిండు సున్న కొన్ని చోట్ల రావచ్చునని ఈ సూత్రానికి అర్థం.

ఉదా : వచ్చెను + ధాత్రీపతి = వచ్చెంధాత్రీపతి.

వర్గ యుక్కు అంటే వర్గాక్షరాల్లోని రెండు, నాల్గు, అక్షరాలు అని అర్థం. క, ఖ, గ, ఘ, జ అనేది ఒక వర్గం. దీనిలో ఖ, ఘ, అనేవి వర్గయుక్కులు. ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, భ ఇవి మిగిలిన వర్గ యుక్కులు. వచ్చెను + ధాత్రీపతి అనే చోట వర్గ యుక్కు పరమైంది కాబట్టి ద్రుతానికి పూర్ణ బిందువు ఆదేశంగా వచ్చి వచ్చెం ధాత్రీపతి అని కూడ కావచ్చు. ఇలానే పాడెం గంధర్వుడు కందోయి అనే రూపాలు ఏర్పడతాయి. అంటే గ, ద, అనేవి సరళాలు గంధర్వుడు పదంలోని గ, దోయి పదంలోని ద అన్నమాట. ఇవి పరములైనప్పుడు గూడా ద్రుతానికి పూర్ణ బిందువు వస్తుందన్నమాట.

**2.1.20** అవసానంబు నందు ద్రుత స్వరంబున కేని ద్రుతంబున కేని లోపంబు బహుళంబుగా నగు. (సంధి 20 సూ.)

పదవిభాగం : అవసానము నందు ద్రుత స్వరంబునకు ఏని ద్రుతంబునకు ఏని లోపము బహుళముగా అగు.

భావం : అవసానం అంటే వాక్యానికి చివర అని అర్థం. ఇలాంటి అవసాన స్థానంలో నున్న ద్రుతంలోగల అచ్చునకు గాని లేక అసలు ద్రుతానికి గాని లోపం వస్తుందని అర్థం. అయితే ఇది బహుళంగా జరుగుతుంది.

ఉదా : వాడు వచ్చెన్ - వాడు వచ్చె - వాడు వచ్చెను.

ఇక్కడ అవసానంలో ను అనే ద్రుతం ఉంది. ఇందులో 'ఉ' అనే అచ్చు ఉంది. (న్ + ఉ) అది లోపించగా ద్రుతం మిగులుతుంది. కనుక, వాడు వచ్చెన్ అని అవుతుంది. ద్రుతానికి కూడ లోపం వస్తే వాడు వచ్చె అవుతుంది. పద్యాలలో చివర గురువు రావలసి ఉన్నట్లైతే తప్పకుండా నకారపు పొల్లు వస్తుంది. బహుళంలో భాగంగా విభాష రూపం ఇక్కడ చూపిన ఉదాహరణ.

2.1.21 కొన్ని యెడల ద్రుతంబు మీఁద నకారంబు గానంబడి యెడి. (సంధి 21 సూ.)

పదవిభాగం : కొన్ని ఎడల ద్రుతము మీద నకారము కనబడి యెడి.

భావం : కొన్ని ప్రయోగాల్లో ద్రుతము మీద మరల ద్రుతము వస్తుందని ఈ సూత్రానికి అర్థం. అక్కడక్కడ ఇలాంటివి కనబడుతున్నాయని సూచించటం తప్ప ఇది నియమమని చిన్నయ సూరి విధించడం లేదు.

ఉదా : అదియునున్గాక. ఇక్కడ దీన్ని అది + కాక అని విడదీస్తే అదియును గాక అవుతుంది. కానీ దాని మీద మరల ద్రుతం వస్తే అదియునున్ గాక అవుతుంది. అలానే దివంబునుం బోలె అనే రూపం కనబడుతుంది. దివంబునుబోలె అని కావలసి ఉండగా మరల ద్రుతం రావడం వల్ల దివంబును + ను + బోలె - దివంబునుంబోలె అవుతుంది. ద్రుతానికి అర్థ బిందువు సంశ్లేష రూపాలు గూడ రావచ్చును. అందువల్ల అదియునుఁగాక, అదియునున్గాక, దివంబునుఁబోలె, దివంబునున్బోలె అనే రూపాలు సిద్ధిస్తాయి.

2.1.22 అఁట, యిఁక, చుఁడు శబ్దంబులం దప్ప నుడి తొలి హ్రస్వంబు మీఁద ఖండ బిందువును ద్రుతంబునకు లోపంబును లేవు. (సంధి 22 సూ.)

పదవిభాగం : అఁట, యిఁక, చుఁడు శబ్దములలో తప్ప నుడి తొలి హ్రస్వము మీఁద ఖండ బిందువు, ద్రుతమునకు లోపము లేవు.

భావం : అఁట, యిఁక, చుఁడు అనే మూడు శబ్దాలలో మొదట ఉన్న హ్రస్వాక్షరం మీద ఖండ బిందువు ఉంది. ఇవి తప్ప మిగిలిన ఏ శబ్దాలలోనైనా మొదటి అక్షరం హ్రస్వం అయితే తరువాత నిండుసున్న తప్ప అరసున్న రాదు. అలానే ద్రుతం లోపించదు అని అర్థం.

ఉదా : ముందు + కొంగు = ముంగొంగు.

ప్రాతాదుల తొలి అచ్చు మీది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళముగానగు అనే సూత్రం వల్ల ము + కొంగు అవుతుంది. ఇక్కడ లుప్త శేషానికి పరుషం పరమైంది కాబట్టి నుగాగమం వస్తుంది. అందువల్ల ము + ను + కొంగు అనే రూపం ఏర్పడుతుంది. ద్రుత ప్రకృతికం మీది పరుషానికి సరళం రావడం

వల్ల ము + ను + గొంగు అవుతుంది. ఆదేశ సరళానికి ముందున్న ద్రుతానికి బిందు సంశ్లేషలు రావడం వల్ల ముంగొంగు - ముఁగొంగు - మున్గొంగు - అనే మూడు రూపాలు రావలసి ఉన్నాయి. కాని ఈ సూత్రం వల్ల మొదటి అక్షరం హ్రస్వం కాబట్టి దాని మీద ఉన్న అరసున్న నిలవదు. కాబట్టి ముఁగొంగు అనే రూపం రాదు. ఈ సూత్రం వల్ల ఇది సాధించబడింది. ఇక్కడ, ద్రుతానికి సంశ్లేష కూడ లేదు. (ప్రాతాదుల సూత్రం వల్ల). కనక ముంగొంగు అనే రూపం ఒక్కటి మాత్రమే వస్తుంది. అలాగనే క్రొంబసిడి. కన్ + దోయి - కన్దోయి.

ఇక్కడ ద్రుతము మీద సరళం పరమైంది కాబట్టి ద్రుతానికి లోప సంశ్లేషలు విభాషగా వచ్చి కన్దోయి, కదోయి అనే రెండు రూపాలు ఏర్పడాలి. కాని కదోయి అనే అనిష్ఠ రూపాన్ని ఈ సూత్రం వారిస్తుంది.

"వర్గయుక్సరళములు పరములగు నపుడొకానొకచో ద్రుతమునకుఁ బూర్ణ బిందువును గానంబడియెడి" అనే సూత్రాన్ని బట్టి కందోయి అనే రూపం ఏర్పడుతుంది.

విశేషం : కన్ అనే చోట చివరి న కారం నిజానికి ద్రుతం కాదు. అది శబ్దంలో సహజంగా ఉన్నదే. కాని కన్ను, కను, కన్, అనే శబ్దాలలోని న కారాన్ని పూర్వకవి ప్రయోగబలాన్ని బట్టి చిన్నయ సూరి ద్రుతంగా నిర్ధారించినట్లు స్పష్టంగా తెలుస్తుంది.

**2.1.23** తాను నేను పదంబుల ద్రుతంబునకు సంశ్లేషంబు లేదు. (సంధి 23 సూ.)

భావం : తాను, నేను, అనే రెండు శబ్దాలు ద్రుత ప్రకృతికాలే. వీటికి చివరలో ఉన్న 'ను' అనే ద్రుతానికి ఆదేశ సరళాలు పరమైతే బిందు సంశ్లేషలు, సరళ స్థిరాలు పరమైతే లోప సంశ్లేషలు, విభాషగ వస్తాయి. కాని తాను, నేను పదాల లోని ద్రుతానికి సంశ్లేష నిషేధింపబడింది. కనక బిందువు, లోపం అనేవి మాత్రమే వస్తాయి.

ఉదా : తాను + చదివె - ఇక్కడ ద్రుత ప్రకృతికం మీద పరుషానికి సరళం వచ్చి తాను + జదివె అవుతుంది. ద్రుతానికి బిందువు వస్తే తాఁ జదివె అవుతుంది. పక్షంబున స్వత్వంబగు అనే నియమాన్ననుసరించి 'తాను జదివె' అవుతుంది. అలానే తాను + విని - తావిని, తాను విని అవుతాయి.

విశేషం : తాఁ జదివె అన్న చోట ద్రుతానికి పూర్ణ బిందువు రాదు. దీర్ఘం మీద సాధ్య పూర్ణం లేదు అనే సంజ్ఞా పరిచ్ఛేద సూత్రం దీనికి కారణం.

**2.1.24** సమాసంబున యందు ద్రుతంబునకు లోపంబగు. (సంధి 24 సూ.)

పదవిభాగం : సమాసంబున అందు ద్రుతమునకు లోపము అగు.

భావం : సమాసం లోని రెండు పదాలలో మొదటిది పూర్వపదం రెండవది పరపదం. పూర్వపదం చివరన ద్రుతం వచ్చినట్లైతే పదాలు సమసించి నప్పుడు ద్రుతం లోపిస్తుందని సూత్రానికి అర్థం.

ఉదా : ఎల్లయర్థములు, ఎల్లకలుషములు

సంస్కృతంలో ఉన్న 'సర్వ' శబ్దానికి తెలుగులో ఎల్లన్ శబ్దం సమానార్థకం. ఇది ద్రుతం చివరలో గల

అవ్యయం. అవ్యయం అంటే లింగ వచన విభక్తి శూన్యమైంది అని అర్థం.

ఇది ద్రుతాంతంగా ఉన్నందు వల్ల 'ఎల్లన్' అవుతుంది. దీనికి అర్థములు అనే పదం పరమైతే ముందు ఈ సూత్రం వల్ల ద్రుతం (న్) లోపించి ఎల్ల అవుతుంది. ఆ తర్వాత యడాగగమం వచ్చి ఎల్లయర్థములు అవుతుంది. అలాగనే ఎల్లకలుషములు రూపం సాధింపబడుతుంది.

2.1.25 సమాసంబుల నుదంతంబులగు స్త్రీ సమంబులకుం బుంపులకుం బరుష సరళంబులు పరంబులగునపుడు నుగాగమంబగు. (సంధి 25 సూ.)

పదవిభాగం : సమాసంబుల, ఉదంతంబులు అగు స్త్రీ సమంబులకు, పు, ంపు, లకు పరుష సరళములు పరము లగునపుడు నుగాగమము అగు.

భావం : ఉదంతంబులు = హ్రస్వమైన ఉ కారం అంతంలో గల పదాలు. స్త్రీ సమములు. డు ము వు అనే ప్రథమా విభక్తి ఏకవచన ప్రత్యయాలు చివర లేని శబ్దాలు పు, ంపు లు. ముువర్ణకానికి బదులుగా కర్మధారయ సమాసంలో వచ్చేవి.

ఇవి పూర్వపదాలుగా ఉండి, వాటికి పరుషం గాని లేక సరళంగాని వీటితో ప్రారంభమయ్యే పదాలు పరమైనట్లైతే 'ను' ఆగమంగా వస్తుందని సూత్రానికి అర్థం.

ఉదా : చిగురు + కయిదువు - ఇక్కడ చిగురు అనేది ఉదంత స్త్రీ సమం. దీనికి కయిదువు లోని 'క' అనే పరుషం పరమైతే నుగాగమం వస్తుంది.

పరుషం సరళంగా మారి దానికి ముందున్న ద్రుతానికి బిందు సంశ్లేషలు వస్తాయి. అందు వల్ల మూడు రూపాలు ఏర్పడతాయి. చిగురుం గయిదువు, చిగురుఁగయిదువు, చిగురున్గయిదువు అనేవి.

సరళం పరమైతే ద్రుతానికి లోప సంశ్లేషలు వస్తాయి. తళుకు గజ్జెలు, తళుకున్గజ్జెలు - అని. అలాగే పుంపులు పూర్వపదం చివరలో ఉంటే వాటికి పరుషాలు పరమైనప్పుడు మూడు, సరళాలు పరమైనప్పుడు మూడు రూపాలేర్పడతాయి.

విశేషం : రాబోయే సూత్రం ద్వారా సమాసంబులందు ద్రుతంబునకు స్వత్వంబు లేదు అనే నియమం వస్తుంది. విధాన సామర్థ్యం వలన ఇక్కడ ద్రుతానికి లోపం లేదని చెప్పడం జరిగింది.

స్వత్వమంటే అసలు స్వరూపం. అది 'ను' కనుక చిగురును కయిదువు అనే రూపం ఉండదన్నమాట.

నలుగడాదులలో సైతం ఈ రూపం వస్తుందని చిన్నయ సూరి అభిప్రాయం. కొందరు లేదంటారని చెప్పాడు. గఱుదపు న్మరువు అనే చోట పరపదం మొదట్లో మకారముంది. ఇది స్థిరం. అయినా సంశ్లేష రూపం వస్తుంది. ఇది విశేషమైన ప్రయోగమని చిన్నయ సూరి అభిప్రాయం.

2.1.26 సమాసంబులందు ద్రుతంబునకు స్వత్వంబు లేదు. (సంధి 26 సూ.)

భావం : సమాసాలలోని పూర్వ శబ్దానికి చివర సహజంగా ఉన్న ద్రుతానికి గాని, ఆగమంగా వచ్చిన ద్రుతానికి గాని స్వత్వ రూపముండదని అర్థం.

ద్రుతానికి పరుష సరళాలు గాని స్థిరాలు గాని పరమైనప్పుడు ప్రకృతి భావం ఉంటుందని ముందు కొన్ని రూపాలలో చూపడం జరిగింది. అయితే ఇది అవివ్యస్తంగా ఉన్నప్పుడు మాత్రమే అలా జరుగుతుందని సమాసాలైనప్పుడు మాత్రం అలా జరగరాదని ఈ సూత్రానికి అర్థం కనక ఇది నిషేధ సూత్రం.

2.1.27 తలఁబ్రాలు మొదలగు సమాసంబుల ద్రుతమునకు లోపము లేదు. (సంధి 27 సూ.)

భావం : ఇంతకు ముందు చెప్పినట్లుగా ద్రుతానికి లోపం రాని సమాసాలు కొన్ని ఉన్నాయని అవి తలఁబ్రాలు మొదలైన సమాసాలని సూత్రానికి అర్థం.

ఉదా : తలన్ + ప్రాలు - దీనికి నిండుసున్న అరసున్న సంశ్లేష వచ్చి తలంబ్రాలు, తలఁబ్రాలు, తలన్బ్రాలు అనే రూపాలు ఏర్పడతాయి.

అంతేగాని ద్రుతం లోపించి తలప్రాలు అనే రూపం ఏర్పడదు. అలాంటివే ఒడిఁబ్రాలు, సేసఁబ్రాలు, ఊరఁబంది, ఊరఁబిచ్చుక, తోడఁబుట్టువ, తోఁబుట్టువ, ఒల్లఁబాటు, ఒడఁబాటు మొదలైనవి.

## 2.2 సమీక్ష

సంధి పరిచ్ఛేదంలోని మొదటి 27 సూత్రాలకు సోదాహరణ వ్యాఖ్యలు తెలుసుకున్నారు.

## 2.3 ప్రశ్నలు

క్రింది సూత్రాలకు సోదాహరణ వ్యాఖ్యలు వ్రాయండి.

1. ఉత్తున కచ్చు పరంబగునపుడు సంధి యగు.
2. సంధి లేని చోట స్వరంబు కంటె పరంబయిన స్వరంబునకు యడాగమంబగు.
3. అత్తునకు సంధి బహుళముగా నగు.
4. అచ్చునకు ఆమ్రేడితము పరంబగునప్పుడు సంధి తఱుచుగా నగు.
5. కుఱు, చిఱు, కడు, నడు, నిడు శబ్దముల ఱ డ ల కచ్చు పరంబగునపుడు ద్విరుక్తటకారంబగు.
6. ప్రథమ మీది పరుషములకు గసడదవలు బహుళముగా నగు.
7. ద్రుత ప్రకృతికము మీది పరుషములకు సరళము లగు.
8. సమాసంబుల ఉదంతములగు స్త్రీ సమములకు, పుంపులకు పరుష సరళములు పరములగునపుడు నుగాగమంబగు.

## 2.4 ఆధార గ్రంథాలు


1. బాల వ్యాకరణము - శ్రీ పరవస్తు చిన్నయ సూరి
2. రమణీయము - శ్రీ దువ్వూరి వేంకటరమణ శాస్త్రి
3. బాలప్రౌఢ వ్యాకరణ సర్వస్వము - శ్రీ టి. భాస్కరరావు



**డాక్టర్ చింతపల్లి సత్యనారాయణ**
ఎం.ఏ., పిహెచ్.డి.
రీడర్
ఆర్.వి.వి.ఎన్. కళాశాల
ధరణికోట, గుంటూరు జిల్లా

# పాఠం - 3

# సంధి పరిచ్ఛేదం

పాఠ్యనిర్మాణక్రమం

3.0 లక్ష్యం
3.1 సోదాహరణ వ్యాఖ్యలు (28 నుండి 55 సూత్రాల వరకు)
3.2 సమీక్ష
3.3 ప్రశ్నలు
3.4 ఆధార గ్రంథాలు

## 3.0 లక్ష్యం

సంధి పరిచ్ఛేదంలోని 28 నుండి 55 సూత్రాల వరకు సోదాహరణ వ్యాఖ్యానం తెలుసుకుంటారు.

## 3.1 సోదాహరణ వ్యాఖ్యలు (28 నుండి 55 సూత్రాల వరకు)

3.1.1 కర్మధారయంబు లందుత్తున కచ్చు పరంబగునపుడు టుగాగమంబగు (బాల. వ్యా. 28. సూ).

పద విభాగం : కర్మధారయంబులందు ఉత్తునకు అచ్చు పరమగునపుడు టుగాగమము అగు.

భావం : విశేషణ విశేష్యాలతో కూడిన సమాసాన్ని కర్మధారయ సమాసం అంటారు. ఉత్తర పదార్థ ప్రధానం తత్పురుష. కర్మధారయంలోను, తత్పురుషలోను పూర్వ శబ్దం చివరగల హ్రస్వమైన ఉకారానికి (ఉత్తు) అచ్చు పరమైనట్లైతే 'టుక్' అనేది ఆగమంగా వస్తుందని అర్థం. అంటే టు వర్ణం అంతంలో వస్తుందన్న మాట.

ఉదా : కఱకు + అమ్ము = పూర్వపదం ఉదతం. కఱకు విశేషణం అమ్ము విశేష్యం. కనుక ఇది కర్మధారయం కాబట్టి పూర్వ శబ్దానికి చివర ఉన్న ఉత్తునకు 'టు' వచ్చి చేరుతుంది. కఱకు + టు + అమ్ము అవుతుంది. 'టు + అ' అనేదానికి ఉత్వ సంధి చేస్తే 'ట' అవుతుంది. కనుక పదం 'కఱకుటమ్ము' గా మారుతుంది. అలాగే 'నిగ్గుటద్దము' గూడ.

మరి సరసము + అలుక అనే చోట కర్మధారయంబులకు పుంపులగు (బాల 33) అనే సూత్రం వల్ల సరసపు + అలుక అవుతుంది. ఈ సూత్రంతో టుగాగమం వచ్చి ఉకార సంధి సూత్రంతో 'సరసపుటలుక' అవుతుంది.

3.1.2 కర్మధారయంబునందుఁ బేర్వాది శబ్దముల కచ్చు పరంబగునపుడు టుగాగమము విభాషనగు. (బాల.వ్యా. 29 సూ).

పద విభాగం : కర్మధారయము నందు పేరు ఆది శబ్దములకు అచ్చు పరమగు నపుడు 'టుక్' ఆగమము విభాషగ అగు.

భావం : కర్మధారయ సమాసంలో పేరు మొదలైన శబ్దాలకు అచ్చు పరమైనట్లైతే 'టుక్' అనేది విభాషగ ఆగమమం అవుతుందని అర్థం. ఇక్కడ కర్మధారయం అని ఏకవచనం వాడాడు కాబట్టి ఇక్కడ సమానాధికరణమే చెప్పబడిందన్నమాట. తత్పురుషను గ్రహించరాదన్నమాట.

ఉదా : పేరు + ఉరము = పేరుటురము అవుతుంది. అంటే టుగాగమం వచ్చిందన్నమాట. సూత్రంలో విభాషగ అవుతుందని చెప్పడం వల్ల 'పేరురము' అవుతుంది. అలానే చిగురుటాకు, చిగురాకు, పొదరుటెల్లు, పొదరిల్లు అనేవి కూడ.

3.1.3 పేదాది శబ్దంబుల కాలు శబ్దము పరంబగు నపుడు కర్మధారయంబునందు రుగాగమంబగు. (బాల.వ్యా. 30 సూ.)

పద విభాగం : పేద ఆది శబ్దములకు ఆలు శబ్దము పరము అగునపుడు కర్మధారయమునందు రుగాగమంబు అగు.

భావం : కర్మధారయ సమాసంలో పేద మొదలైన శబ్దాలకు 'ఆలు' అనే శబ్దం పరమైనట్లైతే వాటి తర్వాత 'రుక్' అనేది ఆగమంగా వస్తుందని సూత్రానికి అర్థం.

ఉదా : పేద + రు + ఆలు = ఉకార సంధి వల్ల రు + ఆ - రా అవుతుంది. కనక పేదరాలు అవుతుంది. అలానే బీదరాలు, ముద్దరాలు, బాలెంతరాలు, జవరాలు మొదలగు రూపాలు సాధ్యమౌతాయి.

3.1.4 కర్మధారయంబునందత్సమంబుల కాలు శబ్దము పరంబగునపుడత్వంబున కుత్వంబును రుగాగమంబునగు.(బాల. 31)

పద విభాగం : కర్మధారయంబు నందు తత్సమంబులకు 'ఆలు' శబ్దము పరంబు అగునపుడు అత్వంబునకు ఉత్వంబును రుగాగమంబును అగు.

భావం : కర్మధారయ సమాసంలో పూర్వ పదం తత్సమమయి దానికి 'ఆలు' శబ్దం పరమైనట్లయితే తత్సమ శబ్దపు అత్వానికి ఉత్వం వచ్చి ఆ తర్వాత రుగాగమం వస్తుందని సూత్రానికి అర్థం.

ఉదా : ధీర + ఆలు = ధీరురాలు.

సంస్కృతంలో 'ధీరా' అనేది స్త్రీలింగ శబ్దం. నామంబుల తుది దీర్ఘంబునకు హ్రస్వంబగు అనే సూత్రం వల్ల అది ధీర అవుతుంది. ఇది ప్రాతిపదికగా దానికి 'ఆలు' శబ్దం పరమైతే ముందు 'ధీరు' అవుతుంది. దానికి ఆలు శబ్దం పరమై ధీరు + ఆలు అంటే రుగాగమం వస్తుంది. ధీరు + రు + ఆలు అవుతుంది. ఉత్వసంధి వల్ల 'ధీరురాలు' అవుతుంది.

అలానే సంస్కృత భాషలోని 'గుణవంతమే' అనే శబ్దం తెలుగులో 'గుణవంత' అవుతుంది. దీనికి ఆలు శబ్దం పరమైతే అత్వానికి ఉత్వం వచ్చి గుణవంతు అని రుగాగమం ఉత్తసంధి రెండూ వచ్చి గుణవంతురాలు అని అవుతుంది. ఇక్కడ చెప్పిన ఆలు అనే శబ్దం స్త్రీ మాత్ర పరంగా గ్రహించాలి. అంటే ఆలు అనే పదానికి భార్య అని స్త్రీ అని అర్థాలున్నాయి గాని స్త్రీ అని మాత్రమే గ్రహించాలని అర్థం. సూరి దీన్ని సూచించాడు.

3.1.5 కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బుంపులగు. (బాల.వ్యా. 32 సూ.)

పద విభాగం : కర్మధారయంబులందు 'ము' వర్ణకమునకు పు, ంపు, లు అగు.

భావం : కర్మధారయ సమాసాలలో పూర్వ శబ్దం చివర ము వర్ణకం ఉంటే దానికి పు, గాని ంపు గాని ఆదేశంగా వస్తాయని సూత్రానికి అర్థం. కర్మధారయంబులందు అని బహువచనం వాడడం వల్ల సమానాధికరణం లోను (తత్పురుష) వ్యధి కరణంలోను (కర్మధారయం) ఈ కార్యం జరుగుతుందని అర్థం.

ఉదా : సరసము + మాట = అనే శబ్దంలో ముvర్ణకానికి 'మాట' పరమైంది కనుక మువర్గకానికి బదులుగా పువర్గకం వస్తే సరసపు మాట అని ంపు వర్ణకం వస్తే సరసంపు మాట అని రెండు రూపాలేర్పడతాయి. అలాంటిదే విరసపు వచనము, విరసంపు వచనము అనేది.

3.1.6 ఉదంత తద్ధర్మార్థ విశేషణమున కచ్చు పరమగునపుడు నుగాగమంబగు. (బాల. వ్యా. 33 సూ.)

పదవిభాగం : ఉత్ అంత తద్ధర్మ అర్థ విశేషణమునకు అచ్చు పరము అగునపుడు నుగాగమంబు అగు.

భావం : తద్ధార్మార్థకం అంటే ధాతువు యొక్క అర్థాన్ని బోధించేది అని అర్థం. అంటే ఇది భూత భవిష్యతే, వర్తమాన కాలాలలో దేనినీ నిర్దేశింపదన్నమాట, వచ్చు, వచ్చెడు, వచ్చెడి మొదలైనవి తద్ధర్మార్థకాలు. వీటిని విశేషంగా వాడుకున్నట్లైతే దాన్ని తద్ధర్మార్థక విశేషణం అంటారు.

ఉదా : చేయు + అతడు = చేయునతడు

చేయు అనేది తద్ధార్మార్థక విశేషణం. ఉత్తు అంతంలో కలది. కాబట్టి దీనికి 'అతడు' అనే దానితో అచ్చు పరమైతే నుగాగమం వస్తుంది. అందువల్ల చేయు + ను + అతడు అవుతుంది. ను + అతడు ఉత్వ సంధి వల్ల 'నతడు' గా మారి 'చేయునతఁడు' రూపం సిద్ధిస్తుంది. అలాగనే చేసెడునతఁడు.

3.1.7 షష్ఠీ సమాసంబు నందుకార ఋ కారముల కచ్చు పరమగునపుడు నుగాగమంబగు. (బాల వ్యా. 34)

పదవిభాగం : షష్ఠి సమాసము నందు ఉకార ఋ కారములకు అచ్చు పరము అగునపుడు 'నుక్' ఆగమము అగు.

భావం : పూర్వ శబ్దం షష్ఠీ విభక్తితో కూడి శబ్దానికి ఉ కారం గాని ఋ కారం గాని అంతంలో ఉండి దానికి అచ్చు పరమైనట్లైతే నుగాగమం వస్తుంది అని అర్థం.

ఉదా : రాజు యొక్క + ఆజ్ఞ = రాజునాజ్ఞ

దీనిలో పూర్వ శబ్దం షష్ఠీ విభక్తి అంతంలో కల్గి ఉంది. సమాస పరిచ్ఛేదంలోని 25 వ సూత్రంలో చెప్పినట్లు సమాస విభక్తికి లోపంబగు, లట్టునకు గాదు అనే నియమం ప్రకారం 'యొక్క' లోపించి రాజు + ఆజ్ఞ అవుతుంది. అలాగనే విధాతృ + ఆనతి ఈ రెండింటికి నుగాగమం వచ్చి రాజునాజ్ఞ, విధాతృకాకతి అవుతాయి.

3.1.8 ఉదంత స్త్రీ సమంబులకును, బుంపులకు, న దంత గుణ వాచకంబులకును దనంబు పరంబగునపుడు నుగాగమంబగు. (బాల వ్యా. 35 సూ.)

పదవిభాగం : ఉత్ అంత స్త్రీ సమములకు ను, పు, ంపు, లకును, అత్ అంత గుణ వాచకములకును తనము పరము అగునపుడు నుగాగమము అగు.

భావం : స్త్రీ సమాలు అంటే ప్రథమా ఏక వచన ప్రత్యయాలు లోపించి నట్టి శబ్దాలు అని అర్థం. ఇలాంటివి

ఉదంతాలు అయితే వాటిని ఉదంత స్త్రీ సమాలు అంటారు. కర్మధారయ సమాసంలో ము వర్ణకానికి ఆదేశంగా వచ్చిన పు, ంపు, లకు - హ్రస్వమైన అకారం (అత్తు) అంతంలో ఉండి గుణాన్ని బోధించే అదంత గుణ వాచకాలకు - వీటికి 'తనము' అనే తద్ధిత ప్రత్యయం పరమైనట్లైతే 'ను' అనేది ఆగమంగా వస్తుందని సూత్రానికి అర్థం.

ఉదా : సొగసు + తనము (ఉదంత స్త్రీ సమం)
సరసపు + తనము ( పు )
తెల్ల + తనము (అదంత గుణవాచకం)

వీటిలో సొగసు ఉదంత స్త్రీ సమం, సరసపు పు అంతంలో గలది. తెల్ల అదంత గుణవాచకం. వీటికి 'ను' ఆగమంగా వస్తుంది. సొగసు + ను + తనము అవుతుంది. పరుషం సరళంగా మారి తనము దనము అవుతుంది. బిందు సంశ్లేషలు విభాషగా రావడం వల్ల సొగసుందనము సొగసుఁదనము, సొగసున్దనము అనే మూడు రూపాలు వస్తాయి. సమాసం కావడం వల్ల ద్రుతానికి స్వత్వం ఉండదు. అంటే సొగసు + ను + దనము ఉండదన్నమాట. విధాన సామర్థ్యం వల్ల ద్రుతానికి లోపం కూడా రాదు. మిగిలిన వాటిని గూడ ఇలానే స్వీకరించాలి.

3.1.9 సమాసంబునం బ్రాఁతాదుల తొలి యచ్చు మీఁది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు. (బా. వ్యా. 36 సూ.)

పదవిభాగం : సమాసంబున ప్రాత ఆదుల తొలి అచ్చు మీది వర్ణంబులకు ఎల్ల లోపంబు బహుళంబుగా అగు.

భావం : ప్రాత మొదలైన శబ్దాలు సమాసంలో పూర్వ శబ్దాలుగా ఉండి అవి తరువాతి శబ్దాలతో సమసించే టప్పుడు వాటి తొలి అచ్చు మీద ఉన్న వర్ణాలకన్నింటికీ బహుళంగా లోపం వస్తుందని సూత్రానికి అర్థం.

ఉదా : ప్రాఁత+ ఇల్లు = ప్రాయిల్లు, ప్రాతయిల్లు

ప్రాత శబ్దంలో తొలి అచ్చు 'ప్రా' అనే అక్షరం లోని 'ఆ' అనేది. దీని తర్వాత ఉన్న వర్ణాలు ఒకటి అర్థానుస్వారం (అరసున్న) రెండు త వర్ణం. కాబట్టి ఈ సూత్రం వల్ల ఈ రెండింటికి లోపం వచ్చి ప్రా + ఇల్లు అని అవుతుంది. దీర్ఘం మీద సంధి లేదు కాబట్టి యడాగమం వచ్చి ప్రాయిలు అవుతుంది. సూత్రంలో బహుళం అని చెప్పడం వల్ల ఈ లోపం విభాషగా జరిగి లోపం రాకపోతే ప్రాతయిల్లు అని ఉంటుంది. అలానే లేఁదూడ, లేతదూడ, పూరెమ్మ, పూవురెమ్మ - అనే రూపాలు గ్రహించాలి.

3.1.10 లుప్త శేషంబునకుం బరుషములు పరములగునపుడు నుగాగమంబగు. (బాల వ్యా. 37 సూ.)

పదవిభాగం : లుప్త శేషమునకు పరుషములు పరములు అగునపుడు నుగాగము అగు.

భావం : లుప్త శేషం అంటే లోపించగా మిగిలిందని అర్థం. అంటే పూర్వ సూత్రం వల్ల లోపించగా మిగిలిన అక్షరానికి పరుషాలు పరమైనట్లయితే 'నుక్' ఆగమంగా అంటే అదనంగా వచ్చి చేరుతుందని యీ సూత్రానికి అర్థం.

ఉదా : ప్రాఁత + కెంపు = తొలి యచ్చు మీది వర్ణాలకు లోపం విభాషగా రావడం వల్ల ప్రా అనే అక్షరం

మిగులుతుంది. దీన్ని లుప్త శేషం అంటారు. దీనికి 'కె' అనే పరుషం పరమైంది. కనుక ఈ సూత్రాన్ని బట్టి 'ను' అనేది అదనంగా వచ్చి ప్రా + ను + కెంపు అవుతుంది. ద్రుత ప్రకృతికముల మీది పరుషములకు సరళములగు అనే సూత్రం ప్రకారం ప్రాగెంపు అని ఆదేశ సరళానికి ముందున్న ద్రుతానికి బిందువు రావడం వల్ల ప్రాఁగెంపు అని రూపం సిద్ధిస్తుంది. దీర్ఘం మీద సాధ్య పూర్ణం లేదు కాబట్టి నిండుసున్న రాదు. ఇక్కడ సంశ్లేష కూడ నిషేధింపబడింది. తొలి యచ్చు మీది వర్ణాలు లోపించనట్లయితే ప్రాఁత కెంపు అని ఉంటుంది. అలాగే లేఁగొమ్మ, పూఁదోఁట అనే రూపాలేర్పడతాయి. లోపం రాకపోతే లేతకొమ్మ, పూవుఁదోఁట అనే రూపాలు సిద్ధిస్తాయి.

మీఁదు, కెంపు, చెన్ను - శబ్దాల తొలి యచ్చు మీద వర్ణాలు నిత్యంగా లోపిస్తాయి. కనుక మీఁగడ, కెందామర చెందొవ అనే రూపాలు తప్పకుండా సిద్ధిస్తాయి. బహుళం లోని నిత్యానికి ఇవి ఉదాహరణలు.

3.1.11 క్రొత్త శబ్దమున కాద్యక్షర శేషంబునకుం గొన్ని యెడల నుగాగమంబునుం గొన్ని యెడల మీఁది హల్లునకు ద్విత్వంబునగు. (బాల వ్యా. 38 సూ.)

పదవిభాగం : క్రొత్త శబ్దమునకు ఆది అక్షర శేషమునకు కొన్ని ఎడల నుగాగమంబును, కొన్ని ఎడల మీఁది హల్లునకు ద్విత్వమును అగు.

భావం : ఆద్యక్షర శేషం అంటే మిగిలి ఉన్న మొదటి అక్షరం - అని అర్థం. క్రొత్త శబ్దం ప్రాతాదుల లోనిదే. కనుక తొలి యచ్చు మీది వర్ణాలు లోపిస్తే 'క్రొ' అనేది శేషంగా మిగులుతుంది. ఇది ఆద్యక్షరం అంటే మొదటి అక్షరం. దీనికి కొన్ని సార్లు 'ను' ఆగమంగా వస్తుంది. మరికొన్ని సార్లు మీది హల్లుకు ద్విత్వం వస్తుంది. మీది హల్లు అన్నాడు కాబట్టి అచ్చు పరమైతే ఈ సూత్రం వర్తించదు అని అర్థం.

ఉదా : క్రొత్త + చాయ = అన్నప్పుడు 'త్త' లోపించి క్రొ + చాయ అని మిగులుతుంది. నుగాగమం రావడంవల్ల క్రొ + ను + చాయ అవుతుంది. పరుషం సరళం గాను, ఆదేశ సరళానికి ముందున్న ద్రుతానికి బిందువు రావడం వల్ల క్రొంజాయ అనే రూపం సిద్ధిస్తుంది. అలాంటివే క్రొంజెమట, క్రొంబసిడి అనే రూపాలు.

ఇక క్రొత్త + కారు అన్నప్పుడు 'త్త' లోపించి క్రొ + కారు అని మిగులుతుంది. మీది హల్లునకు ద్విత్వం వచ్చి క్రొక్కారు అనే రూపం సిద్ధిస్తుంది. ఇలాంటివే క్రొత్తావి, క్రొగ్గండి, క్రొన్నన, క్రొమ్మావి - అనే రూపాలు.

పర పదం మొదటి అక్షరం పరుషేతరమైతే నుగాగమం రాదు. కేవలం ద్విత్వ మీది హల్లునకు ద్విత్వం వస్తుంది అంతే. క్రొక్కారు, క్రొత్తావి, క్రొగ్గండి, క్రొన్నన్, క్రొమ్మావి అనేవి ఉదాహరణలు.

కాని కెంధూళి, కెంజడలు - అనే పదాలలో పరపదం మొదట పరుషేతరాలే ఉన్నాయి. అయినా నుగాగమం వచ్చి ద్రుతకార్యం జరుగుతుంది. కాబట్టి ఇవి బహుళంలోని నిషేధానికి ఉదాహరణలు అలాగనే క్రొత్త + కుండ అన్నప్పుడు తొలి యచ్చు మీది వర్ణం లోపించదు కాబడ్డి క్రొత్తకుండ అవుతుంది 'క్రొక్కుండ' కాదు. ఇది నిషేధానికి ఉదాహరణ.

ఇక క్రిందు + కడుపు అన్నప్పుడు తొలియచ్చు మీఁది వర్ణాలకు లోపం జరిగి క్రి + ను + కడుపు అని

ఏర్పడుతుంది. పరుషం సరళంగా మారి క్రిగడుపు కావాలి కాని లుప్తశేషానికి దీర్ఘం వచ్చి క్రీగడుపు అవుతుంది. ఇది బహుళంలోని అన్య విధానికి ఉదాహరణ. బహుళానికి పూర్తిగా లక్ష్యాలను చూపించిన సూత్రం ఇది ఒక్కటే అవి.

1. నిత్యం - మీఁదు + కడ = మీఁగడ.
2. నిషేధం - క్రొత్త + కుండ = క్రొత్తకుండ.
3. వైకల్పికం - ప్రాత + ఇల్లు = ప్రాయిల్లు, ప్రాతయిల్లు
4. అన్యవిధం - క్రిందు + కడుపు = క్రీఁగడుపు

3.1.12 అన్యంబులకు సహిత మిక్కార్యంబులు కొండొకచో గానంబడియెడి. (బాల వ్యా. 39 సూ.)

పదవిభాగం : అన్యంబులకు సహితము ఇక్కార్యములు, కొండొకచో కానంబడియెడి.

భావం : ప్రాతాదులలో చేరని శబ్దాలకు కూడ ఒక శబ్దం పరమైనప్పుడు తొలి యచ్చు మీది వర్ణాలకు లోపం వచ్చి ఆ తర్వాత పరుషాలు పరమైతే నుగాగమం వస్తుంది. ఇంకో శబ్దం పరమైనప్పుడు లోప ద్విత్వాలు వస్తాయని యీ సూత్రానికి అర్థం. అన్యంబులు అంటే ఏదో పదానికి మరేదో పదం అని అర్థం చేసుకోకూడదు. సూత్రంలో ఇచ్చిన లక్ష్యాలను మాత్రమే గ్రహించాలి.

ఉదా : ఇక్కడ రెండు రకాల ఉదాహరణలున్నాయి. మొదటి నాలుగు లక్ష్యాలలో తొలి యచ్చు మీది వర్ణాలు లోపించి లుప్త శేషానికి నుగాగమం వస్తుంది. అవి -

పది + తొమ్మిది = పందొమ్మిది
తొమ్మిది + పది = తొంబది
వంక + చెఱగు = వంజెఱగు
సగము + కోరు = సంగోరు

తర్వాతి లక్ష్యాలలో తొలి యచ్చు మీది వర్ణం లోపించిన తర్వాత మీది హల్లులకు ద్విత్వం వస్తుంది.

నెఱ + మది = నెమ్మది
నెఱ + నడుము = నెన్నడుము మొదలైనవి.

ఎప్పుడెలా ప్రయోగించాలనేది ప్రయోగాలను బట్టి గ్రహించాలి.

3.1.13 ఆమ్రేడితంబు పరంబగునపుడు కడాదుల తొలి యచ్చు మీఁది వర్ణంబుల కెల్ల నదంతంబగు ద్విరుక్తటకారంబగు. (బాల వ్యా. 40 సూ.)

పదవిభాగం : ఆమ్రేడితము, పరమగునపుడు, కడ ఆదుల తొలి అచ్చు మీది వర్ణంబులకు ఎల్లన్ అదంతంబు అగు ద్విరుక్త టకారంబు అగు.

భావం : కడ మొదలైన శబ్దాలు అత్యంతం అనే అర్థంలో ద్విరుక్తాలైతే పూర్వపదం తొలి యచ్చు మీది వర్ణాల కన్నింటికినీ బదులుగా అదంతమైన ద్విరుక్తటకారం అంటే 'ట్ట' ఆదేశంగా వస్తుందని ఈ సూత్రానికి అర్థం.

ఉదా : కడ + కడ

ఇందులో రెండవ కడను ఆమ్రేడితం అంటారు. ఇది పరమైనట్లయితే మొదటి కడలోని తొలి యచ్చు మీది వర్ణాలన్నీ లోపించి దాని స్థానంలో ద్విరుక్తమైన ట కారం వస్తుంది. కనుక క + కడ తర్వాత క + ట్ట + కడ అనే రూపం సిద్ధిస్తుంది. మిగిలినవి గూడ అంతే ఎదురు + ఎదురు - ఎట్టఎదురు - ఇంకా కొన, చివర, తుద, తెన్ను, తెరువు, నడుము, పగలు, పిడుగు, బయలు మొదలైన శబ్దాలు ఈ నియమం క్రింద చేరతాయి.

3.1.14 ఆమ్రేడితంబు పరంబగునపుడు విభక్తిలోపంబు బహుళంబుగానగు. (బాల వ్యా. 41 సూ.)

పదవిభాగం : ఆమ్రేడితము పరము అగునపుడు, విభక్తి లోపము, బహుళముగా అగు.

భావం : ఆమ్రేడితం పర పదంగా ఉంటే పూర్వ పదం చివర ఉన్న విభక్తికి బహుళంగా లోపం కలుగుతుందని సూత్రానికి అర్థం. బహుళం అనడం వల్ల విభక్తి లోపం కొన్నింటికి వైకల్పికంగా జరుగుతుంది. ఒక్కోసారి విభక్తికి బదులుగా అంతిమాక్షర లోపం జరుగుతుంది.

ఉదా : అప్పటికిన్ + అప్పటికిన్

అన్నప్పుడు రెండో శబ్దం ఆమ్రేడితం. ముందు చెప్పిన అప్పటికిన్ శబ్దంలో చివర ఉన్న 'కిన్' అనే విభక్తి ప్రత్యయం వైకల్పికంగా లోపిస్తుంది. అందువల్ల అప్పటి + అప్పటికిన్ అవుతుంది. ఆమ్రేడిత సంధి వల్ల అప్పటప్పటికిన్ అనే రూపం సిద్ధిస్తుంది. ఒకవేళ సంధి జరగక పోతే కేవలం ద్రుతం లోపించి 'అప్పటి కప్పటికిన్' అవుతుంది. ఇలానే అక్కడక్కడన్, అక్కడనక్కడన్, ఇంటింటిన్, ఇంటనింటన్, ఊరూరన్, ఊరనూరన్, అనే రూపాలు సిద్ధిస్తాయి.

ఇంచుక + ఇంచుక - అన్నప్పుడు విభక్తి కాకపోయినప్పటికి అంతిమాక్షరం లోపిస్తుంది. అందువల్ల ఇంచించుక - అనే రూపం సిద్ధిస్తుంది. సంధి జరగకపోతే ఇంచుకించుక - అని అవుతుంది. ఇలానే నాఁడు + నాఁడు - నానాడు అని లోపం జరగకపోతే నాఁడు నాఁడు అని రూపాలు ఏర్పడతాయి.

బహుళం లోని అన్య విధానికివి ఉదాహరణలు.

3.1.15 అందదుకు ప్రభృతులు యధా ప్రయోగంబుగ గ్రాహ్యంబులు. (బాల వ్యా. 42 సూ.)

భావం : అందదుకు మొదలైన శబ్దాలు ప్రయోగాన్ని బట్టి గ్రహింప దగినవని అర్థం.

ఉదా : అదుకు + అదుకు = అందదుకు
ఇంకులు + ఇంకులు = ఇఱ్ఱింకులు
ఇగ్గులు + ఇగ్గులు = ఇల్లిగ్గులు
చెదరు + చెదరు = చెల్లచెదరు, చెల్లాచెదరు
తుమురు + తుమురు = తుత్తుమురు
తునియలు + తునియలు = తుత్తునియలు
మిట్లు + మిట్లు = మిఱుమిట్లు

మొదలైన వాటిని మహాకవి ప్రయోగాలననుసరించి అదే విధంగా గ్రహించి ప్రయోగించవచ్చు అని అర్థం.

3.1.16 చేత తోడ వలనల కిత్వంబు సమాసంబులందగు. (బాల వ్యా. 43 సూ.)

పదవిభాగం : చేత తోడ వలనలకు ఇత్వంబు సమాసంబులంది అగు.

భావం : సమాసాలలో తృతీయా తత్పురుష సమాసంలోని విగ్రహ వాక్యంలో వచ్చే చేత, తోడ అనే విభక్తి ప్రత్యయాలకు, పంచమీ తత్పురుష సమాసంలో విగ్రహ వాక్యంలో వచ్చే వలన అనే విభక్తి ప్రత్యయానికి ఇత్వం వస్తుందని సూత్రానికి అర్థం.

సమాస విభక్తికి లోపం జరుగుతుందనే నియమాన్ని బట్టి అసలు విభక్తి ప్రత్యయం ఉండదు. కాని ఇక్కడ విభక్తికి ఇత్వం విధించడం వల్ల విభక్తి ప్రత్యయం లోపించదని అర్థం.

ఉదా : నీచేతన్ + ప్రోవు = అన్నప్పుడు విభక్తి ప్రత్యయానికి 'ఇ' ఆగమంగా వచ్చి నీ చేతన్ + ఇ + ప్రోవు అని అవుతుంది. అంద్వవగాగమంబు లందప్వ అపదాది స్వరంబు పరంబగు నపుడు సంధి యగు - అనే సూత్రం ప్రకారం ఇక్కడ సంధి జరుగుతుంది. ద్రుతం దానంతటదే లోపిస్తుంది. కనక 'నీ చేతిప్రోవు' అనే రూపం సిద్ధిస్తుంది.

అలానే నాతోడి చెలిమి, నీవలని భయము సిద్ధిస్తాయి.

3.1.17 అంద్వాదుల కలి గాగమంబు సమాసంబు నందగు. (బాల వ్యా. 44 సూ.)

పదవిభాగం : అందు, ఆదులకు, అలిక్ ఆగమము సమాసము నందు అగు.

భావం : అందు, ఇందు, ఎందు అనేవి అంద్వాదులు. వీటికి 'అలి' అనేది అదనంగా చేరుతుందని అర్థం. దాంతో అందలి, ఇందలి, ఎందలి అనే రూపాలు సిద్ధమౌతాయి.

ఉదా : నాయందున్ + కరుణ - అనే చోట అలిక్ ఆగమంగా రావడం వల్ల నాయందున్ + అలి + కరుణ అవుతుంది. సంధి పరిచ్ఛేదం 11వ సూత్రంతో ద్రుతానికి లోపం వచ్చి ఉత్వసంధి జరిగి నాయందలి కరుణ అవుతుంది. అలాగనే ఇందు, ఎందు అనేవి పరపదాలైనప్పుడు గూడ సంధి జరుగుతుంది.

కొంతమంది ఎందు శబ్దానికి మాత్రం సంధి లేదంటారని సూరి సూచించాడు. కాని తాను అంగీకరించ లేదు. ఎందున్ + వారు - ఎందలి వారు అనేది సమ్మతమైన రూపం కేవలం సప్తమీ తత్పురుష సమాసం మాత్రమే ఈ సూత్రానికి లక్ష్యం.

3.1.18 అది యవి శబ్దంబుల యత్తునకు వృత్తిని లోపంబు బహుళంబుగ నగు. (బాల వ్యా. 45 సూ.)

పదవిభాగం : అది, అవి, శబ్దముల అత్తునకు వృత్తిని లోపము బహుళముగ అగు.

భావం : సమాసంలో పూర్వ పదం మీద అది, అవి అనే శబ్దాలు పర పదాలుగా వచ్చినట్లైతే వీటి తొలి వర్ణమైన అత్తునకు బహుళంగా లోపం వస్తుందని సూత్రార్థం.

ఉదా : నా + అది - అన్నప్పుడు 'అ' వర్ణం లోపిస్తే 'నాది' అవుతుంది. లోపం రాకపోతే నాయది అవుతుంది. యడాగమం రావడం వల్ల ఇది విభాషకు ఉదాహరణ. అలాగే నాయవి.

మరి బహుళం అని చెప్పడం ఎందుకంటే ఉదంత తద్ధర్మ విశేషణాలకు ఈ లోపం లేదని ఇదంత తద్ధర్మ విశేషణాలకేమో నిత్యమని గ్రహించమని సూరి చెప్పాడు.

వచ్చు + అది - ఇది ఉదంత తద్ధర్మ విశేషణానికి ఉదాహరణ. దీనికి బాల వ్యాకరణం సంధి పరిచ్ఛేదం 33వ సూత్రాన్ని అనుసరించి నుగాగమం వస్తుంది. కనుక వచ్చు + ను + అది 'వచ్చునది' అవుతుంది. కనక ఇది అప్రవృత్తికి ఉదాహరణ.

ఇక హ్రస్వమైన ఇకారం అంతమందు గల తద్ధర్మ విశేషణం మీద అత్వం వస్తే లోపం నిత్యంగా జరుగుతుంది.

వచ్చెడి + అది అన్నప్పుడు అవర్ణం లోపించి వచ్చెడి + ది - వచ్చెడిది అవుతుంది. కనుక ఇది ప్రవృత్తికి లక్ష్యం కనుక ఈ సూత్రంలో బహుళంలోని విభాష, అప్రవృత్తి, ప్రవృత్తి అనే మూడింటిని నిరూపించినట్లుగా తెలుస్తుంది.

3.1.19 పడ్వాదులు పరంబులగు నపుడు మువర్ణకంబునకు లోప పూర్ణ బిందువులు విభాషనగు. (బాల వ్యా. 46 సూ.)

పదవిభాగం : పడు, ఆదులు, పరంబులు అగునపుడు 'ము' వర్ణకంబునకు లోప, పూర్ణ బిందువులు విభాషన్ అగు.

భావం : 'ము' వర్ణకం ప్రథమావిభక్తి ఏక వచన ప్రత్యయం. దీనికి 'పడు' మొదలైనవి పరమైతే దానికి లోపమూ, నిండు సున్న (పూర్ణ బిందువు) లు రెండు విభాషగ వస్తాయి. కనుక మొత్తం మూడు రూపాలు సిద్ధిస్తాయి.

ఉదా : భయము + పడియె - అన్నప్పుడు 'ము' విభక్తికి లోపం వస్తే భయపడియె అవుతుంది పూర్ణబిందువు వచ్చి నట్లయితే భయంపడియె అని అవుతుంది. అలాంటిదే సూత్ర పట్టె, సూత్రం పట్టె - వికల్పం కాబట్టి ఇలా జరగకపోతే భయముపడియె, సూత్రము పట్టె అనే రూపాలు సిద్ధిస్తాయి.

3.1.20 మధ్యమ పురుష మువర్ణకంబునకు హలవసానంబులు పరంబులగునపుడు లోపము విభాషనగు. (బాల వ్యా. 47 సూ.).

పదవిభాగం : మధ్యమ పురుష 'ము' వర్ణకంబునకు హల్లు అవసానములు పరములు అగునపుడు లోపము విభాషగ అగు.

భావం : మధ్యమ పురుష క్రియకు ఏక వచనంలో నాల్గు పర్యాయాలు ము వర్ణకం వస్తుంది. అవి ఆశీస్సు, శాపము సంప్రార్థనము విధి అనేవి. నీవు మీరు అనే సర్వ నామాలు కర్తగా ఉన్నప్పుడు వాటితో అన్వయించే క్రియను మధ్యమ పురుష క్రియ అంటారు. ఉదా. చూడుము.

ఏక వచనంలో ఈ మధ్యమ పురుషకు చివరలో ఉన్న 'ము' అనే ప్రత్యయానికి హల్లుగాని అవసానం గాని పరమైనట్లయితే ము వర్ణకం విభాషగ లోపిస్తుందని అర్థం. అవసానం అంటే వాక్యానికి చివర అని అర్థం.

ఉదా : చూడుము + నన్ను - అన్నప్పుడు చూడుము మధ్యమ పురుష క్రియ దీని 'న' అనే హల్లు పరమైంది కాబట్టి 'ము' వర్ణం లోపించి చూడు నన్ను అవుతుంది.

ఇటు చూడుము - అన్నప్పుడు 'ము' అవసానంలో ఉందన్నమాట. అప్పుడు అది లోపించి 'ఇటు చూడు' అనే రూపం సిద్ధిస్తుంది. ఈ లోపం విభాష కాబట్టి లోపం జరగకపోతే ఇటు చూడుము అని ఉంటుంది.

హల్లు పరమైతేనే ఇలా జరుగుతుంది. అచ్చు పరమైతే మామూలుగానే ఉత్వసంధి వస్తుంది. అందువల్ల చూడుమనియె (చూడుము + అనియె), వినుమనియె (వినుము + అనియె) అనే రూపాలు సిద్ధిస్తాయి.

3.1.21 వ్యతిరేక మధ్యమ ము వర్ణకంబునకెల్ల యెడల లోపంబు విభాషనగు. (బాల వ్యా. 48 సూ.)

పదవిభాగం : వ్యతిరేక మధ్యమ 'ము' వర్ణకమునకు ఎల్ల ఎడల లోపము విభాషక అగు.

భావం : వ్యతిరేకార్థకమైన మధ్యమ పురుష క్రియకు 'ము' వర్ణకం వస్తుంది. దీనికి అచ్చు పరమైనా, హల్లు పరమైనా, అవసానం అయినా విభాషగ అది లోపిస్తుందని సూత్రానికి అర్థం.

ఉదా : నమ్మకుము + ఇటు - ఇందులో నమ్మకము అనేది మధ్యమ పురుష క్రియ ఇది వ్యతిరేకార్థకం. ఈ సూత్రం ప్రకారం 'ము' ప్రత్యయం విభాషగ లోపిస్తుంది. కనుక

నమ్మకు + ఇట - అవుతుంది. ఉత్వసంధి వల్ల 'నమ్మకిట' అనే రూపం సిద్ధిస్తుంది. లోపం రాకపోతే 'నమ్మకుమిట' అని అవుతుంది.

3.1.22 ఆమ్రేడితంబు పరంబగునపుడు మధ్యమ ముడుజ్ఞలకు లోపంబు విభాషనగు. (బాల వ్యా. 49 సూ.)

పదవిభాగం : ఆమ్రేడితము, పరము, అగునపుడు మధ్యమ 'ము' డుజ్ లకు లోపము విభాషన్ అగు.

భావం : మధ్యమ పురుష క్రియలకు ఏకవచన ప్రత్యయం 'ము' బహువచన ప్రత్యయం 'డు'. ఈ రెండింటిని కలిపి సూత్రంలో మధ్యమ ము డు జ్ఞులు అన్నాడు సూరి.

ఆమ్రేడితం పరమైతే ఈ మధ్యమ ము డు జ్ఞులు విభాషగా లోపిస్తాయని సూత్రానికి అర్థం లోపించక పోతే మామూలుగానే పరస్వరంలో పూర్వ స్వరం కలిసి పోతుంది.

ఉదా : ఉండుము + ఉండుము. అన్నప్పుడు రెండవసారి పల్కిన 'ఉండుము' అనేది ఆమ్రేడితం. ఇది పరపదమై నప్పుడు దానికి ముందు వున్న మధ్యమ పురుష 'ము' ప్రత్యయం లోపిస్తుంది. కనుక - ఉండు + ఉండుము అని అవుతుంది. ఉత్వసంధి వల్ల 'ఉండుండుము' అనే రూపం సిద్ధిస్తుంది. ఒకవేళ లోపం జరగకపోతే ఉండుముండుము అవుతుంది. అలానే కొట్టుడు + కొట్టుడు - కొట్టుకొట్టుడు, కొట్టుడు కొట్టుడు అవుతుంది.

3.1.23 విసర్గంబున ననుకరణంబున లోపంబగు. (బాల వ్యా. 50 సూ.)

పదవిభాగం : విసర్గమున, అనుకరణమున లోపము అగు.

భావం : అనుకరణం అంటే అను అనే ధాతువును చేర్చి చెప్పడం అని అర్థం. ఏ వాక్యాన్నైనా అనుకరించేటప్పుడు 'అను' అనే ధాతువును చేర్చి పలుకుతారు. సంస్కృత వాక్యాలను తెలుగు లోనికి అనుకరించేటప్పుడు కొన్ని నియమాలు పాటించాలి.

వాటిని అనుకరణ సంధులు అంటారు. సంస్కృత వాక్యం చివర విసర్గ ఉన్నట్లయితే దానికి 'అను' అనే పదాన్ని చేర్చినప్పుడు విసర్గకు లోపం కలుగుతుందని అర్థం.

ఉదా : వర్ధతాం శ్రీః + అనియె - అన్నప్పుడు విసర్గ లోపించి వర్ధతాం శ్రీ అనియె అని అవుతుంది. దీర్ఘం మీద సంధి లేదు కాబట్టి యడాగమం వచ్చి వర్ధతాం శ్రీ యనియె అని అవుతుంది.

**3.1.24** అనుకృతిని నమశ్శబ్దము తుది యత్తున కోత్వము విభాషనగు. (బాల వ్యా. 51 సూ.)

పదవిభాగం : అనుకృతిని నమః శబ్దము తుది అత్తునకు ఓత్వము విభాషన్ అగు.

భావం : నమః అనే శబ్దం చివరగల అత్వానికి ఓత్వం విభాషగ ఆదేశంగా వస్తుందని సూత్రానికి అర్థం.

పూర్వ సూత్రం వల్ల విసర్గ లోపించి నమ + అనె అవుతుంది. 'మ' కు ఓత్వం రావడం వల్ల నమో + అనె - అని అవుతుంది. స్త్రీ వాచక తత్సమ సంబోధ నాంతములకు సంధి లేదు అనే నియమం ప్రకారం అత్వ సంధి రాదు. కనుక యడాగమం వచ్చి తుభ్యం నమయనె - అనే రూపం సిద్ధిస్తుంది.

వేరే చోట కూడ ఇలాంటిది కనపడుతుందని చెప్తూ 'గతాను గతికో లోకో యటంచున్' అనే లక్ష్యాన్ని సూరి చూపించాడు. ఇక్కడ గూడ లోక + అటంచున్ అని ఏర్పడి సంధి జరగనందువల్ల యడాగమం వస్తుంది.

**3.1.25** అనుకరణంబునందుది హల్లునకు ద్విర్వచనంబగు. (బాల వ్యా. 52 సూ.)

పదవిభాగం : అనుకరణము నందు తుది హల్లునకు ద్విర్ వచనంబు అగు.

భావం : సంస్కృత వాక్యం చివర హల్లు ఉన్నట్లయితే అనుకరించే టప్పుడు ఆ హల్లునకు ద్విత్వం వస్తుందని సూత్రానికి అర్థం.

ఉదా : కింతత్ + అనియె - అన్నప్పుడు కింతత్ అనేది హలంత శబ్దం. దానికి అనియె చేరినప్పుడు చివరి హల్లుకు ద్విత్వం వచ్చి అది కింతత్తనియె అని అవుతుంది.

అలానే + కస్త్వమే అనియె - కస్త్వమ్మనియె అవుతుంది.

**3.1.26** అనుకరణంబునం దహమాదుల మకారంబునకు ద్విరుక్తి విభాషనగు. (బాల వ్యా. 53 సూ.)

పదవిభాగం : అనకరణంబు నందు అహమ్ ఆదుల మకారమునకు ద్విరుక్తి విభాషన్ అగు.

భావం : అనుకరణంలో 'అహమ్' మొదలైన శబ్దాల తుది మకారానికి విభాషగా ద్విత్వం వస్తుందని సూత్రానికి అర్థం.

ఉదా : దాసోహమ్ + అని - అన్నప్పుడు ముందు చెప్పిన సంస్కృత వాక్యం హలంతం కాబట్టి 52 వ సూత్రం ప్రకారం ద్విర్వచనం వచ్చి దాసోహమ్మని అని అవుతుంది. కాని ప్రస్తుత సూత్రంలో ఈ ద్విర్వచనం విభాషగ చెప్పడం వల్ల ద్విర్వచనం కాని పక్షంలో 'దాసోహమనె' అని అవుతుంది. అలానే తత్కర్తవ్యమ్మనె తత్కర్తవ్యమనె అనేది రెండో ఉదాహరణ.

3.1.27 ఉదంత నామంబున కనుకరణంబు నందు వుగాగమంబగు. (బాల వ్యా. 54 సూ.)

పదవిభాగం : ఉత్ అంత నామంబునకు అనుకరణంబు నందు 'వు' ఆగమంబు అగు.

భావం : హ్రస్వమైన ఉకారం (ఉత్తు) అంతంలోగల నామంపై 'అను' అనే ధాతువు చేరినట్లయితే 'వు' వర్ణం ఆగమంగా వస్తుందని సూత్రానికి అర్థం.

ఉదా : ఇయంధేనుః + అనె పూర్వ భాగం సంస్కృత వాక్యం కాబట్టి 'అనుకరణంబున విసర్గకు లోపంబగు' అనే నియమాన్ని బట్టి ఇయంధేను + అనె అని అవుతుంది. ధేను అనేది ఉదంతం కాబట్టి దీనికి 'వు' అనేది ఆగమంగా వచ్చి చేరుతుంది అందువల్ల ఇయం ధేనువు + అనె అని అవుతుంది. ఉత్వసంధి వలన ఇలా జరుగుతుంది.

3.1.28 వాక్యావసానంబున సంధి లేమి దోషంబు గాదని యార్యులంద్రు. (బాల వ్యా. 55 సూ.)

పదవిభాగం : వాక్య అవసానంబున సంధి లేమి దోషంబు కాదని ఆర్యులు అంద్రు.

భావం : వాక్యానికి చివర సంధి లేకపోయినప్పటికి దాన్ని దోషంగా ఆర్యులు పరిగణింపరని సూత్రానికి అర్థం . ఒక వాక్యం చివర ఉన్న వర్ణానికి దాని తర్వాత వచ్చిన వాక్యానికి మొదట ఉన్న వర్ణానికి సంధి చేయక పోయినప్పటికినీ తప్పు కాదని పెద్దలంటారని ఈ సూత్రానికి అర్థం.

ఉదా : సత్యము సర్వ శ్రేయము. అది లేనిచో సర్వ ధర్మములు వ్యర్థములు.

ఇందులో మొదటి వాక్యం చివర 'ఉత్వం' ఉంది. రెండవ వాక్యానికి మొదట 'అత్వం' ఉంది. కాబట్టి ఉత్వ సంధి జరగడానికి అవకాశం ఉంది. కాని వాక్యం చివర అచ్చు ఉండి మరొక వాక్యం అచ్చుతో ప్రారంభమైనప్పటికి సంధి చేయాల్సిన అవసరం లేదని సూత్ర కర్త నిర్ణయం పద్యాలలో పాదాంతంలో గల అచ్చుకు తర్వాతి పాదం మొదట్లోగల అచ్చుకు కూడ సంధి జరగవలసిన పనిలేని చిన్నయ సూరి వివరించాడు.

## 3.2 సమీక్ష

సంధి పరిచ్ఛేదంలోని 28 నుండి 55వ సూత్రం వరకు గల సూత్రాలకు సోదాహరణ వ్యాఖ్యలు తెలుసుకున్నారు.

## 3.3 ప్రశ్నలు

క్రింది సూత్రాలకు సోదాహరణ వ్యాఖ్యలు వ్రాయండి.

1. కర్మధారయంబు లందుత్తున కచ్చు పరంబగునపుడు టుగాగమంబగు.

2. పేదాది శబ్దంబుల కాలు శబ్దము పరంబగునపుడు కర్మధారయంబు నందు రుగాగమంబగు.
3. కర్మధారయంబులందు ము వర్ణకమునకు పుంపులగు.
4. సమాసంబునం బ్రాతాదుల తొలి యచ్చు మీది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు.
5. క్రొత్త శబ్దమున కాద్యక్షర శేషంబునకుం గొన్ని యెడల నుగాగమంబును కొన్ని యెడల మీది హల్లునకు ద్విత్వంబునగు.
6. ఆమ్రేడితంబు పరంబగునపుడు కడాదుల తొలి యచ్చు మీది వర్ణంబుల కెల్ల వదంతంబగు ద్విరుక్తటకారంబగు.
7. పద్వాదులు పరంబులగునపుడు మువర్ణకమునకు లోప పూర్ణ బిందువులు విభాషనగు.
8. వాక్యావసానంబున సంధి లేమి దోషంబు గాదని యార్యులండ్రు.

## 3.4 ఆధార గ్రంథాలు

1. బాల వ్యాకరణము - శ్రీ పరవస్తు చిన్నయ సూరి
2. రమణీయము - శ్రీ దువ్వూరి వేంకటరమణ శాస్త్రి
3. ఘంటాపథ వ్యాఖ్యానం - శ్రీ నంతరాం రామకృష్ణారావు

డాక్టర్ చింతపల్లి సత్యనారాయణ
ఎం.ఏ., పిహెచ్.డి.
రీడర్
ఆర్.వి.వి.ఎన్. కళాశాల
ధరణికోట, గుంటూరు జిల్లా

# పాఠం - 4

# సంధి పరిచ్ఛేదం

పాఠ్యనిర్మాణక్రమం

4.0 లక్ష్యం
4.1 పారిభాషిక పదాలు
4.2 వ్యాసరూప ప్రశ్నలు
4.3 సమీక్ష
4.4 ప్రశ్నలు
4.5 ఆధార గ్రంథాలు

## 4.0 లక్ష్యం

సంధి పరిచ్ఛేదంలోని పారిభాషిక పదాలను వివరించడం, వ్యాసరూపంలో ఉండే ప్రశ్నలకు సమాధానాలను చెప్పడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## 4.1 పారిభాషికపదాలు

4.1.1 సంధి : పూర్వ పర స్వరంబులకు పర స్వరం బేకాదేశమగుట సంధి యనంబడు.

ఉదా. : రాముఁడు + అతడు = రాముడతడు

4.1.2 శత్రర్థకం : శత్రర్థకం అసమాపక క్రియా రూపాలలో ఒకటి. క్రియకు 'చున్' అనే ప్రత్యయం చేరుతుంది.

ఉదా. : వచ్చుచున్

4.1.3 వైకల్పికం : 'సూత్రం చేత విధింపబడిన వ్యాకరణ కార్యం ఒకసారి జరగడం మరొకసారి జరగకుండడం' - దీన్ని వైకల్పికమంటారు.

ఉదా. : ఏమి + అంటివి = ఏమంటివి, ఏమియంటివి.

4.1.4 ఆగమం : 'ఆగమం బనగా వర్ణాధిక్యము' - అంటే ఒక వర్ణం అదనంగా వచ్చి చేరడం. ఆగమం మిత్రుని వంటిది.

ఉదా. : మా + అమ్మ = మాయమ్మ - దీన్ని యడాగగమం అంటారు.

4.1.5 తపరకరణం : తకారాన్ని పరం చేయడాన్ని తపరకరణం అంటారు. ఈ తపరకరణం పరమైనపుడు ఏ విధమైన అచ్చుకు తకారాన్ని చేర్చుతామో ఆవిధమైన అచ్చు మాత్రమే వస్తుంది.

ఉదా. : అత్తు = అ
ఉత్తు = ఉ
ఇత్తు = ఇ

4.1.6 బహుళం : నిత్య నిషేధ వైకల్పిక అన్యవిధం అనే నాల్గింటిని కలిపి (గ్రహించేదానిని) బహుళం అంటారు. వీటికి ప్రవృత్తి, అప్రవృత్తి విభాష అన్యకార్య ప్రవృత్తి అనే పేర్లు కూడా ఉన్నాయి.

ఉదా. : అత్తునకు సంధి బహుళముగా నగు.

4.1.7 క్త్వార్థం : ఏకాశ్రయంబులగు క్రియల లోపల ఏది పూర్వ కాలిక మౌతుందో దానిని క్త్వార్థము అంటారు. ఇది ఒక అసమాపక క్రియా రూపం. ఇందులో క్రియకు చివర 'ఇ' అనే ప్రత్యయం చేరుతుంది.

ఉదా. : వచ్చి, చదివి

4.1.8 ఆమ్రేడితం : 'ద్విరుక్తము యొక్క పర రూపము ఆమ్రేడితము'. ఒకే పదాన్ని రెండు సార్లు ఉచ్చరించినపుడు రెండవసారి ఉచ్చరించిన దాన్ని ఆమ్రేడితం అంటారు.

ఉదా : ఆహా + ఆహా = ఆహాహా

4.1.9 విభాష : విభాష కూడ వైకల్పికం లాంటిదే! కాని ఎక్కడైన ఒక చోట 'నిత్య' స్వరూపం కూడ ఉంటుంది. విధించిన వ్యాకరణ కార్య మొక పక్షాన జరగడం మరొక పక్షాన జరగకుండడం. - దీనిని విభాష అంటారు.

ఉదా : లేత + దూడ = లేదూడ, లేతదూడ

లక్ష్యానుసారంగా అయిన ఉదాహరణతో కూడిన విభాషను వ్యవస్థితవిభాష అంటారు.

4.1.10 స్వత్వం : ద్రుతానికి గల ప్రకృతి భావాన్ని స్వత్వము అంటారు. అంటే ద్రుతం ఎలాంటి మార్పు చెందక స్వస్వరూపంతో ఉన్నట్లయితే దాన్ని స్వత్వము అంటారు.

ఉదా : 'ను' ద్రుతము - ఇది స్వస్వరూపం.

4.1.11 సాంస్కృతిక పరుషాలు : సంస్కృత భాషకు సంబంధించింది సాంస్కృతికం. సంస్కృత సమ పదాలలోని క చ ట త ప లను సాంస్కృతిక పరుషాలంటారు.

ఉదా : కంసారి, చక్రపాణి

4.1.12 సంశ్లేష : ద్రుతము మీది హల్లుతో కూడుకొనడాన్ని సంశ్లేష అంటారు.

ఉదా : వచెన్గోవులు

4.1.13 వర్గయుక్కులు: వర్గంలోని సరి సంఖ్యలో ఉన్న వర్ణాలను వర్గ యుక్కులంటారు.

ఉదా : క ఖ గ ఘ జ - క వర్గం ఇందులోని రెండు నాల్గు స్థానాలలో ఉన్నా ఖ, ఘ, లను వర్గయుక్కులంటారు.

4.1.14 అవసానం : అవసానమంటే 'విరామం' అని అర్థం. ఒక వర్ణం ఉచ్చరించిన తర్వాత 'అర్థమాత్రా' కాలం కంటె ఎక్కువ కాలం వేరేమి వర్ణాలు ఉచ్చరించక పోయినట్లైతే దాన్ని అవసానం అంటారు.

ఉదా : వాడు వచ్చెన్, వాడు వచ్చెను.

4.1.15 ద్వంద్వం : ఉభయ పదార్థ ప్రధానము ద్వంద్వము.

ఉదా : తల్లిదండ్రులు.

4.1.16 కర్మధారయం : విశేషణ విశేష్యాలతో జరిగే సమాసాన్ని కర్మ ధారయం అంటారు. దీన్నే సమానాధికరణం అని కూడా అంటారు.

ఉదా : మంచి రాజు.

4.1.17 స్త్రీ సమం : స్త్రీ సమం అంటే ప్రథమ ఏకవచన ప్రత్యయం లోపించిన అచ్చుతెనుగు శబ్దం.

ఉదా : చిగురు, తళుకు.

4.1.18 తద్ధర్మార్థ విశేషణ : క్రియ ధర్మంగా గల విశేషణాన్ని తెలిపే దాన్ని తద్ధర్మార్థ విశేషణమంటారు.

ఉదా : చే<u>యు</u>నతడు

చేయు అనేది తద్ధర్మార్థ విశేషణం.

## 4.2 వ్యాసరూప ప్రశ్నలు

4.2.1 సంధిని నిర్వచించి తెలుగు సంధులను గూర్చి వివరించండి.

పూర్వ పర స్వరాలకు పర స్వరం ఏకాదేశం కావడాన్ని సంధి అంటారు. మొదటి పదానికి చివర, రెండవ పదానికి మొదట అచ్చు ఉండాలి. ఆ రెండు అచ్చులు బదులుగా రెండవ పదం మొదట ఉండే అచ్చు ఆదేశంగా వస్తే దాన్ని సంధి అంటారు.

ఉత్వ సంధి : ఉత్తునకచ్చు పరంబగునపుడు సంధి యగు. అనగా హ్రస్వమైన ఉ కారానికి అచ్చు పరమైనపుడు సంధి జరుగుతుంది.

రాముడు + అతడు = రాముడతడు
సోముడు + ఇతడు = సోముడితడు

ప్రథమేతర విభక్తులలో ఉన్న హ్రస్వమైన ఉకారానికి సంధి వైకల్పికంగా జరుగుతుంది.

నన్నున్ + అడిగె = నన్నడిగె, నన్నునడిగె
నాయందున్ + ఆశ = నాయందాశ, నాయందునాశ

శత్రర్థంలో వచ్చే చు వర్ణంలో ఉండే హ్రస్వ ఉకారానికి సంధి వైకల్పికంగా జరుగుతుంది.

వచ్చుచున్ + ఉండెను = వచ్చుచుండెను, వచ్చుచుండెను
చూచుచున్ + ఏగెను = చూచుచునేగెను.

అత్వ సంధి : అత్తునకు సంధి బహుళముగా నగు. అంటే హ్రస్వ అకారానికి సంధి బహుళముగా జరుగుతుంది.

మేన + అల్లుడు = మేనల్లుడు, మేనయల్లుడు
పుట్టిన + ఇల్లు = పుట్టినిల్లు, పుట్టినయిల్లు

మొదలైన చోట్ల సంధి వైకల్పికముగా జరుగుతుంది.

బహుళం అని చెప్పడం చేత అమ్మ + ఇచ్చెను, దూత + ఇతడు అనే చోట్ల సంధి జరుగక యడాగమం వచ్చి అమ్మ యిచ్చెను, దూత యితడు అనే రూపాలు ఏర్పడతాయి. ఇది నిషేధానికి ఉదాహరణ.

వెల + ఆలు = వెలయాలు మొదలగు చోట్ల సంధి జరుగకపోవడానికి సంధి బహుళమని చెప్పడం వల్లనే. ఇక్కడ అత్తు అని చెప్పడం వల్ల దీర్ఘమైన అకారానికి సంధి జరుగదు.

మా + అమ్మ = మాయమ్మ.

ఇత్వ సంధి : హ్రస్వమైన ఇకారానికి కలిగే సంధి కార్యాలు.

1. ఏమి, మఱి, అది, అవి, ఇది, ఇవి మొదలైన ఏమ్యాదులలో ఉండే ఇత్వానికి సంధి వైకల్పికంగా జరుగుతుంది.

   ఏమి + అంటివి = ఏమంటివి, ఏమియంటివి.
   మఱి + ఏమి = మఱేమి, మఱిఏమి.

2. క్రియాపదాల్లో ఉండే హ్రస్వ ఇకారానికి కూడా సంధి వైకల్పికంగా జరుగుతుంది.

   వచ్చిరి + అప్పుడు = వచ్చిరప్పుడు, వచ్చిరియప్పుడు
   వచ్చితిమి + ఇప్పుడు = వచ్చితిమిప్పుడు, వచ్చితిమియిప్పుడు

3. మధ్య పురుష క్రియలైన ఏలితివి, ఏలితి మొదలైన వానిలో ఉండే ఇత్వానికి సంధి నిత్యంగా జరుగుతుంది.

   ఏలితివు + అపుడు = ఏలితివపుడు
   ఏలితి + ఇపుడు = ఏలితివిపుడు

4. భూతకాలంలోని అసమాపక క్రియను క్త్వార్థం అంటారు. క్త్వార్థాలైన వచ్చి మొదలైన వానిలో ఉండే ఇత్వానికి సంధి జరుగది.

   వచ్చి + ఇచ్చెను = వచ్చి యిచ్చెను.

   ఇక, ఇగ, ఎట్టకేలకు, ఎట్టకేని అనేవి ఇకాదులు. వీనిలో అచ్చునకు సంధి వైకల్పికంగా వస్తుంది. ఇకాదులకు తప్ప మిగిలిన ద్రుతప్రకృతికాలకు సంధి జరుగదు.

వచ్చున్ + ఇపుడు = వచ్చునిపుడు
చూడన్ + అయితి = చూడనయితి

ఎడు, ఇంచు అనేవి అపదాలు. ఇవి పరంగా వచ్చేటప్పుడు సంధి నిత్యంగా జరుగుతుంది.

మూర + ఎడు = మూరెడు
నిర్జి + ఇంచు = నిర్జించు

అందు, అవ అనేవి పరంగా వస్తే సంధి వైకల్పికంగా జరుగుతుంది.

రాముల + అందు = రాములందు, రాములయందు
ఎనిమిది + అవది = ఎనిమిదవది, ఎనిమిదియవది.

ఆమ్రేడితసంధి: అచ్చునకు ఆమ్రేడితము పరమయితే సంధి తఱుచుగా జరుగుతుంది. తఱుచుగా అనడం చేత చాలా చోట్ల నిత్యంగా జరుగుతుందని, కొన్ని చోట్ల వైకల్పికంగా జరుగుతుందని అర్థం.

ఔర + ఔర = ఔరౌర
ఆహా + ఆహా = ఆహాహా

ఇక్కడ సంధి నిత్యం.

ఏమి + ఏమి = ఏమేమి, ఏమియేమి

ఇక్కడ సంధి వైకల్పికం.

తెలుగులో పూర్వ పరస్వరాలకు పరస్వరం ఏకాదేశం కావడం అనే సంధి నియమం వర్తించే నియమాలివి.

4.2.2 ఆగమ సంధులను గురించి వ్రాయండి.

ఆగమమంటే వర్ణాధిక్యం. ఉన్న అక్షరాలకు తోడు మరొక అక్షరం మిత్రునిలాగా అధికంగా వచ్చి చేరితే దానిని ఆగమం అంటారు. సంధి పరిచ్ఛేదంలో ఆగమంగా వచ్చే సంధులను గురించి తెలుసుకుందాం.

యడాగమసంధి: సంధి లేనిచోట స్వరాని కంటె పరమయిన స్వరానికి యడాగమం వస్తుంది.

మా + అమ్మ = మా యమ్మ
మీ + ఇల్లు = మీ యిల్లు

టుగాగమసంధి: కర్మధారయ సమాసంలోని పూర్వపదానికి చివర ఉండే ఉత్తునకు అచ్చు పరమైతే టుగాగమం నిత్యంగా వస్తుంది.

కఱకు + అమ్ము = కఱకుటమ్ము
నిగ్గు + అద్దము = నిగ్గుటద్దము

కర్మధారయంలో పేరు, చిగురు మొదలయిన శబ్దాలకు అచ్చు పరమయితే టుగాగమం వైకల్పికంగా

వస్తుంది.

పేరు + ఉరము = పేరురము, పేరుటురము

చిగురు + ఆకు = చిగురాకు, చిగురుటాకు.

రుగాగమసంధి: కర్మధారయ సమాసంలో పేద, బీద, ముద్ద, బాలెంత మొదలైన శబ్దాలకు ఆలు శబ్దం పరమైతే రుగాగమం వస్తుంది.

పేద + ఆలు = పేదరాలు
బీద + ఆలు = బీదరాలు

ఇక్కడ జవ్వని శబ్దానికి 'ఆలు' పరమైతే 'జవ' ఆదేశంగా వచ్చి తరువాత రుగాగమం వస్తుంది.

జవ్వని + ఆలు = జవ + ఆలు = జవరాలు

కర్మధారయ సమాసంలో తత్సమ శబ్దాలకు ఆలు శబ్దం పరంగా వస్తే అత్వానికి ఉత్వం, ఆ తరువాత రుగాగమం వస్తుంది.

ధీర + ఆలు = ధీరురాలు
గుణవంత + ఆలు = గుణవంతురాలు

నుగాగమసంధి: ఉదంతమైన తద్ధర్మార్థ విశేషణానికి అచ్చు పరమైతే నుగాగమం వస్తుంది.

చేయు + అతడు = చేయునతడు
చేసెడు + అతడు = చేసెడు నతడు

షష్ఠీ సమాసంలో ఉకార ఋకారాలకి అచ్చు పరమైతే నుగాగమం వస్తుంది.

రాజు యొక్క + ఆజ్ఞ = రాజునాజ్ఞ
విధాతృ యొక్క + ఆనతి = విధాతృనానతి

సమాసాల్లో ఉదంతాలైన స్త్రీ సమాలకి, పుంపులకి, పరుష సరళాలు పరాలైతే నుగాగమం వస్తుంది.

చిగురు + కయిదువు = చిగురు + ను + కయిదువు = చిగురుంకయిదువు
సింగపు + కొదమ = సింగపు + ను + కొదమ = సింగపుంగొదమ

ఉదంత స్త్రీ సమాలకి, పుంపులకి, అదంత గుణ వాచకాలకి తనము పరంగా వస్తే నుగాగమం వస్తుంది.

సొగసు + తనము = సొగసు + ను + తనము = సొగసుందనము
సరసపు + తనము = సరసపు + ను + తనము = సరసపుందనము
తెల్ల + తనము = తెల్ల + ను + తనము = తెల్లందనము

ప్రాతాదుల సంధిలో లుప్త శేషానికి పరుషాలు పరమైతే నుగాగమం వస్తుంది.

ప్రాత + కెంపు = ప్రా + ను + కెంపు = ప్రాగెంపు
చెన్ను + తొవ = చె + ను + తొవ = చెందొవ

క్రొత్త శబ్దానికి ఆద్యక్షర శేషానికి కొన్ని చోట్ల నుగాగమం వస్తుంది.

క్రొత్త + చాయ = క్రొ + ను + చాయ = క్రొంజాయ

ఒకానొక శబ్దానికి, ఒకానొక శబ్దం పరమయ్యేటప్పుడు కొన్నిచోట్ల ఆద్యక్షర శేషానికి నుగాగమం వస్తుంది.

పది + తొమ్మిది = ప + ను + తొమ్మిది = పందొమ్మిది

అలిగాగమం : అందు, ఇందు, ఎందు మొదలైన వానికి సమాసంలో 'అలి' ఆగమంగా వస్తుంది.

నాయందున్ + కరుణ = నా యందలి కరుణ
ఇందున్ + జనులు = ఇందలి జనులు

ఇవి ఆగమ సంధులు.

4.2.3 ఆదేశ సంధుల గురించి వ్రాయండి.

వ్యాకరణ సూత్రంలో చెప్పబడిన నియమం మేరకు ఒక వర్ణాన్ని తొలగించి దాని స్థానంలో మరొక వర్ణం చేరినట్లయితే దానిని ఆదేశం అంటారు. బాల వ్యాకారణంలోని సంధి పరిచ్ఛేదంలో చెప్పబడిన ఆదేశ సంధులివి.

1. ద్విరుక్తటకార సంధి : కుఱు, చిఱు, కడు, నడు, నిడు, శబ్దాల్లో ఉండే ఱ, డ లకు అచ్చు పరమయితే ద్విరుక్తటకారం ఆదేశంగా వస్తుంది.

కుఱు + ఉసురు = కుట్టుసురు
చిఱు + ఎలుక = చిట్టెలుక
కడు + ఎదురు = కట్టెదురు
నడు + ఇల్లు = నట్టిల్లు
నిడు + ఊరుపు = నిట్టూరుపు

2. గసడదవాదేశ సంధి : ప్రథమ మీది పరుషాలకు గసడదవలు బహుళంగా ఆదేశంగా వస్తాయి.

వాడు + కొట్టె = వాడుగొట్టె
అపుడు + చనియె = అపుడుసనియె

ద్వంద్వ సమాసంలో పదము మీది పరుషాలకు గసడదవలు నిత్యంగా ఆదేశం అవుతాయి.

కూర + కాయ = కూరగాయలు
కాలు + చేయి = కాలుచేతులు

3. సరళాదేశ సంధి: ద్రుత ప్రకృతికం మీది పరుషాలకు సరళాలు ఆదేశంగా వస్తాయి.

పూచెను + కలువలు = పూచెనుగలువలు
తోచెను + చుక్కలు = తోచెనుజుక్కలు

4. పుంప్వాదేశ సంధి : కర్మధారయ సమాసంలో ము వర్ణకానికి పుంపులు ఆదేశంగా వస్తాయి.

సరసము + మాట = సరసపుమాట
విరసము + వచనము = విరసపు వచనము

5. ఆమ్రేడిత సంధి : ఆమ్రేడితం పరమయ్యేటప్పుడు కడ, ఎదురు, కొన, చివర మొదలయిన వానిలోని తొలి యచ్చు మీది వర్ణాలకు అదంతమైన ద్విరుక్తటకారం ఆదేశంగా వస్తుంది.

కడ + కడ = కట్టకడ
ఎదురు + ఎదురు = ఎట్టఎదురు

ఇవి బాల వ్యాకరణం లోని సంధి పరిచ్ఛేదంలో చెప్పబడిన ఆదేశ సంధులు.

**4.2.4** ఆమ్రేడిత సంధిని గూర్చి వివరించండి.

ద్విరుక్తము యొక్క పరరూపం ఆమ్రేడితం. ఇది ఆమ్రేడితానికి నిర్వచనం. అంటే ఒక పదాన్ని రెండు మార్లు చెప్పినప్పుడు రెండవ సారి చెప్పిన దానిని ఆమ్రేడితం అంటారు. ఉదా : ఆహా + ఆహా.

ఇలాంటి ఆమ్రేడితాలలో పూర్వ పరస్వరాలు ఉన్నట్లయితే 'తఱుచు' గ సంధి జరుగుతుంది. అంటే పర స్వరం ఏకాదేశంగా వస్తుంది.

ఔర + ఔర = ఔరౌర. ఇది నిత్యంగా సంధి జరిగిన రూపం. సంధులను చెప్పేటప్పుడు అకార ఇకార ఉకారాలకు తప్ప మిగిలిన అచ్చులైన ఎ ఓ ఔ బాల వ్యాకరణంలో లక్ష్యం చూపబడలేదు. కాని ఈ సూత్రంలో ఆ లక్ష్యం చూపబడింది. తఱుచుగ అనడం వల్ల ఒకానొక పర్యాయం వైకల్పిక సంధి కూడా జరుగుతుంది. ఏమి + ఏమి = ఏమేమి, ఏమియేమి - కాని ఏగి + ఏగి - అనుచోట ఆమ్రేడిత మైనప్పటికీ 'ఏగి' అనేది క్త్వార్థం కనుక క్త్వార్థంబైన యిత్తునకు సంధి లేదు అనే సూత్రం ప్రకారం ఏగి యేగి అవుతుంది. అచ్చునకు అనడం వల్ల దీర్ఘానికి సైతం సంధి జరుగుతుంది. ఇది విశేషం. ఆహా + ఆహా = ఆహాహా.

ఇక కడాదులు ఆమ్రేడితాలైనప్పుడు తొలి యచ్చు మీది వర్ణాలన్నిటికినీ అదంతమైన ద్విరుక్తటకారం వస్తుంది. కడ + కడ = కట్టకడ - ఎదురు + ఎదురు = ఎట్టయెదురు ఇత్యాదులు.

ఆమ్రేడిత పదాలకు అంతంలో విభక్తి ఉన్నట్లైతే ఆ విభక్తి బహుళంగా లోపిస్తుంది. ఉదా. అప్పటికిన్ + అప్పటికిన్ = అప్పటప్పటికిన్.

సూత్రంలో బహుళం అని చెప్పడం వల్ల ఇంచుక, నాడు మొదలైన పదాలలో చివరి అక్షరం లోపిస్తుంది.

ఇంచుక + ఇంచుక = ఇంచించుక, ఇంచుకించుక
నాడు + నాడు = నానాఁడు, నాఁడు నాఁడు

మరికొన్ని పదాలు ఆమ్రేడితాలైనప్పుడు వాటికి నియమ నిబంధనలేవి వర్తించవు. అందువల్ల ఏ విధంగా ప్రయోగాలలో ఉన్నాయో ఆ విధంగా స్వీకరించవచ్చునని గ్రహించ వలసిందిగా చిన్నయ సూరి భావన.

ఉదా. అదుకు + అదుకు = అందదుకు
ఇంకులు + ఇంకులు = ఇఱ్ఱింకులు
చెదరు + చెదరు = చెల్లాచెదరు

ఇంకా ఇల్లిగ్గులు, తత్తువలుకు, తుత్తునియలు, మిఱుమిట్లు - మొదలైన పదాలు సైతం ఈ నియమం లోనికి వస్తాయి.

మధ్యమ పురుష క్రియలలో అంతంలో ఉండే ము వర్ణకానికి డుజ్ వర్ణకానికి ఆమ్రేడితాలు పరమైనప్పుడు పూర్వ పదంలోని ఈ రెండు వర్ణకాలు వైకల్పికంగా లోపిస్తాయి.

ఉదా. ఉండుము + ఉండుము = ఉండుండుము, ఉండుముండుము.
కొట్టుడు + కొట్టుడు = కొట్టుకొట్టుడు, కొట్టుడుకొట్టుడు.

ఆమ్రేడిత రూప సాధనకు సంబంధించి చిన్నయ సూరి విపులంగా వివరించిన విధమిది.

### 4.2.5 అనుకరణ సంధుల్ని గురించి వ్రాయండి.

సంస్కృత వాక్యాలను యధాతథంగా అనుకరించడాన్ని 'అనుకరణం' అంటారు. ఇలాంటి అనుకరణ సందర్భాలలో 'అను' అనే ధాతువు సాధారణంగా వాడబడుతుంది. విసర్గ లోపించి యడాగగమం వస్తుంది.

వర్ధతాంశ్రీః + అనియె = వర్ధతాంశ్రీయనియె అనేది దీనికి ఉదాహరణ.

నమః అనే శబ్దం అనుకరణ లోనికి వచ్చినప్పుడు చివర గల హ్రస్వమైన అకారానికి విభాషగా ఓత్వం వస్తుంది.

తుభ్యం నమః + అనె = తుభ్యంనమోయనె, తుభ్యంనమయనె.

'గాతాను గతికో లోకోయటంచున్' అనే సందర్భంలో గూడ ఇలానే జరిగింది.

హలంత పదాలు అనుకరణ లోనికి వచ్చినపుడు చివర హల్లునకు ద్విత్వం నిత్యంగా వస్తుంది.

కింతత్ + అనియె = కింతత్తనియె
కస్త్వమ్ + అనియె = కస్త్వమ్మనియె

అహమ్ మొదలైన సంస్కృత శబ్దాలలో చివరగల మకారానికి ద్విత్వం విభాషగా వస్తుంది.

దాసోహమే + అనె = దాసోహమ్మనె, దాసోహమనె
తత్కర్తవ్యమ్ + అనె = తత్కర్తవ్యమ్మనె, తత్కర్తవ్యమనె

మకారం తప్ప ఇతర హల్లులు అంతమందు గల శబ్దాలకు ఈ నియమం వర్తించదు.

హ్రస్వమైన ఉకారంతో ముగిసే సంస్కృత శబ్దాలు సంస్కృత వాక్యాలలో ఉండి అనుకరణంలోనికి వచ్చినప్పుడు 'వు'గాగమం వస్తుంది.

ఉదా. ఇయంధేనుః + అనె = ఇయంధేనువనె

అనుకరణంలో దీర్ఘం హ్రస్వంగా మారదని సూరి నిర్ణయం. 'దుర్బలస్యబలం రాజా యన వినవె' అనేది లక్ష్యం.

ఇవి చిన్నయ సూరి నిరూపించిన అనుకరణ సంధులు.

4.2.6 ప్రాతాదుల సంధిని గురించి వ్రాయండి.

ప్రాతాదుల ఆకృతి గణం ప్రాత, లేత, కొత్త, పూవు, మీఁదు, కెంపు, చెన్ను, క్రింద ఇత్యాదులు ప్రాతాదులు. అన్యంబులకు సహిత మిక్కార్యంబు కొండొకచో గానంబడియెడి (బా. వ్యా. 39) అనే సూత్రంలో ఉదాహరింపబడ్డ పది, తొమ్మిది, వంక, సగము, నిండు, నెఱ, మొదలైన ఇతర పదాలు ప్రాతాదులలో చేరక పోయినా ప్రాతాదులకు జరిగినట్లే వ్యాకరణ కార్యం జరుగుతుందని ఈ సూత్రానికి అర్థం. కనుక వీటిని కూడ ప్రాతాదులుగానే గ్రహించాలని శ్రీ అంబడిపూడి నాగభూషణం గారి అభిప్రాయం (బాల వ్యాకరణ వికాస వివేచనము - పుట - 161).

ప్రాతాదులతో వేరొక పదం కలిసి సమాసంగా రూపు దిద్దుకున్నప్పుడు ఈ నియమం వర్తిస్తుంది. ముందుగా ప్రాతాదుల తొలి యచ్చు మీది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు అనే సూత్రంతో ఈ నియమం ప్రారంభమౌతుంది. ఉదా. లేత + దూడ = లేదూడ, లేతదూడ. ఇది బహుళంలోని వైకల్పికానికి లక్ష్యం.

నిత్య, నిషేధ, వైకల్పిక, అన్య విధాలను కలిపి బహుళం అంటారు. ఈ నాల్గింటికీ నిరూపణలు ఉన్న సూత్రం బాల వ్యాకరణంలో ఇదే! వీటినే ప్రవృత్తి, అప్రవృత్తి, విభాష, అన్యకార్య ప్రవృత్తి అని కూడా అంటారు. బాలవ్యాకర్త నిరూపించిన విధం ఇది.

1. నిత్యం - సూత్రం చేత విధింపబడిన వ్యాకరణ కార్యం తప్పకుండా జరగడం అని అర్థం. కనుక దీనికి ఒకే రూపముంటుంది.

ఉదా. మీదు + కడ - మీ + గడ = మీఁగడ
పది + తొమ్మిది - ప + తొమ్మిది = పందొమ్మిది

2. నిషేధం - సూత్రం చేత విధింపబడిన కార్యం ప్రవర్తించదు. దీన్ని నిషేధం అంటారు.

ఉదా. క్రొత్త + కుండలు = క్రొత్త కుండలు

ఇక్కడ తొలి యచ్చు మీది వర్ణాలు లోపించలేదు.

3. విభాష - విధించిన వ్యాకరణ కార్యం ఒకమారు జరుగుట, మరొక మారు జరుగకుండుట - అనే దాన్ని విభాష అంటారు. దీన్ని వైకల్పికమని కూడా అంటారు.

ఉదా. ప్రాత + ఇల్లు = ప్రాయిల్లు, ప్రాతయిల్లు
లేఁత + దూడ = లేదూడ, లేతదూడ
క్రొత్త + చాయ = క్రొంజాయ, క్రొత్తచాయ

4. అన్యకార్య ప్రవృత్తి - సూత్రంలో చెప్పబడిన విధంగా గాక వేరే విధంగా వ్యాకరణ కార్యం జరిగి నట్టైన దాన్ని అన్యకార్య ప్రవృత్తి అంటారు.

ఉదా. క్రిందు + కడుపు = క్రిఁగడుపు
క్రిందు + కాలు = క్రిఁగాలు

ఈ విధంగా నాల్గు రకాలుగా బహుళ శబ్దానికున్న నాలుగర్థాలు సంపూర్ణంగా వినియుక్తమయ్యే స్థలం బాలవ్యాకరణంలో ఇది ఒక్కటే.

ఇంక ప్రాతాదుల సంధిలోని మరొక నియమం నుగాగమం. లుప్త శేషంబునకు పరుషంబులు పరంబులగునపుడు నుగాగమం వస్తుంది.

ప్రాత + కెంపు.

36వ సూత్రం వల్ల తొలి యచ్చు మీది వర్ణాలన్నీ లోపించగా ప్రా + కెంపు - అవుతుంది. 'త' లోపించగా మిగిలిన ప్రా కు ('క') 'కె'ంపు పరమైనందు వల్ల 'క' అనే పరుషం వచ్చింది. కనుక నుగాగమం వస్తుంది. నుగాగమం వల్ల ప్రాను + కెంపు అవుతుంది. ద్రుతప్రకృతికముల మీద పరుషం సరళం కావడం వల్ల కెంపు గెంపు అవుతుంది. బిందు సంశ్లేషలు విభాషగా రావడం వల్ల ప్రాఁగెంపు అనే రూపం సిద్ధిస్తుంది. ఇదే నియమం వల్ల సగము + కోరు 'సంగోరు' అవుతుంది. ఇవి ప్రాతాదుల సంధి వివరాలు.

ప్రాతాదుల్లోని క్రొత్త శబ్దంలో ప్రత్యేకమైన నియమం చెప్పడం జరిగింది. తొలి యచ్చు మీది వర్ణాలన్నీ లోపించడం జరిగిన తర్వాత శేషంగా మిగిలిన ఆద్యక్షరానికి నుగాగమం వస్తుంది. క్రొత్త + చాయ - క్రొంజాయ, క్రొత్త + చెమట - క్రొంజెమట - లక్ష్యాలు.

క్రొత్త + కారు, క్రొత్త + నన, క్రొత్త + తావి, మొదలైన పదాలలో మీది హల్లునకు ద్విత్వం వస్తుంది. క్రొక్కారు, క్రొన్నన, క్రొత్తావి.

ఇంకా అన్య కార్య ప్రవృత్తి సైతం జరుగుతుంది. మరికొన్ని చోట్ల సైతం ఒకానొక శబ్దానికి మరొక శబ్దం పరమైనప్పుడు ఇలాంటి లోప ద్విత్వాలు జరుగుతాయి.

సగము + కోరు = సంగోరు
నెఱ + తఱి = నెత్తఱి

ఈ విధంగా బహుళంలోని నాల్గు నియమాలను నిరూపించిన సూత్రం బాల వ్యాకరణంలో ఇదొక్కటే.

## 4.3 సమీక్ష

సంధి పరిచ్ఛేదంలోని పారిభాషిక పదాల గురించి తెలుసుకున్నారు. వ్యాసరూపంలో ఈయదగిన ప్రశ్నలకు జవాబులు తెలుసుకున్నారు.

## 4.4 ప్రశ్నలు

క్రింది పారిభాషిక పదాలను సోదాహరణంగా వివరించండి.

1. తపరకరణం, 2. బహుళం, 3. క్త్వార్థం, 4. ఆమ్రేడితం, 5. సంశ్లేష, 6. సాంస్కృతిక పరుషాలు,
7. వర్గయుక్కులు, 8. స్త్రీ సమం, 9. సంధి.

క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి.

1. సంధిని నిర్వచించి తెలుగు సంధులను గురించి వ్రాయండి.
2. ఆగమ ఆదేశ సంధులను వివరించండి.
3. ఆమ్రేడిత సంధిని గూర్చి వివరించండి.
4. అనుకరణ సంధులను గూర్చి వ్రాయండి.
5. ప్రాతాదుల సంధిని గురించి వ్రాయండి.

## 4.5 ఆధార గ్రంథాలు

1. బాల వ్యాకరణము - శ్రీ పరవస్తు చిన్నయ సూరి
2. రమణీయము - శ్రీ దువ్వూరి వేంకటరమణ శాస్త్రి
3. ఘంటాపథ వ్యాఖ్యానము - శ్రీ వంతరాం రామకృష్ణారావు

**డాక్టర్ చింతపల్లి సత్యనారాయణ**
ఎం.ఏ., పిహెచ్.డి.
రీడర్
ఆర్.వి.వి.ఎన్. కళాశాల
ధరణికోట, గుంటూరు జిల్లా

# పాఠం - 5

# సంధి పరిచ్ఛేదం-రూపసాధన

పాఠ్యనిర్మాణక్రమం

5.0 లక్ష్యం

5.1 రెండు అంతకన్న ఎక్కువ సంధి సూత్రాల ద్వారా సాధించవలసిన రూపాలను సాధించే విధానం.

5.2 సమీక్ష

5.3 ప్రశ్నలు

5.4 ఆధార గ్రంథాలు

## 5.0 లక్ష్యం

సంధిగత రూపాలను ఎలా సాధించాలో తెలిసే విధంగా చేయడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## 5.1 రెండు, అంతకన్న ఎక్కువ సంధి సూత్రాల ద్వారా సాధించవలసిన రూపాలను సాధించే విధానం.

### 5.1.1 కూరగాయలు

కూర + కాయ

సూ : ద్వంద్వంబునం బదంబుపయి పరుషములకు గసడదవలగు.

కూరగాయలు

### 5.1.2 కాలుసేతులు

కాలు + చేయి

సూ : ద్వంద్వంబునం బదంబుపయి పరుషములకు గసడదవలగు.

కాలుసేతులు

### 5.1.3 టక్కుడెక్కులు

టక్కు + టెక్కు

సూ : ద్వంద్వంబునం బదంబుపయి పరుషములకు గసడదవలగు.

టక్కుడెక్కులు

### 5.1.4 తల్లిదండ్రులు

తల్లి + తండ్రి

సూ : ద్వంద్వంబునం బదంబుపయి పరుషములకు గసడదవలగు.

తల్లిదండ్రులు

### 5.1.5 ఊరువల్లెలు

ఊరు + పల్లె

సూ : ద్వంద్వంబునం బదంబుపయి పరుషములకు గసడదవలగు.

ఊరువల్లెలు

### 5.1.6 పూచెంగలువలు

పూచెను + కలువలు

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

పూచెను + గలువలు

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

పూచెంగలువలు
పూచెఁగలువలు
పూచెన్గలువలు

### 5.1.7 తోచెంజుక్కలు

తోచెను + చుక్కలు

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

తోచెను + చుక్కలు

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

తోచెంజుక్కలు
తోచెఁజుక్కలు
తోచెన్జుక్కలు

### 5.1.8 చేసెండక్కులు

చేసెను + టక్కులు

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

చేసెను + డక్కులు

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

చేసెండక్కులు
చేసెఁడక్కులు
చేసెన్డక్కులు

### 5.1.9 నెగడెందమములు

నెగడెను + తమములు

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

నెగడెను + దమములు

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

నెగడెందమములు
నెగడెఁదమములు
నెగడెన్దమములు

### 5.1.10 మొగిడెంబద్మము

మొగిడెను + పద్మము

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

మొగిడెను + బద్మము

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

మొగిడెంబద్మము
మొగిడెఁబద్మము
మొగిడెన్బద్మము

### 5.1.11 ముంగొంగు

ముందు + కొంగు

సూ : సమాసంబునం బ్రాతాదుల తొలియచ్చు మీది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు.

ము + కొంగు

సూ : లుప్త శేషంబునకుం బరుషములు పరములగునపుడు నుగాగమంబగు.

ము + ను + కొంగు

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

ము + ను + గొంగు

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

ముంగొంగు

**5.1.12 క్రొంబసిడి**

క్రొత్త + పసిడి

సూ : సమాసంబునం బ్రాతాదుల తొలియచ్చు మీది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు.

క్రొ + పసిడి

సూ : క్రొత్త శబ్దమునకు ఆద్యక్షర శేషమునకు కొన్ని యెడల నుగాగమంబును కొన్ని యెడల మీది హల్లునకు ద్విత్వంబునగు.

క్రొ + ను + పసిడి

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

క్రొ + ను + బసిడి

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

క్రొంబసిడి

**5.1.13 చిగురుంగయిదువు**

చిగురు + కయిదువు

సూ : సమాసంబుల నుదంతంబులగు స్త్రీ సమంబులకుం బుంపులకుం బరుష సరళములు పరంబులగునపుడు నుగాగమంబగు.

చిగురు + ను + కయిదువు

సూ : దృతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

చిగురు + ను + గయిదువు

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాష నగు.

చిగురంగయిదువు
చిగురుఁగయిదువు
చిగురున్గయిదువు

**5.1.14 తళుకుంగజ్జెలు**

తళుకు + గజ్జెలు

సూ : సమాసంబుల నుదంతంబులగు స్త్రీ సమంబులకుం బుంపులకుం బరుష సరళములు పరంబులగునపుడు నుగాగమంబగు.

తళుకు + ను + గజ్జెలు

సూ : వర్గయుక్సరళములు పరములగు నపుడొకా నొకచో ద్రుతమునకు బూర్ణ బిందువును గానంబడియెడి.

తళుకుం గజ్జెలు
తళుకు గజ్జెలు
తళుకున్గజ్జెలు

**5.1.15 సింగపుం గొదమ**

సింగము + కొదమ

సూ : కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బుంపులగు.

సింగపు + కొదమ

సూ : సమాసంబుల నుదంతంబులగు స్త్రీ సమములకుం బుంపులకుం బరుష సరళంబులు పరంబు లగునపుడు నుగాగమంబగు.

సింగపు + ను + కొదమ

సూ : ద్రుత ప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

సింగపు + ను + గొదమ

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

సింగపుం గొదమ
సింగపుఁ గొదమ
సింగపున్గొదమ

**5.1.16 ఉన్నతంపు గొడుగు**

ఉన్నతము + గొడుగు

సూ : కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బుంపులగు.

ఉన్నతంపు + గొడుగు

సూ : సమాసంబుల నుదంతంబులగు స్త్రీ సమములకుం బుంపులకుం బరుష సరళంబులు పరంబు లగునపుడు నుగాగమంబగు.

ఉన్నతంపు + ను + గొడుగు

సూ : వర్గయుక్సరళములు పరములగు నపుడొకానొకచో ద్రుతమునకు బూర్ణ బిందువును గానంబడియెడి.

ఉన్నతంపు గొడుగు
ఉన్నతంపు న్గొడుగు
ఉన్నతంపుంగొడుగు

## 5.1.17 జవరాలు

జవ్వని + ఆలు

సూ : జవ్వని శబ్దంబునకు జవాదేశంబని మెరుంగునది.

జవ + ఆలు

సూ : పేదాది శబ్దముల కాలు శబ్దము పరంబగునపుడు కర్మధారయంబునందు రుగాగమంబగు.

జవరాలు

## 5.1.18 సొగసుందనము

సొగసు + తనము

సూ : ఉదంత స్త్రీ సమంబులకు బుంపులకు నదంత గుణ వాచకంబులకును దనంబు పరంబగునపుడు నుగాగమంబగు.

సొగసు + ను + తనము

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

సొగసు + ను + దనము

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

సొగసుందనము
సొగసుఁదనము
సొగసున్దనము

### 5.1.19 సరసపుందనము

సరసము + తనము

సూ : కర్మధారయంబులందు మువర్ణకంబునకుం బుంపులగు.

సరసపు + తనము

సూ : ఉదంత స్త్రీ సమంబులకును బుంపులకు నదంత గుణవాచకంబులకును దనంబు పరంబగునపుడు నుగాగమంబగు.

సరసపు + ను + తనము

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

సరసపు + ను + దనము

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

సరసపుందనము
సరసపుఁదనము
సరసపున్దనము

### 5.1.20 తెల్లందనము

తెల్ల + తనము

సూ : ఉదంత స్త్రీ సమంబులకును బుంపులకు నదంత గుణవాచకంబులకును దనంబు పరంబగునపుడు నుగాగమంబగు.

తెల్ల + ను + తనము

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

తెల్ల + ను + దనము

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

తెల్లందనము
తెల్లఁదనము
తెల్లన్దనము

### 5.1.21 ప్రాఁగెంపు

ప్రాఁత + కెంపు

సూ : సమాసంబునం బ్రాతాదుల తొలి యచ్చు మీది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగా నగు.

ప్రా + కెంపు

సూ : లుప్త శేషంబునకుం బరుషంబులు పరము లగునపుడు నుగాగమంబగు.

ప్రా + ను + కెంపు

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

ప్రాఁ + ను + గెంపు

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

ప్రాఁగెంపు

**5.1.22 లేఁగొమ్మ**

లేఁత + కొమ్మ

సూ : సమాసంబునం బ్రాతాదుల తొలి యచ్చు మీది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు.

లే + కొమ్మ

సూ : లుప్త శేషంబునకుం బరుషములు పరములగునపుడు నుగాగమంబగు.

లే + ను + కొమ్మ

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

లే + ను + గొమ్మ

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

లేఁగొమ్మ

**5.1.23 పూఁదోట**

పూవు + తోట

సూ : సమాసంబునం బ్రాతాదుల తొలి యచ్చు మీది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు.

పూ + తోట

సూ : లుప్త శేషంబునకుం బరుషములు పరములగునపుడు నుగాగమంబగు.

పూ + ను + తోట

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

పూ + ను + దోట

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

పూఁదోట

## 5.1.24 మీఁగడ

మీఁదు + కడ

సూ : సమాసంబునం బ్రాతాదుల తొలి యచ్చు మీఁది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు.

మీ + కడ

సూ : లుప్త శేషంబునకుం బరుషములు పరములగునపుడు నుగాగమంబగు.

మీ + ను + కడ

సూ : ద్రుతప్రకృతికము మీఁది పరుషములకు సరళములగు.

మీ + ను + గడ

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

మీఁగడ

## 5.1.25 కెందామర

కెంపు + తామర

సూ : సమాసంబునం బ్రాతాదుల తొలి యచ్చు మీఁది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు.

కె + తామర

సూ : లుప్త శేషంబునకుం బరుషములు పరములగునపుడు నుగాగమంబగు.

కె + ను + తామర

సూ : ద్రుతప్రకృతికము మీఁది పరుషములకు సరళములగు.

కె + ను + దామర

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

కెందామర

**5.1.26 చెందొవ**

చెన్ను + తొవ

సూ : సమాసంబునం బ్రాతాదుల తొలి యచ్చు మీది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు.

చె + తొవ

సూ : లుప్త శేషంబునకుం బరుషములు పరములగునపుడు నుగాగమంబగు.

చె + ను + తొవ

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

చె + ను + దొవ

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

చెందొవ

**5.1.27 క్రొంజాయ**

క్రొత్త + చాయ

సూ : సమాసంబునం బ్రాతాదుల తొలి యచ్చు మీది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు.

క్రొ + చాయ

సూ : క్రొత్త శబ్దమున కాద్యక్షర శేషంబునకుం గొన్ని యెడల నుగాగమంబునుం గొన్ని యెడల మీది హల్లునకు ద్విత్వంబునగు.

క్రొ + ను + చాయ

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

క్రొ + ను + జాయ

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

క్రొంజాయ.

**5.1.28 క్రొంజెమట**

క్రొత్త + చెమట

సూ : సమాసంబునం బ్రాతాదుల తొలి యచ్చు మీది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు.

క్రొ + చెమట

సూ : క్రొత్త శబ్దమున కాద్యక్షర శేషంబునకుం గొన్ని యెడల నుగాగమంబును, గొన్ని యెడల మీది హల్లునకు ద్విత్వంబునగు.

క్రొ + ను + చెమట

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

క్రొ + ను + జెమట

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

క్రొంజెమట

**5.1.29 కెంధూళి**

కెంపు + ధూళి

సూ : సమాసంబునం బ్రాతాదుల తొలి యచ్చు మీది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు.

కె + ధూళి

సూ : లుప్త శేషంబునకుం బరుషంబులు పరములగునపుడు నుగాగమంబగు.
(ఇక్కడ పరుషం లేకపోయినా "కెంధూళి, కెంజడలని ప్రయోగంబులు కానంబడి యెడి" అనుటచే నుగాగమం వస్తుంది)

కె + ను + ధూళి

సూ : వర్గయుక్సరళములు పరములగు నపుడొకానొకచో ద్రుతమునకు బూర్ణ బిందువును గానంబడియెడి.

కెంధూళి.

**5.1.30 కెంజడ**

కెంపు + జడ

సూ : సమాసంబునం బ్రాతాదుల తొలి యచ్చు మీది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు.

కె + జడ

సూ : లుప్త శేషంబునకుం బరుషములు పరములగునపుడు నుగాగమంబగు.
(ఇక్కడ పరుషం లేకపోయినా "కెంధూళి, కెంజడలని ప్రయోగంబులు కానంబడి యెడి" అనుటచే నుగాగమం వస్తుంది)

కె + ను + జడ

సూ : వర్గయుక్సరళములు పరములగు నపుడొకానొకచో ద్రుతమునకు బూర్ణ బిందువును గానంబడియెడి.

కెంజడ.

**5.1.31 క్రీఁగడుపు**

క్రిందు + కడుపు

సూ : సమాసంబునం బ్రాతాదుల తొలి యచ్చు మీది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు.

క్రి + కడుపు

సూ : లుప్త శేషంబునకుం బరుషములు పరములగునపుడు నుగాగమంబగు.

క్రి + ను + కడుపు

బహుళ గ్రహణం చేత క్రిందు శబ్దానికి లుప్త శేషానికి దీర్ఘం వస్తుంది.

క్రీ + ను + కడుపు

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

క్రీ + ను + గడుపు

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

క్రీఁగడుపు.

**5.1.32 క్రీఁగాలు**

క్రిందు + కాలు

సూ : సమాసంబునం బ్రాతాదుల తొలి యచ్చు మీది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు.

క్రి + కాలు

సూ : లుప్త శేషంబునకుం బరుషములు పరములగునపుడు నుగాగమంబగు.

క్రి + ను + కాలు

బహుళ గ్రహణం చేత క్రిందు శబ్దానికి లుప్త శేషానికి దీర్ఘం వస్తుంది.

క్రీ + ను + కాలు

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

క్రీ + ను + గాలు

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

క్రీఁగాలు.

**5.1.33 క్రీఁదొడ**

క్రిందు + తొడ

సూ : సమాసంబునం బ్రాతాదుల తొలి యచ్చు మీది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు.

క్రి + తొడ

సూ : లుప్త శేషంబునకుం బరుషములు పరములగునపుడు నుగాగమంబగు.

క్రి + ను + తొడ

బహుళ గ్రహణం చేత క్రిందు శబ్దానికి లుప్త శేషానికి దీర్ఘం వస్తుంది.

క్రీ + ను + తొడ

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

క్రీ + ను + దొడ

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

క్రీఁదొడ.

**5.1.34 ప్రాయిల్లు**

ప్రాత + ఇల్లు

సూ : సమాసంబునం బ్రాతాదుల తొలి యచ్చు మీది వర్ణంబుల కెల్ల లోపంబు బహుళంబుగా నగు.

ప్రా + ఇల్లు

సూ : సంధిలేని చోట్ల స్వరంబు కంటెం బరంబయిన స్వరంబునకు యడాగమంబగు.

ప్రాయిల్లు.

**5.1.35 పందొమ్మిది**

పది + తొమ్మిది

సూ : "అన్యంబులకు సహిత మిక్కార్యంబులు కొండొకచో కానం బడియెడి" అను సూత్రము ననుసరించి ఒకానొక శబ్దమునకు ఒకానొక శబ్దము పరంబగు నపుడు తొలియచ్చు మీది వర్ణములకు లోపనుగాగమములగును.

ప + ను + తొమ్మిది

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

ప + ను + దొమ్మిది

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

పందొమ్మిది.

**5.1.36 తొంబది**

తొమ్మిది + పది

సూ : "అన్యంబులకు సహిత మిక్కార్యంబులు కొండొకచో కానం బడియెడి" అను సూత్రము ననుసరించి ఒకానొక శబ్దమునకు ఒకానొక శబ్దము పరంబగు నపుడు తొలియచ్చు మీది వర్ణములకు లోపనుగాగమములగును.

తొ + ను + పది

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

తొ + ను + బది

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

తొంబది.

**5.1.37 వంజెఱగు**

వంక + చెఱగు

సూ : "అన్యంబులకు సహిత మిక్కార్యంబులు కొండొకచో కానం బడియెడి" అను సూత్రము ననుసరించి ఒకానొక శబ్దమునకు ఒకానొక శబ్దము పరంబగు నపుడు తొలియచ్చు మీది వర్ణములకు లోపనుగాగమములగును.

వం + ను + చెఱగు

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

వం + ను + జెఱగు

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

వంజెఱగు.

**5.1.38 సంగోరు**

సగము + కోరు

సూ : "అన్యంబులకు సహిత మిక్కార్యంబులు కొండొకచో కానం బడియెడి" అను సూత్రము ననుసరించి ఒకానొక శబ్దమునకు ఒకానొక శబ్దము పరంబగు నపుడు తొలియచ్చు మీది వర్ణములకు లోపనుగాగమములగును.

స + ను + కోరు

సూ : ద్రుతప్రకృతికము మీది పరుషములకు సరళములగు.

స + ను + గోరు

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు సంశ్లేషములు విభాషనగు.

సంగోరు.

**5.1.39 నివ్వెఱ**

నిండు + వెఱ

సూ : "అన్యంబులకు సహిత మిక్కార్యంబులు కొండొకచో కానం బడియెడి" అను సూత్రము ననుసరించి కొండొక శబ్దమునకు ఒకానొక శబ్దము పరంబగు నపుడు లోప ద్విత్వములు అగును.

నివ్వెఱ.

**5.1.40 నెమ్మది**

నెఱ + మది

సూ : "అన్యంబులకు సహిత మిక్కార్యంబులు కొండొకచో కానం బడియెడి" అను సూత్రము ననుసరించి కొండొక శబ్దమునకు ఒకానొక శబ్దము పరంబగు నపుడు లోప ద్విత్వములు అగును.

నెమ్మది.

## 5.2 సమీక్ష

సంధి గత రూపాలను విడదీసి సంధి సూత్రానుగుణంగా ఎలా రూపసాధన చేయాలో తెలుసుకున్నారు.

## 5.3 ప్రశ్నలు

క్రింది వాటిని విడదీసి సంధి కార్యాలను సూత్రానుగుణంగా వివరించండి.

1. తల్లిదండ్రులు, 2. మొగిడెంబద్మము, 3. ముంగొంగు, 4. క్రొంబసిడి, 5. తళుకుంగజ్జెలు
6. సింగపుఁగొదమ, 7. సొగసుఁదనము, 8. మీఁగడ, 9. క్రొంజాయ, 10. పందొమ్మిది.

## 5.4 ఆధార గ్రంథాలు

1. బాల వ్యాకరణము - శ్రీ పరవస్తు చిన్నయ సూరి
2. ఘంటాపథ వ్యాఖ్యానం - శ్రీ వంతరాం రామకృష్ణారావు

**డాక్టర్ చింతపల్లి సత్యనారాయణ**
ఎం.ఏ., పిహెచ్.డి.
రీడర్
ఆర్.వి.వి.ఎన్. కళాశాల
ధరణికోట, గుంటూరు జిల్లా

# పాఠం - 6

# తతయు ˜రిచ్ఛేదం

పాఠ్యనిర్మాణక్రమం

6.0 లక్ష్యం
6.1 సోదాహరణ వ్యాఖ్యలు
6.2 సమీక్ష
6.3 ప్రశ్నలు
6.4 ఆధార గ్రంథాలు

## 6.0 లక్ష్యం

ఈ పాఠంలో తత్సమ పరిచ్ఛేదంలోని 1 నుండి 38 సూత్రాలకు సోదాహరణ వ్యాఖ్యలు తెలుసుకుంటారు.

## 6.1 సోదాహరణ వ్యాఖ్యలు (1 నుండి 38 సూత్రాలు)

6.1.1 సూత్రం : డు, ము, వు, లు - ప్రథమ

6.1.2 సూత్రం : 'ను' వర్ణంబు - ద్వితీయ

6.1.3 సూత్రం : చేత, తోడ - తృతీయ

6.1.4 సూత్రం : కొఱకు, కయి - చతుర్థీ

6.1.5 సూత్రం : వలన, కంటె, పట్టి - పంచమి

6.1.6 సూత్రం : కు, యొక్క, లోపల- షష్ఠి

6.1.7 సూత్రం : అందు, న - సప్తమి

తత్ + సమము = తత్సమము. ఇక్కడ 'తత్' అనే దానికి సంస్కృతమని అర్థం. సంస్కృత ప్రాతిపదికాలకు డు, ము, వు, లు మొదలైన ప్రత్యయాలను చేర్చి తెల్పే భాగం కాబట్టి ఇది తత్సమ పరిచ్ఛేదం. దీనిలో ప్రథమ మొదలైనవి విభక్తుల పేర్లు. 1 నుండి 7 వరకు గల సూత్రాలు తెలుగు విభక్తులను తెలుపుతాయి.

6.1.8 సూత్రం : తృతీయాదులకు నుగాగమంబగు.

పదవిభాగం : తృతీయ + ఆదులకు, నుక్ + ఆగమము + అగు.

భావం : చేత, తోడ అనే తృతీయా విభక్తుల నుండి సప్తమీ విభక్తులైన అందు, న అనే విభక్తుల చివర 'ను' వర్ణం

చేరుతుంది.

ఉదాహరణ : రాముని + చేత + ను, రాముని + తోడ + ను
రాముని + కొఱకు + ను, రాముని + వలన + ను
రామున + కు + ను, రాముని + అందు + ను

వివరణ : తృతీయా విభక్తి ప్రత్యయాలు మొదలు సప్తమీ విభక్తి ప్రత్యయాల వరకు 'ను' వర్ణం చివరలో చేరి రాముని చేతను నుండి రాముని యందు ను వంటి రూపాలు ఏర్పడుతాయి.

విశేషాంశాలు : 'నుక్ + ఆగమ = నుగాగమ అని 'క' కారంతో నిర్దేశించడం వల్ల 'ను' వర్ణం తృతీయాదుల చివర చేరుతుందని, ప్రథమ, ద్వితీయలకు నుగాగమం లేదని భావం.

6.1.9 సూత్రం : కయి, పట్టి, యొక్క లకు నుగాగమంబు లేదు.

భావం : కయి, పట్టి, యొక్క అనే చతుర్థి, పంచమి, షష్ఠి విభక్తి ప్రత్యయాలకు చివర 'ను' వర్ణం చేరదు.

ఉదాహరణ : రాముని కయి, జ్ఞానమును బట్టి, రాముని యొక్క

వివరణ : కయి, పట్టి, యొక్క అనేవి చతుర్థి, పంచమి, షష్ఠి విభక్తి ప్రత్యయాలే అయినను వీటికి చివర మాత్రము 'ను' వర్ణం రాదు. అంటే రామునికయి + ను అని కాక రామునికయి అని మాత్రమే రూపం ఉంటుంది.

విశేషాంశాలు : తృతీయా విభక్తి నుండి సప్తమీ విభక్తి వరకు గల ప్రత్యయాలలోని అన్ని ప్రత్యయాలకు 8వ సూత్రాన్ని అనుసరించి 'ను' వర్ణం రాగా కేవలము కయి, పట్టి, యొక్క అనే విభక్తి ప్రత్యయాలకు మాత్రమే 'ను' వర్ణం రాదు.

6.1.10 సూత్రం : చేత, తోడ, లోపల వర్ణంబుల ప్రథమాక్షరంబులు వైకల్పికంబుగా శేషించు.

పదవిభాగం : ప్రథమ + అక్షరములు.

భావం : చేత, తోడ, లోపల అనే ప్రత్యయాలలోని మొదటి అక్షరాలైన చే, తో, లో, అనే అక్షరాలే మిగులుతాయి.

ఉదాహరణ : రామునిచే, రామునితో, వనములలో.

వివరణ : వైకల్పికముగా అనటం వల్ల రాముని చేత, రాముని తోడ, వనముల లోపల అని గూడా ఉండవచ్చు.

విశేషాంశాలు : వైకల్పికం అనే దాని అర్థం కోసం పారిభాషిక పద వివరణలో చూడండి.

6.1.11 సూత్రం : డు, ము, వు, న లేకవచనంబులు ఏకత్వ సంఖ్యను బోధించు ప్రత్యయం బేకవచనంబు.

పదవిభాగం : డు - ము - వు - న లు + ఏకవచనము + లు ప్రత్యయంబు + ఏకవచన + ము.

భావం : విభక్తి ప్రత్యయాలలో డు, ము, వు, న అనేవి ఏకవచనాలు. ఏకవచనం అంటే ఒకే ఒక పదార్థాన్ని తెలిపే ప్రత్యయం.

ఉదాహరణ : రాముడు, సోముడు, వనము, ధనము, ధేనువు, భానువు.

వివరణ : రాముడు, వనము, ధేనువు అనే చోట్ల డు, ము, వు అను ప్రత్యయాలు ఒక్క వస్తువును మాత్రమే తెలియజేస్తాయి కాబట్టి ఇవి ఏకవచనాలు.

విశేషాంశాలు : డు, ము, వు, అనేవి ప్రథమా విభక్తి ప్రత్యయాలు. 22వ సూత్రం వల్ల రాముడు వంటివి కాగా 39వ సూత్రం వల్ల 'ము' వర్ణం చేరి వృక్షము అని, 48వ సూత్రం వల్ల దేనువు అని అవుతాయి.

6.1.12 సూత్రం : లు వర్ణంబు బహువచనంబు. బహుత్వ సంఖ్యను బోధించు ప్రత్యయంబు బహువచనంబు.

భావం : 'లు' అనే ప్రత్యయం బహుత్వ సంఖ్యను అంటే ఎక్కువను తెలియజేస్తుంది.

ఉదాహరణ : రాము + లు, సోము + లు, వనము + లు, ధనము + లు, ధేనువు + లు, భానువు + లు.

వివరణ : 'లు' వర్ణము బహువచనం. ఒకటికి మించిన పదార్ధములను బోధించు ప్రత్యయం బహువచనం. రాము + లు. ఒక రాముని కంటె ఎక్కువ మంది రాములను బోధించుట చేత బహువచనమైనది.

విశేషాంశాలు : వర్ణం, బహువచనం అను వాని వివరణం పారిభాషిక పద వివరణలో చూడండి.

6.1.13 సూత్రం : తక్కినవి యుభయములు. మిగిలిన ప్రత్యయము లేకత్వ బహుత్వములకు బోధకములని యర్థము.

పదవిభాగం : తక్కినవి + ఉభయములు, ప్రత్యయములు + ఏకత్వ బహుత్వములకు బోధకములు + అని + అర్థము.

భావం : డు, ము, వు, న, లు అను అయిదు ప్రత్యయాలు కాక మిగిలిన అన్ని ప్రత్యయాలను ఏకత్వంలోను బహుత్వంలో గూడా ఉంటాయి అని అర్థం.

ఉదాహరణ : వనమును - వనములను - వనము చేతను - వనముల చేతను - వనము తోడను - వనముల తోడను.

వివరణ : వనమును అని నప్పుడు అందలి 'ను' వర్ణము ద్వితీయా విభక్తి ఏకవచనాన్ని తెల్పుతుంది. వనములను అని నప్పుడు బహువచనాన్ని తెల్పుతుంది. అదే విధంగా చేత, తోడ మొదలైన విభక్తి ప్రత్యయాలు కూడా ఏక వచనంలోను బహువచనంలోను సమానంగానే వస్తాయి.

6.1.14 సూత్రం : ఓ యా మంత్రణంబునం దగు. ఓ యను శబ్దము సంబోధనంబు నందగునని యర్థము. ఇది సంబోధ్య వాచకంబునకు ముందే ప్రయోగింపబడును. ఓ శబ్దంబు తొఱంగియు సంబోధ్య వాచకంబు ప్రయోగింపవచ్చును.

పదవిభాగం : ఓ + ఆమంత్రణమునందు + అగు.

ఉదాహరణ : ఓ రాముడ - ఓ రాములార - రాముడ - రాములార.

భావం : ఆమంత్రణము అనగా పిలుచుట అని అర్థము. ఎవరినైనా పిలువ వలసి వచ్చినప్పుడు 'ఓ' అను శబ్దమును సంబోధ్య వాచకానికు ముందు ప్రయోగిస్తారు. సంబోధ్య వాచకమంటే ఏ వ్యక్తిని సంబోధిస్తామో ఆ వ్యక్తి బోధించే శబ్దం.

వివరణ : ఒక రాముని పిలచేటప్పుడు ఓ రాముడ అని, ఎక్కువ మందిని పిలిచేటప్పుడు ఓ రాములారా అని అవుతుంది. 'ఓ' శబ్దాన్ని విడిచిపెట్టి గూడా రాముడ, రాములారా అని అనవచ్చు.

6.1.15 సూత్రం : ఓ శబ్దంబునకుం బురుష నీచస్త్రీ పురాషా మంత్రణంబు లందు యి - సి - రి వర్ణంబులు విభాషనంతాగమంబు లగు.

పదవిభాగం : ఓ శబ్దమునకు, పురుష నీచస్త్రీ పురుష + ఆమంత్రణముల + అందు యి - సి - రి వర్ణములు విభాషను + అంత + ఆగమములు + అగు.

ఉదాహరణ : ఓయి రాముడ - ఓ రాముడ - ఓసి దుష్టరాల - ఓ దుష్టురాల - ఓరి దుష్టుడ - ఓ దుష్టుడ.

భావం : పురుషుని పిలిచేటప్పుడు 'యి' అనేది, నీచస్త్రీని పిలిచేటప్పుడు 'సి' అనేది నీచ పురుషుని పిలిచేటప్పుడు 'రి' అనేది 'ఓ' అనే శబ్దానికి తర్వాత అదనంగా చేరుతాయి. ఇవి చేరకుండా గూడా వ్యవహరింప బడతాయి.

6.1.16 సూత్రం : ఓరి యోసి మైత్రి యందుంగలవు.

పదవిభాగం : ఓరి, ఓసి మైత్రి యందు + కలవు.

ఉదాహరణ : ఓరి చిన్ని కృష్ణ - ఓసి ముద్దు బాల - ఓయి మొదలైన వానికి స్వతంత్ర ప్రయోగముం గలదు. సంగతియెమోయి - ఓసిపోవే - ఓరోరి యింకెందు బోవవచ్చు - వీనికి దీర్ఘంబుంగలదు. ఓయీ విప్రకులావతంస - ఓరీ దుష్టనిశాటులార - ఓసీవనుజెనకరాకు.

భావం : పురుషుని పిలిచేటప్పుడు 'ఓరి' అని, స్త్రీని పిలిచేటప్పుడు 'ఓసి' అని స్నేహంగా గూడ పిలవవచ్చు.

వివరణ : చిన్ని కృష్ణ అనేది ప్రేమగా పిలిచే పిలుపు దీనికి ముందు 'ఓరి' అనే శబ్దం వచ్చింది. 'ఓసి ముద్దుబాల' లో ఓసి అనేది కూడా ప్రేమ సూచకమే.

విశేషాంశం : నీచస్త్రీ పురుషులంటే శీలము, జాతి, విద్య, వయస్సు మొదలైన వాటి విషయంలో తనకంటే తక్కువ వారని అర్థం. నీచ అనే పదం తక్కువదనాన్ని సూచిస్తుందే కాని తిట్టడం కాదు. శత్రువుల విషయంలో ఉత్తమ వ్యక్తులు గూడా ఓరి, ఓసి శబ్దాలతో వ్యవహరింపబడతారు.

6.1.17 సూత్రం : స్త్రీ తిర్యగ్జడ భిన్నంబులును వాని విశేషణంబులును మహత్తులనంబడు. తిర్యక్కులనగా బశుపక్ష్యాదులు, జడములనగా నచేతనములు.

పదవిభాగం : సీ + తిర్యక్ + జడ భిన్నములును వాని విశేషణములును మహత్తులు + అనంబడు.

పశు + పక్షి + ఆదులు, న + చేతనములు.

భావం : స్త్రీలును, పశువులు పక్షులు మొదలైనవియును, అచేతనాలు కాక మిగిలిన వానిని వాని విశేషణాలను మహద్వాచకాలని అంటారు. జడములు అంటే అచేతనాలు అంటే కదలికలు లేనివి అనగా బుద్ధి మరియు జీవము వంటి ఇంద్రియాలు లేనివి.

వివరణ : పురుష వాచకాలను మహత్తులు అంటారు. స్త్రీ వాచకాలకు మహతీ శబ్దం అన్వయిస్తుంది. తిర్యక్కులంటే పశువులు, పక్షులు, జడములు అంటే కొండలు, చెట్లు, సముద్రాలు మొదలైనవి. మానవుల వలే సహజమైన గమనం లేకపోవటంవల్ల వీనిని ప్రాణములేని వాటిగనే నిర్ణయించి జడములు అని అనటం జరిగింది. రాముడు, రావణుడు, ఇంద్రుడు వంటి పురుష వాచకాలనే కాకుండా 'మనోహరుడు రాముడు' అనే దానిలో విశేషణపదం అయిన 'మనోహరుడు' అనేది గూడా మహత్తు అనబడుతుంది.

6.1.18 సూత్రం : క్లైబంబులు, మిత్రాదులు, మహద్వాచకంబులు విభాషం బుంలింగ తుల్యంబులగు. మిత్ర శరణ ప్రధాన పాత్రాదులు మిత్రాదులు.

పదవిభాగం : మిత్ర + ఆదులు , మహత్ + వాచకములు, విభాషం + పుంలింగ తుల్యములు + అగు.

మిత్ర, శరణ, ప్రధాన, పాత్ర + ఆదులు, మిత్ర + ఆదులు.

భావం : క్లైబములు అంటే నపుంసకలింగాలు. సంస్కృతంలో నపుంసకలింగంగా కనపడే 'మిత్ర' మొదలైన శబ్దాలకు వికల్పంగా పుంలింగ సమానత్వం ఉంది. మిత్రుడు అనే పదానికి స్నేహితుడు, సూర్యుడు అనే అర్థాలున్నాయి. పుంలింగ పదంగా మిత్రుడు అని, నపుంసకలింగంగా మిత్రము అని అవుతుంది.

ఉదాహరణ : మిత్రుడు - మిత్రము
శరణుడు - శరణము
ప్రధానుడు - ప్రధానము
పాత్రుడు - పాత్రము

వివరణ : మిత్ర, శరణ, ప్రధాన, పాత్ర వంటి మరికొన్ని శబ్దాలు నపుంసకలింగ శబ్దాలయినప్పటికిని వికల్పంగా వీటికి పుంలింగ శబ్దాలతో సమానత్వం ఉంటుంది. 'మిత్ర' శబ్దం పుంలింగం అయితే మిత్ర + ఉ + డుజ్ - మిత్రుడు అవుతుంది. అదంతమైన నపుంసకలింగమైతే మిత్ర + ము - మిత్రము అవుతుంది.

6.1.19 సూత్రం : జిత్తు బిందు పూర్వంబగు జకార మిత్తుగా గలదానికి ముందు బిందువు వచ్చునని యర్థము. కార్యార్థము ప్రత్యయాదులందు నిబద్ధమయి ప్రయోగించునపుడు మానంబడు వర్ణ మిత్తునాబడు. ఉదాహరణము మీద స్పష్టంబగు.

పదవిభాగం : జ + ఇత్తు, బిందు పూర్వము + అగు.

జ కారము + ఇత్తు, కార్య + అర్థము, ప్రత్యయ + ఆదులు నిబద్ధము + అలు, వర్ణము + ఇత్తు.

భావం : ఒక ప్రయోజనం కోసం ప్రత్యయాదులలో కూర్చబడి ప్రయోగించేటప్పుడు తీసివేయబడే వర్ణాన్ని 'ఇత్' అంటారు. 'జ' కారాన్ని ఇత్ వర్ణంగా ఉండే దానిని జిత్తు అంటారు. జిత్తును కలిగి ఉన్న వర్ణానికి ముందు బిందువు ఉంటుంది. అంటే 'జ' కారం ఏ వర్ణానికి చివర ఇత్ సంజ్ఞగా ఉపయోగపడిందో ఆ వర్ణానికి ముందు బిందువు వస్తుంది అని అర్థం.

ఉదాహరణ : రాముడు

సమన్వయం : 'బిందు పూర్వ' మంటే ముందు సున్న ఉండడం జ కారము లోపించే ప్రత్యయాలకు ముందు బిందువు వస్తుంది. రామ + ఉ - రాము

రాము + డుజ్

'జ' కారము పోయి రాము + ండు - రాముండు అనే రూపం ఏర్పడుతుంది. ఆ తర్వాత బిందువు లోపించి 'రాముడు' అనే రూపం నిలుస్తుంది.

విశేషాంశాలు : 'ఇత్తు' వివరణం పారిభాషిక పదాల వివరణలో చూడండి. 'డుజ్' అనే దాని చివర ఉన్న 'జ' కారము 'డు' కి ముందు బిందువును కలిగించి లోపిస్తుంది. అందువలన 'జ' అనేది ఇత్తు అనబడింది.

6.1.20 సూత్రం : డుజ్వర్ణకంబునకు బ్రకృతి యయినది డుమంతంబనబడు.

పదవిభాగం : డుజ్ + వర్ణకమునకు, ప్రకృతి + అయినది. డుం + అంతము, డుమంతము + అనబడు.

భావం : 'డుజ్' అనే ప్రత్యయం చేరటానికి తగిన ప్రాతిపదికను డుమంతము అంటారు. రామ, కృష్ణ మొదలైనవి ప్రకృతులు. 'డుజ్' మొదలైనవి ప్రత్యయాలు. ప్రకృతి, ప్రాతిపదిక అనేవి సమానార్థకాలు.

ఉదాహరణ : రామ + ఉ + డుజ్ - రాముడు.

వివరణ : ప్రత్యయం చేరక ముందున్న శబ్ద స్వరూపాన్ని ప్రకృతి అంటారు. 'డుజ్' అనేది ప్రత్యయం. ఇది 'రామ' అనే ప్రాతిపదిక ప్రక్కన చేరుతుంది. అప్పుడు రామ + ఉ - రాము అయి 'డుజ్' ప్రత్యయం చేరటం వల్ల రాము + డుజ్ అవుతుంది. 'డుజ్' ప్రత్యయం చేరటానికి అవకాశమున్న 'రామ' అనే ప్రాతిపదికను 'డుమంతము' అంటారు.

విశేషాంశాలు : 'డుజ్' అనే ప్రత్యయం కొన్ని ప్రాతిపదికాలకు మాత్రమే ప్రక్కన చేరుతుంది. ఈ విధమైన కలయికకు అవకాశమున్న రామ, భార్గవ వంటి ప్రాతిపదికలు మాత్రమే డుమంతాలు అనబడతాయి. హరి + డుజ్ - హరి అని మాత్రమే అవుతుంది. ప్రథమా విభక్తి ఏకవచనంలో ఇది డుజ్ వర్ణకముతో ఉండదు. కాబట్టి 'హరి' శబ్దము డుమంతము కాదు.

6.1.21 సూత్రం : పుంలింగంబయి మహద్వాచకంబయిన నామంబు తుది యత్వమున కుత్వంబగు. నామంబనగా ప్రాతిపదికము.

పదవిభాగం : పుంలింగము + అయి, మహత్ + వాచకము అయిన, నామము + తుది, అత్వమునకు + ఉత్వము + అగు. నామము + అనగా.

భావం : మహత్తును చెప్పేదిగా ఉండి సంస్కృతంలో పుంలింగంగా ప్రసిద్ధమైన ప్రాతిపదికల యొక్క చివర ఉన్న 'అ' కారానికి 'ఉ' కారం ఆదేశంగా వస్తుంది. ప్రాతిపదిక అంటే ప్రకృతి. దీనికే నామవచకమని పేరు.

ఉదాహరణ : రామ, భార్గవ, రాజపురుష.

రామ + ఉ - రాము
భార్గవ + ఉ - భార్గవ
రాజపురుష + ఉ - రాజపురుష

వివరణ : రామ, భార్గవ, రాజపురుష అనేవి పుంలింగాలు మరియు మహద్వాచకాలైన నామములు. కాబట్టి వీటి చివరలో ఉన్న అత్వానికి (రామ్ + అ) ఉత్వం వస్తుంది. అప్పుడు రామ్ + ఉ - రాము అనే రూపం సిద్ధిస్తుంది. పుంలింగాలు కాని మహత్తుల అత్వానికి ఉత్వం రాదు. దేవత, బ్రహ్మ, అనే పదాలలో దేవత స్త్రీ లింగం, బ్రహ్మ నపుంసకలింగం.

6.1.22 సూత్రం : పుంలింగమగు మహద్వాచకమునకు డుజ్ఞగు.

ఇచ్చట డుజ్ఞను దాని యందు జకారమిత్తు గావున 'జిత్తు బిందు పూర్వంబగు' నను సూత్రము చేత డు వర్ణకమునకు ముందు సున్న వచ్చును. బిమ్మట జ కారము లోపించును.

పదవిభాగం : పుంలింగము + అగు, మహత్ + వాచకము, డుజ్ + అగు, డుజ్ఞి + అను, జ కారము + ఇత్తు.

భావం : పుంలింగమై మహత్తును బోధించే పదంలోని ప్రథమ ఏకవచనానికి 'డుజ్' అనే ప్రత్యయం వస్తుంది.

ఉదాహరణ : రాముఁడు, రాముండు, భార్గవుఁడు, భార్గవుండు.

వివరణ : 'రామ' అనేది ప్రాతిపదికం. ఇది పుంలింగం, మహద్వాచకమైన నామం. రామ్ + అ - దీనిలో 'అ' త్వానికి 'ఉ' త్వం వచ్చి రామ్ + ఉ అవుతుంది. దీనికి డుజ్ వచ్చి రాము + డుజ్ అయి, జిత్తు బిందు పూర్వం అనటం వల్ల రాముండు, రాముఁడు అనే రూపాలు ఏర్పడతాయి.

విశేషాంశాలు : 'పుంలింగమగు' అనటంవల్ల పుంలింగాలు కాని మహద్వాచకాలకు 'డుజ్' రాదని భావం. దేవత స్త్రీ లింగం, బ్రహ్మ నపుంసక లింగం, వృక్షము పుంలింగమే కాని మహద్వాచకం కాదు. వీటికి 'డుజ్' వర్ణకం రాదు.

6.1.23 సూత్రం : డుమంతంబునకు ద్వితీయాద్యేక వచనంబు పరంబగు నపుడు నిగాగమంబు సర్వత్ర విభాషనగు. సర్వత్ర యనుట నగాగమ బాధనార్థము.

పదవిభాగం : ద్వితీయాది + ఏక వచనము, పరంబు + అగు, విభాష + అగు.

భావం : డుమంతమునకు చివర 'ని' అనుదానికి ద్వితీయాది ఏకవచనము పరమైనపుడు 'ని' అనునది ఆగమముగా వస్తుంది.

ఉదాహరణ : రామునిని, రాముని చేతను, రాము చేతను, రామునికిని, రామునకును.

వివరణ : 'రామ' అనేది ప్రాతిపదిక. 21వ సూత్రముచే రామ + ఉ - రాము, 2వ సూత్రముచే రాము + ను అగును. ఈ సూత్రము వలన రాముని + ను అగును. 26వ సూత్రముచే 'రామునిని' అవుతుంది. 'ని'గాగమము రానిచో రాము + ను, 25వ సూత్రముచే 'రాముని' అవుతుంది.

విశేషాంశాలు : 'సర్వత్ర' యనుట నగాగమ బాధనార్థము అని చెప్పబడింది నిగాగగం సర్వత్ర విభాష గనుక మొదట

నిగాగముం వచ్చి రాము + కు + ను - రాముని + కు + ను అవుతుంది. 26వ సూత్రముచే రామునికిని అవుతుంది. ఇది కాని పక్షంలో రాము + కును - రామునకును అవుతుంది. డుమంతము అనటం వల్ల డుమంతం కాని వాటికి నిగాగమం రాదు. హరి + ను - హరిని అవుతుందే కాని హరినిని అని కాదు. 'ద్వితీయాద్యేక వచనం' అనటం వల్ల బహువచనం పరమైతే 'ని' గాగమంరాదు. రాము + లను - రాములని అని మాత్రమే అవుతుంది.

6.1.24 సూత్రం : అనుదంత మగు తెనుగు డుమంతమునకు నిగాగమము నిత్యముగా నగును.

పదవిభాగం : అన్ + ఉత్ + అంతము + అగు.

భావం : హ్రస్వ ఉకారం చివరియందు లేని డు మంతానికి ద్వితీయ మొదలైన విభక్తులలో నిగాగమం నిత్యంగా వస్తుంది.

ఉదాహరణ : మగనిని - మగని చేతను - మగనికిని - అనుందంతంబను పర్యుదాసము చేత తమ్మునిని - తమ్ముని - తమ్ముని చేతను - తమ్ము చేతను, అల్లునిని - అల్లుని - అల్లుని చేతను - అల్లు చేతను - బల్లి దునిని - బల్లి దుని - బల్లి దుని చేతను - ఇత్యాదులందు నిగాగమంబు పాక్షికంబని యెఱుగునది.

వివరణ : హ్రస్వమైన ఉ కారం చివర గలిగిన శబ్దం ఉదంతం. అనుదంతం అంటే ఉదంతం కానిది. ద్వితీయ మొదలైన విభక్తులలో ఏకవచనం పరంగా ఉండగా దానిని పూర్వంలో ఉన్న ఉదంతం కాని అచ్చ తెలుగు డుమంత ప్రాతిపదకకు చివర 'ని' అనే ఆగమం నిత్యంగా వస్తుంది. 'మగ' అనేది అనుదంతమైన అచ్చతెలుగు డుమంతం. దీనికి ద్వితీయ మొదలైన విభక్తులలో ఏకవచనం పరంగా ఉంటే 'నిగాగమం' నిత్యంగా వస్తుంది.

'మగ' అనే దానికి 2వ సూత్రాన్ననుసరించి మగ + ను అని ఉంటే 23వ సూత్రం వలె కాక ఈ సూత్రం వల్ల నిగాగమం నిత్యంగా వచ్చి మగని + ను - మగనిని, మగని చేత వంటి రూపాలు అవుతాయే కాని 'మగ చేత' వంటి రూపాలుండవు.

'డుమంతంబునకు' అనడం చేత డుమంతం కాని శబ్దాలకు నిగాగమం రాదు.

విశేషాంశాలు : ఈ సూత్రంలో 'అనుదంతం' అనటం చేత అనుదంతమైనా సంస్కృత డుమంతానికి నిగాగమం నిత్యం గాదు. విధాతృని యానతి అని కాదు. 'డుమంతంబునకు' అనటం చేత డుమంతంకాని శబ్దాలకు నిగాగమం రాదు. అన్నను, అన్న చేత అనే రూపాలుండవు. 'నిగాగమము నిత్యముగా నగును' అనటం చేత నిగాగమం రాని రూపాలుండవు. మగని, మగచేత అనే రూపాలుండవు.

6.1.25 సూత్రం : డుమంతంబు మీది ను వర్ణకంబు నుత్వంబున కిత్వంబగు.

నువర్ణంబు ద్వితీయ యను సూత్రము చేత రామును అని ప్రాప్తింపగా నీ సూత్రము చేత నువర్ణకోత్వమున కిత్వంబు సిద్ధించె.

పదవిభాగం : ను వర్ణకంబు + ఉత్వంబునకు + ఇత్వము + అగు.

భావం : డుమంతానికి పరమైన ద్వితీయా విభక్తి ప్రత్యయమైన 'ను' వర్ణం యొక్క 'ఉ' త్వానికి 'ఇ' త్వం వస్తుంది.

వివరణ : 'రాము' అనే డుమంతానికి ద్వితీయా విభక్తి పరమై రాము + ను అని అవుతుంది.

23వ సూత్రం వల్ల నిగాగమం రాకపోతే 25వ సూత్రాన్ని అనుసరించి రాము + న్ + ఇ - రాముని అవుతుంది.

విశేషాంశాలు : డుమంతంబు మీది అనటం వల్ల డుమంతాలు కాని వాని మీది ను వర్ణకాల ఉత్వానికి ఇత్వం రాదు. విధాత + ను - విధాతను, చెట్టు + ను - చెట్టును అనే రూపాలే అవుతాయి.

రాము + ను - రామ + ఉ + ని - రామునిని అనే రూపం ఏర్పడుతుంది తప్ప 'రామునిను' అను రూపమేర్పడదు.

6.1.26 సూత్రం : ఇకారంబు మీది కు - ను - వు క్రియా విభక్తుల యుత్వంబున కిత్వంబగు.

పదవిభాగం : క్రియా విభక్తుల + ఉత్వంబునకు + ఇత్వంబు + అగు.

భావం : ఇ - ఈ లు చివరి యందు గల పదములకు పరమైన కు - ను - వు అనే వర్ణాల యొక్కయు, క్రియా విభక్తుల యొక్కయు 'ఉ' త్వానికి 'ఇ' త్వం వస్తుంది.

ఉదాహరణ : హరిని, హరికిని - శ్రీని - శ్రీకిని - వారిని - వారికిని.

వివరణ : హరి - ప్రాతిపదిక. 2వ సూత్రం వల్ల హరి + ను అగును. ఈ సూత్రం వల్ల హరి + న్ + ఉ లో 'ఉ' త్వానికి 'ఇ' త్వం వచ్చి హరి + న్ + ఇ - హరిని అవుతుందు. హరి + కు - హరి + కు + ను - హరి + క్ + ఉ + న్ - హరి + క్ + ఇ + న్ - హరికిని అనే రూపం ఏర్పడుతుంది.

విశేషాంశాలు : డు, రు, వు, ను, ము అనేవి క్రియా విభక్తులు సుకృతి + వు - సుకృతివి అని, వచ్చి + రు - వచ్చిరి, వండితి + రు - వండితిరి అనే రూపాలు అవుతాయి.

6.1.27 సూత్రం : ఈధాతు యుష్మదర్థంబుల మీది వాని యుత్వంబున కిత్వంబు రాదు.

పదవిభాగం : యుష్మత్ + అర్థము, ఉత్వంబునకు + ఇత్వంబు.

భావం : 'ఇచ్చు' అనే క్రియా ధాతువు 'ఈ' అనే రూపాన్ని పొందుతుంది. 'ఈ' ధాతువు మీదను, యుష్మత్ (మీరు) అర్థాన్ని తెలిపే ఈ, నీ, మీ అనే వాటి మీద వచ్చిన కు, ను, వు క్రియా విభక్తుల 'ఉ' త్వానికి 'ఇ' త్వం రాదు.

ఉదాహరణ : ఈరు - ఈవు - ఈను - ఈము - ఈకు - నీకు - మీకు.

వివరణ : యుష్మదర్థకాలు తెలుగులో ఏకవచనంలో 'నీ' అనేది బహువచనంలో 'మీ' అనేది. 'ఇచ్చు' అనే ధాతువుకు ప్రథము పురుష బహువచన ప్రత్యయం వచ్చి ఇచ్చు + రు అని అవుతుంది. 'ఇచ్చు' కు 'ఈ' రాగా ఈ + రు - ఈరు అని అవుతుంది. ఏకవచనంలో 'ఈవు' అవుతుంది.

ఈ + ర్ + ఉ - ఈరు అనే రూపం ఉంటుందే కాని ఈ + ర్ + ఇ (ఉత్వానికి ఇత్వం పూర్వ సూత్రం వల్ల) వచ్చి 'ఈరి' అని కాదు. ఈకు - నీకు - మీకు అనే రూపాలు అవుతాయి. కాని ఈకి - నీకి - మీకి అనే రూపాలు ఏర్పడవు.

విశేషాంశాలు : 'ఈకుము' లో ము వర్ణానికి లోపం వచ్చి 'ఈకు' అనే రూపమే అవుతుంది. ఇక్కడ 'కు' వర్ణం 'ఈ' ధాతువు మీద ఉండటం వల్ల 'ఇ' త్వము పొందరు. అందువల్ల 'ఈకు' అనే రూపమే గాని 'ఈకి' అనే రూపం రాదు.

**6.1.28** సూత్రం : కు వర్ణకంబు పరంబగు నపు డుకార ఋకారంబులకు నగాగమంబగు.

పదవిభాగం : 'కు' వర్ణకము + పరము + అగునపుడు + ఉకార ఋకారము + లకు నక్ + అగమము + అగు.

భావం : షష్ఠీ విభక్తి ప్రత్యయమైన 'కు' పరమందు (తర్వాత) ఉన్నప్పుడు పూర్వము (ముందు) న్న 'ఉ' కార 'ఋ' కారాలకు తర్వాత 'న' వర్ణం అదనంగా వచ్చి చేరుతుంది.

ఉదాహరణ : రామునకును - విష్ణునకును - సవితృనకును - విధాతృనకును.

వివరణ : 'రామ' ప్రాతిపదిక 'పుంలింగంబయి మహద్వాచకంబయిన నామంబు తుది యత్వంబునకుత్వం బగు' అనే 21 సూత్రాన్ని అనుసరించి 'రామ్ + అ' అనే దానిలో 'అ' త్వానికి 'ఉ' త్వం వచ్చి రామ్ + ఉ - రాము అనే రూపం అయింది. దీనికి షష్ఠీ విభక్తి ప్రత్యయం 'కు' జేరి రాము + కు అవుతుంది. 'తృతీయాదులకు నుగాగమంబగు' అనే 8వ సూత్రం వల్ల 'రామునకు' అనే రూపం వస్తుంది. ప్రస్తుత సూత్రం వల్ల 'న' అనే వర్ణం వచ్చి రామున + కును - రామునకును అనే రూపం ఏర్పడుతుంది.

విశేషాంశాలు : రామ + ఉ - రాము అనునది చేయబడిన 'ఉత్తు' గలది (కృతోత్కము) 'విష్ణు' అను పదములోని 'ఉ' అనునది సహజమైన ఉ కారము. అందువల్ల 'విష్ణు' అను రూపమే ప్రాతిపదిక. విష్ణు + కు - విష్ణు + కును - విష్ణున + కును - విష్ణునకును ఏర్పడుతుంది.

**6.1.29** సూత్రం : ఉకార ఋకారంబుల కందు వర్ణకము పరంబగునపుడు నుగాగమంబగు.

పదవిభాగం : ఉకార ఋకారములకు + అందు వర్ణకము పరము + అగునపుడు నుక్ + అగమము + అగు.

భావం : సప్తమీ విభక్తి ప్రత్యయమైన 'అందు' పరమైనప్పుడు ఉకార, ఋకారములకు చివర నుగాగమం వస్తుంది.

ఉదాహరణ : రామునందును - విష్ణునందును - విధాతృనందును.

వివరణ : రాము + అందు లో 'ము' ఉదంతం. దీనికి 'అందు' అనే ప్రత్యయం పరంగా ఉంది. అదే విధంగా 'విష్ణు' లో 'ష్ణు' ఉదంతం దీనికి 'అందు' అనే ప్రత్యయం పరంగా ఉంది. 'విధాతృ' లో 'తృ' ఋ అనేది చివరలో ఉంది. దీనికి 'అందు' పరంగా ఉంది. అందు వలన

రాము + ను + అందు - రామునందు.
విష్ణు + ను + అందు - విష్ణునందు.
విధాతృ + ను + అందు - విధాతృనందు, అని అవుతాయి.

విశేషాంశాలు : 'రాము' లోని 'ఉ' (రామ్ + ఉ) కారం కృతోత్కం. 21వ సూత్రాన్ని అనుసరించి 'రామ్ + అ' లోని 'అ' త్వానికి 'ఉ' త్వం వచ్చి రామ్ + ఉ - రాము అనే రూపం వచ్చింది. విష్ణు లోని ఉకారం శబ్ద సహజం. కృతోత్కానికి, సహజ ఉకారానికి ఈ సూత్రం వర్తిస్తుంది.

6.1.30 సూత్రం : ఆగమము - వు వర్ణంబుల కందు వర్ణకము పరంబగు నపుడు నుగాగమంబు విభాషనగు.

పదవిభాగం : వర్ణంబులకు + అందు, వుక్ + ఆగమంబు + విభాష + అగు.

భావం : 'అందు' అనే ప్రత్యయం పరమైనపుడు ఆగమంగా వచ్చిన ము, వు, వర్ణాలకు చివర 'ను' వర్ణం విభాషగా వస్తుంది.

ఉదాహరణ : వనమునందును, వనమందును,
ధేనువునందును, ధేనువందును.

వివరణ : 'వనము' అనే పదంలోని 'ము' వర్ణకం ప్రథమా విభక్తి ప్రత్యయం. 'వన' అనేది ప్రాతిపదిక. సప్తమీ విభక్తి ప్రత్యయమైన 'అందు' అనేది చేరి వనము + అందు. 'తృతీయాదులకు నుగాగమంబగు' అనే సూత్రాన్ని అనుసరించి వనమును + అందు అవుతుంది. ఈ సూత్రాన్ని అనుసరించి వనమును + అందును - వనమునందును అనే రూపం ఏర్పడుతుంది. వనమున్ + అందును లో అచ్చు పరంగా ఉండటం వల్ల ద్రుత స్వరం (న్) లోపించి వనమున్ + అందును - వనమునందును అని, నుగాగమం రాకపోతే వనము + అందును - వనమందును అనే రూపాలు ఏర్పడతాయి. ధేను ప్రాతిపదిక

ధేను + అందు
ధేను + అందును
ధేను + వు + అందును
ధేనువును + అందును
ధేనువున్ + అందును - ధేనువునందును
నుగాగమం రాకపోతే ధేనువు + అందును - ధేనువందును అనే రూపాలు ఏర్పడతాయి.

6.1.31 సూత్రం : బహుత్వంబున, ద్వితీయాది విభక్తులకు లడాగమంబగు.

పదవిభాగం : బహుత్వమున, ద్వితీయ + ఆది విభక్తులకు లట్ + ఆగమము + అగు.

భావం : బహువచనంలో ద్వితీయా విభక్తి మొదలు సప్తమీ విభక్తి వరకు ఉన్న ఏ విభక్తి ప్రత్యయానికైనా ముందు 'ల' వర్ణం అదనంగా వచ్చి చేరుతుంది.

ఉదాహరణ : రాములను - రాముల చేతను
విధాతృలను - విధాతృల చేతను

వివరణ : బహువచనంలో ద్వితీయాది విభక్తులకు ముందు 'ల' వర్ణం ఆగమంగా వస్తుంది. 'లట్' అని 'ఉ' కారంతో చెప్పటం వల్ల 'ల' వర్ణం ద్వితీయాది విభక్తులకు ముందు చేరుతుందని భావం. రాము - ప్రాతిపదిక. 21వ సూత్రముచే 'రాము'. దీనికి ద్వితీయా విభక్తి ప్రత్యయం చేరి రాము + ను. 'ను'

ప్రత్యయానికి ముందు 'ల' వర్ణం ఆగమంగా వచ్చి రాము + ల + ను - రాములను అవుతుంది. అదే విధంగా రామ - రాము - రాము+ చే - రాము + చేత - రాము + చేతను - రాము+ ల+ చేతన - రాముల చేతను. ఇదే విధంగా విధాతృలను, విధాతృల చేతను.

విశేషాంశాలు : లట్ + ఆగమము - లడాగమము. ఇక్కడ 'ఉ' కారము ఇత్తు. 'కార్యార్థము ప్రత్యయాదులందు నిబద్ధమయి ప్రయోగించు నపుడు మానంబడు వర్ణము 'ఇత్తు' నాబడు. ఇక్కడ 'ల' అనేది విభక్తి ప్రత్యయానికి ముందుగా జేరింది. 'రాము' అనేది డుమంతం. దీనికి ద్వితీయా విభక్తి ప్రత్యయమైన 'ను' జేరితే రాము + ను అని అవుతుంది. 'ల' అనేది విభక్తికి ముందు జేరటవల్ల రాము + లను - రాములను అని అవుతుంది.

**6.1.32** సూత్రం : సంబోధనంబు నందే కార్థంబయిన పదంబు తుది యుకారంబున కకారంబగు.

పదవిభాగం : సంబోధనము నందు + ఏక + అర్థము + అయిన. తుది 'ఉ' కారమునకు + అకారంబు + అగు.

భావం : సంబోధనలో ఏక పదార్థాన్ని బోధించే పదం యొక్క చివర ఉన్న 'ఉ' కారానికి 'అ' కారం వస్తుంది.

ఉదాహరణ : ఓ రాముడ, ఓ వృక్షమ, ఓ శంభువ, ఓ కొడుక.

వివరణ : సంబోధన అంటే పిలవడం. ఏకార్థమైన పదం అంటే ఏకవచన పదం అని భావం. అంటే ఒక దానిని మాత్రమే తెలిపేది అని అర్థం.

'రాముడు' అనేది ప్రథమా విభక్తి చివరి యందుండే పదం. సంబోధనలో 'ఉ' త్వానికి (రాముడ్ + ఉ) 'అ' త్వం వచ్చి (రాముడ్ + అ) - రాముడ అని అవుతుంది. 'ఓ యామంత్రణంబు నందగు' అనే సూత్రాన్ననుసరించి 'రాముడు' అనే పిలవబడే పదానికి (సంబోధ్య వాచకానికి) 'ఓ' అనేది వచ్చి 'ఓ రాముడ' అని అవుతుంది. ప్రథమా విభక్తి ఏకవచన ప్రత్యయాలైన డు, ము, వు అనే వానికి ఉదాహరణగా ఓ రాముడ, ఓ వృక్షమ, ఓ శంభువ అనేవి చెప్పబడ్డాయి. ఈ తత్సమ పదాలకే కాకుండా ఆచ్ఛిక పదాలకు గూడా ఈ విధంగానే రూపం వస్తుంది అని తెల్పటానికి 'ఓ కొడుక' అనేది చెప్పబడింది. 'కొడుకు' అనేది ఉదంతమైన దేశ్య శబ్దం. ఇది ఏకార్థకమైనది కాబట్టి సంబోధనలో చివర 'ఉ' త్వానికి 'అ'త్వ వచ్చి 'ఓ కొడుక' అనే రూపం వచ్చింది.

**6.1.33** సూత్రం : సంబోధనంబు నందు బదంబు తుది యకారేకారంబులకు దీర్ఘంబు విభాషనగు.

పదవిభాగం : సంబోధనము నందు + పదము + తుది + అకార + ఏ కారములకు దీర్ఘము విభాష + అగు.

భావం : సంబోధనలో సంబోధ్య వాచకమైన పదానికి చివర ఉన్న 'అ' త్వానికి 'ఉ' త్వానికి దీర్ఘం విభాషగా వస్తుంది.

ఉదాహరణ : ఓ రాముడా - ఓ రాముడ
ఓ చెలియా - ఓ చెలియ
ఓ హరీ - ఓ హరి
ఓ తండ్రీ - ఓ తండ్రి

వివరణ : 'రాముడు' అనే పదం 'సంబోధనంబునం దేకార్థంబయిన పదంబు తుది యుకారంబున కకారంబగు' అనే సూత్రాన్ని అనుసరించి ఓ రాముడ! అయింది. ఈ సూత్రం వల్ల దీర్ఘం వచ్చినట్టయితే ఓ రాముడా! అని, విభాష అనడం వల్ల దీర్ఘ రానట్టయితే ఓ రాముడ! అని హ్రస్వాంతంగానే ఉంటుంది. అదే విధంగా ఓ చెలియా! - ఓ చెలియ!, ఓ హరీ! - ఓ హరి!, ఓ తండ్రీ! - ఓ తండ్రి! వంటి రూపాలుంటాయి.

విశేషాంశాలు : సంబోధనలో సంబోధ్య వాచకానికి చివర ఉన్న అకారానికి, ఇకారానికి దీర్ఘం వికల్పంగా వస్తుంది అనటంవల్ల 'అ' కారానికి 'ఆ' కారం, 'ఇ' కారానికి 'ఈ' కారం విభాషగా వస్తుంది.

6.1.34 సూత్రం : కృతోత్కంబగు సంస్కృత నామంబు సంబుద్ధి డుజ్ఞునకు లోపంబు విభాష నగు.

పదవిభాగం : కృత + ఉత్కము + అగు.

భావం : వ్యాకరణ సూత్రం చేత 'ఉ' త్వం వచ్చింది కృతోత్కం. ఈ విధంగా 'ఉ' దంతంగా మారిన సంస్కృత ప్రాతిపదికల యొక్క సంబుద్ధి (సంబోధనలోని) 'డుజ్ఞు' కు లోపం విభాషగా అవుతుంది.

ఉదాహరణ : ఓ రామ - ఓ కృష్ణ. పూర్వ సూత్రము చేత దీర్ఘంబు. ఓ రామా! - ఓ కృష్ణా! సంస్కృత నామంబనుట జేసి ఓ తమ్ముడ!, ఓ బల్లిదుడ! ఇత్యాదులందు లోపంబు లేదు.

వివరణ : కృతోత్కం అంటే కృత - చేయబడిన ఉత్ + క - హ్రస్వమైన ఉకారం కలది. సంబుద్ధి డుజ్ఞు అంటే సంబుద్ధి యందున్న డుజ్ ప్రత్యయం. ఓ రాముడ! అనే సంబోధనలోని 'డ' అనేది.

ఓ రామ, ఓ రామా! అనే దానిలో రామ - సంస్కృత ప్రాతిపదికం. 21వ సూత్రం వల్ల రామ - రాము అవుతుంది. రాములోని 'ఉ' కృతోత్కం. 'రాము' అనేది కృతోత్కమైన సంస్కృత ప్రాతిపదికం. 'పుంలింగమగు మహద్వాచకమునకు డుజ్ఞగు' అనే 22వ సూత్రం వల్ల రాము + డుజ్ అయింది. ప్రస్తుత సూత్రాన్ని అనుసరించి 'డుజ్ లోపించి 'రాము' అని మిగులుతుంది. 32వ సూత్రాన్ని అనుసరించి రామా, రామ అనే రెండు రూపాలు ఉంటాయి. 'ఓ యామంత్రణంబునందగు' అనే సూత్రాన్ని అనుసరించి ఓ రామా!, ఓ రామ! అని వ్యవహరింపబడతాయి. విభాషగ ఈ రూపాలు ఏర్పడతాయి అనటంవల్ల ఓ రాముడా! ఓ రామా! ఓ రామ! అనే రూపాలుంటాయి. అదే విధంగా ఓ కృష్ణుడా!, ఓ కృష్ణా! ఓ కృష్ణ! అనే రూపాలు.

విశేషాంశాలు : 'సంస్కృత నామంబు మీది' అనటం వల్ల బల్లిదుడు వంటి తెలుగు పదాలు కృతోత్కాలైనప్పటికి ఓ బల్లిదుడు వంటి తెలుగు పదాలు కృతోత్కాలైనప్పటికి ఓ బల్లిదుడా! ఓ బల్లిదుడ! అనే రూపాలే కాని ఓ బల్లిదా! వంటి రూపాలు రావు. కృతోత్కాలకే చెప్పటం వల్ల సహజంగా ఉ కారాంత శబ్దాలైన విష్ణు, శంభు మొదలైన సంస్కృత నామాల మీద వచ్చే 'డుజ్ లోపించదు. అందువల్ల విష్ణుడ, శంభుడ, ఓ విష్ణుడా! ఓ శంభుడా! అనే రూపాలు మాత్రమే ఏర్పడతాయి. అదే విధంగా తెలుగు ప్రాతిపదికాలైన బలవంత, మతిమంత, విద్వాంస అనేవి సంస్కృత సమాలే గాని సంస్కృత నామాలు కాకపోవటం వల్ల ఓ బలవంతుడా!, ఓ మతిమంతడా! ఓ విద్వాంసుడా! అనే రూపాలతో బాటు చివర హ్రస్వాక్షరాలతో గూడా రూపాలుంటాయి.

6.1.35 సూత్రం : ఉదంత సంస్కృత నామంబు మీది సంబుద్ధి డుజ్ఞునకు నూ కారంబు ప్లుతం బాదేశంబు విభాషగ నగు.

పదవిభాగం : 'ఉత్' అంత సంస్కృత నామము, డుజ్ఞునకు + ఊ కారము పుతము + ఆదేశము విభాషగ + అగు.

భావం : హ్రస్వమైన ఉ కారము చివరి యందున్న సంస్కృత ప్రాతిపదిక మీద ఉన్నట్టి సంబుద్ధి డుజ్ఞుకు ప్లుతమైన 'ఊ' కారము విభాషగ ఆదేశమౌతుంది.

ఉదాహరణ : ఓ విష్ణూ! - ఓ శంభూ! - పక్షమునందు
విష్ణుడ - శంభుడ .. ఇత్యాది.

వివరణ : సహజముగా హ్రస్వ 'ఉ' కారము అంతమందున్నట్టి సంస్కృత నామాలైన శంభు, విష్ణు వంటి రూపాలకు పరమైనట్టి సంబుద్ధి డుజ్ఞుకు ప్లుత రూపమైన 'ఊ' కారము విభాషగ వస్తుంది.

సమన్వయం : ఏక మాత్ర కాలంలో ఉచ్చరించేది హ్రస్వము రెండు మాత్రల కాలంలో ఉచ్చరింపబడేది దీర్ఘము. మూడు మాత్రల కాలంలో ఉచ్చరింపబడేది ప్లుతము అని వ్యవహారము. మాత్ర అనేది ఒక్క క్షణ కాలాన్ని సూచిస్తుంది. విష్ణు శబ్దము సహజమైన ఉకారము చివరి యందున్నట్టి సంస్కృత నామం. 'ఉకారాంతంబగు మహత్తునకు వు వర్ణకము బహుళముగా నగు' అనే 50వ సూత్రాన్ని అనుసరించి విష్ణువు - విష్ణుడు అనే రూపాలు ఏర్పడతాయి. 'వు' వర్ణకం రానప్పుడు 'పుంలింగమగు మహద్వాచకమునకు డుజ్ఞగు' అనే 22 సూత్రాన్ని అనుసరించి విష్ణు + డుజ్ అనే రూపం వస్తుంది. ప్రస్తుత సూత్రాన్ని అనుసరించి ప్లుతమైన ఊ కారము వచ్చి ఓ విష్ణు + ఊ - ఓ విష్ణూ!!! అనే రూపం ఏర్పడుతుంది. 32వ సూత్రాన్ని అనుసరించి ఓ విష్ణుడ! అనే రూపం గూడా ఏర్పడుతుంది. ఓ విష్ణో! అనే రూపం ఏర్పడదు. విశేషాంశాలు కేవలం సంస్కృత నామాలకే కాకుండా 'బాబు' వంటి తెలుగు పదాలకు 'ఊ' కారం కలుగుతోంది. సంస్కృత నామాలతో గూడా డుమంతాలకే కాకుండా మిగిలిన పదాలకు గూడా 'ఊ' కారం ప్లుత రూపంలో వస్తోంది. అందుకే 'విభాష' ఉపయోగింపబడింది.

6.1.36 సూత్రం : సంబోధనంబు నందు బహువచనంబున కారగాగమంబగు.

పదవిభాగం : బహువచనమునకు + ఆరక్ + ఆగమము + అగు.

భావం : సంబోధనలో సంబోధ్యవాచకానికి చివరలో ఉన్న బహువచన ప్రత్యయానికి 'ఆర' అనేది అదనంగా చేరుతుంది.

ఉదాహరణ : ఓ రాములార - ఓ కృష్ణులార. దీనికిం బ్రాక్షికంబుగా దీర్ఘంబగు. ఓ రాములారా! - ఓ కృష్ణులారా!

వివరణ : 'లు' వర్ణంబు బహువచనంబు' అని సూత్రము. డు, ము, వు, లు అనే ప్రథమా విభక్తి ప్రత్యయాలలో డు, ము, వు అనేవి ఏకవచనాన్ని సూచిస్తే 'లు' అనేది బహువచనాన్ని సూచిస్తుంది. రాము + డు - రాముడు ఏకవచనం కాగా, రాము + లు - రాములు అనేది ఎక్కువ మంది రాములను సూచిస్తుంది. రాములు అనే బహువచన రూపంలో ప్రస్తుత సూత్రాన్ని అనుసరించి సంబోధనలో

ఓ రాములు - ఓ రాములు + ఆర - ఓ రాములార!

అని అయినది. రాములార, కృష్ణులార అనే పదాలలోని 'అ' త్వానికి దీర్ఘం వచ్చి రాములారా!, కృష్ణులారా!

అనే రూపాలు వ్యవహరింపబడతాయి.

విశేషాంశాలు : అరక్ + ఆగమము - ఇందులోని 'అరక్' లోని పొల్లు 'క' కారము (క్) లోపించి ఆరగాగమము అయింది. రాములు + ఆర - రాములారా. దీర్ఘం వచ్చినప్పుడు రాములారా! - ఓ రాములారా! అనే రూపం ఏర్పడుతుంది.

6.1.37 సూత్రం : మధ్యమ పురుష యోగంబునం దారగాగమంబు విభాష నగు.

పదవిభాగం : మధ్యమ పురుష యోగము + నందు + ఆరక్ + అగమము విభాష + అగు.

భావం : మధ్యమ పురుష యోగము అంటే సంబోధ్య వాచకముచే బోధింపబడ్డ యుష్మ దర్థకం మధ్యమ పురుషతో అన్వయించటం. సంబోధనలో మధ్యమ పురుష యోగంలో బహువచనానికి చివర 'ఆర' అనే ఆగమం విభాషగ వస్తుంది.

ఉదాహరణ : వినుడు బాలకులు - వినుడు బాలకులార వచ్చితిరి కాంతలు - వచ్చితిరి కాంతలార అన్నలార మిమ్ము నడిగెద నొక మాట - ఇచ్చట మధ్యమ పురుష యోగంబు లేమీ జేసి యారగాగమంబు నిత్యంబు.

వివరణ : 'వినుడు బాలకులు' అనే దానిలో 'వినుడు' అనేది మధ్యమ పురుష. దానికి కర్త 'బాలకులు' అనే సంబోధ్య వాచకం. ఇది బహువచన ప్రత్యయమైన 'లు' చివరి యందు కలది. వినుడు బాలకులు. ఇందులో 'లు' ప్రత్యయానికి ఆర (క్) ఆగమంగా వచ్చి 'వినుడు బాలకులార' అని అవుతుంది. ఈ సూత్రం వల్ల 'ఆర' గాగమం విభాష అనటం వల్ల 'వినుడు బాలకులు' అని గూడా రూపం ఉంటుంది. ఇదే విధంగా 'వచ్చితిరి కాంతలార', 'వచ్చితిరి కాంతలు' అని రెండు విధాలైన రూపాలు ఉంటాయి.

విశేషాంశాలు : 'అన్నలార మిమ్ము నడిగెద నొకమాట' అనే వాక్యంలో సంబోధ్య వాచకమైన 'అన్నలు' అనేది మధ్యమ పురుషతో కలిసి ఉండక పోవడం వల్ల 'ఆర' గాగమం తప్పని సరిగా వస్తుంది. అందువల్ల 'అన్నలార మిమ్ము నడిగెద నొకమాట' అనే గాని 'అన్నలు మిమ్మునడిగెద నొకమాట' అని కాదు. 'ఆర' అనేది 'లు' వర్ణము మీద మాత్రమే రావడం ప్రసిద్ధం.

6.1.38 సూత్రం : అదంతంబయి దీర్ఘ పూర్వలో పధంబయిన మహత్తు మీది విభక్తి లకారంబునకు రేఫంబగు.

పదవిభాగం : అత్ + అంతము + అయి, దీర్ఘ పూర్వల + ఉపథంబు + అయిన, రేఫము + అగు.

భావం : హ్రస్వమైన 'అ' కారం చివరి యందుండి, 'ల' కారము ఉపథగా ఉండి దానికి ముందు దీర్ఘమైన అక్షరం గల నామం మహదర్థకం అయినప్పుడు దాని మీద ఉన్నట్టి విభక్తి 'ల' కారానికి ఆదేశంగా 'ర' వర్ణం (రేఫ) నిత్యంగా వస్తుంది.

ఉదాహరణ : బాలురు - బాలురను - బాలుర చేతను
నృపాలురు - నృపాలురను - నృపాలుర చేతను

దయాళు శబ్దంబున కిట్లు రేఫంబు గానంబడియెడి.

దయాళురు - దయాళురను - దయాళుర చేతను.

వివరణ : అదంతం (అత్ + అంతం) అంటే హ్రస్వమైన 'అ' కారం చివర ఉన్న శబ్దం. ఉపధ అంటే శబ్దంలో చివరి నుండి రెండవ వర్ణం.

మహద్వాచకం, హ్రస్వ 'అ' కారం చివరగా ఉన్నది, ఆ చివరి 'అ' కారానికి ఉపధగా లకారం ఉన్నట్టిది, దానికి ముందు దీర్ఘాక్షరం ఉన్నది అయిన ప్రాతిపదిక మీద ఉన్న 'ల' కార స్థానంలో రేఫ (ర్) ఆదేశంగా వస్తుంది. వర్ణాలన్నింటికి (అక్షరాలన్నింటికి) 'ఆర' ప్రత్యయం వచ్చి 'అ కార', 'ఇ' కార, 'మ' కార వంటి వ్యవహారం ఉంటుంది. 'ర' అనే దానికి మాత్రం 'ఇఫ' అనేది వచ్చి 'రేఫం' అనబడుతుంది.

బాల - బాలు - బాలు + లు - బాలు + రు
నృపాల - నృపాలు - నృపాలు + లు - నృపాలు + రు

విశేషాంశాలు : అదంతాలు కాని వాటికి ఈ కార్యం రాదు. ధీశాలి + లు + ధీశాలులు 'ల' ఉపధ హస్వమైతే ఈ కార్యం రాదు. నల - నలులు 'ల' కారం కాకుండా వేరొకటి ఉపధ అయితే ఈ కార్యం రాదు.

రామ - రాములు

అమహత్తులకు ఈ కార్యం రాదు. బాల - బాలలు. 'బాల' అనే దానికి బాలిక అనే అర్థంలో బాలు + రు - బాలురు అని ప్రక్రియ చెప్పటం సరికాదు.

## 6.2 సమీక్ష

తత్సమ పరిచ్ఛేదంలోని మొదటి 38 సూత్రాలకు సోదాహరణ వ్యాఖ్యలు తెలుసుకున్నారు.

## 6.3 ప్రశ్నలు

క్రింది సూత్రాలకు సోదాహరణ వ్యాఖ్యలు వ్రాయండి.

1. ఓ యామంత్రణంబునందగు.
2. జీత్తు బిందు పూర్వంబగు.
3. పుంలింగమగు మహద్వాచకమునకు డు జ్ఞగు.
4. ఇకారంబు మీది కు, ను, వు క్రియా విభక్తుల యుత్వంబున కిత్వంబగు.
5. బహుత్వంబున ద్వితీయాది విభక్తులకు లడాగమంబగు.
6. కృతోత్కంబగు సంస్కృత నామంబు సంబుద్ధి డుజ్ఞునకు లోపంబు విభాష నగు.
7. అదంతమయి దీర్ఘ పూర్వంలో పధంబయిన మహత్తు మీది విభక్తి లకారంబునకు రేఫంబగు.

## 6.4 ఆధార గ్రంథాలు

1. బాల వ్యాకరణము - శ్రీ పరవస్తు చిన్నయ సూరి
2. ఘంటాపథ వ్యాఖ్యానం - శ్రీ వంతరాం రామకృష్ణారావు
3. బాలవ్యాకరణ సారస్య సర్వస్వ పేటిక - శ్రీ దూసి రామమూర్తి శాస్త్రి
4. రమణీయము - శ్రీ దువ్వూరి వేంకటరమణ శాస్త్రి

డాక్టర్ కౌతా సుబ్రహ్మణ్య శాస్త్రి
రీడర్ మరియు ఆంధ్ర శాఖాధ్యక్షులు
(రిటైర్డ్)
హిందూ కళాశాల
గుంటూరు

# పాఠం - 7

# తతయు ˆరిచ్ఛేదం

పాఠ్యనిర్మాణక్రమం

7.0 లక్ష్యం
7.1 సోదాహరణ వ్యాఖ్యలు (39 నుండి 66 సూత్రాల వరకు)
7.2 సమీక్ష
7.3 ప్రశ్నలు
7.4 ఆధార గ్రంథాలు

## 7.0 లక్ష్యం

బాల వ్యాకరణంలోని తత్సమ పరిచ్ఛేదం లోని 39 నుండి 66 సూత్రాలకు భావాలు, విశేషాంశాలు, వివరణలతో సోదాహరణ వ్యాఖ్యలు తెలియజేయడం.

## 7.1 సోదాహరణ వ్యాఖ్యలు (39 నుండి 66 సూత్రాల వరకు)

7.1.1 సూత్రం : అమహన్న పుంసకముల కదంతములకు ముపర్ణకం బగు. (39 సూ.)

పద విభాగం : అమహత్తు + నపుంసకములకు + అత్ + అంతములకు + ముపర్ణకము + అగు.

భావం : హ్రస్వమైన 'అ' కారం చివర గల అమహత్తులకు, నపుంసక లింగ శబ్దాలకు 'ము' అనే ప్రత్యయం కలుగుతుందని అర్థం.

ఉదా : వృక్షము - ఋక్షము, దైవము - కళత్రము - అపత్యము, క్లీబంబులు మిత్రాదులను సూత్రంబున బాక్షికంబుగం బుంలింగత్వంబతి దేశించుటం జేసి మిత్రాది శబ్దంబులకు ద్వైరూప్యం బెదుంగునది. మిత్రుడు - మిత్రము, శరణుడు - శరణము.

వివరణ : అదంతాలైన (అత్ + అంత) అమహద్వాచకాలకు, అదంతాలైన నపుంసక లింగ శబ్దాలకు 'ము' అనే ప్రత్యయం కలుగుతుంది. వృక్ష - ఋక్ష అనేవి అదంతాలైన అమహత్తులు. వీటికి 'ము' వర్ణకం వచ్చి వృక్షము - ఋక్షము అనే రూపాలు ఏర్పడ్డాయి. దైవ, కళత్ర అపత్య అనేవి అదంతాలైన నపుంసక లింగ శబ్దాలు. వీటికి 'ము' వర్ణకం వచ్చి దైవము - కళత్రము - అపత్యము అనే రూపాలు ఏర్పడ్డాయి. 18వ సూత్రమైన 'క్లీబంబులు మిత్రాదులు మహద్వాచకంబులు విభాషం బుంలింగ తుల్యంబులగు' అనే దాని ననుసరించి మిత్రము, శరణము, ప్రధానము, పాత్రము అనేవి అదంత పుంలింగ అయినపుడు మిత్రుడు, శరణుడు, ప్రధానుడు, పాత్రుడు అనే రూపాలు ఏర్పడతాయి.

విశేషాంశాలు : మిత్ర, శరణ, ప్రధాన, పాత్ర అనేవి పుంలింగ రూపాలు అయినపుడు ఉత్వము, డుజ్‌లు వచ్చి మిత్రుడు,

శరణుడు, పధానుడు, పాత్రుడు అనే రూపాలు ఏర్పడ్డాయి. 'వృక్ష' శబ్దం పుంలింగమే గాని మహద్వాచం కాదు కాబట్టి ఉత్వము, డుజ్ లు రావు కాబట్టి వృక్షము, ఋక్షము, దైవము, కళత్రము, అపత్యము, అనే రూపాలు మాత్రమే ఏర్పడ్డాయి. ఋక్షము - అమహద్వాచమైన నపుంసకలింగం, దైవము - మహద్వాచకమైన నపుంసక లింగ శబ్దం, కళత్రము - మహతీ వాచకమైన నపుంసకలింగ శబ్దం. అపత్యము అనేది మహత్తు, అమహత్తు అయిన నపుంసకలింగ శబ్దం.

7.1.2 సూత్రం : వానికి ముపర్ణ కేతరంబయిన విభక్తి పరంబగు నపుడు ముగాగమం బగు. (40 సూ.)

పద విభాగం : వానికి, ము వర్ణక + ఇతరంబు + అయిన విభక్తి పరము+ అగునపుడు, ముక్ + ఆగమము + అగు.

భావం : వానికి అనగా ప్రథమైన వచనము నందు 'ము' వర్ణకముతో కలసి ఉండే అదంతాలైన అమహన్న పుంసక లింగములు అని అర్థం. వీటికి ము వర్ణకం కాకుండా తక్కిన విభక్తులు పరమైనపుడు 'ము' ఆగమంగా వస్తుంది.

ఉదా : వృక్షములు - వృక్షమును.
ఋక్షములు - ఋక్షమును.

వివరణ : ముక్ + ఆగమం - ముగాగమం. ఇక్కడ క కారం ఇత్యంజ్ఞ. 'ము' అనునది నామము చివర చేరుతుందని అర్థం. వృక్ష - ప్రాతిపదికం. బహువచనంలో వృక్ష + లు అని అవుతుంది. వృక్షము అనేది ము వర్ణకంతో కలిసి ఉంటే ప్రాతిపదిక. వృక్ష శబ్దం అదంతం, అమహద్వాచకం. దీనికి 'లు' వర్ణం పరమైంది. 'వృక్ష' శబ్దానికి చివర 'ము' వర్ణం ఆగమంగా వచ్చి 'వృక్షము' + లు అయింది. ఇదే విధంగా వృక్ష, వృక్ష + ను, వృక్షము + ను, వృక్షమును.

ఋక్ష + లు - ఋక్ష + ము + లు - ఋక్షములు.
ఋక్ష + ను - ఋక్ష + ము + ను - ఋక్షమును.

విశేషాంశాలు : ఈ సూత్రంలోని 'వానికిన్' అనే దానికి ముందు సూత్రంలో చెప్పబడ్డ 'అహమన్న పుంసకముల కదంతములకు' అని సమన్వయం చేసికోవాలి. 'ము వర్ణకేతరంబయిన' అనటంవల్ల ప్రథమా విభక్తి ఏక వచనంలో 'ము' వర్ణకంతో కలిసి ఉన్న అదంతాలైన అమహన్నపుంసకాలకే 'ము' గాగమం వస్తుందని అర్థం. వృక్షము, ఋక్షము అనే పదాలలోని 'ము' ప్రథమా విభక్తి ఏక వచన ప్రత్యయం. వృక్షమును, ఋక్షమును లోని 'ము' వర్ణము ఆగమము. 'ము' వర్ణకముపై ఇతర విభక్తులు చేరవు కాబట్టి నుగాగమం చెప్పబడింది.

7.1.3 సూత్రం : ము వర్ణకంబునకు విధించు కార్యము ముగాగమంబునకు నగు. (41 సూ.)

పద విభాగం : 'ము' వర్ణకము, ముక్ + ఆగమము.

భావం : ము వర్ణకంబునకు విధించు లోపాదేశాది కార్యములు ముగాగమానికి సహితం వస్తాయని యర్థం.

ప్రథమా విభక్తి ఏకవచన ప్రత్యయమైన 'ము' అను దానికి విధింపబడే లోపం, ఆదేశం వంటి కార్యాలు ముగాగమానికి కూడా వస్తాయి.

ఉదా : వృక్షము + లు - వృక్షమ్ములు, వృక్షంబులు.
చరిత్ర + లు - చరిత్రములు, చరిత్రలు

విశేషాంశాలు : ఈ సూత్రం తర్వాత చెప్పబడే సూత్రాలకు ఇది అన్వయిస్తుంది. 'ము' ప్రత్యయానికి విధించే కార్యాలు 'ము' గాగమ రూపంలో ఉండే 'ము' వర్ణకాలకు గూడా అవుతాయి. లోపము, ఆదేశం వంటివి 'ము' వర్ణకానికే కాక 'ము' ఆగమానికి గూడా వస్తాయి.

7.1.4 సూత్రం : ము వర్ణకంబునకు మాముడియేనిం బూర్ణ బిందు పూర్వక బువర్ణంబేని విభాషనగు. (42 సూ.)

పద విభాగం : 'ము' వర్ణకము + నకు, మా + ముడి (మా వత్తు - 'మ్మ') + ఏని + పూర్ణబిందు పూర్వక బు వర్ణము + ఏని, విభాష + అగు.

భావం : ప్రథమా విభక్త ప్రత్యయమైన 'ము' వర్ణానికి అదనంగా మాముడిగాని, పూర్ణబిందు పూర్వక బు (ంబు) వర్ణంగాని విభాషగ వస్తుంది.

ఉదా : వృక్షము, వృక్షంబు.
ఋక్షమ్ము, ఋక్షంబు

పూర్వ సూత్రము చేత ముగాగమమునకీ కార్యంబగు.

వృక్షమ్ములు - వృక్షంబులు.
ఋక్షమ్ములు - ఋక్షంబులు.

వివరణ : 'వృక్షము' అనే పదంలో 'ము' అనేది ప్రథమా విభక్తి ఏక వచన ప్రత్యయం. 'అమహన్న పుంసకాలకు, అదంతాలకు' 'ము' వర్ణకం వస్తుంది అనే సూత్రాన్ననుసరించి వృక్షము - ఋక్షము, దైవము - కళత్రము అపత్యము అనే రూపాలు ఏర్పడ్డాయి. ఈ సూత్రం వల్ల మాముడి (మ కారం క్రింద వ్రాయబడే 'మ' కారం గుర్తు) వస్తుంది. వృక్షము అనే పదం చివర ఉన్న 'ము' ప్రత్యయానికి మావత్తు (-్మ) అదనంగా వచ్చి చేరడం వల్ల 'వృక్షమ్ము' అని అవుతుంది. పూర్ణ బిందు పూర్వకమైన బు వర్ణం (ంబు) 'ము' వర్ణానికి ఆదేశంగా వచ్చి 'వృక్షంబు' అనే రూపం ఏర్పడుతుంది. అదే విధంగా వృక్షమ్ములు, వృక్షంబులు అనే బహువచన రూపాలు గూడా ఏర్పడుతాయి.

7.1.5 సూత్రం : లు ల న లు పరంబులగునపు డొకానొకచో ముగాగమంబునకు లోపంబును దత్పూర్వ స్వరంబునకు దీర్ఘంబును విభాషనగు. (43 సూ.)

పద విభాగం : పరంబులు + అగునపుడు + ఒకానొకచో ముక్ + ఆగమమునకు లోపంబును తత్ + పూర్వ స్వరంబునకు దీర్ఘము + ను విభాష + అగు.

భావం : లు, ల, న అనేవి పరంగా వచ్చినపుడు 'ము' గాగమానికి లోపం దాని ముందున్న అచ్చుకు దీర్ఘం విభాషగ వస్తుంది.

ఉదా : వజ్రాలు - వజ్రాలను - వజ్రాన
పగడాలు - పగడాలను - పగడాన.

ఒకానొకచో ననుటచే నీ కార్యంబు నకుం బ్రయోగ వైరళ్యంబు సూచింపబడియె.

వివరణ : ప్రథమా విభక్తి బహువచన ప్రత్యయా 'లు'. బహుత్వంలో ద్వితీయాది విభక్తులకు ఆగమంగా వచ్చేది 'ల'. సప్తమి విభక్తి ప్రత్యయం 'న'. లు, ల, న అనేవి పరంగా ఉన్నప్పుడు వాని ముందున్న ఆగమ ముకారానికి లోపం, దాని ముందుండే అచ్చుకు దీర్ఘం వికల్పంగా వస్తాయి. వజ్రము + లు - ఇక్కడ 'లు' వర్ణకం పరంగా ఉండటం వల్ల దానికి ముందున్న 'ము' కారానికి లోపం వచ్చి దానికి ముందున్న 'జ్ర' అనే దానికి దీర్ఘం రావటం వల్ల 'వజ్రాలు' అనే రూపం ఏర్పడింది. ఈ విధంగా కాని పక్షంలో వజ్రములు - వజ్రములను - వజ్రమున అనే రూపాలుంటాయి. 'ఒకానొకచోట' అని అనటం వల్ల ఈ విధమైన ప్రక్రియ తప్పనిసరి కాదని భావం. 'పగడము' అనేది ఆచ్ఛిక శబ్దం బహుత్వంలో ఇది 'పగడములు' అవుతుంది. దీనికి ప్రస్తుత సూత్రం వల్ల 'ము' వర్ణ లోపం వచ్చి 'పగడలు' అయి 'ము' వర్ణానికి ముందున్న 'డ' అనుదానికి దీర్ఘం వచ్చి 'పగడాలు' అవుతుంది. పగడము + లను అనేది పగడాలను, పగడములను అని అవుతుంది. ముగాగమానికి ముందు 'అ' కారం లేకపోతే ఈ కార్యం రాదు. పున్నెములు, గేములు, పాములు మొదలైన చోటులంది 'ము' వర్ణానికి లోపం, దాని ముందున్న స్వరానికి దీర్ఘం రాదు. ముగాగమ లోపం, దాని పూర్వ స్వరానికి దీర్ఘం రెండు జంటగా విధింపబడ్డాయి. అందువల్ల ఈ కార్యం అయితే జంటగా అవుతుంది లేదా పూర్తిగా కాదు.

విశేషాంశాలు : 'ఒకానొకచో ననుటచే నీ కార్యంబునకు బ్రయోగ వైరళ్యంబు సూచింపబడియె'. ఇందులోని ఒకానొకచో అనేది 'లు ల న లు పరంబులగు నపుడొకానొకచో ముగాగమంబునకు లోపంబును దత్పూర్వ స్వరంబునకు దీర్ఘంబును విభాషనగు' అనే సూత్రంలోని 'ఒకానొకచో' అనే పదానికి సంబంధించింది. **43**వ సూత్రం లు ల న లు పరంగా ఉండగా వాటికి పూర్వంలో ఉన్న ముగాగమానికి లోపము, దానికి పూర్వంలో ఉన్న అచ్చుకు దీర్ఘం వస్తుంది అనే విషయాన్ని తెలుపుతుంది. ఇక్కడ ఒకానొకచో అనడం వల్ల ఈ విధమైన 'ముగాగమ లోపం' దాని 'పూర్వ స్వరానికి దీర్ఘం' అనేవి కవుల ప్రయోగాల్లో విరళంగా ఉన్నాయని చెప్పబడింది. విరళంగా అంటే చాల అరుదుగా అని అర్థం. వజ్రాలు, వజ్రాలను, వజ్రాన, పగడాలు, పగడాలను, పగడాన అనే విధంగా కార్యం జరిగిన రూపాలు కావ్యాలలో చాల తక్కువగా ఉన్నాయని సూచించటానికే 'ఒకానొకచో' అని వాడబడింది. వజ్రాలు, పగడాలు అనే లక్ష్యాలను బట్టి పూర్వ స్వరం హ్రస్వమైన అకారమే కావాలని అనటం చేత 'ముత్తెములు' వంటి పదాలలో ఈ విధమైన రూపాలు ఏర్పడవు. ముగాగమ లోపం, తత్పూర్వ స్వర దీర్ఘం రెండును జంటగా విధింపబడ్డాయి. ఇలాంటి వాటిని 'ఏకయోగ నిర్దిష్టా' లు అంటారు. "ఏకయోగ నిర్దిష్టానాం సహవా ప్రవృత్తిః సహవా నివృతిః" అనగా జంటగా విధింపబడిన కార్యాలు కలిసే ప్రవర్తిస్తై, మానితే కలిసే మానతాయి అని చెప్పబడింది.

**7.1.6** సూత్రం : ఇగ్లొరా యుగంతంబుల ప్రథమైక వచనంబునకు లోపంబగు. (**44** సూ.)

పద విభాగం : ఇక్ + గ్లౌ + రై + ఉగంతముల, ప్రథమ + ఏక వచనమునకు లోపము + అగు.

భావం : ఇకారాంతములకు, గ్లౌ, రై శబ్దములకు మఱి యుగాగమాంతంబులకుం బ్రథమైన వచన లోపం బగు.

ఉదా : హరి - గిరి - శ్రీ - ధీ

వివరణ : ఇకారాంతాలైన వాటికిని, గ్లౌ శబ్దానికి, రై శబ్దానికి ఉగాగమం అంతంలో ఉన్న శబ్దాలకు ప్రథమా విభక్తిలో ఏకవచన ప్రత్యయం లోపిస్తుంది. ప్రకృతి ప్రత్యయాల కలయికతోనే పదం ఏర్పడుతుంది. కేవలం ప్రకృతిని గాని ప్రత్యయాన్ని కాని 'పదం' అనకూడదు. సంస్కృతంలో 'సుప్తిఙన్తం పదం' అన్నారు. అనగా సుప్పులు గాని, తిఙ్‌లు చివరగా ఉండేవే 'పదం' అనబడతాయి. సుప్పులు 21. తిఙ్‌లలో ఆత్మనేపదులు 9, పరస్మైపదులు 9, మొత్తం 18. వీటి కలయికతో ఏర్పడేదే పదం. రామ+స్ అనే దాంట్లో 'రామ' నామ ధాతువు దేనికి 'స్' అనే ప్రత్యయం చేరి రామస్ అనే రూపం ఏర్పడింది. 'స్' విసర్గగా మారి 'రామః' అనే పదం ఏర్పడుతుంది. ఇదే తెలుగులో రామ అనే ప్రాతిపదిక మీద ప్రథమా విభక్తి ప్రత్యయమైన 'డు' అనేది జేరుతుంది. రామ - 'రాము' గా మారి 'డుఙ్' జేరి రాముండు - రాముడు అనే రూపాలు ఏర్పడుతాయి. హరి అనేది ఇదంతమైన ప్రాతిపదిక. దీనికి ప్రథమా విభక్తి ఏకవచనం పరంకాగా హరి + సు అని అవుతుంది. ఇకారాన్త ప్రథమైక వచనానికి లోపం రావడం వల్ల 'సు' అనేది లోపించి 'హరి' అనే రూపమే ఉంటుంది.

విశేషాంశాలు : తెలుగు వ్యాకరణంలో చెప్పబడని విషయాలు సంస్కృత వ్యాకరణ సూత్రాల ననుసరించి ఏర్పడతాయి. 'శ్రీ' ప్రాతిపదిక అయినపుడు 'సు' అనే సంస్కృత విభక్తి ప్రత్యయం చేరి శ్రీ + సు అవుతుంది. ఈ సూత్రం వల్ల 'సు' లోపించి 'శ్రీ' అనేదే పదంగా మిగులుతుంది. అదే విధంగా 'గ్లౌ' అనే ప్రాతిపదికకు డుఙ్ జేరి గ్లౌ + డుఙ్ కావలసియుండగా 'డుఙ్' లోపించి 'గ్లౌ' అనేదే పదంగా మిగులుతుంది. రుక్కు - రాట్టు - మరుత్తు అనేవి ఉగాగమాంతాలు. వీటికి 'వు' వర్ణకం కలగకుండా ఉండటానికే ఈ సూత్రం వల్ల ప్రథమైన వచన లోపం నిత్యంగా విధించబడింది.

7.1.7 సూత్రం : ఇత్తునకు బహువచనంబు పరంబగునపు డుత్వంబగు. (45 సూ.)

పద విభాగం : ఇత్తు (ఇ), పరంబు + అగునపుడు + ఉత్వము + అగు.

భావం : హ్రస్వమైన ఇకారానికి (ఇ) బహువచనం పరమైతే ఉత్వం వస్తుంది.

ఉదా : హరులు, గిరులు, కవులు, రవులు,
యామినులు, భామినులు
తపరకరణముచే దీర్ఘంబున కుత్వంబు లేదు.
శ్రీలు, స్త్రీలు, లకోరీలు.

వివరణ : నామవాచకాలకు చివరలో ఉన్న హ్రస్వమైన 'ఇ' కారానికి బహువచనం పరంగా ఉన్నప్పుడు ఉత్వం ఆదేశంగా వస్తుంది.

హరి + లు - ఇందులో 'హరి' అనేది హ్రస్వమైన 'ఇ' కారం అంతంలో ఉన్న పదం. దీనికి 'లు' అనే బహువచన ప్రత్యయం రాగా 'హరి' లో ఉన్న ఇకారానికి ఉకారం వచ్చి హర్ + ఉ + లు - హరులు అనే రూపం ఏర్పడుతుంది. 'గిరి' అనేది ఇదంతమైన అమహద్వచకం. బహువచన ప్రత్యయమైన 'లు' జేరగా గిర్ + లు - గిర్ + ఉ + లు అని 'గిరి' లో చివర ఉన్న ఇత్వానికి ఉత్వం వచ్చి 'గిరులు' అని ఏర్పడింది. ఇదే విధంగా కవులు, రవులు అనే శబ్దాలు గూడా.

విశేషాంశాలు : తపరకరణం అంటే 'త' కారాన్ని తరువాత చేర్చడం. ఇత్తునకు బహువచనంబు పరంబగునపు డుత్వంబగు' అనే సూత్రంలో ఇత్తు - ఇత్ అనే చోట హ్రస్వమైన ఇకారానికి పరంగా 'త' కారం చేర్చబడింది. దీనినే తపరకరణం అంటారు. 'తపరకరణా'నికి వివరణ పారిభాషిక పద వివరణలో చూడండి. తపరకరణం అనడం వల్ల 'త' కారం దేనికి తర్వాత చేర్చబడిందో ఆ వర్ణం ఒక్క దానికే ఆ శబ్దం తెలుపుతుంది. కాబట్టి ఇక్కడ 'ఇత్' అంటే హ్రస్వమైన ఇకాది ఒక్కటే అని అర్థం. దీర్ఘమైన ఇకారాన్ని (ఈ) ఇది బోధించదు. హరి లు - హరులు అని హ్రస్వ ఇకార రూపాలకే వర్తిస్తుంది కాని శ్రీ + లు - శ్రీలు, స్త్రీ + లు - స్త్రీలు, లకోరీ + లు - లకోరీలు ఆచ్ఛిక పదాలకు ఈ సూత్రం వర్తిస్తుంది.

పందిరి + లు - పందిరులు

సిరి + లు - సిరులు

లకోరీ + లు - ఇందులో దీర్ఘమైన ఇకారం ఉండడం వల్ల ఉకారం రాక లకోరీలు అనేగాని 'లకోరులు' అని కాదు.

7.1.8 సూత్రం : వికృతి యందికారాంతముల యుపోత్తమేత్వంబునకు బహువచనము పరంబగు నపుడుత్వంబగు. (46 సూ.)

పద విభాగం : వికృతియందు + ఇకార + అంతముల + ఉప + ఉపోత్తమ + ఇత్వంబునకు బహువచనము పరము + అగునపుడు + ఉత్వము + అగు.

భావం : అచ్చ తెలుగుకు చెందిన (ఆచ్ఛిక) ఇకారాంత శబ్దాల యొక్క ఉపోత్తమమైన ఇత్వానికి బహువచనం పరమైనపుడు 'ఉ'త్వం వస్తుంది.

ఉదా : ఇచట వికృతి శబ్దముచే సంస్కృత సమేతరంబు గ్రహింపవలయు. కలికి .. కలుకులు

ములికి - ములుకులు

చెలిమి - చెలుములు

బలిమి - బలుములు

ఉపోత్త మేత్వంబున కనుటంజేసి జిగి, నిసి ఇత్యాదులందుత్వంబు లేదు. జిగులు, నిసులు.

వివరణ : 'ప్రకృతి' - సంస్కృత శబ్దాలు. 'వికృతి' సంస్కృత సమమైన (తత్సమ) పదాలకు భిన్నమైన పదాలు. 'ఉపోత్తమేత్వము' అంటే పదం యొక్క చివర ఉన్న ఇత్వానికి ముందున్న ఇత్వం. ఉప + ఉత్తమ - ఉపోత్తమ 'ఉప' అనగా సమీపం. ఉత్తమం అంటే మూడు అక్షరాలు గల శబ్దంలో చివరి అచ్చు. దాని సమీపంలో ఉండే అచ్చు ఉపోత్తమం. ఉదాహరణ - కలికి - ఈ శబ్దంలో చివరి అచ్చు కి (క్ + ఇ) లోని 'ఇ' కారం. ఇది ఉత్తమం. దీని సమీపంలో ఉన్న అచ్చు 'లి' (ల్ + ఇ) లోని ఇ కారం. కాబట్టి 'లి' లో ఉన్న 'ఇ' కారం ఉపోత్తమం. 'కి' - ఉత్తమం, 'లి' - ఉపోత్తమం. మూడు అక్షరాలకు తక్కువ అక్షరాలున్న శబ్దాలలో ఉపోత్తమ వ్యవహారం ఉండదు. జిగి, నిసి అనేవి రెండక్షరాల శబ్దాలు. వీటిలో ఉపోత్తమ వ్యవహారం లేదు. మూడక్షరాల కంటే ఎక్కువ ఉన్న శబ్దాలలో ఉపోత్తమ వ్యవహారం ఉంటుంది. 'పిడికిలి' శబ్దంలో చివరి అచ్చు ఉత్తమం. దాని సమీపంలోని అచ్చు ఉపోత్తమం.

'కలికి' అనేది ఇకారాంత శబ్దం. 'లి' అనే అక్షరంలోని ఇత్వం ఉపోత్తమేత్వం. బహుత్వంలో 'లు' వర్ణం పరమై కలికి + లు అవుతుంది. ప్రస్తుత సూత్రాన్నుసరించి కలుకి + లు అవుతుంది. 'ఇత్తునకు బహువచనంబు పరంబగునపు డుత్వంబగు' అనే 45వ సూత్రాన్నుసరించి 'కి' అనేది 'కు' గా మిరి కలుకు + లు - కలుకులు అవుతుంది. ఇదే విధంగా -

ములికి + లు - ములుకులు
చెలిమి + లు - చెలుములు
బలిమి + లు - బలుములు

అనే రూపాలు ఏర్పడతాయి.

'జిగి' అనే శబ్దంలో రెండు అక్షరములు మాత్రమే ఉన్నాయి. జిగి అంటే కాంతి అని అర్థం. రెండక్షరాలే ఉండటం వల్ల ఈ సూత్రం రాదు. 45వ సూత్రాన్నుసరించి 'జిగి' లోని 'గి' లోని ఇత్వానికి ఉత్వం వచ్చి 'జిగులు' అని అవుతుంది. నిసి - నిసులు అవుతుంది.

విశేషాంశాలు : 'వికృతి' యందు అని ఈ సూత్రంలో అనడం వల్ల సంస్కృత సమాల విషయంలో ఈ కార్యం రాదు.

యామిని + లు - యామినులు అవుతుంది.

'ఇకారాంతముల' అనటం వల్ల ఇకారాంతాలు కాని పదాల విషయంలో ఈ సూత్రం వర్తించదు. ఉలివు + లు - ఉలివులు, తలిరు + లు - తలిరులు అవుతాయి.

7.1.9 సూత్రం : రలడోపధ నవార్థాతుల యుపోత్తమేత్వంబున కుత్వంబు గలుగదు. (47 సూ.)

పద విభాగం : ర, ల, డ + ఉపధ నవ + అర్థ + ఆదుల , ఉప + ఉత్తమ + ఇత్వమునకు + ఉత్వము కలుగదు.

భావం : ఉపధా స్థానంలో ర ల డ అనే వర్ణాలలో దేనిని కలిగి యున్నను, తొమ్మిది మొదలైన పదముల ఉపోత్త మేత్వానికి ఉత్వం రాదు.

ఉదా : పందిరి - పందిరులు
పిడికిలి - పిడికిళులు
రాపిడి - రాపిడులు
తొమ్మిది - తొమ్మిదులు

వివరణ : 'ఇత్తునకు బహువచనంబు పరంబగునపు డుత్వంబగు' అనియు, 'వికృతి యందికారాంతముల యపోత్తమేత్వంబునకు బహువచనము పరంబగునపుడుత్వంబగు' అనే సూత్రాల వల్ల కలికి - కలుకులు, ములికి - ములుకులు, చెలిమి - చెలుములు, బలిమి - బలుములు, రూపాలేర్పడ్డాయి. ఉపోత్తమేత్వాలకు ఉత్వం నిత్యంగా రాగా ప్రస్తుత సూత్రంలో ర - ల - డ అనేవి ఉపథగా ఉన్న పదాలకు, తొమ్మిది మొదలైన పదాల యొక్క ఉపోత్తమేత్వానికి బహువచనం పరమైనపుడు 'ఉ'త్వం రాదని నిషేధింపబడింది.

'పందిరి' అనే పదంలో 'ర' ఉపధ. ర్ + ఇ - రి - ఇందలి. 'ఇ' కారం చివరి అచ్చు. దీనికి ముందున్న

ర్ (రేఫం) ఉపధ. పూర్వ సూత్రాల ననుసరించి పందిర్ + ఉ + లు - పందిరులు అనే రూపం సిద్ధిస్తుందే కాని 'పందురులు' అనే రూపం రాదు. 'పిడికిలి' అనేది వికృతి పదం మరియు ఇత్ అంతంలో కలది. ఇక్కడ 'ల' కారం ఉపధ. కాబట్టి ఉపోత్తమేత్వానికి ఉత్వం రాకపోవటం చేత 'పిడికిళులు' అని చివరి 'ఇ' త్వం మాత్రమే ఉత్వాన్ని పొందింది. 'పిడికుళులు' అని రూపం రాదు. తొమ్మిది అనే పదం గూడా బహువచనం పరమైనప్పుడు తుది ఇత్వం మాత్రమే 'ఉ' త్వాన్ని పొంది 'తొమ్మిదులు' అనే రూపమే ఏర్పడుతుంది. ఎనిమిది - ఎనిమిదులు అని అవుతుంది.

7.1.10 సూత్రం : ఉకారాంత గోశబ్దంబుల కంతట వు వర్ణకం బగు. (48 సూ.)

పద విభాగం : ఉకార + అంత గోశబ్దములకు + అంతట 'వు' వర్ణకము + అగు.

భావం : ఉకారాన్త శబ్దాలకు, గోశబ్దానికి ప్రథమా విభక్తి ఏకవచనంలో 'వు' వర్ణకం వస్తుంది.

ఉదా : తరువు - ధేనువు
మధువు - గోవు
అంతట ననుట స్త్రీ లింగ ప్రథమై కవచన లోప బోదనార్థము.

వివరణ : ఈ సూత్రంలో 'అంతట' అనే శబ్దానికి ఒక ప్రయోజనం ఉంది. బాల వ్యాకరణం 57వ సూత్రం "స్త్రీ లింగంబుల ప్రథమైక వచనంబు నకు లోపంబగు" అనే దాన్ని అనుసరించి ప్రథమా విభక్తి ఏకవచనానికి లోపం రావలసి ఉంటుంది. స్త్రీ లింగాలైన ఉకారాంతాలకు ప్రథమా విభక్తి ఏకవచన లోపం జరుగరాదు. అందువలననే 'అంతట' అని తెలుపబడినది.

తరు - ఇది ఉదంత పుంలింగ నామం (తర్ + ఉ) అమహద్వాచకం. ప్రస్తుత సూత్రం వల్ల తరు + వు అని 'వు' వర్ణకం చేరి 'తరువు' అనే రూపం ఏర్పడింది. 'ధేను - ఇది ఉదంతమైన స్త్రీ లింగం, అమహద్వాచకం. 57వ సూత్రాననుసరించి ప్రథమా విభక్తి ఏకవచనానికి లోపం రావలసి ఉండగా అది నిషేధింపబడి 'ధేనువు' అనే రూపం ఏర్పడింది.

'మధు' - ఇది ఉదంత నపుంసక శబ్దం మరియు అమహద్వాచకం. దీనికి 'వు' వర్ణకం వచ్చి మధు + వు - మధువు అయింది.

'గో' - ఇది సంస్కృత నామవాచకం దీనికి 'వు' ప్రత్యయం వచ్చి గో + వు - గోవు అయింది.

విశేషాంశాలు : 'గో' అనే శబ్దానికి పుంలింగంలో ఆదిత్యుడు, వృషభము, ఒకానొక ఋషి, గుఱ్ఱము అనే అర్థాలుండగా స్త్రీ లింగంలో భూమి, ఆవు వంటి అర్థాలున్నాయి. అందువల్ల 'గో శబ్దంబునకు' అనటం వల్ల స్త్రీ లింగ మయేటప్పుడు, పులింగమయినపుడు గో శబ్దానికి 'వు' వర్ణకం వస్తుంది. 'ఉకారాంత' అనటం వల్ల దీర్ఘమైన ఉకారం అంతంలో ఉన్న పదాలకు గూడా 'వు' వర్ణకం వస్తుంది. భ్రూ + వు - భ్రూవు.

7.1.11 సూత్రం : వు వర్ణకేతర విభక్తి పరమగుచే నుకారాంతంబులకు బహుళంబుగా గో శబ్దంబునకు నిత్యంబుగా వుగాగమంబగు. (49 సూ.)

పద విభాగం : వు వర్ణక + ఇతర విభక్తి పరము + అగుచోన్ + ఉకార + అంతంబులకు బహుళము + గా, గో

శబ్దమునకు నిత్యముగా వుక్ + ఆగమము + అగు.

భావం : ఉకారాంతాలకు 'వు' వర్ణకం కాకుండా ఇతర విభక్తి ప్రత్యయాలు పరమైనపుడు బహుళంగా వుగాగమం వస్తుంది. గో శబ్దానికి వుగాగమం నిత్యంగా వస్తుంది.

వివరణ : ఉకారాంతాలకు ప్రథమా విభక్తి ఏకవచనంలో తప్ప తక్కిన ఇతర విభక్తుల ఏకవచన బహువచనములు పరమైనపుడు 'వు' గాగమం వికల్పంగాను, గో శబ్దానికి నిత్యంగాను వస్తుంది.

తరు + లు - ఇందు 'తరు' (తర్ + ఉ) ఉ కారాంతం. దీనికి బహువచన ప్రత్యయమైన 'లు' వర్ణకం పరంగా 'తరు' అనే ప్రకృతికి 'వు' వర్ణకం ఆగమంగా రాగా తరు + వు + లు - తరువులు అనే రూపం సిద్ధిస్తుంది. వుగాగం వికల్పం కాబట్టి 'తరులు' అనే రూపం గూడా ఉంటుంది. ఇదే విధంగా 'తరువులను' 'తరులను' 'తరువుచేత' - 'తరుచేత' మొదలైన ఇతర విభక్తి ప్రత్యయాలతో కూడిన రూపాలేర్పడతాయి.

ధేను + లు - దేను + వు + లు - ధేనువులు, ధేనులు.

గోవులు - 'గో' ప్రాతిపదిక. బహువచనంలో 'లు' వర్ణకం చేరి గో + లు - గోలు, ఈ 49వ సూత్రంచే గో + వు + లు - గోవులు.

విశేషాంశాలు : గోవు, తరువు, ధేనువు, అనే ఏకవచన రూపములలో 'వు' ప్రత్యయము. తరువులు, గోవులు, ధేనువులు అనే పదాలలోని 'వు' ఆగమము. 'వు' వర్ణకేతర విభక్తి' అనటంవల్ల ప్రథమా విభక్తి ఏకవచనంలో 'వు' వర్ణకంతో కలిసి యుండే 'ఉ' కారాంతాలకు 'వు' ఆగమంగా వస్తుందని గ్రహించాలి. చిగురు + లు అని ఉన్నప్పుడు ప్రథమా విభక్తి ఏకవచనంలో 'చిగురువు' అని ఉన్నప్పుడు ప్రథమా విభక్తి ఏకవచనంలో 'చిగురువు' అని రూపం ఉండదు కాబట్టి చిగురు + లు - చిగురులు అనే రూపం ఉంటుంది కాని 'చిగురువులు' అని ఉండదు.

7.1.12 సూత్రం : ఉ కారాంతంబగు మహత్తునకు వు వర్ణకము బహుళముగా నగు. (50 సూ.)

పద విభాగం : 'ఉ' కారము + అంతము + అగు + బహుళముగాన్ + అగు.

భావం : మహద్వాచకమై ఉకారాంతమైన నామవాచకానికి ప్రథమా విభక్తి ఏకవచనమైన 'వు' అనే ప్రత్యయం వస్తుంది.

ఉదాహరణ : విష్ణువు - విష్ణుడు
శంభువు - శంభుడు
వసువు - వసుడు

వివరణ : "ఉకారాంత గో శబ్దంబుల కంతట వు వర్ణకం బగు" అనే సూత్రాన్ని అనుసరించి 'విష్ణు' 'శంభు' 'వసు' మొదలైన 'ఉదంత (ఉ - చివర గల) నామ వాచక శబ్దాలకు విష్ణువు, శంభువు, వసువు అనే రూపాలు మాత్రమే రావలసి ఉండగా ఈ సూత్రం వల్ల విష్ణుడు, శంభుడు, వసుడు అనే రూపాలు గూడా ఏర్పడతాయి.

విశేషాంశాలు : 'విష్ణు' అనేది ఉదంతం, మహద్వాచకం. దీనికి 'వు' అనే ప్రథమా విభక్తి ఏకవచన ప్రత్యయం వచ్చి విష్ణు + వు - విష్ణువు అయింది. ప్రస్తుత సూత్రంలో 'వు వర్ణకము బహుళముగా నగు' అని ఉండటం చేత 'వు' వర్ణకం లేకుండా ఉన్నప్పుడు "పుంలింగమగు మహద్వాచకమునకు డు జ్ఞ గు అనే సూత్రాన్ని అనుసరించి బిందు పూర్వక డు వర్ణకం (డుజ్ - 'ండు') వచ్చి విష్ణుండు - విష్ణుఁడు - విష్ణుడు అనే రూపం గూడా ఏర్పడుతుంది. మను, దను మొదలైన ఉదంత మహద్వాచకాలకు 'వు' ప్రత్యయం నిత్యంగా వచ్చి మనువు, దనువు అనే రూపాలే ఏర్పడతాయి. కాని మనుడు, దనుడు అని రూపాలేర్పడవు.

7.1.13 సూత్రం : కద్రువ నాగమాత. (51 సూ.)

ఉదాహరణ : కద్రువ - కద్రువలు
కద్రువను - కద్రువలను

వివరణ : కద్రువ అనే పదం సర్ప జాతికి తల్లి యొక్క పేరు. సంస్కృత భాషలో 'కద్రు' అని ఒక శబ్దం, కద్రూ అని మరొక శబ్దం ఉన్నాయి. మొదటిది పుంలింగ శబ్దం. దీనికి గోరోచన వర్ణమని అర్థం. రెండవదైన 'కద్రూ' అనేది ఊకారాన్త స్త్రీ లింగ శబ్దం దీనికి నాగమాత అని అర్థం. తెలుగు భాషలో కద్రు, కద్రూ అనే రెండు రూపాలకు 'వు' ప్రత్యయం వచ్చి కద్రువు, కద్రూవు అనే రూపాలు వస్తాయి. కద్రూ శబ్దంలో చివర ఉన్న 'ఊ' కారం హ్రస్వగామాః 'వు' వర్ణకం చేరి కద్రువు అనే అవుతుంది. పూర్వ సూత్రాల ననుసరించి 'కద్రువు' అనే రూపమే ఏర్పడుతుండగా 'కద్రువ' అనే రూపాన్ని ఈ సూత్రం ద్వారా ప్రకటించడం జరిగింది. నాగమాత అనే అర్థంలో 'కద్రువ' అనేదే తత్సమ రూపంగా గ్రహించాలి. ఇతర విభక్తులతో కలిసినప్పుడు కద్రువను, కద్రువతో కద్రువలను - కద్రువలతో వంటి రూపాలే ఏర్పడతాయి.

విశేషాంశాలు : కవి ప్రయోగాల్లో 'కద్రువు' అని కాకుండా 'కద్రువ' అనే కనబడుతుంది. ఈ రూపాన్ని సాధించటానికై ప్రత్యేకించి 'కద్రువ నాగమాత' అని సూత్రీకరించి 'కద్రువు' అని కాకుండా 'కద్రువ' అని చెప్పడం జరిగింది. దీనినే నిపాతము అంటారు. పారిభాషిక పద వివరణలో 'నిపాత' వివరణ చూడండి. వ్యాకరణ నియమాలని బట్టి ఒక రూపం ఏర్పడుతుండగా మరొక విధంగా ఉండే రూపాన్ని నియమించటాన్ని 'నిపాత' అంటారు.

7.1.14 సూత్రం : ఋ కారాంతంబున కత్వంబును స్త్రీవద్భావంబు నగు. (52 సూ.)

పద విభాగం : ఋ కార + అంతమునకు + అత్వమును స్త్రీవత్ + భావమును + అగు.

భావం : ఋకారంతో అంతమయ్యే శబ్దాల యొక్క చివరనున్న ఋ కారానికి బదులు అత్వం వచ్చి స్త్రీ తుల్యత్వం కలుగుతుంది.

ఉదాహరణ : భ్రాత - జామాత
కర్త - భర్త
హర్త - గంత
హంత

వివరణ : 'ఋ' కారం అంతంగా ఉండే పదాలలోని చివరి 'ఋ' కారానికి 'అ' కారం ఆదేశంగా వస్తుంది. ఆ విధంగా అకారం ఆదేశంగా వచ్చిన పదాలు స్త్రీ లింగముల వంటివి అవుతాయి. స్త్రీ వద్భావము అంటే స్త్రీ లింగ శబ్దంతో సమానం అవటం.

'భ్రాతృ' అనేది ఋ కారం అంతమందు గల శబ్దం. భ్రా + త్ + ఋ అనే చోట 'ఋ' త్వానికి 'అ' త్వం రాగా భ్రా + త్ + అ - 'భ్రాత' అని అవుతుంది. స్త్రీ లింగ తుల్యత్వం వలన ఉత్వ, డుజ్ణలు రావు. అంటే 'భ్రాత్రుడు' అనే రూపం ఏర్పడదు. సంస్కృతంలో భ్రాత + సు అని ఏర్పడి 'సు' ప్రత్యయ లోపించి 'భ్రాత' అనే రూపం మిగులుతుంది. ఇదే విధంగా జామాత, కర్త, భర్త, హర్త, గంత, హంత అనే రూపాలు ఏర్పడతాయి.

విశేషాంశాలు : ప్రస్తుత సూత్రంలో ఉదాహరణగా పుంలింగ శబ్దాలు మాత్రమే చూపబడ్డాయి. మాతృ - దుహితృ వంటి స్త్రీ లింగ శబ్దాలు మాత - దుహితగ అవుతాయి.

7.1.15 సూత్రం : విధాతృ ధాతృ సవితృ నేతృ శబ్దంబుల మహత్తుల కత్వ స్త్రీ వద్భావంబులు విభాష నగు. (53 సూ.)

పద విభాగం : మహత్తులకు + అత్వ + స్త్రీవత్ + భావములు + విభాష + అగు.

భావం : మహద్వాచము లైనప్పుడు విధాతృ, ధాతృ, సవితృ, నేతృ అనే అయిదు శబ్దాలకు అత్వం, స్త్రీవద్భావం విభాషగా అవుతుంది.

ఉదాహరణ : విధాత - విధాతృడు
ధాత - ధాతృడు
దాత - దాతృడు
సవిత - సవితృడు
నేత - నేతృడు

వివరణ : విధాతృ, ధాతృ, సవితృ, నేతృ అనేవి మహద్వాచకాలు, ఋ కారాంత శబ్దాలు. వీటిలోని ఋ కారానికి 'అ' త్వం మరియు స్త్రీ లింగ తుల్యత్వం విభాషగ వస్తాయి. 'విధాతృ' అనేది ఋ వర్ణం అంతలో ఉన్న పుంలింగ శబ్దం. దీని చివరి 'ఋ' త్వానికి అత్వం వచ్చి ప్రథమా విభక్తి ఏకవచన ప్రత్యయం లోపించగా 'విధాత' అని అవుతుంది. అత్వము, స్త్రీ వద్భావము రాకపోతే 'పుంలింగమగు మహద్వాచకమునకు డుజ్ణగు' అనే 22వ సూత్రాన్ననుసరించి 'విధాతృడు' అనే రూపం వస్తుంది. ద్వితీయాది విభక్తులు పరమైనప్పుడు 'ని' గాగమం వచ్చి విధాతృనిని, విధాతృని చేత, విధాతృని కొఱకు వంటి రూపాలేర్పడతాయి.

విశేషాంశాలు : అత్వము, స్త్రీవద్భావము రెండు వస్తే కలిసే వస్తాయి లేదా రెండూ రావు. సూత్రంలో 'మహత్తులకు' అనడం వల్ల అమహత్వంలో అత్వం, స్త్రీవద్భావం నిత్యంగానే అవుతుందని అర్థం.

7.1.16 సూత్రం : నామంబుల తుది దీర్ఘంబునకు హ్రస్వంబగు. (54 సూ.)

పద విభాగం : నామము + ల తుది దీర్ఘము + నకు, హ్రస్వము + అగు.

భావం : దీర్ఘము చివరి యందు గల ప్రాతిపదికల యొక్క చివర నున్న దీర్ఘానికి హ్రస్వం వస్తుంది.

ఉదాహరణ : రమా - రమ
వనితా - వనిత
విద్యా - విద్య
లక్ష్మీ - లక్ష్మి
సేనానీ - సేనాని

ఇట్లు కృత హ్రస్వములకు హ్రస్వాంతములకు బోలె గార్యంబగు. లక్ష్ములు - సేనానులు - సిరులు.

వివరణ : 'నామం' అంటే ప్రాతిపదిక. 21వ సూత్రం చూడండి. ప్రత్యయం చేరని ప్రకృతిని ప్రాతిపదిక అంటారు. 'రమా' అనేది ప్రాతిపదిక ఈ సూత్రం వల్ల 'రమా' అన్న దీర్ఘాంత శబ్దం 'రమ' అని హ్రస్వాంతంగా మారుతుంది. 'రమా' అనేది ఆకారాంత స్త్రీ లింగ శబ్దం. 'స్త్రీ లింగంబుల ప్రథమైక వచనంబునకు లోపంబగు' అనే నియమం వల్ల రమ + సు అని ఉండగా 'సు' లోపించి 'రమ' అని మిగులుతుంది. 'సు' అనేది సంస్కృత భాషలో ప్రథమా విభక్తి ఏకవచన ప్రత్యయం. తెలుగులో ప్రథమా విభక్తి ప్రత్యయం 'ము'. రమ + ము - 57వ సూత్రంచే 'ము' వర్ణకం లోపించి 'రమ' అని ప్రథమైన వచన రూపం ఏర్పడుతుంది.

విశేషాంశాలు : 'కృతహ్రస్వములు' అంటే చేయబడిన హ్రస్వము గలవి అని అర్థం. దీర్ఘాంతంగా ఉండి వ్యాకరణంచే హ్రస్వంగా మారినది కృత హ్రస్వం. 'రమా' అనేది ఈ సూత్రం వల్ల 'రమ' అని కృత హ్రస్వంగా మారింది. వనిత, విద్య, లక్ష్మి, సేనాని అనేవి కృతహ్రస్వాలు. బహువచనంలో లక్ష్మీ + లు, లక్ష్మి + లు - 45వ సూత్రంచే 'లక్ష్ములు' అదే విధంగా సేనానులు, సిరులు వంటి రూపాలేర్పడతాయి.

7.1.17 సూత్రం : ఏకాక్షరంబులకు హ్రస్వంబు లేదు. (55 సూ.)

పద విభాగం : ఏక + అక్షరము + లకు, హ్రస్వము + లేదు.

భావం : ఏకాక్షరాలైన నామాలకున్న దీర్ఘం హ్రస్వం కాదు.

ఉదాహరణ : క్ష్మా - మా - భా - శ్రీ - స్త్రీ - హ్రీ - ధీ
భీ - భ్రూవు

వివరణ : 54వ సూత్రాన్ననుసరించి దీర్ఘానికి హ్రస్వం రావలసి ఉండగా ఒక్కటే అచ్చుగా ఉన్న ప్రాతిపదిక దీర్ఘానికి హ్రస్వం రాదని నియంత్రించబడింది. 'క్ష్మా' అనేది దీర్ఘాంతం. ఒకే అక్షరం. దీనికి హ్రస్వం రాదు. స్త్రీ లింగ శబ్దం అవడం వల్ల ప్రథమా విభక్తి ఏకవచనానికి లోపం వస్తుంది. క్ష్మా + సు - దీనిలో 'సు' లోపించి 'క్ష్మా' అనే మిగులుతుంది. 'క్ష్మా' అంటే భూమి. 'భ్రూ' అనేది ఊ కారాంత శబ్దం. ఏకాక్షరం. 'ఉకారాంత గోశబ్దంబుల కంతట వువర్ణకంబగు అనే సూత్రం వల్ల 'భ్రూవు' అవుతుంది. దీనికి భ్రుకుటి లేదా కనుబొమ్మ అని అర్థం.

విశేషాంశాలు : 'క్ష్మా' అనేది ఒక్కటే అక్షరం. దీంట్లో క్, ష్, మ్, ఆ అనే నాలుగు వర్ణాలున్నాయి. వర్ణాలను బట్టి

చూస్తే నాలుగు వర్ణాలున్నప్పటికి ఇది ఒకే అక్షరంగా గ్రహించాలి.

7.1.18 సూత్రం : వృద్ధాదుల డుజ్ఞు నకు లోపము విభాషనగు. (56 సూ.)

పద విభాగం : వృద్ధ + ఆదుల.

భావం : 'వృద్ధ' మొదలైన శబ్దాల యొక్క 'డుజ్' వర్ణకానికి విభాషగ లోపం వస్తుంది.

ఉదాహరణ : వృద్ధు - వృద్ధుడు
మూర్ఖు - మూర్ఖుడు
నీచు - నీచుడు
గృహస్థు - గృహస్థుడు
చార్వాకు - చార్వాకుడు

వివరణ : 'వృద్ధ' అనేది 'అదంత (అత్ + అంత) పుంలింగ శబ్దం. దీనికి 'పుంలింగంబయి మహద్వాచకం బయిన నామంబు తుది యత్వంబున కుత్వంబగు అనే 21వ సూత్రాన్ననుసరించి ఉత్వం వచ్చి వృద్ధ + ఉ - వృద్ధు అనే రూప ఏర్పడుతుంది. "పుంలింగమగు మహద్వాచకమునకు డుజ్ఞగు" అనే సూత్రాన్ని బట్టి వృద్ధు + డుజ్ - వృద్ధుడు అనే రూపం అవుతుంది. 'డు వర్ణక లోపం వికల్పం కాబట్టి 'వృద్ధు' అనే రూపం గూడా వుంటుంది.

విశేషాంశాలు : ఉత్వం 21 సూత్రం చేత, డుజ్ఞా 22వ సూత్రం చేత విడిగా విధింపబడ్డాయి. కాబట్టి 'డుజ్ఞు' లోపించినప్పటికి ఉత్వం ఉంటుంది. వృద్ధుడు - వృద్ధు.

7.1.19 సూత్రం : స్త్రీ లింగంబుల ప్రథమైక వచనంబునకు లోపంబగు. (57 సూ.)

పద విభాగం : స్త్రీ లింగముల + ప్రథమ + ఏకవచనము + నకు + లోపము + అగు.

భావం : స్త్రీ లింగ శబ్దాల ప్రథమా విభక్తి ఏకవచనానికి లోపం వస్తుంది.

ఉదాహరణ : రమ, క్షమ, వనిత, ఘనత
విద్య, దేవత, మీన నేత్ర

వివరణ : 'రమా' అనేది ఆకారాంత స్త్రీ లింగ శబ్దం. 'నామంబుల తుది దీర్ఘంబునకు హ్రస్వంబగు' అనే నియమాన్ని బట్టి 'రమ' అవుతుంది. దీనికి ప్రథమా విభక్తి ఏకవచన ప్రత్యమైన 'సు' (సంస్కృత భాషలో) అనేది పరంగా వచ్చి రమ + సు అని అయి సు విభక్తి లోపించగా 'రమ' అనే రూపం మిగిలుతుంది.

విశేషాంశాలు : 'ఉ' కారాంతాలైన శబ్దాలకు 'వు' వర్ణకం రావడం చేత అది లోపాన్ని పొందక 'వధువు', 'ధేనువు' వంటి రూపాలు ప్రథమా విభక్తి ప్రత్యయంతోనే ఉంటాయి.

7.1.20 సూత్రం : చరిత్రాదుల ము వర్ణకంబునకు లోపంబు బహుళంబుగా నగు. (58 సూ.)

పద విభాగం : చరిత్ర + ఆదులు.

ఉదాహరణ : చరిత్ర - చరిత్రము
చరిత - చరితము

అలక, అభిలాష, అక్షత, ఘోష, తరంగ, భ్రమ, విజృంభణ, వధ, వేగ, స్ఫురణ, హంస - ఇత్యాదులు చరిత్రాదులు. బాహుళకము వలన దర్భాదులకు ము లోపంబు నిత్యంబు. దర్భ, పనస ఇత్యాదులు.

వివరణ : చరిత్ర మొదలైనవి చరిత్రాదులు. 'ము' వర్ణకం ప్రథమా విభక్తి ఏకవచనం. చరిత్ర - చరిత అనేవి అదంతాలైన నపుంసక నామాలు. 'అమహన్నపుంసకముల కదంతములకు ము వర్ణకంబగు అను సూత్రాన్ని బట్టి చరిత్రము - చరితము అనే రూపాలు వస్తాయి. ప్రస్తుత సూత్రం వల్ల 'ము' వర్ణకానికి లోపం వచ్చి 'చరిత్ర', 'చరిత' అనే రూపాలేర్పడతాయి. 'ఇత్యాదులు చరిత్రాదులు' అనడం వల్ల ఇలాంటి రూపాలే మరికొన్ని ఉన్నాయని అర్థం. 'కుశ' శబ్దం, కుశము, కుశములు, కుశమును, కుశములను అని 'ము' వర్ణకం ఉన్న రూపాలతో ఉంటుంది. 'దర్భ' అనేది అదంత పుంలింగ శబ్దం. అమహద్వాచకం. సూత్రంలో 'బహుళంబుగా నగు' అని అనడం చేత 'ము' లోపం నిత్యంగా వచ్చి 'దర్భ' అనే ఉంటుంది.

విశేషాంశాలు : 'చరిత్రాదులు' అనడం చేత చరిత్ర మొదలైన వాటిలో చేరని శబ్దాలకు ఈ లోపం రాదని సూచన. 'వృక్షము' లో 'ము' లోపించదు. 'పనసము' అని కాక 'పనస' అని 'ము' వర్ణకం లోపించిన శబ్దాలే ఏర్పడతాయి.

7.1.21 సూత్రం : స్వర్గవాచి దేవసుర శబ్దంబు లేకత్వ బహుత్వంబులం బ్రయోగింపంబడు. (59 సూ.)

పద విభాగం : శబ్దములు + ఏకత్వ + బహుత్వముల + ప్రయోగింపబడు.

భావం : స్వర్గానికి సంబంధించిన వారిని గురించి చెప్పేది స్వర్గవాచి. స్వర్గవాచియైన దేవ శబ్దాన్ని ఏకవచనం గానే ప్రయోగించాలి. 'సుర' శబ్దాన్ని బహుత్వంలోనే ప్రయోగించాలి.

ఉదాహరణ : దేవుడు - సకల సురులు.

స్వర్గవాచి యనుటచే భూదేవులు, భూసురుడను ప్రయోగంబుల బాధితంబులయ్యె.

వివరణ : స్వర్గవాచి అంటే స్వర్గంలో ఉన్న వారిని తెలిపేది. 'ఏకత్వం' అంటే ఏకవచనంతో అని, బహుత్వం అంటే బహువచనం అని అర్థం. దేవ అనే ప్రాతిపదిక దేవుడు అవుతుంది. ప్రథమా విభక్తి ఏకవచన రూపం 'దేవుడు' అని కాగా ఇతర విభక్తులలో దేవుని చేత, దేవుని వలన .. వంటి రూపాలు ఏర్పడతాయి.

'సుర' అనే పుంలింగ ప్రాతిపదికకు ప్రస్తుత సూత్రం చేత బహువచనమే వచ్చి సురలను - సురలచేత వంటి రూపాలు ఏర్పడతాయి. 'స్వర్గవాచి' అనడం చేత స్వర్గంలో ఉన్నవారు కాకుండా ఇతరులను బోధించే పక్షంలో ఈ నియమము లేదు.

భూదేవుడు - భూదేవులు - భూసురుడు - భూసురులు.

విశేషాంశాలు : 'బహుత్వ' అనటం చేత 'సుర శబ్దం ఏకత్వార్థంలో అంటే ఏకవచనంలో ప్రయోగించరాదు. అంటే సుర - సురను వంటి ఏక వచనాంత రూపాలుండవు.

7.1.22 సూత్రం : సుర శబ్దంబు నిత్యంబుగా నసుర శబ్దము వైకల్పికముగా స్త్రీ తుల్యంబులగు. సంస్కృత సమాసంబున గావు. (60 సూ.)

పద విభాగం : సురశబ్దము + నిత్యముగా + అసురశబ్దము.

భావం : 'సుర' అనే శబ్దం నిత్యంగా స్త్రీ తుల్యం అవుతుందని, 'అసుర' శబ్దం వైకల్పికంగా స్త్రీ తుల్యత్వాన్ని పొందుతాయని, ఈ రెండు శబ్దాలు సంస్కృత సమాసంలో స్త్రీ తుల్యత్వాన్ని పొందవని భావం.

ఉదాహరణ : సురలు - అసుర - అసురుడు.
నిఖిలసురులు - రావణాసురుడు.
ఎల్లసురలు - ఎల్లయసురులు.

వివరణ : 'సుర' శబ్ద సంస్కృతంలో ఆకారాంతం, నిత్య బహువచనాంతమైన పుంలింగ శబ్దం. 'సురాః' అనేది దాని రూపం 'సుర' ప్రాతిపదిక. స్త్రీ లింగ తుల్యత వలన ఉత్వం రాదు. సుర శబ్దానికి ఏకవచన రూప లేదు కనుక 'సురలు' అవుతుంది. 'అసుర' శబ్దానికి స్త్రీ లింగ తుల్యత వికల్పం అవడం వల్ల 'అసురుడు' అనే రూపం ఏర్పడుతుంది. 'రావణాసుర' ప్రాతిపదికలో స్త్రీ లింగ తుల్యత లేకపోవడం వల్ల 'రావణాసురుడు' అవుతుంది. సంస్కృత సమాసం కానప్పుడు 'సుర' శబ్దం నిత్యంగా, అసుర శబ్దం వైకల్పికంగా స్త్రీ లింగ తుల్యాలౌతాయి. 'ఎల్ల సురలు', 'ఎల్లయసురులు' అవుతాయి.

7.1.23 సూత్రం : దూతాదులకు స్త్రీత్వంబు బహుళంబుగ నగు. (61 సూ.)

పద విభాగం : దూత + ఆదులకు.

ఉదాహరణ : దూత - దూతుడు, యోధ - యోధుడు, శుంఠ - శుంఠుడు. బహుళ గ్రహణముచే నమహత్వంబునందు స్త్రీత్వంబు నిత్యంబు.
సింగంబు దూత యగు జంబుకంబు.

వివరణ : 'దూత' అనేది అకారాంత పుంలింగ శబ్దం. అది మహద్వాచకం అయినప్పుడు ఉత్వం, డుజ్ లు వచ్చి 'దూతుడు' అవుతుంది. ప్రస్తుత సూత్రం వల్ల స్త్రీత్వం వికల్పంగా అవడంవల్ల 'దూత' అనే రూపం ఏర్పడుతుంది. 'రామునికి హనుమంతుడు దూతుడు', 'రామునికి హనుమంతుడు దూత' అనే విధంగా ప్రయోగింపవచ్చు. అమహద్వాచకంలో స్త్రీ లింగత్వం నిత్యం కాబట్టి 'సింగంబు దూతయగు జంబుకంబు' అనే అవుతుంది. 'సింగంబు దూత మగు బంబుకంబు' అనికాదు.

7.1.24 సూత్రం : పృధ్వీ వాచి భూశబ్దంబు నకు భువి యగు. (62 సూ.)

భావం : 'భూ' అనే శబ్దం భూమి అనే అర్థాన్ని బోధించేటప్పుడు 'భువి' అనే తత్సమ రూపాన్ని పొందుతుంది.

ఉదాహరణ : భువి - భువులు - భువిని - భువులను.

వివరణ : 'పృధ్వీవాచి' అనటం చేత పృధ్వీ వాచకం కాని భూ శబ్దానికి 'భువి' కాదు. సమాసంలో ఉత్తర పదంగా 'భూ' శబ్ద ఉన్నప్పుడు 'స్వయంభూ', 'ఆత్మభూ', అనే ఉంటాయి. గాని స్వయంభువి, ఆత్మభువి అని కావు.

7.1.25 సూత్రం : నే శబ్దంబునకు నావయగు. (63 సూ.)

భావం : 'నౌ' శబ్దానికి తత్సవ రూపం 'నావ' అని అవుతుంది.

ఉదాహరణ : నావ, నావలు, మహానావ.
కొందరు నావి యనియు నా దేశంబగు నంద్రు.

వివరణ : వ్యాకరణ సూత్రాల్ని అనుసరించి 'నే' శబ్దం 'నౌ' గానే మిగలాల్సి ఉండగా ఈ సూత్రాన్ని అనుసరించి 'నౌ' శబ్దానికి 'నావ' అని నిపతింపబడింది.

7.1.26 సూత్రం : రై గ్లౌ శబ్దంబుల కోత్వంబు విభాషనగు. (64 సూ.)

పద విభాగం : రై, గౌ శబ్దములకు + ఓత్వము + విభాష + అగు.

భావం : 'రై' అనే శబ్దానికి, గ్లౌ అనే శబ్దానికి చివర నున్న అచ్చు (ఐ, ఔ) లకు బదులుగా 'ఓ' త్వం విభాషగ వస్తుంది.

ఉదాహరణ : ఇగ్లీ సూత్రము చేత ప్రథమైక వచనమునకు లోపంబగు. రో - రై - గ్లో - గ్లౌ.

వివరణ : 'రై' అనే శబ్దం ఓత్వం వచ్చి 'రో' అని, 'గ్లౌ' శబ్దం ఓత్వం వచ్చి 'గ్లో' అని అవుతాయి.

రై - ర్ + ఐ - ర్ + ఓ - రో
గ్లౌ - గ్ + ఔ - గ్ + ఓ - గో

బహువచనంలో రై + లు, రో + లు - రోలు అవుతాయి.

7.1.27 సూత్రం : ఐ కారం బీతుల్యంబు (65 సూ.)

పద విభాగం : ఐ కారం బు + ఈ తుల్యము.

ఉదాహరణ : రైని, రైకి, కైని, కైకి, పైని, పైకి.

వివరణ : వ్యాకరణ కార్యాల విషయంలో ఐకారం 'ఈ' వర్ణంతో సమానం రై + ను - రైని అవుతుంది.

విశేషాంశాలు : దీర్ఘమైన 'ఈ' కారంతో సమానత్వం చెప్పటం వల్ల హ్రస్వ 'ఇ' కారానికి విధించే కార్యాలు ఐ కారానికి కలగవని అర్థం.

7.1.28 సూత్రం : కంధరాదులు క్లైబతుల్యంబులు బహుళంబుగానగు. (66 సూ.)

పద విభాగం : కంధర + ఆదులు.

భావం : 'కంధర' మొదలైనవి బహుళంగా నపుంసక లింగ తుల్యాలు ఔతాయని అర్థం. నపుంసక తుల్యత్వాన్ని చెప్పటం చేత 'ము' వర్ణకం కలుగుతుందని భావం.

ఉదాహరణ : కంధరము - కంధర. విధము విధా శబ్దమునకు గ్లైబతుల్యత్వంబు నిత్యంబు కంధరా, నాసికా, భిక్షా, దంష్ట్రా, గ్రీవా, పాదుక, ఓల్కా ప్రభృతులు కంధరాదులు.

వివరణ : 'కంధరా' అనేది ఆకారాంత స్త్రీ లింగ శబ్దం. 'నామంబుల తుది దీర్ఘంబునకు హ్రస్వంబగు' అనే సూత్రాన్ననుసరించి 'కంధర' అనే రూపం ఏర్పడుతుంది. ప్రస్తుత సూత్రం వల్ల నపుంసక తుల్యత్వం కలిగి ము వర్ణకం కాగా 'కంధరము' అవుతుంది. ఉదాహరణలో చెప్పబడిన శబ్దాలన్నీ ఆకారాంత స్త్రీ లింగాలే. నాసిక - నాసికము, భిక్ష - భిక్షము, దంష్ట్ర - దంష్ట్రము, గ్రీవ - గ్రీవము, పాదుక - పాదుకము, ఉల్క - ఉల్కము అనే రూపాలేర్పడతాయి.

విశేషాంశాలు : 'విధా' శబ్దానికి నిత్యంగా క్లీబ తుల్యత్వం ఉండటం చేత 'విధము' అని ఒక్క రూపమే గాని 'విధ' అనే రూపం ఉండదు.

ఇప్పటి వరకు 'అజంత' శబ్దాల రూపాలు తెలుపబడగా తర్వాత సూత్రాలలో 'హలంత' శబ్దాల రూపాలు సాధింపబడతాయి.

## 7.2 సమీక్ష

తత్సమ పరిచ్ఛేధంలోని 39 నుండి 66వ సూత్రాలకు సోదాహరణ వ్యాఖ్యలు తెలుసుకున్నారు.

## 7.3 ప్రశ్నలు

క్రింది సూత్రాలకు సోదాహరణ వ్యాఖ్యలు వ్రాయండి.

1. అమహన్నపుంసకముల కదంతములకు మువర్ణకంబగు.
2. లు, ల, న లు పరంబగునపు డొకానొకచో ముగాగమంబునకు లోపంబును దత్పూర్వ స్వరంబునకు దీర్ఘంబును విభాషనగు.
3. ఇ గ్లో రా యుగంతముల ప్రథమైక వచనంబునకు లోపంబగు.
4. ఉ కారాంత గో శబ్దంబుల కంతట వు వర్ణకంబగు.
5. ఉ కారాంతంబగు మహత్తునకు వు వర్ణకము బహుళముగా నగు.
6. కద్రువ నాగమాత.
7. నామంబుల తుది దీర్ఘంబునకు హ్రస్వంబగు.
8. స్త్రీ లింబంబుల ప్రథమైక వచనంబునకు లోపంబగు.
9. దూతాదులకు స్త్రీత్వంబు బహుళంబుగా నగు.

## 7.4 ఆధార గ్రంథాలు

1. బాల వ్యాకరణము - శ్రీ పరవస్తు చిన్నయ సూరి
2. ఘంటాపథ వ్యాఖ్యానం - శ్రీ వంతరాం రామకృష్ణారావు
3. బాలవ్యాకరణ సారస్వ సర్వస్వ పేటిక - శ్రీ దూసి రామమూర్తి శాస్త్రి
4. రమణీయము - శ్రీ దువ్వూరి వేంకటరమణ శాస్త్రి

డాక్టర్ కౌతా సుబ్రహ్మణ్య శాస్త్రి
రీడర్ మరియు ఆంధ్ర శాఖాధ్యక్షులు
(రిటైర్డ్)
హిందూ కళాశాల
గుంటూరు

# పాఠం - 8

# తతయు ˆరిచ్ఛేదం

పాఠ్యనిర్మాణక్రమం

8.0 లక్ష్యం
8.1 సోదాహరణ వ్యాఖ్యలు (67 నుండి 87 సూత్రాల వరకు)
8.2 సమీక్ష
8.3 ప్రశ్నలు
8.4 ఆధార గ్రంథాలు

## 8.0 లక్ష్యం

ఈ పాఠంలో తత్సమ పరిచ్ఛేదం లోని 67 నుండి 87 సూత్రాలకు సోదాహరణ వ్యాఖ్యలు తెలుసుకుంటారు.

## 8.1 సోదాహరణ వ్యాఖ్యలు (67 నుండి 87 సూత్రాల వరకు)

8.1.1 సూత్రం : హలంత ప్రకరణం - హలంతంబు ప్రథమైక వచనాంత తుల్యం బిందు నామంబగు. (67 సూ.)

పద విభాగం : హల్ + అంతము, ప్రథమ + ఏకవచన + అంత తుల్యము + ఇందు + నామము + అగు.

భావం : హల్లుతో అంతమయ్యే సంస్కృత శబ్దాల ప్రథమా విభక్తి ఏకవచనాంతంతో తుల్యమైనదే తత్సమ రూపాలకు ప్రాతిపదికగా గ్రహింపబడుతుంది.

ఉదా : రుక్ - రాట్
మరుత్ - వీరుత్
కర్మ - వర్మ

శ్వశబ్దంబు తప్ప నకారాంతంబు లెల్ల బ్రథమైక వచన తుల్యంబులే యగునని యెఱుంగునది.

వివరణ : హల్లు చివరి యందు గలవి 'హలంతాలు'. హలంతాలను గూర్చిన భాగం కాబట్టి ఇది హలంత ప్రకరణం అనబడింది. సంస్కృత హలంత శబ్దాల యొక్క ప్రథమా విభక్తి ఏక వచనాంతంతో సమానమైన రూపం ప్రాతిపదిక అవుతుంది. విభక్తి అంతంలో ఉన్నది ప్రాతిపదిక కారాదు. కాబట్టి 'తుల్యం' ఉపయోగింపబడింది. ప్రథమైక వచనాంత తుల్యం అంటే ప్రథమా విభక్తి ఏకవచనం అంతంలో ఉన్న శబ్దంతో తుల్యమని భావం. 'రుచ్' అనేది సంస్కృత శబ్దం. దీని ప్రథమా విభక్తి ఏకవచన రూపం 'రుక్' అనేది. 'రుక్' అనేది ప్రథమైక వచనాంత తుల్యం. రుక్, రాట్, మరుత్, వీరుత్, కర్మ, వర్మ అనే ఆరు ఉదాహరణాలు ఆయా సంస్కృత శబ్దాల ప్రథమా విభక్తి ఏకవచన రూపాలు. తెలుగులో ఇవే ప్రాతిపదిక లౌతాయి. కర్మ, వర్మ అనేవి నకారాంత శబ్దాలు. 'శ్వన్' అనే నకారాంత శబ్దం తప్ప

మిగిలిన సంస్కృత నకారాంత శబ్దాలన్నీ తెలుగులో 'ప్రథమైక వచనాంత తుల్యా'లే ఔతాయి.

విశేషాంశాలు : అజంత (అచ్ + అంత) రూప సాధనంలో సంస్కృత ప్రాతిపదికాలే తెలుగులో ప్రాతిపదికాలౌతాయి. రామ అనే ప్రాతిపదికకు సంస్కృతంలో 'స్' ప్రత్యయం ఔరు' రామః అని రూపం ఏర్పడగా తెలుగులో 'రామ' అనే సంస్కృత ప్రాతిపదికకు ఉత్వ, డుజ్‌లు వచ్చి 'రాముడు' అనే రూపం ఏర్పడుతుంది. హలంత (హల్ + అంత) రూప సాధనంలో సంస్కృత భాషలోని ప్రథమైక వచనాంత శబ్దాలే ప్రాతిపదిక లౌతాయి. హలంతాల ప్రథమైక వచనాలు 'రుక్, రుగ్, రాట్, రాడ్' అని రెండు విధాలుగా ఉంటాయి. వీటిలో రుక్, రాట్ అనే వానినే తెలుగు ప్రాతిపదికాలుగా గ్రహించాలి.

8.1.2 సూత్రం : ఉగాగమంబును ద్విత్వంబును దుది హల్లున కగు. (68 సూ.)

పద విభాగం : ఉక్ + ఆగమమును, ద్విత్వమును, తుది హల్లునకు + అగు.

భావం : హలంత నామం యొక్క తుది హల్లునకు ద్విత్వము, ఉగాగమం అవుతాయి.

ఉదా : ఉగాగమాంతంబుల కిగ్లే సూత్రముచే బ్రథమైక వచన లోపంబగు. రుక్కు, రాట్టు.
ఉగాగమంబు లేమింజేసి యిచట నాంతంబుల కస్త్రీ లింగంబులకుం బ్రథమైక వచన లోపంబు లేదు.

కర్మము, వర్మము, చర్మము.
సుధన్వుడు, సుత్రాముడు.

వివరణ : రుక్, రాట్, మరుత్, వీరుత్ అనేవి ప్రాతిపదికలు. ఈ సూత్రం వల్ల ఈ శబ్దాలలోని చివరి హల్లుకు ఉత్వము, ద్విత్వము వచ్చి రుక్కు, రాట్టు, మరుత్తు, వీరుత్తు అనే రూపాలు ఔతాయి. 'ఉ' కాంత గో శబ్దంబుల కంతట 'వు' వర్ణకంబగు అనే సూత్రాన్ననుసరించి రుక్కు + వు - రుక్కువు అని అయి 'ఇగ్లౌరా యుగంతంబుల ప్రథమైక వచనంబునకు లోపంబగు' అనే సూత్రాన్ననుసరించి 'వు' లోపించి రుక్కు అను ప్రథమా విభక్తి ఏకవచన మేర్పడుతుంది. 'రాట్' ఉత్వ, ద్విత్వాలను పొంది 'రాట్టు' అని, 'మరుత్' అనేది 'మరుత్తు' అని, 'వీరుత్' అనేది 'వీరుత్తు' అవుతాయి. కర్మ, వర్మ, చర్మ అనేవి 'న' కారాంత శబ్దాలే అయినప్పటికి తెలుగులో అదంత శబ్దాలుగానే వ్యవహరింపబడతాయి. వీటికి 'ము' వర్ణకం వచ్చి కర్మము, వర్మము, చర్మము అనే రూపాలేర్పడతాయి.

8.1.3 సూత్రం : దీర్ఘంబు మీది హల్లునకు ద్విత్వంబు బహుళంబుగా నగు. (69 సూ.)

భావం : హలంతాలయిన నామాలు దీర్ఘ పూర్వాలైతే వాటికి ద్విత్వం బహుళంగా వస్తుంది.

ఉదా : వాక్కు - వాకు.
స్వరాట్టు - స్వరాటు

వివరణ : 'వాక్' అనే ప్రాతిపదికలో 'క్' అనే హల్లుకు ముందున్నది దీర్ఘాక్షరం. దీర్ఘం మీద హల్లుకు ద్విత్వం బహుళంగా వస్తుంది అనటం వల్ల 'వాక్' అనే ప్రాతిపదిక యొక్క తుది హల్లుకు ఉత్వ, ద్విత్వలు రాగా 'వాక్కు' అని అవుతుంది. కకారానికి ద్విత్వం రాకపోతే 'వాకు' అని ఉత్వంతో కూడిన రూపమే అవుతుంది. 'స్వరాట్' అనే ప్రాతిపదిక కూడా ఉత్వాన్ని మాత్రమే పొంది 'స్వరాటు' అని, ద్విత్వం

కూడా కలిగితే 'స్వరాట్టు' అని అవుతుంది. ద్విత్వాన్ని బహుళంగా విధించటం వల్ల దీర్ఘం మీది హల్లుకు కొన్ని శబ్దాలకు ద్విత్వం నిత్యంగా వచ్చి పరివ్రాట్ అనేది 'పరివ్రాట్టు' గ అవుతుంది.

విశేషాంశాలు : దీర్ఘము మీద అనటం వల్ల హ్రస్వం మీద ఉన్న హల్లుకు ద్విత్వం నిత్యంగా వస్తుందని అర్థం. మరుత్ - మరుత్తు అవుతుంది.

8.1.4 సూత్రం : మతుబాదికంబు ద్వితీయైక వచనాంత తుల్యంబు నామంబగు. (70 సూ.)

పద విభాగం : మతు + ప్ + ఆదికంబు , ద్వితీయ + ఏకవచన + అంత, తుల్యము, నామము + అగు.

భావం : మతుబంతాలు మొదలైన శబ్దాల ద్వితీయైక వచన రూపాలతో సమానమైనవి తెలుగులో ప్రాతిపదికలుగ వ్యవహరింపబడతాయి.

ఉదా : శ్రీమంతమ్ - గుణవంతమ్ - విద్వాంసమ్ - అనడ్వాహమ్ - శ్వానమ్ - ఉపానహమ్ - అప్సరసమ్ ఇత్యాదులు.

వివరణ : మతుబాదికము అంటే 'మ తుప్' ప్రత్యయం అంతంలో ఉండే శబ్దాలు. 'మత్' అనే ప్రత్యయం కలది, కలవాడు అనే అర్థంలో వస్తుంది. శ్రీ + మత్ - శ్రీమత్. శ్రీమత్ శబ్దం యొక్క ద్వితీయైక వచనాంత రూపం శ్రీమంతమ్. అకారాంతాలపై ఈ ప్రత్యయంలోని 'మ' కారం 'వ' కారంగా మారుతుంది. గుణ + మత్ - గుణవత్. 'గుణవత్' శబ్దం యొక్క ద్వితీయైక వచనాంత రూపం గుణవంతం. 'మతుప్ + ఆదికము' అనటం వల్ల మతుబందాలు కాని 'విద్వస్' 'విద్వాంసమ్' అని, 'అనుడుత్' అనేది 'అనుడ్వాహమ్' (ఎద్దు అని అర్థం) అని, శ్వన్ అనేది శ్వానమ్ (కుక్క) అని, ఉపానత్ అనేది 'ఉపానహమ్' (పాదుక) అని 'అప్సరస్' అనేది 'అప్సరసమ్' అని ద్వితీయైక వచనాంతంలో అవుతాయి.

విశేషాంశాలు : శ్రీమత్ శబ్ద శ్రీమన్తమ్ అని, గుణవత్ శబ్దం గుణవన్తమ్ అవుతాయి. వర్ణ పంచమ స్థానంలో బిందువు వచ్చి శ్రీమంతమ్, గుణవంతమ్ అని రూపాలు గూడా వ్యవహరింపబడతాయి.

8.1.5 సూత్రం : దాని యంతిమ మకారంబునకు లోపంబగు. (71 సూ.)

భావం : ద్వితీయైక వచనాంత తుల్యమైన ప్రాతిపదికము యొక్క తుది 'మ' కారానికి లోపం వస్తుంది.

ఉదా : శ్రీమంత - గుణవంత, విద్వాంస - అనడ్వాహ॥ ఇత్యాది వీని కజంతంబులకుం బోలె డుజాదులు యథా యోగ్యంబు గానగు.

అతడు శ్రీమంతుడు - ఇతడు గుణవంతుడు.
వాని వంశము శ్రీమంతము.
వీని వంశము గుణవంతము.

విద్వాంసుడు - విద్వాంసము - అనడ్వాహము - శ్వానము - అప్సరస. వక్ష్యమాణ లక్షణంబుచే స్త్రీత్వంబున మతుబాదులు జ్యంతంబులే యిందు గ్రహింపబడు.

శ్రీమతి - గుణవతి - విదుషి - శుని, మహతి వాచ్యంబగునపుడు శ్రీమంతురాలు - గుణవంతురాలు - విద్వాంసురాలనియు బ్రయోగింపదగు.

వివరణ : 'శ్రీమంత' అనేది పుంలింగం, మహద్వాచకం. 'శ్రీమంతమ్' అనేది ప్రాతిపదిక. దీని అంతిమ 'మ' కారానికి లోపం వచ్చి శ్రీమంత అవుతుంది.

'పుంలింగంబయి మహద్వాచకంబయిన నామంబు తుది యత్వంబున కుత్వంబగు' (21 సూ.) అనే సూత్రాన్ననుసరించి 'శ్రీమంతు' అవుతుంది. దీనికి 'డుజ్' వర్ణకం వచ్చి శ్రీమంతు డుజ్. జిత్తు బిందు పూర్వంబగు' (సూ.19) అనే సూత్రాన్ననుసరించి శ్రీమంతుడు, శ్రీమంతుండు అనే రూపాలేర్పడతాయి. అమహద్విశేషణము లైనప్పుడు శ్రీమంతము, గుణవంతము, విద్వాంసము - మొదలైన విధాలుగా 'ము' వర్ణకంతో రూపాలేర్పడతాయి. అనడ్వాహ, శ్వాన అనే రెండు శబ్దాలు జంతు వాచకాలు కాబట్టి 'అమహన్నపుంసకముల కదంతములకు 'ము' వర్ణకంబగు' (సూత్రం 39) ననుసరించి అనడ్వాహము, శ్వానము అవుతాయి. 'ఉపానహ' శబ్దం జడవాచకం అవటం వల్ల 'ము' వర్ణకం వచ్చి 'ఉపానహము' అవుతుంది.

'అప్సరస' అనేది స్త్రీ లింగ శబ్దం. 'స్త్రీ లింగంబుల ప్రథమైక వచనంబునకు లోపంబునగు' (సూత్రం 57) అనే సూత్రాన్ననుసరించి అప్సరస + ము - 'ము' ప్రత్యయం లోపించి 'అప్సరస' అనే రూపమే ఉంటుంది.

'శ్రీమంత' మొదలైనవి మహతీ వాచకాలైనప్పుడు 'ఆలు' శబ్దం జేరుతుందు. 'కర్మధారయంబున దత్సమంబుల కాలు శబ్దము పరంబగునపు డత్వంబున కుత్వంబును, రుగాగమంబు నగు' (సంధి సూత్రం 31) అనే సూత్రాన్ని అనుసరించి శ్రీమంతురాలు, గుణవంతురాలు, విద్వాంసురాలు అని అవుతాయి. శ్రీమతీ - శ్రీమతి అయినట్లే గుణవతీ, విదుషీ, శునీ అనే రూపాలనుండి గుణవతి, విదుషి, శుని అనే సంస్కృత సమాలు ఏర్పడతాయి.

8.1.6 సూత్రం : ముదాదులకు బ్రథమైక వచన లోపంబు లేదు. (72 సూ.)

పద విభాగం : ముద్ + ఆదులకు, ప్రథము + ఏకవచన లోపము.

భావం : స్రీ లింగ శబ్దాలైన 'ముద' మొదలైన శబ్దాలకు ప్రథమా విభక్తి ఏకవచనానికి లోపం కలుగదు.

ఉదా : ముదము - ఉపానహము - స్రజము.

వివరణ : ముదాదులు ముదము, ఉపానహము, స్రజము అనేవి. 'ముత్' అనే స్త్రీ లింగ శబ్దం ద్వితీయా విభక్తి ఏకవచనంలో 'ముదమ్' అవుతుంది. 'అంతిమ 'మ' కారానికి లోపం రాగా' (71 సూ.) 'ముద' అని ఏర్పడుతుంది. 'అమహన్నపుంసకములు కదంతములకు 'ము వర్ణకంబగు' (సూ. 39) ముద + ము అవుతుంది. 'అంతిమ 'మ' కారంబునకు లోపంబగు' (సూ. 71) అనటం వల్లను, 'స్త్రీ లింబంబుల ప్రథమైక వచనంబునకు లోపంబునగు' (సూ. 57) అనే సూత్రాల వల్ల 'ము' - లోపించాల్సి ఉండగా ఈ సూత్రం ప్రథమైక వచన లోపాన్ని నిషేధించింది. అందువల్ల ముదము - ఉపానహము - స్రజము అనే రూపాలు ఏర్పడ్డాయి.

విశేషాంశాలు : 'ఉపానహ' శబ్దం స్త్రీ లింగం. దీనికి 'ము' ప్రత్యయం చేరి 'ఉపానహము' అయి ఇది ముదాదులకు చెందినది కాబట్టి 'ము' లోపించక ఉపానహము' అనే రూపమే ఉంటుంది. అదే విధంగా స్రక్ స్రజమ్ అయి స్రజము అని అవుతుంది.

8.1.7 సూత్రం : 'ఋత్విగాదులు ద్వితీయైక వచనాంత తుల్యంబులు విభాష నగు. (73 సూ.)

పద విభాగం : ఋత్విక్ + ఆదులు, ద్వితీయ + ఏకవచన + అంత.

భావం : 'ఋత్విక్' మొదలైన సంస్కృత నామాలు ద్వితీయైక వచనాంత తుల్య రూపాలు విభాషగ తెలుగులో ప్రాతిపదిక లౌతాయి.

ఉదా : ఋత్విజుడు - ఋత్విక్కు
నీవృతము - నీవృత్తు
ఋత్విగాది కంబాకృతి గణంబు.

వివరణ : ఋత్విక్ మొదలైనవి ఋత్విగాదులు. 'ఋత్విజ్' మొదలైన శబ్దాలకు సంస్కృతంలో వాటి ద్వితీయా విభక్తి ఏకవచనాంతంతో తుల్యమైన రూపం తెలుగులో వికల్పగా ప్రాతిపదిక ఔతుంది.

'ఋత్విజమ్' అనేది ప్రాతిపదిక. ఇది 'ఋత్విజ్' అనే శబ్దం యొక్క ద్వితీయా విభక్తి ఏకవచనాంత తుల్యం. 'దాని యంతిమ మకారంబునకు లోపంబగు' (సూ. 71) అనే సూత్రాన్ననుసరించి 'శ్రీమంతమ్' లో 'శ్రీమంత' వలె 'ఋత్విజ' అని అవుతుంది. 'పుంలింగంబయి మహద్వాచకంబయిన నామంబు తుది యత్వంబున కుత్వంబగు' (సూ. 21) అను సూత్రాన్ననుసరించి 'ఋత్విజు' అవుతుంది. 'పుంలింగమగు మహద్వాచకమునకు డుజ్ఞగు' (సూ.22) అనే సూత్రాన్ననుసరించి ఋత్విజు + డుజ్ అయి 'జిత్తు బిందు పూర్వంబగు' (సూ. 19) అనే సూత్రాన్ననుసరించి ఋత్విజుడు, ఋత్విజుండు అనే రూపాలేర్పడతాయి. 'ద్వితీయైక వచనాంత తుల్యం' కాకపోతే అంటే 'ఋత్విక్' అనే ప్రథమైక వచనాంత తుల్యం అయితే ఉత్వం, ద్విత్వం వచ్చి 'ఋత్విక్కు' అని అవుతుంది. 'నీవృత్' అనే దానికి ఉత్వ, ద్విత్వాలు కలిగితే 'నీ వృత్తు' అవుతుంది. ద్వితీయైక వచనాంత తుల్యం అయినప్పుడు 'నీ వృతమ్' అవుతుంది. దీని అంతిమ 'మ' కారానికి లోపం వచ్చి 'నీవృత' అవుతుంది. ఇది అమహద్వాచకం. నీవృతం అంటే గ్రామము లేదా దేశము అని అర్థం. 'అమహన్న పుంసకముల కదంతములకు ము వర్ణకంబగు' (సూ. 39) అనే సూత్రాన్ననుసరించి 'నీవృతము' అవుతుంది. విభాష అనటం చేత ద్వితీయైక వచనాంత తుల్య రూపం (ఋత్విజుడు) తోనూ ప్రథమైక వచనాంత తుల్యరూపం (ఋత్విక్కు) అనే రెండు రూపాలుంటాయి.

విశేషాంశాలు : 'ఆకృతి గణం' అంటే సమానమైన ఆకారం గల్గిన శబ్దాల్ని ప్రయోగానుసారంగా చేర్చుకొనదగిన పదాల సమూహం. ఆకృతి గణం అని అనటం చేత అట్టి శబ్దాల్ని పోలికను బట్టి గ్రహించాలి అని గమనించాలి. మరుత్తు - మరుతుడు, ఇంద్రజిత్తు - ఇంద్రజితుడు, వేదవిత్తు - వేదవిదుడు, వణిక్కు - వణిజుడు మొదలైన శబ్దాలు గమనింపదగినవి.

8.1.8 సూత్రం : ఒకానొకచో మహత్వంబునందు మతుప్తకారంబున కానాదేశంబు విభాష నగు. (74 సూ.)

పద విభాగం : మతుప్ + తకారమునకు + ఆన + ఆదేశము.

భావం : మహద్వాచకమైన మతుబంతం యొక్క మతుప్తకారానికి విభాషగా 'ఆన' అనేది ఆదేశంగా వస్తుంది.

ఉదా : హనుమానుడు - హనుమంతుడు
భగవానుడు - భగవంతుడు .... ఇత్యాది

వివరణ : మతుప్తకారము అంటే 'మతుప్' అనే ప్రత్యయం యొక్క 'త' కారం. 'మతుప్' ప్రత్యయంలో ప్రకారం లోపించి 'మత్' అనేది మిగిలుతుంది.

కొన్నిచోట్ల మతుబంతాలైన శబ్దాలలోని మతుప్రత్యయానికి సంబంధించిన 'త' వర్ణానికి 'ఆన' అనేది ఆదేశం వికల్పంగా అవుతుంది.

'హనుమత్' అనే శబ్దం యొక్క ద్వితీయైక వచనాంత రూపం 'హనుమంతమ్' అనేది. 'దాని యంతిమ మకారంబునకు లోపంబగు (సూ. 71) అనే సూత్రాన్ననుసరించి చివరనున్న మకారాని లోపం రాగా 'హనుమంత' అయింది.

మహద్వాచకం, పుంలింగం కావటం వల్ల ఉత్వ, డుజ్ణులు వచ్చి 'హనుమంతుడు' అని అవుతుంది. 'భగవత్' అనే మతుబంతం కూడా ఇదే విధంగా 'భగవంతుడు' అవుతుంది.

'హనుమత్' అనేది ప్రాతిపదిక. ప్రస్తుత సూత్రాన్ననుసరించి 'త్' (త కారానికి) 'ఆన' అనేది ఆదేశంగా వచ్చి 'హనుమ + ఆన' - హనుమాన అవుతుంది. 'పుంలింగమగు మహద్వాచమునకు డుజ్ణగు' అనే సూత్రాన్ననుసరించి 'హనుమాను + డుజ్' అయి 'జిత్తు బిందు పూర్వంబగు' సూత్రాన్ననుసరించి హనుమానుడు, హనుమానుండు, హనుమంతుడు అనే రూపాలేర్పడతాయి. అదే విధంగా భగవ + ఆన - భగవాన, ఉత్వ, డుజ్ణులు వచ్చి భగవంతుడు, భగవానుడు వంటి రూపాలు ఏర్పడతాయి. 'ఇత్యాదులు' అనటం వల్ల హనుమంతుడు, భగవంతుడు, నభస్వంతుడు, మఘవంతుడు వంటి మరికొన్ని శబ్దాలకు గూడా ఈ రూప ప్రక్రియ అన్వయిస్తుందని అర్థం.

విశేషాంశాలు : 'విభాష' అని అనటం వల్ల వేరు విధమైన రూపాలు గూడా ఏర్పడతాయని అర్థం. 'మఘవత్' అనే శబ్దం 'మఘవా' అనే రూపాన్ని పొంది 'మఘవుడు' అనే రూపాన్ని పొందుతుందని గ్రహింపవచ్చు.

8.1.9 సూత్రం : 'విశ్వ కర్మాదులకు స్త్రీత్వంబగు'. (75 సూ.)

పద విభాగం : విశ్వకర్మ + ఆదులకు స్త్రీత్వము + అగు.

భావం : విశ్వకర్మ మొదలైన పుంలింగ శబ్దాలకు స్త్రీలింగత్వం నిత్యంగా కలుగుతుంది.

ఉదా : స్త్రీలింగత్వాతి దేశంబు చేతనుత్వడుజ్ణులు లేవని యెఱుంగునది.
విశ్వకర్మ - కృష్ణవర్త్మ - అశ్వత్థామ
యువ - యజ్వ॥ ఇత్యాదులు.

వివరణ : విశ్వకర్మ మొదలైనవి విశ్వకర్మాదులు. ఇవి నకారాంత, పుంలింగ శబ్దాలు. ఇవి అన్ని పురుష వాచకాలు.

అందువల్ల ఇవి తత్సమ రూపాలైనప్పుడు ఉత్వ, డుజ్ణులను పొందాలి. ఇక్కడ స్త్రీత్వం అంటే స్త్రీలింగ ధర్మం. ప్రస్తుత సూత్రం స్త్రీతుల్యత్వాన్ని చెప్పటం చేత ఉత్వ, డుజ్ణులు వారింపబడ్డాయి. 'విశ్వకర్మన్' అనేది నకారాంత సంస్కృత శబ్దం. దీనికి 'హలంతంబు ప్రథమైక వచనాంత తుల్యంబిందు నామంబగు' (సూ. 67) అనే సూత్రాన్ననుసరించి 'విశ్వకర్మ' అనేది ప్రాతిపదిక. 'నామంబుల తుది దీర్ఘంబునకు హ్రస్వంబగు' (సూ. 54) అను సూత్రాన్ని అనుసరించి 'విశ్వకర్మ' అవుతుంది. ప్రస్తుత సూత్రం వల్ల స్త్రీ తుల్యత్వం కలుగగా ప్రథమా విభక్తి ఏకవచన లోపం వచ్చి ఉన్నవి ఉన్నట్టుగా పదస్థితిని పొందుతుంది. అశ్వత్థాము - అశ్వత్థామను, యువత - యువతో, యజ్వచేత - యజ్వవల్య మొదలైన విధాలుగా రూపాలుండి ఇతర విభక్తులతో వ్యవహరిస్తాయి.

విశేషాంశాలు : 'విశ్వకర్మాదులకు' అనటం చేత విశ్వకర్మాదులలో లేని శబ్దాలకు ఈ కార్యం రాదు. సుత్రాముడు, సుధన్వుడు మొదలైనవి.

8.1.10 సూత్రం : మహద్వాచకమయి పుంలింగంబగు బ్రహ్మ శబ్దమునకు స్త్రీత్వంబగు. (76 సూ.)

పద విభాగం : మహత్ + వాచకము + అయి, పుంలింగము + అగు.

భావం : 'బ్రహ్మ' శబ్దం పుంలింగమై మహద్వాచకమైనప్పుడు స్త్రీతుల్యత్వాన్ని పొందుతుంది.

ఉదా : బ్రహ్మ - ఈశబ్దము చతుర్ముఖ ఋత్విగ్విప్రులకు వాచకంబు. తత్వ తపోవేద యోగ వాచకంబగు నేని బ్రహ్మము నాబడు.

వివరణ : స్త్రీత్వం అంటే ప్రథమా విభక్తి ఏకవచనం లోపించడం. సంస్కృతంలో పుంలింగ శబ్దమైన 'బ్రహ్మ' ప్రథమా విభక్తి ఏకవచనంలో 'బ్రహ్మ' అవుతుంది. దీనికి బ్రహ్మదేవుడు, ఋత్విజుడు, బ్రాహ్మణుడు అనే అర్థాలున్నాయి. బ్రహ్మ శబ్దం మహద్వాచకం. 'నామంబుల తుది దీర్ఘంబునకు హ్రస్వంబగు' (సూ. 54) అనే సూత్రాన్ననుసరించి 'బ్రహ్మ' అని హ్రస్వరూపాన్ని పొంది ఆ తర్వాత ఉత్వము, డుజులు రావలసి యుండగా ప్రస్తుత సూత్రం వల్ల స్త్రీత్వం కలిగి 'బ్రహ్మ' అని మాత్రమే అవుతుంది.

నపుంసక లింగ రూపమైన 'బ్రహ్మ' శబ్దానికి పరమాత్మ తత్వము, తపస్సు, వేదము అనే అర్థాలున్నాయి. ఈ 'బ్రహ్మ' శబ్దం ప్రథమా విభక్తి ఏకవచనంలో 'బ్రహ్మ' అని అదంతంగానే ఉంటుంది. 'అమహన్నపుంసకముల కదంతములకు ము వర్ణకంబగు' (సూ. 39) అనే సూత్రాన్ననుసరించి 'ము' వర్ణకం వచ్చి 'బ్రహ్మము' అని అవుతుంది. బ్రహ్మ, బ్రహ్మ, బ్రహ్మము అనే రూపాలు వ్యవహరింపబడతాయి.

విశేషాంశాలు : సూత్రంలో 'మహద్వాచకంబయి' - అనటం చేత అమహద్వాచకమై, పుంలింగమైన 'బ్రహ్మ' శబ్దానికి స్త్రీత్వం రాదని అర్థం. 'యోగం' అనే అర్థంలో ఉపయోగించే 'బ్రహ' శబ్దం పుంలింగం. ఇది అమద్వాచకం అవటం వల్ల స్త్రీత్వం రాదు కాబట్టి 'ము' వర్ణకం లోపించదు. అపుడు 'బ్రహ్మము' అనే రూపమే ఉంటుంది.

8.1.11 సూత్రం : ఆత్మేమనిజంతంబులకు నాంతములగు మనుజ సంజ్ఞలకు స్త్రీత్వంబు బహుళంబుగానగు. (77 సూ.)

పద విభాగం : ఆత్మన్ + ఇమనిచ్ + అంతములకు, న + అంతములు + అగు మనుజ సంజ్ఞలకు స్త్రీత్వము

బహుళముగా + అగు.

భావం : 'ఆత్మ' శబ్దానికి, ఇయనిచ్ ప్రత్యయం చివరిలో ఉన్న శబ్దాలకి, నకారాంతాలైన మనుష్య నామాలకి స్త్రీత్వం బహుళంగా అవుతుంది.

ఉదా. : ఆత్మ - ఆత్మము - ఆత్ముడు.
మహిమ - మహిమము
అణిమ - అణిమము
గరిమ - గరిమము
లఘిమ - లఘిమము
దేవశర్మ - దేవశర్ముడు

వివరణ : 'ఆత్మ' శబ్దము 'ఆత్మన్' అని నకారాంతం. 'ఆత్మ' ప్రాతిపదిక. అమహద్వాచకమైతే 'ము' వర్ణకం వచ్చి ఆత్మ + ము అవుతుంది.

స్త్రీత్వం అయితే 'స్త్రీలింగంబుల ప్రథమైక వచనంబునకు లోపంబగు' (సూ. 57) అను సూత్రం వల్ల 'ము' వర్ణకం లోపించి 'ఆత్మ' అని మిగులుతుంది.

మహద్వాచకమైతే 'పుంలింగమగు మహద్వాచకమునకు డుజ్ఞగు' (సూ. 22) అనే సూత్రాన్ని బట్టి ఆత్ముడు, ఆత్ముండు అనే రూపాలు అవుతాయి.

ఇమనిచ్ + అంత - 'ఇమనిజంత' 'ఇమనిచ్' అనే దాంట్లో 'ఇమన్' అనేదే చేరుతుంది. స్త్రీత్వం అయితే -

మహత్ + ఇమన్ - మహిమన్ - మహిమ
అణు + ఇమన్ - అణిమన్ - అణిమ
గురు + ఇమన్ - గరిమన్ - గరిమ
లఘు + ఇమన్ - లఘిమన్ - లఘిమ

అవుతాయి. స్త్రీత్వ రాకపోతే అమహద్వాచకాలవటం వల్ల 'ము' వర్ణకాన్ని పొంది మహిమము, అణిమము, గరిమము, లఘిమము అవుతాయి.

మనుజ సంజ్ఞ అయిన 'దేవశర్మ' అనేది నకారాంత శబ్దం, పుంలింగం, మహద్వాచకం అయినప్పుడు ఉత్వ, డుజ్ఞులు వచ్చి దేవశర్మ - దేవశర్ముడు అవుతుంది. ప్రస్తుత సూత్రం వల్ల స్త్రీత్వం కలిగితే ప్రథమా విభక్తి ఏకవచనం లోపించి 'దేవశర్మ' అనే ఉంటుంది.

**8.1.12** సూత్రం : మహత్వంబున స్వార్థపరంబగు రాజ శబ్దము రాజు నాబడు. (78 సూ.)

పద విభాగం : మహత్వమున, స్వ + అర్థ + పరము + అగు.

భావం : రాజ శబ్దం స్వార్థపరమై, మహత్వ బోధకమైనట్లయితే 'రాజు' అని అవుతుంది.

ఉదాహరణ : రాజు - ఖగరాజు
అమహత్త్వము నందు, రాజము, వృక్షరాజము.
ఉపసర్జనత్వము నందు, హతరాజుడు పరశురాముడు.

వివరణ : 'స్వార్థపరమగుట' అంటే ఆత్మార్థానికి ప్రాధాన్యం కలిగి ఉండటం. అంటే వాక్యమందలి క్రియతో అన్వయాన్ని కల్గి ఉండటం.

సంస్కృతంలో 'రాజన్' శబ్ద ప్రథమా విభక్తి ఏకవచన రూపం 'రాజా'. దీర్ఘానికి హ్రస్వం వచ్చి 'రాజ' అవుతుంది. దీనికి ఉత్వము, డుజ్ఞులు రాగా 'రాజుడు' అనే రూపం రావాలి. ఇది అనిష్ట రూపం. దీన్ని నివారించటానికి ఈ సూత్రం తెలుపబడింది.

'రాజ' శబ్దం మహద్వాచకమై స్వార్థ ప్రాధాన్యం కలిగి యున్నప్పుడు 'రాజు' అని ప్రథమా విభక్తి ఏకవచనంలో ఉండి, ఇతర విభక్తుల్లో రాజు, రాజును, రాజుచే, రాజులచే వంటి రూపాలలో ఉంటుంది.

గరుత్మంతుడు అనే అర్థంలో మహద్వివక్ష చేయడం వల్ల ఖగరాజు, పక్షిరాజు అనే రూపాలు అవుతాయి.

విశేషాంశాలు : 'రాజ' శబ్దం డుమంతం కాదు. ఇది ప్రథమా విభక్తిలో 'రాజు' అవుతుందని 'నిపతింప' బడింది. (నిపాతము: పారిభాషిక పద వివరణలో చూడండి). కాబట్టి 'ని' గాగమం రాదు. రాజు + ను - రాజును అవుతుంది.

8.1.13 సూత్రం : జగదింద్రజిత్తుల తకారంబునకు లోపంబు విభాషనగు. (79 సూ.)

పద విభాగం : జగత్ + ఇంద్రజిత్

భావం : జగత్, ఇంద్రజిత్ - అనే శబ్దాల చివర ఉన్న 'త' కారానికి విభాషగ లోపం వస్తుంది.

ఉదాహరణ : జగము - జగత్తు
ఇంద్రజి - ఇంద్రజిత్తు

ఋత్విగాది యగుటం జేసి యింద్రజితుండనియు వాడంబడు.

వివరణ : 'జగత్' అనేది హలంత శబ్దం. అందువల్ల 'ఉగాగమంబును ద్విత్వంబును దుది హల్లున కగు' (సూ. 68) అనే సూత్రాన్ని అనుసరించి ఉత్వము, ద్విత్వము రాగా 'జగత్తు' అని అవుతుంది. ప్రస్తుత సూత్రం వల్ల 'జగత్' అనే శబ్దం యొక్క 'త' కారానికి లోపం వచ్చి 'జగ' అని మిగులుతుంది. ఇది అమహద్వాచకం కాబట్టి 'అమహన్నపుంసకముల కదంతములకు మువర్ణకంబగు' అనే నియమాన్ని అనుసరించి 'ము' వర్ణకం వచ్చి 'జగము' అని అవుతుంది.

'జగత్' శబ్దంలో 'త' కారం లోపింపకపోతే జగత్ - జగత్తు అయి 'ఉకారాంత గోశబ్దముల కంతట వు వర్ణకంబగు (సూ. 48) అనే సూత్రాన్ని అనుసరించి జగత్తు + వు అవుతుంది. 'ఇగ్లౌరా యుగంతంబుల ప్రథమైక వచనంబునకు లోపంబగు' (సూ. 44)ను అనుసరించి 'వు' లోపించి జగత్తు అనే మిగులుతుంది.

'ఇంద్రజిత్' అనే శబ్దం 68వ సూత్రాన్ని అనుసరించి ఉత్వ, ద్విత్వాల్ని పొంది, 'ఇంద్రజిత్తు' అవుతుంది.

'పుంలింగంమగు మహద్వాచమునకు డుజ్ఞగు' (సూ. 22) ను అనుసరించి ఇంద్రజిత్తు + డుజ్ అయి 'ఇగ్లొరా యుగంతంబుల ప్రథమైక వచనంబునకు లోపంబగు' (సూ. 44) ను అనుసరించి డుజ్ఞు లోపించి 'ఇంద్రజిత్తు' అవుతుంది. 'ఇంద్రజిత్' అనే శబ్దం ఋత్విగాదులలోది కావటం వల్ల విభాషగ ద్వితీయాంత తుల్యం నామంగా వ్యవహరింపబడుతుంది. ఇంద్రజితమ్ అనేది ద్వితీయా విభక్తి ఏకవచనాంత రూపం. దీని అంతిమ 'మ' కారానికి లోపం వచ్చి 'ఇంద్రజిత' అవుతుంది. ఇది మహద్వాచకం, పుంలింగం అవటం చేత అత్వానికి ఉత్వం వచ్చి డుజ్ఞు రాగా 'ఇంద్రజితుడు' అవుతుంది.

8.1.14 సూత్రం : సాంతంబుల తుది సకారంబునకు లోపంబు బహుళంబుగా నగు. (80 సూ.)

పద విభాగం : స + అంతము.

భావం : సకారాంత శబ్దాల చివరలో ఉన్న 'స' కారానికి లోపం బహుళంగా అవుతుంది.

ఉదాహరణ : ఉరము - ఉరస్సు
వక్షము - వక్షస్సు
అర్చి - అర్చిస్సు
ధనువు - ధనస్సు
ఆయువు - ఆయుస్సు

బహుళ గ్రహణంబునం జేసి పయః ప్రభృతుల సకారంబునకు లోపంబు లేదు. పయస్సు, వయస్సు, సరస్సు.

వివరణ : సకారంతో అంతమయ్యే శబ్దాలలోని చివరి సకారానికి బహుళంగా లోపం వస్తుంది.

'హలంతంబగు ప్రథమైక వచనాంత తుల్యం బిందు నామంబగు'.

(సూ. 67) ను బట్టి సాధారణంగా ప్రథమా విభక్తి ఏకవచనాలనే నామములుగా గ్రహించటం జరుగుతుంది. స కారం అంతంలో ఉండే శబ్దాల విషయంలో సంస్కృత ప్రాతిపదికాలనే తెలుగు గూడా ప్రాతిపదికాలుగా గ్రహించాలి. 'ఉరస్' అనే సకారాంత శబ్దం యొక్క ప్రథమా విభక్తి ఏకవచన రూపం 'ఉరః' అనేది. ఈ 'ఉరః' లోని విసర్గ 'స్' కారంగా మారి 'ఉరస్' అనేది ప్రాతిపదిక అవుతుంది. ప్రస్తుత సూత్రాన్ని అనుసరించి 'స' కారం లోపించి 'ఉర' అని అవుతుంది. 'అమహన్నపుంసకముల కదంతములకు ము వర్ణకంబగు' (సూ. 39) ను అనుసరించి ఉర + ము - ఉరము అనే రూపం వస్తుంది. స కారం లోపింపకపోతే ఉరస్ 68వ సూత్రాన్ననుసరించి ఉగాగమం, ద్విత్వం వచ్చి 'ఉరస్సు' అవుతుంది. ఇదే విధంగా 'వక్షస్' అనే శబ్దం వక్షస్సు, వక్షము అని రూపాలను పొందుతుంది.

'అర్చిస్' అనేది ఉత్వ, ద్విత్వాల్ని పొంది ప్రథమా విభక్తి ఏకవచనం లోపించి 'అర్చిస్సు' అవుతుంది. ప్రస్తుత సూత్రం వల్ల 'స్' లోపించి 'అర్చి' అవుతుంది. 'ఇగ్లొరా యుగంతంబుల ప్రథమైక వచనంబునకు లోపంబగు' (సూ. 44) ను అనుసరించి అర్చి + స్ లో 'స్' లోపించి 'అర్చి' అనే రూపం మిగులుతుంది.

ధను - ధనువు, స లోపం కాకపోతే ధనుస్సు.

ఆయు - ఆయువు, స లోపం కాకపోతే ఆయుస్సు.

'బహుళంబుగా నగు' అని అనటం వల్ల పయః (పయస్) మొదలైన శబ్దాలలో స కారానికి లోపం లేదు.
పయః - పయస్ - పయస్సు
వయః - వయస్ - వయస్సు.
సరః - సరస్ - సరస్సు.

విశేషాంశాలు : సంస్కృత విభక్తులలో సు, ఔ, అస్ అనేవి ప్రథమా విభక్తి ఏక, ద్వి, బహు వచన ప్రత్యయాలు ఇందులో సు అనేది విసర్గగా అవుతుంది. రామ + స్ - రామః, రామ + ఔ - రామౌ, రామ + అస్ - రామః అవుతాయి.

8.1.15 సూత్రం : మహద్వాచకంబులగు సాంతంబుల కంత లోపంబేని ద్వితీయైక వచనాంత తుల్యతంబే నగు. (81 సూ.)

పద విభాగం : మహత్ + వాచకములు + అగు, స + అంతములకు + అంత, లోపంబు + ఏని, ద్వితీయ + ఏకవచన + అంత, తుల్యత్వంబు + ఏని + అగు.

భావం : స కారాంత పదాలు మహత్‌ను బోధించే వైనప్పుడు తుది స కారానికి లోపం కాని, ద్వితీయైక వచనాంత తుల్యంత్వం కాని కలిగి ప్రాతిపదిక ఏర్పడుతుంది.

ఉదాహరణ : అంగిరుడు - అంగిరసుడు
ఉగ్రశ్రవుడు - ఉగ్రశ్రవసుడు
ప్రచేతుడు - ప్రచేతసుడు
ఊర్ధ్వరేతుడు - ఊర్ధ్వరేతసుడు

వివరణ : 'అంగిరస్' అనే శబ్దం పుంలింగము, మహద్వాచకం. మహద్వాచకాలైన స కారాంత శబ్దాలకు చివరనున్న వర్ణానికి లోపం వస్తుంది. లోపం రాని పక్షంలో ద్వితీయైక వచనాంత తుల్యత కలుగుతుంది. అంగిరస్ అనే శబ్దంలో 'స' కారానికి లోపం వచ్చి 'అంగిర' అని అవుతుంది. దీనికి ఉత్వము, డుజ్లు కలిగి 'అంగిరుడు' అనే రూపం ఏర్పడుతుంది. అంగిరసమ్ అనేది ద్వితీయా విభక్తి ఏకవచనాంత రూపం. దీని అంతిమ మ కారానికి లోపం వచ్చి 'అంగిరస' అనే రూపం ఔతుంది. దీనికి ఉత్వ డుజ్జులు కలుగగా 'అంగిరసుడు' అనే రూపం ఏర్పడుతుంది. అదే విధంగా ఉగ్రశ్రవుడు - ఉగ్రశ్రవసుడు, ప్రచేతుడు - ప్రచేతసుడు, ఊర్ధ్వరేతుడు - ఊర్ధ్వరేతసుడు వంటి శబ్దాలు ఏర్పడతాయి.

విశేషాంశాలు : ఉగ్రశ్రవస్, ప్రచేతస్, ఊర్ధ్వరేతస్, అనేవి మాత్రమే సంస్కృత ప్రాతిపదికలుగా కొందరు పేర్కొన్నారు. కాని ఉగ్రశ్రవసమ్, ప్రచేతసమ్, ఊర్ధ్వతేసమ్ అనే వాటిని గూడ ద్వితీయైక వచనాంత తుల్య ప్రాతిపదికలుగా గ్రహించి వాని నుండి ఉగ్రశ్రవసుడు, ప్రచేతసుడు, ఊర్ధ్వరేతసుడు అనే రూపాలను సాధించుకోవాలి.

8.1.16 సూత్రం : వేధ పురోధ పురోధసుడు (82 సూ.)

పద విభాగం : వేధ, పురోధ, పురోధసుడు.

భావం : వేధ, పురోధ, పురోధస అనే మూడు ఉదాహరణల 'సాంతము' లైన మహద్వాచకాలు. 'మహద్వాచ కంబులగు సాంతంబుల కంత లోపంబేని ద్వితీయైక వచనాంత తుల్యత్వంబే నగు' అనే 81వ సూత్రాన్ని అనుసరించి వేధుడు, వేధసుడు అనే రూపాలు ఏర్పడాలి. వేధశ్శబ్దానికి నిత్యంగా సలోప స్త్రీ వద్భావాలు వస్తాయని ఈ నిపాత సూత్రానికి అర్థం.

ఉదాహరణ : వేధశ్శబ్దమునకు నిత్యంబుగాఁ బురోధశ్శబ్దమునకు వైకల్పికముగా సలోప స్త్రీవద్భావంబులు దీనిచే నిపతింపబడియె.

వివరణ : వేధ, పురోధ, పురోధసుడు అని ప్రథమైక వచనాంత తుల్యరూపాలను యథాతథంగా గ్రహించాలి.

వేధస్ అనే శబ్దానికి స కార లోపం చేసి తర్వాత ప్రథమా విభక్తి ఏకవచనాన్ని లోపింపచేయడం వల్లగాని 'వేధ' అనే రూపం ఏర్పడదు.

'వేధ' అంటే చతుర్ముఖుడు లేదా బ్రహ్మ అనే అర్థం అవటం వల్ల ఈ శబ్దం మహద్వాచకం అవుతుంది. పుంలింగము, మహద్వాచకము అయిన 'వేధ' శబ్దానికి ఉత్వము, డుజ్ఞులు రావలసి ఉంది. దీనిని నివారించటానికై వేధస్ అనే శబ్దానికి వేధ అనేది ప్రథమైక వచనాంత తుల్యమని నిపతింపబడింది. (నిపాతము - కొన్ని శబ్దాలలో సామాన్య ప్రక్రియకు భిన్నంగా సూత్రకారుడు నిర్దేశించిన రూపం నిపాత మనబడుతుంది. 'అన్యథా ప్రాప్తస్యాన్యథోచ్చారణం నిపాతమ్' లేదా అన్యథా ప్రయోగే ప్రాప్తే అన్యథా కరణం నిపాతమ్'. కద్రూ శబ్దము హ్రస్వం రాగా కద్రు అయి కద్రువు అని సామాన్య ప్రక్రియచే ప్రయోగం ప్రాప్తించుచుండగా దానికి భిన్నమైన రీతిలో 'కద్రువ' అనే రూపాన్ని సూత్రకారుడు చెప్పటం వల్ల ఇది నిపాతమయినది).

వేధస్ శబ్దానికి సకార లోపము, స్త్రీవద్భావము నిత్యంగా వస్తాయి. సకారం లోపించి 'వేధ' అవుతుంది. మిగిలిన విభక్తులలో వేధను, వేధచేత, వేధవలన మొదలైన వాటిలో సలోపము స్త్రీవద్భావము నిత్యం. అందువలన వేధుడు, వేధసుడు అనే రూపాలుండవు.

పురోహితుడు అనే అర్థం తెల్పే 'పురోధస్' శబ్దం 'పురోధ' అని ఒక రూపంతోను 'పురోధసుడు' అని మరొక రూపంలోను వ్యవహరింపబడుతోంది. ఈ 'నిపాతము' వలన పురోధస్ అనే దానికి వైకల్పికంగా సలోపం వచ్చి స్త్రీవద్భావం కలిగింది. అందువల్ల 'పురోధ' అనే రూపం సిద్ధించింది. వైకల్పికం అనడం చేత ద్వితీయాంత తుల్యమైన పురోధసమ్ అనే దాని 'మ' కారం లోపించి ఉత్వము, డుజ్ఞులు వచ్చి 'పురోధసుడు' అని అవుతుంది. సలోపం, స్త్రీవద్భావం రెండూ కలిసే వస్తాయి. రాకపోతే రెండూ రావు. అందువల్ల సలోపం మాత్రమే వచ్చి 'పురోధుడు' అని గాని స్త్రీవద్భావం మాత్రమే వచ్చి 'పురోధస' అని కాని కావు.

విశేషాంశాలు : వేధశ్శబ్దానికి 81వ సూత్రాన్ననుసరించి సలోపం వైకల్పికం. అది రాని పక్షంలో ద్వితీయా విభక్తి ఏకవచన రూప తుల్యత కలుగుతుంది. ఈ సూత్రం ద్వారా సలోపం, స్త్రీవద్భావం నిత్యంగా నిపతింప బడ్డాయి. సలోపం నిత్యమని నిపతించడం చేత ద్వితీయైక వచన తుల్యత దీనికి కలుగదు. కాబట్టి

వేధ అనే రూపం ఒక్కటి మాత్రమే యేర్పడుతుంది. 'పురోధ' శబ్దానికి స లోపం, స్త్రీ వద్భావం వైకల్పికంగా నిపతింపబడింది. సలోప స్త్రీవద్భావాలు కలిగినట్లయితే 'పురోధ' రూపం ఏర్పడుతుంది. సలోపం కాని పక్షంలో ద్వితీయైక వచనాంత తుల్యత సిద్ధించి పురోధసుడు అనే రూపం ఏర్పడుతుంది.

8.1.17 సూత్రం : మనః ప్రభృతుల సకారంబునకు ద్విత్వంబు విభాష నగు. (83 సూ.)

పద విభాగం : మనః, ప్రభృతుల, సకారము + నకు, ద్విత్వము, విభాష, అగు.

భావం : 'మనస్' మొదలైన సకారాంత శబ్దాలలోని చివరనున్న సకారానికి ద్విత్వం విభాషగా అవుతుంది.

ఉదాహరణ : మనసు - మనస్సు
శిరసు - శిరస్సు
సదసు - సదస్సు

స లోపం బయ్యేనేని మనము - శిరము - సదము.

వివరణ : అమహద్వాచకాలైన సాంత (స + అంత) శబ్దాల తుది స కారానికి ద్విత్వం వికల్పంగా అవుతుంది. ద్విత్వం మాత్రమే వికల్పం అనడం వల్ల ఉత్వము, ద్విత్వము రానప్పుడు నిత్యంగా కలుగుతుందని భావం.

'ఉగాగమంబును ద్విత్వంబును దుది హల్లున కగు' అనే 68 సూత్రాన్ననుసరించి నిత్యంగా ఉత్వము, ద్విత్వము రావలసి యుండగా కేవలము ద్విత్వానికి మాత్రమే వికల్పంగా చెప్పబడింది.

'మనస్' అనే శబ్దానికి ఉత్వము, ద్విత్వము రాగా 'మనస్సు' అని అవుతుంది. ఈ సూత్రం వల్ల ద్విత్వం వికల్పంగా అవుతుంది. అందువల్ల ద్విత్వం రాని ఎడల ఉత్వం మాత్రమే వచ్చి 'మనసు' అని అవుతుంది.

'సాంతంబుల తుది సకారంబునకు లోపంబు బహుళంబుగా నగు' అనే 80వ సూత్రాన్ని అనుసరించి సకారానికి లోపం వచ్చినట్లయితే ము వర్ణకం వచ్చి 'మనము' అని అవుతుంది. అదే విధంగా 'శిరస్' శబ్దం శిరస్సు - శిరసు - శిరము అనే మూడు రూపాలను పొందుతుంది.

విశేషాంశాలు : మనసు, శిరసు, సదసు అనే శబ్దాలకే కాకుండా ఈ విధమైన శబ్ద ప్రక్రియ కలిగి ద్విత్వము వైకల్పికంగా కాగా వయసు - వయస్సు, సరసు - సరస్సు అనే రూపాలు ఏర్పడతాయి.

8.1.18 సూత్రం : ద్యు హృ చ్ఛ బ్దంబులకు దివి హృది యగు. (84 సూ.)

పద విభాగం : ద్యు, హృత్ + శబ్దములకు (దివ్ హృద్ + శబ్ద - ద్యుహృచ్ఛబ్ద) దివి, హృది + అగు.

భావం : ద్యు అనేది 'దివ్' శబ్దాన్ని బోధిస్తుంది. హృత్ శబ్దం హృది అని ప్రథమా విభక్తి ఏకవచనంలో అవుతాయి.

ఉదాహరణ : దివి - దివులు
హృది - హృదులు

వివరణ : 'దివ్' అనే శబ్దానికి ప్రథమా విభక్తి ఏకవచనాంత తుల్యమైన తత్సమ రూపం దివి. అదే విధంగా 'హృద్' అనే శబ్దానికి 'హృది' అనేది తత్సమ రూపం. 'దివ్' అనే శబ్దం సమాసంలో 'ద్యు' శబ్దంగా మారుతుంది. దివ్ హృద్ + శబ్ద - ద్యుహృచ్ఛబ్దము. 'దివి' ప్రాతిపదిక కాగా దీనికి 'సు' ప్రత్యయం చేరి దివి + సు అవుతుంది. 'ఇగ్లొరా యుగంతంబుల ప్రథమైక వచనంబునకు లోపంబగు' అనే 44వ సూత్రాన్ననుసరించి 'సు' లోపించి 'దివి' అనే ప్రథమా విభక్తి ఏకవచన రూపం ఏర్పడుతుంది. బహువచనంలో దివి + లు - దివులు అవుతుంది. ఇతర విభక్తులు పరమైనపుడు దివులు - దివిని - దివికి, హృదులు - హృదిని - హృదికి మొదలైన రూపాలు ఏర్పడతాయి.

8.1.19 సూత్రం : స్త్రీ లింగంబు లెల్ల స్వస్వ నియతంబు లగు. (85 సూ.)

స్త్రీ ప్రత్యయంబులం గూడి యిందు బ్రవర్తిల్లు.

పద విభాగం : స్త్రీ లింగములు + ఎల్ల, స్వ, స్వ, నియతములు + అగు, స్త్రీ ప్రత్యయములను + కూడి, ఇందు, ప్రవర్తిల్లు.

భావం : సంస్కృత వ్యాకరణము నందు విధింపబడెడి స్త్రీ ప్రత్యయములతో కూడియే స్త్రీలింగ శబ్దములు తెలుగులో తత్సమ నామములో వ్యవహరింపబడతాయి.

ఉదాహరణ :

| నామము | స్త్రీ ప్రత్యయాంతము | తత్సమము |
|---|---|---|
| కర్తృ | కర్త్రీ | కర్త్రి |
| జనయితృ | జనయిత్రీ | జనయిత్రి |
| భాగ్యశాలిన్ | భాగ్యశాలినీ | భాగ్యశాలిని |
| బుద్ధిశాలిన్ | బుద్ధిశాలినీ | బుద్ధిశాలిని |
| మతిమత్ | మతిమతీ | మతిమతి |
| గుణవత్ | గుణవతీ | గుణవతి |
| విద్వస్ | విదుషీ | విదుషి |
| వనజముఖీ | వనజముఖీ | వనజముఖి |
| | వనజముఖా | వనజముఖ |
| మీననేత్ర | మీననేత్రా | మీననేత్ర |

అంగాదులకు దప్ప సంయోగో పథంబులకు జీప్రత్యయంబు లేమింజేసి మీననేత్రి - పద్మనేత్రి - ఇత్యాదు లసాధువులు.

వివరణ : కర్తృ మొదలైన ఋదంతాలకు, భాగ్యశాలిన్ వంటి నకారాంతాలకు 'జీప్' వస్తుంది. కర్త్రీ, జనయిత్రీ, భాగ్యశాలినీ అనేవి 'జీప్' ప్రత్యయం రాగా ఏర్పడిన రూపాలు. ఇవి తెలుగులో 'నామంబుల తుది దీర్ఘమునకు హ్రస్వంబగు' అనే నియమాన్ని అనుసరించి హ్రస్వం రాగా కర్త్రి, జనయిత్రి, భాగ్యశాలిని అని అగును.

మతిమత్, గుణవత్, విద్వస్ అనే వాటికి గూడా 'జీప్' ప్రత్యయం రాగా మతిమతీ, గుణవతీ, విదుషీ అనే రూపాలు ఏర్పడతాయి. ఈ శబ్దాల తుది దీర్ఘానికి హ్రస్వం వచ్చి మతిమతి, గుణవతి, విదుషి అని ఏర్పడతాయి. శతృక్ ప్రత్యయాంతాలకు 'జీప్' ప్రత్యయం కలగటం వల్ల స్రవన్తీ, దేవ్యన్తీ, గచ్ఛన్తీ అనే స్త్రీలింగ రూపాలు ఏర్పడి వీటికి హ్రస్వం రాగా స్రవంతి, దేవ్యంతి, గచ్ఛంతి అనే రూపాలు ఏర్పడతాయి.

'వనజముఖ' + జీప్ - వనజముఖీ అయి వికల్పత్వం వల్ల వనజముఖా అవుతుంది.

మీననేత్రా అనేది సంస్కృత స్త్రీ ప్రత్యయాంతం. మీనముల వంటి నేత్రములు కలది అని దీని అర్థం. ఇది ఉపమాన పూర్వపద బహువ్రీహి సమాసం. హ్రస్వం రాగా మీననేత్ర అవుతుంది.

'మీననేత్ర' అనేది తకారంతో సంయోగం పొందిన రకారం. ఇది సంయోగోపధం. సంయోగోపధాలకు 'జీష్' ప్రత్యయం రాదు. మీన నేత్రీ, పద్మ నేత్రీ రూపాలు రావు.

అంగాదులలో సంయోగోపధములు గూడా ఉన్నాయి. వీటికి 'జీష్' ప్రత్యయం వస్తుంది. నేత్ర శబ్దం అంగాదులలో చేరక పోవడం వల్ల సంయోగో పధం అవటం వల్ల ఈ కారం పొందరాదు. అందువల్ల మీననేత్రి, పద్మనేత్రి అనే ఈకారాంతం పొందిన రూపాలు సరియైనవి కావు.

విశేషాంశాలు : అంగ, గాత్ర, కంఠ, ముఖ, కేశ, నాసికా, ఉదర, ఓష్ఠ, దన్త, కర్ణ, శృంగ, పుచ్ఛ అనేవి అంగాదులు. స్త్రీలింగ రూపాలలో ఈ కారాన్ని విధించటానికి జీప్, జీష్, జీన్ - అనే మూడు ప్రత్యయాల్ని సంస్కృత వ్యాకర్తలు వాడారు. ఈ మూడించిని కలుపుకొని చిన్నయ సూరి 'జీప్' ప్రత్యయమనే వాడినాడు.

8.1.20 సూత్రం : మహతీ తరంబులగు స్త్రీలింగంబుల విశేషణంబులకు క్లీబత్వంబు విభాషనగు. (86 సూ.)

పద విభాగం : మహతీ తరంబులు + అగు, స్త్రీ లింగము + ల, విశేషణము + లకు, క్లీబత్వము, విభాష + అగు.

భావం : 'మహత్' అనేది పురుష వాచకం. 'మహతి' స్త్రీ వాచకం. మహతి కంటే భిన్నమైనది అంటే స్త్రీ వాచకం కాని శబ్దం మహతీ తరం. క్లీబం అంటే నపుంసక లింగం. స్త్రీ వాచకాలు కానటువంటి, స్త్రీలింగాలైన శబ్దాల యొక్క విశేషణాలకు వికల్పంగా నపుంసక లింగత్వం వస్తుంది.

ఉదాహరణ : పద్మలత మనోహరి.
పద్మలత మనోహరిణి.
హృద్యంబగు విద్య
హృద్యయగు విద్య
మొదవులలో గపిల వరిష్ఠంబు, కపిలవరిష్ఠ.

వివరణ : సామాన్యంగా శబ్దాలు ప్రాణివాచకాలు, అప్రాణి వాచకాలు అని రెండు విధాలు. వీనిలో ప్రాణివాచకాలును, ప్రాణివాచకాలలో స్త్రీ తిర్యక్కులను చెప్పేవి అమహత్తులు అనబడతాయి. అమహత్తులలో కొన్ని స్త్రీ లింగాలు, కొన్ని అస్త్రీలింగాలు. అస్త్రీలింగాలలో కొన్ని స్త్రీ వాచకాలు, కొన్ని స్త్రీ వాచకాలు కానివి. రమా -గౌరీ - వధూః అనేవి స్త్రీ వాచకాలు. లతా - మతిః - భ్రూః, అనేవి స్త్రీ

వాచకాలు కాని స్త్రీ లింగాలు. స్త్రీ లింగాలలో అన్నీ స్త్రీలను బోధించేవి కావు. కొన్ని స్త్రీ వాచకాలు, కొన్ని ప్రాణి వాచకాలు మరికొన్ని అప్రాణి వాచకాలుగా ఉంటాయి. స్త్రీ లింగ శబ్దాలలో స్త్రీ వాచకాలు కాని అన్ని సంస్కృత స్త్రీలింగ శబ్దాలకు విశేషణాలైన సంస్కృత పదాలకు స్త్రీలింగత్వం, నపుంసక లింగత్వం కలుగుతాయని సూత్రార్థం.

హృద్య ఆగు విద్య - ఇక్కడ విద్య అనేది విశేష్యం. స్త్రీ లింగం కాని స్త్రీని బోధించేది కాదు. మహతీతర స్త్రీ లింగం. ప్రస్తుత సూత్రాన్ని అనుసరించి 'హృద్య' శబ్దానికి నపుంసక లింగత్వం వస్తుంది. అందువల్ల 'ము' వర్ణకం వచ్చి 'హృదము అగు విద్య' అని అవుతుంది. విభాష అనడం వల్ల క్లీబత్వం రాకపోతే 'విశేష్యంబునకుం బోలె విశేషణంబునకు లింగ విభక్తి వచనంబులగు' (కారక పరిచ్ఛేదం 19వ సూత్రం) అనే సూత్రాన్ననుసరించి స్త్రీ లింగత్వం వచ్చి 'హృద్య అగు విద్య' అని అవుతుంది.

'మహతీతరంబు' అనడం చేత విశేష్యం మహతి అయితే విశేషణానికి క్లీబత్వం రాదు. స్త్రీలింగంలో మాత్రమే ఉంటుంది. హృద్య అగు వనిత.

'స్త్రీలింగంబుల' అనడం చేత విశేష్యం పుంలింగమయితే విశేషణానికి క్లీబత్వం రాదు. మనోహరుడగు రాముడు విశేషణంబులకు అనడం చేత విశేష్యానికి క్లీబత్వం రాదు హృద్య అగు విద్యము అని కాదు.

'మొదవులలో గపిల వరిష్ఠ' అన్నచోట కపిల అనేది ఆవును తెల్పే శబ్దం. ఇది స్త్రీ లింగం. కాబట్టి దీని విశేషణం కూడా స్త్రీ లింగ తుల్యం కాగా 'వరిష్ఠ' అని అవుతుంది. కపిల అనేది గోవును సూచిస్తుంది. కాబట్టి అమహద్వాచకం. అందువలన ప్రస్తుత సూత్రం చేత విశేషణానికి క్లీబత్వం కలిగి 'కపిల వరిష్ఠంబు' అని అవుతుంది.

విశేషాంశాలు : కారక పరిచ్ఛేదంలోని 19వ సూత్రం 'విశేష్యంబునకుంబోలె విశేషణంబునకు లింగ విభక్తి వచనంబులగు' అనే సూత్రాన్ని అనుసరించి విశేష్యానికి అయ్యే లింగ విభక్తి వచనాలు విశేషణానికి అవుతాయి. అందువల్ల స్త్రీ వాచకాలు కాని స్త్రీ లింగాల విశేషణాలకు క్లీబతుల్యత విభాషగ వస్తుందని ఈ సూత్రంలో చెప్పబడింది. మనోహారీ, మనోహారిణీ, హృద్యా, వరిష్ఠా అనేవి మనోహారి, మనోహారిణి, హృద్య, వరిష్ఠ అని హ్రస్వంత రూపాలుగా అవుతాయి. ము వర్ణకం చేరడం వల్ల హృద్యము, వరిష్ఠము అనే రూపాలు ఏర్పడతాయి. మహతీ తరంబులగు అనడం చేత మహతీ వాచకాలైన స్త్రీ లింగముల విశేషణాలకు క్లీబత్వం రాదు. కాంత మనోహారిణి అనే వాక్యంలో కాంతా శబ్దం స్త్రీ లింగం. మహతీ వాచకం కాబట్టి దీని విశేషణానికి క్లీబత్వం రాదు. 'కాంత మనోహారము' అని కాదు.

**8.1.21** సూత్రం : భవచ్ఛత్రాదుల కిందు బ్రయోగంబు లేదు. (87 సూ.)

భవదాదులగు హలంత సర్వనామంబులకును, శతృ రేఫాంతాదులకును దెనుగు భాషయందు వ్యవహారంబు లేదని యర్థము. సమాసంబులందొలుతం గదిసి యిందు బ్రయుక్తంబు లగు.

పద విభాగం : భవత్ + శతృ + ఆదులకు + ఇందు, ప్రయోగము, లేదు.

భావం : భవత్ మొదలైన హలంత సర్వనామాలకు, శతృప్రత్యయాంతములు మొదలైన వానికి తత్సమ రూపంలో ప్రయోగం లేదు.

ఉదాహరణ : భవద్గుణంబులు
త్వదాశ్రయము
మత్పుణ్యము
లసద్రూపము
భవిష్యత్కాలము
ధూర్వహము .. ఇత్యాదులెరుంగనది.

వివరణ : భవత్, త్వత్, యుష్మత్, మత్, అస్మత్, తత్, ఏతత్ మొదలైనవి భవదాదులు.

లసత్, భవిష్యత్, మొదలైనవి శత్రాదులు.

ధూర్, గీర్, దోర్ మొదలైనవి రేఫాంతాలు.

ఈ భవదాదులు, శత్రాదులకు, రేఫాంతాలకు తెలుగులో ప్రయోగాలు లేవని ఈ సూత్రం తెల్పుతుంది.

హలంత నామాల యొక్క తుది హల్లునకు ద్విత్వం, ఉగాగమం వస్తాయని 'ఉగాగమంబును, ద్విత్వంబున దుది హల్లునకగు' అని హలంత ప్రకరణం 68 సూత్రంలో చెప్పబడింది. భవత, శత్ర మొదలైన వాటికి గూడా ఉగాగము, ద్విత్వాలు రావలసి ఉండగా తత్సమ రూపంలో వీటికి ప్రవేశం లేదని ఈ సూత్రంలో నిషేధింపబడింది. ఇవి సమాసములందు పూర్వ శబ్దాలుగా ఉండి తెలుగులో ప్రయోగింపబడతాయి. భవద్గుణంబుల, త్వదాశ్రయము, మత్పుణ్యము, లసత్ + రూపము (ఒప్పుచున్న రూపము), భవిష్యత్కాలము, ధూర్వహము మొదలగు సమాస రూపాలను గ్రహించాలి.

## 8.2 సమీక్ష

తత్సమ పరిచ్ఛేధంలోని 67వ సూత్రం నుండి 87వ సూత్రం వరకు సోదాహరణంగా వ్యాఖ్యలు ఎలా వ్రాయాలో తెలుసుకున్నారు.

## 8.3 ప్రశ్నలు

క్రింది సూత్రాలకు సోదాహరణ వ్యాఖ్యలు వ్రాయండి.

1. దీర్ఘంబు మీది హల్లునకు ద్విత్వంబు బహుళంబుగా నగు.
2. ఋత్విగాదులు ద్వితీయైక వచనాంత తుల్యంబులు విభాషనగు.
3. విశ్వ కర్మాదులకు స్త్రీత్వంబగు.
4. మహత్వంబున స్వార్థ పరంబగు రాజ శబ్దము రాజునాబడు.
5. సాంతంబుల తుది స కారంబునకు లోపంబు బహుళంబుగా నగు.
6. వేధ పురోధ పురోధసుడు
7. మనః ప్రభృతుల స కారంబునకు ద్విత్వంబు విభాషనగు.
8. భావచ్ఛత్రాదుల కిందు ప్రయోగంబు లేదు.
9. దూతాదులకు స్త్రీత్వంబు బహుళంబుగా నగు.

## 8.4 ఆధార గ్రంథాలు


1. బాల వ్యాకరణము - శ్రీ పరవస్తు చిన్నయ సూరి
2. ఘంటాపథ వ్యాఖ్యానం - శ్రీ వంతరాం రామకృష్ణారావు
3. బాలవ్యాకరణ సారస్వ సర్వస్వ పేటిక - శ్రీ దూసి రామమూర్తి శాస్త్రి
4. రమణీయము - శ్రీ దువ్వూరి వేంకటరమణ శాస్త్రి



**డాక్టర్ కౌతా సుబ్రహ్మణ్య శాస్త్రి**
రీడర్ మరియు ఆంధ్ర శాఖాధ్యక్షులు
(రిటైర్డ్)
హిందూ కళాశాల
గుంటూరు

# పాఠం - 9

# తతయు ˆరిచ్ఛేదం

పాఠ్యనిర్మాణక్రమం

9.0 లక్ష్యం

9.1 పారిభాషిక పదాలు

1. ఏకవచనం, 2. బహువచనం, 3. ఆమంత్రణం, 4. మహత్తులు, 5. ఇత్తు, 6. డుమంతం, 7. నామం, 8. కృతోత్కం, 9. ఉపోత్తమం, 10. అజంతం, 11. హలంతం, 12. వర్ణం, 13. వర్ణకం, 14. హ్రస్వం, 15. దీర్ఘం, 16. ప్లుతం.

9.2.1 తెలుగు విభక్తుల్ని వివరించండి.

9.2.2 అకారాంత సంస్కృత శబ్దాలు తత్సమాలయ్యే విధం.

9.2.3 ఇకారాంత సంస్కృత శబ్దాలు తత్సమాలయ్యే విధం.

9.2.4 ఉకారాంత సంస్కృత శబ్దాలు తత్సమాలయ్యే విధం.

9.2.5 ఋకారాంత సంస్కృత శబ్దాలు తత్సమాలయ్యే విధం.

9.2.6 నకారాంత సంస్కృత శబ్దాలు తత్సమాలయ్యే విధం.

9.2.7 సకారాంత సంస్కృత శబ్దాలు తత్సమాలయ్యే విధం.

9.2.8 ఆమంత్రణంలో జరిగే వ్యాకరణ కార్యాల్ని తెల్పండి.

9.2.9 తత్సమ శబ్దాలకు బహువచనంలో జరిగే వ్యాకరణ కార్యాల్ని వివరించండి.

9.3 సమీక్ష

9.4 ప్రశ్నలు

9.5 ఆధార గ్రంథాలు

## 9.0 లక్ష్యం

తత్సమ పరిచ్ఛేదంలోని పారిభాషిక పదాలను పరిచయం చేయడం, తత్సమ పరిచ్ఛేదంలోని వ్యాసరూప ప్రశ్నలను వివరించడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## 9.1 పారిభాషిక పదాలు

### 9.1.1 ఏకవచనం

డు, ము, వు, న లేకవచనంబులు. ఏకత్వ సంఖ్యను బోధించు ప్రత్యయం బేకవచనంబు. రాముడు - సోముడు - వనము - ధనము - ధేనువు - భానువు. డు, ము, వు అనే ప్రథమా విభక్తి ప్రత్యయాలు మూడును, 'న' అనే సప్తమీ విభక్తి ప్రత్యయమును ఏకవచన మౌతుంది. ధనమున, వనమున అనేవి 'న' వర్ణకానికి ఉదాహరణాలు.

### 9.1.2 బహువచనం

లు వర్ణంబు బహువచనంబు. బహుత్వ సంఖ్యను బోధించు ప్రత్యయంబు బహువచనంబు. రాములు - సోములు - వనములు - ధనములు - ధేనువులు - భానువులు ప్రథమా విభక్తి యందలి 'లు' అనే ప్రత్యయం బహువచనం. ఒకటి కంటే ఎక్కువ పదార్థాలను బోధించే ప్రత్యయం బహువచనం.

### 9.1.3 ఆమంత్రణం

ఓ యామంత్రణంబు నందగు. ఆమంత్రణం అంటే పిలుపు. ఒకరిని పిలవాల్సి వచ్చినప్పుడు 'ఓ' అనే శబ్దాన్ని సంబోధ్య వాచకానికి ముందు ప్రయోగిస్తారు. ఓ రాముడ - ఓ రాములార.

### 9.1.4 మహత్తులు

స్త్రీ తిర్యగ్జడ భిన్నంబులును వాని విశేషణంబులును మహత్తులనంబడు.

స్త్రీలును, పశుపక్ష్యాదులును, అచేతనాలు కాక తక్కిన వానిని వాని విశేషణాలను మహద్వాచకాలంటారు. స్త్రీలను స్త్రీలకు చెందే విశేషణాలను మహతీ వాచకాలంటారు. పశుపక్ష్యాదుల్ని, జడాలను అమహద్వాచకాలంటారు.

### 9.1.5 ఇత్తు

ప్రత్యయాదులందు నిబద్ధమయి ప్రయోగించునపుడు మానంబడు వర్ణమిత్తు నాబడు.

ఒక ప్రయోజనాన్ని అపేక్షించి ప్రత్యయాలలో కూర్చబడి ప్రయోగించునప్పుడు మానబడే వర్ణానికి ఇత్ వర్ణమని పేరు. రాము + డుజ్ - రాముఁడు అవుతుంది. ఇక్కడ 'డు' ప్రత్యయంతో కూర్చబడిన 'జ్' కారం ఇత్తు. రాముడు అని ప్రయోగించేటప్పుడు జ కారం లేకుండాపోతుంది. కాబట్టి డుజ్ లోని 'జ' కారం ఇత్తు. యట్ లోని 'ఉ' కారం, ను 'క్' లోని 'క' కారం మొదలైనవి ఇత్తులు.

### 9.1.6 డు మంతం

డు ప్వర్ణకంబునకుం బ్రకృతి యయినది డుమంతం బనంబడు.

డుజ్ అనే ప్రత్యయం దేనికి చేరుతుందో అది డుమంతం. రాముడు అనే శబ్దంలో 'డు' ప్రత్యయం 'రాము' అనే దానికి చేరుతోంది. కాబట్టి 'రాము' అనేది డుమంతం.

### 9.1.7 నామము

నామంబనగా బ్రాతిపదికము.

ధాతువు కాని, ప్రత్యయం గాని కాకుండా అర్థవంతమై ఉండేది ప్రాతిపదిక. దీనికే నామమని మరొక పేరు. డిత్థ్ - రామ - భార్గవ రాజపురుష మొదలైనవి నామాలు. డిత్థుడు - రాముడు - భార్గవుడు రాజపురుషుడు. డిత్థుడు అనగా "శ్యామరూపోయు వావిద్వాన్ సుందః ప్రియదర్శనః సర్వశాస్త్రార్థ వేత్తాచ డిత్థ ఇత్యాభిధీయతే".

### 9.1.8 కృతోత్కం

కృత + ఉత్కము - కృతోత్కము అనగా చేయబడిన ఉత్వము గలది అని అర్థం. ఉత్ + క - హ్రస్వ ఉకారము "పుంలింగంబయి మహద్వాచకంబయిన నామంబు తుది యత్వంబున కుత్వంబగు" అనే సూత్రాన్ననుసరించి ఓ రామ! అనేది ఓ రాము అని మారి కృతోత్కమేన సంస్కృత ప్రాతిపదిక అయింది.

### 9.1.9 ఉపోత్తమము

ఉప + ఉత్తమము - ముడు గాని లేదా అంతకంటే ఎక్కువ గాని అక్షరాలున్న శబ్దంలో చివరి అక్షరానికి ఉత్తమం అని సంజ అక్షరం అంటే అచ్చు లేదా అచ్చు చేరిన హల్లు. 'కలికి' అనే పదంలో 'కి' అనేది ఉత్తమం. 'లి' అనేది ఉపోత్తమం.

### 9.1.10 అజాతం

అచ్ + అంతం - అచ్చులు అంతమందు గల శబ్దాలు. అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ, ౠ, ఌ, ౡ, ఏ, ఐ, ఓ, ఔ, అం, అః అనే 16 వర్ణాలు అచ్చులు.

### 9.1.11 హలంతం

హల్ + అంతం - హల్లులు అంతమందుగల శబ్దాలు. క, ఖ, గ, ఘ, ఙ, చ, ఛ, జ, ఝ, ఞ, ట, ఠ, డ, ఢ, ణ, త, థ, ద, ధ, న, ప, ఫ, బ, భ, మ, య, ర, ల, వ, శ, ష, స, హ, ళ అనే 34 వర్ణాలు హల్లులు.

### 9.1.12 వర్ణం

వర్ణం అంటే అక్షరం. సంస్కృతములకు వర్ణాలు 50. ఇందులో 16 వర్ణాలు అచ్చులు, 34 వర్ణాలు హల్లులు.

### 9.1.13 వర్ణకం

'ప్రత్యయంబు వర్ణకంబని ప్రాచీనులు వ్యవహరింతురు' అని బాలవ్యాకర్త చిన్నయసూరి పేర్కొన్నాడు. ప్రథమా విభక్తి ప్రత్యయాలైన డు, ము, వు, లు ద్వితీయా విభక్తికి చెందిన నిన్, నున్, లన్, కూర్చి, గుఱించి, తృతీయ విభక్తికి చెందిన చేతన్, చేన్, తోడన్, తోన్ చతుర్థీ విభక్తికి చెందిన కొఱకున్, కై పంచమీ విభక్తికి చెందిన నుండి, వలనన్, కంటెన్, పట్ట షష్ఠీ విభక్తి చెందిన కిన్, కున్, యొక్క, లోన్, లోపలన్ సప్తమీ విభక్తి చెందిన అందున్, ఇందున్, నన్ అనేవి వర్ణకాలు.

### 9.1.14 హ్రస్వం

ఏక మాత్రా కాలంలో పలుకబడి అచ్చు. మాత్ర అంటే ఒక సెకనులో 5వ వంతు కాలం లేదా ఒక చిటిక వేయుటకు పట్టు కాలం. (ఏక మాత్రా భవేద్ హ్రస్వః).

ఉదా. అ, క, మ, వ, ర, త . . . . . .

### 9.1.15 దీర్ఘం

రెండు మాత్రల కాలంలో పలుకబడే అచ్చు (ద్వి మాత్రో దీర్ఘ ఉచ్చతే)

ఉదా. ఆ, కా, మా, వా, రా, తా, అం, కం, యం . . . . . . .

**9.1.16 ప్లుతం**

మూడు మాత్రల కాలంలో పలుకబడే అచ్చు. (త్రిమాత్రస్తు ప్లుతో జ్ఞేయః).

ఓ రామా$_3$ . . .   ఓ విష్ణూ$_3$ . . .   ఓ శంభూ$_3$ . . .

ఉచ్చారణ ప్రమాణాన్ని చూపటాన్ని ఆ వర్ణం క్రింద మూడు అంకె వేయటం సంప్రదాయం.

**9.2.1 తెలుగు విభక్తుల్ని వివరించండి.**

ఆంధ్ర శబ్ద చింతామణి యందును, తదనంతర వ్యాకరణము లందును విభక్తుల విభాగము ఈ క్రింది విధంగా ఉంది.

| | |
|---|---|
| 1) ప్రథమా విభక్తి | డు, ము, వు, లు |
| 2) ద్వితీయా విభక్తి | నిన్, నున్, లన్, కూర్చి, గురించి |
| 3) తృతీయా విభక్తి | చేతన్, చేన్, తోడన్, తోన్ |
| 4) చతుర్థీ విభక్తి | కొఱకున్, కై |
| 5) పంచమీ విభక్తి | వలనన్, కంటెన్, పట్టి |
| 6) షష్ఠీ విభక్తి | కిన్, కున్, యొక్క, లోన్, లోపలన్ |
| 7) సప్తమీ విభక్తి | అందున్, నన్ |

1) ప్రథమా విభక్తి : డు, ము, వు, లు అనేవి నాలుగు ప్రథమా విభక్తి ప్రత్యయాలు. ఇందులో డు, ము, వు, అనేవి ఏకత్వ సంఖ్యను మాత్రమే బోధిస్తాయి. రాముడు, వనము, ధేనువు ఏకవచనాలు. 'లు' వర్ణంబు బహువచనంబు' 'లు' వర్ణంబు బహుత్వ సంఖ్యను బోధిస్తుంది. కాబట్టి బహువచనం. రాములు, వనములు, ధేనువులు.

2) ద్వితీయా విభక్తి : 'ను' వర్ణంబు ద్వితీయ. ద్వితీయా విభక్తిలో 'ను' అనేది ఒక్కటే ప్రత్యయం. ఇది ఏకవచనాన్ని, బహువచనాన్ని గూడా సూచిస్తుంది. వనమును, వనములను. 'ఇకారంబు మీది కు, ను, వు క్రియా విభక్తుల యుత్వంబున కిత్వంబగు' అనే సూత్రాన్ని బట్టి 'ను' అనే ప్రత్యయం 'ని' గా మారుతుంది. హరిని, రాముని, పైని.

3) తృతీయా విభక్తి : "చేత, తోడ, లోపల వర్ణకంబుల ప్రథమాక్షరంబులు వైకల్పికంబుగా శేషించు" అనే సూత్రంచే చే, తో అనేవి ప్రత్యయాలు వ్యవహరింపబడతాయి.

4) చతుర్థీ విభక్తి : 'కొఱకు కయి చతుర్థి' ఇవి ఏకత్వ బహుత్వాలు రెండింట వస్తాయి. రాముల కొఱకున్, రాములకయి.

5) పంచమీ విభక్తి : వలన, కంటె, పట్టి అనేవి పంచమీ విభక్తులు. ఇవి ఏకత్వ బహుత్వాలు రెండింట వస్తాయి. వనముల వలనన్, వారికంటెన్

'ఉండి పదంబొకానొకచో వలన వర్ణకంబున కనుప్రయుక్తంబగు'

హిమగిరి వలన నుండి గంగ వొడమెను
హిమగిరి వలన గంగ వొడమెను
హిమగిరి నుండి గంగ వొడమెను

6) షష్ఠీ విభక్తి : 'కు, యొక్క, లోపల షష్ఠి'. కి, కు, యొక్క, లోపల అనేవి మూడును షష్ఠీ విభక్తులు. ఇవి ఏకవచనం బహువచనం రెండూ అవుతాయి. రామునకును, రాములకును - 'రామునకు' అని ఉన్నప్పుడు చివరనున్న 'కు' వర్ణమే ఇకారము మీద వచ్చినపుడు 'హరికి' మున్నగు విధంగా 'కి' వర్ణం వస్తుంది. రామునకు, రామునికి.

7) సప్తమీ విభక్తి : అందు, న అనేవి రెండును సప్తమీ విభక్తులు. 'డు, ము, వు, న లోకవచనంబులు 'కాబట్టి వీటిలో' 'న' అనేది ఏకవచనం. వనమునను.

'అందు' ఏక బహువచనాలు రెండు అవుతుంది. వనము నందును, వనములందును.

'తృతీయాదులకు నుగాగమంబగు' అని చెప్పి "కయి పట్టి యొక్కలకు నుగాగమంబు లేదు" అని నిషేధించటం చేత కయి, పట్టి, యొక్క అనే మూడింటికి కాక తక్కిన ప్రత్యయాలన్నింటికి చివర ద్రుతం (న్) చేరుతుంది. చేత, తోడ, లోపల అనే ప్రత్యయాలకు నుగాగమం వచ్చి చేన్, తోన్, లోన్ అనే విధంగా ఉంటుంది.

### 9.2.2 అకారాంత సంస్కృత శబ్దాలు తత్సమాలయ్యే విధం తెల్పండి.

అకారం చివరి యందుండే శబ్దాల్ని అకారాంత శబ్దాలు అంటారు. రాము - రామ్ + అ, వనిత - వనిత్ + అ, వృక్ష - వృక్ + అ, సుర - సుర్ + అ, బాల - బాల్ + అ, రమా - రమ్ + ఆ. సంస్కృత భాషలో ప్రాతిపదికలుగ ఉన్న శబ్దాలే తెలుగులో గూడా వ్యవహరింప బడతాయి. సంస్కృత భాషలో 'సు, ఔ, అస్ ... ' వంటి ప్రత్యయాలు ప్రాతిపదికలకు చేరి రూపాలు ఏర్పడతాయి. తెలుగు విభక్తి ప్రత్యయాలు ప్రాతిపదికలకు చేరి తెలుగు రూపాలు ఏర్పడతాయి.

'నామంబుల తుది దీర్ఘంబునకు హ్రస్వంబగు' అనే 54వ సూత్రాన్ననుసరించి రమా - రమ, వనితా - వనిత, విద్యా - విద్య, లక్ష్మీ - లక్ష్మి, సేనానీ - సేనాని వంటి రూపాలేర్పడతాయి. 'ఏకాక్షరంబులకు హ్రస్వంబు లేదు' అనే 55 సూత్రాన్ని అనుసరించి క్ష్మా - మా - శ్రీ - స్త్రీ - వంటి రూపాలకు హస్వం లేదు.

'రామ' అనే ప్రాతిపదికకు 'పుంలింగంబయి మహద్వాచకంబయిన నామంబు తుది యత్వంబున కుత్వంబగు' అనే 21 సూత్రాన్ననుసరించి రామ్ + ఉ - రాము అవుతుంది.

'పుంలింగమగు మహద్వాచకమునకు డుజ్ఞగు' అనే 22 సూత్రాన్ననుసరించి రాము + డుఙ్ అవుతుంది.

'ఙిత్తు బిందు పూర్వంబగు' అనే 19వ సూత్రాన్ననుసరించి రాముండు అనే రూపం ఏర్పడుతుంది.

'వృద్ధాదుల డుజ్ఞునకు లోపంబు విభాషనగు' అనే 56వ సూత్రాన్ని బట్టి వృద్ధ మొదలైన శబ్దాలలోని చివరనున్న అత్వానికి ఉత్వం వచ్చి డుఙ్నకు వికల్పంగా లోపం వచ్చి వృద్ధు - వృద్ధుడు వంటి రూపాలేర్పడతాయి.

'దూతాదులకు స్త్రీత్వంబు బహుళంబుగా నగు' అనే 61 సూత్రాన్ని బట్టి దూత - దూతుడు, యోధ - యోధుడు వంటి రూపాలు ఏర్పడతాయి.

'సుర శబ్దంబు నిత్యంబుగా' అసుర శబ్దము వైకల్పికముగా స్త్రీ తుల్యములగు సంస్కృత సమాసంబుల గావు', సుర -

సురలు , అసుర - అసురుడు.

సంబోధనంబునందేకార్థం బయిన పదంబు తుది యుకారంబున కకారంబగు. రామ - రాముడ, రామ - రాముడా! 'డుమంతంబునకు ద్వితీయాద్యేక వచనంబు పరంబగు నప్పుడు నిగాగమంబు సర్వత్ర విభాషనగు' అనే 23వ సూత్రాన్ని బట్టి రామునిని, రాము చేత, రామునికిని, రామునకును వంటి రూపాలేర్పడతాయి.

'అనుదంతమగు తెనుగ డు మంతమునకు ని గాగమము నిత్యముగా నగును. మగనిని - మగని చేతను, తమ్మునిని - తమ్ముని - తమ్ముని చేతను.

స్త్రీ లింగంబుల ప్రథమైక వచనంబునకు లోపంబగు' అనే 57వ సూత్రాన్ని బట్టి రమ - క్షమ - వనిత - ఘనత - విద్య - దేవత - మానసేత్ర వంటి రూపాలేర్పడతాయి.

'అమహన్నపుంసకముల కదంతములకు ము వర్ణకంబగు అనే 39వ సూత్రాన్ని బట్టి వృక్షము - ఋక్షము, దేవము, కళత్రము.

'ము వర్ణకంబునకు మాముడి యేసం బూర్ణ బిందు పూర్వక బు వర్ణం లేని విభాష నగు అనే 42వ సూత్రాన్ని బట్టి వృక్షము - వృక్షంబు, వృక్షమ్మ - వృక్షంబులు ఏర్పడతాయి.

'చరిత్రాదుల ము వర్ణకంబునకు లోపంబు బహుళంబుగా నగు' అనే 58వ సూత్రాన్ని బట్టి చరిత్ర - చరిత్రము, చరిత - చరితము 'బహుళంబు' అనటం చేత దర్బ మొదలైన వాని మీద ఈ లోపం నిత్యం. అందువల్ల దర్భ - పనస అనే రూపాలే ఉంటాయి.

'లు - ల - నలు పరంబు లగునపుడొకానొకచో ముగాగమంబునకు లోపంబును దత్పూర్వ స్వరంబునకు దీర్ఘంబున విభాషనగు అనే 43వ సూత్రాన్ని బట్టి వజ్రాలు - వజ్రాలను, పగడాలు - పగడాలను ఏర్పడతాయి.

'క్లీబంబులు మిత్రాదులు మహద్వాచకంబులు విభాషం బుంలింగ తుల్యంబులగు' అనటం చేత నపుంసక లింగ శబ్దాలైన 'మిత్ర' మొదలైనవి వికల్పంగా పుంలింగ తుల్యాలౌతాయి. అందువల్ల మిత్రుడు - పాత్రుడు, మిత్రము - పాత్రము వంటి రూపాలేర్పడతాయి. 'ఆగమ ము - వు వర్ణంబుల కందు వర్ణకము పదంబగు నపుడు నుగాగమంబు విభాషనగు అనే 30వ సూత్రాన్న నుసరించి సప్తమీ విభక్తి ఏకవచనంలో 'అందు' పరమైనప్పుడు వికల్పంగా నగాగమం వచ్చి వృక్షము నందు - వృక్షమందు, వనము నందును, వనమందును, ధేనువు నందును - ధేనువందును ఏర్పడతాయి. 'బహుత్వంబున ద్వితీయాది విభక్తులకు లడాగమంబగు' అనే 31వ సూత్రాన్ని బట్టి రాములను - రాముల చేతను, వనితల కొఱకు - వనముల యందు వంటి రూపాలేర్పడతాయి.

### 9.2.3 ఇకారాంత సంస్కృత శబ్దాలు తత్సమాలయ్యే విధానాన్ని తెల్పండి.

ఇకారం చివరలో ఉన్న శబ్దాలు ఇకారాంతాలు. అజంతాలు (అచ్చులకు సంబంధించిన వర్ణాలు) అయినటు వంటి శబ్దాలు సంస్కృతంలో వేటిని ప్రాతిపదికలుగ కలిగి ఉంటాయో తెలుగులో గూడా అవే ప్రాతిపదికలుగ ఉంటాయి.

'నామంబుల తుది దీర్ఘంబునకు హ్రస్వంబగు' అనే 54వ సూత్రాన్ననుసరించి లక్ష్మీ, సేనానీ వంటి ఇకారాంత శబ్దాలకు హ్రస్వం వచ్చి లక్ష్మి, సేనాని అని అవుతాయి.

'ఏకాక్షరంబులకు హ్రస్వంబు లేదు' అనే 55వ సూత్రం వల్ల శ్రీ, స్త్రీ, హ్రీ, ధీ, భీ వంటి ఇకారాంత శబ్దాలకు హ్రస్వం రాదు.

'ఇగ్లౌరా యుగంతంబుల ప్రథమైక వచనంబునకు లోపంబగు' అనే 44వ సూత్రం వల్ల హరి, శ్రీ అనేవి విభక్తి ప్రత్యయం రూపాలు గాని మిగులుతాయి.

హరి అనేది ఇకారాంతమైన ప్రాతిపదిక. దీనికి ప్రథమా విభక్తి ఏకవచనం పరంకాగా హరి + సు అని అవుతుంది. ఇకారాంత ప్రథమైక వచనానికి లోపం రావటం వల్ల 'సు' అనేది (హరి + స్సు) లోపించి 'హరి' అనే రూపమే ఉంటుంది. తెలుగు వ్యాకరణంలో చెప్పని విషయాలు సంస్కృత వ్యాకరణ సూత్రాల ననుసరించి ఏర్పడతాయి. 'శ్రీ' అనేది ప్రాతిపదిక అయినప్పుడు 'సు' అనే సంస్కృత ప్రథమా విభక్తి ప్రత్యయం చేరి శ్రీ + సు అవుతుంది. ఈ సూత్రం వల్ల 'సు' లోపించి 'శ్రీ' అనేదే పదంగా మిగులుతుంది.

'ఇత్తునకు బహువచనంబు పరంబగునపు డుత్వంబగు' అనే 45 సూత్రాన్ననుసరించి హరులు, గిరులు, కవులు, రవులు, యామినులు, భామినులు రూపాలేర్పడతాయి.

హరి + లు - హరి + ఉ + లు - హరులు.

ఈ సూత్రంలోని 'ఇత్' అంటే హ్రస్వమైన ఇకారమనే అర్థం. దీర్ఘమైన ఇకారాన్ని (ఈ) ఇది బోధించదు.

శ్రీ + లు - శ్రీలు, స్త్రీ + లు - స్త్రీలు, లకోరీ + లు - లకోరీలు (లకోరీ - బాణం).

అచ్చ తెలుగుకు చెందిన ఇకారాంత శబ్దాల ఉపోత్తమమైన ఇత్వానికి బహువచనం పరమైనపుడు ఉత్వం వస్తుంది. కలికి - కలికులు, ములికి - ములుకులు, చెలిమి - చెలుములు.

'రలడోప నవార్థాదుల యుపోత్త మేత్వంబున కుత్వంబు గలుగదు' అనే 47వ సూత్రాన్ననుసరించి ఉపథాస్థానంలో ర, ల, డ, అనే వర్ణాలలో దేనిని కలిగి ఉన్నను, తొమ్మిది మొదలైన పదాలలోని ఉపోత్తమ ఇత్వానికి ఉత్వం రాదు.

పందిరి - వందిరులు, పిడికిలు - పిడికిళులు, రాపిడి - రాపిడులు, తొమ్మిది - తొమ్మిదులు.

**9.2.4 ఉకారాంత సంస్కృత శబ్దాలు తత్సమాలయ్యే విధానాన్ని తెల్పండి.**

ఉకారం చివరి యందు గల శబ్దాలు ఉకారాంతాలు. అజంతాలు (అచ్చులు చివరి యందుండే శబ్దాలు) అయినటువంటి శబ్దాలు సంస్కృతంలో వేటిని ప్రాతిపదికలుగ కలిగి ఉంటాయో తెలుగులో గూడ అవే ప్రాతిపదికలుగ ఉంటాయి.

'నామంబుల తుది దీర్ఘంబునకు హ్రస్వం బగు' అనే 54వ సూత్రాన్ననుసరించి సంస్కృత ప్రాతిపదిక చివరనున్న దీర్ఘానికి హ్రస్వం వస్తుంది. స్వయంభూ - స్వయంభు అవుతుంది. 'ఏకాక్షరంబులకు హ్రస్వంబు లేదు' అనే 55వ సూత్రాన్ననుసరించి సంస్కృత ప్రాతిపదిక ఒకే అక్షరమైన శబ్దమయితే హ్రస్వం రాదు. భ్రూ, గో వంటి ఉకారాంత శబ్దాలకు హ్రస్వం రాదు.

'ఉకారాంత గో శబ్దంబుల కంతట వు వర్ణకంబగు' అనే 48వ సూత్రం వల్ల ఉకారాంతాలైన శబ్దాలు ఏ లింగంలో ఉన్నప్పటికిని ప్రథమా విభక్తి ఏకవచనంలో 'వు' వర్ణకం వస్తుంది.

తరువు - ధేనువు - మధువు - గోవు

'వు' వర్ణకేతర విభక్తి పరమగుచో నుకారాంతంబులకు బహుళముగా గో శబ్దంబునకు నిత్యంబుగా వుగాగమంబగు' అనే 49వ సూత్రాన్ననుసరించి -

తరువులు - తరులు
ధేనువులు - ధేనులు
తరు + లు - తరు + (వు) + లు - తరువులు, తరులు (బహుళం)
గో + లు - గో + వు + లు - గోవులు

ఉకారాంతంబగు మహత్తునకు వు వర్ణకము బహుళముగా నగు.

విష్ణువు - విష్ణుడు
శంభువు - శంభుడు
వసువు - వసుడు

'వు' ప్రత్యయం మహద్వాచకాలకు బహుళంగా వస్తుంది.

విష్ణు + వు - విష్ణువు
విష్ణు + డుఙ్ - విష్ణుడు (పుంలింగ మగు మహద్వాచమునకు డుజ్ఞగు అనే 22 సూత్రాన్ననుసరించి)

'కద్రువ నాగమాత'

కద్రువ - కద్రువలు
కద్రువను - కద్రువలను

కద్రువ అనే పదం సర్పజాతికి తల్లి యొక్క పేరు. సంస్కృత భాషలో 'కద్రు' అని ఒక శబ్దం, కద్రూ అని మరొక శబ్దం ఉన్నాయి. మొదటిది పుంలింగ శబ్దం. దీనికి గోరోచన వర్ణమని అర్థం. రెండవదైన 'కద్రూ' అనేది ఊకారాన్త స్త్రీలింగ శబ్దం. దీనికి నాగమాత అని అర్థం. తెలుగు భాషలో కద్రు, కద్రూ అనే రెండు రూపాలకు 'వు' ప్రత్యయం వచ్చి కద్రువు, కద్రూవు అనే రూపాలు వస్తాయి. కద్రూ శబ్దంలో చివర ఉన్న 'ఊ' కారం హ్రస్వగా మారి 'వు' వర్ణకం చేరి కద్రువు అనే అవుతుంది. పూర్వ సూత్రాల ననుసరించి 'కద్రువు' అనే రూపమేర్పడుతుండగా 'కద్రువు' అనే రూపాన్ని ఈ సూత్రం ద్వారా ప్రకటించడం జరిగింది. 'కద్రువ' అనేదే తత్సమ రూపంగా గ్రహించాలి. ఇతర విభక్తులతో కలిసినప్పుడు కద్రువను, కద్రువతో, కద్రువలను, కద్రువులతో వంటి రూపాలే ఏర్పడతాయి.

### 9.2.5 ఋకారాంత సంస్కృత శబ్దాలు తత్సమాలయ్యే విధానాన్ని తెల్పండి.

ఋకారం చివరలో ఉన్న శబ్దాలు ఋకారాంతాలు. అజంతాలు (అచ్చులకు సంబంధించిన వర్ణాలు) అయినటువంటి శబ్దాలు సంస్కృతంలో వేటిని ప్రాతిపదికలుగ కలిగి ఉంటాయో తెలుగులో గూడ అవే ప్రాతిపదికలుగ ఉంటాయి.

'ఋకారాంతంబున కత్వంబును స్త్రీవద్భావంబునగు' 52వ సూత్రం.

భ్రాత - జామాత - కర్త - భర్త
హర్త - గంత - హంత

ఋకారాంత శబ్దాలకు చివరి యందున ఋకారం పోవుడము, 'స్త్రీ లింగంబుల ప్రథమైక వచనంబునకు లోపంబునగు' అనే 57 సూత్రం వల్ల స్త్రీ లింగములకు చెప్పబడిన విధంగా ప్రథమా విభక్తి ఏకవచనము నందు విభక్తి ప్రత్యయం లోపించడం

జరుగుతుంది.

భ్రాత - భ్రాత్ + ఋ (డు, ము, వు, లు రాక, ఋకారం లోపించి)

స్త్రీవద్భావం అంటే స్త్రీలింగం వలె అవటం. స్త్రీ లింగ తుల్యత్వం వల్ల ఉత్వ, డుజ్లులు రావు. అంటే భ్రాతుడు అనే రూపం ఏర్పడదు. సంస్కృతంలో భ్రాత + సు అని ఏర్పడి 'సు' ప్రత్యయం లోపించి భ్రాత అనే రూపం మిగులుతుంది. ఇదే విధంగా జామాత, కర్త, భర్త, హర్త, గంత, హంత అనే రూపాలు ఏర్పడతాయి.

'విధాతృ ధాతృ సవితృ నేతృ శబ్దంబుల మహత్తుల కత్వ స్త్రీ వద్భావంబులు విభాషనగు' అనే సూత్రాన్ననుసరించి -

విధాత - విధాతృడు
ధాత - ధాతృడు
దాత - దాతృడు
సవిత - సవితృడు
నేత - నేతృడు

అనే రూపాలు ఏర్పడతాయి. ఈ పైన చెప్పబడిన ఐదు శబ్దాలకు మాత్రం అత్వము, స్త్రీ వద్భావము వికల్పంగా వస్తాయి. మిగిలిన వికల్పరూపాలలో 'పుం లింగమగు మహద్వాచకానికి డు జ గు' అనే 22వ సూత్రాన్ననుసరించి డుజ్ వస్తుంది.

విధాతృ - విధాత్ + ఋ ('ఋ' లోపం)
- విధాత్ అ
- విధాత

విధాతృ + డుజ్ - విధాతృడు

ఈ రెండు రూపాలు పైన చెప్పిన ఐదు శబ్దాలకు వికల్పం అత్వం, స్త్రీ వద్భావం రెండు వస్తే కలిసే వస్తాయి. లేదా రెండూ రావు. సూత్రంలో 'మహత్తులకు' అనటం వల్ల అమహత్వంలో అత్వం స్త్రీ వద్భావం నిత్యంగానే అవుతుందని అర్థం. అత్వ స్త్రీవద్భావాలైన శబ్దాలు స్త్రీ లింగ కార్యాల్ని పొందుతాయి. రమన, రమచేత, అనే రూపాలవలె భ్రాతను, విధాత చేత మొదలైన రూపాల్ని పొందుతాయి.

'స్త్రీ లింగంబు లెల్ల స్వస్వ నియతంబులగు స్త్రీ ప్రత్యయంబులం గూడి యిందు ప్రవర్తిల్లు' అనే 85వ సూత్రాన్ననుసరించి, కర్తృ అనే నామం కర్త్రీ అనే స్త్రీ ప్రత్యయాంతమయి 'నామంబుల తుది దీర్ఘంబునకు హ్రస్వంబగు' అనే 54వ సూత్రాన్ననుసరించి కర్త్రీ అనేది కర్త్రి అనే హ్రస్వం రూపాన్ని పొందుతుంది.

'ఇగ్లొరా యుగంతంబుల ప్రథమైక వచనంబునకు లోపంబగు' అనే 44వ సూత్రాన్ననుసరించి కర్త్రి - ధాత్రి అనే రూపాలుంటాయి. 'ఇత్తునకు బహువచనంబు పరంబగునప్పు డుత్వంబగు' అనే 45వ సూత్రాన్ననుసరించి హస్వ ఇకారాంతాలకు వలె ఆయాకార్యాలవుతాయి. ధాత్రులు - కర్త్రిని - నేత్రికి - ఓ ధాత్రీ! వంటి రూపాలు వ్యవహృతమౌతాయి.

**9.2.6 నకారాంత సంస్కృత శబ్దాలు తత్సమాలయ్యే విధానాన్ని తెల్పండి.**

నకారం చివరలో ఉండే శబ్దాలు నకారాంతాలు.

విశ్వకర్మ(న్) - విశ్వకర్మ
కృష్ణవర్మ(న్) - కృష్ణవర్మ
అశ్వత్థామ(న్) - అశ్వత్థామ

'విశ్వకర్మాదులకు స్త్రీత్వంబగు' అని 75వ సూత్రం. విశ్వకర్మ, కృష్ణవర్మ - అశ్వత్థామ - యువ - యజ్వ మొదలైనవి విశ్వకర్మాదులు. ఈ శబ్దాలకు స్త్రీత్వాన్ని చెప్పటం వల్ల 21, 22 సూత్రాల ప్రకారం వచ్చే ఉత్వము, డుజ్ణులు ఇక్కడ నిషేధింపబడ్డాయి. 'స్త్రీలింగంబుల ప్రథమైక వచనంబునకు లోపంబగు' అనే 57 సూత్రాన్ననుసరించి ప్రథమైక వచన లోపం వస్తుంది.

'మహద్వాచకమయి పుంలింగంబగు బ్రహ్మశబ్దమునకు స్త్రీత్వంబగు' అనే 76వ సూత్రం వల్ల మహత్పుంలింగమయిన బ్రహ్మన్ శబ్దానికి స్త్రీత్వం కలుగుతుంది. అందువల్ల 'పుంలింగంబయి మహద్వాచకంబయిన నామంబు తుది యత్వంబున కుత్వంబగు' అనే 21 సూత్రం. పుంలింగమగు మహద్వాచకమునకు డుజ్ణగు అనే 22 సూత్రానికి సంబంధించి ప్రక్రియ రాకుండ నిషేధింపబడింది. స్త్రీ లింగత్వం ఆపాదింపబడడం వల్ల ప్రథమైక వచన లోపం మొదలైన స్త్రీ లింగ కార్యాలవుతాయి.

బ్రహ్మ - ఈ శబ్దం చతుర్ముఖ ఋత్విగ్విప్రులకు వాచకము. చతుర్ముఖ ఋత్విక్ విప్రుడు - చతుర్ముఖుడు (నాలుగు ముఖాలు గల్గిన బ్రహ్మదేవుడు). ఋత్విక్కు (యజ్ఞము చేయించువాడు), విప్రుడు (బ్రాహ్మణుడు). ఈ మూడు అర్థాలలో మాత్రము ప్రస్తుత సూత్రం ప్రకారం స్త్రీత్వం వస్తుంది. తత్వము - తపస్సు - వేదము - యోగము అనే అర్థాలలో వాడే బ్రహ్మ శబ్దం అమహత్తు గనుక 'ము' వర్ణకం వచ్చి బ్రహ్మము అనే రూపం ఉంటుంది.

'ఆత్మేమనిజంతంబులకు నాంతంబులకు మనుజ సంజలకు స్త్రీత్వంబు బహుళంబుగా నగు' అనే 77వ సూత్రాన్ననుసరించి ఆత్మ శబ్దానికి, ఇమనిచ్ చివరలో ఉన్న శబ్దాలకి, నకారాంతాలైన మనుష్య నామాలకి స్త్రీత్వం బహుళంగా అవుతుంది.

ఆత్మశబ్దం 'ఆత్మన్' అని నకారాంతం. 'ఆత్మ' ప్రాతిపదిక అమహద్వాచకమైతే 'ము' వర్ణకం వచ్చి ఆత్మ + ము అవుతుంది. స్త్రీత్వం అయితే 'స్త్రీలింగముల ప్రథమైక వచనంబునకు లోపంబగు అనే 57వ సూత్రం వల్ల 'ము' వర్ణకం లోపించి 'ఆత్మ' అని మిగులుతుంది.

మహద్వాచకమైతే 'పుంలింగమగు మహద్వాచకమునకు డుజ్ణగు' అనే 22వ సూత్రాన్ననుసరించి ఆత్ముడు, ఆత్ముండు అనే రూపాలౌతాయి.

ఇమనిచ్ + అంత - ఇమనిజంత.

ఇమనిచ్ అనే దాంట్లో 'ఇమన్' అనేదే చేరుతుంది. స్త్రీత్వం అయితే

మహత్ + ఇమన్ - మహిమన్ - మహిమ

అణు + ఇమన్ - అణిమన్ - అణిమ

గురు + ఇమన్ - గరిమన్ - గరిమ

లఘు + ఇమన్ - లఘిమన్ - లఘిమ

అవుతాయి. స్త్రీత్వం రాకపోతే అమహద్వాచకం లవడం వల్ల 'ము' వర్ణకాన్ని పొంది మహిమము, అణిమము, గరిమము, లఘిమము అవుతాయి.

మనుజ సంజ్ఞ అయిన 'దేవశర్మ' అనేది నకారాంత శబ్దం. పుంలింగం, మహద్వాచకం అయినప్పుడు ఉత్వము, డుజ్ఞులు వచ్చి దేవశర్మ - దేవశర్ముడు అవుతుంది. 'ఆత్మేమనిజింతంబులకు నాంతంబులగు మనుజ సంజ్ఞలకు స్త్రీత్వంబు బహుళంబుగా నగు' అనే 77వ సూత్రం వల్ల ప్రథమా విభక్తి ఏకవచనం లోపించి 'దేవశర్మ' అనే ఉంటుంది. 'సుధన్వాన్' అనే శబ్దానికి స్త్రీత్వం లేకపోవటం వల్ల 'సుధన్వుడు' అనే రూపం ఉంటుంది.

'మహత్వంబున స్వార్థపరంబగు రాజ శబ్దము రాజునాబడు' అనే 78వ సూత్రాన్ననుసరించి రాజ శబ్దం స్వార్థపరమై మహత్వ బోధకమైనట్లయితే 'రాజు' అని అవుతుంది. సంస్కృతంలో 'రాజన్' శబ్దం నకారాంతమే. దీని ప్రథమా విభక్తి ఏకవచన రూపం 'రాజా' అనేది. దీర్ఘానికి హ్రస్వం వచ్చి 'రాజ' అవుతుంది. దీనికి ఉత్వం, ఉజ్ఞులు రాగా 'రాజుడు' అనే రూపం రావాలి. ఇది అనిష్ట రూపం.

'రాజు' శబ్దం మహద్వాచకమై స్వార్థ ప్రాధాన్యం కలిగి యున్నప్పుడు 'రాజు' అని ప్రథమా విభక్తి ఏకవచనంలో ఉండి, ఇతర విభక్తుల్లో రాజు, రాజును, రాజుచే, రాజులచే వంటి రూపాలలో ఉంటుంది.

గరుత్మంతుడు అనే అర్థంలో మహద్వివక్ష చేయటం వల్ల ఖగరాజు, పక్షిరాజు అనే రూపాలౌతాయి.

'స్త్రీ లింగంబు లెల్ల స్వస్వనియతంబులగు స్త్రీ ప్రత్యయంబులం గూడి యింది బ్రవర్తిల్లు' అనే 85వ సూత్రాన్ననుసరించి నకారాంత స్త్రీలింగ శబ్దాలు స్త్రీ ప్రత్యయంతో కలిసి తెలుగులో ప్రాతిపదికలౌతాయి. వాటికి ఇకారాంతాలకు ఆయా కార్యాలౌతాయి. భాగ్యశాలిన్ - భాగ్యశాలినీ - భాగ్యశాలిని, బుద్ధిశాలిన్ - బుద్ధిశాలినీ - బుద్ధిశాలిని.

### 9.2.7 సకారాంత సంస్కృత శబ్దాలు తత్సమాలయ్యే విధానాన్ని తెల్పండి.

సకారం చివరన ఉన్నట్టి శబ్దాలు సకారాంతాలు.

'సాంతంబుల తుది సకారంబునకు లోపంబు బహుళంబుగా నగు' అనే 80వ సూత్రాన్ననుసరించి

ఉరస్సు - ఉరము
వక్షస్సు - వక్షము
అర్చిస్సు - అర్చి
ధనస్సు - ధనువు
ఆయుస్సు - ఆయువు

సకారంతో అంతమయ్యే శబ్దాలలోని చివరి సకారానికి బహుళంగా లోపం వస్తుంది.

'హలంతంబగు ప్రథమైక వచనాంత తుల్యం బిందు నామంబగు' అనే 67 సూత్రాన్ని బట్టి సాధారణంగా ప్రథమా విభక్తి ఏకవచనాలనే నామములుగా గ్రహించటం జరుగుతుంది. సకారం అంతంలో ఉండే శబ్దాల విషయంలో సంస్కృత ప్రాతిపదికాలనే తెలుగులో గూడ ప్రాతిపదికలుగా గ్రహించాలి. 'ఉరస్' అనే సకారాంత శబ్దం యొక్క ప్రథమా విభక్తి ఏకవచన రూపం 'ఉరః' అనేది. ఈ 'ఉరః' లోని విసర్గ రూపం 'సు' అనే సంస్కృత ప్రత్యయం. 'ఉరస్' అనేది సంస్కృత ప్రాతిపదిక. 'సాంతంబుల తుది సకారంబునకు లోపంబు బహుళంబుగా నగు' అనే సూత్రం వల్ల సకారం లోపించి' 'ఉర' అని అవుతుంది. 'అమహన్నపుంసకముల కదంతములకు 'ము' వర్ణకంబగు అనే 39 సూత్రం వల్ల ఉర + ము - ఉరము అనే రూపం వస్తుంది. సకారం లోపించకపోతే 'ఉగాగమంబును ద్విత్వంబును దుది హల్లున కగు' అనే 68వ సూత్రాన్ననుసరించి ఉగాగమం, ద్విత్వం వచ్చి 'ఉరస్సు' అవుతుంది.

ఇదే విధంగా 'వక్షస్' అనే శబ్దం వక్షస్సు, వక్షము అనే రూపాలను పొందుతుంది.

అర్చిస్ అనేది ఉత్వ, ద్విత్వాల్ని పొంది ప్రథమా విభక్తి ఏకవచనం లోపించి అర్చిస్సు అవుతుంది. సకారం లోపించి 'అర్చి' అనే రూపం మిగులుతుంది.

ధను - ధనువు, సలోపం కాకపోతే ధనుస్సు
ఆయు - ఆయువు, సలోపం కాకపోతే ఆయుస్సు

'బహుళంబుగా నగు' అనటం వల్ల పయః (పయస్) మొదలైన శబ్దాలలో సకారానికి లోపం లేదు.

పయః - పయస్ - పయస్సు
వయః - వయస్ - వయస్సు
సరః - సరస్ - సరస్సు

'అంగిరస్' అనే శబ్దం పుంలింగం, మహద్వాచకం. మహద్వాచకాలైన సకారాంత శబ్దాలకు చివరనున్న వర్ణానికి లోపం వస్తుంది. లోపం రాని పక్షంలో ద్వితీయైక వచనాంత తుల్యత కలుగుతుంది. 'అంగిరస్' అనే శబ్దంలో 'స' కారానికి లోపం వచ్చి 'అంగిర' అని అవుతుంది. దీనికి ఉత్వము, డుజ్ఞులు కలిగి 'అంగిరుడు' అనే రూపం ఏర్పడుతుంది. అంగిరసమ్ అనేది ద్వితీయా విభక్తి ఏకవచనాంత రూపం. దీని అంతిమ 'మ' కారానికి లోపం వచ్చి 'అంగిరస' అనే రూపం ఔతుంది. దీనికి ఉత్వము, 'డుజ్ఞ' లు కలుగగా 'అంగిరసుడు' అనే రూపం ఏర్పడుతుంది. అదే విధంగా ఉగ్రశ్రవుడు - ఉగ్రశవసుడు, ప్రచేతుడు - ప్రచేతసుడు, ఊర్ధ్వరేతుడు - ఊర్ధ్వరేతసుడు వంటి శబ్దాలేర్పడతాయి.

వేధ, పురోధ, పురోధస అనే మూడు శబ్దాలు సకారాంతాలైన మహద్వాచకాలు.

'మహద్వాచకంబులగు సాంతంబుల కంత లోపంబేని ద్వితీయైక వచనాంత తుల్యంబే నగు' అనే 81వ సూత్రాన్ననుసరించి వేధుడు, వేధసుడు అనే రూపాలేర్పడాలి. వేధశ్శబ్దానికి నిత్యంగా సలోప స్త్రీ వద్భావాలు వస్తాయని, పురోధశ్శబ్దానికి వైకల్పికంగా సలోప్త్రీవద్భావాలు వస్తాయని చెప్పబడింది.

'వేధ' అంటే చతుర్ముఖుడు లేదా బ్రహ్మ అనే అర్థం అవటం వల్ల ఈ శబ్దం మహద్వాచకం అవుతుంది. పుంలింగం, మహద్వాచకము అయిన 'వేధస్' శబ్దానికి ఉత్వం, డుజ్ఞులు రావలసి ఉంది. దీనిని నివారించడానికి 'వేధస్' శబ్దానికి 'వేధ' అనేది ప్రథమైక వచనాంత తుల్యయని నిపతింపబడింది.

'మనః ప్రభృతుల సకారంబునకు ద్విత్వంబు విభాషనగు' అనే 83వ సూత్రం వల్ల 'మనస్' మొదలైన సకారాంత శబ్దాలలోని చివరనున్న సకారానికి ద్విత్వం విభాషగా అవుతుందని చెప్పబడింది.

'మనస్' అనే శబ్దానికి ఉత్వము, ద్విత్వము రాగా 'మనస్సు' అని అవుతుంది. ద్విత్వం రాకపోతే ఉత్వం మాత్రమే వచ్చి 'మనసు' అని అవుతుంది. 'సాంతంబుల తుది సకారంబునకు లోపంబు బహుళంబుగా నగు' అనే 80వ సూత్రాన్ననుసరించి సకారాని లోపం వచ్చినట్లయితే 'ము' వర్ణకం వచ్చి 'మనము' అని అవుతుంది. అదే విధంగా 'శిరస్' శబ్దం.

శిరస్సు - శిరసు - శిరము అనే మూడు రూపాలను పొందుతుంది.

**9.2.8 ఆమంత్రణములలో జరిగే వ్యాకరణ కార్యాల్ని తెల్పండి.**

ఆమంత్రణ మంటే పిలుచుట అని అర్థం. ఎవరినైనా పిలువ వలసి వచ్చినప్పుడు 'ఓ' అనే శబ్దాన్ని సంబోధ్య వాచకానికి ముందు ప్రయోగిస్తారు. సంబోధ్య వాచకమంటే ఏ వ్యక్తిని సంబోధిస్తామో ఆ వ్యక్తిని బోధించే శబ్దం.

'ఓ యామంత్రణంబునందగు' అని 14వ సూత్రం. ఒక రాముని పిలిచేటప్పుడు 'ఓ రాముడ!' అని, ఎక్కువ మందిని పిలిచేటప్పుడు ఓ రాములారా! అని అవుతుంది. 'ఓ' శబ్దాన్ని విడిచిపెట్టి గూడా రాముడ! రాములారా! అని అనవచ్చు.

'ఓ శబ్దమునకు బురుష, నీచస్త్రీ పురుషామంత్రణంబు లందు యి - సి - రి వర్ణంబులు విభాష నంతాగమంబులగు. పురుషుని పిలిచేటప్పుడు 'యి' అనేది, నీచస్త్రీని పిలిచేటప్పుడు 'సి' అనేది నీచ పురుషుని పిలిచేటప్పుడు 'రి' అనేది 'ఓ' అనే శబ్దానికి తర్వాత అదనంగా చేరుతాయి. ఇవి చేరకుండా గూడా వ్యవహరింపబడతాయి.

1. ఓ + యి + రాముడ - ఓయి రాముడ, ఓ రాముడ - పురుషామంత్రణం.
2. ఓ + సి + దుష్టురాల - ఓసి దుష్టురాల, ఓ దుష్టురాల - నీచస్త్రీ ఆమంత్రణం
3. ఓ + రి + దుష్టుడ - ఓరి దుష్టుడ, ఓ దుష్టుడ - నీచపురషామంత్రణం

'ఓరి, యోసి మైత్రి మైత్రి యందుంగలవు' అనే 16వ సూత్రంలో పురుషుని పిలిచేటప్పుడు 'ఓరి' అని, స్త్రీని పిలిచేటప్పుడు 'ఓసి' అని స్నేహంగా గూడ పిలవవచ్చునని తెల్పబడింది.

'ఓరి చిన్నికృష్ణ' అనేది ప్రేమగా పిలిచే పిలుపు చిన్నికృష్ణ అనే దానికి ముందు 'ఓరి' అనే శబ్దం వాడబడింది. 'ఓసి ముద్దుబాల' లో 'ఓసి' అనేది కూడా ప్రేమ సూచకమే. నీచస్త్రీ పురుషులంటే శీలము, జాతి, విద్య, వయస్సు మొదలైన వాటి విషయంలో తనకంటే తక్కువ వారని అర్థం. నీచ అనే పదం తక్కువ దనాన్ని సూచిస్తుందే కాని తిట్టడం కాదు. శత్రువుల విషయంలో ఉత్తమ వ్యక్తులు గూడ 'ఓరి', 'ఓసి' శబ్దాలతో వ్యవహరింపబడతారు.

ఓయి మొదలైన ప్రయోగాల సంబోధ్యవాచకాన్ని విడిచి స్వతంత్రంగా కూడ ప్రయోగింపవచ్చు.

'సంగతియె యోయి' - ఇక్కడ సంబోధ్య వాచకం లేదు. అదే విధంగా ఓసి, ఓరి అనేవి గూడా ప్రయోగింపబడ్డాయి.

'ఓరోరి' అని అన్నప్పుడు 'ఓరి' శబ్దం పునరుక్తమైంది. దీనిని బట్టి ఓయి, ఓసి అనేవి గూడ పునరుక్తాలు కావచ్చునని సూచింపబడింది.

ఓయి, ఓరి, ఓసి అనే వాటికి దీర్ఘం కూడా వస్తుంది.

ఓయీ విప్రకులావతంస!
ఓరీ దుష్టనిశాటులార!
ఓసీ! నను చెనక రాకు.

సంబోధ్య వాచకం బహువచనం అయినప్పుడు గూడా వీనిని ప్రయోగించవచ్చునని సూచింపబడింది.

**9.2.9 తత్సమ శబ్దాలకు బహువచనంలో జరిగే వ్యాకరణ కార్యాల్ని వివరించండి.**

'లు వర్ణంబు బహువచనము'

ఒకటికి మించిన పదార్థాల్ని బోధించే ప్రత్యయం బహువచనం. రాము + లు - ఒక రాముని కంటే ఎక్కువ మంది

రాములను బోధించటం చేత బహువచనమైంది. 'రాముడు', 'సోముడు' వంటి ఏకవచన రూపాలకు 'లు' అనే వర్ణాన్ని కలిపినప్పుడు బహువచనాలౌతాయి. రాము + లు, సోములు, వనములు, ధనములు, ధేనువులు, భానువులు .. మొదలైనవి.

'బహుత్వంబున ద్వితీయాది విభక్తులకు లడాగమంబగు' అనే 31 సూత్రాన్ననుసరించి బహువచనంలో ద్వితీయా విభక్తి మొదలు సప్తమీ విభక్తి వరకు ఉన్న ఏ విభక్తి ప్రత్యయానికైనా ముందు 'ల' అనే వర్ణం అదనంగా వచ్చి చేరుతుందని చెప్పబడింది.

సూత్రంలో (లట్ + ఆగమం) లడాగమమని చెప్పటం వల్ల 'ల' వర్ణం ద్వితీయాది విభక్తులకు ముందు చేరుతుందని భావం.

రామ - ప్రాతిపదిక

'పుంలింగంబయి మహద్వాచకంబయిన నామంబు తుది యత్వంబున కుత్వంబగు' అనే 21వ సూత్రాన్ననుసరించి 'రాము' అవుతుంది. దీనికి ద్వితీయా విభక్తి ప్రత్యయం చేరి -

రాము + ను అవుతుంది.

'ను' ప్రత్యయానికి ముందు 'ల' వర్ణం ఆగమంగా వచ్చి రాము + ల + ను - రాములను అవుతుంది. అదే విధంగా రాము + ల + చేతను - రాముల చేతను, విధాతృలను, విధాతృల చేతను వంటి రూపాలౌతాయి.

'అమహన్నపుంసకముల కదంతములకు 'ము' వర్ణకంబగు' అనే 39వ సూత్రం ప్రకారం వృక్షః - వృక్షము అవుతుంది. ప్రథమైక వచనంలో 'ము' వర్ణకం వస్తుంది. మిగిలిన విభక్తుల్లో మిగిలిన ప్రత్యయాలు కలిసినపుడు క్రింది విధంగా ఏర్పడతాయి.

వృక్ష + ము - వృక్షము (ప్రథమైక వచనం ము వర్ణకం)
వృక్ష + లు - ప్రథమా బహువచనం
వృక్ష + ను - ద్వితీయైక వచనం
వృక్ష + లను - ద్వితీయా బహువచనం

ఈ విధంగా వచ్చిన మిగిలిన రూపాలలో విభక్తి ప్రత్యయానికి ముందు 'ముక్' ఆగమంగా వస్తుంది. అప్పుడు

వృక్ష + లు - వృక్ష + ము + లు - వృక్షములు అనే బహువచన రూపం సిద్ధిస్తుంది.

ప్రథమా విభక్తి బహువచన ప్రత్యయం 'లు'. బహుత్వంలో ద్వితీయాది విభక్తులకు ఆగమంగా వచ్చేది 'ల'.

సప్తమీ విభక్తి ప్రత్యయం 'న'.

'లు - ల - న లు పరంబులగు నపుడొకానొకచో ము గాగమంబునకు లోపంబును దత్పూర్వ స్వరంబునకు దీర్ఘంబును విభాషనగు అని 43వ సూత్రం.

లు, ల, న అనేవి పరంగా ఉన్నప్పుడు వాని ముందున్న ఆగమ ముకారానికి లోపం, దాని ముందుండే అచ్చుకు దీర్ఘం వికల్పగా వస్తాయి.

వజ్రము + లు - ఇక్కడ 'లు' వర్ణకం పరంగా ఉండటం వల్ల దానికి ముందున్న 'ము' కారానికి లోపం వచ్చి దానికి ముందున్న 'జ్ర' అనే దానికి దీర్ఘం రావటం వల్ల 'వజ్రాలు' అనే బహువచన రూపం యేర్పడింది. 'ఈ విధంగా కాని పక్షంలో వజ్రములు, వజ్రములను అనే రూపాలుంటాయి.

'ఒకానొక చోట' అని సూత్రంలో అనడం వల్ల ఈ విధమైన ప్రక్రియ తప్పని సరి కాదని భావం.

వజ్ర + ము + లు
వజ్ర + ( ) + లు (ము లోపం)
వజ్రా + ( ) + లు (పూర్వస్వర దీర్ఘం)
వజ్రాలు.

'ఇత్తునకు బహువచనంబు పరంబగు నపుడుత్వంబగు' అనే 45 సూత్రంలో హ్రస్వమైన ఇకారానికి (ఇత్తు) బహువచనం పరమైతే ఉత్వం వస్తుందని చెప్పబడింది.

హరి + లు - హరు + లు - హరులు
హరులు, గిరులు, కవులు, రవులు, యామినులు, భామినులు.
'తపరకరణంబుచే దీర్ఘంబున కుత్వంబు లేదు'
తపరకరణం అంటే 'త' కారాన్ని తర్వాత చేర్చడం.

'ఇత్తునకు బహువచనంబు పరంబగు నపుడుత్వంబగు' అనే సూత్రంలో ఇత్తు - ఇత్ అనే చోట హ్రస్వమైన ఇకారానికి పరంగా తకారం చేర్చబడింది. దీనినే తపరకరణం అంటారు. 'ఇత్' అంటే హ్రస్వమైన ఇకారం ఒక్కటే అని అర్థం. దీర్ఘమైన ఇకారాన్ని (ఈ) ఇది బోధించదు. హరి + లు - హరులు అని హ్రస్వ ఇకారానికే వర్తిస్తుంది కాని స్త్రీ, శ్రీ వంటి దీర్ఘాంత శబ్దాలకు వర్తించదు. స్త్రీ + లు - స్త్రులు అని కాదు. స్త్రీలు అనే ఉంటుంది. శ్రీ + లు - శ్రీలు అనే అవుతుంది. యామినీ, భామినీ అనేవి దీర్ఘాంత శబ్దాలే అయినప్పటికిని వాని తుది దీర్ఘానికి హ్రస్వం రావటం చేత యామినులు, భామినులు వంటి రూపాలేర్పడ్డాయి.

## 9.3 సమీక్ష

తత్సమ పరిచ్ఛేధంలో పారిభాషిక పదాలను గురించి తెలుసుకున్నారు. అదే విధంగా తత్సమ పరిచ్ఛేదంలోని వ్యాసరూప ప్రశ్నలకు జవాబులు తెలుసుకున్నారు.

## 9.4 ప్రశ్నలు

1. క్రింది పారిభాషిక పదాలను వివరించండి.

   1. ఆమంత్రణం, 2. ఇత్తు, 3. డుమంతం, 4. కృతోత్కరం, 5. ఉపోత్తమం, 6. వర్ణకం.

2. క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి.

   1. అకారాంత సంస్కృత శబ్దాలు తత్సమాలయ్యే విధం తెలపండి.
   2. ఇకారాంత సంస్కృత శబ్దాలు తత్సమాలయ్యే విధం తెలపండి.
   3. ఉకారాంత సంస్కృత శబ్దాలు తత్సమాలయ్యే విధం తెలపండి.
   4. నకారాంత సంస్కృత శబ్దాలు తత్సమాలయ్యే విధం తెలపండి.
   5. సకారాంత సంస్కృత శబ్దాలు తత్సమాలయ్యే విధం తెలపండి.
   6. ఆమంత్రణంలో జరిగే వ్యాకరణ కార్యాలను తెలపండి.
   7. తత్సమ శబ్దాలకు బహువచనంలో జరిగే వ్యాకరణ కార్యాలను వివరించండి.

## 9.5 ఆధార గ్రంథాలు


1. బాల వ్యాకరణము - శ్రీ పరవస్తు చిన్నయ సూరి
2. ఘంటాపథ వ్యాఖ్యానం - శ్రీ వంతరాం రామకృష్ణారావు
3. బాలవ్యాకరణ సారస్వ సర్వస్వ పేటిక - శ్రీ దూసి రామమూర్తి శాస్త్రి
4. రమణీయము - శ్రీ దువ్వూరి వేంకటరమణ శాస్త్రి



**డాక్టర్ కౌతా సుబ్రహ్మణ్య శాస్త్రి**
రీడర్ మరియు ఆంధ్ర శాఖాధ్యక్షులు
(రిటైర్డ్)
హిందూ కళాశాల
గుంటూరు

# పాఠం - 10

# ఆచ్ఛిక పరిచ్ఛేదం

పాఠ్యనిర్మాణక్రమం


10.0 లక్ష్యం

10.1 పారిభాషిక పదాలు

10.2 సోదాహరణ వ్యాఖ్యలు (1 నుండి 14 సూత్రాల వరకు)

10.3 సమీక్ష

10.4 ప్రశ్నలు

10.5 ఆధార గ్రంథాలు


## 10.0 లక్ష్యం

ఈ పాఠంలో అచ్చతెలుగు అంటే ఏమిటి, అచ్చతెలుగు పదాలకు బహువచనంలో ఎటువంటి మార్పులు వస్తాయి, మొదలైన విషయాలు తెలుసుకుంటారు. కొన్ని పారిభాషిక పదాలకు సోదాహరణ వివరణ కూడ తెలుసుకుంటారు. 1 నుండి 14 సూత్రాలకు సోదాహరణ వ్యాఖ్యలు తెలియజేయడం ఈ పాఠం లక్ష్యం.

## 10.1 పారిభాషిక పదాలు

### 10.1.1 అచ్చ

"సంస్కృత సమేతరంబయిన యీ భాష యచ్చయనంబడు". సంస్కృత సమం తప్ప తక్కిన తెలుగు భాషను అచ్చ అంటారు. సంస్కృతసమం, ప్రాకృతసమం, సంస్కృతభవం, ప్రాకృతభవం, దేశ్యం అనే ఐదు జాతుల పదాలు తెలుగులో ఉన్నాయి. వీనిలో సంస్కృత సమాలు తప్ప తక్కిన ప్రాకృతసమం, సంస్కృతభవం, ప్రాకృతభవం, దేశ్యం అనే నాలుగు జాతుల పదాలు కలిగిన భాషను "అచ్చ" అంటారు. దీన్నే ఆచ్ఛికం, అచ్చతెనుఁగు అని కూడ అంటారు.

ఉదా॥ అగ్గి, ఆకసము, లచ్చి, ఊరు.

### 10.1.2 సర్వనామం

"అన్ని ప్రభృతులు సర్వనామంబులు". 'అన్ని' మొదలైన వాటిని తెలుగు భాషలో సర్వనామాలు అంటారు. అన్ని - ఇన్ని - ఎన్ని - కొన్ని - పెక్కు - పలు - ఆ - ఈ - ఏ - నీ - నా - మన - తా, సంఖ్యావాచకాలైన ఒకటి, రెండు మొదలైనవి తెలుఁగులో సర్వనామాలు. ఎల్లనామాలకు బదులుగా వాడబడేది సర్వనామం.

ఒక వాక్యంలో నామవాచకాన్ని మరలా చెప్పవలసి వచ్చినపుడు దానికి బదులుగా వాడబడేది సర్వనామం.

ఉదా॥ రాముఁడు అన్నము తినెను. <u>వాఁడు</u> బడికి వెళ్లెను.

పై వాక్యంలో 'వాఁడు' అనే పదం సర్వనామం.

### 10.1.3 ఔపవిభక్తికం

"ఇ-టి-తి" వర్ణంబులు వక్ష్యమాణంబులు ఔపవిభక్తికంబులు". ఇ-టి-తి అనే వర్ణాలను ఔపవిభక్తికాలు అంటారు. ఉప అంటే సమీపం అని అర్థం. విభక్తికి సమీపంలో వస్తాయి కాబట్టి వీటిని ఉపవిభక్తులు అంటారు. ఉపవిభక్తులే ఔపవిభక్తికాలు. ఇవి కొన్ని చోట్ల శబ్దాల చివరి అక్షర స్థానంలో ఆదేశంగా వస్తాయి. కొన్ని చోట్ల చివరి అక్షరానికి ఆగమంగా వస్తాయి. ఈ ఔపవిభక్తిక వర్ణాలు చేరే శబ్దాల్ని కూడ ఔపవిభక్తికాలు అంటారు.

ఉదా॥ ఇ - ఊరిని, కాలిని
టి - రెంటిని, రెండింటిని
తి - చేతిని, నేతిని

## 10.2 సోదాహరణ వ్యాఖ్యలు (1 నుండి 14 సూత్రాల వరకు)

### 10.2.1 "సంస్కృత సమేతరంబయిన యీ భాష యచ్చ యనంబడు" (ఆచ్ఛిక - 1 సూ.)

పద విభాగం : సంస్కృతసమ, ఇతరంబు, అయిన, ఈ భాష, అచ్చ, అనంబడు.

భావం : సంస్కృత సమాలు చేరని భాష అచ్చతెలుగు.

వ్యాఖ్య : సంస్కృతసమం, ప్రాకృతసమం, ప్రాకృతభవం, సంస్కృతభవం, దేశ్యం అనే ఐదు జాతుల పదాలు తెలుగులో ఉన్నాయి. వీనిలో సంస్కృతసమాలు తప్ప తక్కిన ప్రాకృతసమం, సంస్కృతభవం, ప్రాకృతభవం, దేశ్యం అనే నాలుగు జాతుల పదాలు కలిగిన భాషను "అచ్చ" అంటారు. "అచ్ఛ" అనే శబ్ద నుండి "అచ్చ" అనే శబ్దం పుట్టింది. కాబట్టి ఈ భాషను అచ్చతెలుగు అంటారు. అచ్చతెలుగునే ఆచ్ఛికం అనికూడ అంటారు. అచ్చతెలుగు భాషకు అక్షరాలు 36.

ఉదాహరణ : ప్రాకృత సమానికి ఉదాహరణ - అగ్గి.
సంస్కృత భవానికి ఉదాహరణ - ఆకసము
ప్రాకృత భవానికి ఉదాహరణ - లచ్చి
దేశ్యానికి ఉదాహరణ - ఊరు

### 10.2.2 ఆచ్ఛిక శబ్దంబు లెల్లందఱుచుగ స్త్రీసమంబులుం గ్లీబసమంబులునయి యుండు. (ఆచ్ఛిక - 2 సూ.)

పద విభాగం : ఆచ్ఛిక శబ్దంబులు, ఎల్లన్, తఱుచుగ, స్త్రీసమంబులును, క్లీబసమంబులును, అయి, ఉండు.

భావం : అచ్చతెలుగు శబ్దాలు అన్నీ తఱుచుగా స్త్రీసమాలూ క్లీబసమాలూ అయి ఉంటాయి.

వ్యాఖ్య : "తఱుచుగ" అనడంచేత పుంలింగ తుల్యాలు కూడ కొన్ని ఉంటాయి.
స్త్రీలింగంతో సమానమైనది స్త్రీసమం.
నపుంసకలింగంతో సమానమైనది క్లీబసమం.
పుంలింగంతో సమానమైనది పుంసమం.

సంస్కృత భాషలో మాదిరిగా తెలుగుభాషలో లింగం అనేది లేదు. ఈ సూత్రం అచ్చతెలుగు శబ్దాలకు ఆయాలింగంతో సమత్వాన్ని చెబుతున్నది. అందువల్ల స్త్రీసమత్వాన్ని చెప్పిన శబ్దాలకు ప్రథమా ఏకవచనం లోపిస్తుంది. క్లీబసమత్వం చెప్పిన శబ్దాలకు ప్రథమా ఏకవచనంలో 'ము' వర్ణకం వస్తుంది. పుంలింగ తుల్యత్వం చెప్పిన శబ్దాలకు ప్రథమా ఏకవచనంలో 'ఉత్వ-డుజ్'లు వస్తాయి.

ఉదాహరణ : అన్న - అన్న - ప్రాతిపదిక

ఇది ఈ సూత్రం చేత స్త్రీసమం. ప్రథమా ఏకవచనం 'సు' ప్రత్యాయం చేయగా అన్న + సు అవుతుంది. "స్త్రీ లింగంబుల ప్రథమైక వచనంబునకు లోపంబగు" అనే సూత్రం చేత ప్రథమా ఏకవచనం 'సు' లోపిస్తుంది. 'అన్న' అనే రూపం అవుతుంది. ఇలా ప్రథమా ఏకవచనం లోపించే పదాలు స్త్రీసమాలు. ఇలాగే మిన్న - అద్ద - గద్ద - జాణ - గాణ - ఓడ - గోడ మొదలైనవి.

ఉదా ॥ బియ్యము.

బియ్య - ప్రాతిపదిక - ఇది ఈ సూత్రం చేత క్లీబసమం.
"అమహన్నపుంసకముల కదంతములకు మువర్ణకంబగు"
అనే సూత్రం చేత ప్రథమా ఏకవచనంలో 'ము' వర్ణకం వచ్చి 'బియ్యము' అనే రూపం అవుతుంది.
ఇలా ప్రథమా ఏకవచనంలో 'ము' వర్ణకం వచ్చే పదాలు క్లీబసమాలు.
ఇలాగే నెయ్యము - అల్లము - మొల్లము - సున్నము - సన్నము మొదలైనవి.

ఉదా॥ కొమరుఁడు.

కొమర - ప్రాతిపదిక - ఇది ఈ సూత్రం చేత పుంలింగతుల్యం.
"పుంలింగంబయి మహద్వాచకంబయిన నామంబు తుది యత్వంబున కుత్వంబగు" అనే సూత్రం చేత ప్రాతిపదిక చివరి అకార స్థానంలో ఉకారం వచ్చి 'కొమరు' అవుతుంది.
"పుంలింగంబగు మహద్వాచకమునకు డుజ్ఞగు"
అనే సూత్రం చేత "డుజ్" వచ్చి "కొమరు + డుజ్" అవుతుంది.
"జిత్తు బిందు పూర్వకంబగు" అనే సూత్రం చేత 'జ కారం' లోపించి డువర్ణకానికి ముందు బిందువు వచ్చి "కొమరుఁడు" అవుతుంది. ఇలా ప్రథమా ఏకవచనంలో 'ఉత్వ, డుజ్'లు వచ్చేవి పుంలింగతుల్యాలు. ఇలాగే చందురుఁడు, జముఁడు, కందుఁడు మొదలైనవి.

విశేషం : పైన చెప్పిన మూడు విధాలైన శబ్దాల్లో స్త్రీసమాలు ఎక్కువనీ, క్లీబసమాలు తక్కువనీ, పుంలింగ తుల్యాలు ఇంకా తక్కువనీ చిన్నయసూరి అభిప్రాయం. ఆ అభిప్రాయాన్ని సూచించడానికే స్త్రీసమాలకు **8**, క్లీబసమాలకు **6**, పుంలింగతుల్యాలకు **4** ఉదాహరణలిచ్చారు.

### 10.2.3 బల్లిదాదులు సంస్కృత తుల్యంబులు. (ఆచ్ఛిక - 3 సూ.)

పద విభాగం : బల్లిద, ఆదులు, సంస్కృత, తుల్యంబులు.

భావం : బల్లిద మొదలైన శబ్దాలు సంస్కృత తుల్యాలు. అంటే ఇవి మహద్వాచకాలైనపుడు వీనికి "ఉత్వడుజ్ఞు"లు

వస్తాయి. అమహద్వాచకాలైనపుడు "మువర్ణకం" మొదలైనవి వస్తాయి. స్త్రీ వాచకాలైనపుడు "ఆలు" శబ్దంతో సమాసాన్ని పొందుతాయి.

ఉదా॥ బల్లిదుఁడు.

బల్లిద - ప్రాతిపదిక. ఈ సూత్రం చేత సంస్కృత తుల్యం. మహద్వాచకంలో "పుంలింగంబయి మహద్వాచకంబయిన నామంబు తుదియత్వంబునకుత్వంబగు" అనే సూత్రం చేత బల్లిద లోని తుది అత్వానికి ఉత్వం వచ్చి "బల్లిదు". పుంలింగమగు మహద్వాచకమునకు డుజ్ఞగు" అనే సూత్రం చేత 'బల్లిదు + డుజ్' అవుతుంది. "జిత్తు బిందు పూర్వకంబగు" అనే సూత్రం చేత జకారం లోపించి డువర్ణకానికి ముందు బిందువు వచ్చి "బల్లిదుఁడు" అవుతుంది.

ఉదా॥ బల్లిదము.

బల్లిద - ప్రాతిపదిక. సంస్కృత తుల్యం కాబట్టి, అమహద్వాచకంలో "అమహన్నపుంసకముల కదంతములకు మువర్ణకంబగు" అనే సూత్రం చేత మువర్ణకాన్ని పొంది "బల్లిదము" అవుతుంది.

ఉదా॥ బల్లిదురాలు.

బల్లిద - ప్రాతిపదిక. స్త్రీ వాచకమైనపుడు.

"కర్మధారయంబునం దత్సమంబుల కాలు శబ్దము పరంబగు నపుడత్వంబున కుత్వంబును రుగాగమంబు నగు" అనే సూత్రం చేత 'ఆలు' శబ్దంతో సమాసం కల్గి ఉత్వం, రుగాగమం వచ్చి బల్లిద + ఆలు - బల్లిదురాలు అవుతుంది.

బల్లిద - అక్కజ - కావల - బెట్టిద - బెడిద - మిసిమింత - మొక్కల మొదలైనవి బల్లిదాదులు. వీటన్నింటికి ఇలాగే మూడేసి రూపాలు ఏర్పడతాయి.

విశేషం : సంస్కృత భాషలో విశేష్యాన్ని బట్టి కొన్ని విశేషణ శబ్దాలకు మూడు లింగాల్లో రూపాలు ఉంటాయి. అటువంటి వాటిని "విశేష్య నిఘ్నాలు" అంటారు. తెలుగులో బల్లిదాది విశేషణాలు అటువంటివి. కాబట్టి బల్లిదుఁడు రాముఁడు, బల్లిదురాలు సీత, బల్లిదము వృషభము అని ఉండవచ్చును.

**10.2.4 మహత్తులగు మగాదులకుం గయిరాదులకును డుజ్ఞగు నుత్వంబు గాదు. (ఆచ్ఛిక - 4 సూ.)**

పద విభాగం : మహత్తులగు, మగాదులకును, కయిరాదులకును, డుజ్, అగును, ఉత్వంబు, కాదు.

భావం : మహద్వాచకాలైన "మగ" మొదలైన శబ్దాలకు, అమహద్వాచకాలైన "కయిర" మొదలైన శబ్దాలకు ప్రథమావిభక్తి ఏకవచనంలో "డుజ్" ప్రత్యయం వస్తుంది. "ఉత్వం" మాత్రం కాదు. మహత్తులు అంటే మహద్వాచకాలు, అంటే పురుషవాచక శబ్దాలు.

ఉదా॥ మగఁడు.

మగ - ప్రాతిపదిక. ఇది మహద్వాచకం, పుంలింగ తుల్యం. కాబట్టి "పుంలింగంబయి మహద్వాచ

కంబయిన నామంబు తుది యత్వంబున కుత్వంబగు". పుంలింగమగు మహద్వాచకమునకు డుజ్ణగు" అనే సూత్రాలచేత ఉత్వం, డుజ్ రావలసియుండగా, ఉత్వం కాదని, డుజ్ మాత్రమే వస్తుందని ఈ సూత్రం నియమిస్తున్నది. కాబట్టి 'డుజ్' వచ్చి మగ + డుజ్ అవుతుంది. "జిత్తు బిందు పూర్వకంబగు" అనే సూత్రం చేత జకారం లోపించి, డువర్ణకానికి ముందు బిందువు వచ్చి, మగఁడు - మగండు అనే రూపాలు ఏర్పడతాయి. ఇట్లే మనుమ + డుజ్ - మనుమఁడు - మనుమండు.

మగ - మనుమ - రాయ - పాప - వ్రే - తే - ఈ - కా ప్రత్యయాంతాలు మగాదులు.

ఉదా॥ కయిరఁడు.

కయిర - ప్రాతిపదిక. ఇది అమహద్వాచకం. ఈ సూత్రం చేత 'డుజ్' వచ్చి కయిర + డుజ్. "జిత్తు బిందు పూర్వకంబగు" అనే సూత్రం చేత జకారం లోపించి, డువర్ణకానికి ముందు బిందువు వచ్చి, కయిరఁడు - కయిరండు అనే రూపాలు ఏర్పడతాయి. ఇట్లే కత్తళ + డుజ్ - కత్తళఁడు, కత్తళండు.

కయిర - కత్తళ - జన్న - నీల - మొదలైనవి కయిరాదులు.

విశేషం : మగాదులు, కయిరాదులు అనే రెండు గణాల్లో మగాదులు మహద్వాచకాలు కాబట్టి 'ఉత్వ, డుజ్'లు రెండూ రావలసి ఉండగా వాటికి 'ఉత్వం' మాత్రం రాదని, కయిరాదులు అమహద్వాచకాలు కాబట్టి 'ఉత్వ' , డుజ్' లు రెండూ రాకపోవడంచేత వాటికి 'డుజ్' వస్తుందని చెప్పబడింది. మహత్తులైన మగాదులకు 'ఉత్వ' నిషేధం, అమహత్తులైన కయిరాదులకు 'డుజ్' ప్రాప్తి ఈ సూత్ర విశేషం.

**10.2.5 పగతాదుల బహువచన లకారంబునకు రేఫంబగు. (ఆచ్ఛిక - 5 సూ.)**

పద విభాగం : పగత, ఆదుల, బహువచన, లకారంబునకు, రేఫంబు, అగు.

భావం : పగత మొదలైన అకారాంత మహద్వాచక శబ్దాలకు బహువచనంలో వచ్చే లకారస్థానంలో రేఫ వస్తుంది.

వ్యాఖ్య : ప్రథమా బహువచనం అయిన లువర్ణం, ద్వితీయాది విభక్తుల్లో వచ్చే లడాగమం, రెండిటినీ "బహువచన లకారం" అంటారు. సూత్రంలో లకారానికి రేఫ వస్తుందని చెప్పడం చేత కేవలం లకార హల్మాత్రానికే రేఫ ఆదేశంగా వస్తుంది. కాబట్టి 'లు' స్థానంలో 'రు', 'ల' స్థానంలో 'ర' వస్తాయి.

ఉదా॥ పగతురు

పగత - ప్రాతిపదిక. ప్రథమా విభక్తి బహువచనంలో "లువర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత 'లు' వర్ణం వచ్చి పగత + లు. ఈ సూత్రం చేత 'లు' స్థానంలో 'రు' వచ్చి పగత + రు. "పుంలింగబయి మహద్వాచకంబయిన నామంబు తుది యత్వంబున కుత్వంబగు" అనే సూత్రం చేత చివరి అత్వానికి 'ఉత్వం' వచ్చి 'పగతురు' అవుతుంది. పగతు + లను - పగతురను, పగతు + ల చేత - పగతురచేత అవుతుంది. ఇలాగే అల్ల + లు - అల్లురు, నెయ్య + లు - నెయ్యురు, బలియ + లు - బలుయురు, మార్త + లు - మార్తురు.

ఇది నిత్యవిధి. కాబట్టి లకారస్థానంలో రేఫాదేశం నిత్యం. కనుక పగతులు, పగతులను అని రేఫ రాని

రూపాలు ఉండవు.

విశేషం : పగత + ఆది - పగతాది. 'పగత' అనే దానిని బట్టి తక్కిన ఉదాహరణలు కూడ అదంతాలు అని గ్రహించాలి.

**10.2.6 కొన్ని డుమంతంబుల బహువచన లకారంబునకు రేఫంబును దానికి ముందు పూర్ణబిందు పూర్వక డకారంబు నగు. (ఆచ్ఛిక - 6 సూ.)**

పద విభాగం : కొన్ని, డుమంతంబుల, బహువచన, లకారంబునకు, రేఫంబును, దానికి, ముందు, పూర్ణబిందు, పూర్వక, డకారంబును, అగు.

భావం : డుమంతాలైన కొన్ని ఆచ్ఛిక శబ్దాలకు సంబంధించిన బహువచన లకారానికి రేఫ, ఆ రేఫకు ముందు నిండుసున్నతో కూడిన డకారం (ండ్) వస్తుంది.

వ్యాఖ్య : "డుఙ్ వర్ణకంబునకుం బ్రకృతి యయినది డుమంతంబనంబడు" 'డుఙ్' ప్రత్యయం రావడానికి అర్హతగల ప్రాతిపదికలను డుమంతాలు అంటారు. పూర్ణబిందువు అంటే నిండుసున్న. ప్రథమా విభక్తి బహువచనం అయిన లువర్ణం, ద్వితీయాది విభక్తుల్లో వచ్చే లడాగమం, రెండిటినీ బహువచన లకారం అంటారు. సూత్రంలో లకారానికి రేఫ వస్తుందని చెప్పడం చేత కేవలం లకార హల్లు స్థానంలో రేఫ ఆదేశంగా వస్తుంది. కాబట్టి 'లు' స్థానంలో 'రు' వస్తుంది. 'ల' స్థానంలో 'ర' వస్తుంది. ఇక్కడ పూర్ణబిందు పూర్వక డకారం పొల్లు రూపంగానే (ండ్) వస్తుంది.

ఉదాహరణ : గండండ్రు

గండ - ప్రాతిపదిక. ప్రథమా విభక్తి బహువచనంలో "లు" వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత 'లు' వర్ణం వచ్చి గండ + లు. ప్రస్తుత సూత్రం చేత 'లు' స్థానంలో 'రు' వచ్చి గండ + రు. రేఫకు ముందు పూర్ణబిందు పూర్వకమైన డకారం (ండ్) రాగా గండండ్రు - "గండండ్రు" అవుతుంది. గండ + లను - గండండ్రను, గండ + లచేత - గండండ్రచేత అవుతుంది. ఇలాగే మిండ + లు - మిండండ్రు, మిండ + లను - మిండండ్రను. ఇది నిత్యవిధి కాబట్టి గండలు, మిండలు అనే రూపాలు ఉండవు.

విశేషం : ఈ సూత్రంలో చెప్పబడిన రేఫాదేశం, పూర్ణబిందు పూర్వక డకారం రెండూ కలిసే వస్తాయి. ఒకటి వచ్చి, ఒకటి రాకపోవడం ఉండదు. ఇలా రెండు కార్యాలు కలిసి రావడాన్ని వ్యాకరణ పరిభాషలో "సన్నియోగ విశిష్టం" అంటారు.

**10.2.7 కా ప్రత్యయంబు మీది బహువచన లకారంబునకు లఘ్వ లఘు రేఫంబులును, లఘురేఫంబునకు ముందు బిందు పూర్వక డకారంబునగు. (ఆచ్ఛిక - 7 సూ.)**

పద విభాగం : కా ప్రత్యయంబు మీది, బహువచన, లకారంబునకు లఘు, అలఘు రేఫంబులును, లఘురేఫంబునకు, ముందు, బిందు పూర్వక, డకారంబును, అగు.

భావం : కా ప్రత్యయం చివర ఉన్న ప్రాతిపదికలకు సంబంధించిన బహువచన ప్రత్యయమైన లు వర్ణానికి,

లడాగమ లకారానికి, రేఫ ఒకసారి, అలఘురేఫ ఒకసారి వస్తాయి. రేఫ వచ్చినపుడు దానికి ముందు బిందు పూర్వక డకారం (ండ్) నిత్యంగా వస్తుంది. అలఘురేఫ వచ్చినపుడు దానికి ముందు బిందు పూర్వక డకారం (ండ్) రాదు. అలఘురేఫ అంటే శకటరేఫ(ఱ).

ఉదా॥ విలుకాండ్రు - విలుకాఱు.

విలుకా - ప్రాతిపదిక. ప్రథమా విభక్తి బహువచనంలో "లు వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత 'లు' వర్ణం వచ్చి విలుకా + లు అవుతుంది. ప్రస్తుత సూత్రం చేత 'ల' కార స్థానంలో రేఫ వచ్చి విలుకా + రు అవుతుంది. రేఫకు ముందు బిందు పూర్వక డకారం (ండ్) వచ్చి విలుకాండ్రు - "విలుకాండ్రు" అవుతుంది.

విలుకాఱు : విలుకా + లు అని ఉన్నపుడు ప్రస్తుత సూత్రం చేత లకార స్థానంలో అలఘురేఫ (ఱ) రాగా "విలుకాఱు" అవుతుంది.

ఇలాగే వేఁటకా + లు - వేటకాండ్రు - వేఁటకాఱు
వేడుకకా + లు - వేడుకకాండ్రు - వేడుకకాఱు

ద్వితీయాది బహువచనాల్లో విలుకాండ్రను - విలుకాఱును, వేఁటకాండ్రను - వేఁటకాఱును, అని రూపాలు ఏర్పడతాయి.

విశేషం : ఈ సూత్రంలో "బిందు పూర్వక" అని మాత్రమే ఉంది. అయినా పూర్ణబిందువును నిలిపే ప్రక్రియ చెప్పాలి. ఇక్కడ ఒకవేళ అర్ధబిందువు నిలిపి "విలుకాఁడ్రు" అని చేసినా ఇదే పరిచ్ఛేదం లోని 15వ సూత్రం "సమాన పదంబు నందు సంయోగంబు పరంబగు నపుడెల్లచో ఖండబిందువునకుం బూర్ణం బగు" అనే సూత్రం చేత ఆ అర్ధబిందువు పూర్ణబిందువై "విలుకాండ్రు" అవుతుంది.

**10.2.8 ఱే ప్రభృతుల బహువచనమునకు ముందు డుజ్జగు. (ఆచ్ఛిక - 8 సూ.)**

భావం : ఱే మొదలైన అచ్చతెలుగు ప్రాతిపదికలకు బహువచన ప్రత్యయాలైన "లు - ల" లకు ముందు "డుజ్" వస్తుంది.

ఉదా॥ ఱేఁడులు - ఱేండ్లు.

ఱే - ప్రాతిపదిక. ప్రథమా విభక్తి బహువచనంలో "లు వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత లువర్ణం వచ్చి "ఱే + లు" అవుతుంది. ప్రస్తుత (ఈ) సూత్రం చేత లువర్ణానికి ముందు 'డుజ్' రాగా "ఱే + డుజ్ + లు" అవుతుంది.

"జిత్తు బిందు పూర్వకం బగు" అనే సూత్రం చేత జకారం లోపించి, 'డు' ముందు అర్ధ బిందువు వచ్చి "ఱేఁడు + లు" అవుతుంది.

"బహువచనము పరంబగునపుడు డ ల ట ర ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగా నగు" అనే సూత్రం చేత 'డు' లోని 'ఉత్వం' లోపించి "ఱేఁడ్ + లు - ఱేఁడ్లు" అవుతుంది.

"సమాన పదంబునందు సంయోగంబు పరంబగు నపుడెల్లచో ఖండబిందువునకుం బూర్ణంబగు" అనే సూత్రం చేత అర్థబిందువు స్థానంలో పూర్ణబిందువు (నిండుసున్న) వచ్చి "ఱేండ్లు" అవుతుంది.

వ్యాఖ్య : ఱే మొదలైనవి ఱే ప్రభృతులు. ఈ సూత్రంలో "డుజ్‌అగు" అనడం చేత ఇది నిత్యవిధి. కాబట్టి బహువచనంలో 'డుజ్' రాకుండా 'ఱేలు' అని కాదు.

విశేషం : సాధారణంగా బహువచనంలో "డుజ్" ప్రత్యయం రావడానికి వీలులేదు. అందుకే చిన్నయ సూరి ఈ సూత్రం చేత ప్రత్యేకంగా "డుజ్" ప్రత్యయాన్ని విధించారు.

**10.2.9 కూఁతు శబ్దము ప్రథమైక వచనంబునకు రువర్ణంబగు. (ఆచ్ఛిక - 9 సూ.)**

భావం : కూఁతు శబ్దం యొక్క ప్రథమా విభక్తి ఏకవచనానికి రువర్ణం ఆదేశంగా వస్తుంది.

ఉదా॥ కూఁతురు.

కూఁతు - ప్రాతిపదిక. ప్రస్తుత (ఈ) సూత్రం చేత ప్రథమా ఏకవచన స్థానంలో రువర్ణం ఆదేశమై "కూతురు" అనే ప్రథమా ఏకవచన రూపం ఏర్పడుతుంది.

ఉదా॥ కూఁతులు.

కూఁతు - ప్రాతిపదిక. ప్రథమా విభక్తి బహువచనంలో "లు వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత లు వచ్చి "కూఁతులు".

వ్యాఖ్య : సూత్రంలో "రు వర్ణంబు అగు" అనడం చేత ఇది నిత్యవిధి. ప్రథమా ఏకవచనానికి మాత్రమే రువర్ణం విధించడం చేత, ప్రథమా బహువచనానికి, ఇతర విభక్తుల ఏకవచన, బహువచనాలకూ ఈ విధి (రు) కలుగదు.

కనుక కూఁతురులు - కూఁతుళ్లు - కూఁతురిని మొదలైన రూపాలు లక్షణ విరుద్ధాలు. అందువల్ల గ్రామ్యా లవుతాయి.

విశేషం : "కూఁతురు" ప్రథమా ఏకవచనం. ఒక విభక్తి మీద మరొక విభక్తి చేరదు. కనుక దీని మీద మరల విభక్తులు చేరవు.

**10.2.10 చెయువు బహువచన లకారంబున కలఘురేఫంబు విభాషనగు. (ఆచ్ఛిక - 10 సూ.)**

పద విభాగం : చెయువు, బహువచన, లకారంబునకు, అలఘురేఫంబు, విభాషను, అగు.

భావం : చెయువు అనే అచ్చ తెలుగు శబ్దం యొక్క బహువచన లకార స్థానంలో అలఘురేఫ(ఱ) వికల్పంగా వస్తుంది.

వ్యాఖ్య : ప్రథమా విభక్తి బహువచనం అయిన లువర్ణం, ద్వితీయాది విభక్తుల్లో వచ్చే లడాగమం, రెండిటినీ 'బహువచన లకారం' అంటారు. సూత్రంలో లకారానికి అలఘురేఫ వస్తుందని చెప్పడం చేత కేవలం లకార హల్మాత్రానికే అలఘురేఫ ఆదేశంగా వస్తుంది. కాబట్టి 'లు' స్థానంలో 'ఱు' వస్తుంది. 'ల'

స్థానంలో 'ఱ' వస్తుంది. విభాష అంటే చెప్పిన వ్యాకరణ కార్యం ఒకసారి వస్తుంది, ఒకసారి రాదు.

ఉదా॥ చెయువుఱు - చెయువులు

చెయువు - ప్రాతిపదిక. ప్రథమా విభక్తి బహువచనంలో "లు వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత చెయువు + లు ప్రస్తుత సూత్రం చేత లు వర్ణ స్థానంలో శకటరేఫ వస్తే 'చెయువుఱు' అవుతుంది. విభాష గాబట్టి శకటరేఫ రానిచో 'చెయువులు' అవుతుంది. ఇలాగే ద్వితీయాది బహువచనాల్లో చెయువు + లను - చెయువుఱను, చెయువులను అవుతుంది.

విశేషం : అలఘురేఫ అంటే శకటరేఫ. దీన్నే తెలుగులో బండి 'ఱ' అంటారు.

**10.2.11 ఆల్వాదుల బహువచన లకారంబునకు రేఫంబును ముందటి లువర్ణంబునకు బిందు పూర్వక డకారంబు నగు. (ఆచ్ఛిక - 11 సూ.)**

భావం : ఆలు మొదలైన ఆచ్ఛిక శబ్దాల బహువచన లకార స్థానంలో రేఫ వస్తుంది. దాన్ని ముందున్న లువర్ణ స్థానంలో, పూర్ణబిందువు (నిండు సున్న) పూర్వమందుగల డకారం(ండ్), నిత్యంగా ఆదేశంగా వస్తుంది.

వ్యాఖ్య : ప్రథమా విభక్తి బహువచనం అయిన లువర్ణం, ద్వితీయాది విభక్తుల్లో వచ్చే లడాగమం, రెండింటినీ బహువచన లకారం అంటారు. సూత్రంలో లకారానికి రేఫ వస్తుందని చెప్పడం చేత కేవలం లకార హల్మాత్ర స్థానంలో రేఫ వస్తుంది. కాబట్టి 'లు' స్థానంలో 'రు' వస్తుంది, 'ల' స్థానంలో 'ర' వస్తుంది. ఇక్కడ బిందు పూర్వక డకారం పొల్లు రూపంగానే (ండ్) వస్తుంది.

ఆలు + ఆదులు - ఆల్వాదులు. ఆలు మొదలైన శబ్దాలు ఆల్వాదులు. ఆలు - చెలియలు - చెల్లెలు - కోడలు - మఱదలు - ఇవి ఆల్వాదులు. ఇది నియతగణం. కాబట్టి వీటికి తప్ప ఇంక ఏ శబ్దాలకు ఈ కార్యాలు రావు.

ఉదా॥ ఆండ్రు.

ఆలు - ప్రాతిపదిక. ప్రథమా విభక్తి బహువచనంలో "లు వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత "లు" వచ్చి "ఆలు + లు". ప్రస్తుత సూత్రం చేత బహువచన లకార స్థానంలో రేఫ "ఆలు + రు", రేఫ ముందున్న లువర్ణ స్థానంలో పూర్ణబిందు పూర్వకమైన డకారం (ండ్) ఆదేశంగా రాగా ఆండ్ + రు - "ఆండ్రు" అని అవుతుంది. ద్వితీయాది విభక్తుల బహువచనంలో ఆలు + లను - "అండ్రను" అవుతుంది. ఇలాగే చెల్లెలు + లు - చెల్లెండ్రు, చెల్లెలు + లను - చెల్లెండ్రను.

విశేషం : ఈ సూత్రంలో చెప్పబడిన రేఫం, డకారం రెండూ కలిసే వస్తాయి. ఒకటి వచ్చి ఒకటి రాకపోవడం ఉండదు. బిందు పూర్వక డకారం అని సామాన్యంగా చెప్పినా పూర్ణబిందువును నిలిపే ప్రక్రియ చెప్పాలి. ఒకవేళ అర్ధబిందువు నిలిపి "ఆఁడ్రు" అని చేసినా "సమానపదంబునందు సంయోగంబు పరంబగు నపుడెల్లచో ఖండ బిందువునకుం బూర్ణంబగు" అనే సూత్రం చేత ఆ అర్థబిందువు పూర్ణమై "ఆండ్రు" అవుతుంది.

**10.2.12 బహువచనము పరంబగునపుడు డ ల ట ర ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగా నగు. (ఆచ్ఛిక - 12 సూ.)**

భావం : డ-ల-ట-ర అనే అక్షరాలు చివరగల ఆచ్ఛిక శబ్దాల యొక్క ఉత్వానికి (హ్రస్వమైన ఉకారానికి) బహువచనం పరమైనపుడు లోపం బహుళంగా వస్తుంది. డ-ల-ట-ర-ల యొక్క ఉత్వానికి అంటే డు-లు-టు-రు అనే వానిలోని ఉత్వానికి అని అర్థం.

ఉదా॥ గుండ్లు - గుండులు.

గుండు - ప్రాతిపదిక. ప్రథమా విభక్తి బహువచనంలో "లు వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత "గుండు + లు". ప్రస్తుత సూత్రం చేత 'డు' లోని ఉత్వం లోపిస్తే గుండ్ + లు - "గుండ్లు". ఉత్వలోపం బహుళం కాబట్టి లోపించనిచో "గుండులు" అని ఉంటుంది.

ఉదా॥ గిండ్లు - గిండులు.

గిండి - ప్రాతిపదిక. ప్రథమా బహువచనంలో "లు వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత "గిండి + లు". ఇత్తునకు బహువచనంబు పరంబగు నపుడుత్వంబగు" అనే సూత్రం చేత ప్రాతిపదిక చివరి ఇత్వానికి ఉత్వం వచ్చి 'గిండు + లు' అవుతుంది. ప్రస్తుత సూత్రం చేత 'డు' లోని ఉత్వం లోపిస్తే "గిండ్లు", లోపించనిచో "గిండులు" అవుతుంది. ఇలాగే మిగిలిన ఉదాహరణలు.

వ్యాఖ్య : బహుళం అంటే విధించిన వ్యాకరణ కార్యం, ప్రవృత్తి, అప్రవృత్తి, విభాష అన్యవిధం అని నాల్గు విధాలుగా జరగడం.

ప్రవృత్తి - విధించిన వ్యాకరణకార్యం (ఉత్వ లోపం) నిత్యంగా జరగడం. ఈ సూత్రంలో ప్రవృత్తికి ఉదాహరణ లేదు.

అప్రవృత్తి - విధించిన కార్యం జరగక పోవడం. విల్లులు, పిల్లులు, పులులు మొదలైన వానిలో ఉత్వలోపం లేదు.

విభాష - విధించిన కార్యం ఒకసారి జరగడం, ఒకసారి జరగక పోవడం. గుండు + లు - ఉత్వం లోపిస్తే గుండ్లు, లోపించనిచో గుండులు.

అన్యవిధం - విధించిన కార్యం భిన్నంగా జరగడం. కేవలం అచ్చతెలుగు శబ్దాలకే జరగవలసిన ఉత్వాలోప కార్యం తత్సమాల్లో కోటి, పిప్పలి శబ్దాలకూ జరుగుతున్నది.

కోటి + లు - కోటు + లు - కోట్లు, కోటులు.
పిప్పలి + లు - పిప్పలు + లు - పిప్పళ్ళు, పిప్పలులు.

విశేషం : డ-ల-ట-రల ఉత్వం సహజంగాని, కృతోత్కంగాని కావచ్చును. గుండు - మొదలైన వానిలోనిది సహజ ఉకారం. గిండి + లు - గిండులు మొదలైన వానిలోనిది కృతోత్కం. "కృతోత్కం" అంటే వ్యాకరణ రీత్యా వచ్చిన ఉకారం.

**10.2.13 బహువచనము పరంబగునపు డసంయుక్తంబులయి, యుదుతంబులయిన డ ల ర ల కలఘు లకారంబు బహుళంబుగానగు. (ఆచ్ఛిక - 13 సూ.)**

పద విభాగం : బహువచనము, పరంబు, అగునపుడు, అసంయుక్తంబులయి, ఉదంతంబులయిన, డ ల ర లకు , అలఘులకారంబు, బహుళంబుగాన్, అగు.

భావం : అసంయుక్తములై, ఉదంతాలైన డ-ల-ర లకు బహువచనం పరమైనపుడు అలఘు లకారం బహుళంగా వస్తుంది. ఉదంతాలయిన డ-ల-ర లు అంటే డు-లు-రు అన్నవి.

ఉదా॥ త్రాళులు - త్రాడులు.

త్రాడు - ప్రాతిపదిక. ప్రథమా విభక్తి బహువచనంలో "లు వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత త్రాడు + లు అవుతుంది. ప్రస్తుత సూత్రం చేత డకార హల్మాత్ర స్థానంలో అలఘు లకారం ఆదేశంగా వచ్చి త్రాళ్ + ఉ + లు - "త్రాళులు" అవుతుంది. అలఘు లకారం రానిచో త్రాడులు. ఇది సహజ ఉదంత డవర్ణాంత శబ్దానికి ఉదాహరణ.

ఉదా॥ గుమ్మళులు - గుమ్మడులు.

గుమ్మడి - ప్రాతిపదిక. ప్రథమా విభక్తి బహువచనంలో "లు వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత "గుమ్మడి + లు". "ఇత్తునకు బహువచనంబు పరంబగు నపుడుత్వంబగు" అనే సూత్రం చేత ప్రాతిపదిక చివరి ఇత్వానికి ఉత్వం వచ్చి "గుమ్మడు + లు". ప్రస్తుత సూత్రం చేత డకారస్థానంలో అలఘు ళకారం వచ్చినపుడు గుమ్మళ్ + ఉ + లు - "గుమ్మళులు" అవుతుంది. అలఘు ళకారం రానిచో "గుమ్మడులు" అవుతుంది. ఇది కృతోత్కమయిన డవర్ణాంత శబ్దానికి ఉదాహరణ.

వ్యాఖ్య : అసంయుక్తాలు అంటే వేరొక హల్లుతో కూడనివి. అలఘు లకారం అంటే 'ళ' కారం. సూత్రంలో "బహువచనం పరమైనపుడు" అనడం చేత అలఘు లకారం అన్ని విభక్తుల్లో బహుత్వం లోపిస్తుంది. ఉదా॥ త్రాళులను - త్రాళుల చేత. "అసంయుక్తములయిన" అనడం చేత సంయుక్తాలైన డ-ల-ర-లకు అలఘు లకారం రాదు. ఉదా॥ గ్రుడ్డు + లు - గ్రుడ్డులు - అలఘులకారం రాలేదు. "ఉదంతంబులయిన" అనడం చేత ఉదంతాలు కాని డ-ల-ర-లకు అలఘు లకారం రాదు. ఉదా॥ గోడ + లు - గోడలు - అలఘు లకారం రాలేదు.

విశేషం : త్రాడు - ఊరు వంటి సహజ ఉదంతాలకు, గుమ్మడులు - పిడికిలులు వంటి కృతోత్కాలకు ఈవిధి వర్తిస్తుంది.

**10.2.14 బహువచన శ్లిష్టంబులయి యద్విరుక్తంబులయిన డకార లకారంబుల కలఘు లకారంబు నిత్యంబుగ నగు. (ఆచ్ఛిక - 14 సూ.)**

పద విభాగం : బహువచన, శ్లిష్టంబులయి, అద్విరుక్తంబులు, అయిన, డకార లకారంబులకు, అలఘు లకారంబు, నిత్యంబుగన్, అగు.

భావం : బహువచనంతో కూడినవై, అద్విరుక్తాలైన డకార - లకారాల స్థానంలో అలఘు లకారం నిత్యంగా వస్తుంది.

ఉదా॥ త్రాళ్లు.

త్రాడు - ప్రాతిపదిక. ప్రథమా విభక్తి బహువచనంలో "లు వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత త్రాడు + లు. "బహువచనము పరంబగునపుడు డలటరల యుత్వమునకు లోపంబు బహుళముగా నగు" అనే సూత్రం చేత 'డు' లో ఉత్వం లోపించి త్రాడ్ + లు అవుతుంది. ప్రస్తుత సూత్రం చేత డకార పొల్లు స్థానంలో అలఘు లకారం నిత్యంగా వచ్చి త్రాళ్ + లు - త్రాళ్లు అవుతుంది. ఇలాగే మొగిళ్లు. మొగిలు + లు - మొగిల్ + లు - మొగిళ్ + లు - మొగిళ్లు. గుమ్మడి - వంటి ఇకారాంత శబ్దాలకు బహువచనంలో ఉత్వం వచ్చి గుమ్మడు + లు, అయిన తరువాత ఉత్వం లోపించి గుమ్మడ్ + లు అయి, ప్రస్తుత సూత్రం చేత డకారస్థానంలో అలఘు లకారం నిత్యంగా వచ్చి గుమ్మళ్ + లు - "గుమ్మళ్లు" అవుతుంది. ఇలాగే విడి + లు - విడు + లు - విడ్ + లు - విళ్ + లు - విళ్లు. ఇంకా సిళ్లు, మొసళ్లు మొదలైనవి. బహువచన శ్లిష్టం అంటే బహువచనాలతో కూడినది. అద్విరుక్తం అంటే ద్విత్వం లేనిది. అలఘు లకారం అంటే 'ళ' కారం.

విశేషం : "బహువచన శ్లిష్టములు" అని సూత్రంలో సామాన్యంగా చెప్పడం చేత ద్వితీయాది బహుత్వంలో విధించిన లకారంతో కూడినపుడు కూడ ఈ అలఘు లకార కార్యం కలుగుతుంది. కాబట్టి త్రాళ్లను - త్రాళ్లచేత - మొదలైన రూపాలు కలుగుతాయి.

## 10.3 సమీక్ష

ఈ పాఠంలో పారిభాషిక పదాలకు వివరణ, సూత్రాలకు సోదాహరణ వ్యాఖ్య తెలుసుకున్నారు.

## 10.4 ప్రశ్నలు

క్రింది పారిభాషిక పదాలను వివరించండి.

1. అచ్చు, 2. సర్వనామం, 3. ఔపవిభక్తికం.

క్రింది సూత్రాలకు సోదాహరణ వ్యాఖ్యలు వ్రాయండి.

1. సంస్కృత సమేతరంబయిన యీ భాష యచ్చు యనంబడు.
2. బల్లిదాదులు సంస్కృత తుల్యంబులు.
3. పగతాదుల బహువచన లకారంబునకు రేఫంబగు.
4. ఆే ప్రభృతుల బహువచనమునకు ముందు డు జ్ఞగు.
5. ఆల్వాదుల బహువచన లకారంబునకు రేఫంబును ముందరి లు వర్ణంబునకు బిందు పూర్వక డ కారంబునగు.
6. బహువచనము పరంబగునపుడు అసంయుక్తంబులయి యుదంతంబులయిన డలరలకలఘు లకారంబు బహుళంబుగానగు.

## 10.5 ఆధార గ్రంథాలు

1. బాల వ్యాకరణము - శ్రీ పరవస్తు చిన్నయ సూరి
2. ఘంటాపథ వ్యాఖ్యానం - శ్రీ వంతరాం రామకృష్ణారావు
3. బాలవ్యాకరణ సారస్వ సర్వస్వ పేటిక - శ్రీ దూసి రామమూర్తి శాస్త్రి
4. రమణీయము - శ్రీ దువ్వూరి వేంకటరమణ శాస్త్రి

డాక్టర్ రామినేని పద్మావతి
రీడర్
శ్రీ శారదా నికేతన్ ఓరియంటల్ కాలేజి
గుంటూరు

# పాఠం - 11

# ఆచ్ఛిక పరిచ్ఛేదం

పాఠ్యనిర్మాణక్రమం

11.0 లక్ష్యం
11.1 సోదాహరణ వ్యాఖ్యలు (15 నుండి 27 సూత్రాల వరకు)
11.2 సమీక్ష
11.3 ప్రశ్నలు
11.4 ఆధార గ్రంథాలు

## 11.0 లక్ష్యం

ఈ పాఠంలో ఆచ్ఛిక పరిచ్ఛేదంలోని 15 నుండి 27 సూత్రాలకు సోదాహరణంగా వ్యాఖ్యానం తెలుసుకుంటారు.

## 11.1 సోదాహరణ వ్యాఖ్యలు (15 నుండి 27 సూత్రాల వరకు)

### 11.1.1 సమాన పదంబు నందు సంయోగంబు పరంబగు నపుడెల్లచో ఖండబిందువునకుం బూర్ణంబగు. (ఆచ్ఛిక - 15 సూ.)

పద విభాగం : సమాన పదంబునందు, సంయోగంబు, పరంబు, అగునపుడు, ఎల్లచో, ఖండబిందువునకున్, పూర్ణంబు, అగు.

భావం : ఒకే పదంలో సంయుక్తాక్షరం పరంగా ఉంటే ఎల్లచో అరసున్నకు నిండుసున్న వస్తుంది.

సమానపదం - ఏకపదం, సంయోగం - రెండు హల్లుల కలయిక
ఖండబిందువు - అరసున్న, పూర్ణబిందువు - నిండుసున్న

ఉదాహరణ : అనఁటులు - అనంట్లు.

అనటి - ప్రాతిపదిక. ప్రథమా బహువచనంలో "లు" వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత 'అనఁటి + లు', "ఇత్తునకు బహువచనంబు పరంబగు నపుడుత్వంబగు" అనే సూత్రం చేత ఇత్వానికి ఉత్వం వచ్చి "అనఁటులు" అవుతుంది. "బహువచనము పరంబగునపుడు డ ల ట ర ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగా నగు" అనే సూత్రం చేత 'టు' లోని ఉత్వం లోపించి అనఁట్ + లు - "అనఁట్లు" అవుతుంది. ఇక్కడ సంయోగం పరమైంది గాబట్టి ప్రస్తుత సూత్రం చేత అరసున్నకు నిండుసున్న నిత్యంగా వచ్చి అనంట్లు అయినది. ఇలాగే పనఁటి + లు - పనఁటులు - పనంట్లు.

ఉదా॥ గోఁటులు - గోంట్లు.

గోఁటు - ప్రాతిపదిక. ప్రథమా విభక్తి బహువచనంలో "లు వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం

చేత గోఁటు + లు - గోఁటులు. "బహువచనము పరంబగునపుడు డ ల ట ర ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగా నగు" అనే సూత్రం చేత 'టు' లోని ఉత్వం లోపించి గోఁట్ + లు - "గోఁట్లు" అవుతుంది.

"దీర్ఘము మీద సాధ్య పూర్ణము లేదు" అనే సూత్రం చేత ఇక్కడ అరసున్న స్థానంలో నిండుసున్న రావడానికి వీలులేదు. కాని ప్రస్తుత సూత్రంలో "ఎల్లచో" అనడం చేత దీర్ఘం మీద కూడ సాధ్యపూర్ణ బిందువు వస్తుంది. కాబట్టి, గోఁట్లు - గోంట్లు అవుతుంది. ఇలాగే తేఁటి + లు - తేఁటు + లు - తేఁ ట్ + లు - తేఁట్లు - తేంట్లు. ఇలాగే ఏఁడు + లు - ఏఁడ్ + లు - ఏఁడ్లు - ఏండ్లు. కాఁడు + లు - కాఁ డ్ + లు - కాఁడ్లు - కాండ్లు.

ఏండ్లు, కాండ్లు మొదలైన వానిలో డకార స్థానంలో ళకారాదేశం కొందరు చెప్పారని, అవి గ్రహించవద్దని చిన్నయ సూరి అభిప్రాయం.

విశేషం : సూత్రంలో "ఎల్లచో" అనడం చేత దీర్ఘము మీద కూడ సాధ్యపూర్ణ బిందువు వస్తుంది. గోంట్లు, ఏండ్లు మొదలయినవి. "అగు" అనడం చేత ఇది నిత్యవిధి. కాబట్టి పూర్ణబిందువు రాని అనఁట్లు, పనఁట్లు, గోఁట్లు, ఏఁడ్లు అనే రూపాలు ఉండవు.

### 11.1.2 ఔప విభక్తికంబుల లివర్ణ సలలు వర్ణంబులకు బహువచనంబు పరంబగునపుడు పూర్ణబిందు పూర్వక డువర్ణంబు బహుళంబుగా నగు. (ఆచ్ఛిక - 16 సూ.)

భావం : ఔప విభక్తికముల యొక్క లి - ల్లు అనే వర్ణాలకు బహువచనం పరమైనపుడు పూర్ణబిందు పూర్వకమైన డువర్ణం (ండు) బహుళంగా వస్తుంది. సల లువర్ణం - అంటే లకారంతో కూడిన లువర్ణం. అంటే 'ల్లు' వర్ణం. పూర్ణబిందు పూర్వక డువర్ణం - పూర్ణబిందువు ముందు కలిగిన డువర్ణం (ండు).

ఉదాహరణ : కొడవండులు - కొడవండ్లు.

కొడవలి - ప్రాతిపదిక. ప్రథమా బహువచనం కొడవలి + లు. ప్రస్తుత సూత్రం చేత 'లి' వర్ణ స్థానంలో 'ండు' వచ్చి కొడవండు + లు. "బహువచనము పరంబగునపుడు డ ల ట ర ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగా నగు" అనే సూత్రం చేత 'డు' లోని ఉత్వం లోపిస్తే కొడవండ్లు, లోపించనిచో కొడవండులు అవుతుంది.

కొడవలులు - కొడవళులు - కొడవళ్లు.

కొడవలి - ప్రాతిపదిక. "లు వర్ణంబు బహువచనంబు" కొడవలి + లు. "ఇత్తునకు బహువచనము పరంబగునపుడు త్వంబగు" అనే సూత్రం చేత "కొడవలులు" అవుతుంది. "బహువచనము పరంబగునపు డసంయుక్తంబులయి యుదంతంబులయిన డ ల ర ల కలఘు లకారంబు బహుళంబుగా నగు" అనే సూత్రం చేత 'కొడవళులు' అవుతుంది.

కొడవలి - ప్రాతిపదిక. "లు వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత కొడవలి + లు అవుతుంది. "ఇత్తునకు బహువచనంబు పరంబగునపుడు త్వంబగు" అనే సూత్రం చేత "కొడవలు + లు" అని

కాగా "బహువచనంబు పరంబగు నపుడు డ ల ట ర యుత్వంబునకు లోపంబు బహుళంబుగా నగు" అనే సూత్రం చేత కొడవల్ + లు అవుతుంది. "బహువచన శ్లిష్టంబులయి యద్విరుక్తంబులయిన డకార లకారంబుల కలఘు లకారంబు నిత్యంబుగ నగు" అనే సూత్రం చేత కొడవళ్ + లు - కొడవళ్లు అవుతుంది. 'కొడవలి' లోని 'లి' వర్ణస్థానంలో ప్రస్తుత సూత్రం చేత పూర్ణబిందు పూర్వక డు వర్ణం వస్తే "కొడవండులు - కొడవండ్లు" అని రెండు రూపాలు, రాకపోతే "కొడవలులు - కొడవళులు - కొడవళ్లు" అని మూడు రూపాలు, మొత్తం ఐదు రూపాలు కలుగుతాయి. 'రోకలి' మొదలైన వానికి ఇలాగే రూపాలు కలుగుతాయి.

ఉదా॥ ఇండులు - ఇండ్లు - ఇల్లులు.

ఇల్లు - ప్రాతిపదిక - ఇది సల లువర్ణానికి ఉదాహరణ. "లు వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత బహువచనంలో లు వర్ణం వచ్చి ఇల్లు + లు. ప్రస్తుత సూత్రం చేత 'ల్లు' స్థానంలో 'ండు' ఆదేశంగా వచ్చి ఇండు + లు - ఇండులు అవుతుంది. "బహువచనము పరంబగునపుడు డ ల ట ర ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగా నగు" అనే సూత్రం చేత 'డు' లోని ఉత్వం లోపిస్తే "ఇండ్లు" లోపించనిచో "ఇండులు" అవుతుంది. ఇల్లు + లు అని ఉన్నప్పుడు ప్రస్తుత సూత్రం చేత 'ల్లు' స్థానంలో 'ండు' రాని పక్షంలో "ఇల్లులు" అవుతుంది.

ఇలాగే కల్లు - పల్లు - ముల్లు - విల్లు మొదలైన వానికి రూపాలు కలుగుతాయి. మద్యం అర్థంగల 'కల్లు' శబ్దం, నిమ్నం అర్థంగల 'పల్లు' శబ్దం, 'తెల్లు' మొదలైన శబ్దాలు ఔప విభక్తికాలు కావు. కాబట్టి వానికి ఈ కార్యం లేదు. అనగా వాని 'ల్లు' వర్ణ స్థానంలో 'ండు' వర్ణం ఆదేశం కాదు. అనగా వాని 'ల్లు' వర్ణ స్థానంలో 'ండు' వర్ణం ఆదేశం కాదు.

కల్లులు - పల్లులు - తెల్లులు అనే ఉంటాయి.

**11.1.3 ఒకానొకచో నామంబు సంశ్లిష్ట బహువచనాంత తుల్యంబయి బహువచనంబు నెనయు (ఆచ్ఛిక - 17 సూ.)**

నామం అంటే ప్రాతిపదిక.

భావం : కొన్ని ఆచ్ఛిక ప్రాతిపదికలు బహువచనంతో సంశ్లిష్టమై (కూడి) మరల బహువచన ప్రత్యయాన్ని పొందుతాయి. అంటే బహువచనంతో సంశ్లిష్టమైనవే ప్రాతిపదికలై మరల బహువచన ప్రత్యయాన్ని పొందుతాయి.

ఉదాహరణ : కొడవండ్లులు - కొడవళ్లులు.

కొడవలి - ప్రాతిపదిక. ఇది ప్రథమా విభక్తి బహువచనం 'లు' వర్ణంతో సంయోగం చెందితే కొడవండ్లు - కొడవళ్లు అనే రూపాలు అవుతాయి. ఇవి సంశ్లిష్ట బహువచనాంతాలు. ఈ సూత్రంలో "సంశ్లిష్ట బహువచనాంత తుల్యంబై" అని "తుల్యం" అనడం చేత కొడవండ్లు, కొడవళ్లు అనే సంశ్లిష్ట బహువచనాంత రూపాలు ప్రాతిపదికలై మరల బహువచన ప్రత్యయం 'లు' వర్ణాన్ని పొంది, కొడవండ్లులు - కొడవళ్లులు అవుతున్నాయి.

విశేషం : ఒక విభక్తి చేరిన ప్రాతిపదిక మీద మరొక విభక్తి చేరడం శాస్త్ర విరుద్ధం. ఈ శాస్త్ర విరోధాన్ని తప్పించడానికే సూత్రంలో 'తుల్యం' అనే పదం చెప్పబడింది. కాబట్టి "కొడవండ్లు - కొడవళ్లు" అనే బహువచనాంతాలపై మరల బహువచన ప్రత్యయం చేరగలిగింది. సూత్రంలో "బహువచనంబు నెనయు" అనడం చేత సంశ్లిష్ట బహువచనాంత తుల్య ప్రాతిపదిక మీద మరల బహువచనమే వస్తుంది గాని ఏకవచనం రాదు. 'కొడవండ్లులు' అనే అవుతుంది గాని ఏకవచన ప్రత్యయం చేరి 'కొడవండ్లును' అని మాత్రం కాదు.

**11.1.4 కలన్వాదుల నువర్ణంబు కుజ్జగు, బహువచనము పరంబగునపుడు నిత్యముగా నగు. (ఆచ్ఛిక - 18 సూ.)**

భావం : కలను మొదలైన శబ్దాల యొక్క నువర్ణ స్థానంలో 'కుజ్' అనేది ఆదేశంగా వస్తుంది. బహువచనం పరమైనపుడు నువర్ణ స్థానంలో 'కుజ్' నిత్యంగా వస్తుంది.

'కుజ్' బహువచనంలో నిత్యంగా వస్తుందని చెప్పడం చేత, ఏకవచనంలో అనిత్యంగా వస్తుంది. అంటే వికల్పంగా వస్తుందని భావం.

ఉదాహరణ : కలఁకు - కలంకు - కలను.

కలను - ప్రాతిపదిక. ప్రస్తుత సూత్రం చేత 'ను' స్థానంలో 'కుజ్' ఆదేశంగా వచ్చి కలకుజ్ అవుతుంది. కుజ్‌లో జకారం ఇత్తు. కాబట్టి "జిత్తు బిందు పూర్వంబగు" అనే సూత్రం చేత జకారం లోపించి కువర్ణానికి ముందు అర్థ బిందువు వస్తే "కలఁకు" అవుతుంది. పూర్ణబిందువు వస్తే "కలంకు" అవుతుంది. నువర్ణ స్థానంలో 'కుజ్' రానిచో "కలను" అని ఉంటుంది. ఇది స్త్రీ సమం కాబట్టి, "స్త్రీ లింగంబుల ప్రథమైక వచనమునకు లోపంబగు" అనే సూత్రం చేత దీని మీది ప్రథమా ఏకవచనం లోపిస్తుంది.

కలఁకులు - కలంకులు

కలను - ప్రాతిపదిక. ప్రథమా విభక్తి బహువచనంలో "లు వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత లువర్ణం చేరి కలను + లు అవుతుంది. ప్రస్తుత సూత్రం చేత 'ను' స్థానంలో 'కుజ్' నిత్యంగా వచ్చి కలకుజ్ + లు అవుతుంది. "జిత్తు బిందు పూర్వంబగు" అనే సూత్రం చేత కువర్ణానికి ముందు అర్థ బిందువు వస్తే కలఁకులు, పూర్ణబిందువు వస్తే కలంకులు అవుతాయి. ఇలాగే "మ్రాను" శబ్ద నువర్ణస్థానంలో ఏకవచనంలో 'కుజ్' వికల్పంగా వచ్చి "మ్రాకు - మ్రాను" అవుతాయి. బహువచనంలో కుజ్ నిత్యం కాబట్టి "మ్రాఁకులు" అవుతుంది.

"దీర్ఘము మీద సాధ్య పూర్ణము లేదు"

కాబట్టి మ్రాంకు, మ్రాంకులు అని పూర్ణబిందు రూపాలు ఉండవు.

విశేషం : కలను - కెలను - కొఱను - కొలను - గవను - నెఱను - మ్రాను - వరను - వలను. ఇవి కలన్వాదులు అని చెప్పడం చేత వీనికి తప్ప తక్కిన నువర్ణాంత శబ్దాలకు ఈ కార్యం వర్తించదు. మేను + లు - మేనులు అని ఉంటుందే గాని 'మేఁకులు' అని కాదు.

**11.1.5 అట్లు రేను గోను శబ్దంబుల నువర్ణంబు గుజ్జగు. (ఆచ్ఛిక - 19 సూ.)**

"అట్లు" అనే శబ్దం పూర్వం చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తున్నది.

భావం : కలన్వాదుల నువర్ణం కుజ్ అయినట్లు, రేను - గోను శబ్దాల నువర్ణం గుజ్ అవుతుంది. అంటే రేను - గోను శబ్దాల నువర్ణం ఏకవచనంలో వైకల్పికంగా గుజ్ వస్తుంది. బహువచనం పరమైనపుడు నిత్యంగా గుజ్ వస్తుంది.

ఉదాహరణ : రేఁగు - రేను.

రేను - ప్రాతిపదిక. ప్రస్తుత సూత్రం చేత 'ను' స్థానంలో 'గుజ్' ఏకవచనంలో వికల్పం కాబట్టి రేఁగు - రేను అని రెండు రూపాలవుతాయి. ఇది స్త్రీ సమం కాబట్టి "స్త్రీ లింగంబుల ప్రథమైక వచనమునకు లోపంబగు" అనే సూత్రం చేత దీని మీది ప్రథమా ఏకవచనం లోపిస్తుంది. ఇలాగే గోఁగు - గోను.

రేఁగులు

రేను - ప్రాతిపదిక. ప్రథమా విభక్తి బహువచనంలో "లు వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత లు వర్ణం చేరి రేను + లు అవుతుంది. ప్రస్తుత సూత్రం చేత 'ను' స్థానంలో 'గుజ్' నిత్యంగా వచ్చి రేగుజ్ + లు. "జిత్తు బిందు పూర్వం బగు" అనే సూత్రం చేత "రేఁగులు" అవుతుంది. "దీర్ఘము మీద సాధ్య పూర్ణము లేదు" కాబట్టి రేంగు, రేంగులు అని పూర్ణబిందు రూపాలు ఉండవు. ఇలాగే గోను + లు - గోఁగులు.

విశేషం : సూత్రంలో "రేను గోను శబ్దంబుల" అనడం చేత, ఇతర శబ్దాలకు ఈ కార్యం కలగదు. మేను + లు - మేనులు అవుతుంది కాని మేఁగులు అని మాత్రం కాదు.

**11.1.6 బహువచనంబు పరంబగునపుడు చేను, పేను, మీను శబ్దంబుల నువర్ణంబు లోపించు. (ఆచ్ఛిక - 20 సూ.)**

భావం : బహువచనం పరమైనప్పుడు చేను, పేను, మీను అనే శబ్దాల చివరి నువర్ణం లోపిస్తుంది.

ఉదాహరణ : చేలు.

చేను - ప్రాతిపదిక. ప్రథమా విభక్తి బహువచనంలో "లు వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత చేను + లు అవుతుంది. ప్రస్తుత సూత్రం చేత 'ను' లోపించి "చేలు" అవుతుంది. ఇలాగే పేను + లు - పేలు, మీను + లు - మీలు అవుతాయి. ద్వితీయాది బహువచనాలు పరమైనపుడు కూడ 'ను' లోపిస్తుంది. మీను + లను - మీలను, మీను + లచేత - మీలచేత, మొదలైన రూపాలు ఏర్పడతాయి.

ఇది నిత్యవిధి. కాబట్టి నువర్ణం లోపించని చేనులు, పేనులు, మీనులు అనే రూపాలు లక్షణ విరుద్ధాలు. కనుక గ్రామ్యాలవుతాయి.

విశేషం : చేను, పేను, మేను శబ్దాల నువర్ణానికే లోపం వస్తుంది తప్ప, తక్కిన నువర్ణాంత శబ్దాలకు ఈ కార్యం రాదు. మేను + లు - మేనులు అని ఉంటుందే కాని "మేలు" అని నువర్ణలోపం ఉండదు.

**11.1.7 బహువచనంబు పరంబగునపుడు రేయి ప్రభృతుల తుది యక్షరంబు లోపించు. (ఆచ్ఛిక - 21 సూ.)**

భావం : బహువచనం పరమైనప్పుడు రేయి మొదలైన శబ్దాల యొక్క చివరి అక్షరం లోపిస్తుంది. ప్రభృతులు అంటే మొదలైనవి అని అర్థం.

ఉదాహరణ : రేలు.

రేయి - ప్రాతిపదిక. ప్రథమా విభక్తి బహువచనంలో "లు వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత రేయి + లు - అవుతుంది. ప్రస్తుత సూత్రం చేత 'యి' లోపించి "రేలు" అవుతుంది. ఇలాగే ఊయి + లు - ఊలు, వేయి + లు - వేలు, వ్రాయి + లు - వ్రాలు. ద్వితీయాది బహువచనాలు పరమైనపుడు కూడ 'యి' లోపిస్తుంది. రేయి + లను - రేలను, రేయి + లచేత - రేలచేత అని రూపాలు అవుతాయి. ఇది నిత్యవిధి. కాబట్టి 'యి' వర్ణం లోపించక రేయి + లు - రేయులు, ఊయి + లు - ఊయులు అనే అపశబ్దాలు ఏర్పడవు.

ఈ చివరి అక్షరం లోపించడం అనే కార్యం విడిగా ఉన్నపుడే కాక సమాసాల్లో కూడ కనిపిస్తున్నది.

రేయి + రాజు - రేరాజు
మగఊయి + పతకము - మగఊపతకము
వేయి + వెలుగు - వేవెలుగు.

విశేషం : బహువచనం పరమైనపుడు చివరి "యి వర్ణం" లోపించే శబ్దాలన్నింటినీ ఇక్కడ ఉదాహరణంగా గ్రహించవచ్చు.

**11.1.8 బహువచనంబు పరంబగు నపు డావు ప్రభృతుల తుది యక్షరంబునకు లోపంబు విభాషనగు. (ఆచ్ఛిక - 22 సూ.)**

పద విభాగం : బహువచనంబు, పరంబగునపుడు, ఆవు ప్రభృతుల, తుది, అక్షరంబునకు, లోపంబు, విభాషన్, అగు.

భావం : బహువచనం పరమైనపుడు "ఆవు" మొదలైన శబ్దాల యొక్క చివరి అక్షరానికి విభాషగా లోపం వస్తుంది.

ఉదాహరణ : ఆలు - ఆవులు.

ఆవు - ప్రాతిపదిక. ప్రథమా విభక్తి బహువచనంలో "లు వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత 'లు వర్ణం' వచ్చి ఆవు + లు అవుతుంది. ప్రస్తుత సూత్రం చేత 'వు' లోపిస్తే "ఆలు" అవుతుంది. 'వు' లోపించడం విభాష కాబట్టి లోపించనిచో "ఆవులు" అవుతుంది.

ఇలాగే ద్వితీయాది బహువచనాల్లో కూడ వికల్పంగా లోపిస్తుంది. ఆవు + లను - ఆలను, ఆవులను అనే రూపాలు అవుతాయి.

ఇలాగే - జాము + లు - జాలు - జాములు.
చుట్టము + లు - చుట్టలు - చుట్టములు
మీసము + లు - మీసలు - మీసములు.

వ్యాకరణ కార్యం ఏదైనా ఒకసారి వచ్చుట, ఒకసారి రాకుండుట అనే దాన్ని విభాష లేక వికల్పం అంటారు.

విశేషం : ఈ సూత్రంలో "ఆవు ప్రభృతి" అనడం చేత 'ప్రభృతి' శబ్దం ఆవు శబ్దాన్ని బట్టి 'వు' వర్ణం చివర ఉన్న వానినే చెప్పేదిగా గ్రహించనవసరం లేదు. బహుత్వంలో చివరి అక్షరలోపం వికల్పంగా వచ్చే శబ్దాలను ఈ సూత్రానికి ఉదాహరణగా చెప్పవచ్చు. సూత్రంలో ఇవ్వబడిన ఉదాహరణలే అందుకు నిదర్శనం.

**11.1.9 ఇయకు మాఱుగా నామాంతంబున కెత్వంబు బహుళంబుగా నగు. (ఆచ్ఛిక - 23 సూ.)**

పద విభాగం : ఇయకు, మాఱుగా, నామాంతంబునకు, ఎత్వంబు, బహుళంబుగాన్, అగు.

భావం : ఆచ్ఛిక శబ్దాలలో ప్రాతిపదికల చివర ఉన్న 'ఇయ' అనే దానికి బదులుగా 'ఏ' కారం బహుళంగా వస్తుంది. ఇయకు 'మాఱుగా' అనడం చేత 'ఇయ' అనే దాని స్థానంలో 'ఏ' త్వం ఆదేశంగా వస్తుంది.

వ్యాఖ్య : బహుళం అంటే వ్యాకరణ కార్యం నాలుగు విధాలుగా వస్తుంది. అవి. 1. ప్రవృత్తి, 2. అప్రవృత్తి, 3. విభాష, 4. అన్యకార్యం. ప్రవృత్తి అంటే రావడం. అప్రవృత్తి అంటే రాకపోవడం. విభాష అంటే ఒకసారి రావడం, ఒకసారి రాకపోవడం. అన్యకార్యం అంటే చెప్పిన దానికంటే వేరేగా జరగడం. ఈ సూత్రంలో బహుళం లోని మూడిటికి ఉదాహరణ ఇచ్చారు.

అప్రవృత్తి : సందియము, కాఱియ మొదలైన శబ్దాల్లో ఇయకు బదులు ఎత్వం రావడం లేదు. సందియము, కాఱియ అని ఉంటాయే గాని సందెము, కాఱె అని కాదు.

విభాష : కొన్ని శబ్దాల్లో ఇయకు బదులు ఎత్వం విభాష. "కన్నె - కన్నియ". కన్నియ అనే శబ్దంలో ఇయకు బదులు ఎత్వం వస్తే కన్నె, రాకపోతే కన్నియ. ఇలాగే వన్నె - వన్నియ, కొంచెము - కొంచియము, కొండెము - కొండియము.

అన్యకార్యం : ఇయ శబ్దంలోని ఇకారం లోపించడం అన్యకార్యం. ముత్తియము - ఇందులో ఇత్వం మాత్రం లోపించి "ముత్యము" అవుతుంది. ఇక్కడ ఇయకు బదులుగా ఎత్వం వస్తే "ముత్తెము" కూడ అవుతుంది.

విశేషం : ఇయకు బదులుగా ఎత్వం బహుళంగా రావడం అనేది ఏకవచన, బహువచనాలు రెండిటిలో వస్తుందని గ్రహించాలి.

**11.1.10 అన్ని ప్రభృతులు సర్వనామంబులు. (ఆచ్ఛిక - 24 సూ.)**

భావం : అన్ని మొదలైనవి సర్వనామాలు.

వ్యాఖ్య : "ప్రభృతులు" అంటే మొదలైనవి అని అర్థం. అన్ని - ఇన్ని - ఎన్ని - కొన్ని - పెక్కు - పలు - ఆ - ఈ - ఏ - నీ - నా - మన - తా - మొదలైన శబ్దాలు, రెండు, మూడు మొదలైన సంఖ్యా వాచక శబ్దాలు "అన్ని ప్రభృతులు".

మహద్వాచక అర్థాన్ని చెప్పేటప్పుడు అన్ని - ఇన్ని - ఎన్ని - కొన్ని - పెక్కు - పలు - అనే ఆరు, రెండు - మూడు మొదలైన సంఖ్యా వాచకాలు బహువచనాంతాలే అవుతాయి.

అందఱు, అందొఱు, ఇందఱు, ఎందఱు, కొందఱు, పెక్కురు, పెక్కండ్రు, పలుగురు, పలుగుండ్రు, ఇద్దరు, ముగ్గురు మొదలైనవి.

అమహద్వాచక అర్థాన్ని చెప్పేటప్పుడు పై శబ్దాలు ఏకవచనాంతంగా ఉంటాయి. అన్ని - ఇన్ని - ఎన్ని - కొన్ని, పెక్కు - పలు - రెండు - మూడు మొదలైనవి.

నీ - నా - మన - తా - అనే నాలుగు శబ్దాలు మహద్వాచకాలైనా, అమహద్వాచకాలైనా ఒకే విధమైన రూపంలో ఉంటాయి.

నీవు రాముడవు, నీవు సీతవు, నీవు వృక్షమవు. ఈ సూత్రంలో సర్వనామ రూపాలు రూపసాధన ప్రక్రియ చూపకుండా ఇవ్వబడ్డాయి. ప్రక్రియా విధానం చూపాలంటే సూత్రాలు చాలా ఎక్కువ చెప్పవలసి వస్తుందని చిన్నయ సూరి ఈ పద్ధతి పాటించారు.

**11.1.11 సంఖ్యకుం బూరణార్థంబునం దవగాగమంబగు. (ఆచ్ఛిక - 25 సూ.)**

పద విభాగం : సంఖ్యకున్, పూరణార్థంబునందు, అవక్, ఆగమంబు, అగు.

భావం : సంఖ్యా వాచకాలకు పూరణార్థంలో 'అవక్' అనే ఆగమం వస్తుంది.

వ్యాఖ్య : సంఖ్యకు అంటే సంఖ్యా వాచకానికి అని అర్థం. పూరణం అంటే పూర్తి చేయడం అని అర్థం. ఆగమ అంటే వర్ణాధిక్యం. అంటే వర్ణం అధికంగా రావడం.

అవక్ - ఇందులో కకారాన్ని ఇత్తు అంటారు. అది లోపిస్తుంది. ఇలా 'క్' ఇత్తుగా ఉన్నవానిని వ్యాకరణ పరిభాషలో 'కిత్తు' అంటారు. అవి శబ్దానికి చివర చేరుతాయి. కాబట్టి సంఖ్యావాచకానికి చివర 'అవ' ఆగమంగా వస్తుంది.

ఉదారహణ : రెండవ.

రెండు - అనే సంఖ్యా వాచక శబ్దం మీద పూరణార్థంలో ప్రస్తుత సూత్రం చేత 'అవ' ఆగమంగా వచ్చి రెండు + అవ అవుతుంది. "అంద్వవగాగమం బులందప్ప నపదాది స్వరంబు పరంబగునపు డచ్చునకు సంధి యగు" అనే సూత్రం చేత సంధి వచ్చి 'రెండవ' అవుతుంది. ఇలాగే మూఁడు + అవ - మూఁడవ. ఇవి అది - వాఁడు అనే శబ్దాలతో సమాసాన్ని పొంది రెండవది, రెండవవాఁడు, మూఁడవది, మూఁడవవాఁడు అనే రూపాలు ఏర్పడతాయి. దేనిచేత సంఖ్య పూరింపబడుతుందే అది పూరణార్థం.

ఉదా॥ రామ లక్ష్మణులలో లక్ష్మణుఁడు రెండవవాఁడు.

ఇచట రెండు సంఖ్యను పూరించేవాడు లక్ష్మణుఁడు. కాబట్టి లక్ష్మణుని చెప్పే "రెండు" సంఖ్యకు అవగాగమం వచ్చింది.

విశేషం : "అవ" అనే పూరణార్థం రెండు - మూఁడు అనే సంఖ్యావాచకాలకే ఆగమంగా వస్తుంది గాని, దాని నుండి ఏర్పడిన మహద్వాచక రూపాలైన ఇద్దరు, ముగ్గురు అనే వాటికి రాదు.

**11.1.12 సర్వనామ క్రియాపదంబుల బహువచనంబు మహత్తునకుం బోలె మహతికగు. (ఆచ్ఛిక - 26 సూ.)**

భావం : సర్వనామాల యొక్క, క్రియా పదాల యొక్క, బహువచనం మహద్వాచకానికి వలె మహతీ వాచకానికి

అవుతుంది. అంటే మహద్వాచకాలకు బహువచనంలో వచ్చే సర్వనామాలు, క్రియలు, మహతీ వాచకాలకు కూడ బహువచనంలో వస్తాయి.

వ్యాఖ్య : స్త్రీ వాచకాలనే మహతీ వాచకాలు అంటారు.

"స్త్రీ తిర్యగ్జడ భిన్నంబులును వాని విశేషణంబులును మహత్తులనంబడు" అనే లక్షణాన్ని బట్టి స్త్రీ వాచకాలు తిర్యక్కులు జడాలవలె అమహత్తులు. కాబట్టి స్త్రీ వాచకాలకు అంటే మహతీవాచకాలకు అమహద్వాచకాలకు వలె కార్యాలు రావాలి. ప్రస్తుత సూత్రం దాన్ని వారించి మహద్వాచక కార్యాలను చెప్తూ ఉంది.

ఉదా॥ వారిద్దరు రుక్మిణీ సత్యభామలు.

రుక్మిణీ సత్యభామలు మహతీ వాచకాలు. కాబట్టి అమహద్వాచకాలకు వలె "అవి - రెండు" రుక్మిణీ సత్యభామలు అని కావాలి. ఈ సూత్ర ప్రకారం అది నివారించబడి "వారు - ఇద్దరు" అనే మహద్వాచక బహువచన రూపాలే మహతీ వాచకానికీ బహువచన రూపాలయ్యాయి.

అలాగే "వీరు ముప్పురు శ్రీభూ నీళలు"

శ్రీభూ నీళలు మహతీ వాచకాలు. వీటికి "ఇవి - మూడు" అని అమహత్ సర్వనామాలు కాక "వీరు - ముప్పురు" అని మహద్వాచక బహువచన సర్వనామాలే విశేషణాలుగా ప్రస్తుత సూత్రం చేత చెప్పబడ్డాయి. క్రియా పదాలకు కూడ ఇదే విధంగా జరుగుతుంది.

ఉదా॥ రుక్మిణీ సత్యభామలు వచ్చుచున్నారు.

రుక్మిణీ సత్యభామలు మహతీ వాచకాలు. వీటి క్రియాపదం "వచ్చుచున్నవి" అని అమహద్వాచక బహువచన క్రియగాక "వచ్చుచున్నారు" అని మహద్వాచక బహువచన క్రియ వచ్చింది.

ప్రస్తుత సూత్రంలో "బహు వచనంబు" అనడం చేత ఏకవచనం మాత్రం మహత్తునకు వలె మహతికి కాదు.

ఉదా॥ అది రుక్మిణి. రుక్మిణి వచ్చుచున్నది. ఇక్కడ వాఁడు రుక్మిణి. రుక్మిణి వచ్చుచున్నాఁడు. అని మహద్వాచకం వలె ఉండదు.

మహతీ వాచక సర్వనామ క్రియలకు ఏకవచనంలో అమహద్వాచక రూపం, బహువచనంలో మహద్వాచక రూపం ఉంటుందని తాత్పర్యం.

**11.1.13 అపదాద్యంబయి యసంయుక్తంబయిన గకారంబునకు వకారంబు విభాషనగు. (ఆచ్ఛిక - 27 సూ.)**

భావం : ఆచ్ఛిక పదాల్లో పదం యొక్క మొదటి అక్షరం కానిది, వేరొక హల్లుతో కూడనిది అయిన, గకారానికి వకారం విభాషగా వస్తుంది.

ఉదాహరణ : పలువురు - పలుగురు.

పలుగురు - ఇక్కడ గకారం పదాద్యం కాదు. సంయుక్తంలో లేదు. కాబట్టి ప్రస్తుత సూత్రం చేత

గకార స్థానంలో వకారం వస్తే 'పలువురు'. విభాష కాబట్టి వకారం రాకపోతే 'పలుగురు' అని ఉంటుంది.

ఇలాగే ఇరుగురు - ఇరువురు, వేగురు - వేవురు, తొగ - తొవ, పగలు - పవలు.

వ్యాఖ్య : పదాద్యం కానిది అపదాద్యం, అంటే పదం మొదట ఉండనిది. సంయుక్తం కానిది అసంయుక్తం, అంటే మరొక హల్లుతో కలియనిది. "గ కారమునకు" అంటే గకార స్థానంలో అని అర్థం.

విభాష అంటే చెప్పబడిన వ్యాకరణ కార్యం ఒకసారి వస్తుంది. ఒకసారి రాదు. ఈ సూత్రంలో గకార స్థానంలో వకారం ఒకసారి వస్తుంది. ఒకసారి రాదు.

"అపదాద్యంబు" అనడం చేత పదం మొదటి గకారస్థానంలో వకారం రాదు. "గడప, గాదె" అని ఉంటాయి గాని "వడప, వాదె" అని కావు.

"అసంయుక్తంబు" అనడం చేత సంయుక్తంలో ఉన్న గకారానికి వకారం రాదు. "సిగ్గు - ఎగ్గు" అని ఉంటాయి గాని "సివ్వు - ఎవ్వు" అని కావు.

ఈ విశేషం కేవలం అచ్చతెలుగు శబ్దాలకు సంబంధించింది మాత్రమే.

## 11.2 సమీక్ష

ఈ పాఠంలో ఆచ్ఛిక పరిచ్ఛేదంలోని 13 సూత్రాలకు సోదాహరణ వ్యాఖ్య తెలుసుకున్నారు.

## 11.3 ప్రశ్నలు

క్రింది సూత్రాలకు సోదాహరణ వ్యాఖ్యలు వ్రాయండి.

1. సమాన పదంబు నందు సంయోగంబు పరంబగునపుడెల్లచో ఖండ బిందువునకుం బూర్ణంబగు.
2. కలన్వాదుల నువర్ణంబు కు జ్ఞ గు, బహువచనము పరంబగునపుడు నిత్యముగా నగు.
3. ఇయకు మారుగా నామాంతంబున కెత్వంబు బహుళంబుగా నగు.
4. సంఖ్యకు బూరణార్థంబునంద వగాగమంబగు.
5. అపదాద్యంబయి యసంయుక్తంబయిన గకారంబునకు వకారంబు విభాష నగు.

## 11.4 ఆధార గ్రంథాలు


1. బాల వ్యాకరణము - శ్రీ పరవస్తు చిన్నయ సూరి
2. ఘంటాపథ వ్యాఖ్యానం - శ్రీ వంతరాం రామకృష్ణారావు
3. బాలవ్యాకరణ సారస్వ సర్వస్వ పేటిక - శ్రీ దూసి రామమూర్తి శాస్త్రి
4. రమణీయము - శ్రీ దువ్వూరి వేంకటరమణ శాస్త్రి



డాక్టర్ రామినేని పద్మావతి
రీడర్
శ్రీ శారదా నికేతన్ ఓరియంటల్ కాలేజి
గుంటూరు

# పాఠం - 12

# ఆచ్ఛిక పరిచ్ఛేదం

పాఠ్యనిర్మాణక్రమం

12.0 లక్ష్యం

12.1 సోదాహరణ వ్యాఖ్యలు (28 నుండి 38 సూత్రాల వరకు)

12.2 వ్యాసరూప ప్రశ్నలు

12.3 సమీక్ష

12.4 ప్రశ్నలు

12.5 ఆధార గ్రంథాలు

## 12.0 లక్ష్యం

ఈ పాఠంలో ఆచ్ఛిక పరిచ్ఛేదంలోని కొన్ని సూత్రాలకు సోదాహరణ వ్యాఖ్యలు తెలుసుకుంటారు. వ్యాసరూప ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకుంటారు.

## 12.1 సోదాహరణ వ్యాఖ్యలు (28 నుండి 38 సూత్రాల వరకు)

### 12.1.1 ఇ టి తి వర్ణంబులు వక్ష్యమాణంబు లౌప విభక్తికంబులు. (ఆచ్ఛిక - 28 సూ.)

పద విభాగం : ఇ-టి-తి, వర్ణంబులు, వక్ష్యమాణంబులు, ఔపవిభక్తికంబులు.

భావం : రాబోయే సూత్రాల చేత చెప్పబోయే ఇ-టి-తి అనే వర్ణాలను ఔపవిభక్తికాలంటారు.

వ్యాఖ్యానం : వక్ష్యమాణంబులు అంటే చెప్పబోయేవి అని అర్థం. ఉప అంటే సమీపం అని అర్థం. విభక్తికి సమీపంలో వచ్చేది ఉపవిభక్తి. ఉపవిభక్తికి సంబంధించింది ఔపవిభక్తికం. విభక్తులు పరమైనపుడు శబ్దాల చివర ఆదేశంగా, ఆగమంగా ఈ ఇ-టి-తి వర్ణాలు వస్తాయి. ఔపవిభక్తికాలు చేరే శబ్దాలను కూడ ఔపవిభక్తికాలనే అంటారు.

ఉదాహరణ : ఇ - కాలు + ను - కాలి + ను - కాలిని.
టి - నాగలి + ను - నాగటి + ను - నాగటిని.
తి - నేయి + ను - నేతి + ను - నేతిని.

### 12.1.2 ఇవి ద్వితీయాద్యేక వచనంబులు పరంబులగునపుడు నామంబులకుం గొన్నింటికిం బ్రాయికంబుగ నగు. (ఆచ్ఛిక - 29 సూ.)

పద విభాగం : ఇవి, ద్వితీయాది, ఏకవచనంబులు, పరంబులు, అగునపుడు నామంబులకున్, కొన్నింటికిన్, ప్రాయికంబుగన్, అగు.

భావం : ఇ-టి-తి-అనే ఔపవిభక్తికాలు, ద్వితీయ మొదలైన విభక్తుల ఏకవచనాలు పరంగా ఉంటే, కొన్ని అచ్చుతెలుగు ప్రాతిపదికలకు తరచుగా వస్తాయి.

ఉదాహరణ : కాలు - కాలిని. ఇక్కడ ద్వితీయా ఏకవచనం పరంగా ఉండగా "ఇ" వచ్చింది.
నాగలి - నాగటిచే. ఇక్కడ తృతీయా ఏకవచనం పరంగా ఉండగా "టి" వచ్చింది.
నేయి - నేతికొఱకు. ఇక్కడ చతుర్థీ విభక్తి ఏకవచనం పరంగా ఉండగా "తి" వచ్చింది.

వ్యాఖ్యానం : ఇవి అంటే పూర్వ సూత్రంలో చెప్పబడిన ఇ-టి-తి-అనే వర్ణాలు. ప్రాయికమంటే తఱచుగా అని అర్థం. నామం అంటే ప్రాతిపదిక.

సూత్రంలో "ఏకవచనంబులు" అనడం చేత ఇవి బహువచనంలో రావు. "కొన్నింటికి" అనడం చేత ఆచ్ఛిక ప్రాతిపదికలకు అన్నింటికీ ఔపవిభక్తికాలు రావు.

ద్వితీయా ఏకవచనం పరమైనపుడు ఔపవిభక్తికాలు రావని కొందరు అన్నారు. కాని ఈ అభిప్రాయం శాస్త్ర విరుద్ధం గనుక ఆదరించనక్కర లేదని చిన్నయ సూరి సూత్రంలో వివరించారు.

**12.1.3 ఊరు మొదలగువాని కిత్వంబగు. (ఆచ్ఛిక - 30 సూ.)**

పద విభాగం : ఊరు, మొదలగువానికి, ఇత్వంబగు.

భావం : ద్వితీయాది ఏకవచనాలు పరమైనపుడు ఊరు - మొదలైన శబ్దాల చివరి అచ్చు స్థానంలో ఇత్వం వస్తుంది. ఇత్వం అంటే హ్రస్వమైన ఇకారం అని అర్థం.

ఉదాహరణ : ఊరిని.

ఊరు - ప్రాతిపదిక. "ను వర్ణంబు ద్వితీయ" అనే సూత్రం చేత ద్వితీయా విభక్తి ఏకవచనం నువర్ణం చేరి "ఊరు + ను" అవుతుంది. ప్రస్తుత సూత్రం చేత "ఊర్ + ఇ + ను" - "ఊరి + ను" అవుతుంది. "ఇకారంబు మీది కు-ను-వు-క్రియా విభక్తుల యుత్వంబున కిత్వంబగు" అనే సూత్రం చేత నువర్ణంలోని ఉత్వానికి ఇత్వం వచ్చి "ఊరిని" అవుతుంది.

ఇలాగే - కాలు + ను - కాలిని, మ్రాను + ను - మ్రానిని
నోరు + ను - నోరిని, చోటు + ను - చోటిని

విశేషం : అనేక వర్ణాలున్న పదానికి ఒక వర్ణాన్ని ఆదేశంగా విధిస్తే, అది ఆ పదంలోని చివరి వర్ణం స్థానంలోనే ఆదేశంగా వస్తుందని శాస్త్ర నియమం. ఇక్కడ ఇత్వం ఒక్కటే వర్ణం కాబట్టి ఇది, ఊరు శబ్దంలోని చివరి ఉత్వస్థానంలో ఆదేశంగా వచ్చింది.

**12.1.4 టి వర్ణంబు గొన్నింటి యంతాక్షరంబున కాదేశంబును, గొన్నింటి కంతాగమంబును, గొన్నింటికిం బర్యాయంబున రెండును బ్రాయికంబుగ నగు.. (ఆచ్ఛిక - 31 సూ.)**

పద విభాగం : టి వర్ణంబు, కొన్నింటి, అంతాక్షరంబునకు, ఆదేశంబును, కొన్నింటికి, అంత, ఆగమంబును, కొన్నింటికిన్, పర్యాయంబున, రెండును, ప్రాయికంబుగన్, అగు.

భావం : ఇ-టి-తి- అనే ఔపవిభక్తిక వర్ణాలలో టి - వర్ణం కొన్ని శబ్దాల చివరి అక్షరానికి ఆదేశంగాను, కొన్ని శబ్దాల చివర ఆగమంగాను, కొన్ని శబ్దాలకు ఒకసారి ఆదేశంగా, ఒకసారి ఆగమంగా తఱచుగా వస్తుంది.

1. ఆదేశానికి ఉదాహరణ - త్రాటిని.

త్రాడు - ప్రాతిపదిక. "నువర్ణంబు ద్వితీయ" అనే సూత్రం చేత ద్వితీయా విభక్తి ఏకవచనం నువర్ణం వచ్చి "త్రాడు + ను" అవుతుంది. ప్రస్తుత సూత్రం చేత చివరి అక్షరానికి 'టి' వర్ణం ఆదేశంగా వచ్చి త్రాటి + ను అవుతుంది. "ఇకారంబు మీది కు-ను-వు- క్రియావిభక్తుల యుత్వంబున కిత్వంబగు" అనే సూత్రం చేత నువర్ణం లోని ఉత్వానికి ఇత్వం వచ్చి "త్రాటిని" అవుతుంది.

ఇలాగే కాడు + ను - కాటిని, నోరు + ను - నోటిని, ఏఱు + ను - ఏటిని.

2. ఆగమానికి ఉదాహరణ - అన్నిటిని.

అన్ని - ప్రాతిపదిక. "నువర్ణంబు ద్వితీయ" అనే సూత్రం చేత ద్వితీయా విభక్తి ఏకవచనం నువర్ణం వచ్చి "అన్ని + ను" అవుతుంది. ఈ సూత్రం చేత "టి" వర్ణం ఆగమంగా వచ్చి "అన్నిటి + ను" అవుతుంది. "ఇకారంబు మీది కు-ను-వు- క్రియావిభక్తుల యుత్వంబున కిత్వం బగు" అనే సూత్రం చేత నువర్ణంలోని ఉత్వానికి ఇత్వం వచ్చి "అన్నిటిని" అవుతుంది. ఇలాగే ఎనిమిది + ను - ఎనిమిదిటిని, వేయి + ను - వేయిటిని.

3. ఉభయానికి ఉదాహరణ - ఒకసారి ఆదేశంగా, ఒకసారి ఆగమంగా రావడం. ఏటిని - ఏమిటిని.

ఏమి - ప్రాతిపదిక. "నువర్ణంబు ద్వితీయ" అనే సూత్రం చేత ద్వితీయా విభక్తి 'ను' వర్ణం వచ్చి 'ఏమి + ను' అవుతుంది. ఈ సూత్రం చేత చివరి అక్షరం స్థానంలో 'టి' వర్ణం ఆదేశంగా వచ్చి "ఏటి + ను" అవుతుంది. "ఇకారంబు మీది కు-ను-వు- క్రియావిభక్తుల యుత్వంబున కిత్వంబగు" అనే సూత్రం చేత 'ను' వర్ణంలోని ఉత్వానికి ఇత్వం వచ్చి "ఏటిని" అవుతుంది. 'టి' వర్ణం 'ఏమి' శబ్దానికి చివర ఆగమంగా వచ్చినపుడు "ఏమిటి + ను" అవుతుంది.

"ఇకారంబు మీది కు-ను-వు- క్రియావిభక్తుల యుత్వంబున కిత్వంబగు" అనే సూత్రం చేత నువర్ణంలోని ఉత్వానికి ఇత్వం వచ్చి "ఏమిటిని" అవుతుంది.

ఇలాగే - పగలు + ను - పగటిని - పగలిటిని.
మొదలు + ను - మొదటిని - మొదలిటిని.
రెండు + ను - రెంటిని - రెండిటిని.
మూఁడు + ను - మూఁటిని - మూఁడిటిని.
నూఱు + ను - నూటిని - నూఱిటిని.

సూత్రంలో "ప్రాయికంబుగా" అనడం వలన 'టి' వర్ణం కొన్నిచోట్ల రాకపోవచ్చును. మహాకవుల ప్రయోగాలను బట్టి 'టి' వర్ణం ఎక్కడ ఆగమంగా వస్తుందో, ఎక్కడ ఆదేశంగా వస్తుందో, ఎక్కడ

ఉభయమో గ్రహించాలి.

**12.1.5 హ్రస్వము మీఁది టివర్ణంబునకు ముందు పూర్ణబిందువు బహుళముగా నగు. (ఆచ్చిక - 32 సూ.)**

భావం : హ్రస్వాక్షరం మీది 'టి' వర్ణానికి ముందు పూర్ణబిందువు బహుళంగా వస్తుంది.

హ్రస్వాక్షరం అంటే కుఱచ అక్షరం.
పూర్ణబిందువు అంటే నిండుసున్న.

ఉదాహరణ : అన్నింటిని - అన్నిటిని.

అన్ని - ప్రాతిపదిక. "నువర్ణంబు ద్వితీయ" అనే సూత్రం చేత ద్వితీయా విభక్తి ఏకవచనం నువర్ణం వచ్చి "అన్ని + ను" అవుతుంది.

"టి వర్ణంబు గొన్నింటి యంత్యాక్షరంబున కాదేశంబును, గొన్నింటి కంత్యాగమంబును, గొన్నింటికిం బర్యాయంబున రెండును బ్రాయికంబుగ నగు" అనే సూత్రం చేత 'టి' వర్ణం ఆగమంగా వచ్చి "అన్నిటి + ను" అవుతుంది.

"ఇకారంబు మీది కు-ను-వు- క్రియావిభక్తుల యుత్వంబున కిత్వంబగు" అనే సూత్రం చేత నువర్ణంలోని ఉత్వానికి ఇత్వం వచ్చి "అన్నిటి + ని" అవుతుంది. ఈ సూత్రం చేత హ్రస్వం తరువాత ఉన్న టి వర్ణానికి ముందు నిండుసున్న వస్తే "అన్నింటిని" అవుతుంది. నిండుసున్న రాకపోతే "అన్నిటిని" అవుతుంది.

ఇలాగే - ఎనిమిది + ను - ఎనిమిదిటి + ను - ఎనిమిదింటిని - ఎనిమిదిటిని.
రెండు + ను - రెండిటి + ను - రెండింటిని - రెండిటిని.

ఈ సూత్రంలో "హ్రస్వము మీది" అనడం చేత దీర్ఘము మీద టివర్ణానికి ముందు నిండుసున్న రాదు. ఉదా॥ త్రాటిని, ఏటిని.

"బహుళం" అనడం చేత కొన్నిచోట్ల హ్రస్వం మీద టివర్ణానికి ముందు కూడ నిండుసున్న రాదు. ఉదా॥ మొదటికి, మీదటికి.

**12.1.6 పదాద్యంబగు హ్రస్వంబు మీది టివర్ణంబునకు ముందు పూర్ణబిందువగు. (ఆచ్చిక - 33 సూ.)**

భావం : పదం యొక్క మొదటి హ్రస్వం మీద ఉన్న టివర్ణానికి ముందు పూర్ణబిందువు నిత్యంగా వస్తుంది.

ఉదాహరణ : కంటిని.

కన్ను - ప్రాతిపదిక. "నువర్ణంబు ద్వితీయ" అనే సూత్రం చేత ద్వితీయా విభక్తి ఏకవచనం నువర్ణం వచ్చి కన్ను + ను అవుతుంది.

"టివర్ణంబు గొన్నింటి యంత్యాక్షరంబున కాదేశంబును, గొన్నింటి కంత్యాగమంబును, గొన్నింటికిం బర్యాయంబున రెండును బ్రాయికంబుగ నగు" అనే సూత్రం చేత 'టి' వర్ణం చివరి అక్షరం స్థానంలో

ఆదేశంగా వచ్చి "కటి + ను" అవుతుంది. ఈ సూత్రం చేత 'టి' వర్ణానికి ముందు నిండుసున్న వచ్చి 'కంటి + ను' అవుతుంది. "ఇకారంబు మీది కు-ను-వు- క్రియావిభక్తుల యుత్వంబున కిత్వంబగు" అనే సూత్రం చేత నువర్ణం లోని ఉత్వానికి ఇత్వం వచ్చి "కంటిని" అవుతుంది.

ఇలాగే - మిన్ను + ను - మిటి + ను - మింటి + ను - మింటిని.
ఇల్లు + ను - ఇటి + ను - ఇంటి + ను - ఇంటిని.
పల్లు + ను - పటి + ను - పంటి + ను - పంటిని.

ఇతర విభక్తుల ఏకవచనం పరమైనపుడు కూడ ఈ కార్యం వస్తుంది.

ఉదా॥ మింటిచేత, మింటివలన, మింటికి మొదలైనవి.

విశేషం : ఈ సూత్రంలో 'టి' వర్ణానికి ముందు "బిందువగును" అని చెప్పినట్లయితే అరసున్నను కూడ చెప్పడానికి వీలయ్యేది. అపుడు 'కఁటిని' అని చేసినా, అది "అఁట యిక చుఁడు శబ్దంబులందప్ప నుడి తొలి హ్రస్వము మీది ఖండ బిందువును ద్రుతంబునకు లోపంబును లేవు" అనే సూత్రం చేత నిండుసున్నగా తప్పక మారేది. కాని రూపసాధన సులభంగా చేయడానికి "పూర్ణబిందువగును" అని చెప్పబడింది.

**12.1.7 అఱ్ఱు మొదలగు శబ్దముల కంతాగమంబు తివర్ణంబును రేఫంబున కొక్కటికి లోపంబునగు. (ఆచ్ఛిక - 34 సూ.)**

పద విభాగం : అఱ్ఱు, మొదలగు, శబ్దములకు, అంతాగమంబు, తివర్ణంబును, రేఫంబునకు, ఒక్కటికి, లోపంబును, అగు.

భావం : అఱ్ఱు మొదలైన శబ్దాలకు 'తి' వర్ణం ఆగమంగా వస్తుంది. ఒక రేఫకు లోపం కూడ వస్తుంది.

వ్యాఖ్యానం : ఇది నిత్యవిధి. అఱ్ఱు మొదలైన శబ్దాలకు ఔపవిభక్తిక 'తి' వర్ణం ఆగమంగా రావడం నిత్యం. అలాగే అది పరమైనపుడు ఒక రేఫకు లోపం రావడం కూడ నిత్యమే.

ఉదాహరణ : అఱితిని.

అఱ్ఱు - ప్రాతిపదిక. "నువర్ణంబు ద్వితీయ" అనే సూత్రం చేత ద్వితీయా విభక్తి ఏకవచనం నువర్ణం వచ్చి 'అఱ్ఱు + ను' అవుతుంది. ఈ సూత్రం చేత 'తి' వర్ణం ఆగమంగా వచ్చి, ఒక రేఫకు లోపం వస్తే 'అఱు + తి + ను' అవుతుంది.

"టి తి వర్ణంబులు పరంబగునపు డుత్వంబున కిత్వంబగు" అనే సూత్రం చేత తివర్ణం పరమైనపుడు ముందున్న ఉత్వానికి ఇత్వం వచ్చి "అఱి + తి + ను" అవుతుంది.

"ఇకారంబు మీది కు-ను-వు- క్రియావిభక్తుల యుత్వంబున కిత్వంబగు" అనే సూత్రం చేత "అఱితిని" అవుతుంది.

ఇలాగే - కఱ్ఱు + ను - కఱు + తి + ను - కఱితి + ను - కఱితిని.
కొఱ్ఱు + ను - కొఱు + తి + ను - కొఱితి + ను - కొఱితిని.

అఱ్ఱు, కఱ్ఱు, కొఱ్ఱు, గొఱ్ఱు, మిఱ్ఱు, వఱ్ఱు - ఇవి అఱ్ఱు మొదలైనవి.

**12.1.8 విభక్తి పరంబగునపుడు గోయి ప్రభృతుల తుది యక్షరంబు తివర్ణంబగు. (ఆచ్ఛిక - 35 సూ.)**

భావం : విభక్తి పరమైనపుడు 'గోయి' మొదలైన అచ్చతెలుగు శబ్దాల యొక్క చివరి 'యి' వర్ణ స్థానంలో 'తి' వర్ణం ఆదేశంగా వస్తుంది.

వ్యాఖ్యానం : గోయి మొదలైనవి గోయి ప్రభృతులు. గోయి, చేయి, దాయి, నూయి, నేయి, వాయి, రోయి మొదలైనవి. ఈ శబ్దాలన్నీ 'యి' వర్ణాంతాలుగానే కన్పిస్తున్నాయి. ఇది నిత్యవిధి. కాబట్టి 'యి' వర్ణ స్థానంలో 'తి' వర్ణం నిత్యంగా వస్తుంది. ఈ 'తి' వర్ణం ఔపవిభక్తికం. ఔపవిభక్తికాలైన ఇ-టి-తి- అనే వర్ణాలు ద్వితీయాది ఏకవచనాలు పరంగా ఉంటే వస్తాయని ఇంతకు ముందు చెప్పడం జరిగింది. కాని ఈ సూత్రంలో ప్రత్యేకంగా "విభక్తి పరంబగునపుడు" అనడం చేత ద్వితీయాది ఏకవచనాలే గాక ఏ విభక్తి పరంగా ఉన్నా ఈ తివర్ణం వస్తుందని తెలుసుకోవాలి.

ఉదాహరణ : గోతులు.

గోయి - ప్రాతిపదిక. ప్రథమా విభక్తి బహువచనంలో "లు వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత లు వచ్చి 'గోయి + లు' అవుతుంది. ప్రస్తుత సూత్రం చేత 'యి' వర్ణం స్థానంలో 'తి' వర్ణం నిత్యంగా ఆదేశమై 'గోతి + లు' అవుతుంది. "ఇత్తునకు బహువచనంబు పరంబగు నపుడుత్వంబగు" అనే సూత్రం చేత "గోతులు" అవుతుంది.

ఇతర విభక్తుల్లో - గోయి + ను - గోతి + ను - గోతిని.
- గోయి + లను - గోతి + లను - గోతులను.

సూత్రంలో "గోయి ప్రభృతులు" అనడం చేత వీటిలో లేని శబ్దానికి ఈ కార్యం రాదు.

ఉదా॥ రేయి + ను - రేయిని అవుతుందు గాని 'రేతిని' కాదు.

ఇది నిత్యవిధి కాబట్టి గోయి + లు - గోయులు, గోయి + ను - గోయిని అనే విధంగా 'తి' వర్ణం రాని రూపాలు ఉండవు.

**12.1.9 "టి తి వర్ణంబులు పరంబులగునపు డుత్వంబున కిత్వంబగు" (ఆచ్ఛిక - 36 సూ.)**

పద విభాగం : టి తి వర్ణంబులు, పరంబులు, అగునపుడు, ఉత్వంబునకు, ఇత్వం బగు.

భావం : టి వర్ణం, తి వర్ణం పరమైనపుడు ఉత్వానికి ఇత్వం వస్తుంది.

ఉత్వం అంటే హ్రస్వమైన ఉకారం.
ఇత్వం అంటే హ్రస్వమైన ఇకారం.

ఉదాహరణ : రెండిటికి.

రెండు - ప్రాతిపదిక. "కు-యొక్క-లోపల-షష్ఠి" అనే సూత్రం చేత షష్ఠీవిభక్తి ఏకవచనం 'కు' వర్ణకం వచ్చి "రెండు + కు" అవుతుంది. "టి వర్ణంబు గొన్నింటి యంత్యాక్షరంబున కాదేశంబును, గొన్నింటి కంతాగమంబును, గొన్నింటికిం బర్యాయంబున రెండును బ్రాయికంబుగ నగు" అనే సూత్రం చేత

'టి' వర్ణం ఆగమంగా వచ్చి 'రెండు + టి + కు' అవుతుంది. ప్రస్తుత సూత్రం చేత 'టి' వర్ణం పరంగా ఉన్నది కాబట్టి 'రెండు' శబ్దంలోని 'డు' వర్ణం లోని ఉత్వానికి ఇత్వం వచ్చి "రెండి + టి + కు" అవుతుంది. "ఇకారంబు మీఁది కు-ను-వు- క్రియావిభక్తుల యుత్వంబున కిత్వంబగు" అనే సూత్రం చేత "రెండిటికి" అవుతుంది.

ఇలాగే - మూఁడు + కు - మూఁడు + టి + కు - మూఁడిటి + కు - మూఁడిటికి.
నాలుగు + కు - నాలుగు + టి + కు - నాలుగిటి + కు - నాలుగిటికి.

"కొండొకచో నుత్వంబున కిత్వంబు చూపట్టదు" అని చిన్నయ సూరి కొన్నిచోట్ల ఉత్వానికి ఇత్వం కనబడదు అని నిషేధించాడు.

ఉదా॥ నెత్తుటికి.

నెత్తురు - ప్రాతిపదిక. షష్ఠీవిభక్తి ఏకవచనం 'కు' చేయగా 'నెత్తురు + కు'. ఇక్కడ 'రు' వర్ణస్థానంలో ఔపవిభక్తికం 'టి' వర్ణం ఆదేశంగా వచ్చి 'నెత్తు + టి + కు' అవుతుంది. ప్రస్తుత సూత్రం చేత 'త్తు' లోని ఉత్వానికి ఇత్వం రాదు. 'నెత్తుటి + కు' అని ఉండగా "ఇకారంబు మీఁది కు-ను-వు- క్రియావిభక్తుల యుత్వంబున కిత్వంబగు" అనే సూత్రం చేత కువర్ణక ఉత్వానికి ఇత్వం వచ్చి "నెత్తుటికి" అవుతుంది.

ఈ సూత్రంలో "ఉత్వమునకు" అని హ్రస్వమైన ఉకారానికి ఇకారం చెప్పబడింది. కాబట్టి దీర్ఘమైన ఊకారానికి ఇత్వం రాదు.

ఉదా॥ నూఱు + కు అని ఉన్నపుడు 'టి' వర్ణం 'ఱు' స్థానంలో ఆదేశంగా వచ్చి నూ + టి + కు అవుతుంది.

ఇక్కడ 'నూ' లోనిది దీర్ఘమైన ఉకారం కాబట్టి ఇత్వం రాదు. "నూటికి" అవుతుంది.

**12.1.10 టి వర్ణంబు పరంబగునపుడు క్రిందు, మీఁదు, ముందు, పువర్ణంబుల కత్వంబగు. (ఆచ్ఛిక - 37 సూ.)**

పద విభాగం : టి వర్ణంబు, పరంబు, అగునపుడు, క్రిందు, మీఁదు, ముందు, పువర్ణంబులకు, అత్వంబు, అగు.

భావం : 'టి' వర్ణం పరమైనపుడు క్రిందు, మీఁదు, ముందు శబ్దాల చివరి ఉత్వానికి, 'పు' వర్ణాంత శబ్దాల చివరి ఉకారానికి అత్వం ఆదేశంగా వస్తుంది. ఇది నిత్యవిధి. కాబట్టి 'అత్వం' నిత్యంగా వస్తుంది.

ఉదాహరణ : క్రిందటిని.

క్రిందు - ప్రాతిపదిక. "ను వర్ణంబు ద్వితీయ" అనే సూత్రం చేత ద్వితీయా విభక్తి ఏకవచనం నువర్ణం వచ్చి "క్రిందు + ను" అవుతుంది.

"టి వర్ణంబు గొన్నింటి యంతాక్షరంబున కాదేశంబును, గొన్నింటి కంతాగమంబును, గొన్నింటికిం బర్యాయంబున రెండును బ్రాయికంబుగా నగు" అనే సూత్రం చేత 'టి' వర్ణం ఆగమంగా వచ్చి "క్రిందు + టి + ను" అవుతుంది. ప్రస్తుత సూత్రం చేత టివర్ణం ముందున్న ఉత్వానికి అత్వం ఆదేశంగా వచ్చి "క్రింద + టి + ను" అవుతుంది.

"ఇకారంబు మీఁది కు-ను-పు క్రియావిభక్తుల యుత్వంబున కిత్వంబగు" అనే సూత్రం చేత "క్రిందటిని" అవుతుంది.

ఇలాగే - మీఁదు + ను - మీఁదు + టి + ను - మీఁద + టి + ను - మీఁదటిని.
ముందు + ను - ముందు + టి + ను - ముంద + టి + ను - ముందటిని.
మాపు + ను - మాపు + టి + ను - మాప + టి + ను - మాపటిని.

విశేషం : 1. అనేక వర్ణాలున్న పదానికి ఒక వర్ణాన్ని ఆదేశంగా విధిస్తే, అది ఆ పదంలోని చివరి వర్ణం స్థానంలోనే ఆదేశంగా వస్తుందని శాస్త్ర నియమం. కాబట్టి ఇక్కడ అత్వం ఒక్కటే వర్ణం కాబట్టి అది, క్రిందు, మీఁదు, ముందు, పు వర్ణాల చివరి ఉత్వం స్థానంలోనే ఆదేశంగా వచ్చింది.

2. "టి-తి- వర్ణంబులు పరంబులగునపు డుత్వంబున కిత్వంబగు" (ఆచ్చిక - 36 సూ.) అనే సూత్రం చేత టి-వర్ణం పరమైనపుడు ఉత్వానికి ఇత్వం రావాల్సి ఉంది. కాని దాన్ని నిషేధించి, ఈ సూత్రం చేత క్రిందు-మీఁదు-ముందు-పు వర్ణాలకు విశేషంగా అత్వం చెప్పబడింది. కాబట్టి ఈ సూత్రంలో (37వ సూ.) చెప్పబడిన స్థలాల్లో తప్ప తక్కిన స్థలాల్లో 36వ సూత్రమే వర్తిస్తుందని గ్రహించాలి.

**12.1.11 ఔపవిభక్తికముల తృతీయా సప్తముల కత్వం బాదేశంబు బహుళంబుగా నగు. (ఆచ్చిక - 38 సూ.)**

పద విభాగం : ఔపవిభక్తికముల, తృతీయా సప్తములకు, అత్వంబు, ఆదేశంబు, బహుళంబుగాన్, అగు.

భావం : ఔపవిభక్తిక శబ్దాలయొక్క తృతీయా సప్తమీ విభక్తుల స్థానంలో బహుళంగా హ్రస్వమైన అకారం ఆదేశంగా వస్తుంది.

వ్యాఖ్యానం : ఇ-టి-తి- అనే వర్ణాలను ఔపవిభక్తికాలు అంటారు. ఇవి చేరే ప్రాతిపదికలను కూడ ఔపవిభక్తికాలు అంటారు. "తృతీయా సప్తములకు" అంటే తృతీయా సప్తమీ విభక్తుల స్థానంలో అని అర్థం. అత్వం అంటే హ్రస్వమైన అకారం.

ఒక వర్ణాన్ని తొలగించి దాని స్థానంలో మరొక వర్ణం రావడం ఆదేశం అంటారు. బహుళం అంటే చెప్పిన వ్యాకరణ కార్యం ప్రవృత్తి, అప్రవృత్తి, విభాష, అన్యకార్యం అనే విధంగా నాలుగు విధాలుగా రావడం.

ఉదారహణ : గోరను.

గోరు - ప్రాతిపదిక. "చేత తోడ తృతీయ" అనే సూత్రం చేత తృతీయా విభక్తి ప్రత్యయం "చేత" వచ్చి 'గోరు + చేత' అవుతుంది. "ఊరు మొదలగు వాని కిత్వంబగు" అనే సూత్రం చేత ఔపవిభక్తికం 'ఇ' త్వం వచ్చి "గోరి + చేత" అవుతుంది. ఈ సూత్రం చేత తృతీయా విభక్తి 'చేత' స్థానంలో అత్వం ఆదేశంగా వచ్చి "గోరి + అ" అవుతుంది. "తృతీయాదులకు నుగాగమంబగు" అనే సూత్రం చేత నుగాగమం వచ్చి 'గోరి + అను' అవుతుంది.

"అంద్వవగాగమంబులందప్ప నపదాది స్వరంబు పరంబగునపు డచ్చునకు సంధి యగు" అనే సూత్రం చేత సంధి వచ్చి "గోరను" అవుతుంది.

బహుళం కాబట్టి అత్వం రాకపోతే "గోరి చేతను" అని ఉంటుంది.

ఇలాగే - ఊరను. ఊరు + అందు - ఊరి + అందు. ఈ సూత్రం చేత సప్తమీ విభక్తి స్థానంలో "అత్వం" వచ్చి ఊరి + అ, అవుతుంది. నుగాగమం వచ్చి ఊరి + అను అవుతుంది. సంధి వచ్చి "ఊరను" అవుతుంది. అత్వం ఆదేశంగా రానపుడు "ఊరియందు" అవుతుంది. నుగాగమం వచ్చి "ఊరియందును" అవుతుంది.

ఇలాగే - ఇంటను. ఇల్లు + అందు - ఇంటి + అందు - ఇంటి + అ - ఇంటి + అను - "ఇంటను". అత్వం రాకపోతే "ఇంటియందును".

విశేషం : సూత్రంలో విధించబడిన "అత్వం" ఏకవర్ణం కాబట్టి తృతీయా సప్తమీ ప్రత్యయల చివరి అచ్చుకు ఆదేశంగా రావాలి. ఎందుకంటే అనేక వర్ణాలు గల పదానికి ఏకవర్ణాన్ని ఆదేశంగా విధిస్తే అది ఆ పదంలోని చివరి వర్ణం స్థానంలోనే వస్తుందని శాస్త్ర నియమం. అందుకే "అత్వం బాదేశంబు" - అని ఆదేశ శబ్దాన్ని వాడడం చేత అత్వం తృతీయా సప్తమీ ప్రత్యయాల కంతటికీ ఆదేశంగా వస్తున్నది.

గోరి + చేత - గోరి + అ - గోర, ఊరి + అందు - ఊరి + అ - ఊర.

## 12.2 వ్యాసరూప ప్రశ్నలు

### 12.2.1 ఆచ్ఛిక శబ్దములలో బహువచనానికి కలిగే మార్పులు.

ప్రాతిపదికలకు ప్రథమా బహువచనంలో "లు వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత 'లు' ప్రత్యయం వస్తుంది. ద్వితీయ మొదలైన విభక్తుల బహువచనంలో "బహుత్వంబున ద్వితీయాది విభక్తులకు లడాగమంబగు" అనే సూత్రం చేత 'ల' వర్ణం వస్తుంది. ఆచ్ఛిక శబ్దాలకు పరంగా ఉన్న బహువచన ప్రత్యయాలైన ఈ "లు-ల" లకు కొన్ని మార్పులు కలుగుతున్నాయి.

**1. లఘురేఫ :** "పగతాదుల బహువచన లకారంబునకు రేఫం బగు" పగత మొదలైన ఆచ్ఛిక శబ్దాలపై ఉన్న బహువచన లకారానికి రేఫ వస్తుంది.

పగత + లు - పగతురు.

"కొన్ని డుమంతంబుల బహువచన లకారంబునకు రేఫంబును, దానికి ముందు పూర్ణబిందు పూర్వక డకారంబు నగు"

కొన్ని శబ్దాలకు బహువచన లకార స్థానంలో రేఫ, దానికి ముందు "ండ్" అనేది ఆగమంగా వస్తుంది.

గండ + లు - గండండ్ + రు - గండంద్రు.

"ఆల్వాదుల బహువచన లకారంబునకు రేఫంబును ముందటి లువర్ణంబునకు బిందు పూర్వక డకారంబు నగు."

ఆలు మొదలైన వానికి బహువచన లకార స్థానంలో రేఫ రావడంతో బాటు, ఆ శబ్దంలోని లువర్ణస్థానంలో 'ండ్' అనేది ఆదేశంగా వస్తుంది.

ఆలు + లు - ఆండ్ + రు - ఆండ్రు.

**2. అలఘురేఫ :** "చెయుపు బహువచన లకారంబున కలఘు రేఫంబు విభాషనగు". చెయుపు - శబ్దం మీది బహువచన లకారానికి శకటరేఫ విభాషగా ఆదేశంగా వస్తుంది.

చెయువు + లు - చెయువుఱు - చెయువులు.

"కా ప్రత్యయంబు మీఁది బహువచన లకారంబునకు లఘ్వలఘు రేఫంబులును, లఘురేఫంబునకు ముందు బిందు పూర్వక డకారంబునగు". కా ప్రత్యయం మీద అలఘురేఫ వస్తుంది.

విలుకా+లు-విలుకాఱు.

ఇదే సూత్రంచేత బహువచన లకార స్థానంలో లఘురేఫతో బాటు ముందు "ండ్" అనేది ఆగమంగా వస్తుంది.

విలుకా + లు - విలుకా+ండ్ + రు - విలుకాండ్రు.

**12.2.2 ఆచ్ఛిక శబ్దములందు బహువచనము పరమగునపుడు కలుగు మార్పులు.**

ప్రాతిపదికలకు ప్రథమా బహువచనంలో "లు వర్ణంబు బహువచనంబు" అనే సూత్రం చేత "లు" ప్రత్యయం వస్తుంది. ద్వితీయ మొదలైన విభక్తుల బహువచనంలో "బహుత్వంబున ద్వితీయాది విభక్తులకు లడాగమంబగు" అని 'ల' వర్ణం వస్తుంది. ఈ "లు-ల" లు పరమైనపుడు అచ్చతెలుగు శబ్దాలలో అనేకమైన మార్పులు కలుగుతున్నాయి.

**1. ఉత్వం :** "ఇత్తునకు బహువచనంబు పరంబగునపు డుత్వంబగు" ప్రాతిపదిక చివరి ఇకారానికి ఉకారం వస్తుంది. ఇంతి + లు - ఇంతులు. "వికృతియందికారాంతముల యుపోత్త మేత్వంబునకు బహువచనము పరంబగునపు డుత్వంబగు" ఉపోత్తమమైన ఉత్వానికి ఇత్వం వస్తుంది.

కలికి + లు - కలుకి + లు - కలుకులు.

**2. ఉత్వలోపం :** "బహువచనము పరంబగునపుడు డ-ల-ట-ర-ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగా నగు". డ-ల-ట-ర-ల లోని ఉత్వం లోపించి,

గుండు + లు - గుండ్ + లు - గుండ్లు, ఊరు + లు - ఊర్ + లు - ఊర్లు.

**3. కుజ్ :** "కలన్వాదుల నువర్ణంబు కుజ్జగు. బహువచనము పరంబగు నపుడు నిత్యముగా నగు" కలను మొదలైన వాని చివరి నువర్ణం స్థానంలో కుజ్ వస్తుంది.

కలను + లు - కల కుజ్ + లు - కలఁకులు.

**4. గుజ్ :** "అట్లు రేను గోను శబ్దంబుల నువర్ణంబు గుజ్జగు". రేను + లు - రేగుజ్ + లు - రేఁగులు. రేను శబ్దంలోని నువర్ణ స్థానంలో బహువచనం పరమైనపుడు 'గుజ్' వచ్చింది.

**5. డుజ్ :** "తే ప్రభృతుల బహువచనమునకు ముందు డుజ్జగు". 'తే' మొదలైన శబ్దాలకు బహువచనానికి ముందు డుజ్ ఆగమంగా వస్తుంది.

తే + లు - తేడుజ్ + లు - తేఁడులు.

**6. అలఘు లకారం :** "బహువచనము పరంబగునపు డసంయుక్తంబులయి యుదంతంబు లయిన డ-ల-ర-ల కలఘు లకారంబు బహుళంబుగా నగు". డు-లు-రు-ల లోని హల్లులకు అలఘు లకారం బహుళంగా వస్తుంది.

త్రాడు + లు - త్రాళులు, ఏరు + లు - ఏళులు, పాలు + లు - పాళులు.

"బహువచన శ్లిష్టంబులయి యద్విరుక్తంబు లయిన డకార లకారంబుల కలఘు లకారంబు నిత్యంబుగ నగు".

త్రాడు + లు - త్రాడ్లు - త్రాళ్లు, పాలు + లు - పాల్లు - పాళ్లు.

**7. "ండు" :** "ఔపవిభక్తికంబుల లివర్ణ సలలు వర్ణంబులకు బహువచనంబు పరంబగునపుడు పూర్ణబిందు పూర్వక డువర్ణంబు బహుళంబుగా నగు".

కొడవలి + లు - కొడవండులు, ఇల్లు + లు - ఇండులు.

**8. అంతిమాక్షర లోపం :** "బహువచనంబు పరంబగునపుడు చేను, పేను, మీను శబ్దంబుల నువర్ణంబు లోపించు". 'చేను' మొదలైన శబ్దాల్లో 'ను' లోపించి చేను + లు - చేలు అవుతుంది.

"బహువచనంబు పరంబగునపుడు రేయి ప్రభృతుల తుది యక్షరంబు లోపించి". రేయి మొదలైన వానిలో చివరి అక్షరం లోపిస్తుంది. రేయి + లు - రేలు.

"బహువచనంబు పరంబగునపు డావు ప్రభృతుల తుది యక్షరంబునకు లోపంబు విభాష నగు". ఆవు మొదలైన శబ్దాల్లో చివరి అక్షరం వికల్పంగా లోపిస్తుంది.

ఆవు + లు - ఆలు - ఆవులు.

**12.2.3 ఔపవిభక్తికాలను వివరించండి.**

"ఇ-టి-తి- వర్ణంబులు వక్ష్యమాణంబు లౌపవిభక్తికంబులు". ఇ-టి-తి- అనే వర్ణాలను ఔపవిభక్తికాలు అంటారు. ఇవి చేరే ప్రాతిపదికలను గూడ ఔపవిభక్తికాలు అంటారు.

"ఇవి ద్వితీయాద్యేక వచనంబులు పరంబు లగునపుడు నామంబులకుం గొన్నింటికిం బ్రాయికంబుగా నగు." ~~ఈ~~ ఇ-టి-తి- అనే ఔపవిభక్తికాలు ద్వితీయాది ఏకవచనాలు పరంగా ఉన్నపుడు ప్రాతిపదికల చివరి అక్షరానికి ఆదేశంగా, ఆగమంగా వస్తాయి.

**1. ఇ వర్ణం :** "ఊరు మొదలగు వాని కిత్వంబగు" ఊరు మొదలైన శబ్దాలకు ఇత్వం వస్తుంది.

ఊరు + ను - ఊర్ + ఇ + ను - ఊరి + ను - ఊరిని.

**2. టి వర్ణం :** "టి వర్ణంబు గొన్నింటి యంత్యాక్షరంబున కాదేశంబును గొన్నింటి కంత్యాగమంబును గొన్నింటికిం బర్యాయంబున రెండును బ్రాయికంబుగా నగు". టి వర్ణం కొన్ని శబ్దాల చివరి అక్షరానికి ఆదేశంగా వస్తుంది. నోరు+ను - నోటి+ను - నోటిని. టి వర్ణం కొన్ని శబ్దాల చివర ఆగమంగా వస్తుంది.

అన్ని + ను - అన్ని + టి + ను - అన్నిటిని.

టి వర్ణం కొన్ని శబ్దాల చివరి అక్షరానికి ఒకసారి ఆదేశంగా, ఒకసారి ఆగమంగా వస్తుంది. రెండు + ను - రెంటి + ను - రెంటిని. రెండు + టి + ను - రెండిటిని.

**3. తి వర్ణం :** "అఱ్ఱు మొదలగు శబ్దముల కంతాగమంబు తివర్ణంబును రేఫంబున కొక్కటికి లోపంబు నగు". అఱ్ఱు మొదలైన శబ్దాలకు తివర్ణం వచ్చి, ఒక రేఫకు లోపం వస్తుంది. అఱ్ఱు + ను - అఱు + తి + ను - అఱితిని.

"విభక్తి పరంబగు నపుడు గోయి ప్రభృతుల తుది యక్షరంబు తివర్ణంబగు". గోయి మొదలైన శబ్దాలకు అన్ని విభక్తుల్లో చివరి అక్షరమైన 'యి' స్థానంలో 'తి' ఆదేశంగా వస్తుంది. గోయి + లు - గోతులు, గోయి + ను - గోతి + ను - గోతిని. ఇలాగే చేయి + లు - చేతులు.

## 12.3 సమీక్ష

పై సూత్రాలకు సోదాహరణ వ్యాఖ్య తెలుసుకున్నారు. వ్యాసరూప ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకున్నారు.

## 12.4 ప్రశ్నలు

క్రింది సూత్రాలకు సోదాహరణ వ్యాఖ్యలు వ్రాయండి.

1. ఇ టి తి వర్ణంబులు వక్ష్యమాణంబు లౌపవిభక్తికంబులు.
2. ఊరు మొదలగు వాని కిత్వంబగు.
3. టి వర్ణంబు గొన్నింటి యంతాక్షరంబున కాదేశంబును, గొన్నింటి కంతాగమంబును, గొన్నింటికిం బర్యాయంబున రెండును బ్రాయకంబుగ నగు.
4. విభక్తి పరంబగునపుడు గోయి ప్రభృతుల తుది యక్షరంబు తివర్ణంబగు.
5. ఔపవిభక్తికముల తృతీయా సప్తముల కత్వంబాదేశంబు బహుళంబుగానగు.

క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి.

1. ఆచ్ఛిక శబ్దాలలో బహువచనానికి కలిగే మార్పులు వ్రాయండి.
2. ఔపవిభక్తికాలను వివరించండి.

## 12.5 ఆధార గ్రంథాలు

1. బాల వ్యాకరణము - శ్రీ పరవస్తు చిన్నయ సూరి
2. ఘంటాపథ వ్యాఖ్యానం - శ్రీ వంతరాం రామకృష్ణారావు
3. బాలవ్యాకరణ సారస్వ సర్వస్వ పేటిక - శ్రీ దూసి రామమూర్తి శాస్త్రి
4. రమణీయము - శ్రీ దువ్వూరి వేంకటరమణ శాస్త్రి

డాక్టర్ రామినేని పద్మావతి
రీడర్
శ్రీ శారదా నికేతన్ ఓరియంటల్ కాలేజి
గుంటూరు

# పాఠం - 13

# ఆంధ్రము-తెనుగు-తెలుగు పదాల చరిత్ర వ్యాప్తి

పాఠ్యనిర్మాణక్రమం


13.0 లక్ష్యం
13.1 ఆంధ్రము-తెనుగు-తెలుగు పదాల చరిత్ర వ్యాప్తి
13.1.1 ఉద్దేశం
13.1.2 పాఠ పరిచయం
13.1.3(అ) ఆంధ్ర - ఆంధ్రము
13.1.3(ఆ) జాతివాచక ప్రయోగాలు
13.1.3(ఇ) ఆంధ్రం - దేశవాచకం
13.1.3(ఈ) ఆంధ్రం - భాషావాచకం
13.1.4(అ) తెనుఁగు-తెలుగు
13.1.4(ఆ) తెనుంగు-తెనుగు
13.1.4(ఇ) తెలుఁగు-తెలుంగు
13.1.5 తెనుఁగు-తెలుగు పదస్వరూప నిర్ణయం
13.2 తెలుగు భాష - యుగ విభజన
13.2.1 ఉద్దేశం
13.2.2 పాఠ పరిచయం
13.2.3 అజ్ఞాత యుగం
13.2.4 సంస్కృత ప్రాకృత భాషా శాసన యుగం
13.2.5 ప్రాఙ్నన్నయ యుగం
13.2.6 నన్నయ యుగం
13.2.7 మధ్య యుగం
13.2.8 ఆధునిక యుగం
13.3 సమీక్ష
13.4 ప్రశ్నలు
13.5 ఆధార గ్రంథాలు


## 13.0 లక్ష్యం

ఆంధ్రము-తెనుగు-తెలుగు పదాల వ్యాప్తి గురించి తెలియజేయడం - తెనుగు భాషా కాలాన్ని యుగాలుగా విభజించడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## 13.1 ఆంధ్రము-తెనుఁగు-తెలుగు పదాల చరిత్ర-వ్యాప్తి

### 13.1.1 ఉద్దేశం

మన భాషకు ఆంధ్రం, తెనుగు, తెలుగు అనే 3 పేర్లు వ్యవహారంలో ఉన్నాయి. తెలుగు భాషా శాస్త్ర చరిత్రను అభ్యసించే విద్యార్థులకు ఆ 3 పదాల ఆవిర్భావం గురించి, అవి వ్యవహరింపబడిన దేశం, జాతి మొదలైన విశేషాంశాలను గురించి అవగాహనను పొందటం ఆవశ్యకం. అందువలన ఆంధ్రము, తెనుఁగు, తెలుగు పదాలలో దాని ప్రాచీనత, వ్యాప్తి మొదలైన అంశాలను సోదాహరణ రీతిలో వివరించటం ఈ పాఠం యొక్క ఉద్దేశం.

### 13.1.2 పాఠ పరిచయం

మన భాషకు ఈనాడు ఆంధ్రం, తెనుగు, తెలుగు అని మూడు పేర్లు వ్యవహారంలో ఉన్నాయి. 'ఆంధ్ర' అనే పదం 'అంధ్ర' అనే ప్రాచీన పదానికి అర్వాచీన రూపం అని ప్రాచీన తామ్ర శిలాశాసనాలను బట్టి, ప్రాచీన సంస్కృత గ్రంథాలను బట్టి తెలియవస్తుంది. తెలుగు కావ్యాలలో "తెనుంగు, తెనుఁగు, తెలుంగు, తెలుఁగు, త్రిలింగ" అనే పదాలు భాషాపరంగా ప్రయోగంలో ఉన్నాయి. తమిళంలో తెలుగు భాషకు 'వడగు, వడుగ' అనే పదాలు గ్రంథస్థమయ్యాయి. తమిళంలోని 'సంగం' సాహిత్యంలో కుఱుందొగై, అగనానుర్, నట్రిణై' గ్రంథాల్లో 'వడుగర్' (ఉత్తర దేశస్థులు) అంటే తెలుగువారు అని పద ప్రయోగం ఉంది.

పోర్చుగీసువారు తెలుగు వారిని 'జెంతియొ' (Gentio) అనీ తెలుగు భాషను జెంతూ (Gentoo) అనీ 16, 17 శతాబ్దాలలో వ్యవహరించారు.

"Gentoo. From Portuguese gentio, a gentile or heathen. The name formerly applied by Europeans to the natives of the country"

- Manual of the Administration of the
Madras Presidency, Vol. III/893.

మొత్తం మీద అంధ్ర, ఆంధ్ర, తెనుంగు, తెనుఁగు, తెలుంగు, తెలుఁగు, త్రిలింగ, వడగు, వడుగ, జెంతూ అనే పేర్లు తెలుగు భాషకు వ్యవహారంలో ఉన్నాయి. ఈ పదాల చరిత్రను, వ్యాప్తిని, పరస్పర సంబంధాన్ని పరిశీలింపవలసి ఉంది.

### 13.1.3(అ) అంధ్ర, ఆంధ్రము

ఇవి రూపాంతరాలైన సంస్కృత పదాలు. ఇవి తొలుత జాతి వాచకంగాను, అనంతరం దేశవాచకంగాను, పిదప భాషాపరంగాను ప్రయోగింపబడినట్లు ఆధారాలు కన్పిస్తున్నాయి.

### 13.1.3(ఆ) జాతివాచక ప్రయోగాలు

1. క్రీ.పూ. 600 సంవత్సర కాలంలో రూపొందింపబడిన ఐతరేయ బ్రాహ్మణంలో శునశ్శేపుని తమ జ్యేష్ఠభ్రాతగా అంగీకరించ టానికి నిరాకరించిన తన మొదటి 50 మంది కుమారులను అనార్య జాతులైన ఆంధ్ర, పుండ్ర, శబర, పుళింద, మూతిబాది దస్యులలో కలసి పోవలసిందని విశ్వామిత్రుడు శపించినట్లుగా ఒక ఐతిహ్యం ఉంది.

"తస్యహ విశ్వామిత్రస్యైకశతం పుత్రా ఆసుః, పంచాశత్ ఏక జ్యాయాంసో మధుచ్ఛందసః పంచాశత్ కనీయాంసః, తద్యే జ్యాయాంసో నతే కులమ్ మేనిరే, తాన్ అనువ్యాజహారన్ తాన్వః ప్రజాభిక్షిస్తేతి త ఏతేంధ్రాః పుండ్రాః, శబరాః, పుళిందా మూతిబా

ఇత్యుదంత్యా బహవో భవంతి వైశ్వామిత్రా దస్యూనామ్ భూయిష్ఠాః" - "ఐతరేయ బ్రాహ్మణమ్" Asiatic Society of Bengal (1906) 7వ సంచిక, 3వ అధ్యాయం.

'ఆంధ్ర' శబ్దానికి సంస్కృత భాషలో మొట్టమొదటి ప్రయోగం ఇదే. మ్లేచ్ఛులైన పై అయిదు జాతులవారు ఆర్యావర్తానికి సరిహద్దు ప్రాంతాల్లో ఆనాడు నివసిస్తున్న ద్రావిడులుకాని ముండా ప్రజలు కాని కావచ్చు. భారత దేశానికి ఆర్యులు అనంతర కాలంలో వచ్చిన వారని, ద్రావిడులు. ముండా ప్రజలు అంతకు పూర్వం ఉన్న ఆదిమ వాసులని చరిత్రకారుల నిర్ణయం. కాబట్టి ఆంధ్రులు అనార్యులైన ద్రావిడులలో ఒక తెగవారని చెప్పవచ్చు.

2. 'సమంత పసాదిక' అనే బౌద్ధ గ్రంథంలో 'అంధకు'లను గురించిన ప్రస్తావన ఉంది. తమిళులతో పాటు 'అంధులు' కూడ మ్లేచ్ఛులుగా అక్కడ పేర్కొనబడ్డారు. 'అంధులు'ను 'అంధకులు'ను ఒక జాతివారే అని భావించటానికి అక్కడ అవకాశం ఉంది.

3. కొన్ని బౌద్ధ గ్రంథాల్లో గోదావరి తీరంలో 'అంధకరట్ట' (అంధకరాష్ట్ర) ఉన్నదని, అస్సకులు, అళకులు ఆంధ్రరాజులని పేర్కొనబడింది. దీన్నిబట్టి బౌద్ధమత ప్రచారం నాటి తొలి శతాబ్దాలలోనే అంటే క్రీ.పూ. 5వ శతాబ్ది కాలంలోనే గోదావరి తీరంలో ఆంధ్ర జనపదాలున్నట్లు, ఆంధ్రరాజులున్నట్లు తెలియవస్తుంది.

4. క్రీ.పూ. 4వ శతాబ్దంలో మగధ సామ్రాజ్యాన్ని పరిపాలించిన చంద్రగుప్తమౌర్యుని ఆస్థానంలో మెగస్తనీస్ అనే గ్రీకు రాయబారి మౌర్యుల తరువాత బలవంతులుగా పరిగణింపదగినవారు ఆంధ్రులే అని ప్రశంసించాడు.

"Next come the Andhras, a still more powerful race which possess numerous villages and thirty towns defended by walls and towers and which supplies its king with an army 100000 infantry, 2000 cavalry and 1000 elephants". - Haccrindla's Magasthenes, Vol.VI P. 337-339.

5. అశోక చక్రవర్తి వెలయించిన శాసనాలలో ఒకదానిలో 'అంధ' అనే శబ్దం జాతిపరంగా కానవచ్చింది.

"ఏవమేవ ఇహ రాజ విషయేషు యవన కంభోజేషు నాభకే నాభపంక్తిషు, భోజప్రితి నిక్యేషు, అన్ధ్ర పులిన్దేషు, సర్వత్రదేవానాం ప్రియస్య ధర్మాను శిష్టిమనువర్తనే". - Edicts of Asoka - పు. 47.

6. వ్యాసమహాభారతంలో కూడ ఆంధ్రుల ప్రశంస కన్పిస్తుంది. మయసభలో అంగ, వంగ, పుండ్రక, పాండ్య, ఓఢ్ర, ఆంధ్రరాజులు ధర్మరాజును కొలిచినట్లు వర్ణింపబడింది.

"తథాంగ వంగౌ సహపుండ్రకేణ
పాండ్యోఢ్ర రాజౌచ సహాంధ్రకేణ"

- వ్యాసభారతమ్ - సభాపర్వం. 4 - 24.

7. మనుస్మృతిలో కారావరస్త్రీకి, వైదేహునకు జన్మించిన నిషాదులు ఆంధ్రులని పేర్కొనబడింది.

"కారావరో నిషాదాత్తు చర్మకారః ప్రసూయతే
వైదేహికా దంధ్ర మేదౌ బహర్గ్రామ ప్రతిశ్రయౌ"

- మనుస్మృతిః - 10 - 36 శ్లో.

8. భరతుడు రచించిన 'నాట్యశాస్త్ర' గ్రంథంలో పాత్రోచిత భాషను గురించి చర్చిస్తూ బర్బర, కిరాత, ఆంధ్ర, ద్రమిల ప్రభృతి జాతులను శౌరసేని మొదలైన ప్రాకృతాలను ఉపయోగించరాదని సూచించాడు.

"సబర్బర కిరాతాంధ్ర తమిలాద్యాసు జాతిషు
నాట్య ప్రయోగే కర్తవ్యం పాఠ్యం భాషా సమాశ్రయమ్"

- నాట్యశాస్త్రం, 176. 486 పు.

9. వాయు పురాణంలో ఆంధ్రరాజులైన ఆంధ్ర భృత్యుల పేర్లు, వారి పరిపాలనా కాలాలూ వివరింపబడ్డాయి. (45-127) ఆంధ్రభృత్యులే శాతవాహన రాజులు. వారి పరిపాలనా కాలం క్రీ.పూ. 230 - 225 అని చరిత్రకారుల నిర్ణయం.

10. 'సంస్కృత భాగవతం' లో శుకమహర్షి హరిస్తుతి చేస్తూ కిరాత హూణాంధ్ర పుళిందాది జాతులు తమ పాపాల నుండి విముక్తిని పొందటానికి శ్రీహరిని ఆశ్రయించారని చెప్పాడు.

"కిరాత హూణాంధ్ర పుళిందపుల్కసా
ఆభీర కంకా యవనాః కషాదయః
యేఽన్యేచ పాపా మదుపాశ్రయాశ్రయా
శ్శుధ్యంతి తస్మై ప్రభవిష్ణవే నమః"

- ద్వితీయస్కంధం, 14-18 శ్లో.

11. 'కువలయమాల' అనే ప్రాకృత గ్రంథంలో ఉద్యోతనుడు ఆంధ్రులు అందమైన వారని, ఆహార విహార ప్రియులని అభివర్ణించాడు.

"పియమహిళాసంగామే సుందర గత్తేయ భోయణీ రోద్దే
అటుపుటురటుం భణంతే ఆంధ్రే కుమారో సలోయేతి"

- వ్యాస సంగ్రహం - పంచాగ్నుల ఆదినారాయణ

ఈ విధంగా ఐతరేయ బ్రాహ్మణ కాలం నుండి 'ఆంధ్ర' శబ్దం జాతివాచకంగా వ్యవహరింపబడింది. సంస్కృత వాఙ్మయంలో కూడ 'అంధక, ఆంధ్రక జాతుల ప్రశంస కన్పిస్తుంది.

12. వ్యాస మహాభారతంలో ద్రౌపదీ స్వయంవరానికి విచ్చేసిన వారిలో 'అంధకులు' ఉన్నట్లు పేర్కొనబడింది.

"హలాయుధస్తత్ర జనార్దనశ్చ
వృష్ణ్యంధకాశ్చైవ యథా ప్రధానమ్
ప్రేక్షాంస్మ చక్రుర్యదు పుంగవాస్తే
స్థితాంశ్చ కృష్ణస్య మతే మహాంతః

- ఆదిపర్వం, 186-8 శ్లో.

13. పాండవులు వనవాసానికి వెళ్ళిన వార్త విని భోజులు, వృష్ణులు, అంధకులు వారిని దర్శించారని వర్ణింపబడింది.

"భోజాః ప్రవ్రజితాన్ శ్రుత్వా వృష్ణయశ్చాంధకైస్సహ
పాండవాన్ దుఃఖ సంతప్తాన్ సమాజగ్ము ర్మహావనే"

- అరణ్యపర్వం, 12-1 శ్లో.

14. భాగవత పురాణంలో అంధకులు యాదవ జాతికి చెందిన ఒక తెగవారని, ద్వారకా నగర సంరక్షకులని పేర్కొనబడింది. (1-11-11).

15. మత్స్య పురాణంలో అంధకాసురుని సంతతి అంధకులని ఒక ఐతిహ్యం ఉంది. (179-7-37)

16. వ్యాసభారతంలో అరణ్యపర్వ కథాభాగంలో శ్రీకృష్ణుడు ధర్మరాజును ఓదారుస్తూ రాజసూయయాగ సందర్భంలో ధర్మరాజును సేవించటానికి పాండ్య, ఓడ్ర, చోళ, ద్రావిడులతో పాటు 'ఆంధ్రకులు' కూడ వచ్చి ఉన్నారని స్మరించాడు.

"యత్ర సర్వాన్ మహీపాలాన్ శస్త్రతేజో భయార్తితాన్
సవంగాంగాన్ స పౌండ్రోడ్రాన్ సచోళ ద్రావిడాంధ్రకాన్"

- వ్యాసభారతమ్ - అరణ్యపర్వం. 51-22 శ్లో.

17. కురుక్షేత్ర యుద్ధంలో ఆంధ్రకులు, పుళిందులు, కిరాతులు మొదలైన మ్లేచ్ఛ జాతుల వారు కౌరవ పక్షంలో యుద్ధం చేసినట్లు వర్ణింపబడింది.

"ఆంధ్రకాశ్చ పుళిందాశ్చ కిరాతాశ్చోగ్ర విక్రమాః
మ్లేచ్ఛాశ్చ పార్వతీయాశ్చ సాగరానూపవాసినః

- కర్ణపర్వం, 73-20 శ్లో.

18. శాంతి పర్వంలో భీష్మపితామహుడు ధర్మరాజునకు సర్వభూతోత్పత్తిని గురించి వివరిస్తూ దక్షిణాపథంలో జన్మించిన పుళింద, శబరాది జాతులలో ఆంధ్రకులు ఒకరని పేర్కొన్నాడు.

"దక్షిణాపథ జన్మానః సర్వే నరవరాంధ్రకాః
గుహాః పుళిందాః శబర శ్చుచుకా మద్రకైస్సహ"

- 207-42 శ్లో.

పై ప్రమాణాలను బట్టి జాతి వాచకంగా ప్రయోగింపబడిన అంధ్ర, ఆంధ్ర, అంధక, ఆంధ్రక పదాలు ఏక జాతి వాచకాలే అని పేర్కొనవచ్చు. ఆధునిక కాలంలో 'బీరారు' ప్రాంతంలో 'అంధ' అనే ఒక అనార్య తెగవారు ఉన్నారు. 'అంధ' అనే శబ్దానికి ప్రాకృత రూపాంతరం 'అంధక' అని, దాని సంస్కృత రూపమే 'అంధ్ర', లేక 'ఆంధ్ర' అని భాషాశాస్త్రవేత్త టి. బరో అభిప్రాయం.

పై గ్రంథస్థాధారాలననుసరించి 'ఆంధ్ర' శబ్దం ప్రథమంగా జాతి వాచకంగా ప్రయోగింపబడిందని నిరూపింపబడింది. 'ఆంధ్ర' శబ్దానికి సంస్కృతంలో వేటకాడు అని ఒక అర్థం ఉంది.

(ఆంధ్రము From Andhra, San. Hunter)

సంగం యుగానికి చెందిన తమిళ గ్రంథాలలో తెలుగు వారిని 'వడుగర్' అని పేర్కొనబడి వారు వేటకుక్కలతో సంచరించేవారని వర్ణింపబడింది. ఆర్యుల ప్రాబల్యాన్ని ఎదుర్కొనలేని ఆంధ్రులు దక్షిణాపథానికి తరలివచ్చి రాజ్యస్థాపన కావించి ఆ ప్రాంతంలోని ప్రజలతో కలసి ఉండవచ్చు. పాలకులైన వారి పేరు ఆ దేశానికి, ఆ భాషకు కూడ కాలక్రమంలో సిద్ధించి ఉండవచ్చు.

**13.1.3(ఇ) ఆంధ్రం - దేశవాచకం**

'ఆంధ్ర' శబ్దం జాతి వాచకంగానే కాక దేశవాచకంగా కూడ ప్రాచీన శాసనాల్లోను, సంస్కృత సాహిత్యంలోను కానవస్తుంది.

1. క్రీ.శ. నాలుగవ శతాబ్దారంభం నాటి పల్లవ రాజుల ప్రాకృత శాసనాలలో 'అంధాపథ' అనే పేరుతో ఆంధ్రదేశం పేర్కొనబడింది.

2. వాల్మీకి రామాయణంలో సుగ్రీవుడు సీతాన్వేషణకై వానరులను దక్షిణ దిక్కునకు పంపుతూ వారు అన్వేషించవలసిన రాజ్యాలలో ఆంధ్ర, పుండ్ర, చోళ, పాండ్యాది దేశాలను పేర్కొని ఉన్నాడు.

> "తథావంగాన్ కళింగాంశ్చ కౌశికాంశ్చ సమన్తతః
> అన్వీక్ష్య దణ్డకారణ్యం సపర్వత నదీగుహమ్
> నదీం గోదావరీంచైవ సర్వమేవాను పశ్యత
> తథైవాంధ్రాంశ్చ పుండ్రాంశ్చ చోళాన్పాణ్డాంశ్చ కేరళాన్"
>
> - వాల్మీకి రామాయణమ్, కిష్కింధ, 41-11, 12 శ్లో.

3. వ్యాసభారతంలో దక్షిణ దిగ్విజయ యాత్రాసందర్భంలో సహదేవుడు జయించిన రాజ్యాలలో ఆంధ్రదేశం కూడ ఉంది.

> "పాండ్యాంశ్చ ద్రవిడాంశ్చైవ సహితాంర్చోఢ్ర కేరళైః
> ఆంధ్రాం స్తాలవనాంశ్చైవ కళింగానుష్ట్ర కర్ణికాన్"
>
> - వ్యాసభారతమ్, సభాపర్వం, 31-71 శ్లో.

4. భాగవత పురాణంలో బలికుమారులు ఆరుగురు తమ పేర్లతో ప్రత్యేక రాజ్యాలు స్థాపించుకున్నారని, వారిలో ఆంధ్రుడు కూడ ఆంధ్రరాజ్యాన్ని స్థాపించాడని వివరింపబడింది.

> "అంగవంగ కళింగాంధ్ర సింహ పుండ్రాంధ్ర సంజ్ఞితాః
> జజ్ఞిరే దీర్ఘ తపసో బలేః క్షేత్రే మహీక్షితః
> చక్రు స్స్వనామ్నా విషయాన్ షడిమాన్ ప్రాచ్యగాంశ్చతే
>
> - భాగవతమ్, 9-23-5, 6 శ్లో.

5. శివస్కంధవర్మ వేయించిన మైదవోలు శాసనంలో (క్రీ.శ. 234) ఆంధ్రపదం దేశవాచకంగా కానవస్తుంది.

> "అంధాపథియోగామో విరిపరమ్"

6. వల్లిదేవనందివర్మ దానశాసనంలో (క్రీ.శ. 340) "ఆంధ్రమండలే ద్వాదశ సహస్ర గ్రామ సంపాదిత సప్తార్థ లక్ష విషయాధి పతేః అనే వాక్యంలోని 'ఆంధ్ర' శబ్దం దేశవాచకంగానే ప్రయోగింపబడింది.

7. వరాహ మిహిరుడు రచించిన 'బృహత్సంహిత' లోని "కౌశిక విదర్భవత్సాంధ్ర చేదికా శ్చోర్ధ్వితండకాః" అనే వాక్యంలోని 'ఆంధ్ర' శబ్దం కూడ దేశవాచకమే.

ఈ ప్రమాణాలను బట్టి 'ఆంధ్ర' శబ్దం తొలుత జాతి వాచకంగానూ, పిదప దేశవాచకంగానూ వ్యాప్తి చెందిందని తెలియవస్తోంది.

**13.1.3(ఈ) ఆంధ్రం - భాషావాచకం**

సంస్కృత వాఙ్మయంలో క్రీ.శ. 11వ శతాబ్దానికి పూర్వం 'ఆంధ్ర' శబ్దానికి భాషా పరమైన ప్రయోగం లేదు. భరతుడు రచించిన 'నాట్యశాస్త్ర' గ్రంథంలో మాత్రం నాటకంలో ఉపయోగించదగిన 'విభాషలు' 7 విధాలని, అవి శకార, అభీర, చండాల, శబర, ద్రమిల, ఆంధ్ర, వనచరుల వ్యవహారం లోనివని సూచింపబడింది.

"శకారా భీర చండాల శబర ద్రమిలాంధ్రజాః
హీనా వనేచరాణాంచ విభాషా నాటకేస్మృతాః"

- నాట్యశాస్త్రం, 17-487.

అనంతరం 11వ శతాబ్దం నుండి 'ఆంధ్ర' శబ్దం భాషావాచిగా తరచుగా ప్రయోగింపబడింది.

1. నన్నయభట్టు రచించిన నందంపూడి శాసనంలో 'ఆంధ్ర' శబ్దం మొట్టమొదట భాషా పరంగా ప్రయోగింపబడింది.

"యః సంస్కృత కర్ణాట ప్రాకృత పైశాచికాంధ్ర భాషాసు కవిరాజశేఖర ఇతి ప్రథితః సుకవిత్వ విభవేన" అని నారాయణభట్టును నన్నయ ప్రశంసించియున్నాడు.

2. మూలఘటిక కేతన తెనుగు, తెలుగు పదాలనే కాక 'ఆంధ్ర' శబ్దాన్ని కూడ భాషా పరంగా ప్రయోగించాడు. 'ఆంధ్ర భాషాభూషణం' అనే గ్రంథనామకరణంలోనే 'ఆంధ్ర' శబ్దం భాషాపరంగా ప్రయోగింపబడింది.

ఈ విధంగా తెలుగులో గ్రంథ రచన ప్రారంభమైన కాలం నుండి 'ఆంధ్ర' శబ్దాన్ని భాషాపరంగా కవులు, పండితులు ప్రయోగించారని నిస్సంశయంగా పేర్కొనవచ్చు. మొదట జాతి వాచకమైన 'ఆంధ్ర' శబ్దం పిదప దేశ బోధకంగాను, అనంతరం భాషావాచిగాను వ్యాప్తిలోనికి వచ్చిందని నిరూపింపబడింది.

**13.1.4(అ) తెనుఁగు - తెలుగు**

ఈ రెండు పదాలలో తెనుఁగు, తెనుంగు అనే రూపాలు తొలుత ప్రయోగింపబడినట్లుగా పేర్కొనబడుతున్నాయి. దీనికి ఈ క్రింది ప్రమాణాలను సాక్ష్యాలుగా చెప్పవచ్చు.

**13.1.4(ఆ) 1. తెనుంగు - తెనుఁగు** అనే రెండు రూపాలు నన్నయ మహాభారతంలో ప్రప్రథమంగా భాషాపరంగా ప్రయోగింపబడ్డాయి. తెలుగు ధ్వని పరిణామంలో హ్రస్వం మీది పూర్ణబిందువు అర్థబిందువుగా కూడ కానవస్తుంది. అందువలన 'తెనుంగు, తెనుఁగు' అనేవి రూపాంతరాలే.

"సారమతిం గవీంద్రులు ప్రసన్న కథాకలితార్థ యుక్తిలో
నారసి మేలునా నితరు లక్షర రమ్యత నాదరింప నా
నారుచిరార్థ సూక్తి నిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారత సంహితా రచన బంధురుడయ్యె జగద్ధితంబుగన్"

- ఆదిపర్వం, 1-26 ప.

ఈ పద్యంలో 'తెనుంగునన్' అని పూర్ణబిందు రూపంగా ఈ శబ్దం భాషాపరంగా ప్రయోగింపబడింది.

"జననుత కృష్ణద్వైపా
యనముని వృషభాభిహిత మహాభారతబ
ద్ధ నిరూపితార్థ మేర్పడఁ
దెనుఁగున రచియింపు మధిక ధీయుక్తి మెయిన్"

- ఆదిపర్వం, 1-16 ప.

అనే పద్యంలో 'తెనుఁగు' అని అర్థబిందు రూపం భాషాపరంగా కానవచ్చింది.

2. నన్నెచోడుడు తాను రచించిన "కుమారసంభవ" కావ్యంలో 'తెనుంగు' పదాన్ని రెండు సందర్భాలలో ప్రయోగించాడు.

"మును మార్గ కవిత లోకం
బున వెలయగ దేశి కవితఁ బుట్టించి తెనుం
గున నిలిపి రంధ్ర విషయం
బున జన చాళుక్యరాజు మొదలుగ బలువుర్"

- 1 - 23 ప.

"సరళముగాగ భావములు జాను దెనుంగున నింపు పెంపుతో
బిరిగొన వర్ణనల్ ఫణితి పేర్కొన నర్థము లొత్తగిల్ల బం
ధురముగ బ్రాణముల్ మధుమృదుత్వ రసంబున గందళింపన
క్షరములు సూక్తులార్యులకు గర్ణ రసాయన లీల గ్రాలఁగాన్"

- 1 - 35 ప.

నన్నయ, నన్నెచోడు లిద్దరు 'తెనుఁగు' అనే నకార రూపాలనే ప్రయోగించారు. తెలుఁగు, తెలుంగు అని 'ల' కార రూపాలను ప్రయోగింపలేదు.

3. పాల్కురికి సోమన తెనుంగు, తెలుగు పదాలను రెండింటిని భాషాపరంగా ప్రయోగించి ఉన్నాడు.

"ఉరుతర గద్య పద్యోక్తుల కంటె - సరసమై పరగిన జానుఁ దెనుంగు
చర్చింపఁగా సర్వసామాన్యమగుట - గుచ్చెద ద్విపదలు గోర్కిదైవాఱ
దెలుఁగు మాటలనంగా వలదు - వేదముల కొలదియ కాఁజూడు డిలనెట్టులనిన"

- బసవ. 4 పు.

4. తిక్కన నిర్వచనోత్తర రామాయణంలో 'తెలుగు కవిత్వము, తెలుఁగుబడి' అనీ, మహాభారతావతారికలో 'తెనుంగుబాస, తెనుఁగుబాస' అనీ ప్రయోగించి ఉన్నాడు. దీనిని బట్టి 13వ శతాబ్దం నుండి తెనుఁగు, తెలుగు అనే రెండు రూపాలు భాషాపరంగా కావ్యాల్లో సర్వసాధారణంగా కన్పిస్తుంది.

భాషాపరంగా తరచుగా ప్రయోగింపబడిన పై రెండు రూపాల వ్యుత్పత్తులను పరిశీలించి చూడవలసి ఉన్నది.

'తెనుఁగు' అనే రూపం తద్భవమనీ, అది 'త్రినగ' అనే శబ్దం నుండి ఏర్పడినదని కొందరు పేర్కొన్నారు. 'తెనుఁగు' అనే శబ్దం దేశ్యపదం అనీ, అది దిక్కును సూచించే పదం అనీ శ్రీ గంటిజోగి సోమయాజి గారు 'ఆంధ్రభాషా వికాసం'లో పేర్కొన్నారు.

'తెన్' అనే శబ్దం దిక్కు అని అర్థం కలిగిన ద్రావిడ పదాంశం అనీ, ప్రాచీన ద్రావిడ భాషా సమాజంలోని ఉత్తర ప్రాంతం వారు, దక్షిణ ప్రాంతం వారిని అనగా నేటి ఆంధ్రదేశం వారిని 'తెన్' శబ్దం చేత నిర్దేశించి ఉండవచ్చునని, ఆ ప్రాంతపు మాండలికం ప్రత్యేక భాషగా పరిణమించి నప్పుడు ఆ భాషకు 'తెనుఁగు' అను పేరు ఏర్పడి ఉండవచ్చునని వారి అభిప్రాయం. 'తెలుగు' భాషలో నేటి వ్యవహారంలో 'తెన్' అనే శబ్దం తొలగిపోయింది. కాని "తెమ్మెర, తెన్నేరు, టెంకాయ, తీరూ-తెన్నూ" మొదలైన సమాస రూపాల్లో మాత్రం నిలిచి ఉంది.

ఉత్తర ద్రావిడ ప్రజలు దక్షిణ దిక్కులోని వారిని 'తెన్' శబ్దంతో నిర్దేశించి ఉండటం అసంగతం కాదు. తమిళ దేశానికి ఉత్తరాన ఉన్న తెలుగు వారిని 'వడుగర్' అని, తెలుగు భాషను 'వడుగ' అని తమిళులు ప్రాచీన కాలం నుండి వ్యవహరించి ఉండటం పై అభిప్రాయానికి అనుకూలంగా కన్పిస్తుంది.

**13.1.4(ఇ) తెలుఁగు-తెలుంగు**

'తెలుఁగు' శబ్దం భాషా వాచకంగా సంస్కృత గ్రంథాల్లో కానరావటం లేదు.

1. వాయుపురాణంలో 'తెలింగా' అనే పదం ఒక జనపదానికి పేరుగా పేర్కొనబడింది.

2. క్రీ.శ. 13వ శతాబ్దానికి చెందిన కాకతీయ ప్రతాపరుద్రుని ఆస్థానంలోని విద్యానాథుడు ఈ దేశం పేరును 'త్రిలింగ' మని వ్యవహరించాడు. శ్రీశైలం, కాళేశ్వరం, దాక్షారామాలలోని మూడు శివలింగాల వలన, ఆ ప్రదేశాలకు నడుమ నున్న భాగం త్రిలింగ దేశం అయిందని అతడు పేర్కొన్నాడు.

3. క్రీ.శ. 14వ శతాబ్దానికి చెందిన విన్నకోట పెద్దన ఆంధ్రదేశానికి త్రిలింగ దేశమనే పేరు కావ్యాల్లో ప్రయుక్తమైనట్లు, 'తెలుఁగు' అనే పదం 'త్రిలింగ' శబ్దభవమైనట్లు పేర్కొన్నాడు.

"ధరశ్రీ పర్వత కాళే
శ్వర దాక్షారామ సంజ్ఞ వఱలు త్రిలింగా
కర మగుట నంధ్ర దేశం
బరుదారఁ ద్రిలింగ దేశమన జనుగ్రుతులన్"

తత్త్రిలింగ పదము తద్భవం బగుటచే
దెలుగు దేశ మనఁగ దేట పడియె
వెనుఁక దెనుఁగు దేశమును నంద్రు కొందఱు
బ్బాస పంచగ తులఁ బరగుచుండు"

- కావ్యాలంకార చూడామణి. 192 పు.

శ్రీశైలం, కాళేశ్వరం, దాక్షారామం అనే త్రిలింగాలతో కూడి ఉండటం వలన త్రిలింగదేశం అని, ఆ 'త్రిలింగ' శబ్దం నుండి 'తెలుగు' అనే పదం తద్భవ రూపంగా సిద్ధించిందని విన్నకోట పెద్దన అభిప్రాయం.

'త్రిలింగ' పదం దేశవాచకంగా బ్రహ్మాండ పురాణంలోను, స్కాంద పురాణంలోను, గ్రంథస్థమై ఉన్నట్లు చిలుకూరి వీరభద్రరావు గారు 'ఆంధ్రుల చరిత్ర' ప్రథమ భాగంలో తెలిపి ఉన్నారు.

"శ్రీశైల భీమ కాళేశ మహేంద్ర గిరి సంయుతం
ప్రాకారంతు మహత్ కృత్వా త్రీణి ద్వారాణి చాకరోత్
. . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . . .
అవసత్తత్ర ఋషిభిః యుత్ గోదావరీ తటే
తత్కాల ప్రభృతి క్షేత్రం త్రిలింగ మితి విశ్రుతం"

\- బ్రహ్మాండ పురాణమ్

"కర్ణాటాశ్చైవ త్రైలింగ ఘూర్జరా రాష్ట్ర వాసినః
ద్రావిడాః ద్రావిడాః పంచ వింద్య దక్షిణ వాసినః

\- స్కాంధ పురాణమ్

రాజశేఖరుడు రచించిన 'విద్ధసాల భంజిక' గ్రంథంలో "జయతు జయతు త్రిలింగాధిపో దేవః" అని 'త్రిలింగ' శబ్దం దేశవాచకంగా ప్రయుక్తమైంది. దీని నుండి 'తెలుఁగు' శబ్దం ఉత్పన్నమైనదని కొందరి అభిప్రాయం.

'త్రికళింగ' పదమే రూప పరిణామం వలన 'తెలుగు' పదం ఏర్పడిందని మరికొందరి భావన.

త్రికళింగ - తి అలింగ - తెలింగ - తెలుంగు.

ఈ అభిప్రాయానికి సరియైన ఆధారాలు లేవు. ఇవి అన్నీ కవుల చమత్కారాలుగా పరిగణింపదగినట్టివే.

ఉత్తర దేశం నుండి క్రీ.శ. 13వ శతాబ్ది మొదలుగా పలు దండయాత్రలు నిర్వహించిన మహమ్మదీయులు తెలుగు దేశాన్ని 'తిలింగ్' లేదా 'తెలింగ్' అనీ, తదనంతర కాలంలో 'తెలింగానా' అని వ్యవహరించారు. 'తెలుగు' అనే పదం దేశవాచకం కావటం దీనివలన స్పష్టం అవుతుంది.

'ఆంధ్ర' దేశాన్ని పరిపాలించినట్లుగ తమ శాసనాల్లో తెలుపుకొనిన వెలనాటి దుర్జయులు మొదలైన పాలకులు తాము పాలించిన ఆంధ్ర దేశానికి సరిహద్దులను తెలిపి ఉన్నారు. కాని అవి సంపూర్ణ ఆంధ్ర దేశానికి సరిహద్దులు కావు. వారి అధీనంలో ఉన్న ఆంధ్రదేశపు భాగానికి మాత్రమే వర్తించేటటువంటివి. విద్యానాథునిచేత 'ప్రతాపరుద్రీయం'లో పేర్కొనబడిన త్రిలింగ భూమిలో కళింగ భూమి చేరక పోవటం వలన అది సమగ్రాంధ్ర దేశం కానేరదు. పాల్కురికి సోమనాథుడు ఈ దేశాన్ని 'నవలక్ష తెలుంగు' అనగా నవలక్ష గ్రామ పరిమితమైన తెలుగుదేశం అని తన 'పండితారాధ్య చరిత్ర' లో పేర్కొన్నాడు. అప్పటి మహమ్మదీయ చరిత్రకారుడైన 'ఈసామీ' కూడ 'నౌలక్ తిలింగ్' అని ఈ దేశాన్ని పేర్కొన్నాడు. దీనిని బట్టి 'త్రిలింగదేశం' అనే వ్యవహారం ఉన్నట్లు తెలియవస్తున్నదే కాని దాని సరిహద్దులు స్పష్టం కావటం లేదు.

**13.1.5 తెనుఁగు - తెలుగు పదస్వరూప నిర్ణయం**

'తెనుఁగు, తెలుగు' శబ్దాలు రూపాంతరాలే కాని భిన్న శబ్దాలు కావు. ద్రావిడ భాషలలో నకార, లకారాల వినిమయం సర్వ సాధారణంగా కన్పిస్తుంది. ఈ మార్పు మూల ద్రావిడ భాషలోనే జరిగినట్లుగా ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు నిరూపించారు.

"There was in proto Dravidian language an alternation between <u>-n- and -h-</u>. So wherever we have an alternation -n-/-l- in Telugu, We can normally trace into proto dravidian. Alternation -n-/-l- which was also widely represented in the other South Dravidian languages."

- Telugu Verbal Basis - P.41.

నేడు కూడ కొంతమంది గ్రామీణుల వ్యవహారంలో 'న-ల' ల వినిమయం కన్పిస్తుంది. <u>"మునగ-ములగ,</u> <u>మునుకోల-ములుకోల</u>, <u>జన్మ-జల్మ</u>, <u>లేదు-నేదు</u>, <u>చెనగు-చెలగు</u>, <u>లాగు-నాగు</u>" మొదలైన జంటలు ఇటువంటివే.

కాబట్టి 'తెలుగు' శబ్దం త్రిలింగ శబ్దభవం కాదు. అది దేశ్య పదం అయిన 'తెనుగు' నకు రూపాంతరమే. ఈ రెండు శబ్దాలు ప్రాచీన కాలం నుండి తెలుగు దేశంలో వ్యవహారంలో ఉన్నటువంటివే.

దేశి పదాలను సంస్కృతీకరించటం. వాటికి సంస్కృత సంబంధమైన వ్యుత్పత్తులను కల్పించటం పండితులలో సర్వసాధారణంగా కానవచ్చే అంశం. కొన్ని గ్రామాల పేర్లు కూడ సంస్కృతీకరింపబడి ప్రయోగింపబడటం కానవస్తుంది.

<u>ఓరుగల్లు - ఏకశిలా నగరం</u>, <u>పెనుగొండ - ఘనగిరి.</u>
<u>కందుకూరు - స్కంధపురి</u>, మొదలైనవి ఇటువంటివే.

ఇటువంటిదే 'తెలుగు'నకు రూపొందింపబడిన 'త్రిలింగ' శబ్దం తెలుగు దేశానికి 'త్రిలింగదేశం' అనే పేరు కొన్ని గ్రంథాలలోనే కాని వ్యవహారంలో కానరాదు. నేడు మన భాషకు <u>ఆంధ్రము</u>, <u>తెనుఁగు</u>, <u>తెలుగు</u> అనే మూడు పేర్లు ప్రసిద్ధాలై ఉన్నాయి.

## 13.2 తెలుగు భాష - యుగవిభజన

### 13.2.1 ఉద్దేశం

తెలుగు భాష క్రీ.పూ. శతాబ్దాల నుండి శాసనాలను బట్టి, సాహిత్యాన్ని బట్టి వివిధ పరిణామాలకు లోనవుతూ వచ్చింది. విస్తృతమైన పరిధి కలిగిన తెలుగు భాషలో ఆయా యుగ లక్షణాలను బట్టి పరిణతి చెందుతూ ఆధునిక యుగం వరకు సాగింది. ఇటువంటి విశాలమైన పరిధి కలిగిన తెలుగు భాషా స్వరూప స్వభావాలను గురించి తెలిసికోవలసిన విద్యార్థులకు, పరిశోధకులకు అనేక సూక్ష్మాంశాలను గురించిన అవగాహన అత్యంతావశ్యకం. కనుక తెలుగు భాష - యుగవిభజన అనే పాఠం అభ్యసించవలసిన ఆవశ్యకత ఉంది.

తెలుగు భాషా స్వరూప స్వభావాలను గురించిన సమగ్ర విశ్లేషణ 'తెలుగు భాష - యుగ విభజన' అనే ఈ పాఠంలో నిరూపింపబడింది.

### 13.2.2 పాఠ పరిచయం

తెలుగు భాషా సాహిత్యాలు రెండు అతి ప్రాచీనమైన చరిత్ర కలిగినటువంటివి. ఇన్ని వేల సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగు సాహిత్యాన్ని అధ్యయన సౌలభ్యం కోసం కొన్ని యుగాలుగా విభజించినట్లుగానే తెలుగు భాషను కూడా ఆయా కాలాలలో వచ్చిన పరిణామాలను బట్టి కొన్ని యుగాలుగా విభజింప వచ్చు.

తెలుగునకు ప్రామాణిక స్థాయి 11వ శతాబ్దం నుండి వచ్చింది. అంతవరకు సరి అయిన రూపకల్పన తెలుగునకు లేదు. చైతన్య స్వరూపమైన మానవ సమాజానికి మార్పు అనివార్యం. ఈ మార్పులు మానవునిచే వ్యవహరింపబడే భాషకు సహితం సహజం.

క్రీ.శ. 200 నుండి తెలుగు భాష ప్రత్యక్షమైంది. అంతకు పూర్వం ఉన్న భాషకు అనుమాన ప్రమాణాలే ఆధారాలు. క్రీ.శ. 575 సం॥ నుండి తెలుగు శాసనాలు లభిస్తున్నాయి. 11వ శతాబ్దం నుండి మహాకావ్యాలు వెలువడ్డాయి. ఈ లక్షణాలను ఆధారం చేసికొని తెలుగు భాషను చరిత్రకారులు 6 యుగాలుగా విభజించారు. అవి - 1. అజ్ఞాత యుగం, 2. సంస్కృత ప్రాకృత భాషా శాసన యుగం, 3. ప్రాఙ్నన్నయ యుగం, 4. నన్నయ యుగం, 5. మధ్య యుగం, 6. ఆధునిక యుగం.

### 13.2.3 అజ్ఞాత యుగం

1. క్రీ.పూ. 600 సం॥ల కాలం నాటి ఐతరేయ బ్రాహ్మణంలో జాతిపరంగా 'ఆంధ్ర' శబ్దం ప్రయోగింపబడింది. వీరికి ఒక భాష ఉన్నట్లయితే అది తెలుగు అయి ఉండవచ్చు.

2. క్రీ.శ. 200 సం॥ న సంస్కృత ప్రాకృత శాసనాలలో తెలుగు గ్రామాలు, సరిహద్దులు పేర్కొనబడ్డాయి. ఈ పేర్లకు ఆధారభూతం అయిన తెలుగు భాష క్రీస్తు పూర్వమే ఉండి ఉండవచ్చు.

3. తెలుగునకు సోదర భాషగా పేర్కొనబడే టటువంటి తమిళ భాషకు క్రీ.శ. ప్రథమ శతాబ్దికే వ్యాకరణం, సాహిత్యం ఏర్పడ్డాయి. దానిని బట్టి తెలుగునకు వ్యవహార రూపమైనా ఆనాటికి ఉండవలసి ఉంది.

ఈ అనుమాన ప్రమాణాలను బట్టి దీనిని అజ్ఞాత యుగం అని పేర్కొన్నారు.

### 13.2.4 సంస్కృత ప్రాకృత భాషాశాసన యుగం

క్రీస్తు శకారంభం నుండి 5, 6 శతాబ్దాలలో తెలుగుదేశంలో బయల్పడిన ప్రాకృత సంస్కృత శాసనాలలో ఉదాహరింపబడిన తెలుగుదేశంలోని పేర్లు, సరిహద్దు గ్రామాల పేర్లు మొదలగు వాటిని అనుసరించి ఆ కాలం నాటి తెలుగు భాష అస్తిత్వాన్ని, దాని స్వరూప లక్షణాలను కొంతవరకు ఊహింపవచ్చు. వీటిలో శాతవాహనులు, ఇక్ష్వాకులు రూపొందించిన శాసనాలు ప్రముఖాలు.

1. ఈ కాలంనాటి శాసనాలను బట్టి పరిశీలించినట్లయితే గ్రామాల పేర్ల చివర ఊరు, పట్టు, కొన్ఱ, కోడు, చెఱువు, రేవు, పాక, పల్లి, వాడు, చేడు మొదలైన తెలుగు పదాలు కన్పిస్తున్నాయి. ఉదా. ఆతుకూరు, పెణకపఱ్ఱు, తాటికొన్ఱ, చెఞ్చెఱువు, చాకిఱేవు, చూయిపాక, కురవాడ.

2. ఈ కాలం నాటి తెలుగు భాషలో వింత ద్రావిడ వర్ణం 'ఱ' కారం వ్యవహారంలో ఉండటమే కాక తెలుగు పదాలకు తొలి వర్ణంగా కూడ నిలిచి ఉంది. ఉదా. ఱెందులూరు.

3. శకటరేఫమే కాక దానికి ఊతగా గ్రహింపబడిన 'న' కారంతో కూడిన 'న్ఱ' అనే సంయుక్తాక్షరం వాడుకలో ఉండేది. ఉదా. తాన్ఱికొన్ఱ.

4. ప్రాచీన భాషలోని 'ళ' కారం మార్పు చెందక 'ళ' కారంగానే నిలచి ఉంది. ఉదా. ఏళూరె, విజయరాజ్య సంవత్సరంబుళ్'.

5. సంస్కృత పుంలింగ శబ్దాలు తెలుగు భాషలో చేరి తత్సమాలుగా మారినప్పుడు అవి తిర్యగ్జడ వాచకాలు అయినట్లయితే

తెలుగు భాష సంప్రదాయాన్ని బట్టి అమహత్తులై పు, బు, ంబు ప్రత్యయాలను గ్రహించి ఈ కాలం నాటికి భాషలోనికి వచ్చి చేరాయి. ఉదా. సంవత్సరంబు, నాగంబు మొదలైనవి.

6. ఈ కాలంలో తెలుగు సమాసాలు ఏర్పడిన విధానం ఈ క్రింది పదాల వలన సూచింపబడుతుంది.

బన్ + కోడు - బంగోడు, చెన్ + చెఱువు - చెఞ్చెఱువు, మూడు + ఎల్ల + కూటువ - ముయ్యేల కూటువ.

### 13.2.5 ప్రాఙ్నన్నయ యుగం

ఇది క్రీ.శ. 575 నుండి 1022 వరకు స్వీకరింపబడింది. ఈ కాలం నాటి భాషా స్వరూపాన్ని గ్రహించటానికి ఈ కాలంలో వేయించబడిన తెలుగు శాసనాలు ఆధారం. ఆ శాసనాధారాలను బట్టి నాటి భాషా లక్షణాలు ఈ క్రింది విధంగా చెప్పబడుతున్నాయి.

ఎ. <u>లేఖన పద్ధతులు</u> - రేఫ తరువాత, బిందువు తరువాత ద్విరుక్త హల్లులు వ్రాయటం నాటి లేఖన సంప్రదాయంగా ఉండేది. రేఫ మీది హల్లును ద్విరుక్తం చేయటం అనే పద్ధతి ఆర్య భాషా సంప్రదాయం నుండి వచ్చి చేరింది.

ఉదా. తూర్ప్పున, కార్త్తియ మొదలైనవి.

ఈ అలవాటు క్రీ.శ. 11వ శతాబ్ది నుండి క్రమంగా తగ్గుతూ వచ్చింది. అనుస్వారం మీది పరుషాలను ద్విత్వం చేసే ఆచారం క్రీ.శ. 9, 10 శతాబ్దాల నుండి మాత్రమే కన్పిస్తుంది. ఉదా. అంక్క.

బి. <u>వర్ణమాల</u> - ప్రాచీనాంధ్రంలో 23 హల్లులూ, 10 ఆచ్చులూ గల దేశ్య వర్ణమాల ఉన్నట్లు తెలుస్తుంది. క, గ, జ, చ, జ, ట, డ, ణ, త, ద, న, ప, బ, మ, య, ర, ల, ళ, వ, స, హ అనేవి హల్లులు. అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఎ, ఏ, ఒ, ఓ, అనేవి అచ్చులు. అరసున్న సంధి గత వర్ణం. 'పఞ్చిన, పన్చిన' శబ్దాలను పోల్చినప్పుడు 'ఞ' కారం 'న' కారానికి సవర్ణం అని తెలుస్తుంది.

సి. <u>వర్ణవ్యాప్తి</u> - శాసనభాషలోని వర్ణవ్యవస్థలో కనిపించే కొన్ని ముఖ్య విశేషాలు ఇవి - దీర్ఘాచ్చు మీద ద్విరుక్త హల్లుగాని, ఓ తరువాత సంయుక్తాక్షరం కాని కనిపించవు. జ, ఞ, ట, ణ, హ కారాలు పదాదిన లేవు. రేఫతో సంయుక్తమైన క, త, ద, ప, బ, మ, వ లు మాత్రమే పదాదిలో కన్పిస్తాయి. ఉదా. క్రొచ్చె, త్రాగిన, వ్రచ్చిన రెండేసి హల్లులు కలిసిన సంయుక్త వర్ణాలు అజ్మధ్యంలో ఎక్కువగా ఉండేవి.

డి. <u>తాలవ్యీకరణం</u> - పదాది వర్ణాల చరిత్రలో కొన్ని ముఖ్య పరిణామాలను మాత్రమే ప్రస్తావిస్తాం. తాలవ్యాచ్చులకు ముందున్న ప్రాచీన ద్రావిడ క కారం తెలుగులో చకారంగా మారుతుంది. క్రీ.శ. 400-410 నాటి పెదవేగి శాసనంలోని 'కమ్బురా ఞ్చెరువు' 'చెఞ్చెఱువు' అనే పదాలలోని 'చెఱువు' మూలద్రావిడ శబ్దం 'కెఱుమ్' నుండి ఏర్పడింది.

ఇ. <u>ద్రుతం</u> - ద్రుతసంధి - క్రీ.శ. 6 - 9 శతాబ్దాల మధ్యకాలంలో ద్రుత సంధి వైకల్పికంగా ఉండేది. కాలక్రమంలో అది బహుళంగా పర్యవసించింది. క్రీ.శ. 9-10 శతాబ్దాలలోని పద్య శాసనాల్లో మాత్రం ద్రుతసంధి నిత్యంగా ఉండేది. ఉదా. దీని - గాచినవారు, వైదుంబుళచేతం - బట్టం కట్టబడి, మొదలైనవి.

ఎఫ్. <u>విభక్తి ప్రత్యయాలు</u> - ప్రథమాది సప్తవిభక్తులు ఏర్పడ్డాయి. డుముపులు ప్రథమ - పణ్డరంగణ్డు, కార్తికేయుణ్డు, ధర్మము, నాగము, మహారాజులాకు, న్, ని, ను, మ్, నిం, ము అనే సపదాంశాలు ద్వితీయావిభక్తి.

ఉదా. గండత్రినేత్రని, రడ్డి-ని, నాణ్డి-ం, చోఱ-నిం, చేత, చేతం, తో, తోన్, తోడ, తోడం, తోఱన్ - తృతీయావిభక్తి.

ఉదా. బోళ - చేత, చోడుళ - తోడ.

కి(న్), కు(న్), కూ, క్ అనే పదాంశంతోను, 'పొణ్డె' అనే అనుబంధంతోను చతుర్థీవిభక్తిని సూచించేవారు.

సంప్రదాయ వ్యాకరణాలు దీన్ని షష్ఠీ ప్రత్యయంగా పరిగణించినా ఆ అర్థంలో దీనికి ప్రయోగం లేదు. చేను - కు, సోము - కు, మూలద్రావిడంలో ద్వితీయా, చతుర్థీవిభక్తులు ఒక్కటిగానే ఉండేవి.

పంచమీవిభక్తి - వలన, ఉణ్డి - గద్యంబువలన, చేబ్రోలనుణ్డి.

షష్ఠీవిభక్తి - కి, కు - చిమ్మనకు, నాకు.

సప్తమీవిభక్తి - నన్, న, అందు - ముత్తులూరిన్, పులొంబున, మహిమింద.

జి. సంఖ్యావాచకాలు - నిర్మాణ క్రమంలో ఇవి విశేష్యాలవంటివే. ఇవి ప్రాథమిక, సార్వనామిక అని రెండు రకాలు.

ఒకొటి - ఒక, ఒరుల్ అని రూపాంతరాలు.

రెణ్డు - రెంటి - కి, ఇన్ - మడి, ఇర - వది. దీనికి విశేషణార్థంలో ఇను, ఇర, ఇరు అనే రూపాంతరాలున్నాయి.

మూన్డ్ - మూను, మూణ్డు, నాల్కు - నాలుగు, నాల్ - ఉను

ఏను, ఆఱు - అర-వాద్యది, ఎణ్బొది - ఎణుంబొది.

నూర - నూఱు, నూట, నూఱింటికి.

హెచ్. సంధులు - తత్సమ శబ్దాలకు తెలుగు పద్ధతిలోను, తెలుగు మాటలకు సంస్కృత పద్ధతిలోను సంధి చేయటం కనిపిస్తుంది.

'నీలీస్వర, మన్చ్యణ్డ' ఇత్యాదులు అటువంటివి.

ఐ. విశేషణాలు - 1. విశేష్యాలకు ముందు మాత్రమే వచ్చే అస్వతంత్ర ప్రాథమిక విశేషణాలు ఒక రకం. ఆ, ఈ, ఏ అనే త్రికం ఈ రకానికి చెందింది. త్రికం మీది హల్లు ద్విత్వం అయినప్పుడు త్రిక దీర్ఘ స్వరం వైకల్పికంగా హ్రస్వం అయ్యేది. ఉదా. ఆ-బసిణ్డి, ఆ-బ్బారణాసి.

2. విశేషణంగా వాడే ద్వితీయాది విభక్త్యంగం రెండవది.

3. సంఖ్యా వాచక విశేషణాలు మూడో రకం.

4. 'ఎడు' అనే మానార్థక ప్రత్యయాలు చేరిన విశేషణాలు నాలుగోరకం. మాన్-ఎడు.

5. విశేష్యం మీది 'ము' ప్రత్యయం స్థానంలో 'పు' వర్ణకం చేరిన విశేషణాలు. వేప్ - ఊర్, వేం - బళ్ళి.

6. అజంత విశేష్యం మీద అజాది విశేష్యానికి ముందు టుగాగమం కాగా ఏర్పడ్డ విశేషణం. ఉదా. ఇరుకు - ట్ - ఊరి.

7. విశేష్య విశేషణ లక్షణాలు రెండూ కలవి. ఉరువు - పల్లి.

8. కేవలం విశేషణంగా మాత్రమే ఉపయోగపడేవి. చెళ్ + చెరువ్.

9. క్రియా పదాలుగా కూడా ఉండే ధాతుజ విశేషణాలు.

భూతకాలిక విశేషణాలు - 'ఇచ్చిన'

తద్ధర్మార్థక విశేషణాలు - మను-వాణ్డు

వ్యతిరేకార్థక విశేషణాలు - పెటని-వారు.

శాసనస్థ నిదర్శనాలను బట్టి ఈ పదబంధ నిర్మాణం క్రీ.శ. 7వ శతాబ్దిలో కడప మండలంలో ఆరంభమై 8-10 శతాబ్దాల మధ్య కాలంలో దక్షిణ కోస్తాకు వ్యాపించి, 11వ శతాబ్దికి యావదాంధ్ర దేశంలో వాడుకలోనికి వచ్చినట్లు తెలుస్తుంది.

జె. అవ్యయాలు - 3 రకాల అవ్యయాలు శాసన భాషలో కన్పిస్తాయి. 1. విశేష్య ప్రాతిపదికకు 'కా' అనే అసంపూర్ణ క్రియా రూపాలు చేరి ఏర్పడేటటువంటివి. ఇవి అసంఖ్యాకం. 2. సర్వనామాలుగా భావింపబడేవి. ఉదా. ఇఙ్ల - ఇట్ల, ఇత్యాదులు.

కె. క్రియలు - ఇవి 3 విధాలు. సామాన్య, సంకీర్ణ, సమస్త అనేవి. ఏకధాతుకమైన 'అగు' మొదలైనవి సామాన్య క్రియలు. ఇవి దేశ్యాల్లోను, ఎరువు మాటల్లోను కన్పిస్తున్నాయి. సమస్త క్రియలు కేవలం దేశ్యాలే. ఇవి విరళంగా ఎనిమిదో శతాబ్దం నుండే కన్పిస్తున్నాయి. ఉదా. వర్తమానార్థకం. ఏళుచ్-ఉణ్టి, భవిష్యదర్థకం. నడపం-గల, ఆత్మార్థకం. అఱిసి-కొన్న.

ఎల్. వాక్యనిర్మాణం - గద్య, పద్య శాసనాలలో చాలావరకు క్రియాపద రహితమై ప్రథమాంతాన్వయం కలిగినదిగా వాక్య నిర్మాణం కన్పిస్తుంది. "ఊరిస్వాముల్ యిచ్చిన స్థితి" "వక్రంబు వచ్చు వన్తు" "పాతక ళ్చేసినవారి" మొదలైనట్టివి.

ఎమ్. మణిప్రవాళ శైలి - సంస్కృతాంధ్ర పదబంధాలను మేళవించి వాక్యరచన చేస్తే దానిని 'మణిప్రవాళశైలి' అంటారు. శాసనాల్లో క్రీ.శ. 7వ శతాబ్దం నుండి ఈ రకం వాక్యాలు అక్కడక్కడ కన్పిస్తాయి. ఉదా. 'క్షేత్రం ఖణ్డుగవడ్ల సహితమ్, . . . . కొడుకు పల్లవాచార్య్యస్య లికితం' ఇటువంటివి.

ప్రాఙ్నన్నయ యుగం నాటి భాష ద్రవస్థితిలో ఉండేదనీ, దానిని సంస్కరించి నన్నయ ప్రామాణీకరించాడనీ, తెలుగు మీద మొదట ప్రాకృత భాషా ప్రభావమూ, తరువాత సంస్కృత భాషాప్రభావమూ అధికంగా ఉండేవనీ భావించేవారు.

### 13.2.6 నన్నయ యుగం

ఇది క్రీ.శ. 1023 నుండి ప్రారంభం అవుతుంది. తెలుగు భాష సాహిత్య రూపాన్ని పొంది స్థిరత్వాన్ని సంపాదించుకున్న యుగం. ఈ కాలం నాటి భాషా స్వరూపాన్ని అవగతం చేసికోవటానికి నన్నయ భారతమూ పావులూరి మల్లన గణితశాస్త్రమూ ఆధారాలుగా ఉన్నాయి.

ఎ. భాషాలక్షణాలు - 1. తి, న్డు లను నెమ్మదిగా పోగొట్టటం. 'తి' కారంతో కూడిన శబ్దాలను నన్నయ 'డ' కారంతో వాడుకలోనికి తెచ్చాడు. 'న్టు' అనే ధ్వనికి 'ణ్డ, ణ్డు' అనే రూపాలలోని 'ణ్డు' వర్ణాన్ని గ్రహించి అవసరం అయిన చోట అనునాసి కొన్ని తేల్చి పలకటం. లేదా జారవిడవటం గాని ప్రారంభింపబడిందని ఊహింపవచ్చు. ప్రాచీన బహువచన ప్రత్యయం అయిన 'ళ్' వర్ణం తరువాత 'లు' వర్ణంగా మారింది. ఈ 'లు' వర్ణానికే నన్నయ స్థిరత్వాన్ని కల్పించాడు. శకటరేఫం ప్రాచీన ద్రావిడ భాషా ధ్వనులలో విలక్షణమైనది.

2. దేశ్య పదాలలో 'హ' కారం లేదు.

3. కర్మణ్యర్థకంలో 'పడు' ధాతువును ప్రయోగించి విరివిగా ప్రయోగించాడు.

బి. ఛందస్సు - కన్నడ సంప్రదాయానుసారంగా సంస్కృత వృత్తాలు తెలుగు కావ్యాలలో ప్రవేశించాయి. సంస్కృత వృత్తాలలో కూడ తెలుగు కవితా సంప్రదాయానుసారంగా యతిప్రాసలు ఉపయోగింపబడ్డాయి. సంస్కృత పదజాలం అపరిమితంగా తెలుగు భాషలో ప్రవేశించింది.

సి. యత్తదర్థక పదప్రయోగం సంస్కృతంలో అధికం. తెలుగులో 'రక్షిష్చినవారికి' ఇత్యాదిగా ఉంటుంది. కాని 'ఎవరు రక్షింతురో వారి' అని యత్తదర్థక ప్రయోగం ఉండదు. మహాభారతంలో నన్నయభట్టు సంబంధ బోధక సర్వనామాలను అధికంగానే ప్రయోగించాడు. సంస్కృత ప్రభావంతో పాటు, కథాకథన విధానంలోను, ప్రశ్నోత్తర సంవిధానంలోను ఇటువంటి ప్రయోగం సౌకర్య కారణం అవుతుంది. ముందు ప్రశ్న వేసి, సమాధానం వచ్చే లోపుగా దానినే అందుకొని చెప్పినప్పుడు ఈ విధమైన ప్రయోగం చేయబడుతుంది. "అభివాంఛిత మెయ్యది దాని జెపుమ చేయుదుననినన్'. దీనిలో మొదటిది ప్రశ్న. దాని ననుసరించిన దంతా రెండవ వాక్యం. ఈ రెండిటిని నిర్వ్యవధానంగా ఏకవాక్యంలో ప్రయోగించటం వలన తెలుగు భాషా ప్రయోగానికి భిన్నమైన ఒక వైచిత్రి లభించింది.

డి. విభక్తుల విషయంలోను, క్రియాపదాల విషయంలోను నన్నయభట్టు ఒక మార్గ నిర్దేశం చేశాడు. 'నాకుం గరుణింపుడు' మొదలైన ప్రయోగాలలో ఈనాడు ద్వితీయావిభక్తి ప్రయోగింపబడుతుంది. నన్నయ షష్ఠిని ప్రయోగించాడు.

### 13.2.7 మధ్య యుగం

దీనినే పురాణ ప్రబంధయుగం అని కూడ పండితులు వ్యవహరించారు. 1100 నుండి 1600 వరకు ఈ భాషా యుగం పరిగణింపబడింది. నన్నయ నెలకొల్పిన భాషయే తరువాతి కవులకు పరమ ప్రామాణికం అయింది.

1. లేఖన పద్ధతులు - ఎ. రేఫ మీద హల్లును ద్విరుక్తంగా వ్రాయటం. రేఫకు బదులు వలపలగిలక గుర్తును ఉపయోగించటం ఈ కాలంలో అధికంగానే కన్పిస్తుంది. ఉదా. ఇర్ద్దఱు (13వ శతాబ్దం), కర్త్తృ - (కఱుత).

బి. రేఫ సాంకర్యం చేసి సాధు, శకట రేఫలకు అభేదాన్ని పాటించి యతి, ప్రాసల స్థానాల్లో మైత్రిని పాటించారు.

సి. మూర్ధన్య హల్లులపైన దంతమూలీయాలను ప్రయోగించినా వాటి ఉచ్చారణ మూర్ధన్యమే. ఉదా - పుట్లు, అంగళ్లు, వైష్ణవ.

డి. వర్గ పంచమాక్షరాలకు బదులు అనుస్వారం వ్రాసే విధానం ఈ యుగం ప్రారంభం నాటికే పూర్తిగా స్థిరపడింది. ఉదా. గుండ్డాబత్తుని (15 శ.), అంత్త (16 శ.), అర్థానుస్వారానికి ప్రత్యేక చిహ్నం శాసనాలలో లేదు. పూర్ణానుస్వార చిహ్నాన్నే వ్రాసే వారు. అటువంటి సందర్భాలలో హల్లును ద్విరుక్తంగా వ్రాసే వారు కాదు. ఉదా. మీంది.

ఇ. పదాదిలో తాలవ్యాచ్చులకు ముందు యకారాన్ని, ఓష్ఠ్యాచ్చులకు ముందు వకారాన్ని చేర్చేవారు. ఉదా. యేకాదశి (ఏకాదశి) వుభయం (ఉభయం).

యఫ్. ఐ/అయ్, ఔ/అవ్, ఉదా. వైశాఖ/వయిశాఖ (15వ శతాబ్ది)

2. <u>సంధులు</u> - రెండు స్వతంత్ర శబ్దాల మధ్య వచ్చే పదాంత సంధిని నాలుగు వర్గాలుగా విభజింపవచ్చు. (1) అచ్చు + అచ్చు, (2) అచ్చు + హలు, (3) హల్లు + అచ్చు, (4) హల్లు + హల్లు.

(1) ఎ. ఉత్వలోపం - ఉదా. యిట్లని (యిట్లు + అని) (16వ శతాబ్ది), కాపురమున్న (కాపురము + ఉన్న). కావ్యభాషలో ఉత్వసంధి నిత్యం. శాసన భాషలో సంధిలేని రూపాలు కూడ కనిపిస్తాయి. ఉదా. సెమ్మెళను, ఎవ్వండైన (12వ శ.), తేరుయెక్కి (16వ శ.).

బి. ఇత్వలోపం - ఉదా. మహాదేవైన (మహాదేవి + ఐన) (14వ శ.), యేమన్నను (యేమి + అన్నను) (15వ శ.), కావ్యభాషలో క్త్వార్థక ఇకారానికి సంధిలేదని వ్యాకరణాలు చెప్తున్నాయి. శాసన భాషలో ఇటువంటి సంధులను స్వేచ్ఛగా వాడటం జరిగింది. ఉదా. కట్టియ్యడం (కట్టి + ఇయ్యడం, 16వ శ.).

సి. అత్వలోపం - ఉదా. వేలేండ్లు (వేల + ఏండ్లు), 15వ శ.), మేనల్లుడు (మేన + అల్లుడు, 16వ శ.)

డి. యడాగమం - ఉదా. కల్గినయట్టి (క్రీ.శ. 1600), అచ్చుకి, అచ్చుకి మధ్య 'వ' చేరటం కూడ శాసనాలలో చూడవచ్చు. ఉదా. తిరువాభరణాలు (తిరు + ఆభరణాలు), 16 శ.). సంధిగాని, యడాగమంగాని లేని రూపాలు కూడ శాసనాల్లో కనిపిస్తాయి. ఉదా. రావి ఆకు (16 శ.).

ఇ. పరిమాణార్థకమైన ఎడ - ఏవార్థకం, ఆశ్చర్యార్థకం పరంగా ఉండేటప్పుడు సంధి నిత్యంగా కన్పిస్తుంది. ఉదా. పుట్టెడు (పుట్టి + ఎడు, 15 శ.), ఇవే (ఇవి + ఏ, 16 శ.).

(2) అచ్చు + హల్లు - అచ్చుకు కచతపలు పరంగా ఉన్నప్పుడు గసదవలు కావటం శాసనభాషలో వికల్పంగా కన్పిస్తుంది. ఉదా. రెండుగుంచములు (12 శ.), పెట్టినచేను (12 శ.).

(3) హల్లు + అచ్చు - కావ్య భాషకు సంబంధించినంత వరకు ద్రుత్ నకారం ఒకటే పదాంత హల్లు. కాబట్టి ద్రుత ప్రకృతిక సంధి కావ్య భాషలో మాత్రమే కన్పిస్తుంది. కావ్య భాషలో ద్రుత ప్రకృతికాలైన రూపాలు శాసన భాషలో 12వ శతాబ్ది నుండి కళలు గానే ప్రవర్తించటం చూడవచ్చు. ఉదా. వీనిసేకొని (12వ శ.), పుష్పాలకు యిచ్చిన (14వ శ.), 15వ శతాబ్ది నాటికి పదాంత నకారం శాసన భాషలో పూర్తిగా లోపించింది.

(4) హల్లు + హల్లు - ద్రుత నకారానికి కచటతపలు పరమైనప్పుడు గజడదబలు రావటం కావ్య భాషలో కన్పిస్తుంది. శాసనాల్లో కూడ కావ్య భాషను ఉపయోగించిన చోట మాత్రమే ఈ సంధి కన్పిస్తుంది. ఉదా. క్రిందను బెట్టిన (12 శ.) పరలోకాని కింజనితేని (13 శ.).

3. <u>వాక్యనిర్మాణం</u> - ఈ కాలపు భాషలోని వాక్యాలను సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలని 3 విధాలుగా విభజింప వచ్చును.



ఎ. నామసమాపక వాక్యాలు - ఆఖ్యాతంలో నామం ఉంటే నామసమాపక వాక్యం. ఉదా. రామయ్య ముత్తతాత (16వ శ.)

బి. క్రియాసమాపక వాక్యాలు - ఆఖ్యాతంలో క్రియ ఉంటే క్రియా సమాపక వాక్యం అవుతుంది. ఇవి అకర్మక, సకర్మక వాక్యాలని రెండు రకాలు. ఉదా. వర్తకులు ...... ఉండిరి. (17 శ.). క్రియాసమాపక వాక్యాలలోనే విధ్యాద్యర్థక వాక్యాలుంటాయి.

| | | |
|---|---|---|
| విధి | .. | కంభం వేయించ్చుము (16 శ.) |
| ఆశ్చర్యార్థక | .. | ఏ నోము నోచెనో (16 శ.) |
| వ్యతిరేక | .. | ఉండు/ఉన్ ధాతువు వ్యతిరేక రూపమైన 'లేదు' చేర్చటం వల్ల వ్యతిరేక వాక్యాలు ఏర్పడుతున్నాయి. |
| | | ఉదా. యిక్కడ సుంకం . ...... లేదు (క్రీ.శ. 1600) |
| నిషేధ | .. | మరియెక్కుడు కానరాదు (16 శ.) |

పై వాక్యాలన్ని శాసన భాషకు, కావ్య భాషకు సమానమే.

సి. సంశ్లిష్ట వాక్యాలు - అసమాపక క్రియతో అంతం అయ్యే ఒకటిగాని కొన్ని గాని ఉపవాక్యాలతో కూడిన సామాన్య వాక్యాలు సంశ్లిష్ట వాక్యాలు. యత్తధర్థక కావ్యాల్లో, అనుకృతి వాక్యాల్లో మాత్రం ఉపవాక్యంలో కూడ సమాపక క్రియ ఉండవచ్చు.

క్త్వార్థకం - మల్కావౌడయలుంగారున్ను క్రిష్ణ దాంటి, విజయం చేసి, దుష్టనిగ్రహం చేసి, ఆజ్ఞలు చేసి (16 శ.)

శత్రర్థకం - ఉప వాక్యంలో శత్రర్థంలో ఉండే క్రియ ప్రధాన క్రియతో పాటు జరిగే వ్యాపారాన్ని సూచిస్తుంది. ఉదా. సామ్రాజ్యం చేస్తున్న ...... బెజవాడకు విచ్చేసి .... (16 శ.).

చేదర్థకం - ప్రధాన వాక్యంలో క్రియ బోధించే వ్యాపారం ఉపవాక్యంలోని వ్యాపారం మీద ఆధారపడి ఉన్నప్పుడు ఇటువంటి వాక్య నిర్మాణం జరుగుతుంది.

యత్తదర్థక వాక్యాలు - సంబంధ బోధకాలయిన యత్తదర్థక వాక్యాలు సంస్కృత భాషా ప్రభావం వలన కావ్య భాషలో ప్రవేశించాయి.

డి. సంయుక్త వాక్యాలు - సమ ప్రాధాన్యం గల రెండు గానీ, అంతకంటె ఎక్కువ గానీ సామాన్య వాక్యాల కలయిక వల్ల ఏర్పడేవి సంయుక్త వాక్యాలు. సముచ్చయార్థకం అయిన న్ని, ను అనే అక్షరాలు రెండు వాక్యాలను కలుపుతాయి.

### 13.2.8 ఆధునిక యుగం

తెలుగు భాషకు భిన్న కాలాల్లో భిన్న భాషలతో సంబంధ బాంధవ్యాలు ఏర్పడ్డాయి. ఆయా భాషల నుండి ఎంతో పదజాలం తెలుగు లోనికి వచ్చి భాషా వ్యక్తీకరణను సంపన్నం చేసింది. తెలుగునకు మొదటినుండి సంస్కృత ప్రాకృతాలతో సాంస్కృతిక సంబంధాలున్నాయి. అందువలన తెలుగులో తత్సమ, తద్భవ శబ్ద విభాగం అర్థవంతమైంది. దేశ్య శబ్దాల్లో లేని ఫ, భ, థ, ధ, ఠ, ఢ, ఛ, ఝ, ఖ, ఘ, అనే మహాప్రాణ వర్ణాలు ఞ, ఙ అనే అనునాసిక వర్ణాలు, శ, ష, హ అనే అంతస్థాలు సంస్కృత శబ్దాల ద్వారా తెలుగు లోనికి చేరినాయి. 'హ' కారం కన్నడ హిందూస్తానీ మాటల ద్వారా ప్రవేశించింది. ' f ' అనే వర్ణం మొదట ఫారసీ, ఉర్దూ భాషా పదాల ద్వారా ప్రవేశించి ఇంగ్లీషు భాషా పదాల ద్వారా నిలదొక్కుకుంది. ఇది దాదాపు అన్ని స్థాయిల వ్యవహర్తల

ఉచ్చారణలోనూ ప్రవేశించింది. దేశ్య శబ్దాల లోనికి కూడ ప్రవేశించింది. 'ఫలితం, కఫం' అనే పదాల్లో మూల 'ఫ' వర్ణాన్ని, 'నలభై, యాభై' పదాల్లో 'భ' వర్ణాన్ని ' f ' అనే దంతోష్ఠ్య ఊష్మంగా కొందరు ఉచ్చరిస్తున్నారు.

ఎ. సంధి - ప్రాచీన కావ్యభాషలో 'ఉ' కార సంధి నిత్యం. 'అ' కార సంధి బహుళం. 'ఇ' కార సంధి వికల్పం. ఆధునిక వ్యవహార భాషలో అన్ని అచ్చులకు ఉచ్చారణ వేగాన్ని అనుసరించి సంధి జరుగుతుంది. అచ్చు లోపం అచ్సంధిగాను, తత్పర్యవసానంగా హల్లుల్లో వచ్చే మార్పులను హల్సంధి గాను పరిగణించాలి.

1. దగ్గరగా వచ్చిన రెండు అచ్చుల్లో పూర్వ హ్రస్వాచ్చు లోపిస్తుంది. ఉదా. 1. ఆయన + ఎవరు - ఆయనెవరు, వారు + ఉన్నారు - వారున్నారు.

2. లోపించిన పర అచ్చు తాలవ్యం అయితే దానికి తాలవ్యత ప్రాప్తిస్తుంది. తాలవ్య భేదాలను సూచించటానికి తెలుగులో గుర్తులు లేవు. చెప్పి + ఉంటాడు, చెప్పి + ఒచ్చాడు, బండి + అంతా మొదలైనవి.

3. స్వరాది ప్రత్యయం పరమైనప్పుడు సంధికి వికల్పత లేదు. ఉదా. వాడు + ఏ - వాడే, మూర + ఎడు - మూరెడు, వచ్చింది + ఆ - వచ్చిందా.

4. రెండు హల్లుల మధ్య ఈ క్రింది పరిసరాలలో హ్రస్వాచ్చు లోపిస్తుంది. ఎ. పూర్వ హల్లు దంత్యమై పరహల్లు చ, జ లు అయినప్పుడు. ఉదా. చేప + పిల్ల - చేప్పిల్ల, నోటి + లో - నోట్లో, వాడి + ని - వాణ్ణి, పాత + చింతకాయ - పాచ్చింతకాయ.

5. స్వరలోపానంతరం హల్లుల్లో కొన్ని సమీకరణలు జరుగుతాయి. ఎ. మూర్ధన్యీకరణ, మూర్ధన్య వర్ణానికి పూర్వ పదాల్లో ఎక్కడ వచ్చినా ల, న లు మూర్ధన్యత్వాన్ని పొందుతాయి.

బి. అన్యోన్య సమీకరణ. డ + ల - ళ్ళ, డ + న - ణ్ణ. వ్యాకరణ కార్యం వలన కాక తొలి నుండి అద్విరుక్తమైన 'డ' వర్ణం ఉన్నప్పుడు ఈ సమీకరణ జరుగుతుంది.

6. ద్విరుక్త హల్లు ఇంకో హల్లు ముందు అద్విరుక్తం అవుతుంది. బహువచనాది ప్రత్యయాలు చేరినప్పుడు స్వరలోపం వలన ఈ రకం పరిసరం ఏర్పడుతుంది.
ఉదా. చెట్టు + లు - చెట్లు, గుడ్డు + లు - గుడ్లు, తొట్టి + లో - తొట్లో.

బి. వాక్య నిర్మాణం - ప్రపంచ భాషలు అన్నింటి మధ్య వాక్య నిర్మాణంలో పోలికలు ఎక్కువగా కన్పిస్తాయి. దీనికి కారణం మానవ మేధా నిర్మాణంలోనే ఉండవచ్చు. అంటే మానవజాతి ఒక జాతిగా పరిణామం చెందేటప్పుడు పరిణామావసరాలూ, నియమాలూ బట్టి ఏర్పడ్డ మానవ మేధా నిర్మాణం వల్ల ఆలోచనల్లో సామ్యం ఉండటం సహజం. అందువలన భాషా యంత్రాంగంలో కూడ సామ్యాలుండటం ఆశ్చర్యం కాదు.

క్రియ లేని వాక్యాలు - అన్ని భాషలకు లాగే తెలుగులో కూడ సమీకరణ వాక్యాలుగా శాస్త్రజ్ఞులు పిలిచే వాక్యాలు ఉన్నాయి. ఈ రకం వాక్యాలను రెండు భాగాలుగా విడదీయవచ్చు. అందుకే వీటిని ద్విదళ వాక్యాలని వ్యవహరిస్తారు. ఈ రకం వాక్యాల్లో మొదటి దళం నామబంధం అయి ఉంటుంది. రెండో దళం విశేషణం గానీ, నామబంధం గాని కావచ్చు. తెలుగు సమీకరణ వాక్యాలలో రెండో దళం సాధారణంగా నామబంధమే ఉంటుంది.

ఉదా. ఎ. ఆయన డాక్టరు గారు, బి. ఆమె టీచరు.
సి. ఆ డాక్టరు మంచివాడు, డి. ఆ టీచరు మంచిది.

పై వాక్యాల్లో ఎ, బి లలో రెండో దళం స్వతహాగా నామబంధం. సి, డి లలో విశేషణం నామబంధంగా మార్చబడింది.

తెలుగులో ద్విదళ వాక్యాలు క్రియా సహిత వాక్యాల నుండి కూడ నిష్పన్నమవుతాయి. క్రియా సహిత వాక్యాల్లో క్రియను నామ్నీకరించి వాక్యంలో ఏదయినా ఒక పదాన్ని క్రియను తరువాతి స్థానానికి జరపటం ద్వారా ఈ వాక్యాలు ఏర్పడతాయి.

ఉదా. ఆయన నిన్న బెజవాడ నుంచి వచ్చాడు.
ఆయన బెజవాడ నుంచి వచ్చింది నిన్న.
ఆయన నిన్న వచ్చింది బెజవాడ నుంచి.
నిన్న బెజవాడ నుంచి వచ్చింది ఆయన.

క్రియా వాక్యాల్లో క్రియేతర శబ్దానికి ప్రాధాన్య వివక్ష కోసం ఈ పద్ధతి ఉపయోగిస్తుంది.

క్రియా సహిత వాక్యాలు - క్రియా సహిత సామాన్య వాక్యాలలో క్రియ వాక్యాంతంలో వస్తుంది. వాక్యంలో ప్రవర్తించే భేదాలను బట్టి క్రియలను ఎన్నో రకాలుగా విభజింపవచ్చు. స్థితి, గతి, వ్యాపార, జ్ఞాన మొదలైన రకాలు విభజించటం ఒక పద్ధతి. వాక్యంలో కర్త, కర్మ, క్రియలతో పాటు రకరకాల కాల, దేశ బోధక అవ్యయాలు విభక్తి బంధాలు ఉంటాయి. కర్త వాక్యంలో సాధారణంగా ముందు వస్తుంది. క్రియ చివర వస్తుంది. ప్రత్యేకమైన ప్రాధాన్యాన్ని చెప్పవలసి వచ్చినప్పుడు ఆ పదాన్ని క్రియా పదానికి సన్నిహితంగా జరపటం ఒక పద్ధతి.

ఉదా. నేను మొన్న కాలేజీలో సుజాతకు ఇంగ్లీషు పుస్తకం ఇచ్చాను.
నేను మొన్న కాలేజీలో ఇంగ్లీషు పుస్తకం సుజాతకు ఇచ్చాను.
నేను మొన్న సుజాతకు ఇంగ్లీషు పుస్తకం కాలేజీలో ఇచ్చాను.
నేను కాలేజీలో సుజాతకు ఇంగ్లీషు పుస్తకం మొన్న ఇచ్చాను.
మొన్న కాలేజీలో సుజాతకు ఇంగ్లీషు పుస్తకం ఇచ్చాను.

అనుకృతి - భావ వ్యక్తీకరణను భాషలో అనుకరించటాన్ని అనుకృతి లేక అనుకరణం అంటారు. అనుకృతిలో వక్తృశ్రోతలు వేరువేరుగా ఉండవచ్చు. ఒకరే కావచ్చు. అనుకృతి ప్రత్యక్ష, పరోక్ష విధానాలలో ఉంటుంది.

ప్రత్యక్షానుకరణ శబ్ద ప్రధానమైనది. పరోక్షానుకృతిలో భాషానియమం ఉంది. ఈ పద్ధతిలో భావం ప్రధానం.

ఉదా.
1. నువ్వు నాతో 'నేను వస్తాను' అన్నావు. - నువ్వు నాతో నువ్వు 'వస్తాను' అన్నావు.
2. అతను నాతో 'నేను వెళ్తున్నాను' అన్నాడు. - అతను నాతో తను వెళ్తున్నాను అన్నాడు.
3. నేను ఆమెతో 'నువ్వు వస్తున్నావు' అన్నాను. - నేను ఆమెతో తను వస్తున్నది అన్నాను.

పై వాక్యాలను పరిశీలిస్తే కొన్ని విషయాలు తెలియ వస్తున్నాయి. 'అను' శబ్దానికి క్రియా అవ్యవహిత యోగంలో వికల్పంగా లోపం వస్తుంది. 'అని' శబ్దం ప్రత్యక్ష, పరోక్షాను కృతులు రెండిటిలోనూ ఉండవచ్చు. 'తను' శబ్దాదేశం అనుకృతాంశంలో ఉత్తమ, మధ్యమ పురుషలకు రెండింటికి వస్తుంది.

ఈ విధంగా అను కృతి వాక్యాలలో కూడ ఎంతో వైవిధ్యం ఆధునిక తెలుగు భాషలో కన్పిస్తుంది.

వాక్యంలో వ్యక్తమైన విషయానికి వక్త పూచీ ఏమీ లేదని సూచించే శబ్దం ఒకటి తెలుగులో ఉంది. అది అంట, అలు, ట అనే రూప భేదాలతో ఉంది. దీని పూర్వ రూపం 'అనుట' అయి ఉండాలి. వాక్యంలో ఉత్తమ పురుష, మధ్యమ పురుషలున్నప్పుడు

ఇది స్పష్టంగా అనుకృతియే.

ఎ. నేను ఆమెను అవమానించానట.

బి. నువ్వు ఆఫీసులో నిద్రపోతావట.

ఈ వాక్యాల్లో 'అట'కు ఎవరో అన్నారని అర్థం.

తెలుగు భాష అన్ని యుగాలలోను ఇంతటి వైవిధ్య భరితమైన విధానాలతో క్రమక్రమంగా సుస్థిరతను సాధించుకుంది.

## 13.3 సమీక్ష

ఈ పాఠంలో ఆంధ్రము, తెనుగు, తెలుగు పదాల గురించి తెలుసుకున్నారు. తెలుగు, తెనుగు పదస్వరూపాల గురించి తెలుసుకున్నారు. తెలుగు భాష - యుగవిభజన ఎలా చేయాలో నేర్చుకున్నారు. ఆ యా యుగాల్లో భాషా లక్షణాలను తెలుసుకున్నారు.

## 13.4 ప్రశ్నలు

1. 'ఆంధ్రము' అనే పదం వ్యుత్పత్తి వికాసాలను గురించి వ్రాయండి.
2. తెనుగు - తెలుగు శబ్దాల చరిత్రను తెలపండి.
3. ఆంధ్రము - తెనుగు - తెలుగు పదాల చరిత్ర వ్యాప్తిని గురించి వివరించండి.
4. తెలుగు భాష - యుగ విభజనను గురించి వ్రాయండి.
5. వివిధ భాషా యుగాలలో తెలుగు భాష స్వరూప స్వభావాల మార్పును వివరించండి.

## 13.5 ఆధార గ్రంథాలు


1. విజ్ఞాన సర్వస్వం తెలుగు సంస్కృతి - మొదటి సంపుటం.
2. తెలుగు భాషా చరిత్ర - ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి.
3. తెలుగు భాషా చరిత్ర - స్ఫూర్తిశ్రీ టి. భాస్కరరావు.



**డాక్టర్ వి. నాగ రాజ్యలక్ష్మి**

ఎం.ఏ.(తె), ఎం.ఏ.(సం), పిహెచ్.డి.

రీడర్

ప్రభుత్వ మహిళా కళాశాల

గుంటూరు

# పాఠం - 14

# తెలుగులి ి - రిణామం

పాఠ్యనిర్మాణక్రమం


14.0 లక్ష్యం

14.1 తెలుగులిపి - పరిణామం

14.1.1 ఉద్దేశం

14.1.2 పాఠ పరిచయం

14.1.3 హైరోగ్లిఫిక్ లిపి

14.1.4 క్యూనిఫారం లిపి

14.1.5 క్రీటు లిపి

14.1.6 సెమెటిక్ లిపి

14.1.7 ఫోనీషియన్ లిపి

14.1.8 భారతీయ లిపి

14.1.9 తెలుగులిపి క్రమ పరిణామం

14.1.10 తెలుగులిపి - కొన్ని పరిణామాలు

14.1.11 ఉపసంహారం

14.2. ద్రావిడ భాషలు - తెలుగు స్థానం

14.2.1 ఉద్దేశం

14.2.2 పాఠ పరిచయం

14.2.3 ద్రావిడ భాషలు - వర్గీకరణ

14.2.4 దక్షిణ ద్రావిడ భాషలు

14.2.5 మధ్య ద్రావిడ భాషలు

14.2.6 ఉత్తర ద్రావిడ భాషలు

14.2.7 ద్రావిడ భాషలలో తెలుగు స్థానం

14.2.8 ఉపసంహారం

14.3 సమీక్ష

14.4 ప్రశ్నలు

14.5 ఆధార గ్రంథాలు


## 14.0 లక్ష్యం

వివిధ లిపి భేదాలను తెలియజేయడం - తెలుగు లిపి క్రమ పరిణామాన్ని తెలియజేయడంతో పాటు, ద్రావిడ భాషల

గురించి, ద్రావిడ భాషలలో తెలుగు స్థానాన్ని నిర్ణయించడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## 14.1 తెలుగులిపి - పరిణామం

### 14.1.1 ఉద్దేశం

ఏ భాష అయినా ఉత్తమ పరిణతినంది సాహిత్య స్థాయిని పొందటానికి మూలాధారం ఆ భాష యొక్క లిపి. భాష యొక్క లిపి ఆ భాషా వ్యవహర్తల సంస్కృతిని, నాగరికతను తెలియచేసేటటువంటి ప్రముఖ సాధనం. అత్యున్నతమైన సాహిత్య స్థాయి కలిగిన తెలుగు భాష లిపికి మూలాధారమైన లిపి, దాని ప్రామాణికతలను వివరించి తెలుగు లిపి యొక్క వికాసాన్ని గురించి వివరించటం ఈ పాఠం యొక్క ఉద్దేశం.

### 14.1.2 పాఠం పరిచయం

భాష ధ్వని రూపంలో వ్యక్తం అవుతుంది. ఆ ధ్వనులకు నిర్ణయింపబడిన గుర్తులే అక్షర సమామ్నాయం. అక్షరం అంటే క్షరం కానిది. నశించనిది. వాక్కులు, ధ్వనులు సమకాలికులకు సన్నిహితులకు మాత్రమే అన్వయించును. కాని దూరస్థులకు, కాలాంతరాలలో నివసించే వారికి మన భావాలను తెలియచేయటానికి రూపొందింపబడిన సంకేతాలను, వాటినుండి క్రమంగా రూపుదిద్దుకున్న అక్షర సమామ్నాయంతో కూడుకున్నట్టి దానిని లిపి అని వ్యవహరించారు. ఈ లిపులను 5 విధాలుగా లిపి విశేషజ్ఞులు విభజించారు.

### 14.1.3 హైరోగ్లిఫిక్ లిపి

ఈజిప్టులో వాడుకను పొంది ఉండటం చేత దీనికి ఈజిప్షియను లిపి అనే పేరు కూడ ఏర్పడింది. బొమ్మల రూపంలో ఉన్న ఈ లిపి సుమారు 5000 సం॥రాలకు పూర్వం నుండి ఉన్నటువంటిది.

### 14.1.4 క్యూనిఫారం లిపి

బాణాలు మొనదేలినట్లుండే గుర్తులతో వ్రాయబడటం చేత దీనికి 'బాణలిపి' అని కూడ వ్యవహారం ఉంది. ఇది పారశీక దేశంలో ప్రసిద్ధి పొందింది. ఈ గుర్తులనే అరబ్బులు మేకులు అనుకోవటంచేత దీనికి కీల లిపి అనే పేరు పెట్టబడింది.

### 14.1.5 క్రీటు లిపి

క్రీటు ద్వీపంలో వ్యవహారంలో ఉండటం చేత దీనికీ పేరు వచ్చింది. ఇది ఇప్పటికి 4000 సం॥రాలకు పూర్వం నాటిదిగా ఊహింపబడింది.

### 14.1.6 సెమటిక్ లిపి

ఈజిప్షియను లిపిలోని బొమ్మల రీతినే గ్రహించి వారికి శత్రువులైన 'సెమ్' జాతీయులు ఈ లిపిని కనిపెట్టారు. వీరు ప్రాచీన చిత్రలిపి నుండి 20 సంజ్ఞలను తీసికొని, వ్రాతకు అనుగుణంగా అక్షరలిపిగా మార్చుకున్నారు. ఇది ఇప్పటికి 3000 సంవత్సరాల నాటిదని అభిజ్ఞుల నిర్ణయం.

### 14.1.7 ఫొనీషియన్ లిపి

సిరియా దేశపు సముద్రతీర భాగమే ఫొనీషియా. వీరు నిరంతరం వర్తక, వ్యాపారాలలో మునిగి తేలుతూ సెమెటిక్ లిపినే మరికొంత సులభతరంగా రూపొందించి ఈ లిపిగా ఏర్పాటుచేశారు.

పాశ్చాత్యుల దృష్టిలో భారతదేశంలోని లిపులు కూడ పాశ్చాత్య దేశాలలో ఆవిర్భవించినట్టివే. 'సెమెటిక్' జాతీయులలో 'అక్కాడియనులు' అనే ఒక తెగవారున్నారని వారి వలననే అక్షర లేఖనం వ్యాప్తినందినదని, 'అక్కడ్' అనే పదానికి సంస్కృతీకరణమే అక్షరం అని కొందరి అభిప్రాయం.

### 14.1.8 భారతీయ లిపి

1. భారతీయ ప్రాచీన తమ సాహిత్యం అయిన ఋగ్వేదం (1-164-24) లోను, యజుర్వేద భాగమైన తైత్తిరీయ సంహిత లోను ఉన్న అక్షర చర్చను బట్టి, శతపథ బ్రాహ్మణంలో ఉన్న అక్షరవర్ణ చర్చను బట్టి, పంచవింశ బ్రాహ్మణంలో ఉన్న గణన విధానాన్ని బట్టి, శతపథ బ్రాహ్మణంలోని సమయ చర్చను బట్టి మనకు లేఖన పద్ధతి ఉండి ఉండవచ్చునని పేర్కొనటానికి అవకాశం ఉంది.

2. క్రీ.పూ. 8వ శతాబ్దివాడైన పాణిని అష్టాధ్యాయి (4-1-49, 1-3-75, 1-3-87, 4-3-116) లో లిపి, లిపికర శబ్దాలను, యవనాని అనే లిపి విశేషాన్ని పేర్కొని ఉన్నాడు.

3. క్రీ.పూ. 4వ శతాబ్దివాడని విశ్వసింపబడే కౌటిల్యుడు రచించిన 'అర్థశాస్త్రం'లో రాజకుమారులు చౌలవిధి తరువాత లిపి, సంఖ్యాగణనం అభ్యసించాలని పేర్కొన్నాడు.

ఈ రెండు దృష్టాంతాలను బట్టి మనకు లిపి ప్రాచీన కాలం నుండే ఉన్నట్లు స్పష్టమవుతుంది.

4. వైదిక సాహిత్యంలోనే కాక జైన, బౌద్ధ సాహిత్యాలలో కూడ లిపి ప్రస్తావనలు కోకొల్లలుగా కన్పిస్తున్నాయి.

5. క్రీస్తు పూర్వం 300 ఏళ్ళ నాటి జైనుల సమవాయాంగణ సుత్తంలో 18 లిపులు, మహాయాన బౌద్ధుల ప్రథమ ప్రమాణ గ్రంథమైన లలిత విస్తరంలో 64 లిపులు ఉదాహృతాలు. బుద్ధునికి పూర్వం నుండే తమిళ సంగం సాహిత్యంలో లేఖన సంప్రదాయం ఉన్నట్లు శ్రీ టి.వి. మహాలింగం తెలిపారు.

6. ఇటీవల పురాతత్త్వ శాస్త్రజ్ఞులు శ్రీ ఐ. కార్తికేయశర్మ అమరావతిలో జరిపిన త్రవ్వకాలలో వెలువడిన ప్రాచీన శాసనాన్ని బట్టి తెలుగు దేశంలో లిపి అశోకుని ముందునుండే ఉన్నట్లు స్పష్టం అవుతుంది. ఈ శాసనం లిపి అశోకుని శాసనాల లిపితో సన్నిహితంగా ఉంది. దీనినే బ్రాహ్మిలిపి అని వ్యవహరించారు.

సంస్కృత భాషలో 'లింపతి' అంటే పూయుచున్నది' అని అర్థం. వర్ణాలను పూత పూయటం ఆధారంగా చేసేకొని దీని నుండి 'లిపి' అనే పదం రూపుదిద్దుకుంది.

"This Brahmi alphabet was believed to have been created out of the semetic (phoenician) system of writing by Indian merchants. Several hundred years before Christ. One recent view, however is that it was derived, probably in the 10th century B.C. from the pre-Aryan Script as used at Mohen-Jo-Daro and Harappa and other ancient pre-Aryan cities in Punjab, Sindh and other areas and was adopted for the needs of the Aryan Language (Vedic Sanskrit)". - సునీతి కుమార చటర్జీ

దీనిని బట్టి ఆర్యులకు పూర్వమే భారతదేశంలో లిపి ఉన్నదని, అది వేదం కంటే ప్రాచీన తరం అని విశ్వసింప వలసి ఉంది. ఆ లిపియే బ్రాహ్మీలిపిగా పరిణమించి భారతీయ భాషల లిపులకు మూలమైంది.

ఆంధ్ర దేశంలో అమరావతి శాసనాలు కాక, భట్టిప్రోలులో ఒక స్తూపంలో స్తూపస్థాపకుల పేర్లున్న మూడు కరండకాలు, రాతి బరిణలు దొరికాయి. వీటి మీది లిపికి అశోక లిపికి పోలికలు ఉన్నప్పటికి ఘ, చ, ద, ధ, మ, ల, శ, ష అక్షరాలు భిన్నంగా కన్పిస్తున్నాయి. దీనిని ద్రావిడ బ్రాహ్మీ లిపి అని, ఇది క్రీస్తు పూర్వం 3 శతాబ్దాల నాడే విడిపోయి ఉంటుందని 'బ్యూలర్' అనే భాషా శాస్త్రవేత్త అభిప్రాయపడ్డారు.

**14.1.9 తెలుగు లిపి క్రమ పరిణామం**

1. దక్షిణ బ్రాహ్మీలిపి నుండే తెలుగు లిపి ఆవిర్భవించింది. మన దేశాన్ని అనేక రాజవంశాల వారు పరిపాలించారు. వీరు ప్రాకృత, సంస్కృతాంధ్ర భాషలలో తమ శాసనాలను రూపొందించి బ్రాహ్మీలిపిని ఉపయోగించారు. అది అనేక భేదాలతో కానవస్తూ ఉండటం వలన లిపి ప్రవీణులు దానిని ఆంధ్రలిపి, ఇక్ష్వాకులిపి, పల్లవలిపి, వేంగీలిపి, చాళుక్యలిపి అని వ్యవహరించారు. దీనికి కారణం ఆయా రాజుల కాలంలో ఏర్పడిన పరిణామాలు. ఈ పరిణామాలలో ప్రధాన ఘట్టం ఇక్ష్వాకుల కాలం.

2. వీరి తరువాత శాలంకాయనులు వేంగీ నగరాన్ని రాజధానిగా చేసికొని తెలుగు ప్రాంతాన్ని పరిపాలించారు. వీరి కాలంలో బ్రాహ్మీలిపిలో కొన్ని మార్పులు చోటు చేసికొన్నాయి. శాలంకాయనుల తరువాత విష్ణుకుండినులు తెలుగు దేశాన్ని పరిపాలించారు. ఇది లిపి పరిణామంలో మరొక ఘట్టం. ఈ కాలపు లిపిని వేంగీ లిపి అన్నారు. ఇది దక్షిణాపథం అంతటా వ్యాపించింది. ఇది తెలుగు, కన్నడ లిపికి పూర్వ రూపం.

3. విష్ణుకుండినుల కాలంలో లిపిలో చెప్పుకోదగిన మార్పువచ్చింది. శాలంకాయనుల కాలంలో కొన్ని అక్షరాలపై కనిపించిన చిన్న అడ్డగీత విష్ణుకుండినుల కాలంలో దాదాపు అన్ని అక్షరాలపైనా కనిపించింది. అప్పటి తెలుగు భాషలో ఉండి, తరువాత అదృశ్యం అయిపోయి నేడు తమిళ భాషలో మాత్రం మిగిలిన 'ఴ' అనే వింత అక్షరం విష్ణుకుండినుల కాలంలో కానవచ్చింది. ఇది నన్నయ కాలం వరకు వ్యవహారంలో ఉంది. (అహదనకర శాసనం). దీని ఉచ్చారణ క్రమంగా తెలుగులో డ, ర లుగా మారింది. విష్ణుకుండినుల శాసనాలలోని అక్షరాలపై నున్న అడ్డగీత క్రమంగా పొడవై, వంకరై నేటి తలకట్టుగా స్థిరపడింది.

4. విష్ణుకుండినుల తరువాత తెలుగుదేశాన్ని క్రీ.శ. 7వ శతాబ్దిలో చాళుక్యులు ఆక్రమించుకున్నారు. వీరి కాలంలో శాసనాలు తెలుగు భాషలో వెలువడ్డాయి. ఈ చాళుక్య రాజులు వేయించిన శాసనాలలో ప్రాచీన తమమైనది కుబ్జవిష్ణువర్ధనునిది. దీని కాలం క్రీ.శ. 622. ఈ కాలపు లిపిని వేంగీ చాళుక్య లిపి అని వ్యవహరించారు. దీనిని తెలుగు-కన్నడ లిపి అనవచ్చు. ఈ లిపి మార్పులు చెందుతూ 10వ శతాబ్ది నాటికి సంపూర్ణంగా వికసించి ఆధునిక తెలుగు-కన్నడ లిపిగా పరిణమించింది.

5. పశ్చిమాంధ్ర ప్రాంతాన్ని తెలుగు చోళులు పరిపాలించారు. వీరు తమ శాసనాలను వేంగీ చాళుక్య లిపిలో వేయించారు. వీరిలో రేనాటి చోళరాజయిన ఎరికల్ ముత్తరాజు శాసనం కడప జిల్లా కమలాపురం తాలుకా ఎర్రగుడిపాడు గ్రామంలో చెన్నకేశవస్వామి దేవాలయం సమీపంలోని రాతిపై చెక్కబడింది. ఇది క్రీ.శ. 575 సంవత్సరం నాటిది. మనకు లభించిన మొట్టమొదటి తెలుగు శాసనం ఇదే. అనంతరం సత్యాశ్రయుడనే రేనాటి చోడరాజు శాసనం కడప జిల్లా పొట్లదుర్తి - మాలెపాడు గ్రామంలో లభించింది. ఇది లభించిన ప్రాచీన శాసనాలలో రెండవది.

6. నన్నయభట్టు ఈ వేంగీ - చాళుక్య లిపినే భారత రచనకు శాసన రచనకు ఉపయోగించాడు. నాటినుండి ఈ లిపిలో క్రమంగా మార్పులు చోటు చేసికొన్నాయి. తరువాత 200 సంవత్సరాలకు కన్నడ - తెలుగు లిపులను రెండుగా విడివడ్డాయి.

అంతవరకు ఈ లిపి రాజమహేంద్రవరం నుండి పశ్చిమ సముద్ర తీరం వరకు వ్యాప్తిలో ఉండేది. దీనిని స్పష్టంగా తెలుగులిపి అని గాని, కన్నడ లిపి అని గాని పేర్కొనలేము. క్రమంగా తెలుగు మరీ గుండ్రంగా పరిణితి చెందింది. కన్నడ లిపి కోణాకారం అయింది. ఈ చాళుక్య లిపికి 11, 12 శతాబ్దాల నుండి పరివర్తన కాలం అని, దీనిని సంధి కాలం అని బర్నెల్ పేర్కొన్నాడు. ఈ లిపి పరిణామాన్ని ఈ క్రింది సూచించిన విధంగా పేర్కొనవచ్చు.




**14.1.10 తెలుగులిపి - కొన్ని పరిణామాలు**

1. సంధికాలంలో లిపిలో అనేక పరిణామాలు చోటుచేసికొన్నాయి. చకారానికి తలకట్టు వచ్చి ఎడమ భాగం గుండ్రనైంది. హల్లులకు సాధారణంగా తలకట్లు వచ్చాయి. ఠ, థ, ధ మొదలైనవి.

2. అనుస్వారం పూర్వ కాలంలో బిందురూపంలో, అక్షరం పైభాగంలో గాని, ఎగువ కుడిభాగంలో గాని పెట్టే అలవాటుండేది. క్రమంగా అది మారి అక్షరం పక్కన సపంక్తిలో పెట్టటం ప్రారంభమైంది.

3. మహాప్రాణాక్షరాలకు ఒత్తులు - పొల్లులు ఏర్పడ్డాయి.

4. రెడ్డి రాజుల కాలానికి - శ్రీనాధుని కాలానికి తెలుగులిపి పూర్తిస్థాయిని సంతరించుకొంది. నేటి తెలుగులిపికి సన్నిహిత దశ ఏర్పడింది.

5. చ, జలకు (ts) (ds) అనే దంత్యోచ్చారణ ఉంది. దీనిని సూచించటానికి చ, జలపై ' ౨ ' అనే గుర్తు ప్రాచీన కాలంలో కన్పించేది. వీటిని వైయాకరణులు దంత్య చ జ ల ని పేర్కొన్నారు.

6. తెలుగులో అరసున్న ఒక ప్రత్యేకత కలిగినట్టిది. ఇది వ్రాతలో 16వ శతాబ్దికి పూర్వం కన్పింపలేదు. క్రీ.శ. 12వ శతాబ్ది నాటిదిగా చెప్పబడే 'అధర్వణ కారికావళి' లో "పూర్ణేందు సదృశః పూర్ణః అర్థస్త్వర్థేందు సన్నిభః" అని పూర్ణార్థ బిందువులు సూత్రీకరింప బడ్డాయి.

కాని సమకాలిక శాసనాలలో గాని, అంతకు పూర్వపు శాసనాలలో గాని అరసున్న కానరాదు. ఆ కాలంలో పదమధ్యాను నాసికాలను అవసరం అయితే ఊది పలకటం, అవసరం కాకపోతే తేల్చి పలకటం ఉండేది. వ్రాయటం మాత్రం అనునాసిక మధ్యమైన దానిని ద్విత్వాక్షరంగా వ్రాసేవారు. 'నేణ్టి - కూన్తుఱు' ఇట్టివి.

అనునాసికాలకు అనుస్వారం వ్రాయటం ప్రాకృత భాషా ప్రభావాన్ని బట్టి అలవాటయింది. దీనివలన అనునాసికంతో కూడిన సంస్కృత పదోచ్చారణలో చిక్కు ఏర్పడలేదు గాని తెలుగు పదాల ఉచ్చారణలో ఇబ్బంది ఏర్పడింది.

'రాముండ్డు' అనే పదాన్ని ఒత్తి పలకటం. 'రాముండు' అనే పదాన్ని తేల్చి పలకటం ప్రారంభించారు. ఇది నేటి తమిళనాడులో ఉన్న తెలుగువారి ఉచ్చారణలో ఇప్పటికీ వినిపిస్తుంది. పేండ, వాండు - ఇత్యాదులు ఇటువంటివే.

అనునాసికాలకు అనుస్వారం అలవాటయిన తరువాత కొన్ని పదాలను తేల్చి పలకటం కోసం అర్థబిందువును వైయాకరణులు ఏర్పరచారు. ఇది కూడ క్రమంగా వ్యవహారంలో నుండి లోపించింది.

**ఎ. గుణింతాలు - కొన్ని పరిణామాలు**

1. అకారం, అకార దీర్ఘం సూచింపబడటానికి చిన్న అడ్డుగీత పెట్టటం అశోకుని భట్టిప్రోలు శాసన కాలం నుండి ఉంది. ఈ అడ్డుగీత అక్షరం కుడిపై చివర పెట్టేవారు. తరువాత అది అక్షరంపైన అడ్డుగీతగా మారి శ్రీనాథుని కాలానికే కుడి కొస వంగి సుడి దేరింది. విజయనగర కాలంలో ఇది మరింత చిన్నదై స్థిరపడింది.

2. 'ఇ' గుణింతానికి ఆకారం సూచించే అడ్డగీత మీద చిన్న నిలువు గీత పెట్టటం అశోకుని శాసనాలలో కన్పిస్తుంది. ఇది శాతవాహనుల కాలానికి తురాయి లాగా లేచి, చాళుక్య లిపిలో తురాయి కొస కుడివైపుకు వంగి, నున్నగా మారింది. శ్రీనాథుని కాలానికి పెద్ద కమానులాగా అయి, విజయనగర కాలానికి కమాను కుడికొన లోపలి సుడితిరిగి నేటి గుడికి (ి) మూలం అయింది.

ఈ గుణింతాన్ని సూచించటానికి పైన 2 నిలువు గీతలు పెట్టేవారు. ఈ 2 నిలువు గీతలు క్రమంగా వర్తులాకృతి దాల్చి ఎడమ వైపునకు సుడి తిరిగి విజయనగర కాలానికి నేటి రూపానికి సమీపంగా రూపుదిద్దుకుంది.

3. ఉ గుణింతాన్ని సూచించటానికి అశోకుని భట్టిప్రోలు శాసనాలలో అక్షరం కింద అడ్డుగీతకాని, నిలువు గీతకాని కన్పిస్తుంది. ఈ అడ్డుగీత నన్నయ కాలానికి అక్షరం కుడి ప్రక్కన అంటుకొని ఉండటం కన్పిస్తుంది. ఇది శ్రీనాథుని కాలానికి కొనపైకి వంగి పొడవయింది. విజయనగర కాలానికి ఇప్పటి రూపాన్ని సంతరించుకుంది.

ఊ గుణింతాన్ని తెలపటానికి అక్షరం అడుగున రెండు నిలువు గీతలు కన్పిస్తాయి. ఇవి భట్టిప్రోలు శాసనంలో హంసపాదుగా మారాయి. ఇక్ష్వాకుల కాలంలో కుడివైపునకు వాలాయి. ఇది క్రమంగా ప్రక్కకు ఒరిగినప్పుడు ఇంగ్లీషు 'S' అక్షరంలాగా మారి, విజయనగర కాలానికి కొమ్ము దీర్ఘంగా ఇప్పటి స్వరూపానికి సన్నిహితమైంది.

' 4. ఋ గుణింతం ప్రాచీన సంస్కృత శాసనాలలో అక్షరం కుడివైపున ఐ మూలగా ఒక వంపుతో సూచించేవారు. చాళుక్యుల కాలానికి ఇది వక్రసుడిగా మారింది. రెడ్డిరాజుల కాలం వరకు ఇది అక్షరాన్ని అంటి పెట్టుకొని ఉండేది. విజయనగర కాలానికి

అక్షరాన్ని అంటిపెట్టు కోవటం మానింది. సంస్కృత శాసనాలలో ఋకారాన్ని ఋ గుణింతాన్ని నిర్దుష్టంగా పాటించేవారు. ఔత్తరాహులు దీనిని 'రి'గా ఉచ్ఛరిస్తారు. మనం 'రు' గా పలుకుతాం.

5. ఏ కారం గుణింతాన్ని సూచించటానికి అశోక, భట్టిప్రోలు లిపులలో అక్షరం ఎడమవైపు ఎగువన అడ్డుగీత కన్పిస్తుంది. వేంగీ చాళుక్య లిపిలో ఈ గీత కొన ఎడమకు వాలింది. కాకతీయుల కాలంలో కొక్కెం లాగ మారింది. విజయనగర కాలానికి ఇప్పటి రూపానికి సమీపంగా మారింది.

6. ఐ గుణింతాన్ని అక్షరానికి ఏ గుణింతం ఇచ్చిన మీదట, అక్షరం కుడి పక్కన కిందుగా అంటిపెట్టుకున్న అరసున్న వంటి గుర్తు పెట్టేవారు. ఇది కాకతీయుల కాలానికి అక్షరాన్ని అంటిపెట్టుకొనటం మాని, శ్రీనాథుని కాలానికి మొదటి కొనలో సుడి తిరిగింది.

7. ఓ గుణింతం అశోకుని శాసనాలలో అక్షరంపైన రెండు చిన్న అడ్డుగీతలు పెట్టి సూచించేవారు. ఇవి నన్నయ కాలానికి రెక్కలు విచ్చిన పక్షిలాగా మారాయి. ఓ గుణింతం ఇచ్చి అక్షరం ప్రక్కన కొమ్ముకు దీర్ఘం ఇచ్చే పద్ధతి కూడ మొదటి నుండి ఉంది. మ, య, హ లలో మాత్రం తప్పని సరిగా మిగిలింది. ఎ, ఏ, ఒ, ఓ ల హ్రస్వ దీర్ఘాల భేద్ 16వ శతాబ్ది వరకు అంతటా పాటించినట్లు కనిపించదు.

8. 'ఔ' గుణింతం ప్రాచీన ప్రాకృత శాసనాలలో లేదు. నన్నయ కాలానికి నేటి ల ఒత్తును ఏటవాలుగా పెట్టినట్లున్న గుర్తు కనిపిస్తుంది. శ్రీనాథుని కాలానికి ముఖ్యాక్షరానికి మించి నేటి ణ వర్ణం తలమీద మోపినట్టు ఉంటుంది. మ, య వంటి అక్షరాల కొమ్ములకు ఔత్వం ఇచ్చే పద్ధతి ఏర్పడింది.

## బి. విరామ చిహ్నాలు

ఇప్పుడు మనం విరామం, సమాప్తుల సూచకంగా కామా, ఫుల్‌స్టాప్‌లను వాడుతున్నాం. కాని పూర్వం ఒక నిలువు గీతను విరామ చిహ్నంగానూ, 2 నిలువు గీతలను సమాప్తికి చిహ్నంగాను వాడి ఉండటం కన్పిస్తుంది.

విదేశ పరిపాలనల వలన ముద్రణ యంత్రాలు రావటంతో తెలుగులిపి మరింత గుండ్రనై స్థిర రూపం పొందింది. పాశ్చాత్య దేశాలలో ముద్రణ పరిశ్రమ అభివృద్ధి అవుతున్నకొలదీ దాని ప్రభావ ఫలితాలు మన లిపిపై కూడ ప్రసరించి టైపు మిషన్లు, మోనోటైపు లాంటి ప్రక్రియలు కూడ చోటు చేసికొన్నప్పటికి అక్షర స్వరూపం చెడకుండా ఎన్నో మార్పులు సౌకర్యాలు సమకూరాయి.

## సి. తెలుగులిపి - ధ్వన్యనురూపత

భారతీయ భాషలన్నిటిలోను లిపి ధ్వనిని అనుసరించి ఉండటం సాధారణంగా కన్పిస్తుంది. అదే విధంగా తెలుగులో కూడ చూడవచ్చు.

1. నేటి తెలుగు భాష వాడుకలో ముకారాంత శబ్దాల చివరి ప్రత్యయం బిందువుగా ఉచ్చరింపబడుతుంది. 'వృక్షము' అనే పదాన్ని 'వృక్షం' అని బిందువుతో పలకటం ఇటువంటిదే.

2. యకార వకారాలు ఇ, ఈ, ఎ, ఏ, లకు బదులుగా పదాదిలో ఉచ్చరింపబడతాయి. ఎవడు - యెవడు. ఇల్లు - యిల్లు, ఎక్కడ - యెక్కడ, ఇత్యాది పదాలలో పై వ్యవహారం ఉంది. దీనికి కారణం ఆ అక్షరాలు ఏకస్థాన జనితాలు కావటమే.

3. ఈనాడు వాడకలో వినిపిస్తున్న 'వచ్చాడు, పోయాడు' అనే రీతిలో వ్యవహారంలో ఉన్న పదాలకు లిపి చిహ్నం లేదు. పచ్చి + ఆకు మొదలైన చోట్ల సంధి చేయగా పూర్వ తాలవ్యోచ్చారణ నిలిచి ఉంటుందని చిన్నయ సూరి సూత్రాంధ్ర వ్యాకరణంలో "కంచంత - కా చా కు పచ్చాక్విత్యాదీనా మక్క జాదిత్వా సాధుత్వ మవగంతవ్యమ్" అని పేర్కొన్నాడు.


అ ఆ ఇ ఈ ఉ ఊ ఏ ఐ ఒ ఔ క ఖ గ ఘ ఙ చ ఛ జ ఝ ఞ ట ఠ డ
మౌర్యకాలపు బ్రాహ్మీ లిపి క్రీ.పూ. 3వ శతాబ్దము
భట్టిప్రోలు ధాతుకరండము మీది బ్రాహ్మీ లిపి క్రీ.పూ. 3వ శతాబ్దము
శాతవాహన కాలపు బ్రాహ్మీ లిపి
ఇక్ష్వాకు కాలపు బ్రాహ్మీ లిపి క్రీ.శ. 3వ శతాబ్దము
గుప్తుల కాలపు లిపి క్రీ.శ. 4వ శతాబ్దము
శాలంకాయన కాలపు పురాతన తెలుగు-కన్నడ లిపి
పల్లవుల కాలపు గ్రంథ తమిళ లిపులు క్రీ.శ. 7వ శతాబ్దము
తెలుగు - కన్నడ లిపి క్రీ.శ. 7వ శతాబ్దము
పూర్వచాళుక్య యుగపు తెలుగు కన్నడ లిపి క్రీ.శ. 10వ శతాబ్దము
రాజరాజ నరేంద్రుని కాలపు తెలుగు-కన్నడ లిపి
కాకతి గణపతి దేవుని కాలపు
ప్రోలయ వేమారెడ్డి కాలపు
పెదకోమటి వేమారెడ్డి కాలపు
కృష్ణదేవరాయల కాలపు తెలుగు లిపి క్రీ.శ. 16వ శతాబ్దము


ఢ ణ త థ ద ధ న ప ఫ బ భ మ య ర ల వ శ ష స హ ళ ఱ క్ష
మౌర్యకాలపు బ్రాహ్మీ లిపి క్రీ.పూ. 3వ శతాబ్దము
భట్టిప్రోలు ధాతుకరండము మీది బ్రాహ్మీ లిపి క్రీ.పూ. 3వ శతాబ్దము
శాతవాహన కాలపు బ్రాహ్మీ లిపి
ఇక్ష్వాకు కాలపు బ్రాహ్మీ లిపి క్రీ.శ. 3వ శతాబ్దము
గుప్తుల కాలపు లిపి
శాలంకాయన కాలపు పురాతన తెలుగు-కన్నడ లిపి
పల్లవుల కాలపు గ్రంథ తమిళ లిపులు క్రీ.శ. 7వ శతాబ్దము
తెలుగు-కన్నడ లిపి క్రీ.శ. 7వ శతాబ్దము
పూర్వచాళుక్య యుగపు తెలుగు-కన్నడ లిపి క్రీ.శ. 10వ శతాబ్దము
రాజరాజ నరేంద్రుని కాలపు తెలుగు-కన్నడ లిపి
కాకతి గణపతి దేవుని కాలపు
ప్రోలయ వేమారెడ్డి కాలపు తెలుగు లిపి
పెదకోమటి వేమారెడ్డి కాలపు తెలుగు లిపి
కృష్ణదేవరాయల కాలపు తెలుగు లిపి క్రీ.శ. 16వ శతాబ్దము

### 14.1.11 ఉపసంహారం

తెలుగులిపి అతిప్రాచీనమైనదని పేర్కొనటంలో సందేహంలేదు. ఇది చిత్రలిపినుండి పరిణతి చెందినట్టిది. పురాతన కాలంలో బ్రాహ్మీలిపి ఉత్తర, దక్షిణ బ్రాహ్మీ లిపులుగా రెండు శాఖలయింది. దక్షిణ బ్రాహ్మీలిపి తెలుగు దేశాన్ని పాలించిన ఆయా రాజుల పేర్లతో ప్రచరితమై నేటి తెలుగులిపిగా పరిణమించింది.

## 14.2 ద్రావిడ భాషలు - తెలుగు స్థానం

### 14.2.1 ఉద్దేశం

తెలుగు అతి ప్రాచీనమైన సాహిత్య స్థాయి కలిగిన భాషలలో ఒకటి. తెలుగు ఆర్య భాషాజన్యమా? ద్రావిడ భాషా జన్యమా? అనే చర్చ బహుకాలం కొనసాగిన పిమ్మట తెలుగు ద్రావిడ భాషాజన్యం అని భాషాశాస్త్ర వేత్తల చేత నిరూపింపబడింది. ద్రావిడ భాషలలో కొన్ని నాగరక భాషలుగా కొన్ని అనాగరిక భాషలుగా భాషాశాస్త్రజ్ఞుల చేత వేర్పాటు చేయబడినవి. తెలుగు నాగరక భాషలలో ఒకటి. భాషాశాస్త్ర పరంగానూ, సాహిత్య పరంగానూ మిక్కిలి అభివృద్ధి చెందిన తెలుగు భాష ద్రావిడ భాషల ఉపకుటుంబాలలో ఏ వర్గనికి చెందినదో, ఆ ఉపకుటుంబంలోని తక్కిన భాషలలోని లక్షణాలు తెలుగు భాషా లక్షణాలతో ఏ విధంగా సాదృశ్యాలను కలిగి ఉన్నాయో వివరించి, దాని వలన ద్రావిడ భాషలలో తెలుగు యొక్క స్థానాన్ని నిరూపించటం ఈ పాఠం యొక్క ఉద్దేశం.

సర్వనామాలు, సంఖ్యావాచకాలు, క్రియలు మొదలైన భాషా స్వరూప లక్షణాలలో తెలుగు భాషలోని విధానమూ, ఇతర ద్రావిడ భాషలలోని విధానాలు అవగాహనకు రావటం ఈ పాఠం యొక్క ప్రయోజనం.

### 14.2.2 పాఠ పరిచయం

ద్రావిడ భాషలు వ్యవహరింపబడే దేశాన్ని గురించి 'గ్రియర్సన్' పండితులు ఈ విధంగా పేర్కొన్నారు. "దక్షిణ హిందూ స్థానం అంతటిలోను, సిలోను ఉత్తర భాగంలోను ద్రావిడ భాషలు వ్యాపించి ఉన్నాయి. గోవాకు నూరుమైళ్ళు క్రిందికి అరేబియా సముద్రతీరంలో ప్రారంభమై ఈ విభాగరేఖ పడమటి కనుమల ననుసరించి కొల్లాపురం వరకు పోతూ ఉంది. అక్కడి నుండి కొంత వంకరగా నిజాం రాష్ట్రంలో ప్రవేశించి బీరారులోని దక్షిణ భాగాన్ని తనలో చేర్చుకొని తూర్పువైపున బంగాళాఖాతం తీరాన్ని చేరుతూఉంది. చాందా, భందర అనే ప్రదేశాలకు తూర్పున ఉన్న భాగం ద్రావిడ భాషలు మాటలాడే జాతులతో కూడుకొని ఉంది. ఆర్యభాషా భేదాలు సమప్రదేశాలలో అంతటా వాడుకలో ఉండటం వలన ఆర్య భాషా సముద్రంలో అక్కడక్కడ ఉన్న చిన్న చిన్న ద్వీపాల లాగా ఈ భాషలు కొన్ని చోట్ల వాడబడుతున్నాయి. ఇంకా ఉత్తరాన మధ్య పరగణాలలోను, చోటా నాగపూరులోను, గంగానది ఒడ్డున రాజమహలులోను ఈ ద్రావిడ భాషా భేదాలు వాడబడుతున్నాయి. వాయవ్య దిక్కున బెలూచిస్థాన్‌లోను ఒక ద్రావిడ భాషా భేదం కనబడుతూనే ఉంది.

### 14.2.3 ద్రావిడ భాషలు - వర్గీకరణ

సర్ జార్జ్ గ్రియర్సన్ ద్రావిడ భాషలన్నిటిని 5 వర్గాలుగా విభజించారు. 1. ఆంధ్రవర్గం, 2. దక్షిణ వర్గం, 3. మధ్యమ వర్గం, 4. వాయవ్య వర్గం, 5. అర్థద్రావిడ వర్గం.

ఈ వర్గీకరణను బట్టి ఆయా వర్గాల విశేషాలను నిరూపించే ప్రయత్నాలేమీ జరుగలేదు. శ్రీ ఎల్.వి.రామస్వామి అయ్యరు తమ "The Evolution of Malayalam Morphology" అన్న గ్రంథంలో తమిళ మలయాళాలను ఒక వర్గంగా పరిగణించారు.

ఇటువంటి వివిధ వర్గీకరణలను దృష్టిలో పెట్టుకొని డాక్టరు భద్రిరాజు కృష్ణమూర్తి గారు "Telugu Verbal Bases" అన్న తమ పరిశోధన గ్రంథంలో అత్యంత సమగ్రంగాను సమర్థంగాను, శాస్త్రీయమైన మార్గంలో ద్రావిడ భాషలలో తెలుగు యొక్క స్థానాన్ని నిర్ణయించారు.

ద్రావిడ భాషల యొక్క వ్యావహారిక ప్రదేశాలను బట్టి భౌగోళిక విధానాన్ని బట్టి అవి ఈ క్రింది విధంగా విభజింపబడ్డాయి.

మూల ద్రావిడ భాష

| దక్షిణ ద్రావిడ భాషలు | మధ్య ద్రావిడ భాషలు | ఉత్తర ద్రావిడ భాషలు |
|---|---|---|
| 1. తమిళం | 1. తెలుగు | 1. కుడుఖ్ |
| 2. మలయాళం | 2. గోండీ | 2. మాల్త్ |
| 3. కొడగు | 3. కొండ | 3. బ్రాహుఈ |
| 4. కోత | 4. పెంగో | |
| 5. తొద | 5. మండ | |
| 6. కన్నడం | 6. కూయి | |
| 7. తుళు | 7. కువి | |
| | 8. కోలామి | |
| | 9. నాయికీ | |
| | 10. పర్జి | |
| | 11. గదబ | |

పైన పేర్కొనబడిన ద్రావిడభాష లన్నింటిని 3 విభాగాలుగా చేయటానికి ముఖ్య కారణాలు రెండు. 1. వాని ప్రాదేశికత్వం - అంటే ఆ భాషలు వ్యవహరింపబడే ప్రదేశాలను బట్టి హిందూ దేశంలో దక్షిణ దిక్కున ఉండటంచేత దక్షిణ ద్రావిడ భాషలని, ఉత్తర దిక్కున ఉన్నవి ఉత్తర ద్రావిడ భాషలని, నడుమ నున్నవి మధ్య ద్రావిడ భాషలని పేర్కొనబడ్డాయి. 2. ఆయా విభాగాలలోని భాషలన్నిటికి కొన్ని సామాన్య లక్షణాలు కానరావటం.

### 14.2.4 దక్షిణ ద్రావిడ భాషలు

1. <u>తమిళం</u> - ఇది దక్షిణ హిందూ స్థానం యొక్క ఆగ్నేయ భాగం అంతటను, సింహళ ద్వీపం యొక్క ఉత్తరంలో సగభాగంలోను వ్యవహరింప బడుతుంది. తమిళంలో సారస్వతం అతి ప్రాచీనం. లభించిన గ్రంథాలలో 'తొల్ కాప్పియమ్' అనే లక్షణ గ్రంథం ప్రాచీనం. దీనిలో ఎఱుత్తు (అక్షరం) సొల్ (శబ్దం) పొరుళ్ (అర్థం) అనే 3 ప్రకరణాలున్నాయి. సంస్కృత వ్యాకరణ సంప్రదాయాలు. భాషా పద్ధతుల ప్రభావం ఈ గ్రంథంలో కానవస్తుంది. అయినప్పటికిని సాంకేతిక పదాలలోను, భావాలలోను, పద్ధతులలోను విశేషమయిన స్వాతంత్ర్యం కనిపిస్తూనే ఉంటుంది.

ప్రాచీన కాలంలో 3 తమిళ సంఘాలున్నట్లు, ఆయా సంఘాల కాలంలో కొన్ని కొన్ని సుప్రసిద్ధాలయిన గ్రంథాలు వ్రాయబడి యున్నట్లు వృత్తాంతం ఉంది. మొదటి సంఘంలో 549 మంది కవులు ఉన్నారని తెలియవస్తోంది. అది మధురా పట్టణంలో ఉంది.

నాటి గ్రంథాలు 'పరిపాడల్, ముదునార్రై, ముదుకురుకు, కళరియావిరై' అనేవి. నాటి లక్షణ గ్రంథం 'అగత్తియమ్' అనేది అగస్త్యుడు తమిళ భాషకు వ్రాసిన వ్యాకరణంగా చెప్పబడింది.

రెండవ తమిళ సంగం కపాడపురంలో వర్థిల్లింది.

ఈ కాలం నాటి గ్రంథాలు తొల్‌కాప్పియం, మా పురాణం, ఇసైను నుగము, అనేవి. వీటిలో తొల్ కాప్పియం తప్ప తక్కినవి నామమాత్రాలు.

3వ సంగమునకు నక్కీరరు అధ్యక్షుడు. ఈ కాలం నాటి గ్రంథాలు - పేరిసై, కూత్తు, పత్తుప్పాట్టు, సిత్రిసై.

తమిళ సారస్వతం క్రీస్తు శకానికే ఉద్భవించి చాలా ప్రశస్తికెక్కి ఉందని తెలుస్తోంది. తిరుక్కురళు, చిలప్పదిగారం, మణిమేగలై, జీవక చింతామణి అనే విశాల గ్రంథాలనేకం తమిళంలో ప్రసిద్ధికెక్కాయి.

2. <u>మలయాళం</u> - పశ్చిమ సముద్ర తీరంలో ఉత్తరాన కాసరగోడు అనే ప్రదేశం నుండి దక్షిణాన తిరువనంతపురం వరకు ఇది వ్యవహారంలో ఉంది. గ్రంథజాలం కలిగి ఉండి నాగరికతకు ఆలవాలం అయిన ద్రావిడ వాఙ్మయాలన్నిటిలోను సంస్కృత ప్రభావం అదికంగా కలిగినది మలయాళం. 'రామచరితం, రామకథాపాట్టు' అనే రెండు గ్రంథాలు మిక్కిలి ప్రాచీనాలు. వీటి కాలం 10వ శతాబ్దంగా ఊహింపబడుతోంది. 12వ శతాబ్దం మొదలుకొని 16వ శతాబ్దం వరకు మలయాళంలో అనేక గ్రంథాలు రచింపబడ్డాయి. అవి ముఖ్యంగా 3 జాతులకు చెందినవి. 1. సందేశ కావ్యాలు, 2. చంపవులు, 3. ఖండ కావ్యాలు. తెలుగు, తమిళ భాషలలో హరికథా కాలక్షేపాల వంటి 'కూత్తులు' అనబడిన గ్రంథాలు అనేకం ఈ కాలంలో రచింపబడ్డాయి. ఆంధ్ర కర్ణాటుల వలెనే మలయాళులు కూడ సంస్కృత సారస్వత ప్రభావంతో సంస్కృత ప్రవాహంలో మునిగిపోయారు. ఆంధ్ర, కర్ణాట వాఙ్మయాలలో కేవల నామమాత్రంగా ఉన్న మణిప్రవాళశైలి మలయాళంలో మిక్కిలి ప్రబలమైనది.

3. <u>కొడగు</u> - దీని ప్రాచీన రూపం 'కుడగు'. 'కుడ' అంటే ప్రాచీన తమిళంలో పశ్చిమం అని అర్థం. తమిళులు దీన్ని పశ్చిమ దిక్కుగా వ్యవహరించటం వలన ఈ దిక్కు పేరే దేశానికి, దేశస్థులకు, భాషకు క్రమంగా పేరుగా ఏర్పడింది. నేటి ఆంగ్ల వ్యవహారనామం కూర్గు. ఇది ఒక చిన్న జిల్లా. పడమటి కనుమల నడుమ ఉంది. ఈ దేశస్థులను కొడగులు అని వ్యవహరించే శాసనం ఒకటి 1174 సం. నాటిది మైసూరు జిల్లాలో లభించింది.

ఈ భాషకు తుళు భాషా పదాలు మిక్కిలి సమీపంగా ఉన్నాయి. దీన్ని కన్నడ భాష యొక్క భేదంగా సాధారణంగా పరిగణిస్తారు.

4. <u>కోతభాష</u> - నీలగిరి కొండలలోని 'కోత' అనే కొండజాతి వారు వాడే భాష ఇది.

5. <u>తొద</u> - దీనిని తొద, తోద అని కూడ వ్యవహరిస్తున్నారు. నీలగిరి పశ్చిమ ప్రాంతంలో ఈ భాష వ్యవహరించే వారున్నారు.

6. <u>కన్నడం</u> - దీనికి కర్ణాటం అని కూడ వ్యవహారం ఉంది. డాక్టరు గుండర్టు గారు దీనిని ఈ విధంగా వివరించారు. కర్ + నాడు - నల్లనేల గల దేశం అని అర్థం చెప్పి ఇది ద్రావిడ భాషా పదం అని, తరువాత సంస్కృతీకరింప బడినదని ఊహించారు. కరు + నాడు - ఎత్తయిన ప్రదేశం. కర్ణాటక దేశం తీరదేశాల కంటే ఎత్తయిన పీఠభూమి అనే అభిప్రాయానికి ఆ పదం సరిపోతున్నదని కొందరు నిరూపించారు.

కన్నడంలో లభ్యమాన గ్రంథాలలో ప్రాచీనతమమైనది నృపతుంగుని 'కవిరాజమార్గం' అనే లక్షణ గ్రంథం. జైనులు,

వీరశైవులు, బ్రాహ్మణులు గ్రంథ రచన చేసి కన్నడ భాషను అభివృద్ధి చేశారు. సుమారు 12వ శతాబ్ది వరకు కన్నడ గ్రంథ రచన చేసిన వారు జైనులే. ఆదిపంప (902-941) భారత రచన చేశాడు. ఇది తెలుగు భారతం వలెనే చంపవు. పొన్న అనే కవి (క్రీ.శ. 950) 'శాంత పురాణం' అనే చంపూ కావ్యాన్ని 'భువనైక రామాభ్యుదయం' అనే గ్రంథాన్ని రచించినట్లు వినవస్తోంది. రన్నకవి (క్రీ.శ. 993) అజితపురాణం, సాహసభీమ విజయం, రన్నకందం అనే నిఘంటువును రచించాడు. పంప, పొన్న, రన్న అనే ముగ్గురు రత్నత్రయంగా పేరొందినవారు.

కన్నడ గ్రంథాలలో కూడ సంస్కృత సారస్వత ప్రభావం కన్పిస్తుంది.

7. <u>తుళుభాష</u> - దీనికి లిపి, సాహిత్యం లేవు. ఈ జనులు సంస్కృత గ్రంథాలను మలయాళ లిపిలో వ్రాసికొనే వారు. మంగుళూరులో బేసిల్ మిషను ముద్రాక్షర శాలవారు ఈ భాషను కన్నడ లిపిలో ముద్రించి ఉండటం వలన కన్నడ లిపియే వాడబడుతుంది. ఇది చాలా పరిమిత ప్రదేశాలలో వాడబడుతుంది. కనరా జిల్లాలో ఉన్న చంద్రగిరి, కళ్యాణపురి అనే రెండు నదుల మధ్య ప్రదేశంలో దీని వ్యవహారం. ప్రాచీన కాలంలోను, నవీన కాలంలోను ఈ భాషా ప్రదేశానికి ఈ రెండు నదులే సరిహద్దులని కాల్డ్వెల్ గారు పేర్కొన్నారు.

బ్రిగెల్ దొరగారు ఈ భాషకు ఒక వ్యాకరణాన్ని రచించారు. ఒక నిఘంటువు కూడ ఆంగ్లభాషలో ప్రచురింపబడింది.

**14.2.5 మధ్య ద్రావిడ భాషలు**

1. దీనిలో తెలుగు ముఖ్యమైన భాష. దీనికి ఆంధ్రం అని కూడ పేరు.

2. <u>గోండీ</u> - తమిళాది భాషలలో ఉన్నట్లు ప్రసిద్ధ గ్రంథాలు ఈ భాషలో లేవు. కాని ద్రావిడ భాషలలో గోండీ భాషా జనసంఖ్య చాల అధికం. వీరు నివసించే ప్రదేశాన్ని "గోండ్వనా" అని పేర్కొంటారు. ఆంధ్రప్రదేశ్ లోని అదిలాబాదు. మధ్య ప్రదేశ్ లోని ఛింద్వారా, బేతుళ్, బస్తర్, చాందా, బాలాఘాట్, నాగపూర్, వార్ధ, మోట్మల్, భాంద్రా మండలాల్లో ఈ జనులు నివసిస్తున్నారు. దీనికి ఆంగ్లంలో ఒక బృహద్వ్యాకరణాన్ని ఆచార్య పి.యస్. సుబ్రహ్మణ్యం గారు ప్రచురించారు.

గోండే జాతి వారిలో కొందరు రాజలాంఛనాలు కలిగి పరిపాలకులుగా ఉన్నట్లు తెలియవస్తోంది. వీరికి ముఖ్యదైవం భీముడు. సంప్రదాయబద్ధమైన కథలు, ప్రహేళికలు, హాస్యపు సామెతలు ఉన్నాయి.

3. <u>కొండ</u> - ఆంధ్రదేశంలోని విశాఖపట్టణం మండలంలోను, ఒరిస్సాలోని కోరాపుట్టి మండలంలోని మన్య ప్రదేశాలలో నివసించే కొండదొరలు అనబడేవారే వీరు. ఈ భాషకు కూబీ అని నామాంతరం. కాళీపట్నం సమీపంలో ఉన్న జనులు మాట్లాడేది ఒక మాండలికం అని, అనంతగిరి, కోరాపుట్టి గ్రామాలకు సమీపాన మాట్లాడేది వేరొక మాండలికం అని "Konda or Kubi - A Dravidian Language" అన్న గ్రంథంలో ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు పేర్కొన్నారు.

4. <u>పెంగో</u> - 'జాని' అని కూడ దీని వ్యవహారం. ఒరిస్సాలోని కోరాపుట్టి జిల్లాలో, నవరంగపూర్, దసమంతపూర్ తాలుకాలలో కళహంది జిల్లాలో ధువమల్, రాంపూర్, కాశీపూర్ తాలూకాలలో వీరు ఉన్నారు. శ్రీ టి.బరో, సుధీభూషణ భట్టాచార్యులు "The Pengo Language" అనే గ్రంథాన్ని రచించారు.

5. <u>మండ</u> - ఈ జాతివారు ఒరిస్సా కళహంది జిల్లా ధువమల్, రాంపూర్ తాలుకాలలో నివసిస్తున్నారు. దీనిని కనిపెట్టి ప్రచురించిన వారు బరో, ఎమెనో, భట్టాచార్యుల వారు. పెంగో భాషకు, దీనికి సమీప సంబంధం ఉంది.

6. <u>కూయి</u> - ఈ జాతి వారు తమను 'కూయింగ' అని పేర్కొంటారు. చివర ఉన్న 'ంగ' ప్రత్యయం ద్రావిడ బహువచన

ప్రత్యయం. ఒరిస్సాకు, ఆంధ్రప్రదేశ్‌కు మధ్యన ఉన్న కొండలలో వీరు నివసిస్తారు. వీరినే కోండులు, ఖోండులు, కంధులు అని కూడా వ్యవహరిస్తారు. శ్రీ ఎస్. భట్టాచార్య, విన్‌ఫీల్డ్. W. అనే పరిశోధకులు ఈ భాషపై గ్రంథ రచన చేశారు.

7. కువి - ఈ భాషా వ్యవహర్తలకు ఖోండు, కోంధు, సామంతు జాతావు దొరలని వ్యవహారం ఉంది. విశాఖపట్నం ఏజన్సీలోని, అరకు ప్రాంతంలోను, సాలూరు, జయపూరు ప్రాంతాలలోను, ఒరిస్సాలోని గంజాం. కలహంది, కోరాపుట్టి ఇతర సమీప ప్రదేశాలలో వీరు నివసిస్తున్నారు.

పిట్జ్‌రాల్డు, విన్‌ఫీల్డు, భట్టాచార్యులు ఈ భాషను గురించి వ్రాసి ఉన్నారు.

8. కోలామి - అదిలాబాదు మండలంలోను, యోట్మల్, వార్థామండలం లోను ఈ భాషను మాట్లాడే వారున్నారు. తమ పేరు 'కోలవార్' అని వారు వ్యవహరిస్తారు. ఈ భాషపై ఎమెనోగారు, సేతు మాధవరావు గారు గ్రంథ రచన చేశారు.

9. నాయకీ - ఆంధ్రదేశంలోని అదిలాబాదు, కరీంనగర్ లోని కొండ ప్రదేశాలలో వీరు నివసిస్తున్నారు. ఈ భాష కోలామి భాషకు సన్నిహితమైనది. శ్రీ భట్టాచార్య, ఎమెనో దీని గురించి వ్రాశారు.

10. పర్జి - వీరిలో చాలమందికి ముఖ్యవృత్తి వ్యవసాయం. అందువల్లనే గోండులు వీరిని కాపులు అంటారు. ఈ భాషలో 3 ముఖ్యమాండలికాలున్నాయి.

11. గదబ - ఈ జాతివారు కోరాపుట్ జిల్లాలో జయపూర్ ప్రాంతంలోను, శ్రీకాకుళం జిల్లా సాలూరు ప్రాంతాలలోను ఉన్నారు. వీరిలో గుతోబ్ గదబలు, ఒల్లార్ గదబలు, కొండేకోర్ గదబలు అని మూడు శాఖలవారున్నారు.

గదబ పర్జీకి అతి సన్నిహితమైన భాష. ఒల్లార్ గదబల భాషను మొట్టమొదట కనుగొనిన వారు భట్టాచార్య. ఆయన దీనిమీద "Olari, A Dravidian Sppech" అనే గ్రంథాన్ని రచించారు.

**14.2.6 ఉత్తర ద్రావిడ భాషలు**

1. కురుఖ్ - వీరినే ఒరయానులు అని వ్యవహరించారు. వీరు ఛోటానాగపూర్, రాంచీ జిల్లాలలోను, వలమన్, గంగాపూర్, బస్‌పూర్ జిల్లాలలోను, అస్సాము తేయాకు తోటలలోను ఉన్నారు. వీరి ప్రాచీన గాథలలో వీరు మొదట కర్ణాటక ప్రాంతంలో ఉండే వారని, అక్కడి నుండి నర్మదా తీరానికి వెళ్ళి బీహార్‌లో 'సోనే' నదీ ప్రాంతంలో స్థిరపడ్డారని చెప్తారు. వీరిలో కొందరు గంగానదిని అనుసరించి వెళ్ళి రాజమహల్ కొండలలో స్థిరపడ్డారు. వారిని 'మాలెర్' అని వారి భాషను 'మాల్తో' అని అంటారు.

సాహిత్య రహిత భాషలలో సంఖ్యాబలాన్ని బట్టి గోండీ తరువాత ముఖ్యమైన భాష కురుఖ్. దీనికి 'కూడుఖ్' అని కూడ నామాంతరం.

2. మాల్తో - 'మాలెర్' అనే పదం కొండవారు అనే అర్థంలో సంభవించింది. 'మల' అంటే కొండ. వీరు పూర్వం గ్రామాలను కొల్లగొడుతూ ఉండేవారు. వారిని ఆ వృత్తి విడిచి వ్యవసాయం చేసికొనవలసిందని ప్రభుత్వం భూములను ఇచ్చింది. కాని వారు వ్యవసాయం చేయక ఆ భూములను సంతాలులకు ఇచ్చివేశారు. వీరి భాషకు రాజమహల్, హమాలేరిల్ అని కూడ పేర్లున్నాయి.

3. బ్రాహుయి - పశ్చిమ పాకిస్థాన్‌లో, బెలూచిస్థాన్ లోని కాలత్ ప్రాంతంలో బ్రాహుయీలు అనే ఆదివాసులు వ్యవహరించే భాష ఇది. డాక్టరు బిషప్పు కాల్డ్వెల్ దీనిని ద్రావిడ భాషలలో ఒకటిగా పేర్కొన్నను భాషా వర్గంలో చేర్పలేదు.

ఈ భాషలో పర్షియను, సింధి, పంజాబీ పదాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రకృతులు ఆ భాషలోనివే అయినా ప్రత్యయాలు మాత్రం ద్రావిడ పదాలే.

వీటిలో తొద, కోత, గోండి, కుయి, పర్జి, మాల్తో, బ్రాహుయీ అనేవి అనాగరిక భాషలని తక్కినవి తమిళం, కన్నడం, మలయాళం, తుళు, తెలుగు మొదలైనవి నాగరిక భాషలని కాల్డ్వెల్ గారు పేర్కొన్నారు.

### 14.2.7 ద్రావిడ భాషలలో తెలుగు స్థానం

తెలుగులో ధ్వనులు, వ్యాకరణ నిర్మాణం మొదలైన లక్షణాలను ఇతర ద్రావిడ భాషలతో పోల్చి చూసినప్పుడు తెలుగు మధ్య ద్రావిడ భాష అని, దానికి మధ్య ద్రావిడ భాషలైన గోండీ, కొండ, పెంగొ, మండ, కూయి, కువి భాషలతో అత్యంత సన్నిహిత సంబంధం ఉందని స్పష్టం అవుతుంది. తెలుగు భాష మధ్య ద్రావిడ భాషా కుటుంబానికి చెందిందని మొదలు చెప్పినవారు ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు. మూల ద్రావిడ భాష నుండి తెలుగు ఏ విధంగా పరిణామం చెంది మధ్య ద్రావిడ భాషల లక్షణాలను ఏ విధంగా కలిగియుందో నిరూపింపవలసి ఉంది.

<u>నామవాచకాలు</u>

ఎ. లింగభేదం - తెలుగులో లింగభేదం ఏకవచనంలో మహత్తు, అమహత్తు. (వాడు, అది). బహువచనంలో మనుష్య వాచకాలు, అమనుష్య వాచకాలు. (వారు, అవి). తెలుగుతో దగ్గరి సంబంధం లేని కుడుఖ్, మాల్తో భాషలలో కూడ ఇటువంటి లింగ భేదమే ఉండటం వల్లనూ, దక్షిణ ద్రావిడ భాషలలో స్త్రీ వాచక ప్రత్యయమైన 'అళ్' మొదట్లో ప్రత్యేక శబ్దం అయినందు వల్లనూ తెలుగు, కురుఖ్, మాల్తోలలో ఉన్న లింగభేదమే మూలద్రావిడంలో ఉండేదని పండితుల అభిప్రాయం. (ఎమెనో 1955 1017) కాబట్టి ఈ విషయంలో తెలుగు మూలద్రావిడంలో స్థితిని యథాతథంగా నిలుపుకుంది. మిగిలిన మధ్య ద్రావిడ భాషలలో బహువచనంలో కూడ ఏకవచనంలో లాగా మహత్, అమహత్ భేదమే ఉంది. ఇది ఆ భాషలలో అర్వాచీన పరిణామం కావచ్చు.

బి. బహువచన ప్రత్యయాలు - ప్రాచీనాంధ్రంలో కొన్ని మహన్మహతీ వాచకాలలో రు (ఉ) బహువచన ప్రత్యయంగా ఉంది. ఉదా. పగతురు, అల్లురు, విలుకాండ్రు/విలుకాఱు. ఇది ఇప్పటి వ్యావహారిక భాషలో సర్వనామాల్లోను ఇద్దరు, ముగ్గురు మొదలైన సంఖ్యా వాచకాల్లోను మాత్రమే మిగిలి ఉంది. ఇది మూల ద్రావిడ భాషలో మనుష్య వాచక శబ్దాలలో బహువచన ప్రత్యయమైన - (అ) ర్ నుండి వచ్చింది. మిగిలిన అన్ని నామవాచకాలలోను బహువచన ప్రత్యయం 'లు'. తుళు, కొలామీ, నాయకి, పర్జి, గదబలలోను కళ్, ళ్ అనే రెండు ప్రత్యయాలనుండి వచ్చిన ప్రత్యయాలు ఉన్నాయి. దీనిని బట్టి మూ.ద్రా లో కళ్, ళ్ అనేవి బహువచన ప్రత్యయాలని తెలుస్తుంది.

తెలుగులోని మిగిలిన మధ్య ద్రావిడ భాషలలోను బహువచన ప్రత్యయం నిత్యం. అంటే బహుత్వాన్ని నిర్దేశించినప్పుడు బహువచన ప్రత్యయాన్ని తప్పక ఉపయోగించాలి. దక్షిణ, ఉత్తర ద్రావిడ భాషలలో ఇది నిత్యం కాదు. 'రెండు చెట్లు' అనటానికి తమిళంలో "ఇరంటుమరం" కన్నడంలో "ఎరడుమర", కూడఖ్, మాల్తోలలో అసలు బహువచన ప్రత్యయమే లేదు. కాబట్టి దక్షిణ, ఉత్తర భాషలలో బహువచనం వైకల్పికం.

కనుక మూ.ద్రా.లో వైకల్పికం అయిన బహువచన ప్రత్యయం తెలుగులోను, మధ్య ద్రావిడ భాషలలోను నిత్యంగా మారిందని చెప్పవచ్చు. ఇది తెలుగు మధ్య ద్రావిడ కుటుంబానికి చెందినదని నిర్ణయించటానికి ప్రబలహేతువు.

సి. <u>సర్వనామాలు</u> - అస్మదర్థక ఏకవచనంలో తెలుగులో 'ఏను - నేను' అనేవి మూ.ద్రా. 'యాన్' నుంచి వచ్చాయి. ఏము, మేము అనేవి మూ.ద్రా. 'యామ్' నుంచి వచ్చాయి. వీటి ఔపవిభక్తిక రూపాలు నన్ -/నా-, మమ్ -/మా - అనేవి. వీటి మూల

ద్రావిడ రూపాలు వరుసగా యన్ -, యమ్ -. ఇవి సర్వనామాల తరువాత అజాది విభక్తి ప్రత్యయం చేరటం వలన, ధాతువు అచ్చు హ్రస్వం కావటం వలన ఏర్పడినది. మూల ద్రావిడంలో పదాది యకారం తరువాత దీర్ఘ అకారమే కాని మరి ఏ అచ్చూ ఉండదు. కాబట్టి యన్ -, యమ్ - లలో యకారం లోపించి ఇవి మూల మధ్య ద్రావిడ భాషలో అన్-, అమ్‌లుగా మారాయి. కోలామి, పర్జి భాషలలో ఈ రూపాలు నేటికీ నిలిచి ఉన్నాయి.

యుష్మదర్థక సర్వనామాలు నీవు, ఈవు, మూలద్రావిడ భాష 'నీన్' నుంచి వచ్చాయి. "ఈరు, మీరు, ఈరలు, మీరలు" అనేవి మూ.ద్రా. నీమ్ / నీర్ నుంచి వచ్చాయి. వీటి ఔపవిభక్తిక రూపాలు నిన్- / నీ -, మిమ్ - / మీ - అనేవి. వీటి మూ.ద్రా. రూపాలు నిన్ -, నిమ్ -. వీటిలో పదాది నకారం మూల మధ్య ద్రావిడంలోనే లోపించి ఇవి 'ఇన్ -, ఇమ్' గా మారాయి. ఈ రూపాలు కోలామి, పర్జి భాషలలో కూడ నేటికీ ఉన్నాయి.

మూల ద్రావిడంలో యుష్మదర్థక బహువచన రూపం 'నీమ్'. దానిలో బహువచన ప్రత్యయం అయిన మకారం స్థానాన్ని దానికన్న విశేష వ్యాప్తిలో ఉన్న మనుష్య వాచక బహువచన ప్రత్యయం అయిన రేఫ ఆక్రమించుకోవటం వలన ఏర్పడిన 'నీర్' అనే మరొక రూపం మూ.ద్రా. కాలంలోనే సృష్టించబడింది. తమిళం నీర్, నీయిర్, తుళు - ఈరు, తెలుగు - ఈరు, కూయి - ఈరు. 'నీర్' లో పదాది నకారం లోపించటం వలన ఏర్పడింది. తెలుగులో దీనికి ఔపవిభక్తికమైన 'మీ' ప్రభావం వలన పదాదిని మకారం చేరి 'మీరు' ఏర్పడింది. ఈరలు, మీరలు అనేవి 'ఈరు, మీరు' లకు మళ్ళీ బహువచన ప్రత్యయం అయిన 'లు' చేరగా ఏర్పడిన రూపాలు.

వర్ణవ్యత్యయం వలన ఏర్పడిన నా-, మా-, నీ-, మీ-, అనే యుష్మ దస్మదర్థకాల ఔపవిభక్తిక రూపాలు తెలుగు, గోండీ, కొండ, పెంగొ, మండ, కూయి, కువి భాషలన్నిటిలోను సమానంగా ఉన్నాయి. కాబట్టి వీటిలో ఈ వర్ణవ్యత్యయం ఈ భాషలన్నీ ఒకే భాషగా ఉన్న కాలంలో జరిగి ఉంటుందని ఊహించవచ్చు.

మూల ద్రావిడంలో ఉభయార్థక సర్వనామం నామ్. దీని ఔపవిభక్తిక రూపం 'నమ్', తెలుగులో మా-, మీ-, అనే మకారాదులైన యుష్మదస్మదర్థ కాల ఔపవిభక్తిక రూపాల ప్రభావం వలన దీనిలో కూడ వర్ణ వ్యత్యయం సంభవించి 'నను > మన' గా మారి ఉండవచ్చు. తెలుగులోని 'మనకు' అనేదాన్ని తమిళంలో 'నమక్కు' అనే పదంతో పోలిస్తే ఈ విషయం స్పష్టం అవుతుంది.

<u>మహదేక వచన సర్వనామం</u>

తెలుగు - వాడు, కోత - అమ్ద్ / అవ్న్ద్, పర్జి - ఓద్ / ఓడ్. కొండ - వాన్లు, కూయి - ఆఅంజు, కువి - అఅసి.

వీటికి మూల మధ్య ద్రావిడంలో మూల రూపం అవన్ట్. దక్షిణ ద్రావిడ భాషల్లో దీనికి సమానపదం అవన్. ఇదే మూ.ద్రా. రూపం కూడ అయి ఉండవచ్చు. మూల మధ్య ద్రావిడ భాష కాలంలో మూ.ద్రా. అవన్ చివర ఒక తకారం చేరి 'అవన్ట్' గా మారింది.

అమహదేక వచన సర్వనామం అయిన అత్ (తె. అది) చివర త కారం ఉండటం వలన మధ్య ద్రావిడంలో అవన్ కి కూడ చివర తకారం చేరి అది 'అవన్ట్' గా మారి ఉండవచ్చునని ఎమెనో ఊహించారు. ఈ పరిణామం తెలుగు, ఇతర మధ్య ద్రావిడ భాషలలో కూడ జరిగింది. కాబట్టి తెలుగు మధ్య ద్రావిడ భాష అని నిర్ణయించటానికి ఇది ఒక ఆధారం.

డి. <u>సంఖ్యావాచకాలు.</u>

1. ఒక వ్యక్తిని బోధింపవలసి వచ్చినప్పుడు 'ఒక్కడు, ఒకండు' అనే రూపాలున్నాయి. దక్షిణ ద్రావిడ వర్గంలో

ఒరుత్తన్ (త), ఒరువన్ (మ), ఒబ్బను (క) అనే రీతిలో రూపాలు ఉన్నాయి. కాని కోలామీ - ఒక్కాన్, నాయికీ - ఒక్కొ(న్). పర్జి - ఒకుర్ద, ఒల్లారీ - ఉకుర్, గదబ - ఉక్కుర్ అని కవర్గ మధ్యాలైన రూపాలతో తెనుగునకు సాన్నిహిత్యం ఉంది.

2. తెలుగులోని ఇరుగురు, ఇరువురు, ఇర్వురు అనే మహద్బోధక రూపాలకు 'ఇర్' మూలరూపం.

3. తెలుగులో మూవురు, ముప్వురు, మూగురు, ముగ్గురు అనే రూపాలున్నాయి. మొదటి రెండు రూపాలు మూవర్ (త, మ, క), మూవెరు (తు), మూరె (కొడగు) అనే రూపాలతో సన్నిహితాలుగా కన్పిస్తున్నాయి.

వకారం గకారం అయిన చివరి రూపాలతో కోలామీ, నాయికీ భాషలలోని 'ముగ్గుర్' సాదృశ్యం కలిగి ఉంది.

4. తెలుగులోని 'నలువురు, నల్వురు' అనే రూపాలు దక్షిణ ద్రావిడ వర్ణంతోను 'నలుగురు, నల్గురు' అనేవి కోలామీ, నాయికీ భాషల తోను సారూప్యాన్ని కలిగి ఉన్నాయి.

2. క్రియలు

ఎ. భూతకాలిక ప్రత్యయాలు - మూల ద్రావిడంలో త్ -, -న్-, -త్-, -ఇ-/-ఇన్ అనే నాలుగు భూతకాలిక ప్రత్యయాలు ఉన్నట్లు తమిళం, కొడగు భాషా సముదాయం వలన తెలుస్తోంది. తెలుగులో ఈ నాలుగు ప్రత్యయాలు ఐక్యం పొంది -'ఇతి' ఏర్పడింది. దీని సపదాంశం అయిన -'టి' నకారాంత ధాతువుల తరువాత వస్తుంది. తెలుగులో తిం - టి - ని, కొం - టి - ని.

తమిళంలో తిన్ - ఱ్ - ఏన్, కొణ్ - ట్ - ఏన్ తో పోలిస్తే వీటిలో -ంట్ - -న్ట్ - -ణ్ట్ - అనే రెండింటి నుంచి వచ్చిందని తెలుస్తుంది.

తెలుగులో -ఇతి-, -టి- ఉత్తమ మధ్యమ పురుష ప్రత్యయాల ముందే వస్తాయి. ప్రథమ పురుషలో మహత్ ప్రత్యయం అయిన 'రి' ముందు ఇ, మిగిలినచోట్ల 'ఎను' ఉంటాయి. 'ఎను' కి కొన్ని క్రియల్లో 'ఇయెను' అనే రూపాంతరం కూడా ఉంది. కాబట్టి ఇది ఇ, అన్ అనే రెండు భూతకాలిక ప్రత్యయాల సముదాయం అని ఊహింపవచ్చు. అనియెను, అనెను మొదలైన వాటిలో 'ఇయెను' ఏ ప్రాచీనమైన మల్లియ < మల్లె, కన్నియ < కన్నెలో లాగా అది 'ఎను' గా తరువాత కాలంలో మారి ఉండవచ్చు. మూల ద్రావిడంలో నాలుగు ప్రత్యయాలకి బదులు ఒకే ప్రత్యయం ప్రచురంగా ఉండటం తెలుగులోను, గోందీ, కోలామీ మొదలైన కొన్ని మధ్య ద్రావిడ భాషల్లోను తుల్యంగా ఉంది.

బి. భావికాలిక ప్రత్యయాలు - తెలుగులో -దు/ - ఎద- ఉత్తమ మధ్యమ పురుష ప్రత్యయాలు ముందూ, ప్రథమ పురుషలో మహత్ బహువచన ప్రత్యయం ముందూ వస్తుంది. ప్రాచీన తమిళంలో -త్- అనే భావి కాలిక ప్రత్యయం ఉత్తమ పురుష బహువచనం ముందూ, మధ్యమ పురుష ఏకవచన, బహువచనాల ముందు మాత్రమే వస్తుంది.

ఉదా. అఱితుమ్ (తె. ఎఱుగుదుము)
పోకుతి (తె. పోవుదుం (వు)
కాంటిర్ (తె. (మీరు) కందురు)

ప్రాచీన తమిళంలో ఉన్న ఇటువంటి రూపాలు తప్పితే దక్షిణ ద్రావిడ భాషల్లో పకార వకారాలే భావి కాలిక ప్రత్యయాలుగా ప్రచురంగా ఉన్నాయి. కాని అన్ని మధ్య ద్రావిడ భాషలలోను తకార దకారాలు వర్తమాన భావికాలిక ప్రత్యయాలుగా చాలా వ్యాప్తిలో ఉన్నాయి. కాబట్టి తెలుగు మధ్య ద్రావిడ భాష అనటానికి ఇది కూడ ఒక హేతువు.

సి. వ్యతిరేక ప్రత్యయాలు - తెలుగులో 'అ' వ్యతిరేక ప్రత్యయంగా అన్ని పురుష ప్రత్యయాల ముందు ఉంటుంది. కాని తమిళం, కన్నడం మొదలైన దక్షిణ ద్రావిడ భాషల్లో మాత్రం వ్యతిరేక ప్రత్యయం అయిన 'ఆ' అనేది అమహదేక వచన, బహువచనాల ముందే ఉండి, మిగిలిన పురుష ప్రత్యయాల ముందు దీని లోప రూపం ఉంటుంది. మధ్య ద్రావిడ భాషల్లోనూ, బ్రాహుయీలోను తెలుగులో లాగా వ్యతిరేక ప్రత్యయం అన్ని పురుష ప్రత్యయాల ముందూ ఉంటుంది. కనుక ఇది కూడ తెలుగు మధ్య ద్రావిడ భాషా కుటుంబానికి చెందిందనే విషయాన్ని ఋజువు చేస్తుంది.

డి. క్త్వార్థకం - తెలుగులో క్త్వార్థక ప్రత్యయం - ఇ. దీని ముందు ధాతువులో యకారం సకారంగా మారుతుంది. కాని తెలుగులో కొన్ని క్త్వార్థక రూపాలను మిగిలిన మధ్య ద్రావిడ భాషల్లో క్త్వార్థక రూపాలతో పోల్చి చూస్తే ఇ కారం ముందున్న సకార, చకారాలు కూడ మొదట్లో క్త్వార్థక ప్రత్యయానికి చెందినవే అని తెలుస్తుంది.

| | తెలుగు | గోండీ | కొండ | కూయి | కువి | పర్జి | గదబ |
|---|---|---|---|---|---|---|---|
| 1. | వచ్చి | వాసీ | వాజి | వాజ | వాహ | వెరి | వరి |
| 2. | తెచ్చి | తచ్చీ | తసి | తస | - | - | - |
| 3. | ఇచ్చి | సీసీ | - | సీఅ | హీహ | - | - |
| 4. | చూచి | సూడ్సీ | సుడ్జి | సూడ | | చూడి | సూడి |
| 5. | చేసి | కేసీ | కిజి | గిఅ | - | - | - |
| 6. | నిల్చి | నిల్సీ | - | నీల్జ | - | నిల్చి | - |

పై ఉదాహరణల్లో గోండీ మొదలైన భాషల్లో సకార చకారాలు స్పష్టంగా క్త్వార్థక ప్రత్యయానికి సంబంధించినవే. తెలుగులో కూడ మొదట్లో ఇటువంటి క్రియల్లో క్త్వార్థక ప్రత్యయం -చి / -సి. కాని ఆడి, పాడి, చెప్పి మొదలైన అనేక క్రియలలో 'ఇ' కారం మాత్రమే క్త్వార్థక ప్రత్యయం. కాబట్టి వీటిలో కూడ అనుచిత విభాగం వలన ఇకారం మాత్రమే క్త్వార్థక ప్రత్యయంగా గ్రహించబడి చకారం క్రియలో భాగంగా కలిపివేయబడింది.

కోలామి తప్ప మిగిలిన మధ్య ద్రావిడ భాషలు అన్నిటిలోను ఇకారంతో పాటు సి/చి అనేవి క్త్వార్థక ప్రత్యయాలుగా ఉన్నాయి. ఇకారం స్వర్మంతో అంతమయ్యే క్రియల్లో క్త్వార్థకంగా మూలద్రావిడంలోనే ఉంది. సి/చి మాత్రం మూల మధ్య ద్రావిడ భాష కాలంలో మిగిలిన క్రియల్లో క్త్వార్థకంగా సృష్టించబడింది.

ఈ నూతన పరిణామం తెలుగులోను, కోలామి తప్ప మిగిలిన మధ్య ద్రావిడ భాషలు అన్నిటిలోను కనబడుతుంది. కనుక తెలుగు మధ్య ద్రావిడ భాషా కుటుంబానికి చెందింది.

ఇ. విధ్యర్థకాలు - తెలుగులో విధ్యర్థక మధ్యమ పురుష ఏకవచన ప్రత్యయం - ము. అనేకాచ్క ధాతువులలో అచ్చు పరమైనప్పుడు తప్ప మిగిలిన చోట్ల ఇది వైకల్పికంగా లోపించవచ్చు. విధ్యర్థక బహువచన ప్రత్యయం - ఉండు. విధ్యర్థక రూప నిర్మాణంలో తెలుగుకీ, గోండీ, కొండ, కూయి, కువిలకి సన్నిహిత సంబంధం ఉంది.

| | ఏ. వ. | బ. వ. |
|---|---|---|
| తెలుగు | - (ము) | - ఉండు |
| గోండీ | - ఆ (~ -మ్ -) | - ఆ (~ - మ్ -) + ట్ |
| కోయ | - అ ( ~ - ము - ) | - అ ( ~ మూ - ) + టి (~ - టు) |
| కొండ | - అ | - దు ( ~ - డు ~ - ఋ) |
| కూయి | - ము ( - అము - ఉము) | - అటు - దు (~ - డు ~- డు) |
| కువి | - ము ( - అము) | అదు దు (~ - జు) |

పై భాషలు అన్నిటిలోను మకారం (కొండలో తప్ప) ఏకవచన ప్రత్యయంగాను, టకార దకారాలు బహువచన ప్రత్యయం గాను ఉన్నాయి. మిగిలిన ద్రావిడ భాషలను పరిశీలించి నట్లయితే విధ్యర్థక ఏకవచన రూపంలో ప్రత్యయం ఏమీ లేకుండ క్రియ మాత్రమే ఉండి బహువచన రూపంలో మకారం ప్రత్యయంగా ఉంటుంది.

ఉదా. త. చెయ్ - 'చెయ్యి' - చెయ్యుమ్ (కళ్) - చెయ్యండి.

కోత, తిన్ - 'తిను' - తిన్మ్ - తినండి

ప్రా. కన్నడం. గెయ్ - చెయ్యి - గెయ్యిమ్ - చెయ్యండి.

బ్రాహుయిలో విధ్యర్థక బహువచన ప్రత్యయం అయిన - 'బొ' లో బకారం కూడ ఈ మకారం నుండి వచ్చినదే కావచ్చు. దీనివలన 'మ' కారం మొదట్లో బహువచన ప్రత్యయమే అని తేలుతుంది.

తెలుగు, గోండీ, కుయి మొదలైన భాషల్లో మొదట్లో బహువచన ప్రత్యయం అయిన మకారం ఈ భాషల్లో ట/ద అనే ఒక కొత్త బహువచన ప్రత్యయం వచ్చి చేరటం వలన ఏకవచన ప్రత్యయంగా మారిపోయింది.

| | ఏ.వ. | బ.వ. |
|---|---|---|
| 1. గోండీ | సీమ్ | సీమ్‌ట్ |
| కోయ | ఈము | ఈమూటు |
| తెలుగు | ఇమ్ము | ఇండు |
| 2. గోండీ | కేమ్ | కేమ్‌ట్ |
| తెలుగు | చేయుము | చేయుండు |

మొదట్లో బహువచన ప్రత్యయం అయిన మకారం ఏకవచన ప్రత్యయంగా మారటం, బహువచన రూపంలో టకారం కొత్తగా చేరటం - ఈ రెండు మార్పులు తెలుగు, గోండీ, కొండ, కూయి, కువి లలో తుల్యంగా ఉండటం వలన ఈ భాషలన్ని పూర్వ కాలంలో ఒకే భాషగా ఉండేవని నిర్ణయించవచ్చు.

ఎఫ్. ఉత్పాదక ప్రత్యయాలు

తెలుగులో కొన్ని ధాతువులు సానుబంధాలుగా ఉపయోగింప బడతాయి. అదే విధంగా మూల ద్రావిడ ప్రాతిపదికలు అనుబంధాలను చేర్చుకొని తెలుగు ప్రాతిపదికలుగా వ్యవహరిస్తాయి. ఇలా సానుబంధాలై ఉండటం మధ్యమ ద్రావిడ వర్గంలో కానవస్తుంది.

తెలుగులోని 'నిండు' ధాతువునకు సమానార్థకాలుగా తమిళ, మలయాళాల్లో 'నిఱై' అని, కన్నడంలో 'నెఱె' అని రూపాలున్నాయి.

కోలామి - నిన్డ్, నాయికీ - నిన్డ్, గోండి - నిన్దానా, కొండ - నిన్ట్, కుయి - నెన్జ్ అనే రూపాలలో మూలధాతువుపై అనుబంధం చేరటం స్పష్టంగా కనబడుతుంది.

తెలుగులో 'పండు', తమిళం - పఴు, మల. పఴుక్క, కన్నడం - పణ్ కాగా

కోలామి - పణ్డ్, నాయికీ - పండ్, గోండీ - పండానా, కొండ - పండ్, కువి - పండు అనే రీతిలో రూపాలున్నాయి. ఈ విషయంలో కూడ తెలుగు మధ్యమ ద్రావిడ వర్గానికి చెందింది.

### 14.2.8 ఉపసంహారం

మూల ద్రావిడ భాష కాలం నుండి తెలుగు ప్రత్యేక భాషగా రూపొందే వరకు అనేక పరిణామాలు పొందింది. ఈ పరిణామాలు చాలా వరకు మధ్య ద్రావిడ భాషలలో కూడ ఏర్పడి ఉండటం వలన తెలుగు మధ్య ద్రావిడ భాషా కుటుంబానికి చెందిందని తెలుస్తోంది.

వీటిలో కోలామి, నాయికీ, పర్జి, గదబ - ఈ నాలుగు భాషలు పరస్పర సన్నిహితత్వంతో ఒక చిన్న ఉపకుటుంబం (కోలామి - పర్జి) గాను తెలుగు, గోండీ, కొండ, పెంగొ, మండ, కూయి, కువి భాషలు ఇంకొక చిన్న ఉపకుటుంబం (తెలుగు - కూయి) గాను ఉన్నాయి.

## 14.3 సమీక్ష

వివిధ లిపి భేదాలను తెలుసుకున్నారు. తెలుగు లిపి పరిణామాన్ని తెలుసుకున్నారు. ద్రావిడ భాషల గురించి, ద్రావిడ భాషలలో తెలుగు స్థానం గురించి తెలుసుకున్నారు.

## 14.4 ప్రశ్నలు

1. తెలుగు లిపి ఆవిర్భావ వికాసాలను గురించి తెలపండి.
2. తెలుగు లిపిలో గుణింతాలు పొందిన పరిణామాలను తెలపండి.
3. తెలిపి లిపికి మూలమైన లిపిని గూర్చి చర్చించండి.
4. ద్రావిడ భాషల వర్గీకరణ గురించి పరిచయం చెయ్యండి.
5. ద్రావిడ భాషలలో తెలుగు ఏ ఉపకుటుంబానికి చెందిందో నిరూపించండి?
6. ద్రావిడ భాషలలో తెలుగునకు గల స్థానం ఎట్టిది?

## 14.5 ఆధార గ్రంథాలు

1. తెలుగు భాషా చరిత్ర - ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి.
2. తెలుగు భాషా చరిత్ర - స్ఫూర్తిశ్రీ టి. భాస్కరరావు.
3. ఆంధ్ర భాషా వికాసం - ఆచార్య గంటిజోగి సోమయాజి.

**డాక్టర్ వి. నాగ రాజ్యలక్ష్మి**
ఎం.ఏ.(తె), ఎం.ఏ.(సం), పిహెచ్.డి.
రీడర్
ప్రభుత్వ మహిళా కళాశాల
గుంటూరు

# పాఠం - 15

# తెలుగులో ధ్వనుల మార్పులు

పాఠ్యనిర్మాణక్రమం

15.0 లక్ష్యం
15.1 తెలుగులో ధ్వనుల మార్పులు
15.1.1 ఉద్దేశం
15.1.2 పాఠ పరిచయం
15.1.3 హేతువులు

ఎ. అంతరంగిక కారణాలు - ముఖయంత్ర దోషం, అసమర్థానుకరణ, అస్పష్టగ్రహణం, ఉచ్చారణత్వర, సౌలభ్యాపేక్ష, అనవధానత, ఆవేశావిష్కారం, సౌకుమార్య నివేశనం.

బి. బహిరంగ కారణాలు - దేశ భేదం, కాల భేదం, సమాజ భేదం, అన్యభాషా సంసర్గం, లిపి నిర్బంధం, ఛందో నిర్బంధం.

15.1.4 వర్ణ సమీకరణం (Assimilation)
15.1.5 వర్ణ విభేదనం (Dissimilation)
15.1.6 తాలవ్యీకరణం (Palatalisation)
15.1.7 ఆనునాసిక్యం (Nasalisation)
15.1.8 శ్వాసత - నాదత (Unvoicing, Voicing)
15.1.9 లోపదీర్ఘత (Compensatory Lengthening)
15.1.10 స్వర భక్తి (Anaptysis)
15.1.11 స్వరాగమం (Protheosis)
15.1.12 వర్ణనాశం (Synecope)
15.1.13 సవర్ణలోపం (Haplology)
15.1.14 వర్ణవ్యత్యయం (Metathesis)
15.1.15 వర్ణాగమం (Addition of a syllable)
15.1.16 అనుచిత విభాగం (Wrong Splitting)
15.1.17 సామ్యం (Analogy)
15.1.18 సంప్రసారణం
15.1.19 వ్యంజనాయామం (Doubling)
15.1.20 సంయుక్తాక్షరాలలోని అక్షరలోపాలు
15.1.21 ముగింపు
15.2. సంధి స్వరూపం
15.2.1 ఉద్దేశం
15.2.2 సంధి - నిర్వచనం
15.2.3 సంధి హేతువులు
15.2.4 తెలుగు సంధి స్వరూపం
15.2.5 ద్రావిడ భాషలలోని సంధి పద్ధతులు - సామ్యాలు
15.3 సమీక్ష
15.4 ప్రశ్నలు
15.5 ఆధార గ్రంథాలు

## 15.0 లక్ష్యం

తెలుగులోని ధ్వనుల మార్పులను ఉదాహరణ పూర్వకంగా తెలియజేయడం, తెలుగులోని సంధిస్వరూపాన్ని తెలియజేయడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## 15.1 తెలుగులో ధ్వనుల మార్పులు

### 15.1.1 ఉద్దేశం

భావ వ్యక్తీకరణమే భాషకు మొట్టమొదటి ప్రయోజనం. భాషలో ధ్వనుల సంకేతాలు ప్రధానాలు. భాష ధ్వనుల మీదనే ఆధారపడి ఉంటుంది. కాలక్రమంలో అనేక విధాల హేతువుల చేత భాషలోని ధ్వనులు మార్పుచెందుతూ వచ్చాయి. భాషా శాస్త్రవేత్తలు భాషలోని ధ్వనుల మార్పులను పరిశీలించి, వాటికి హేతువులను విశ్లేషించి చూపారు. కొన్ని శాస్త్రీయ కారణాల వలన భాషాధ్వనులు పరిణామం చెందుతూ వచ్చాయి. అట్టి ధ్వని పరిణామాలను సహేతుకంగా, సోదాహరణంగా నిరూపించి వర్గీకరించటానికి ఈ పాఠం ఉద్దేశింపబడింది.

విద్యార్థులకు ధ్వని పరిణామాలలోని వైచిత్రీ సంబంధ విశేషాలను వివరించటం ఈ పాఠం ప్రయోజనం.

### 15.1.2 పాఠ పరిచయం

భాషకు ప్రాథమిక జీవనం వ్యవహారమే. అది సార్వజనీనం. అటువంటి ముఖ్య వ్యవహారం అయిన సంభాషణలో భాష మారుతూనే ఉంటుంది. కనుక భాషలో ధ్వనుల మార్పులు అతి సహజం.

### 15.1.3 హేతువులు

భాషలో ధ్వనులు మారటానికి కారణాలు రెండు విధాలు. ఒకటి ఆంతరంగిక కారణాలు. రెండవది బహిరంగ కారణాలు.

**ఎ. <u>ఆంతరంగిక కారణాలు</u>** - ఇవి వ్యక్తుల ఉచ్చారణావయవాలయిన తాలువు మొదలైన అవయవాలను బట్టి, వారి ఇచ్ఛను బట్టి ఏర్పడుతూ ఉంటాయి. ఒక విధమైన స్థాన కరణాలచేత ఉచ్చరింపవలసిన ధ్వనిని అప్రయత్నంగా వేరొక స్థానకరణాల చేత ఉచ్చరించటం మొదటి కారణం.

కొందరి అవయవాలు లోపభూయిష్టాలై ఉంటాయి. అంటే ధ్వనుల స్పష్టమైన ఉచ్చారణకు అసమర్థాలుగా ఉంటాయి. కొందరు నత్తి, ముక్కు మాటలు కలవారుగా ఉంటారు. వారికి పదాలు స్పష్టంగా పలకవు. ఇటువంటి లోపాలు కలవారు ఉచ్చరించినప్పుడు వినటం వలన ఇతరులు అటువంటి భిన్న ధ్వనులను ఉచ్చరిస్తారు.

సోమరితనం, సుఖాభిలాష హేతువులుగా ఒక్కొక్కసారి ధ్వనులు మారుతూ ఉంటాయి. సంయుక్తాక్షరాలయిన వాటిని కలిపి ఉచ్చరింపలేకపోవటం ఒక హేతువు. భక్తి - బత్తిగా మార్పుచెందింది. ఇటువంటివి అప్రయత్నంగా వ్యక్తులలో కలిగి కాలక్రమంలో మార్పులుగా చేరిపోతూ ఉంటాయి. కనుక 1. ముఖయంత్ర దోషం, 2. అసమర్థానుకరణం, 3. అస్పష్ట గ్రహణం, 4. ఉచ్చారణత్వర, 5. సౌలభ్యాపేక్ష, 6. అనవధానత, 7. ఆవేశావిష్కారం, 8. సౌకుమార్య నివేశనం - అని ధ్వనుల మార్పులకు అంతరంగ హేతువులను మనం నిర్దేశింపవచ్చు.

1. <u>ముఖయంత్ర దోషం</u> - కొందరు తమ ఉచ్చారణావయవాల లోపం వలన న, ల వర్ణాలను భిన్నంగా పలకలేరు.

కొందరు చ, త లకు భేదాన్ని పాటింపలేరు. కొందరు రేఫోచ్చారణను సక్రమంగా చేయలేరు. ఈ కారణాల చేత ధ్వనులు మార్పునకు లోనవుతాయి.

2. <u>అసమర్థానుకరణ</u> - భాష అనుకరణ ప్రధానం. పెద్దలు మాటలాడుతూ ఉన్నప్పుడు ఆలకించి పిల్లలు దానిని అనుకరించి భాషను వ్యవహరిస్తారు. పెద్దలు కూడ తాము తెలియని ధ్వనులను, పదాలను ఇతరుల వలన నేర్చుకుంటారు. ఈ విధంగా నేర్చుకొనే క్రమంలో తగిన సమర్థత లేకపోవటంచేత మారు ధ్వనులను ఉచ్చరిస్తూ అవియే సరియైన ధ్వనులుగా భావిస్తూ ఉంటారు.

ఉదా॥ టంగణా - టింగణా, ఇసుక - ఉసక, గెల - గొల, ఈ జంటలలోని స్వరభేదానికి అసమర్థాను కరణమే కారణం.

3. <u>అస్పష్టగ్రహణం</u> - ఎదుటివారు మాటలాడినప్పుడు అన్ని పదాలను యథాతథంగా విని గుర్తుపెట్టుకోవటం అసాధ్యం. శ్రోత కూడ ఊహాశాలి కావటం చేత తాను వినే సందర్భంలో కొంత ఊహకు తావు ఇస్తూ ఉంటాడు. ఇటువంటి సందర్భాలలో తాను విన్న శబ్దాలు కాక తాను అనుకొన్న శబ్దాలే గుర్తుంచుకొని ప్రయోగిస్తూ ఉంటాడు. అప్పు, అరువు, ఎరువు అనే పదాలను ఒక దానికి బదులుగా ఒక దానిని ఉచ్చరించటం జరుగుతుంది. దీనికి కారణం అస్పష్ట గ్రహణమే.

4. <u>ఉచ్చారణత్వర</u> - వ్యక్తి తన భావాన్ని శ్రోతకు తెలియచేయాలనే తొందరలో అనేక వర్ణాలను కుంచింపచేస్తూ లోపింపచేస్తూ ఉచ్చరిస్తూ ఉంటారు. 'చేయవలయును' అనే రూపాన్ని 'చేయాలి' అని పలకటం ఉచ్చారణ త్వరయే కారణం. ఆమ్రేడిత రూపాల లోను, పదమధ్య పదాంత స్వరలోపాలలోను ఉచ్చారణత్వర హేతువు అవుతుంది.

5. <u>సౌలభ్యాపేక్ష</u> - మానవుడు ఏ పని చేయటానికి అయినా సులభ మార్గాన్ని అన్వేషించటం సహజం. భాష విషయంలో కూడ ఈ పద్ధతే అనుసరింపబడుతుంది. సౌలభ్యాపేక్ష వలన భాషలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటాయి. పరుష సరళాలు పరస్పరం మార్పునందటం, చాలా పదాలలో నడుమనున్న అచ్చులు గాని, హల్లులు గాని లోపించటం దీనివలననే జరుగుతుంది.

6. <u>అనవధానత</u> - బాధ, బాధ్యత, భేదం మొదలైన పదాలలో మహాప్రాణాలను అల్పప్రాణాలుగాను, అల్పప్రాణాలను మహాప్రాణాలుగను కొందరు పలుకుతారు. ఈ అంశంలో సరి అయిన శ్రద్ధ లేకపోవటం ఒక కారణం. కొందరు అభ్యాసం లేకపోవటం చేత మహాప్రాణాక్షరాలను ఉచ్చరింపలేరు.

7. <u>ఆవేశావిష్కారం</u> - భాష భావవాహకం. భావాలు కొన్ని సందర్భాల్లో ఆవేశాలను ఆవిష్కరింపవచ్చు. కొన్ని క్రోధావేశ పూరితాలు. కొన్ని వాదావేశ పూరితాలు. ఏ ఆవేశం అయినా తీవ్రతను పొందినప్పుడు భాషలో కూడ తీవ్రత వ్యక్తం అవుతుంది. ఆ సందర్భాలలో అక్షరాలను ఊది పలకటమో, ఊష్మత్వాన్ని కల్పించి పలకటమో, అక్షరాలను దీర్ఘీకరించి పలకటమో సంభవిస్తుంది. ఈ కారణం చేత ధ్వనులలో మార్పులు కలుగవచ్చును.

8. <u>సౌకుమార్య నివేశనం</u> - ఆవేశావిష్కరణకు వ్యతిరేకమైనది ఈ కారణం. కొన్ని వర్ణాలు సహజంగా లలితంగాను, కొన్ని వర్ణాలు కటువుగాను ఉంటాయి. కొందరు కఠినమైన వర్ణాలను కూడ లలితంగానే ఉచ్చరిస్తారు. ఈ కారణంగా ధ్వనుల మార్పులు సంభవింపవచ్చును.

**బి. <u>బహిరంగ కారణాలు</u>** - సామ్యం, అనుచిత విభాగం మొదలైన బహిరంగ కారణాల వలన కూడ ధ్వనులలో మార్పులు ఏర్పడవచ్చు. ఈ కారణాలను ఈ క్రింది విధంగా పేర్కొనవచ్చు.

1. <u>దేశభేదం</u> - ఇంగ్లీషులోని ice, snow మొదలైన మాటలకు తెలుగులో 'మంచు' అని ఒకే అర్థం ఉంది. ఆ రెంటికి భేదం తెలుగు మాటలలో గోచరం కాదు. శీతోష్ణాది పరిస్థితుల వలన, దేశభేదం వలన సక్రమమైన ఉచ్చారణ కానరాదు. తెలుగు

ధ్వనులను పాశ్చాత్యులు పలికేటప్పుడు వింత పరిణామాలు ధ్వనులలో ఏర్పడతాయి.

2. <u>కాల భేదం</u> - ఒక విధమైన ధ్వనులు కాల భేదం వలన భిన్న ధ్వనులుగా ఉచ్చరింపబడతాయి. పాణిని కాలం నాటికి 'ర' వర్ణం మూర్ధన్యం. కాని ఈనాడు అది దంత్యం.

3. <u>సమాజ భేదం</u> - ఒకే శబ్దం ఒక భాషా సమాజం ఒక విధంగాను, పరిసర భాషా సమాజం మరియొక విధంగానూ ఉచ్చరిస్తుంది. వృత్తులను బట్టి, కులాలను బట్టి, ఆర్థిక పరిస్థితులను బట్టి, ప్రవర్తనా విధానంలో భేదం ఉన్నట్లుగానే భాషోచ్చారణలో కూడ భేదం కన్పిస్తుంది. మహాప్రాణాలు అల్పప్రాణాలు కావటం. శ-ష-స లు విపర్యాసం పొందటం, స్వర విశ్లేషం మొదలైనవి సమాజభేదాన్ని అనుసరించి ప్రవర్తించే ధ్వని భేదాలే.

4. <u>అన్యభాషాసంసర్గం</u> - ఇతర భాషలతో సంబంధం ఏర్పడినప్పుడు ఆ భాషా ధ్వనులను స్వీయ భాషాధ్వనులను వినిమయం చేసి పలకటం కనిపిస్తుంది. ఇంగ్లీషులోని 'కాఫీ' అనే పదంలోని చివరి అక్షరం తెలుగులో లేదు. తెలుగులో 'ఫలము' మొదలైన చోట్ల ఉన్న అక్షరం కంటె అది భిన్నం. అయినప్పటికి కొందరు 'కాఫీ' లోని దంత్యోష్ఠ్యాన్నే 'ఫలము' లోని ఉభయోష్ఠ్యానికి మారుగా పలుకుతారు. హిందీ మొదలైన భాషల సంసర్గం చేత నేటి తెలుగులో ప్రత్యయ రహిత రూపాలు, హలంత రూపాలు ప్రాచుర్యాన్ని పొందాయి.

5. <u>లిపి నిర్బంధం</u> - ఇంగ్లీషులోని Bank అనే పదం బాంక్, బ్యాంక్, బేంక్, బ్యాంకి మొదలైన రూపాలను పొందటానికి లిపి నిర్బంధమే కారణం.

6. <u>ఛందో నిర్బంధం</u> - ఛందస్సునకు అనుగుణంగా, సంగీతానికి అనుగుణంగా కొన్ని పదాలు కొంత సర్దుబాటును పొందుతాయి. తెలుగులో హ్రస్వ దీర్ఘాలు విశిష్ట వర్ణాలు. కరము, కారము - ఇత్యాదులు. వీటిని ఛందస్సులో ప్రయోగించేటప్పుడు కొన్ని వ్యత్యాసాలు పొందవచ్చు.

మరొక విధమైన మార్పు ద్రావిడ భాషలలో ముఖ్యంగా తెలుగులో ఉంది. ఒక అచ్చు ఒక రూపంతో ఉండగా ప్రక్క అచ్చువలన మొదటి దాని రూపం మారుతుంది.

ఉదా॥ వాని + కు - వానికి, దీని + ను - దీనిని, శ్రీ + ను - శ్రీని, కత్తి + లు - కత్తులు.

ఈ విధమైన ధ్వని మార్పు తెలుగులో అధికం.

"కు-ను-వు క్రియా విభక్తుల యుత్వంబున కిత్వంబగు" అని చిన్నయ సూరి బాలవ్యాకరణంలో దీనిని సూత్రీకరించాడు. ఈ మార్పును ఆంగ్లంలో "Vowel Harmony" అని కాల్డ్వెల్ నామకరణం చేసి ఉన్నారు. "అచ్చుల పరస్పరాకరణం" అని కొందరు పేర్కొన్నారు. ఈ పద్ధతి వలన రెండేసి రూపాలు ఏర్పడినవి అనేకం ఉన్నాయి. 'నడచు-నడుచు, చలవ-చలువ' మొదలైనవి ఇటువంటివే.

అట్లే అకారం ఇకారంగాను, ఇ-ఉ గాను, అ-ఎ గాను మారిన ఉదాహరణలు ఎన్నో భాషలో కన్పిస్తున్నాయి. 'చంపక' శబ్దానికి 'సంపగి, సంపంగి, సంపెంగ, సంపగ' అనే రూపాలు వాడుకలో ఉన్నాయి. అనుకూలతను బట్టి వివిధ మండలాలలో వివిధ రకాల ఉచ్చారణ ఏర్పడుతుంది. పదాలలో కొన్ని వర్ణాలు లోపించటానికి ఆ అక్షరాలపై కల ఊనిక ఒక కారణం అవుతుంది.

### 15.1.4 వర్ణ సమీకరణం (Assimilation)

రెండు భిన్న వర్ణాల కూడిక ఏక వర్ణంగా మారటం వర్ణ సమీకరణం. మిక్కిలి విజాతీయాలైన రెండు వర్ణాలు కాని, స్వల్ప

భేదం కలిగిన రెండు వర్ణాలు కాని సంయుక్తాలు అయినట్లయితే అనేక రూపాలను పొందుతాయి. దీనికి కారణం ఏమిటంటే రెండు జాతుల కూడిక ఉచ్చారణలో క్లేశాన్ని కలిగించటమే.

సంస్కృతంలోని 'అక్షరం' అనే పదంలోని 'క' కారం స్పర్శం, కంఠ్యం, షకారం మూర్ధన్యం, ఊష్మం. వాటి ఉచ్చారణలో ప్రయత్నాలు చాలా విజాతీయాలు. కాబట్టి

అక్షరం > అక్ఖరం = అక్కరం అను రీతిలో మార్పు చెందింది. ఇదే విధంగా

తత్ + చరితం = తచ్చరితం - దంత్య తకారం తాలవ్య చ కారంగా మారింది.

ధనుస్ + శింజినీ = ధనుశ్శింజినీ. స, శ లు ఒకటి దంత్యం. రెండవది తాలవ్యం. కాబట్టి వర్ణ సమీకరణ జరిగింది. సంస్కృతంలోని సంధికార్యమూ, తెలుగులోని అనేక తద్భవాలలోని అక్షర పరిణామమూ వర్ణ సమీకరణ మార్గంలో ఏర్పడిందనటం స్పష్టం.

| | సంస్కృతం | ప్రాకృతం | సంస్కృతం | తెనుగు |
|---|---|---|---|---|
| 1. | కల్పసూత్ర (ము) | కప్పసుత్త (ము) | భక్తి | బత్తి |
| 2. | ప్రపౌత్ర | పవుత్త | కుర్కురము | కుక్క |
| 3. | పచ్యమాన | పచ్చమాన | కూర్పాసము | కుప్పసము |
| 4. | చత్వర | చత్తర | కృష్ణ | కన్న |

ఈ ధ్వని పరిణామాన్ని అనుసరించియే ప్రాచీన ద్రావిడ పదాలు కూడ మార్పులను పొంది తెలుగు పదాలయ్యాయి.

నెఱ + మది = నెమ్మది, కలదు - కద్దు, ఎత్తి - ఎడ్డ, ఎడ్డ

కఱ + పు = కర్పు = కప్పు, చురుట్టు = చుర్టు = చుట్టు, వరు + చు వర్చు - వచ్చు.

శ్రేష్ఠి = సెట్టి, శక్తి - సత్తి, అర్పణము - అప్పనము, కొలది = కొల్ది = కొద్ది, చలిది > చల్ది > చద్ది

### 15.1.5 వర్ణ విభేదనం (Dissimilation)

ఒకే ధ్వని ఒక శబ్దంలో మిక్కిలి సమీపంగా ద్విరుక్తమయినప్పుడు మారుతూ ఉంటుంది. ఇది ఉచ్చారణలో సౌకర్యం కోసం ఏర్పడిన మార్పు అనియే చెప్పవలసి ఉంది. రెండుసార్లు అదే ధ్వనిని ఉచ్చరించినప్పుడు తడబాటు కలిగి వేరొక ధ్వని ఒకదాని స్థానంలో ఏర్పడుతుంది.

1. లాటిన్ భాషలో పెరెగ్రినమ్ = తిరుగుట అనే పదం ఆంగ్లం లోనికి వచ్చినప్పుడు ఒక రేఫ లకారంగా మారి 'పిల్‌గ్రిమ్' (యాత్రికుడు) అనే రూపం ఏర్పడింది.

2. సంస్కృతంలో లిట్టు రూపాలలోను, జుహోత్యాదులలోను అభ్యాసంలో వర్ణ విభేదనం ఏర్పడుతుంది.

కృ + కృ = చక్ర, హు + హు = జుహు, ధా + ధా = దాధా అని మారి చకార, జుహోతి, దధౌ అనే రూపాలు సిద్ధమయ్యాయి.

3. తెలుగులో బాలు + లు = బాలురు అనే రూపంలో ల కారం రేఫగా మారుతుంది. ఈ మార్పు దీర్ఘ పూర్వలో పథమయిన అదంతానికే కలుగుతుంది. క్రియలలో ఈ మార్పు అధికం. పచ్ + ఇంచు + ము = పచింపుము - ఇక్కడ చ వర్ణం ప వర్ణం అయింది. అట్లే ఆవులించి + ఇంచు = ఆవులింపించు, చూచు + ఇంచు = చూపించు.

### 15.1.6 తాలవ్యీకరణం (Palatalisation)

సాధారణంగా ప్రాచీనాలయిన కవర్గాక్షరాలు చవర్గాక్షరాలుగా మారతాయి. ఈ మార్పు పెక్కు భాషలలో ఉంది.

1. సంస్కృతంలో 'చరుః' అనగా హోమం చేయటానికి ఉడికించిన అన్నం అని అర్థం. దీనికి లాటిన్ భాషలో 'కెరు' అనే పదం ఉంది.

2. సంస్కృతంలో 'వాచ్' అనే శబ్దం 'వాక్' అనే రూపాన్ని పొందుతుంది. కొన్నిచోట్ల 'చ' కారం, కొన్ని చోట్ల 'క' కారం పరస్పరం మారుతూ ఉంటుంది.

3. ప్రాచీన ద్రావిడ భాషలోని 'క' కారం తెలుగులో 'చ' వర్ణం అయింది. 'కిళి'(త) - చిలుక(తె), కయి(త), చెయి(తె) కెందొవ - చెందొవ మొదలైన రూపాలు ఇటువంటివే.

### 15.1.7 ఆనునాసిక్యం (Nasalisation)

వర్గాక్షరాలలో చివరి అక్షరాలు నాసికను అనుసరించి ఉచ్చరింపబడటం చేత వాటిని అనునాసికాలుగా భాషాశాస్త్రవేత్తలు పేర్కొన్నారు. నాసిక నుండి గాలిని వదిలినట్లుగా ధ్వనిని ఉచ్చరించటం అనునాసిక్యం యొక్క లక్షణం. కాని శైత్యభారం చేత ముక్కు మాటలు రావటం వల్లను శ్రావ్యంగా ఉంటుందనే భావం చేతను, పెద్దలు ముక్కుతో ఉచ్చరించినప్పుడు వారిని చూసి అనుకరించటం వల్లను అనునాసికాలు కాని అక్షరాలు కూడ అనునాసికాలుగా ఉచ్చరింపబడటం సంభవింపవచ్చు. ఈ విధంగా కొన్ని వర్ణాలు ఆనునాసిక్యాన్ని పొందటం తెలుగులోను, ఇతర ద్రావిడ భాషలలోను కానవస్తుంది. ఇది అనేక రీతులలో కన్పిస్తుంది.

ఉదా॥ ఎండ్రి = యెండ్రి = ఇండు (తమిళం)

పాటోళి = మాట్సో, కడుదురు = కణుదురు

బెడకు = బెణకు, బుఙ్గటకొమ్ము = ముఙ్గటకొమ్ము

బుస్సు = ముసుళి, వనబు = వనము.

వర్గాక్షరాలకు ముందు నిర్నిమిత్తంగా వర్గపంచమాక్షరాలు చేరుతూ ఉండటం, పూర్వం ఉన్న అక్షరాలు భ్రష్టం కావటం కూడ సంభవిస్తుంది. తెలుగులో హ్రస్వ పూర్వ సిద్ధాలు అర్ధానుస్వారం ఉన్న పదాలన్ని రెండు రూపాలతో వాడబడుతున్నాయి. వాటిలో కొన్నిటిలో ప్రాచీనమయిన ఆనునాసిక్యం భ్రష్టం అయింది. కొన్నిటిలో కొత్తగా చేరింది.

అంట = అఁట, ఇంక = ఇఁక, చుండు = చుఁడు. దీర్ఘం మీద పూర్ణబిందువులు పోయి ఖండ బిందువులుగా మారాయి.

### 15.1.8 శ్వాసత - నాదత (Unvoicing, Voicing)

శ్వాసాక్షరాలు, నాదాక్షరాలు పరస్పరం మార్పు చెందుతూ ఉంటాయి. క-చ-ట-త-ప లు గ-జ-డ-ద-బ లుగా మారతాయి. ముందు నాదాత్మకమైన నకారం వచ్చినట్లయితే అంటే ద్రుత ప్రకృతికాల తరువాత, ప్రథమాంతాలైన కళలపైన కూడ క-ట-త లు, గ-డ-ద లుగా మారతాయి. సమాస మధ్యంలో ఈ మార్పు బహుళంగా కానవస్తుంది. ప్రథమ మీది 'చప' లు - 'సవ' లుగా

మారటం బహుళం.

శ్వాసం నాదంగా మారటానికి అవసరం అయిన ప్రయత్నం అత్యల్పం. మొదటిదాని ఉచ్చారణలో నాదతంత్రులు శిథిలాలుగా ఉంటాయి. రెండవదాని ఉచ్చారణలో అవి బిగిసి ఉంటాయి. శ్వాసాక్షరాలను ఉచ్చరించటానికి ముందు నాదాత్మకమయిన వర్ణాలను ఉచ్చరింపవలసి నప్పుడు వాని సాహచర్యం వలన ఆ ప్రయత్నం వీటికి కూడ వర్తిస్తుంది. ఈ మార్పుకు హేతువు వాచకుని సోమరితనమే.

పదాదిలోను, పదమధ్యంలోను, పదాంతంనందు కూడ ఈ మార్పు కారణం లేకయే వస్తూ ఉంటుంది. ఒకప్పుడు సంధిలో కలిగిన మార్పును, సమాసంలో వచ్చిన రూపాంతరాన్ని మనస్సులో పెట్టుకొని అనుచిత పదవిభాగం చేయటం వల్లను ఇవి ఏర్పడుతూ ఉంటాయి.

కడచు = గడచు, చీరాడు = జేరాడు, చెముడు = జెముడు, టీకొను = డీకొను

టిల్ల = డిల్ల, బ్రతుకు = బ్రదుకు, తటాకము = తడాకము, సెక = సెగ

గ్రంథి = కంతి, కోడరికము = కోటరికము, ఘాసవు = కసవు, గుచ్ఛము = కుచ్చు

తూరు = దూరు, ద్విభాషి = తుపాసి, బాలిశుడు = పాలసుడు, భీరుక = పిరికి, బిడాలము = పిల్లి.

### 15.1.9 లోపదీర్ఘత (Compensatory Lengthening)

ఉచ్చారణలో ఒక అక్షరం లోపించి, ఆ విధంగా లోపించటం వలన కలిగిన హ్రస్వతను పూరించటానికి ప్రక్క అచ్చు దీర్ఘతను పొందుతుంది.

మొగము = మోము, చివుకు = చీకు, దనుక = దాక పొగపు = పోపు, సగము = సాము, నివుఱు = నీరు.

### 15.1.10 స్వర భక్తి (Anaptysis)

ఈ మార్పు వేదకాలంలోనే ఉన్నట్లు వైయాకరణులు పేర్కొన్నారు. 'ఇంద్ర' శబ్దం 'ఇందర' అని మధ్య ఒక అచ్చు చేరి ఉచ్చరింపబడినట్లు తెలియవస్తుంది. సంయుక్తాక్షరం నడుమ ఒక అచ్చు చేరి ఉచ్చారణను తేలిక పరచటమే దీని లక్షణం. దీనినే వికర్ష, విప్రకర్ష అని వ్యవహరిస్తారు.

శబ్దము = సబుదము, చంద్రుడు = చందురుడు, ద్వారము = దువారము, హర్షము = అరుసము, దర్శనము = దరిసెనము.

### 15.1.11 స్వరాగమం (Protheosis)

కొన్ని హల్లులకు ముందు ఉచ్చారణలో అచ్చు ఒకటి చేర్పబడుతుంది. ఇటువంటి అభ్యాసం సంస్కృతంలోని సకార, రేఫలు ఆదిలో ఉన్న పదాలు తమిళంలోనికి వచ్చినప్పుడు కన్పిస్తుంది. ఆంగ్లం నుండి వచ్చిన ఇస్కూలు, ఇస్టాండు, ఇస్టేషను మొదలైన పదాలలో ఇది కన్పిస్తుంది.

రాజు = అరసు, రక్తము = ఇరకతము, రథము = అరదము.

### 15.1.12 వర్ణనాశం (Synecope)

రెండు హల్లుల నడుమ ఉన్న అచ్చు ఉచ్చారణ త్వరలో నశించి ఆ రెండు హల్లులు కలసి మరికొంత కాలానికి సమీకరణం

కలుగుతుంది. ఈ వర్ణనాశం స్వరభక్తికి వ్యతిరేకమైనది.

వలదు = వల్దు = వద్దు, కొలది = కొల్ది = కొద్ది, పితరులు = పితాళ్ళు.

**15.1.13** సవర్ణలోపం (Haplology)

సాధారణంగా ఒక శబ్దం చివర వచ్చిన హల్లు తరువాతి శబ్దం మొదట వచ్చి ఆ రెండు కలిసినప్పుడు ఒక వర్ణం లోపిస్తుంది.

శష్పు + పింజరః = శష్పింజరః, శేవ + వృధః = శేవృధః, పెద్ద + తనము = పెత్తనము, కుత్తిక + గంటు = కుత్తిగంటు,

బొంత + దళము = బొందళము, ఎనుప + పసరము = ఎనుపసరము, ఎనుప + పెంటి = ఎనుపెంటి

**15.1.14** వర్ణవ్యత్యయం (Metathesis)

ఉచ్చారణలో తడబాటు వలన ముందున్న అక్షరం వెనుకకు, వెనుకనున్న అక్షరం ముందునకు మారి ఉచ్చరింపబడుతుంది.

నవ్వులాట = నవ్వుటాల, జోనడ = జోడన, వారువము = వావురము, పారువము = పావురము

**15.1.15** వర్ణాగమం (Addition of a syllable)

కొన్ని పదాల సామ్యం వలన ఇతర పదాలలో తప్పుగా క్రొత్త అక్షరాలు చేరుతూ ఉంటాయి.

నడిరేయి = నడికిరేయి, వేగుచుక్క = వేగురుచుక్క, పితలాటకం, కోలాటకం, దొంగాటకం మొదలైన శబ్దాలలోని 'క' వర్ణం పై రీతిలో వచ్చినటువంటిదే.

నడవడి = నడవడిక, సాలు = సాలువు, బొటవ్రేలు = బొటనవ్రేలు, విటతాటము = విటతాటనము.

**15.1.16** అనుచిత విభాగం (Wrong Splitting)

ఇది తెలుగు విభక్తులలో ప్రథమా విభక్తిలోని 'లు' ప్రత్యయం ఏర్పడటానికి మూలం అయింది. ద్రావిడ భాషలలోని 'కళ్' ప్రత్యయం కిళికళ్ = చిలుకలు అని మారి చివరి 'లు' ప్రత్యయంగా ఏర్పడింది.

ద్రుతం తరువాత ఉన్న అచ్చు కలిసినప్పుడు సంధి రూపాన్ని తప్పుగా విరిచి నకారాది పదాలను కల్పించటం ఇటువంటిదే.

తెన్నగాన్ + ఎగసెను = తిన్నగా + నెగసెను, మిగులంగన్ + ఆలి = మిగులుగ + నాలి, ఆలి, నాలి = పరిహాసము,

సభన్ + ఏని = సభనేని = సభ + నేని.

**15.1.17** సామ్యం (Analogy)

ఒక సంధి కార్యం కాని, శబ్ద రూపం గాని, ప్రత్యయం గాని చూచి ఇంకొక చోట కూడ అదే విధంగా కల్పించటం సామ్యం అని చెప్పబడుతుంది. భాషలో ఏర్పడిన భేదాలను, సామాన్య సూత్రాలను అపేక్షించి ఏర్పడిన అపవాదాలను తొలగించి భాష నంతటిని ఒకే పద్ధతిలో ఏక రూపాన్ని పొందించటమే ఈ సామ్యం వలన కలిగే ప్రయోజనం. ఇది చాల విశాలమైన విషయం. అన్ని భాషలలోను, అన్ని స్థితులలోను వింత మార్పులను కల్పించే టటువంటిది ఈ పద్ధతి.

1. సంస్కృతంలోని అకారాంత శబ్దాల తృతీయా విభక్త్యంత రూపాలు రామేణ, రామైః అనే రూపాలు సర్వనామాల యొక్క 'తేన, తైః' అనే తృతీయాంతాల సామ్యం వలన కలిగినవి.

చన్నులు = చండ్లు = చళ్ళు, కన్నులు = కండ్లు = కళ్ళు అనే రూపాల సామ్యం వలన పళ్ళు = పండ్లు = పన్నులు. 'పన్ను' అనే ఏకవచన రూపాన్ని కల్పించారు. కాని 'పల్లు' అనే పదమే సరి అయిన ఏకవచనం.

ఔపవిభక్తిక శబ్దాల సామ్యం వలన అనేక విధాలయిన అనౌప విభక్తికాలు ఔప విభక్తికాలుగా మారిపోయాయి. అదే విధంగా అనౌప విభక్తికాలు ఔప విభక్తికాలు అయ్యాయి.

ఆనునాసిక్యం కలగటం, తొలగటం సామ్యం వలననే కలుగుతుంది. సామ్యం వలననే కృత్ప్రత్యయాలను తద్ధిత ప్రత్యయాలుగా ప్రయోగించటం కన్పిస్తుంది. 'గౌరము' అనే పదం మీద కృత్ప్రత్యయం అయిన 'అనీయ' ను చేర్చి 'గౌరవనీయుడు' అనే పదం కల్పింపబడింది.

ఇదే విధంగా ప్రావీణ్యత, రామణీయకత్వం మొదలైన అప శబ్దాలు రూపొందాయి. ప్రావీణ్యం, రామణీయకం అనేవి భావార్థక రూపాలుగా గుర్తింప వలసి ఉంది.

'అచ్చుట' అనేది సప్తమ్యంత రూపం. దానిని మరచి మరల దానిపై ఇతర శబ్ద సామ్యం వలన 'కు' ప్రత్యయం చేర్చి 'అచ్చుటకు' అనే రూపాన్ని కల్పించారు.

### 15.1.18 సంప్రసారణం

యణాదేశ సంధిలో 'ఇకోయణచి' అనే సూత్రం ప్రకారం ఇ ఉ ఋ ల స్థానంలో క్రమంగా య వ ర లు ఏర్పడతాయి. దీనికి వ్యత్యస్త విధానం సంప్రసారణం. య - వ - ర ల స్థానంలో ఇ - ఉ - ఋ లు రావటం దీని లక్షణం. ఇది తెలుగులో అత్యల్పం. 'వ' కారం పదాదిని గాని, పదమధ్యంలో గాని 'ఒ' వర్ణంగా మారటం కన్పిస్తుంది. ఇదే సంప్రసారణం అని కొందరు పేర్కొన్నారు. 'ఎ' కారం, 'ఒ' కారం కూడ పరస్పరం మారుతూనే ఉంటుంది.

ఒద్ద = వద్ద, ఒక్కటి = వక్కటి, వద్దు = ఒద్దు, ఒయ్యారము = వయ్యారము, ఓమము = వాము, వడ్డి = ఒడ్డి.

### 15.1.19 వ్యంజనాయామం (Doubling)

హల్లులు జడ్డలు కావటం వ్యంజనాయామం. అచ్చుల ఉచ్చారణ కాలాన్ని పొడిగించి నట్లయితే హ్రస్వం దీర్ఘం అవుతుంది. అదే విధంగా ఒక హల్లును ఉచ్చరించే కాలాన్ని పొడిగించినట్లయితే ఆ హల్లునకు ద్విత్వం కలుగుతుంది. కనుక అచ్చులు హ్రస్వ దీర్ఘాలుగా మారినట్లుగానే హల్లు హ్రస్వం కావటం కూడ సంభవిస్తుంది.

ఉయ్యేల = ఊయేల, అక్కట = అకట, ప్రెగడ = ప్రెగ్గడ, ఆ + చోటు = అచ్చోటు, చిటుకు = చిటుక్కు, చిట్టి = చిటి, ఇటువంటివి భాషలో అనేకం ఉన్నాయి.

### 15.1.20 సంయుక్తాక్షరాలలోని అక్షరలోపాలు

సంయుక్తాక్షరాలలోని కొన్ని వర్ణాలు తొలగిపోతాయి. క్రొత్త = కొత్త, తోడ్పాటు = తోపాటు, స్థానము = తానము, కరండి = గంటె, అరంటి = అంటి, వ్రాయు = రాయు, ఇత్యాదులు ఉదాహరణలు.

### 15.1.21 ముగింపు

ఈ విధంగా తెలుగు భాషలో ధ్వనుల మార్పులు పలురీతుల గ్రహింపబడుతున్నాయి. ఆయా ధ్వనులలోని మార్పుల పద్ధతులను గ్రహించి ఏది ప్రాచీన రూపమో, ఏది నవీన రూపమో గుర్తింప వలసి ఉంది. ధ్వనుల మార్పులన్ని సహేతుకమైనట్టి సూత్రపద్ధతిలో ఏర్పడినవని కూడ దీనివలన తెలియవస్తుంది.

## 15.2. సంధి స్వరూపం

### 15.2.1 ఉద్దేశం

రెండు అక్షరాల కలయిక సంధి. భాషలో సంధి అనేది అనివార్యం. సంధి స్వరూపాన్ని బట్టి సంధి జరిగిన విధానాన్ని బట్టి తెలుగు భాషలో సంధి స్వరూపాన్ని గురించి చర్చించటం ఈ పాఠం యొక్క ఉద్దేశం. భాషా శాస్త్రాధ్యయనం చేసే విద్యార్థులకు, పరిశోధకులకు తెలుగు సంధి స్వరూపాన్ని గురించి కొంత పరిచయాన్ని విశ్లేషణను అందించటం ఈ పాఠం ప్రయోజనం.

### 15.2.2 సంధి - నిర్వచనం

'సంధి' అనే పదం ఇతర శాస్త్రీయ పదాల వలెనే సంస్కృతం నుండి తెలుగులోనికి వచ్చి చేరింది. 'సమ్' అనే ఉపసర్గ ముందు చేరిన 'ధా' ధాతువునకు 'కూడు' లేక 'చేరు' అని అర్థం. 'సంధి' అంటే కలయిక, చేరిక అని అర్థాలు. సంహిత కలిగినప్పుడు సంధి ఏర్పడుతుందని సంస్కృత వైయాకరణులు "పరః సన్నికర్షః సంహితా" అనే సూత్రం ద్వారా పేర్కొన్నారు. రెండు అక్షరాలను ఉచ్చరించేటప్పుడు అర్థమాత్రా కాలంకంటె అధిక వ్యవధానం లేకుండటం 'సంహిత' అని వ్యాకర్తల చేత నిర్ణయింపబడింది.

సంస్కృతంలో అచ్చులకు, హల్లులకు నాలుగు విధాలయిన మార్పులలో సంహిత కలుగుతుందని పేర్కొన్నారు. అవి ఆగమ, లోప, వికార, ప్రకృతి భావాలు. తొల్కాప్పియనార్ తమిళ గ్రంథంలో ఈ నాలుగిటికి తమిళ పదాలను ప్రయోగించి పేర్కొన్నాడు.

1. పుణర్చి = సంధి, 2. మెయిపిఱిదాదల్ = వర్ణవికారః, 3. మిగుదుల్ = ఆగమః, 4. కున్దల్ = లోపః,
5. ఇయల్పు = ప్రకృతిభావం.

అచ్చు + అచ్చు, అచ్చు + హల్లు, హల్లు + అచ్చు, హల్లు + హల్లు, అని నాలుగు విధాలుగా సంధి కార్యాలు జరుగుతాయని తొల్కాప్పియనారు గుర్తించాడు.

కన్నడంలో కేశిరాజు 'మణిదర్పణం' అనే కావ్యంలో "రెండు గాని అధికంగా గాని వర్ణాలు పరస్పరం కూడేటటువంటిది సంధి" అని సంధి లక్షణాన్ని నిర్వచించి ఉన్నాడు.

ప్రాచీన తెలుగు వైయాకరణులైన మూలఘటిక కేతన విన్నకోట పెద్దన కూడ సంధి నిర్వచనాలను ఇచ్చియున్నారు. వీరి నిర్వచనాలలో పూర్వాంత్య వర్ణాలని మాత్రమే పేర్కొనబడింది. అనంతరం అథర్వణుడు సంధిని నిర్వచించి దానిలో 'స్వర' శబ్దాన్ని ప్రయోగింపక 'వర్ణ' శబ్దాన్ని ప్రయోగించాడు.

చిన్నయసూరి 'సంధి' ని నిర్వచిస్తూ "పూర్వపర స్వరంబులకు పరస్పరం బేకాదేశంబగుట సంధి" అని సూత్రీకరించాడు. దీనిలో 'వర్ణం' అని ఉపయోగింపక చిన్నయ సూరి 'స్వరం' అనే పదాన్ని ప్రయోగించాడు.

ప్రౌఢ వ్యాకరణ కర్త అయిన బహుజనపల్లి సీతారామాచార్యులు 'సంధి' శబ్దాన్ని చిన్నయ సూరి అర్థంలోనే ప్రయోగించాడు.

ద్రావిడ భాషలలో సంధిని తొల్కాప్పియనార్ పేర్కొనిన రీతిలో అచ్చు + అచ్చు, అచ్చు + హల్లు, హల్లు + అచ్చు, హల్లు + హల్లు అని నాలుగు రీతులుగా గ్రహించటం సముచితం.

1. అచ్చు + హల్లు, 2. అచ్చు + అచ్చు, 3. హల్లు + అచ్చు, 4. హల్లు + హల్లు.

### 15.2.3 సంధి హేతువులు

సంధి కార్యాలు భాషలో స్వతస్సిద్ధంగా ఏర్పడినవే. అవి ఒకరి చేత కల్పింపబడినవి కావు. ఆంగ్ల భాషలో కావలసినంత సంధి ఉంది. కాని ఉచ్చారణకు లేఖన క్రమానికి సంబంధం అంతగా ఉండాలనే పట్టుదల ఆంగ్ల భాషా భాషీయులకు లేదు. కనుక వారు ఆ సంధిని వ్రాతలో నిరూపించక పదాలను ప్రకృతి భావంతోనే వ్రాస్తూ ఉంటారు. "What have you done with that book" ఈ వాక్యాన్ని వ్రాసినప్పుడు సంధి లేకుండ ప్రకృతి భావంతోనే వ్రాస్తారు. కాని ఉచ్చరించినప్పుడు ఆ పదాలన్నీ కలిసి సంధిగానే ఉచ్చరింపబడతాయి.

తెలుగులో 'వాడు ఎక్కడ' అని ప్రకృతి భావంతో ఉచ్చారణ సామాన్యం కాదు. 'వాడెక్కడ' అని కలిపి సంధి రూపంలోనే పలుకుతారు. అదే విధంగా వ్రాయటం కూడ సంభవిస్తుంది. ఈ విధంగా ఉచ్చారణలో ఏర్పడిన సంధినే పరిశీలించి వైయాకరణులు సంస్కృతంలోను, ఆంధ్రంలోను తాము అంగీకరించిన ప్రమాణ ప్రయోగాలననుసరించియే లక్షణాలను నిర్వచించారు.

### సంధికార్యాలకు హేతువులు

1. ప్రకృతి భావ నివారణ, 2. సమీకరణం.

ప్రకృతిభావం అంటే అచ్చులను హల్లులను పదవిభజనలో ఏ విధంగా ఏర్పడినా వాటిని ఆ విధంగానే వ్రాయటం. ఈ నియమం సందర్భాన్ని బట్టి, ఆచారాన్ని బట్టి అనుసరింపదగినటువంటిది కాని పూర్వులు సంధిని అంగీకరించియే వ్రాసి ఉన్నారు. ప్రకృతి భావ నివారణమే ద్రావిడ భాషలు అన్నిటిలోను జనులకు ఇష్టమైనది. ప్రామాణికులచే అంగీకరింపబడింది. వ్యాకరణ సూత్ర నిబద్ధం. దీనికి కారణాలు రెండు కన్పిస్తున్నాయి.

1. రెండచ్చులను కూర్పక వేరుగా ఉచ్చరించటంలోని క్లేశం.

2. తెలుగులోని అసంకీర్ణ పదాలలో రెండు, మూడు అచ్చుల కంటె ఎక్కువ ఉండవు.

సంధి కార్యాలకు రెండవ హేతువు సమీకరణం. ఉచ్చారణ సౌలభ్యమే దీని ఫలితం. ఈ రెండు హేతువుల వలన తెలుగులో సంధి ఏర్పడింది.

### 15.2.4 తెలుగు సంధి స్వరూపం

### 1. యవల ఆగమం

'సంధి లేనిచోట స్వరంబు కంటెం బరంబయిన స్వరంబునకు యడాగమంబగు", అని చిన్నయ సూరి యడాగమాన్ని సూత్రీకరించాడు. చిన్నయ సూరి అభిప్రాయంలో పూర్వ పరస్వరాలకు పరస్వరం ఏకాదేశం కావటం సంధి. అటువంటి సంధి రానిచోట అచ్చునకు అచ్చు పరమైనప్పుడు ప్రకృతి భావ నివారణ కోసం నడుమ యడాగమాన్ని చిన్నయ సూరి విధించాడు.

కన్నడ, తుళు భాషలలో యకార, వకారాలు రెండు అంగీకరింపబడ్డాయి. కాని తెలుగులో వకార విధానాన్ని చిన్నయ సూరి పూర్తిగా నిరాకరించాడు. అంటే ప్రామాణిక భాషలో నన్నయ నుండి నేటివరకు 'వ' కారాగమం లేదని అర్థం. కాని తెలుగులో వకారాగమం కూడ వ్యవహారంలో కన్పిస్తూనే ఉంది. నా వుంగరం, అది వొక్కతె మొదలైనవి ఇటువంటివే.

ఈ యకార, వకారాలు ఉచ్చారణ సౌకర్యాన్ని కల్పిస్తాయి. వీటి స్వభావాన్ని బట్టి ఇవి ఆగమాలని పేర్కొనటం స్పష్టం.

**2. ద్రుత ప్రకృతిక సంధి**

తెలుగులో 'య' కారాగమం సంధిలేని ప్రదేశాలలో కళల తరువాత వస్తుంది. కళలు కానివి ద్రుత ప్రకృతికాలు. చిన్నయ సూరి ఈ విషయంలో 'నకారంబు ద్రుతంబు, ద్రుతాంతములయిన పదములు ద్రుత ప్రకృతికములు" అని సూత్రించాడు. ఈ సూత్రాలను ఆధారం చేసికొని ప్రౌఢవ్యాకర్త "నకారంబ సాధారణంబు ద్రుతంబు" అని సూత్రీకరించి "ప్రత్యయాగమ వ్యయాత్మకమై ఉత్వ విశిష్టమైన నకారంబు ద్రుత సంజ్ఞకంబ" ని వివరించాడు. ద్రుతం అంతమందు కల శబ్దాలు ద్రుత ప్రకృతికాలు.

"షష్ఠీతత్పురుషము నందుకార ఋకారములకు అచ్చు పరమగునపుడు నుగాగమంబగు". ఉదా. రాజు + ఆనతి = రాజునానతి. రాముని - ఆనతి > రామునానతి అనే పదాలలో విశేషణ విశేష్యాలకు మధ్య సంబంధం 'ని' అనే అక్షరం స్థిరీకరిస్తున్నది. అదే విధంగా 'అనునతడు' మొదలైన చోట్ల తద్ధర్మార్థకాలకు అచ్చు పరమైనప్పుడు వచ్చిన నకారం కేవలం ఆగమం కాదు. 'అనును' అనేది తెలుగులో తద్ధర్మార్థకం. దీనినే క్రియాజన్య విశేషణంగా విశేష్యానికి పూర్వం ఉపయోగిస్తారు.

చిగురు + కైదువు = చిగురుంగైదువు, తెల్ల + తనము = తెల్లందనము మొదలగు చోట్ల ఉన్న ద్రుతం కూడ విశేషణ విశేష్య సంబంధాన్నే నిరూపిస్తుంది.

సముచ్చయార్థకమైన 'ను' వర్ణం కూడ ద్రుతమే. ఉదంత రూపాలపై కేవలం 'ను' మాత్రం వచ్చి తక్కిన వానిపై 'ఉను' అని వస్తుంది. రాముడును, లక్ష్మణుడును, సిరియును, హరియును.

ప్రాతాది సంధి కార్యాలలో కూడ నుగాగమం వస్తుంది. శతృ తుమానంతర్య చేదాద్యర్థకాలు ద్రుత ప్రకృతికాలే. వీటిలో ఒక్క శత్రర్థకంలోని నకారం తప్ప ఇక దేనికీ సంధి చేయరాదు.

ఈ పై విషయాలను పరిశీలించినప్పుడు న కారం యవలవలె ప్రకృతి భావ నివారణ కోసం కాక, ప్రత్యేక ప్రయోజనం కోసం వస్తుందని స్పష్టం అవుతుంది. కొన్నిచోట్ల ద్రుతం మీద ద్రుతాన్ని చేర్చటం కూడ కానవస్తుంది. ఉదా. అదియునుంగాక, దివంబునుం బోలె.

**3. టుగాగమ సంధి**

కఱకు + అమ్ము = కఱకు(ట్) అమ్ము = కఱకుటమ్ము

పేరు + ఉరము = పేరు(ట్) ఉరము = పేరుటురము, పేరురము.

పొదరు + ఇల్లు = పొదరు(ట్) ఇల్లు = పొదరుటిల్లు.

"కర్మధారయంబున ఉత్తున కచ్చు పరమగునపుడు టుగాగమంబగు" అని చిన్నయ సూరి పై శబ్దాల నడుమ సంధిని సూత్రీకరించాడు. పై పదాలే కాక మిద్దెటిల్లు, వేల్పుటావు, దుక్కిటెడ్లు మొదలైన శబ్దాలలో కూడ టుగాగమం రావటం సామ్యం వలన సంభవించింది. "పేరుటురము, పేరురము" అని రెండు శబ్దాలు ఏర్పడటానికి కారణం ఏమంటే పేర్, చిగుర్, పొదర్ అనేవి

హలంత శబ్దాలు కావటం వలన రేఫ తరువాతి అచ్చుతో కలిసినప్పుడు ఒక రూపమూ, తుది ఉకారం ప్రకృతి ఉకారంగా భావించటం వలన టుగాగమ రూపమూ ఏర్పడ్డాయి.

**4. రుగాగమ సంధి**

పేద + ఆలు = పేదర్ + ఆలు = పేదరాలు

ముద్ద + ఆలు = ముద్దర్ + ఆలు = ముద్దరాలు

ఇత్యాది శబ్దాలలో రుగాగమం వచ్చింది. "కర్మధారయంబున పేదాది శబ్దంబుల కాలు శబ్దము పరమగునప్పుడు రుగాగమంబగు" అని చిన్నయ సూరి సూత్రం దీనిని వివరించింది.

ఈ పదాల సామ్యం వలన ఇతర స్థలాలలో, ధీరురాలు, గుణవంతురాలు మొదలైన శబ్దాలలో 'రుగాగమం' ఏర్పడింది. 'పొదరిల్లు' అనే శబ్దంలో పూర్వపదం 'పొద' అనిపిస్తుంది. కాని 'పొదరు' అనే శబ్దం కూడ సమానార్థకంగా ఉంది. తమిళంలో 'పుదర్' అనే శబ్దం ఉంది. ప్రాచీన రూపం అయిన 'పొదరు' పూర్వపదంగా 'పొదరిల్లు' అనే రూపం ఏర్పడి ఉంటుంది. 'పొద' అనే దాన్ని పూర్వ పదంగా భ్రమించి కొందరు రకారాన్ని ఆగమంగా పరిగణించారు. 'పొదరుటిల్లు' అనే టుగాగమ రూపం కూడ దీనినే నిర్ధారిస్తున్నది.

**5. ద్విరుక్తటకార సంధి**

'కుట్టుసురు, చిట్టెలుక' మొదలైన శబ్దాలలో 'కుట్రుసుర్, చిట్రిలై' మొదలైన రూపాలు తమిళంలో కానవస్తూ ఉండటం చేత, 'కుఱు, చిఱు' శబ్దాల తొలి రూపాలు 'కుట్, చిట్' అనేవి కావటం చేతను కుట్ + ఉసుర్ = కుట్టుసుర్ = కుట్రుసుర్ = కుట్టుసురు' అని రూపం ఏర్పడిందని చెప్పవచ్చును.

'కుఱు-చిఱు-కడు-నడు-నిడు శబ్దంబుల ఱ-డల కచ్చు పరమగునప్పుడు ద్విరుక్తటకారంబగు' అని చిన్నయ సూరి సూత్రం. భృశార్థంలో కట్టకడ, చిట్టచివర మొదలైన పదాలు ద్విరుక్తాల స్థానంలో ఏర్పడతాయని చిన్నయ సూరి పేర్కొన్నాడు.

**6. ఉత్వసంధి**

తెలుగులోని ప్రథమా విభక్తి ప్రత్యయాలైన 'డు-ము-వు-లు' ఉకారాంతాలే. ఇవి అంతంలో ఉన్న శబ్దాలు అనేకాలు. తత్సమాలు అన్ని చాల వరకు ఇటువంటివే. పదాంతంలో మాత్రమే నిలిచి ఉండటానికి యోగ్యత కలిగి రాముడు, అది మొదలైన పదాల తుదిని వచ్చిన ఉ, ఇ అనే అక్షరాలు సంధిలో కలిసిపోతాయి. కనుక ఉకారసంధి నిత్యంగా ఏర్పడింది.

తమిళంలో పదాంతంలో ఉన్న 'ఉ' కారం కుఱ్ఱియలు ఉకారం అని, ముఱ్ఱియలు ఉకారం అని రెండు విధాలు. సంధిలో కుఱ్ఱియలు ఉకారం నశించిపోయి పరాచ్చు నిలుస్తుంది. ఇంతేకాక ముఱ్ఱియలు ఉకారం కూడ కొన్ని చోట్ల నశించిపోతుంది. ఇలా చివర ఉన్న కుఱ్ఱియలు ఉకారమే తెలుగులో పదాంత ఉకారం అయింది. ఆ భేదం తెలుగులో నశించటం చేత అన్ని ఉకారాలకు సంధి ఏర్పడిందని శ్రీ కోరాడ రామకృష్ణయ్య గారు పేర్కొన్నారు. "ఉత్తునకచ్చు పరమగునపుడు సంధియగు" అని చిన్నయ సూరి సూత్రం.

రాముడు + అతడు > రాముడతడు

వృక్షము + ఇదిగో > వృక్షమిదిగో

విష్ణువు + ఉండెను > విష్ణువుండెను

అలరులు + అలరెను > అలరులలరెను

ఉకారాంతాలయిన ప్రథమేతర విభక్తి ప్రత్యయాలు నాలుగు. అవి 'ను, కొఱకు, కు, అందు' అనేవి. శత్రర్థకమైన 'చు' కూడ ఇటువంటిదే. ఈ అయిదింటికి సంధి వికల్పంగా వస్తుంది. వీటి చివర ఉన్న ఉకారం వికల్పంగా లోపిస్తుందని అర్థం. ఇవి అన్నీ ద్రుత ప్రకృతికాలే.

**7. ఇత్వసంధి**

'ఏమి, మఱి, కి, అది, అవి, ఇది, ఇవి, ఏది, ఏవి' అనేవి ఏమ్యాదులు. వీటిలోని ఇత్వానికి సంధి వికల్పం.

మధ్యమ పురుషలో ఇకారాంతాలయిన వచ్చితిరి, వచ్చితివి అనే వానిలోని ఇత్వానికి సంధి నిత్యం.

వచ్చితివి + ఇపుడు = వచ్చితివిపుడు
వచ్చితిరి + ఇపుడు = వచ్చితిరిపుడు

వీటిలో 'తి' వర్ణం పురుషను, ఇత్వం భూతకాలాన్ని సూచిస్తుంది. క్త్వార్థమైన ఇత్వానికి సంధిలేదు.

వచ్చి + ఇచ్చెను మొదలైన చోట్ల మొదటిది పూర్వకాలిక క్రియ, రెండవది అనంతర కాలిక సమాపక క్రియ. మొదటి క్రియకు రెండవ క్రియకు వ్యవధానం ఉంటుంది. ఆ వ్యవధానాన్ని సూచించటం క్త్వార్థం ధర్మం. కనుక క్త్వార్థ ఇకారానికి సంధి చేయక పోవటం యోగ్యం.

ఉదంత నామానికి అనుకరణలో సంధి రాదు. ఇక్కడ చిన్నయ సూరి వుగాగమాన్ని విధించాడు.

ఇయంధేనుః + అనె = ఇయంధేనువనె. ఇక్కడ 'ఉ' వర్ణం శబ్దగతావయవం. ప్రత్యయం కాదు. ఇక్కడ సంధి వచ్చినట్లయితే 'ఇయంధేనెనె' అనే రూపం ఏర్పడుతుంది. ఇది అసాధురూపం. కాబట్టి ఉకార రూపాన్ని నిలబెట్టటానికి వుగాగమం ఏర్పడింది.

**8. అత్వసంధి**

అకారానికి సంధి బహుళం అని చిన్నయ సూరి మొదలైన వ్యాకర్తలు పేర్కొన్నారు. బహుళం అంటే ప్రవృత్తి, అప్రవృత్తి, విభాష, అన్యరూపం అని నాలుగు విధాలుగా పేర్కొనబడింది.

"క్వచిత్ప్రవృత్తిః క్వచిదప్రవృత్తిః క్వచిద్విభాషా క్వచిదన్యదేవ విధేర్విధానం బహుధా సమీక్ష్య చాతుర్విధం బాహుళకం వదంతి"

దీనిలోని విశేషాంశాలను తెలియచేస్తూ చిన్నయ సూరి "స్త్రీ వాచక తత్సమ సంబోధనాంతాలకు సంధి లేదని" వివరించాడు. కాని దీనికి విరుద్ధాలయిన ప్రయోగాలు కూడ కావ్యాలలో కనిపిస్తున్నాయి. "గంగ + అనుకాసె = గంగనుకాసె" మొదలైనవి ఇటువంటివి.

'వెలయాలు' మొదలైన శబ్దాలలో సంధి లేదని సూరి పేర్కొన్నాడు. 'వెలాలు' అనే రూపం ప్రశస్తం కాదని దీని భావం. 'ఆ' మీద ఉన్న ఉనికి పోకుండటము, 'ఆలు' అనేదాన్ని వేరు శబ్దంగా భావించటమూ దీనికి హేతువులు. కాని 'తలయారి' శబ్దం ఆ విధంగా కన్పించక 'తలారి' అయింది.

ఆకు, అంత, అమ్మ, అయ్య, అన్న అనే పదాలు పరమయినప్పుడు సంధి నిత్యం అని పెక్కురు పేర్కొన్నారు. 'చింతాకు' మొదలైన పదాలలో సంధి యుక్తమే.

'మేనల్లుడు' (మేన + అల్లుడు) మొదలైన చోట్ల సంధి వికల్పం. 'మేన్' అంటే శరీరం. శరీర సంబంధమైన అల్లుడు అని చెప్పవలసి వచ్చినప్పుడు తొలి పదం మీద అత్వం చేరింది. మేన్ + అ + అల్లుడు ఇక్కడి 'అ' సంబంధాన్ని తెలియచేస్తుంది. ఇక్కడి 'అ' కారం సప్రయోజనం కనుక భారతాదులలో దీనికి లోపం కలగలేదు. 'మేనయల్లుడు' అనే రూపం సిద్ధించింది. అనంతర కాలంలో పూర్వపదం 'మేను' అని ఉదంత రూపం అనే భ్రమ వలన గాని, ఉచ్చారణ వేగం వలన గాని 'మేనల్లుడు' అనే రూపం కూడ ఏర్పడింది.

## 9. గసడదవాదేశం

"ప్రథమ మీది పరుషములకు గ-స-డ-ద-వలు బహుళముగా నగు" అని చిన్నయ సూరి సూత్రీకరించాడు.

సంధి ఏర్పడటానికి నిర్దేశింపబడిన కారణాలలో మొదటిదయిన ప్రకృతిభావ నివారణ అనే ప్రయోజనం కోసం పై సంధులు ఉద్దేశింప బడ్డాయి. రెండవ హేతువయిన వర్ణ సమీకరణం ప్రధానంగా ఏర్పడిన సంధి గసడదవాదేశం.

ప్రథమాంతాలయిన కళలపైన, సమాసాల నడుమ 'కచటతప' లు 'గసడదవ' లుగా మారుతున్నాయి.

తమిళంలో పద మధ్యంలో ఉన్నట్లయితే 'క-ట-త' లు 'గ-డ-ద' లుగా ఉచ్చరింపబడటం సర్వసాధారణం. అచ్చుల మధ్య ఉండటం చేత వాటి నాదస్వభావం వీటి మీదకి పాకటం వలన ఈ మార్పు కలిగి ఒక పద్ధతిగా ఏర్పడి సార్వత్రికం అయింది. ఈ పద్ధతియే తెలుగులో "కూరగాయలు, తల్లిదండ్రులు" మొదలైన సమాసాలలో స్థిరపడింది. కనుకనే "ద్వంద్వంబునం బదంబుపయి పరుషములకు గ-స-డ-ద వలగు" అని సూత్రీకరించాడు.

కొన్ని ఉదాహరణలు. వాడు - కొట్టెను > వాడు గొట్టెను / వాడు కొట్టెను, రారు - కదా > రారుగదా / రారుకదా.

చకార సకారాలు ప్రాచీన తమిళంలోనే కాకుండా, నేడు కూడ సాధారణంగా పరస్పరం మార్పు చెందుతూ ఉంటాయి. చ వర్ణం తాలవ్యస్పర్శం. శవర్ణం తాలవ్యోష్మం. సవర్ణం దంత్యోష్మం. ఊష్మత్వ సామ్యం వలన శవర్ణం సవర్ణంగా మారుతూ ఉంటుంది. తెలుగులో కూడ అదే విధంగా నాదత్వం కలిగినప్పుడు చవర్ణం 'స' వర్ణంగా మారుతుంది.

ఉదా॥ అక్క - చెల్లెండ్రు = అక్కసెల్లెండ్రు, ఊరు - పల్లెలు > ఊరువల్లెలు.

ఇది ఈ విధంగా ఉన్నప్పటికీ "అందచందములు, కండ తుండెములు, రాకపోకలు" మొదలైన చోట్ల 'స-వ' లు రాకపోవటం కూడ కన్పిస్తుంది.

చిన్నయ సూరి "తెనుఁగుల మీది సాంస్కృతిక పరుషంబులకు గ-స-డ-ద-వ లు రావు" అని సూత్రీకరించినా కొన్ని ప్రామాణిక ప్రయోగాలలో గసడదవాదేశం కానవస్తూనే ఉంది.

ద్రావిడ భాషలలో ఆనునాసిక్యం కలగటం, తొలగటం ప్రచురంగా ఉంది. అదే విధంగా ఈ గసడదవాదేశం కూడ ప్రచురమూ, ఐచ్ఛికమై ఉంది.

## 10. పుంప్వాదేశ సంధి

"అమహన్నపుంసకముల కదంతములకు మువర్ణకంబగు" నని తత్సమ నామాలకు మువర్ణకం విధింపబడింది. తెలుగు

శబ్దాలు కూడ కొన్ని ముువర్ణకాంతాలు ఉన్నాయి. వీటి ప్రాచీన రూపాలను శాసనాల్లో పరిశీలించినప్పుడు 'రాజ్యమ్బు, సాసనపు, కయ్యమ్బు, క్రమబు' మొదలగు రూపాలు కన్పిస్తున్నాయి. తెలుగులో 'పాము' అని ఉండగా సమానార్థంలో తమిళంలో 'పామ్బు' అని, కన్నడంలో 'హావు' అని రూపాలున్నాయి. తెలుగులోని 'ము' తమిళంలోని 'మ్బు' కన్నడంలోని 'వు' వర్ణాలతో సమానమైనది. శాసనాలను బట్టి కూడ అవి పర్యాయపదాలని తేలుతుంది. "ము విభక్తియతి" లో పు-వు-బు-భు లను ము ప్రత్యయానికి మిత్రాక్షరాలుగా చెప్పటంలో సామంజస్యం కూడ ఇదే. కనుక వృక్షమ్ము-వృక్షంబు-వృక్షంపు-వృక్షపు మొదలైన రీతిలో ప్రథమా విభక్తిలో అనేక రూపాలు ఉండవచ్చు. 'మాయు' అనే క్రియాధాతువు విశేష్య రూపాన్ని పొందటానికి 'పు' అనే కృత్ప్రత్యయాన్ని పొంది 'మాపు' అవుతుంది. ఈ విధంగా కృత్ప్రత్యయంగా ఉన్నది కూడ ప్రథమా విభక్తి ముువర్ణానికి రూపాంతరమే. 'పు' వర్ణమే ప్రాచీనం అని, 'ము' వర్ణం సంస్కృత నపుంసక శబ్దాల సామ్యంచేత అర్వాచీన కాలంలో ఏర్పడిందని కూడ భాషాశాస్త్రవేత్తల అభిప్రాయం.

సరసము-వచనము-సరసపు వచనము, సరసంపు వచనము

"కయ్యముపస, మొగమందము" మొదలైన చోట్ల ము వర్ణకాంత రూపాలతోడి కర్మధారయాలు లేకపోలేదు. దీనిని బట్టి అర్వాదీన కాలంలో 'పు' వర్ణ విధి వైకల్పికం అయింది.

**11. ఆమ్రేడిత సంధి**

తెలుగులో ఆమ్రేడిత సంధి అత్యంత సహజం. సాధారణంగా భృశార్థంలో ద్విరుక్తం కావటం జరుగుతుంది. అందువలన పలికేటప్పుడు ఒక వేగంతో కూడుకొని ఉండటం స్వాభావికం. కనుకనే తెలుగులో ఇంక ఎక్కడా దీర్ఘం మీద సంధి జరగకపోయినా ఆమ్రేడితం పరమైనప్పుడు జరుగుతుంది.

ఓహో - ఓహో > ఓహోహో, ఏమీ - ఏమీ > ఏమేమీ, ఏగి - ఏగి.

మొదలైన చోట్ల పై పదాల సామ్యం వలన సంధి జరుగుతుందని అనిపిస్తుంది. కొంతమంది 'ఎఱిగెఱిగి' అన్న చోట సంధి చేశారు. కాని క్త్వార్థక రూపానికి సంధి చేసినట్లయితే క్రియా నిర్వహణలో పూర్వాపరాల మధ్య వ్యవధానం నశించి పోతుంది. కనుక అక్కడ సంధి చేయకపోవటమే తగినట్టిది. క్త్వార్థకమైన ఇత్వం మీద తప్ప తక్కిన హ్రస్వ దీర్ఘాలయిన అన్ని అచ్చుల మీద ఆమ్రేడిత సంధి జరుగుతుంది.

**15.2.5 ద్రావిడ భాషలలోని సంధి పద్ధతులు - సామ్యాలు (సారాంశం)**

తెలుగు లోని సంధికి, తమిళ, కన్నడ, మలయాళాది ఇతర ద్రావిడ భాషలలోని సంధికి నియతమైన సంబంధం, సామీప్యం ఉంది.

1. తమిళ కన్నడాలలో అంత్య హల్లుల ద్విత్వం ఉంది. తెలుగు అజంత భాషగా మారటం వలన పై లక్షణానికి అవకాశం లేదు.

కణ్ + అ గు (కంటి సొగసు) - తమిళం.

పెణ్ + అంతె = పెణ్ణంతె (స్త్రీవలె) - కన్నడం.

అన్ + ఇష్టసఖి = అన్నిష్టసఖి, తటిత్ + ఉ = తటిత్తు.

2. ప్రకృతి భావ నివారణం అనే హేతువు అన్ని భాషలలోను ఉంది. తెలుగులో అది పరిపూర్ణంగా ఉంది.

3. ఈ భాషలలో పదాంతంలో ఉన్న అ, ఇ, ఉ, ఎ లు లోపించి పరరూప సంధి జరగటం క్వాచిత్కంగా ఉంది. ఈ పద్ధతి తెలుగులోనే పరిపూర్ణమై మిక్కిలి వ్యాప్తి నందిందే.

మాతు + అమ్ = మాతమ్ (మాటను)

మాతిన + ఒళ్ = మాతినొళ్ (మాటలో)

క్రమదె + అయు = క్రమదాయు (కన్నడం) క్రమంగా అయినది.

ఈ విధంగా అనేక ముఖ్య పద్ధతులలో ద్రావిడ భాషలలో సంధి సుమారు ఒకే రీతిగా జరుగుతుంది. ఇవి అన్ని ఒకటే కుటుంబం అని పేర్కొనటం స్పష్టం.

## 15.3 సమీక్ష

తెలుగు భాషలోని ధ్వనులు ఎలా మార్పుచెందాయో తెలుసుకున్నారు. సంధి స్వరూపాన్ని, సంధికి హేతువులను తెలుసు కోవడంతో పాటు తెలుగులో సంధి స్వరూపాన్ని గ్రహించారు.

## 15.4 ప్రశ్నలు

1. భాషలో ధ్వనుల మార్పులకు హేతువులను విశ్లేషించండి.
2. ధ్వనులు ఏయే రీతులలో మార్పు చెందాయో వివరించండి.
3. తెలుగు భాషలోని సంధి స్వరూపాన్ని వివరించండి.
4. సంధి ఏర్పడడానికి హేతువులను విశదీకరించి కొన్ని తెలుగు సంధుల పద్ధతిని నిరూపించండి.

## 15.5 ఆధార గ్రంథాలు


1. ఆంధ్ర భాషా వికాసము - ఆచార్య గంటిజోగి సోమయాజి
2. తెలుగు భాషా చరిత్ర - స్ఫూర్తిశ్రీ టి. భాస్కరరావు.
3. విజ్ఞాన సర్వస్వం - తెలుగు సంస్కృతి.



డాక్టర్ వి. నాగ రాజ్యలక్ష్మి
ఎం.ఏ.(తె), ఎం.ఏ.(సం), పిహెచ్.డి.
రీడర్
ప్రభుత్వ మహిళా కళాశాల
గుంటూరు

# పాఠం - 16

# గ్రాంథిక-వ్యావహారిక భాషావాదాలు

పాఠ్యనిర్మాణక్రమం

16.0 లక్ష్యం
16.1 గ్రాంథిక - వ్యావహారిక భాషావాదాలు
16.1.1 జీవద్భాష
16.1.2 20వ శతాబ్దంలో భాషావాదాలు
16.1.3 వ్యవహారిక భాష నిర్వచనం
16.1.4 గ్రాంథిక భాష - నిర్వచనం
16.1.5 వ్యావహారిక భాషోద్యమం - పూర్వరంగం
16.1.6 వ్యావహారిక భాషా ఉద్యమ ప్రేరకుడు - ఏట్స్
16.1.7 వ్యావహారిక భాష - గిడుగువారి కృషి
16.1.8 వ్యావహారిక భాషావాదులు రాసిన గ్రంథాలు - వ్యాసాలు
16.1.9 సాహిత్య భాషగా వ్యావహారిక భాష
16.2. తెలుగులో అన్యదేశ్యాలు
16.2.1 తెలుగులో అన్యదేశాలు - రకాలు
16.3 సమీక్ష
16.4 ప్రశ్నలు
16.5 ఆధార గ్రంథాలు

## 16.0 లక్ష్యం

తెలుగులోని గ్రాంథిక - వ్యావహారిక భాషావాదాలను గురించి తెలియజేయడం - వ్యావహారిక భాష కోసం గిడుగువారి కృషిని వివరించడంతో పాటు, తెలుగు భాషలోని అన్యదేశాలను తెలియజేయడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## 16.1 గ్రాంథిక - వ్యావహారిక భాషావాదాలు

### 16.1.1 జీవద్భాష

ఒకరి భావాలు మరొకరికి తెలియచెప్పే విధానం భాష. సాధారణంగా భాషలో మార్పులు జరుగుతూ వుంటాయి. మార్పులు జరగడం భాష యొక్క సహజ లక్షణం. మార్పు అనేది ప్రపంచములోని ప్రతీభాషలోను వుంటుంది. వివిధ రంగాల్లో ఎప్పటికప్పుడు చాలా పరిణామాలు జరుగుతూ వుంటాయి. ఇదే విధంగా భాషలో కూడ పరిణామాలు వస్తూ వుంటాయి. ఈ పరిణామా లన్నింటినీ స్వీకరిస్తూ సమకాలీన సమాజానికి అనుగుణంగా అద్దం పట్టేది జీవద్భాష.

### 16.1.2 20వ శతాబ్దంలో భాషావాదాలు

ఇరవయ్యో శతాబ్దపు ప్రథమ దశాబ్దంలో వ్యావహారిక భాషోద్యమం తలెత్తింది. ఈ శతాబ్దంలో గ్రాంథిక భాష, వ్యావహారిక భాష అనే రెండు భాషాభేదాలు చోటు చేసుకున్నాయి. ఈ రెండు భాషావాదాలు తీవ్ర వాదోపవాదాలకు దారి తీసాయి. కావ్య భాష మారదని, దాన్ని మార్చరాదని గ్రాంథిక భాషావాదుల వాదం. భాష ఎప్పటికప్పుడు మారుతుంటుందని శిష్ట వ్యవహారంలో వున్న భాషనే అంటే ప్రజల వాడుక భాషనే వాడాలని వ్యావహారిక భాషావాదుల వాదం. ఈ విషయంలో ఆంధ్ర దేశం లోని పండితులు రెండుగా చీలిపోయారు. ఎవరి వాదాన్ని వాళ్ళు బలపరిచారు.

వ్యావహారిక పదజాలం ఉదాత్త విషయాన్ని తెలపడానికి పనికిరాదని గ్రాంథిక వాదులు గుడ్డిగా వాదించారు. వ్యావహారిక భాషావాదులు దీన్ని తీవ్రంగా ఖండించారు. వ్యావహారిక భాషా వికాసానికి నవ్య కవిత్వోద్యమం కూడా చాలావరకు దోహదపడింది. ఖండకావ్యాలు, నవలలు రావడంతో ఆధునిక సాహిత్యంపై వ్యావహారిక భాషా ప్రభావం అధికంగా పడింది. గేయ రచయితలందరూ వ్యావహారిక భాష వైపు మొగ్గు చూపారు. విద్యార్థులు తమ తమ అభిప్రాయాల్ని తెలియజేయడానికి వ్యావహారిక భాషే ఎక్కువగా వుపయోగపడుతుందని వ్యావహారిక భాషావాదులు వాదించారు. పూర్వం వున్న లక్షణ గ్రంథాల్ని కానీ, వ్యాకరణ గ్రంథాల్ని కానీ, తూలనాడడం వ్యావహారిక భాషావాదుల అభిమతం కాదు. ఒక భావాన్ని తెలియజేయడానికి కాలానుగుణంగా భాషలో మార్పులు వస్తాయని వారి వాదం. ఆంధ్రదేశంలో అన్ని రంగాల్లో వాడుక భాషను తప్పనిసరిగా వాడాలన్నది వీరి అభిప్రాయము. కావ్యభాషకూ, వ్యావహారిక భాషకు చాలా తేడా వుంది. కావ్య భాష కొన్ని లక్షణాలకీ, నియమాలకీ కట్టుబడి వుంటుంది. వ్యావహారిక భాష జీవనది వలె నిత్యం మార్పుకు లోనవుతుంది. గ్రాంథిక భాషావాదులు ఈ విషయాల్ని గుర్తించాలి. 20వ శతాబ్దంలో భాషా వాదాలకు తన జీవితాన్ని త్యాగం చేసిన మహామేధావి గిడుగు వేంకటరామమూర్తి గారు. తెలుగు భాషా సాహిత్యాలకు కొత్త ఒరవడిని దిద్దిన ఆదర్శమూర్తి ఆయన.

### 16.1.3 వ్యావహారిక భాష - నిర్వచనం

వాగ్వ్యవహారంలో వుండి కావ్యాల్లో లేఖన రూపంలో లేని భాషా రూపాల్ని 'వ్యావహారికం' అని అంటారు. నేడు వాగ్వ్యవహార, లిఖిత వ్యవహారాలు రెండూ కలిగిన భాష 'వ్యావహారిక భాష'.

### 16.1.4 గ్రాంథిక భాష - నిర్వచనం

గ్రంథస్థమైనదంతా 'గ్రాంథికం' నన్నయ నుంచి చిన్నయ సూరి వరకు కావ్యరచనలో ఉపయుక్తమైన భాషా భేదమే 'గ్రాంథిక భాష' అని పండితులు భావించారు.

### 16.1.5 వ్యావహారిక భాషోద్యమం - పూర్వరంగం

ఆంగ్లేయులు భారతదేశాన్ని సుమారు 200 సంవత్సరాలు పరిపాలించారు. ఆంగ్లేయుల ప్రభావం భారతదేశంలోని అన్ని రంగాలపైన పడింది. ముఖ్యంగా భారతదేశంలోని విద్యారంగంపై దీని ప్రభావం ఎక్కువగా కన్పిస్తుంది. ఆంగ్లేయుల ప్రభావం వల్ల సార్వజనికమైన విద్యా విధానం వచ్చింది. 1857లో భారతదేశంలో మద్రాసు, బొంబాయి, కలకత్తా ప్రధాన నగరాల్లో విశ్వ విద్యాలయాలు ఏర్పడ్డాయి. అన్ని వర్గాల ప్రజలు బాగా చదువుకొని, దేశంలోని విద్యావ్యాప్తికి దోహదం చేస్తారని ప్రభుత్వం ఆశించింది. అయితే కథ ఇక్కడ అడ్డం తిరిగింది. ఆంగ్లం పరభాష కావడం వల్ల దేశంలోని ప్రాంతీయ భాషలు అభివృద్ధికి నోచుకోలేదు. ప్రభుత్వం కోరిక నెరవేరలేదు.

1901లో అప్పటి గవర్నర్ జనరల్‌గా వున్న లార్డ్ కర్జన్ సిమ్లాలో ఒక సమావేశాన్ని ఏర్పరచి విద్యా విషయానికి సంబంధించిన అనేక సమస్యల్ని వివరంగా విపులంగా చర్చించారు. ప్రాథమిక స్థాయి నుంచి విశ్వవిద్యాలయస్థాయి వరకు పరిష్కరించవలసిన అనేక అంశాల్ని గుర్తించి, ఆ సమావేశంలో 150 తీర్మానాల్ని ఆమోదించారు. వీటి ఆధారంగానే భారత దేశంలో "కర్జన్ విద్యావిధానం" రూపొందింది. మాతృభాషలో వ్యాస రచనల్ని నిర్బంధంగా పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టాలనీ, అంతేకాకుండా ఆంగ్లంలో వున్న మంచి మంచి పుస్తకాల్ని ప్రాంతీయ భాషల్లోకి అనువదించాలనీ నిర్ణయించారు. ఇంకా అనువాదకులకు మంచి శిక్షణ ఇవ్వాలనీ కూడ తీర్మానించారు. దీని వల్ల ప్రభుత్వం ప్రాంతీయ భాషాభివృద్ధికి కంకణం కట్టుకుంది.

1903లో ప్రభుత్వం ఒక నిపుణుల సంఘాన్ని నియమించి, భారతీయ భాషలు ఎంతవరకు ప్రగతిని సాధించాయో చూడమని కోరింది. ఈ సంఘం వారు రెండేళ్ళ పాటు భారతీయ భాషల్ని నిశితంగా పరిశీలించారు. యూరప్‌లో వృద్ధి పొందుతున్న ఆధునిక శాస్త్ర పరిజ్ఞానాన్ని భారతీయ భాషల ద్వారా సామాన్య ప్రజానీకానికి అందుబాటులోకి తీసుకురావాలని సిఫార్సు చేశారు. తదనుగుణంగా ప్రాంతీయ భాషాభివృద్ధికోసం ప్రభుత్వం చాలామంది అధికారుల్ని నియమించింది. వారిలో జె.ఏ.ఏట్స్ ఒకరు.

### 16.1.6 వ్యావహారిక భాషా ఉద్యమ ప్రేరకుడు - ఏట్స్

1906 ప్రాంతంలో విశాఖపట్నం కేంద్రస్థానంగా గంజాం. విశాఖపట్నం గోదావరి జిల్లాలకు పర్యవేక్షణాధికారిగా, విద్యా విచారణాధికారిగా జె.ఏ. ఏట్స్ నియమితులయ్యారు. ఈయన తెలుగు భాష మీద వున్న మమకారంతో అభిమానంతో తెలుగు భాషను నేర్చుకొన్నారు. తాను నేర్చుకొన్న తెలుగు భాష, పుస్తకాల్లో వున్న తెలుగు భాష ఒకటికాదని తెలుసుకున్నాడు. పండితులు తరగతి వెలుపల మాట్లాడే తెలుగు ఒక విధంగాను తరగతి గదిలో మాట్లాడే తెలుగు వేరుగానూ వుండటం ఏట్స్ గుర్తించాడు. విద్యార్థులు గ్రాంధికరూపాన్ని అర్థం కాకాపోయినా గుడ్డిగా బట్టి పట్టడం గమనించాడు. రాసే భాషకు, మాట్లాడే భాషకూ తేడా వుండటం సహజమే. అయితే ఈ భేదాలు మరీ ఎక్కువైతే భాషా ప్రయోగ వ్యవస్థలో సంక్షోభం వస్తుందని తెలుగు భాషలోనూ ఇదే జరిగిందని ఆయన గ్రహించాడు.

ఇలాంటి స్థితి ప్రపంచంలో ఎక్కడా లేదని తెలుసుకున్న ఏట్స్ దొర విశాఖపట్నంలోని మిసెస్ ఎ.వి.యన్ కళాశాల ప్రిన్సిపాల్ అయిన పి.టి.శ్రీనివాస అయ్యంగారి దగ్గరికి వెళ్ళాడు. శ్రీనివాస అయ్యంగారికి తెలుగు భాష మీద పట్టు వుంది. తాను చెప్ప వలసిందంతా ఏట్స్ దొర గారికి చెప్పాడు. అంతేకాక నాకంటే ఎక్కువ పాండిత్యం గలవారు ఇద్దరున్నారు వారిని అడిగితే ఇంకా కొన్ని విషయాలు తెలుస్తాయని మంచి సలహా ఇచ్చారు. ఆ ఇద్దరిలో ఒకరు విజయనగరంలో వున్న గురజాడ అప్పారావు గారు. రెండో వ్యక్తి సర్లాకిమిడిలో వున్న గిడుగు రామమూర్తి పంతులు గారు. ఏట్స్ వీళ్ళిద్దరిని కలుసుకున్నాడు. ఏట్స్ గ్రాంధిక, వ్యావహారిక భాషలపై వున్న అనుమానాలు వారి సహకారంతో పూర్తిగా తొలగిపోయాయి.

ఏట్స్ దొర గారు ప్రతి ఏడూ ఉపధ్యాయ వార్షిక సమావేశాలు ఏర్పాటు చేసి బోధనా పద్ధతుల్ని గూర్చి, పెద్ద పెద్ద వాళ్ళ చేత ఉపన్యాసాలు ఇప్పించేవారు. 1907 మొదలు 1910 వరకు ఈ విధంగా జరిగిన ఉపాధ్యాయ వార్షిక సమావేశాల్లో గిడుగు రామమూర్తి పంతులు గారు 'జీవద్భాష' ప్రాశస్త్యాన్ని వివరిస్తూ పాఠశాలల్లో విద్యార్థులకు బోధనా భాషగా శిష్టవ్యవహారికం ఎందుకు వుండాలో అనేక ఉపపత్తులతో నిరూపిస్తూ ప్రసంగం చేశారు. సంప్రదాయ పండితులకు గిడుగు వారు వాడుక భాష గూర్చి ఉపన్యాసాలు ఇవ్వడం ఇష్టం లేదు. గ్రాంధిక భాషావాదులు చాలా బాధ పడ్డారు కూడ. ఈ విధంగా 1910, 1911 సంవత్సరాల్లోనే వ్యావహారిక భాషోద్యమానికి పూర్వరంగం సిద్ధమైంది.

### 16.1.7 వ్యావహారిక భాష - గిడుగు వారి కృషి

పుట్టుకతోనే కొందరు గొప్పవారుగా పుడతారు. మరి కొందరికి పరిస్థితుల ప్రభావం వల్ల గొప్పవారు అవుతారు. కొందరు

స్వయంకృషి చేత జీవితంలో గొప్పతనం సాధిస్తారు.

గిడుగు వారు స్వయంకృషి చేతనే మహానుభావుడయ్యాడు. అప్పటి పరిస్థితులు కూడా ఆయనకు అనుకూలించాయనే చెప్పాలి. మహా పురుషులు తమ సమకాలీనుల మీద తమ ప్రభావంచూపుతారు. అంతే కాదు తర్వాత తరాల మీద కూడా వారి ప్రభావం బాగా కన్పిస్తుంది. దీనికి మంచి ఉదాహరణ గిడుగు రామమూర్తి గారు.

గిడుగు రామమూర్తి గారి ప్రభావం ఆయన సమకాలీనుల్లో ప్రముఖుల మీద పడింది. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, పి.టి. శ్రీనివాస అయ్యం గారు, సీమనపల్లి రామయ్య పంతులు, పైడి ఘంటం చిన్న పంతులు, బుజ్జా పార్వతీశం పంతులు, వింజ్లచెరువు పోలయ్య, పర్లాకిమిడి యువరాజా శ్రీచంద్ర మహారాజు, కన్నేపల్లి లక్ష్మీనరసింహం, చాగంటి సాంబశివరావు, బుజ్జా శేషగిరిరావు, పారనంది జగన్నాథస్వామి, చిలుకూరి నారాయణరావు లాంటి ఎందరో ప్రముఖులు గిడుగు వారి ప్రభావానికి లోనైయిన వారే.

గిడుగు వారికి గ్రాంథిక భాషపై ద్వేషం కాని, చిన్నచూపుకాని లేదు. గ్రాంథిక భాషా పరిమితులు, ప్రయోజనాలు వేరు అని ఎప్పటికప్పుడు భాష మారుతుందనీ దానికి అనుగుణంగా వ్యావహారిక భాష వుంటుందనీ నొక్కి వక్కాణించాడు. చదువు సంధ్యలూ అన్నీ వ్యావహారిక భాషలో కొనసాగాలన్నది గిడుగు వారి వాదన. "వ్యావహారిక భాష తల్లి వలె నాకు ప్రేమ పాత్రం. ప్రాచీనాంధ్ర భాష మూలపుటమ్మ వలె నాకు పూజ్యురాలు" అని రామమూర్తి గారు పేర్కొన్నారు.

స్కూళ్ళ ఇన్‌స్పెక్టరైన జె.ఏ. ఏట్స్‌తో పరిచయం. పి.టి. శ్రీనివాస అయ్యం గారు అనే ప్రిన్సిపాల్‌తో స్నేహం, గురజాడ అప్పారావుతో వున్న సాహిత్యం. రామమూర్తి గారిని ఉద్యమ నాయకుడిగా తీర్చిదిద్దాయి. ఆ స్ఫూర్తితో వ్యావహారిక భాషోద్యమాన్ని **1910** నుంచి **1914** దాకా కొనసాగించారు.

గిడుగు రామమూర్తి గారి వాదంలో సిద్ధాంతరీత్యా ముఖ్యమైన విశేషాలు నాలుగు వున్నాయని వ్యావహారిక భాషా వికాసంలో డా. బూదరాజు రాధాకృష్ణ చెప్పారు. అవి ఇవి.

**1.** విద్యావసతులు ఇప్పుడు మునుపటిలాగా, ఏ కొందరికో పరిమితం కావు. కాబట్టి సామూహిక విద్యా సౌకర్యాలకు కావ్య భాష ఉపయోగించదు. ఆధునిక శాస్త్రీయ బోధనకు ఆధునిక భాషా రూపమే కాని, ప్రాచీన కావ్య భాష పనికిరాదు. అందువల్ల బోధనా మాధ్యమంగా, రచనా మాధ్యమంగా శిష్టవ్యవహారమే ఉండాలి.

**2.** ప్రత్యక్ష పద్ధతిలాంటి ఆధునిక విద్యాబోధన పద్ధతుల్ని అవలంబిస్తే పఠన, పాఠనాల్లో సౌలభ్యం కలుగుతుంది.

**3.** గ్రాంథిక భాష అనేది కొక్కొండ వెంకటరత్నం పంతులు, కందుకూరి వీరేశలింగం, వేదం వేంకటరాయశాస్త్రి లాంటి మహామహులకే ఒంటబట్ట లేదు. వారిలో వారు పరస్పరం నిందించుకుంటున్నప్పుడు సామాన్యులకిది కొరుకుడు పడేదికాదు. ఒకనాటి భాషా విశేషం ఈనాటి వ్యవహారానికి దూరమైంది. కాబట్టి సౌలభ్య దృష్టిలో వ్యావహారికమే ఉపాదేయం.

**4.** పరంపరాగతంగా చూసినా వ్యావహారిక రచనా సంప్రదాయం వచన వాఙ్మయంలో ప్రధానంగా కన్పిస్తుండగా చిన్నయ సూరి కారణంగా పూర్వ గ్రంథాల్ని పరిష్కరణ, సంస్కరణ పేరిట గ్రాంథీకరించి వికృతీకరించటం జరిగింది. ఇది మన పూర్వులకు మనమే చేసిన అపచారం. చారిత్రకంగా భాషలో మార్పు రావటం సహజ పరిణామం. కాబట్టి వెయ్యేళ్ళ నాటి కావ్యభాష నేటి శాస్త్ర బోధనకు గానీ, వచన రచనలకు గాని పనికిరాదు.

గ్రాంథిక భాషావాదుల చేత వచన రచనకు వ్యావహారిక భాషనుపయోగించడం అన్ని విధాలా ఉచితమని ఒప్పించడానికి

గిడుగువారు రెండు విధాలైన ఉపపత్తుల్ని చెప్పారు.

ఎ. పూర్వకాలంలో కూడా కావ్యాల్లో తప్ప ఆనాటి కవులూ, పండితులూ, టీకలూ, టిప్పణులూ, వ్యాఖ్యానాలూ, శాసనాలూ మొదలైన వాటిలో ఆ కాలం నాటి తమ వ్యావహారిక భాషనే వాడారని నిరూపించడం. ఇందుకోసం గిడుగు వారు ఎన్నో తాళపత్ర గ్రంథాల్ని పరిశీలించి సాక్ష్యాధారాల్ని సేకరించారు. వీటినే 'బాల కవి శరణ్యం' 'గద్య చింతామణి' లాంటి గ్రంథాల్లో ప్రచురించారు.

బి. చిన్నయ సూరి వ్యాకరణానికి అనుగుణంగా రచన చేస్తున్నామని చెప్పుకొనే పండితులూ, కవులూ, ఆ భాష తమకు సహజమైంది కానందువల్ల ఎన్నెన్ని లక్షణ విరుద్ధమైన ప్రయోగాలు చేస్తున్నదీ చూపించడం. తిరుపతి వెంకటకవులు "రెండు బాసలకు మేమె కవీంద్రుల మంచు" గర్వంగా చెప్పుకున్న పద్యంలో కూడ వ్యాకరణ దోషం వుంది అని ఎత్తి చూపారు.

ఒక్క తిరుపతి వేంకటకవుల రచనలోనే కాదు. ఆనాటి పండితులైన వేదం వేంకటరాయశాస్త్రి లాంటి ఉద్దండుల రచనల్లో కూడ వ్యాకరణ దోషాల్ని గిడుగు వారు ఎత్తి చూపించి ప్రముఖుల మన్నల్ని పొందారు.

రామమూర్తి గారు తాను సేకరించిన అనేక సాక్ష్యాధారాల్ని తాళపత్ర గ్రంథాల్ని వెంట తీసుకొని వెళ్ళి, తెలుగు దేశం లోని అన్ని ప్రధాన పట్టణాల్ని సందర్శించి, అక్కడి విద్యాలయాల్లోని, ఆచార్యుల్ని, ఇతర పండితుల్ని కలుసుకొని తన వాదాన్ని చాలా విపులంగా చెప్పేవారు. మన పూర్వులు వ్యావహారిక భాషను నిరసించలేదని, సాక్ష్యాధారాలు చూపిస్తూ వారితో చాలా చక్కగా చర్చించి తన వాదాన్ని వినిపించేవారు. చర్చానంతరం వారి అభిప్రాయాల్ని లిఖిత పూర్వకంగా రాయించి తీసుకొనేవారు. అలా సేకరించిన వారి అభిప్రాయాల్ని 'తెలుగు' పత్రికలో ముద్రించేవారు.

ఆధునిక తెలుగు భాషా స్వరూపాలు ఎలా వుంటే బాగుంటుంది అనే అంశం తీసికొని 'ఎ మెమోరాండం ఆన్ మోడరన్ తెలుగు ప్రోజ్' అనే గ్రంథం రాశారు. 1914లో గురజాడ అప్పారావు గారు "డిసెంట్ పత్రం" ప్రకటిస్తే, గిడుగు రామమూర్తి గారు 'నిజమైన సంప్రదాయం' ప్రకటించారు. గిడుగు వారు 1916 లో కొవ్వూరులో జరిగిన బ్రహ్మాండమైన పండిత సదస్సులో 'జీవద్భాష' గూర్చి విస్తారంగా వివరించారు. రామమూర్తి గారి ప్రభావంతో చాలా మంది పండితులు వ్యావహారిక భాషలో మంచి మంచి గ్రంథాలు, వ్యాసాలు రాశారు.

> "మనకు తెలిసినంతవరకు భారతీయుల్లో కాని, యూరోపియనుల్లో కాని, తెలుగు భాషను వైజ్ఞానిక నేపథ్యంతో పరిశోధించాడని చెప్పగల ఒక్క పండితుడూ లేడు. అలా చెప్పగలిగిన వాడు గిడుగు రామమూర్తి పంతులు గారొక్కడే. శాస్త్రీయ పద్ధతుల్లో భాషా విశ్లేషణ చెయ్యడానికి బహుకాలంగా శ్రమించిన పండితుడు ఆయన తప్ప మరొకడు లేడు"

అని నొక్కి వక్కాణించారు గురజాడ వారు.

### 16.1.8 వ్యావహారిక భాషావాదులు రాసిన గ్రంథాలు, వ్యాసాలు

- సెట్టి లక్ష్మీనరసింహం గారు 'గ్రీకు పురాణకథలు' అనే పుస్తకాన్ని సరళ గ్రంథిక భాషలో రాశారు. ఈ గ్రంథాన్ని స్కూల్ ఫైనల్ క్లాసుకి పాఠ్య గ్రంథంగా నిర్ణయించారు. గ్రాంథిక భాషా వాదులు ఈ గ్రంథం పాఠ్య గ్రంథంగా నిర్ణయించడం పై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు.

- పి.టి. శ్రీనివాస అయ్యం గారి 'బీజగణితం' వ్యావహారిక భాషలో సాగింది. ఈ గ్రంథం కూడా పాఠ్యగ్రంథంగా నిర్ణయించబడింది.

- వేదం వేంకటాచలమయ్య గారు రాసిన 'విధి లేక వైద్యుడు' వ్యావహారిక రచన.
- 1912లో "మెమోరాండమ్ ఆన్ మోడర్న్ తెలుగు ప్రోజ్" అనే పేరుతో గిడుగు వారు ప్రభుత్వానికి ఒక పత్రం అందచేశారు. తర్వాత 1913లో ఈ పత్రాన్ని పుస్తకరూపంలో ప్రచురించి పండితులకు పంచిపెట్టారు. జయంతి రామయ్య పంతులు గారి "ఏ డిఫెన్స్ ఆఫ్ లిటరరీ తెలుగు" దీనికి సమాధానంగా వెలువడింది.
- గిడుగు రామమూర్తి పంతులు గారు రాసిన "నిజమైన సంప్రదాయం" వ్యావహారిక రచన.
- తాతా సుబ్బరాయ శాస్త్రి గారు రాసిన ఆంధ్ర భాషా సంస్కరణ అనే గ్రంథం వ్యావహారిక భాషలో నడిచింది. దీనిలో ఆధునిక శిష్టప్రయోగాల్ని అనుసరించి తెలుగు వ్యాకరణాలను సంస్కరించాలని ఆయన సూచించారు.
- వజ్జల చినసీతారామ శాస్త్రి గారు వ్యావహారిక భాషను సమర్థిస్తూ "ఆంధ్ర భాష" అనే వ్యాసం రాశారు.
- గురజాడ అప్పారావు గారు రాసిన "కళింగదేశ చరిత్ర" వ్యావహారిక భాషలో సాగింది.
- బుఱ్ఱా శేషగిరిరావు రాసిన 'విమర్శాదర్శం' మొదలైనవి వ్యావహారిక భాషలో సాగాయి.

ప్రభుత్వం మెట్రిక్ బదులు స్కూల్ ఫైనల్ పరీక్షలు ఎఫ్.ఎ. బదులు రెండేళ్ళ ఇంటర్మీడియట్ ప్రవేశపెట్టింది. ఈ సమయంలో మాతృభాషలో వ్యాసరచనకు అనువాదానికి ఎన్నుకోవలసిన పాఠ్యాంశాల గూర్చి, గ్రాంథిక వ్యావహారిక భాషావాదుల మధ్య చాలా గందరగోళం, గొడవలు జరిగాయి. గిడుగు వారు తమ సిద్ధాంతాల్ని ఏకరువు పెట్టారు. వ్యావహారిక భాషా గొప్పతనాన్ని, జీవద్భాషా ప్రాముఖ్యాన్ని పునరుద్ఘాటించారు. పి.టి.శ్రీనివాస అయ్యం గారు "లాంగ్వేజ్ లైఫ్ అండ్ డెత్" అనే దాన్ని ప్రచురించారు. రామమూర్తి గారు అధికారులకు, పండితులకు తన వాదాన్ని తన సిద్ధాంతాన్ని నచ్చచెప్పే విధంగా వివరించారు.

విశాఖపట్నం మిసెస్ ఎ.వి. యన్ కళాశాల ఆంధ్రోపన్యాసకులు నరసింహం గారు "గ్రీకు పురాణ కథలు" "వసంతసేన" అనే గ్రంథాల్ని అర్థ గ్రాంథిక భాషలో, వ్యావహారిక భాషలో రాశారు. స్కూల్ ఫైనల్ పరీక్షకు "గ్రీకు పురాణ కథలు" ఉపవాచకంగా నిర్ణయించారు. ఈ గ్రంథానికి శ్రీనివాస అయ్యంగారు మంచి పీఠిక రాశారు. ఇందులోని గ్రాంథిక భాషను 'మాతృభాష' అనీ ఆధునిక భాషను 'జీవద్భాష' అని పేర్కొన్నారు. దీన్ని గ్రాంథిక భాషావాదులు వ్యతిరేకించారు. ఈ గ్రంథం పాఠ్యగ్రంథంగా వుండటానికి వీలులేదని వాదించారు. సంప్రదాయ పండితులు, గ్రాంథిక భాషావాదులు, సంస్థానాధీశుల్ని, ధనవంతుల్ని, జమిందారుల్ని, సానుభూతిపరుల్ని ఆశ్రయించి వ్యావహారిక భాషను వాడకూడదని ఆజ్ఞాపించాలని కోరారు. 'గ్రీకు పురాణ కథలు' పాఠ్య గ్రంథంగా పెట్టడంతో పండితలోకంలో పెద్ద సంచలనం చెలరేగింది. తెలుగు భాషకు తీవ్రమైన అపచారం జరుగుతోందని గ్రాంథిక భాషావాదులు తెగబాధపడ్డారు. తెలుగుభాష చెడిపోయిందని రోడ్డు మీద పడ్డారు. సభలు, సమావేశాలు జరిపారు. వ్యావహారిక భాషావాదులపై రెచ్చిపోయి అనరాని మాటలు అన్నారు. పండితులు బట్టీపట్టి తమకున్న తక్కువ జ్ఞానంతో 'పిడివాదం' చేశారు. చివరకు తమ వాదం తప్పు అని తెలుసుకొని చెంపలు వేసుకొన్నారు.

విద్యాలయాల్లో ప్రాచీన కావ్య భాషను కాకుండా శిష్ట వ్యావహారిక భాషను వాడాలనీ, ఆ భాషనే విద్యార్థులు ప్రశ్నలకు జవాబులు రాసే అవకాశం కల్పించాలనీ, స్కూల్ ఫైనల్, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఆంగ్లానికి తెలుగు అనువాదాన్ని వ్యాసరచనను విద్యార్థులు శిష్టవ్యావహారిక భాషలోనే రాసే అవకాశం వుండాలనీ, వ్యావహారిక భాషోద్యమం ప్రతిపాదించింది. గ్రాంథిక వాదులు దీన్ని తిరస్కరించారు.

గ్రాంథిక, వ్యావహారిక భాషావాదులు ఇద్దరూ ఎవరి వాదాన్ని వారు గొప్పగా చెపుతూ, వారి వాదాన్ని బలపరుస్తూ బలంగా

వాదించుకునేవారు. చివరకు ప్రభుత్వం ఆదేశం ప్రకారం మద్రాసు విశ్వవిద్యాలయం వారు **1911** సెప్టెంబరు **8**వ తేదిన గ్రాంథిక వ్యావహారిక భాషా శైలుల వివాదాన్ని చక్కగా పరిశీలించి విద్యార్థులకు ఏ శైలి మంచిదో ఏ శైలి ఉపయోగపడుతుందో ఏ శైలి ఉచితమో నిర్ణయించడానికి ఒక సంఘాన్ని నియమించారు. ఇందులో ఒక తటస్థ అధ్యక్షుడు, నలుగురు గ్రాంథిక భాషావాదులు, నలుగురు వ్యావహారిక భాషావాదులు వున్నారు. కాంపోజిషన్ కమిటి సంఘానికి అధ్యక్షుడు మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాల అధ్యాపకుడు రంగాచార్యులు గారు. గ్రాంథిక వాదుల తరుపున జయంతి రామయ్య పంతులు, వేదం వేంకటరాయ శాస్త్రి, వావిలికొలను సుబ్బారావు, కొమర్రాజు లక్ష్మణరావులూ, వ్యావహారిక భాషావాదుల తరపున గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావు, బుఝ్జా శేషగిరిరావు, పి.టి, శ్రీనివాస అయ్యం గార్లు ఆ కమిటీలో సభ్యులుగా వున్నారు.

వీరందరూ అనేక సమావేశాలు జరిపి చివరకు ఆ కమిటి వాడుకలో వున్న పదాల్ని క్రియారూపాల్ని, సమాసాల్ని, విభక్తిరూపాల్ని విద్యార్థులు వ్యాసరచనలో వుపయోగించ వచ్చునని తన నివేదికలో పేర్కొన్నారు. వాడుకలో వున్న ఎలాంటి పదాల్ని సమాసాల్ని, క్రియారూపాల్ని, విభక్తుల్ని, వాడవచ్చునో వివరిస్తే అలాంటి కొన్ని పదాల పట్టికల్ని కూడ ఆ నివేదికకు అనుబంధంగా ఆ కమిటి చేర్చింది. చివరకు వ్యావహారిక భాషావాదులు విజయం సాధించారు. గిడుగు వారు పిడుగు అయ్యారు. ఈ పరిణామం చూసి గ్రాంథిక వాదులు చాలా బాధపడ్డారు. ప్రాచీన కావ్య భాషాభిమానులు, సంప్రదాయ పండితులు అందరూ ఏకమయ్యారు. వ్యావహారిక భాషావాదుల్ని అడ్డుకోవడానికి తమ శక్తియుక్తుల్ని, బలాన్ని, ధనాన్ని, ధారపోశారు. గ్రాంథిక భాషావాదుల్ని బలపరచడం కోసం 'ఆంధ్ర సాహిత్య పరిషత్తు' ను స్థాపించారు. శిష్ట వ్యావహారిక వాదాల్ని చాలా తీవ్రంగా నిరసించారు. ఈ విషయంలో గ్రాంథికవాదులు చేయరాని పనులు కూడ చేశారు. మంచి చెడ్డలు మరచిపోయారు. నీతి, నియమాలకు తిలోదకాలిచ్చారు.

గ్రాంథికవాదులు కవుల్ని, పండితుల్ని, రచయతల్ని కలుసుకొని, అందరిని కలుపుకొని ప్రతీ ఊరూ తిరిగి, సభలు సమావేశాలు జరిపి చివరకు సంతకాలు సేకరించి ఒక మహోద్యమంగా నడిపారు. ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించారు. పాత నివేదిక పట్ల తీవ్ర అసమ్మతిని తెలియజేశారు. వ్యావహారిక భాషాశైలి విద్యార్థులకు ఏ మాత్రం పనికిరాదనీ, దీని వల్ల విద్యార్థులకు ప్రయోజనం వుండదని వాదించారు. విద్యాశాఖ మీద గ్రాంథిక భాషావాదులు తీవ్రమైన ఒత్తిడి తెచ్చారు.

ఇది ఇలా జరుగుతుండగా మద్రాసు విశ్వవిద్యాలయం వారు నియమించిన ఉపసంఘం వారు తెలుగులో నామ, సర్వనామ, క్రియాపదాల ప్రాచీన, ఆధునిక రూపాల్ని వర్గీకరించడం కోసం ఒక తీర్మానాన్ని ఆమోదించారు. దీని కోసం ముగ్గురు సభ్యుల్ని నియమించారు. ఇందులో వేదం వెంకటరాయశాస్త్రి, కొమర్రాజు వెంకట లక్ష్మణరావు, గురజాడ అప్పారావు గార్లని సభ్యులుగా నియమించారు. ఈ ముగ్గురిలో ఇద్దరు గ్రాంథిక భాషావాదులు ఒకరు వ్యావహారిక భాషావాది. గురజాడ వారు చెప్పింది వారు పెద్దగా పట్టించుకోలేదు. గురజాడ అప్పారావు గారు ఒంటరి అయ్యారు. వేదం వెంకటరాయశాస్త్రి, కొమర్రాజు వెంకట లక్ష్మణరావు గార్లు ఇద్దరూ స్వార్థంతో వ్యవహరించారు. ఈ పట్టిక తయారీలో వ్యావహారిక రూపాల్ని పెద్దగా పట్టించుకోలేదు. అంతేగాక వ్యావహారిక, గ్రాంథికాల్లో సమాన రూపంలో వున్న ఏ రెండు మూడింటినో తప్ప తక్కిన వాటినన్నింటినీ గ్రాంథిక భాష నుంచి తీసుకొని అనే ఆధునిక రూపాలని గుడ్డిగా వాదించారు. ఈ విధంగా గ్రాంథికవాదులు ముందు ఆమోదించిన తీర్మానాన్ని తమకు కావలసిన విధంగా అర్థం చెప్పుకొని, వ్యావహారిక భాషావాదాన్ని నీరు కార్చారు. వ్యావహారిక భాషా ప్రయోజనాన్ని భగ్నం చేశారు. చివరకు విద్యాశాఖ వారు చేసేది ఏమి లేక గ్రాంథిక భాష వాడడానికి అనుమతి ఇస్తూ లోగడ జారిచేసిన జి.ఓ. ను ఉపసంహరించు కుంటూ **1914**లో మరో జి.ఓ. ను జారీ చేశారు. గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి మొదలైన వ్యావహారిక భాషావాదులు దీన్ని తీవ్రంగా ఖండించారు.

గ్రాంథిక భాషావాదుల బలంతో 'కాంపోజిషన్ కమిటి' నిర్ణయాల్ని తిరగదోడడంతో గ్రాంథిక వాదులదే పైచేయి అయింది. చివరకు గ్రాంథిక భాషావాదుల విజయం సాధించారు. అంతేకాక వీరు తాము అనుకున్నపని జరిగిందని ప్రభుత్వానికి కృతజ్ఞతలు

చెప్పారుకూడ. ఈ సమయములో వడ్డాది సుబ్బారాయ కవి లాంటి వారు 'జయంతి రామయ్యోక్తి గెలిచె' అని అన్నారు. పానుగంటి లక్ష్మినరసింహారావు 'రామమూర్తి ఇంక నీ గంజాం జిల్లాకు గో (వెళ్ళు)' అని అంటూ రామమూర్తి గారిని పరిహాసం చేశారు.

ఇలా జరుగుతుండగా కొందరు రాజకీయ నాయకులు విద్యావిషయాల్లో కూడ రాజకీయ నాయకుల ప్రవేశం వుండాలని వాదించారు. ఈ కారణంగా విశ్వ విద్యాలయం నియమించిన ఉపసంఘంలో రాయలసీమకు ప్రాతినిధ్యం కల్పించారు. కోలాచలం శ్రీనివాసరావు, టి. శంకరలింగం పిళ్ళె, నాగపూడి కుప్పసామయ్య, బారిస్టర్ కె. సుబ్బారెడ్డి గార్ల నియామకం ఈ విధంగా జరిగిందే. వీరందరూ వ్యావహారిక భాషా వ్యతిరేకులు. అంచేత మెజారిటి మెంబరలు గ్రాంథిక భాషనే సపోర్టు చేశారు. ఈ సమయంలో గురజాడ అప్పారావు గారు "డిసెంట్ పత్రం" (Minute of Dissent) రాశారు. ఇదే కాలంలో రామమూర్తి గారు "A Memorandum on Modern Telugu Prose" అనే వ్యాసాన్ని జయంతి రామయ్య గారు "A Defence of Literary Telugu" అనే వ్యాసాన్ని రాశారు.

విద్యాలయాల్లో వ్యావహారిక భాషను భోదనా భాషగా చేయాలనే గిడుగు వారి ప్రధాన లక్ష్యం ఆయన జీవితకాలంలో నెరవేరలేదు. మరో వారం రోజుల్లో చనిపోతారు అనగా 1940 జనవరి 15వ తేది సాయంత్రం 5 గం॥లకు మద్రాసులోని 'ప్రజామిత్ర' కార్యాలయంలో పత్రికా రచయతల్ని సమావేశపరచి గిడుగువారు తమ చివరి సందేశాన్ని తెలియజేశారు. ఈ సభకు తాపీ ధర్మారావు, న్యాపతి నారాయణమూర్తి లాంటి ప్రముఖ పత్రికా సంపాదకులు హాజరయ్యారు. ఆ సభలో విశ్వ విద్యాలయాల వారి చేత, వ్యావహారిక భాషను అంగీకరింపచేసే బాధ్యతను, గిడుగు వారు పత్రికా ప్రతినిధులకు అప్పచెప్పారు. ఈ సభలో రామమూర్తి గారు సుమారు రెండు గంటల పాటు, తక్కువ స్వరంతో ఉపన్యసించారు. తాను ప్రారంభించిన వ్యావహారిక భాషా ఉద్యమ ఫలితాన్ని తాను జీవిత కాలంలో చూడలేక పోతున్నానని విచారాన్ని వ్యక్తం చేశారు.

ఈ సభకు హాజరైన సుప్రసిద్ధ పత్రికా సంపాదకులు వ్యావహారిక భాషావాద లక్ష్యాల్ని నూటికి నూరుపాళ్ళు విజయవంతం అయ్యేలా చూస్తామని, అంతేకాక దీనికోసం తమ శక్తి యుక్తుల్ని వినియోగించి కృషి చేస్తామని గిడుగు రామమూర్తి గారికి హామీ ఇస్తూ ఒక శపథం చేశారు. 30 సం॥రాలు తరువాత అంటే 1973 నాటికి పూర్తిగా ఆంధ్రప్రదేశ్‌లో అన్ని రంగాల్లో వ్యావహారిక భాష వాడడం జరిగింది. 1973 నాటికి అన్ని విశ్వ విద్యాలయాలు వ్యావహారిక భాషను విద్యార్థులు ఉపయోగించవచ్చునని తీర్మానించడంతో గిడుగువారి లక్ష్యం సంపూర్ణంగా నెరవేరింది. ఆయన అందరికి మంచి మిత్రులు, ఆజాతశత్రువు, సహృదయ సార్వభౌముడు, ఆదర్శమూర్తి.

1955 మద్రాసు విశ్వ విద్యాలయంలో "తెలుగు బోర్డు ఆఫ్ స్టడీస్" వారు వ్యావహారిక భాషా పద ప్రయోగాల్ని అంగీకరించారు. 1965 వరకు ఆంధ్రప్రదేశ్ లోని విశ్వ విద్యాలయాలు వ్యావహారిక భాష వైపు చూడనైనా లేదు. ఇది విచారించదగ్గ విషయం. 1965 లోనే విశ్వ విద్యాలయ పాఠ్య గ్రంథాల్లోని శైలి వ్యావహారిక భాషలో వుండవచ్చునని భద్రిరాజు కృష్ణమూర్తి గారు అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ఏకాభిప్రాయం కోసం పింగళి లక్ష్మికాంతం గారి అధ్యక్షతన ఒక సమావేశం జరిగింది. రాను రాను వ్యావహారిక భాష అన్ని రంగాల్లోను చోటు చేసుకుంది. పి.హెచ్.డి. చేసే విద్యార్థులు తమ పరిశోధనా గ్రంథాల్ని వ్యావహారిక భాషలో రాయడానికి శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం వారు 1969 లో అనుమతించారు. 1973 లో ఆంధ్ర విశ్వ కళాపరిషత్ వారు వ్యావహారిక భాషను ఆమోదించారు. వ్యావహారిక భాషను ఆమెదించే విషయంలో ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వ విద్యాలయాలకు 1955 సం॥లో మద్రాసు విశ్వ విద్యాలయం ఆదర్శంగా నిలిచింది. 1911 లో గిడుగు రామమూర్తి గారు ప్రారంభించిన వ్యావహారిక భాషోద్యమం 1973 నాటికి విజయవంతమైంది. రాష్ట్ర ప్రభుత్వమూ, రాష్ట్రంలోని వివిధ విశ్వ విద్యాలయాల కృషి వల్ల మహోద్యమంగా నడిచిన వ్యావహారిక భాషా వివిదానికి 1973 నాటికి తెరపడింది. సనాతన పండితులు, సంప్రదాయవాదులు, గ్రాంథిక భాషావాదులు ఇక్కడ ఒక

విషయం గుర్తుంచుకోవాలి. మార్పును ఎవరు వ్యతిరేకించినా, ఎందరు వ్యతిరేకించినా కాలప్రవాహాన్ని భాషా ప్రవాహాన్ని ఎవరూ అపలేరు. ఆపడం ఎవరి తరమూ కాదు. గ్రాంథిక భాషావాదులు అజ్ఞానంతో వాదించారు. అది కేవలం "పిడివాదం" మాత్రమే. అంచేతనే వారి వాదం కాల ప్రవాహంలో కొట్టుకుపోయింది. చివరకు పశ్చాత్తాప పడ్డారు కూడా.

### 16.1.9 సాహిత్య భాషగా వ్యావహారిక భాష

అనువాద ఆదికవి నన్నయ మొదలుకొని నేటివరకు వచ్చిన తెలుగు సాహిత్య భాషలో క్రమ పరిణామ వికాసాన్ని జాగ్రత్తగా విశ్లేషిస్తే మనకు ఒక విషయం చాలా స్పష్టంగా తెలుస్తుంది. ప్రజలు నిత్య వ్యవహారాల్లో మాట్లాడుకొనే భాషకు భిన్నంగా దీర్ఘ సమాసాల్తో సంస్కృత పద భూయిష్ఠంగా తెలుగు భాష ప్రారంభమైంది. మన కావ్యాల్లో కఠినమైన గ్రాంథిక భాష చోటు చేసుకుంది. ఒక్క మాటలో చెప్పాలంటే "గొడ్డు గ్రాంథిక భాష" కావ్యాల్లో వుంది. ఇలాంటి గ్రాంథిక భాష క్రమక్రమంగా సరళ గ్రాంథిక భాషగా మారింది. తర్వాత ప్రజలు నిత్యం మాటలాడుతున్న వ్యావహారిక భాష చోటుచేసుకుంది.

మొదట వ్యావహారిక భాషను వ్యతిరేకించిన మహామహా పండితులు క్రమక్రమంగా నిజాన్ని నిలకడగా తెలుసుకుని వ్యావహారిక భాషను సమర్థించటం ప్రారంభించారు. అంతే కాకుండా వ్యావహారిక భాషలో రచనలు చేయడం మొదలుపెట్టారు. ఇలా రచనలు చేసిన వారిలో మొదట చెప్పుకోదగ్గ వారు కందుకూరి వీరేశలింగం గారు. వీరు 1918 నాటికి గిడుగువారితో అనేక విషయాలు కూలంకషంగా చర్చించి వారి వాదాన్ని ఆమెదించారు. 1919 ఫిబ్రవరి 28 తేదీన వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజానికి అధ్యక్షస్థానం స్వీకరించారు. ఇదే విధంగా చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, అక్కిరాజు ఉమాకాంతం, మొదలైన వారు వ్యావహారిక భాషను సపోర్టు చేయడమే కాక రచనలు కూడా చేసి ఉద్యమానికి ఊపిరి పోశారు. తాపి ధర్మారావు గారు గిడుగు గారి శిష్యుడు. ప్రారంభంలో ధర్మారావు గారు గ్రాంథిక వాది. గిడుగు ప్రభావంతో వ్యావహారిక వాది అయ్యారు. వ్యావహారిక భాషలో రచనలు చేశారు. 'జనవాణి' పత్రికలో వ్యావహారిక భాషను మొట్టమొదట ప్రవేశ పెట్టిన ఘనత తాపీ ధర్మారావు గారికి దక్కుతుంది. గుడిపాటి వెంకటాచలం, విశ్వనాథ సత్యనారాయణ, అడవి బాపిరాజు, కృష్ణశాస్త్రి, చింతా దీక్షితులు, మల్లాది రామకృష్ణశాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి, గోపిచంద్ మొ॥ వారు నవలలు, కథలు, వ్యాసాలు, చక్కని వ్యావహారిక భాషలో రాసి ప్రజలు మెప్పును పొందారు.

గురజాడ అప్పారావు గారు మాండలిక భాషలో 'కన్యాశుల్కం' అను అద్భుతమైన నాటకాన్ని రాశారు. తెలుగు సాహిత్యంలో ఈ నాటకం పెద్ద సంచలనం రేకెత్తించింది. ఈ నాటకంపై విమర్శలు, ప్రతి విమర్శలు వచ్చాయి. ఏది ఏమైనా ప్రజల వాడక భాషలో నాటకం రాసిన గురజాడ అప్పారావు మొనగాడు. విజయనగరం జిల్లా మాండలికం ఈ నాటకంలో చోటు చేసుకుంది. "ముత్యాల సరాలు" "నీలగిరి పాటలు" లాంటి రచనల ద్వారా అప్పారావు గారు కవిత్వ భాషగా వ్యావహారిక భాషకు వున్న శక్తిని నిరూపించారు.

నండూరి సుబ్బారావు గారు అచ్చమైన గ్రామీణ వాతావరణంలో చక్కని గ్రామీణ భాషలో "ఎంకి పాటలు" రాశారు. ఈ పాటలు కూడ సాహిత్య లోకంలో పెద్ద వివాదాన్ని రెకెత్తించాయి. సుబ్బారావు గారు ఉదాత్త ప్రణయ కావ్యాన్ని అందరికి అర్థమయ్యే విధంగా బ్రహ్మాండంగా రాశారు. మాధవపెద్ది గోఖలే, పోరంకి దక్షిణామూర్తి, రావిశాస్త్రి మొదలైన వారు మాండలిక భాషలో నవలలు, కథలు రాసి వాటికి సాహిత్య భాషగా గౌరవాన్ని తెచ్చిపెట్టారు.

వివిధ విశ్వ విద్యాలయాలు, వ్యావహారిక భాషను చాలా ఆలస్యంగా బాధతో ఆమోదించాయి. ఆయా విశ్వ విద్యాలయాల్లో ఇప్పటికి చక్కని వ్యావహారిక భాషలో రాయలేని ఆచార్యులు వున్నారు. ఇది విచారించదగ్గ విషయం. గిడుగు వారి ప్రభావంతో పత్రికలు, రేడియోలు, సినిమాలు వ్యావహారిక భాషను ఆమోదించాయి. చాలా మంది రచయతలు, కవులు, తమ గ్రంథాల్ని

వ్యావహారిక భాషలో రాశారు. ఒక్క మాటలో చెప్పాలంటే విశ్వ విద్యాలయాల్లో బోధనా భాష కావడానికి ముందే, వ్యావహారిక భాష తెలుగులో సాహిత్య భాషగా స్థిరపడింది. ఇది హర్షించదగ్గ విషయం.

## 16.2 తెలుగులో అన్యదేశ్యాలు

ఒక భాషలో సహజసిద్ధంగా వున్న పదాలు "దేశ్యాలు" (Indigenous). ఇతర భాషల నుంచి వచ్చిన పదాలు "అన్యదేశ్యాలు". వీటినే "ఎరువు" పదాలు అనీ, "ప్రాతిదేయ" పదాలనీ, "అన్యదేశ్యాలు" అని అంటారు. ఆంగ్లంలో వీటిని "Loan Words" అని వ్యవహరిస్తారు.

తెలుగు భాషలో ప్రవేశించిన ఇతర భాషల్లో ప్రధానమైనవి. తమిళం, కన్నడం, సంస్కృతం, ప్రాకృతం, మరాఠీ, ఒరియా, హిందీ, ఉర్దూ, తర్కి, పర్షియన్, పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచి , ఆంగ్ల పదాలు మొదలైనవి.

### 16.2.1 తెలుగులో అన్యదేశ్యాలు - రకాలు

**ఎ. సజాతీయ భాషలు (ద్రావిడ భాషలు)**

తెలుగు భాషకు సోదర భాషలైన జాతీయ భాషలు (Sister Languages) తమిళ, కన్నడ భాషలు. తెలుగు కన్నడం మొదలైన ద్రావిడ భాషలు ఒకే మూల మాతృక నుంచి ఏర్పడ్డాయి. ఇవి ప్రాచీన మూల ద్రావిడం (Proto-Dravidiam) నుంచి పుట్టి పెరిగి అభివృద్ధి చెందిన భాషలని భాషా శాస్త్రజ్ఞులు నిర్ధారించారు. తమిళ, కన్నడ భాషలు తెలుగు భాషకు ఇరుగు పొరుగు భాషలు. భౌగోళిక, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయాది కారణాలు వల్ల శైవ, వైష్ణవ మతాల ప్రభావం వల్ల సమీప దరిత్వం వల్ల తమిళ, కన్నడ భాషల ప్రభావం తెలుగు భాషలో చాలా స్పష్టంగా కన్పిస్తుంది.

**తమిళ పదాలు**

తమిళ భాషలోని మత సంబంధమైన పదాలు, భోజన సంబంధమైన పదాలు తెలుగు భాషలోకి ఎక్కువగా చేరాయి.

(1) మతసంబంధమైన పదాలు

ఉదా॥ తిరు, ఆళ్వారు, నైనారు, నంబి, తంబి, నాంచారి, జియ్యరు, తిరుమణి, తిరునాళూ, తాయారు, అలవేలుమంగ మొదలైనవి.

(2) భోజన సంబంధమైన పదాలు

ఉదా॥ సాంబారు, సాపాటు, వడ, దోసె, ఇడ్లీ, ఉప్మా మొదలైనవి.

(3) ఇతర పదాలు

ఉదా॥ తిరువన్నామలై, పెణ్ణార్, అయ్యర్, తళిగ, మళిగ, నంది, తైరు, ముదిలియార్, పిళ్ళె, సంబళం, నాయనార్, అరంగేట్రం, తోమాల, మాళిగ, ముక్కాల్ మొదలైనవి.

**కన్నడ పదాలు**

తెలుగు భాషతో అధిక సంబంధం కలిగిన ద్రావిడ భాష కన్నడం. కన్నడం తెలుగు భాషకు సజాతీయ భాష. అంటే

దగ్గర సంబంధం కలది (Congnate Language).

ఉదాహరణ.

| | | |
|---|---|---|
| కైవారం | హేమా హేమీలు | హల్లె |
| దేవర | బేడలు | హు |
| హత్తు | మజ్జిగె | హుసె |
| హజ్జ | హేరాళం | సాకు |
| నంగనాచి | హొయలు | కెలసం |
| బిడాం | హారతి | హోయి |
| బసవ | హాజరు | హోటా |
| హోదా | గెనును | గడ్డ |

**బి. విజాతీయ భాషలు**

**పరినరస్ప విజాతీయాలు**

**హింద్వార్య భాషలు (Indo-Aryan Languages)**

సంస్కృతం, ప్రాకృతం, మరాఠీ, ఒరియా, భాషలు హింద్వార్య (Indo-Aryan) భాషలు. ఇవి తెలుగు భాషకు పరినరస్ప విజాతీయ భాషలు. ఈ భాషల పదాలు భౌగోళిక, సాంఘీక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ కారణాలు వల్ల తెలుగులో ప్రవేశించాయి.

**(అ) సంస్కృత పదాలు**

(1) పరిపాలనా సంబంధమైన పదాలు

ఉదాహరణ.

| సంస్కృతం | తెలుగు |
|---|---|
| ఆదేశ | ఆదేశం |
| నిర్బంధ | నిర్బంధం |
| పరిపాలన | పరిపాలన |
| మణ్డల | మండలం |
| రాష్ట్ర | రాష్ట్రం |
| విమాన | విమానం |
| సైన్య | సైన్యం |

(2) న్యాయ సంబంధమైన పదాలు

ఉదాహరణ.

| సంస్కృతం | తెలుగు |
|---|---|
| ఋణ | ఋణం |
| చట్ట | చట్టం |

| | |
|---|---|
| దణ్డన | దండన |
| నష్ట | నష్టం |
| ధర్మ | ధర్మం |
| న్యాయ | న్యాయం |
| లాభ | లాభం |
| శిక్షా | శిక్ష |

(3) ఇతర పదాలు

ఉదాహరణ.

| సంస్కృతం | తెలుగు |
|---|---|
| స్నానం | తానం |
| ఇంద్ర | ఇందర |
| చక్ర | చక్ర |
| అగ్ని | అగ్గి |
| నిత్యమ్ | నిత్తెం |
| సత్యమ్ | సత్తెం |
| మన్త్ర | మంతరం |
| శూర్పణఖా | చుప్పనాతి |
| యుగాది | ఉగాది |
| రాత్రి | రాతిరి |
| కీర్తి | కీరితి |
| చన్ద్ర | చందురుడు |
| భక్తి | బత్తి |

**(ఆ) ప్రాకృత పదాలు**

సంస్కృభవం తద్భవం అనీ, సంస్కృత సమరూపాన్ని తత్సమమనీ అంటారు. కొన్ని ప్రాంతాల్లో ప్రచారంలో వున్న పదాల్ని దేశీపదంచే వ్యవహరిస్తారనీ వీటన్నింటి సమాహార భాషా విశేషాన్ని ప్రాకృతం అని దండి మొదలైన పండితులు చెప్పారు. ప్రకృతులంటే సాధారణ ప్రజలనీ, వారు వ్యవహరించే భాష కాబట్టి ఇది ప్రాకృతం అనీ కొందరు ప్రాకృత పండితుల అభిప్రాయం. ప్రాకృతం నుంచి సంస్కృతం పుట్టిందని కొందరు, సంస్కృతం నుంచి ప్రాకృతం పుట్టిందని కొందరు పండితుల అభిప్రాయం.

ఉదాహరణ.

| ప్రాకృతం | తెలుగు |
|---|---|
| ఆసా | ఆస |
| జూద | జూదం |
| రాణ | రాణము |
| తంతీ | తంతి |
| రాణీ | రాణి |

| | |
|---|---|
| వీర | వీరం |
| సిరీ | సిరి |
| ఆరత్రియ | హారతి |
| అహంకార | హంకారం |
| కిరీటి | క్రీడి |
| కురవము | క్రోవి |
| హింగు | ఇంగువ |
| హిమ | ఇమం |

**(ఇ) మరాఠీ పదాలు**

మరాఠీ భాష తెలుగుకు విజాతీయ భాష (Non-Congnate Language). మరాఠీ భాష ఆర్య భాషా కుటుంబానికి చెందింది. మరాఠీ భాష తెలుగునాడుకు ఇరుగు పొరుగున వుంది. మరాఠి భాషా పదాలు తెలుగులో చేరాయి.

ఉదాహరణ.
ఫే (ప్రశంస)
భళి భళి (మేలు మేలు)
రాహుతులు (సైనికులు)
ఉగ్రాణము (సామాను పెట్టుకొనే చోటు)
ఢమామి (వాద్య విశేషం)
ఖంగార్ (కంగారు)
గోవే (గోవ)
చావడీ (చావడి)
బిడార (బిడారం)
రామో (రావు)

పాగా, శివాజీ, కాగడా, కొరడా, దణి, పంచె, కమరు, కిచిడి, గస్తు కుందనం, గంజాయి, గాగర, తావీజు, కిరాణా, పడేలు, రావు, కిరాయి, లోటు, పంతులు మొదలైనవి.

**(ఒ) ఒరియా పదాలు**

విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు ఒరిస్సా రాష్ట్రానికి దగ్గరగా వుండడం వల్ల ఒరియా భాష ప్రభావం ఎక్కువగా కన్పిస్తుంది.

ఉదాహరణ.
పన్నె (దువ్వెన)
బుగత (భూస్వామి)
భోగట్టా (సమాచారం)
రేక (చేద)
కంబారీ (జీతగాడు)
ఉభాలు (ఊడ్పులు)

బందా (చిన్నచెరువు)

మొరియులు (మరమరాలు)

**హిందుస్థానీ భాషలు**

హిందీ, ఉర్దూ భాషలు, హిందూస్థానీ భాషలు, ఇవి తెలుగు భాషకు పరిసరస్థ విజాతీయ భాషలు. భౌగోళిక, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ కారణాల వల్ల ఈ పదాలు తెలుగులో చోటు చేసుకున్నాయి.

**(అ) హిందీ పదాలు**

ఉదాహరణ. అంగూర్, కిమ్మత్తు, కుశాలు, దివాలా, బడాయి, చుడిదార్ మొదలగునవి.

| | |
|---|---|
| సతాయించు | |
| ఋణయించు | "ఇంచు" తెలుగు ప్రత్యయం. |
| భరాయించు | |

**(ఆ) ఉర్దూ పదాలు**

ఉర్దూభాషలోని పరిపాలన న్యాయ, సాంస్కృతిక, వస్తుభూషణాలకు సంబంధించిన పదాలు తెలుగులో చేరాయి.

(1) పరిపాలనా పదాలు

| ఉదాహరణ. | <u>ఉర్దూ</u> | <u>తెలుగు</u> |
|---|---|---|
| | కౌల్ | కౌలు |
| | నవాబ్ | నవాబు |
| | నౌకర్ | నౌకరు |
| | రసీద్ | రసీదు |

(2) న్యాయ సంబంధమైన పదాలు

| ఉదాహరణ. | <u>ఉర్దూ</u> | <u>తెలుగు</u> |
|---|---|---|
| | కైద్ | ఖైదు |
| | గుమస్తా | గుమస్తా |
| | తాకీద్ | తాకీదు |
| | దస్తావేజ్ | దస్తావేజు |

(3) సాంస్కృతిక పదాలు

| ఉదాహరణ. | <u>ఉర్దూ</u> | <u>తెలుగు</u> |
|---|---|---|
| | ఫకీర్ | ఫకీరు |

| | |
|---|---|
| అల్లాహ్ | అల్లా |
| సలామ్ | సలాం |
| గులామ్ | గులాం |
| మక్కా | మక్కా |
| మస్జిద్ | మసీదు |

(4) వస్తు భూషణాది పదాలు

ఉదాహరణ. కుర్తా, గాబు, తకిలీ, చర్ఖా, చాకు, జరీ, ఖరీదు, కండువా, జిగినీ, బాదినీ, బాజాబందు మొదలనగునవి.

(5) ఇతర పదాలు

ఉదాహరణ.

| <u>ఉర్దూ</u> | <u>తెలుగు</u> |
|---|---|
| కాబు | ఖాబు |
| జోడ్ | జోడు |
| కరార్ | ఖరారు |
| ఖండియా | కండువా |
| ఫీజు | పీజు |
| ఫిరంగీ | పిరంగి |
| షాయ్‌నాయ్ | సన్నాయి |

కచేరి, వకాలత్, కిల్లా, సిపాయి, బందోబస్తు, దివాను, తుపాకీ, బందు, జాగీర్దారు, తహశీల్దారు, గుమస్తా, షరాబు, హజారు, ఫిర్యాదు మొదలైనవి.

**దూరవర్తి విజాతీయాలు**

**(1) పర్సో - అరబిక్ భాషలు**

అరబ్బీ, తుర్కీ, పారశీక (పర్షియన్) భాషలు పర్సో అరబిక్ భాషలు. ఇవి తెలుగు భాషకు దూరవర్తి విజాతీయ భాషలు. 13వ శతాబ్దంలో మహ్మదీయుల పరిపాలనా కాలంలో రాజకీయ, సాంస్కృతిక, వ్యాపార, మత కారణాల వల్ల అరబిక్ పర్షియన్ భాషా పదాలు తెలుగులోకి చేరాయి.

**(అ) అరబ్బీ పదాలు**

ఉదాహరణ.

| <u>అరబిక్</u> | <u>తెలుగు</u> |
|---|---|
| జిల్లా | జిల్లా |
| జిద్ | జిద్దు |
| జరీ | జరీ |

| | | |
|---|---|---|
| | తారీఖ్ | తారీకు |
| | ఖబుర్ | కబురు |
| | కైఫ్ | కైపు |

**(ఆ) తర్కీ పదాలు**

తర్కీ పదాలు కూడా కన్పిస్తున్నాయి. ఉదా. కుర్సీ, తుర్కీ (తురక)

**(ఇ) పారశీక (పర్షియన్) పదాలు**

| ఉదాహరణ | <u>పారశీక</u> | <u>తెలుగు</u> |
|---|---|---|
| | జమానా | జమానా |
| | జాగీర్దార్ | జాగీర్దారు |
| | తరాజు | త్రాసు |
| | కులహ్ | కుల్లా |
| | హకీమ్ | ఎకిమీడు (యజమాని) |
| | సర్నామా | సరినామా (చిరునామా) |
| | ఖుసీ | ఖుసి (సంతోషం) |
| | బాజీర్ | బజార్ (బజారు) |
| | రోజ్ | రోజు (దినం) |
| | లాల్ | లాలు (ఎరుపు) |
| | షహర్ | షహర్ (నగరం) |
| | హవేలి | హవేలి (ప్రాసాదం) |
| | మంజిల్ | మజిల్ |
| | దుభాషియా | దుబాసి |

పర్షియన్ (అరబిక్) భాషలకు సంబంధించిన పదాలు చాలా వున్నాయి.

1) రాజకీయ సంబంధమైన పదాలు - సుల్తాను, పాదుషా, ఫర్మానా, హుజూరు, కితాబు మొదలైనవి.

2) సైనిక పరమైన పదాలు - సిపాయి, తుపాకి, బందూకు, ఫిరాయించి, బందోబస్తు మొదలైనవి.

3) వ్యాపార పరమైన పదాలు - దుకాణం, త్రాసు, మొదలైనవి.

4) రెవిన్యూ పదాలు - కౌలు, కుశ్కీ, దుంబాలా, మొదలైనవి.

5) న్యాయ శాఖ పదాలు - దివాను, నకలు, నకాబత్తు, మొదలైనవి.

6) సామాన్య ప్రజలు వుపయోగించే వస్తు సామాగ్రి పరమైన పదాలు - కుర్చీ, గాబు మొదలైనవి.

7) వస్త్ర విశేషాలైన పదాలు - కలంకారీ, జంబుఖానా, కుల్యాయి, జలతారు మొదలైనవి.

8) ఆటలకు సంబంధించిన పదాలు - గంజి, ఫా మొదలైనవి.

**(అ) పోర్చుగీసు పదాలు**

ఇండి - యూరోపియన్ భాషా కుటుంబంలో అంతర్భాగమైన ఇటాలియన్ శాఖకు చెందిన భాషల్లో "పోర్చుగీసు" ఒకటి. దీన్ని లాటిన్ మాండలికం (Latin Dialect) అని కూడా అంటారు. తెలుగు భాషపై ప్రభావం చూపిన యూరోపియన్ భాషల్లో "పోర్చుగీసు" భాష మొదటిది. క్రీ.శ. 1498 లో పోర్చుగీసు వారు భారతదేశపు పశ్చిమ తీరంలోకి ప్రవేశించడంతో పోర్చుగీసు భాషకు తెలుగు భాషకు సత్సంబంధాలు ఏర్పడ్డాయి. పోర్చుగీసు వారిని బుడత కీచులని కూడా వ్యవహరిస్తారు. పోర్చుగీసు అనే పదం ఆంగ్లం. "బుడతగీచు" అనే పదం "పోర్చుగీసు, "పోర్చుగిసు" అనే పదం 'పోర్తగీజ్' అనే పదం నుంచి పుట్టింది.

పోర్చుగీసు వారికి వాణిజ్యాది సంబంధాలు గల ఇతర దేశాల్లో తిరిగేటప్పుడు కన్పించిన కొత్త కొత్త పండ్లను, మొక్కల్ని వలస దేశాలకు తెచ్చి పెంచే అలవాటు వుండేది. అదే విధంగా పోర్చుగీసు వారు మన దేశానికి వచ్చేటప్పుడు కొన్ని పండ్లను, మొక్కల్ని, కాయల్ని, వస్తువుల్ని తీసుకొని వచ్చారు. వీరికి చెట్లు, మొక్కలంటే ఎంతో ప్రేమ. దాని ఫలితంగా అనాస, జామ, క్యాబేజి, బంగాళదుంప, బొప్పాయి, మిరప, వేరుశనగ, సీతాఫలం మొదలైన అనేక పోర్చుగీసు పదాలు తెలుగు భాషలోకి చేరాయి.

(1) గృహ పరికరాలకు సంబంధించిన పదాలు - ఉదా॥ బాల్చీ, సీసా, అల్మార, మేజా, సబ్బు మొ॥వి.

(2) కూరగాయలకు సంబంధించిన పదాలు - ఉదా॥ అనాస, బొప్పాయి, క్యాబేజి మొ॥వి.

(3) వర్తక సంబంధమైన పదాలు - ఉదా॥ కోస్తా, గిడ్డంగి, గోదాం, బంకు మొ॥వి.

(4) వస్త్ర సంబంధమైన పదాలు - ఉదా॥ ఇస్త్రీ, కమీజు, కాజా, బొత్తం, తువ్వాలు మొ॥వి.

(5) సైనిక సంబంధమైన పదాలు - ఉదా॥ కపితాను, కమాను, పటాలం, సార్జంటు మొ॥వి.

(6) ఇతర పదాలు - ఉదా॥ బిస్కతు, బాతు, మేస్త్రీ, అల్పీ మొ॥వి.

**(ఆ) డచ్చి పదాలు**

'డచ్చి' భాష ఇండో-యూరోపియన్ భాషా కుటుంబంలోని జర్మానిక్ శాఖకు చెందింది. కళాపర్ - క్లోవర్ (Klover) అనే డచ్చి భాషా పదానికి ఇది పరిణిత రూపం.

కక్కస్ (కక్కూస్) కక్ బూ హూయిస్ అనే డచ్చి భాషా పదం దీనికి మూలం. బత్తాయి, బత్తావియా దీవుల నుంచి డచ్చి వర్తకులు తెచ్చిన ఫలవృక్షం, పంపరమాస. ఇది వృక్ష విశేషం. దీనికి పంపర పనస అనీ, పంపరయానస అని రూపాంతరాలు వున్నాయి.

నీల్‌కోల్ (Kneel Koal) దుంప, తురపు (Treemp) నూల్‌కోల్ ఇరోపెట్ మొదలైన పదాలు డచ్చి భాషా పదాలు.

**(ఇ) ఫ్రెంచి పదాలు**

ఫ్రెంచి భాషా పదాలు తెలుగులో చాలా తక్కువగా వున్నాయి. మదామ్ - మదాము.

ప్రాంచీ, కిచన్, పరాంసు, ఫిరంగి, కుసిని, కమాను, మేడమ్, బీరువా మొదలైనవి ఫ్రెంచి పదాలు.

**(ఈ) ఆంగ్ల పదాలు**

తెలుగు భాషపై ఆంగ్ల భాషా ప్రభావం చాలా ఎక్కువగా కనబడుతుంది. తెలుగు భాషపై సంస్కృత భాష తరువాత ఆంగ్ల భాష చూపినంత ప్రభావం మరే భాష చూపలేదు. వీటికి అనేక కారణాలున్నాయి.

ఆంగ్లేయుల పరిపాలన వల్ల రాజకీయ, సాంఘిక, మత, సాహిత్య, సాంస్కృతిక, వైజ్ఞానిక రంగాల్లో అనేక మార్పులు వచ్చాయి. ఈ పరిణామం హర్షించతగ్గ విషయం. దాని ఫలితంగా ఆంగ్ల పదాలనేకం తెలుగు భాషలోకి ప్రవేశించాయి. ఆంగ్లేయుల పరిపాలన పోయిన ఆంగ్ల భాషా ప్రభావం తగ్గలేదు. పైగా రోజురోజుకి ఎక్కువవుతుంది కూడ. దీనికి కారణం ఆంగ్ల భాష అంతర్జాతీయ భాష కావడమే. ఆంగ్ల పదాలు వాడని భారతీయుడు వుండడంటే అతిశయోక్తి కాదేమో! భారతీయ భాషలన్నింటి లోకి ఆంగ్ల భాష ప్రవాహంలా ప్రవహించింది. నేడు నిరక్షరాస్యుడు కూడా ఆంగ్ల పదాలు వాడడం సర్వ సాధారణమైంది. ఆంగ్ల పదాల్ని తెలుగు భాషకి అనుగుణంగా తెలుగు వాళ్ళ ఉచ్చారణకి తగినట్లుగా మార్చుకున్నారు. ఆంగ్ల పదాలు ఎక్కువగా హల్లులతో ముగుస్తాయి. కాని తెలుగు పదాలు అచ్చులతో అంతమొందుతాయి. కాబట్టి ఆంగ్ల పదాల చివర అచ్చులు చేర్చి తెలుగుగా మార్చుకోవడం అనేది వుంది.

ఉదా ॥ కార్ - కారు, పోలీస్ - పోలీసు, డాక్టర్ - డాక్టరు.

(1) పరిపాలనా సంబంధమైన పదాలు - ఉదా॥ కమీషనర్, కలక్టర్, సెక్రటరీ, మునిసిపాలిటి, మేయర్, ఫైల్ మొ॥వి.

(2) న్యాయ సంబంధమైన పదాలు - ఉదా॥ కోర్టు, లాయర్, జైలు, రిట్టు, బెంచి, డిక్రి, మొ॥వి.

(3) సాంస్కృతి సంబంధమైన పదాలు - ఉదా॥ ఫ్యాషను, డాన్సు, సినిమా, ఫ్యాను, రేడియో, టి.వి. క్లబ్బు, చర్చి మొ॥వి.

(4) నిత్యావసరాలకు సంబంధమైన పదాలు - ఉదా॥ స్విచ్, లైటు, టీ, కాఫీ, రోడ్డు, బస్సు, కారు, పెన్ను, పెన్సిల్ మొ॥వి.

(5) ఇతర పదాలు - ఉదా॥ బోర్డు, మాష్టారు, మీటింగ్, యూనివర్సిటీ, పోస్టాఫీసు, కాలేజీ, ప్రిన్సిపాల్ మొ॥వి.

ఈ విధంగా తెలుగు భాషలో ఇతర భాషా పదాలు ప్రవేశించాయి. ఏ భాషకైనా ఇతర భాషల నుంచి పదాల్ని స్వీకరించడం, అలాగే ఇతర భాషలకు తన పదాల్ని ప్రధానం చేయడం సహజమైన లక్షణం.

## 16.3 సమీక్ష

తెలుగులోని గ్రాంథిక వ్యావహారిక భాషావాదాలను గురించి, తెలుగు భాషలోని అన్యదేశ్యాలను గురించి తెలుసుకున్నారు.

## 16.4 ప్రశ్నలు

1. గ్రాంథిక - వ్యావహారిక వాదాలను గురించి వివరింపుము.
2. వ్యావహారిక భాషావాదానికి గిడుగు వారు చేసిన కృషిని వివరింపుము.
3. తెలుగులోని అన్యదేశాలు గురించి వ్రాయండి.

**లఘు ప్రశ్నలు**

1. గ్రాంథిక భాష అనగా నేమి? దాని ఉద్యమము గురించి వివరింపుము.
2. వ్యావహారిక భాష - ఏట్స్

3. గురజాడ అప్పారావు.
4. పోర్చుగీసు పదాలు.

## 16.5 ఆధార గ్రంథాలు


1. తెలుగు భాషా చరిత్ర - డా॥ వెలమల సిమ్మన్న
2. తెలుగు భాషా చరిత్ర - స్ఫూర్తిశ్రీ టి. భాస్కరరావు.
3. ఆధునిక భాషా శాస్త్ర సిద్ధాంతాలు - ఆచార్య పి.యస్. సుబ్రమణ్యం.
4. తెలుగు భాషా చరిత్ర - డా॥ కె. వెంకట్రామయ్య
5. తెలుగు భాషా చరిత్రము - తులనాత్మక పరిశీలన - ఆచార్య నాయని కృష్ణకుమారి, ఆచార్య తమ్మారెడ్డి నిర్మల



**డాక్టర్ డొక్కు కృష్ణ డిటెక్టివ్**
ఎం.ఏ., పిహెచ్.డి., యల్.యల్.బి.
లెక్చరర్ (తెలుగు)
యస్.పి. మహిళా కళాశాల
మచిలీపట్నము, కృష్ణా జిల్లా

# పాఠం - 17

# తెలుగులోని ప్రధాన మాండలికాలు

పాఠ్యనిర్మాణక్రమం


17.0 లక్ష్యం
17.1 తెలుగులోని ప్రధాన మాండలికాలు
17.1.1 మండలమంటే ఏమిటి?
17.1.2 మాండలికమంటే ఏమిటి?
17.1.3 మాండలిక భాష - పర్యాయపదాలు
17.1.4 మాండలికాలు - ప్రధాన లక్షణాలు
17.1.5 మాండలికాలు ఏర్పడే తీరు
17.1.6 మాండలికాలు - ప్రయోజనాలు
17.1.7 మాండలికాలు - పరిశీలనా పద్ధతులు
17.1.8 వ్యవహార భేదక రేఖలు
17.1.9 మాండలిక పటాలు
17.1.10 తెలుగు భాష - వ్యావహారిక మండలాలు
17.1.11 మాండలికాలు - భేదాలు
17.1.12 మాండలికాలు - వర్గీకరణ
17.2 ప్రామాణిక భాష
17.2.1 ప్రామాణిక భాష
17.2.2 ప్రామాణిక భాష - లక్షణాలు - ప్రయోజనాలు
17.2.3 భాషా ప్రామాణీకరణం
17.2.4 భాషా ప్రామాణీకరణం - పరిశోధనా పద్ధతులు
17.2.5 భాషా ప్రామాణీకరణం - టీనర్
17.2.6 ప్రామాణిక భాష - ప్రాంతీయ భేదాలు
17.2.7 శిష్టభాష - ప్రామాణిక భాష
17.2.8 ప్రామాణికేతర భాషా లక్షణాలు
17.2.9 న్యూనప్రామాణిక రూపాలు - ప్రామాణికేతర రూపాలు
17.3 అర్థ పరిణామం
17.3.1 ధ్వని పరిణామం
17.3.2 అర్థ పరిణామం
17.3.3 అర్థ విపరిణామం - నిర్వచనం
17.3.4 అర్థ పరిణామం - పరిశోధన
17.3.5 అర్థ పరిణామం - హేతువులు
17.3.6 అర్థాల్లో మార్పులు వచ్చే పద్ధతులు
17.3.7 అర్థ పరిణామం - రకాలు
17.4 సమీక్ష
17.5 ప్రశ్నలు
17.6 ఆధార గ్రంథాలు

## 17.0 లక్ష్యం

తెలుగులోని మాండలికాలను, వాటి భేదాలను పరిచయం చేయడం, ప్రామాణిక భాషను గురించి తెలియజేయడం. తెలుగులో అర్థపరిణామంలోని రకాలను తెలియజేయడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## 17.1 తెలుగులోని ప్రధాన మాండలికాలు

భాష నిత్యం పరిణామం చెందుతూనే వుంటుంది. భాష సజీవ వ్యవస్థకు చెందింది. కాబట్టి మార్పు అనేది భాషకు సహజం ప్రాంతీయ సామాజిక, చారిత్రక వృత్తి కాల భేదాల్ని బట్టి ఒక భాష విభిన్న రకాలుగా వ్యవహరించబడితే ఆ భాషలో మాండలికాలు ఏర్పడతాయి. ఈ విధమైన మాండలికాలు ప్రపంచ భాషలన్నింటిలోనూ వుంటాయి.

### 17.1.1 మండలమంటే ఏమిటి?

మండలమంటే దేశ భాగమని అర్థం. మండలానికి 'జిల్లా' 'రాశి' సమూహం. గుంపు అనే అర్థాలు కూడా వున్నాయి. నిర్ణీత జన సముదాయానికి లేదా పరిమిత వ్యవహార ప్రాంతానికి మండలమని పేరు 'మండలం' అనేది సంస్కృత పదం.

### 17.1.2 మాండలికమంటే ఏమిటి?

మండల సంబంధమైంది మాండలికం. ఒకే భాషకు చెందిన భిన్న భిన్న ప్రాంతాల్లోని భేదాన్ని మాండలికాలుగా పిలుస్తారు. ఒకే భాషకు ప్రజల వ్యవహారంలోనూ, పదాల్లోనూ వాటి ఉచ్చారణలోనూ, ప్రత్యయాల్లోనూ, పదాల అర్థాల్లోనూ, వ్యాకరణంలోనూ, వాక్యరచనలోనూ, భేదాలు వుంటాయి. ఒకే భాషకు వున్న ఇలాంటి భేదాల్ని "మాండలికాలు" అని అంటారు.

శబ్దరత్నాకరం, సూర్యరాయాంధ్ర నిఘంటువుల్లో "మాండలికం" అనే పదం చోటు చేసుకోలేదు. కాబట్టి ఈ పదాల్ని ఆధునిక పదంగా మనం భావించవచ్చు. "మాండలికం" ను వేదం వేంకటరాయ శాస్త్రి గారు "మాండలిక భాష" అని వ్యవహరించారు. గిడుగు రామమూర్తి పంతులు గారు "మాండలికం", "మాండలీయక భాష" అని అన్నారు. మొత్తం మీద మాండలిక భాష అంటే నిర్ణీతమైన మండలంలో ప్రధాన భాషలో భాగమై ఆ భాష కంటే కొంత వేరై వెలుగొందేది అని అర్థం. భాష విశాలమైంది. మాండలిక భాష పరిమితమైంది.

భాషా వ్యవహర్తల్లో ఎక్కువ స్థాయిలో వున్నవారి మాండలిక భాషను "ప్రామాణిక మాండలికం" (Standard Dialect) అని అంటారు. తక్కువ స్థాయిలో వున్న వారి మాండలిక భాషను "న్యూనప్రామాణిక మాండలికం" (Sub-standard Dialect) అని అంటారు. దీనికి సంబంధించి కొందరు భాషా శాస్త్రవేత్తల అభిప్రాయాలు పరిశీలిద్దాం.

(అ) హీదునీ - "Sub-divisions of a language are referred to as dialects" - Historical Linguistics an Introduction, P-3 "భాషలోని ప్రాంతీయ భేదాల్ని మాండలికాల"ని అంటారు.

(ఆ) ఆచార్య పి.యస్. సుబ్రమణ్యం - ఒకే భాషకు ప్రజల వ్యవహారంలో పదాలలోనూ, వాటి ఉచ్చారణలోనూ ప్రత్యయాలలోనూ, పదాల అర్థాలలోనూ, భేదాలు వుండి ఆ భాషలో రకాలు వుంటాయి. ఒకే భాషకు వున్న ఇలాంటి రకాల్ని మాండలికాలు (Dialects) అని అంటారు.

- ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు - పుట 159.

### 17.1.3 మాండలిక భాష - పర్యాయపదాలు

మాండలిక భాషకు 'ఉప భాష, ప్రాదేశిక భాష, ప్రాంతీయ భాష' అనే పర్యాయపదాలు (Synonyms) కూడా వున్నాయి. మాండలిక భాషను ఆంగ్లంలో 'డైలక్ట్' (Dialect) అని అంటారు. భాషలో వుండే ప్రాంతీయ భేదాల్ని అధ్యయనం చేయడాన్ని (Dialectology) అని అంటారు. ఈ "Dialect" అనే ఆంగ్ల పదం ఫ్రెంచి "Dialecte" అనే పదం నుంచి ఏర్పడింది. ఫ్రెంచి "Dialecte" అనే పదం లాటిన్ Dialectus నుండి వచ్చింది. Dialectus లాటిన్ పదం "Dialektos" అనే గ్రీకు పదం నుంచి వచ్చింది.

### 17.1.4 మాండలికాలు - ప్రధానలక్షణాలు

1) ప్రధాన భాషలో, ప్రామాణిక భాషలో భాగంగా వుండటం.
2) భాషా వ్యవహర్తల మధ్య పరస్పర అవగాహన (Intelligibility) క్షమత్వం కోల్పోకుండా వుండడం.
3) పరిమిత ప్రదేశంలో అంటే నిర్ణీత ప్రాంతాల్లో మాత్రమే వ్యవహరించడం.
4) ముద్రించిన ప్రామాణిక సాహిత్యం లేకపోవడం.
5) న్యూన ప్రామాణికం (Sub-standard) గా వుండడం.
6) కొన్ని పదాల్లో క్రియా రూపాల్లో ప్రాంతీయ వైలక్షణ్యం పాలు ఎక్కువుగా వుండడం.
7) పరిసర భాషల్లోని పదాల్ని గ్రహించి ప్రామాణిక పదాలకు బదులుగా వాడడం.
8) క్రమ క్రమంగా ప్రధాన భాషతో అంటే ప్రామాణిక భాషతో దగ్గరకు రావడానికి ప్రయత్నించడం.

### 17.1.5 మాండలికాలు ఏర్పడే తీరు

మాండలిక భాషలు ఆవిర్భావానికి కాలక్రమంగా భాషల్లో కలిగే మార్పులు, భాషా వ్యవహర్తలు వలసపోవటం, ప్రధాన కారణాలుగా కన్పిస్తున్నాయి. మాండలిక భాషలు ప్రదేశాన్ని బట్టి కాలాన్ని బట్టి ఏ విధంగా ఏర్పడ్డాయో ఇండో - యూరోపియన్ భాషల్ని, ద్రావిడ భాషల్ని పరిశీలించిన తర్వాత మనకు అర్థమవుతుంది.

మూల భాషం (Proto-languages) లోని మాండలికత వల్లే భిన్న భాషలు ఏర్పడ్డాయని భాషా శాస్త్రజ్ఞుల అభిప్రాయం. ద్రావిడ భాషా వ్యవహర్తలు క్రీ.పూ. 3000 సంవత్సర కాలం నుంచి ఉత్తర భారత దేశం నుంచి మధ్య భారత దేశానికి తర్వాత దక్షిణ భారత దేశానికి వచ్చారు. ఒకే భాషా కుటుంబానికి చెందిన భాషలైనప్పటికి ఇద్దరు వ్యక్తుల మధ్య మాట్లాడేటప్పుడు ఏ మాత్రమూ అవగాహన లేకపోతే వారు మాట్లాడే భాషల్ని భిన్న భాషలుగానే భావించాలి. ఈ రీతిగా ఒకే భాష పలు భాషలుగా మారడానికి అవకాశం వుంది. శబ్దార్థ పరిణామాలు భిన్న భాషల ఆవిర్భావానికి కారణాలయ్యాయి.

భాషలో మాండలికాలు ఏర్పడటానికి కొన్ని ప్రధానమైన కారణాలున్నాయి. అవి ఇవి -

1. వ్యవహర్తల సంఖ్య పెరగడం.
2. వ్యవహర్త ప్రాంతం పెరగడం. వ్యవహార ప్రాంతం విస్తృతి వల్ల భాషా వ్యవహర్తల మధ్య భాషా వైరుధ్యం కలిగి, భిన్న మాండలికాలు ఏర్పడతాయి.

3. మాతృ భాషా ప్రాంతం నుంచి దూరం అవడం.

4. కొత్తగా విస్తరించిన ప్రాంతాల్లో కొత్త భాషలతో కలియడం.

5. నూతన ప్రాంతాల్లోని వాతావరణం, శీతోష్ణస్థిత్యాది పరిస్థితుల్లో భేదాల వల్ల కొత్త భావాల్ని బోధించే పదాల్ని కొత్తగా సృష్టించడం లేక స్థానిక భాషల్లోని పదాల్ని ఆదానం చేసుకోవటం, లేక పాత మాటలనే కొత్త అర్థాలతో వుపయోగించడం మొదలైన ప్రయత్నాల వల్ల కొత్త కొత్త పదాలు ఏర్పడడం.

6. నగరాలు, రాజధానులుగా ఏర్పడటం, ఆ నగర భాష ప్రామాణికం కావడం.

7. ప్రజల విద్యా సంస్కారాదుల్లో భేదం వుండడం.

8. ఒకే భాషా ప్రాంతం రాజకీయంగా భిన్న సీమలుగా విడగొట్టబడడం వల్ల కూడా మాండలికాలు ఏర్పడ్డాయి. ఉదాహరణకు రాయలసీమ, సర్కారు, తెలంగాణా ప్రాంతాలు.

9. భిన్న వృత్తుల్ని అవలంబిస్తూ వుండడం.

10. వ్యవసాయ, చేనేత, జాలరి, కుమ్మరి, మొదలైన వృత్తుల వారు వాడుకునే పనిముట్లనూ, చేసే పనులనూ, బోధించే పదాలు ఆయా వృత్తులకూ, ఆయా ప్రాంతాలకూ పరిమితమై వుండడం.

11. బ్రహ్మాండమైన పర్వత శ్రేణులు, నదులు, అడవులు మొదలైనవి రాకపోకలకు ప్రతిబంధకాలై భాషా వ్యవహారంలో భేదాలకు కారణం అవడం.

12. ఆంధ్ర దేశానికి పొరుగున వున్న తమిళనాడు, మహారాష్ట్ర, ఒరిస్సా, కర్ణాటక దేశాలతో భౌగోళికమైన సరిహద్దులు స్పష్టంగా లేకపోవడం.

13. ఒకే ప్రాంతంలోని ప్రజలు విభిన్నమైన సాంఘిక, ఆర్థిక పరిస్థితులకు చెందినవారై వుండడం.

14. ప్రాచీన కాలంలో రాకపోకలకు సరైన సదుపాయాలు లేకపోవడం కారణంగా భాషా వ్యవహర్తల పరస్పర సంబంధాలు సన్నగిల్లి భాషా వ్యవహారంలోని సమరూపత లోపించి మాండలికాలు ఏర్పడతాయి.

15. ఒక ప్రాంతానికి వలస వెళ్ళి, స్థిరపడితే పరిస్థితులకు అనుగుణంగా భాష మారుతుంది. భాషా వ్యవహర్తలు వలస వెళ్ళేటప్పుడు ఆయా ప్రాంతాల్లో వేరే విధంగా వున్న వాతావరణం, జంతువులు, పక్షులు, చెట్లు స్వీయ భాషను ప్రభావితం చేస్తే మాండలికాలు ఏర్పడుతాయి.

16. భాష మార్పుకు లోనుకావడం సహజం. భాషలో శబ్దార్థాల మార్పులు చోటు చేసుకుంటాయి. భిన్న ప్రాంతాల ప్రజలు భాషలో శబ్దార్థాల పరిణామం చెందిన కారణంగా, ఒకే భాషలో భిన్న మాండలికాలు ఏర్పడతాయి.

17. రాజకీయ కారణాలు వల్ల కూడా మాండలికాలు ఏర్పడతాయి. నిజాం పాలకుల పరిపాలన వల్ల తెలంగాణా ప్రాంతంలో నసీబు, జమానా, గల్లీ, దోస్తి లాంటి పదాలు చేరడం వల్లే తెలంగాణా మాండలికాలు ఏర్పడ్డాయి.

18. ఇప్పుడు మనకు వున్న రేడియోలు, టి.వి.లు, వార్తా పత్రికలు, సినిమాలు, టెలిఫోన్‌లు మున్నగు ఆధునిక సౌకర్యాలు పూర్వం లేవు. కాబట్టి సమాచారం చేరవేతలోని (Distance) అసౌకర్యాల వల్ల కూడా మాండలికాలు ఏర్పడతాయి.

### 17.1.6 మాండలికాలు - ప్రయోజనాలు

మాండలికాల వల్ల అనేక ప్రయోజనాలున్నాయి.

1. మాండలికాలు భాషకు సజీవ చిహ్నాలు. జీవ భాషకు మార్పులు సహజం. కాబట్టి ఈ మార్పుల వల్ల భాషా రూపాన్ని గ్రహించడమే మాండలికాల ప్రత్యేకతగా చెప్పవచ్చు.
2. భాషా స్వరూపాన్నే కాక, భాషా చరిత్రను కూడా మాండలికాల వల్ల తెలుసుకోవచ్చు.
3. మాండలిక పరిశోధన వల్ల ప్రత్యేక నిఘంటువు నిర్మాణం చేయవచ్చు.
4. ఒకే పదానికి గల ఉచ్చారణ. అర్థ భేదాన్ని సులభంగా గుర్తించవచ్చు.
5. ఒక కాలంలో ఏకరూపంగా వున్న పదాలు కాలక్రమంలో భిన్న రూపాలుగా స్థిరపడతాయన్న విషయాన్ని తెలుసుకోవచ్చు.
6. మాండలికాల వల్ల ప్రాచీన గ్రంథాల్లో వచ్చిన పదాలకు స్పష్టార్థ నిరూపణ సాధ్యమవుతుంది.
7. ప్రాచీన కవి రాసిన రచనల్లో పదాల్ని ఆధారంగా చేసుకొని ఆ కవి ఏ ప్రాంతానికి చెందినవాడో స్పష్టంగా తెలుసుకోవచ్చు. కవులు వాడిన మాండలికాల్ని బట్టి వారు ఏ ప్రాంతానికి చెందిన వారో నిర్ధారించవచ్చు.

   ఉదాహరణకు - గునపం, గెడ్డపార పదాలు పింగళి సూరనకు ముందున్న కవులు ఎవ్వరూ ప్రయోగించలేదు. ఇది గోదావరి మాండలిక పదాలు, తిక్కన భారతంలో మోట అనే అర్థంలో 'కపిల' అనే పదాన్ని వాడాడు. 'కపిల' పదం నెల్లూరు ప్రాంతంలో వ్యవహారంలో వుంది.

8. మాండలిక పదాల్ని బట్టి ప్రజలు ఏయే దిక్కులుగా వలసపోయింది. మనం ఊహించవచ్చు.

   ఉదా॥ భాగవతకర్త పోతనలో రాయలసీమ పదాలు కన్పించడం.

9. ఒక ప్రాంతంలో వ్యవహారంలో లేని పదాల్ని మాండలిక వ్యవహార ప్రాంతం నుంచి సమకూర్చుకోవడం ద్వారా ప్రధాన భాషను సుసంపన్నం చేయవచ్చు.
10. మాండలికాల ద్వారా సాంఘిక, రాజకీయ చరిత్రకూ భాషకూ వున్న పరస్పర సంబంధాన్ని తెలుసుకోవచ్చు, మాండలిక పదవ్యాప్తికి అనుసరించి సాంఘిక, రాజకీయ హేతువుల్ని కూడా గ్రహించవచ్చు.
11. గ్రాంథిక రూపాలు మాండలికాలుగానూ, మాండలికాలు గ్రాంథిక రూపాలుగాను మారుతాయి.
12. రాను రాను మాండలికాలు ప్రామాణిక భాషలో ప్రవేశించాక కాలక్రమేణా నశిస్తాయి.
13. మాండలిక పరిశీలన వల్ల భాషకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ మాండలికాలు భాషకు, వైవిధ్యాన్ని, సౌందర్యాన్ని పెంపొందిస్తాయి.

### 17.1.7 మాండలికాలు - పరిశీలనా పద్ధతులు

మాండలిక పరిశీలనా పద్ధతులు ఇవి.

1. ఏదో ఒక పదాన్ని తీసుకుని ఆ అర్థంలో మిగిలిన ప్రాంతాల వారు ఏమని వాడుతున్నారో అని పరిశీలించడం.

2. దేశమంతటా ఒకే శబ్దం ఉచ్ఛారణ భేదాలతో వున్న వాటిని గ్రహించడం.

3. వ్యాకరణ ప్రక్రియల్ని వాటి విశేషాల్ని సేకరించడం.

(ఎ) ఏదో ఒక పదాన్ని తీసుకుని ఆ అర్థంలో మిగిలిన ప్రాంతాల వారు ఏమని వాడుతున్నారో అని పరిశీలించడం.

ఒకే అర్థం తీసుకొని మిగిలిన ప్రాంతాల్లో ఆ పదానికి ఏ మాట వాడుతారో ప్రతి పల్లెకీ తిరిగి సేకరించడం. 'నాగలి' అంటే పొలము దున్నే పనిముట్టు. దీనిని నాంగలి, నాగెలు, నాగేలు, మడక అనే పదాలు వ్యవహారంలో వున్నట్లు పరిశోధన వల్ల తేటతెల్లమవుతుంది. పైన చెప్పిన మాటల్లో మడక అనే పదం తప్ప మిగిలిన పదాలన్నీ ఇంచు మించు రూపాంతరాలు. అంటే చారిత్రకంగా ఒకే ప్రాచీన శబ్దం నుంచి ఏర్పడినవని నిర్ధారించవచ్చు. 'నాంగేల్' అనేది ప్రాచీన రూపం. 'మడక' దానికి పర్యాయపదం.

మాండలిక భాషా భేదాలు సాధారణంగా శబ్దార్థాల్లోని పరిణామాల్ని బట్టి కొత్త రూపాన్ని పొందుతుంటాయి. ఒకే పదం భిన్న కాలాల్లో భిన్న మాండలాల్లో అర్థ పరిణామం చెందుతుంది. ఉదాహరణకు 'కంపు' అనే పదానికి 'సుగంధం' అని ప్రాచీన అర్థం అయితే నేడు అది సుగంథం అనే అర్థంలో కాక 'దుర్గంధం' అనే అర్థంలో వాడబడుతుంది.

'చీర' అంటే వస్త్రమని ప్రాచీన అర్థం. నేడు ఆడువారు మాత్రమే కట్టుకొనే 'కోక' అని 'నవీనార్థం'.

'తగవు' అనే మాటకు న్యాయమని, ధర్మమని ప్రాచీన అర్థం. నేడు న్యాయం కోసం జరిగే పోట్లాట అనీ, ధర్మ నిర్ణయం కోసం జరిగే వివాదమనీ అర్థం.

'రేపు' అంటే ప్రాతఃకాలమని ప్రాచీన అర్థం. నేడు రేపు అంటే మరుసటి రోజు అని అర్థం.

'వగలు' అంటే రీతులు అని ప్రాచీన అర్థం. నేడు 'ఒయ్యారం' అని అర్థం. చేను అంటే పైరు లేక పంట అని తీర ప్రాంతపు వారు వ్యవహరిస్తున్నారు. 'పొలం' అని పశ్చిమాంధ్ర వారు వాడుతారు.

'పప్పులు' అంటే పప్పుధాన్యాలని కోస్తా వారు వ్యవహరిస్తారు. 'వేయించిన సెనగపప్పు' అనే అర్థంలో గ్రామీణులు వాడుతున్నారు. కంది, పెసర, మినప మొదలైన వాటిని పప్పు అని ఉత్తర మండలాల వారు వ్యవహరిస్తున్నారు. రాయలసీమలో కొన్ని ప్రాంతాల్లో ఇదే వ్యవహారం వుందని తెలుస్తుంది. 'బేడ'లు అంటే రాయలసీమలో 'పప్పులు' అని అర్థం.

బేడలు అంటె నయాపైసలు రాక పూర్వం వుండే మానం రెండణాలు అని సర్కారు మండలాల వారి వ్యవహారం. రూపాయలు, అణాలు, కాసులు, దమ్మిడీలు వుండే మానం. ఇప్పుడు వ్యవహారంలో లేవు.

(బి) ఆంధ్రదేశ మంతటా ఒకే పదం ఉచ్ఛారణ భేదాలతో వున్న వాటిని గ్రహించడం.

1. పన్ని - పన్నె - పన్య - పైన.

2. నాగలి - నాగల - నాంగలి - నాగెలి - నాగేలి - నాగేలీ.

3. బొత్తం - బొత్తాను - బొత్తాం - బొత్తాయి.

4. తిరగమోత - తిరగమాత - తిరగబోత - తిరగబాత.

సి. వ్యాకరణ ప్రక్రియల్ని - వాటి విశేషాల్ని సేకరించడం.

1. క్రియా రూపాల్లో మాండలిక భేదం గుర్తించడం.
2. వ్యతిరేకార్థకంలో భిన్న మండలాల్లో భిన్న రూపాలు చాలా స్పష్టంగా కన్పిస్తున్నాయి.
3. భావార్థకాల్లో గుంటూరు ప్రాంతానికి ఇతర ప్రాంతానికి చాలా తేడాలు కన్పిస్తున్నాయి.
4. ఇంకా నామవాచకాల్లో, సర్వనామాల్లో, అవ్యయాల్లో, భిన్న మండలాల్లో భేదం కన్పిస్తుంది.

పైన చెప్పిన మాండలిక పరిశీలనా పద్ధతుల ద్వారా భిన్న మండలాల్లో వున్న ఒకే పదం ఏయే రూపాల్లో వుందో తెలుసుకోవడానికి అవకాశం వుంది. మాండలిక పరిశీలన వల్ల భాషకు ఎనలేని మేలు జరుగుతుంది.

### 17.1.8 వ్యవహార భేదక రేఖలు (Isoglosses)

తెలుగు భాషలో జరిగిన మాండలిక పరిశీలన ఇప్పటి వరకు ప్రధానంగా పదాల వాడుక లక్ష్యంగా జరిగిందే కాని భాషా మండలాలు నిరూపించే ఉద్దేశంతో చేసింది కాదు. వృత్తుల్లో వున్న పదాల్ని కోశస్థం చేసే దృష్టితో చేసింది. కాబట్టి మాండలిక పరిశీలన స్థూలదృష్టితో చేసింది మాత్రమే అనే విషయం మనం గుర్తుంచుకోవాలి. ఈ రీతిగా గీసిన పటాల్లో వాడుక మారిన ప్రతి చోట గుర్తులు మార్చాలి. ఇలాంటి గుర్తులన్నింటినీ ఒక వైపుకు వచ్చేటట్లు ప్రత్యేకంగా వేరుచేసి పటంలో గుర్తులు మార్చాలి.

గీసిన గీతనే వ్యవహారిక భేదకరేఖ (Isoglosses) అని అంటారు. ఒక విలక్షణ ఉచ్చారణ లేక పదమో వ్యాపించిన ప్రాంతాల నుండి వేరు చేసే రేఖనే "వ్యవహారిక భేదక రేష" అని అంటారు.

ఉదాహరణకు ఆంధ్ర ప్రదేశ్ పటంలో 'పేడ' ను పెండ అని వ్యవహరించే తెలంగాణా ప్రాంతాన్ని ఒక గీత వల్ల మిగిలిన ప్రాంతాల నుంచి వేరు చేసి చూపించవచ్చు. ఇది వ్యవహారిక భేదకరేఖ.

ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారి ఆధ్వర్యంలో రూపొందించబడిన వృత్తి పదకోశం తెలుగులో వ్యవహారిక భేదక రేఖలను గుర్తించడానికి వుపయోగపడుతుంది. వ్యవహారిక భేదక రేఖలు భాషా స్వరూపాన్ని తెలుసుకోవడానికి పనికి వస్తాయి.

### 17.1.9 మాండలిక పటాలు (Dialect Atlas)

ప్రాంతీయ భేదాల్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత మాండలికాన్ని జాగ్రత్తగా గుర్తించి, ఏదో ఒక వర్గానికి చెందిన వారి వాడుకకు సంబంధించిన పదాల వివరాలు, ఒక పద్ధతి ప్రకారం సేకరించాలి. ఇలా సేకరించిన వాడుక పదాలకు ఒక్కొక్క దానికి ఒక్కొక్క సంకేతం పెట్టుకొని, ఆంధ్రప్రదేశ్ పటంలో గుర్తించాలి. వాడుక మారినచోట, తప్పని సరిగా సంకేతం మారుతుంది. ఈ రీతిగా సిద్ధం చేసుకున్న పటాల్ని మాండలిక పటాలు (Dialect Atlas) అంటారు. మాండలిక పటాలు వృత్తి పదకోశాల్లోనూ "తెలుగు భాషా చరిత్ర" లోనూ చోటుచేసుకున్నాయి.

పదాలు ప్రధానంగా గీచిన పటాల్ని "Word Atlas" అనీ, ధ్వనులు ప్రధానంగా గీచిన పటాల్ని "Phonotic Atlas" అనీ, వ్యాకరణ విశేషాలు లక్ష్యంగా గీచిన పటాల్ని "Grammatical Atlas" అని అంటారు.

### 17.1.10 తెలుగు భాష - వ్యావహారిక మండలాలు

ప్రముఖ భాషా శాస్త్రజ్ఞులు ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు 'తెలుగునాడు' ను వివిధ వృత్తిపరమైన పదకోశ పరిశోధన

ఆధారంగా, నాలుగు భాషా వ్యావహారిక మండలాలుగా విభజించారు.

ఎ. పూర్వ మండలం / కళింగ ప్రాంతం

బి. మధ్య మండలం / కోస్తా ప్రాంతం

సి. దక్షిణ మండలం / రాయలసీమ ప్రాంతం

డి. ఉత్తర మండలం / తెలంగాణా ప్రాంతం

**ఎ. పూర్వ మండలం / కళింగ ప్రాంతం**

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం మూడు జిల్లాలు 16వ శతాబ్దం వరకు కళింగ రాజ్యంలో భాగంగా ఉన్నాయి. కళింగుల దేశం కాబట్టి దీనికి కళింగ దేశమని పేరు వచ్చింది. కళింగ ప్రాంతాన్ని పూర్వ మండలంగా పిలుస్తారు. ఈ జిల్లాలోని భాష ఈ నాటికి మిగిలిన తెలుగు దేశంలోని జిల్లాలోని భాష కంటే విలక్షణంగా వుంటుంది. దీనికి కారణం ఒరియా భాషా ప్రభావం దీనిపై ఎక్కువగా వుండడమే.

పూర్వ మండలంలోని భాష ఇతర మండలాల్లోని భాషకన్నా విలక్షణంగా ప్రత్యేకంగా వుంటుంది. కళింగ ప్రాంతంలో 'తూము' అనే మాటకు బదులుగా 'మదుం' అని వ్యవహరిస్తారు. 'కాడి'ని పూజ/పూదు అని అంటారు. 'కర్ర'ను 'నక్కు' అని అంటారు. 'సజ్జల' ను 'గంటి/గంటె' అని అంటారు. పశువుల్ని ఈ ప్రాంతంలోని వారు 'సొమ్ములు' అని అంటారు. 'సొమ్ము' అంటే ఐశ్వర్యం, ధనం అనే అర్థాలు ఇతర మండలాల్లో వున్నాయి. ప్రాచీన కాలంలో ద్రావిడులకు పశు సంపదే మూలం. సొమ్ములు అనే విషయం మన అందరికీ తెలిసిందే. కాబట్టి సొమ్ములు అంటే పశువులనే అర్థం నేటికీ పూర్వ మండలంలో వుంది. 'కలుపు'ను కళింగ ప్రాంతంలో 'గాబు' అని వ్యవహరిస్తారు. తలుపుకు వేసుకొనే గొళ్లెం/గొళ్ళెంను గొలుసు అంటారు. 'చేను'కు చుట్టూ వేసే కంచెను 'ఎలుగు' అంటారు. 'దువ్వెన'ను పూర్వ మండలంలో పైన/పన్ని/పన్నె అని అంటారు. ఇలా పూర్వ మండలానికి ఇతర మండలాలకు తేడా చాలా స్పష్టంగా కన్పిస్తాయి.

(1) క్రియా పదాలు

కళింగ ప్రాంతంలో క్రియా పదాల్లో మాండలిక భేదం సుస్పష్టంగా కన్పిస్తుంది. ఈ మండలంలోని మాండలిక పదాలకు ఇతర మండలంలోని పదాలకు తేడా పరిశీలించండి.

| ఉదా॥ | పూర్వ మండల భాష (కళింగ జిల్లాల భాష) | | మధ్య మండల భాష (కోస్తా జిల్లాల భాష) |
|---|---|---|---|
| | వెళ్ళొచ్చీశాడు / వచ్చీశాడు | - | వచ్చేడు |
| | తెచ్చీశాడు | - | తెచ్చేడు |
| | ఇచ్చీశాడు | - | ఇచ్చేడు |
| | చేసేశాడు | - | చేసేడు |
| | కట్టేశాడు | - | కట్టేడు |

(2) ధ్వనుల మార్పులు

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | మన్వరాలు | - | మనవరాలు |

| | | |
|---|---|---|
| పిల్లేదు | - | పిలవలేదు |
| కడత | - | కణత |
| మిర్వకాయ | - | మిరపకాయ |
| సెక్రం | - | చెక్రం / చక్రం |
| కల్లేదు | - | కలవలేదు |
| సేలా | - | చాలా |
| వడుకు | - | వణుకు |

(3) పిలుచు, కలుసు క్రియలు కొందరి వ్యవహారంలో వ్యతిరేకార్థక ప్రత్యయంలో పిల్, కల్‌గా వుంటాయి.

| | | |
|---|---|---|
| ఉదా॥ పిల్ - లేదు | - | పిలువలేదు |
| కల్ - లేదు | - | కలువలేదు |
| పిలను | - | పిలవను |
| కలను | - | కలవను |
| పిలొద్దు | - | పిలవొద్దు |
| కలొద్దు | - | కలవొద్దు |

(4) పూర్వ మండలంలో అవశిష్ట రూపాలు చోటు చేసుకున్నాయి.

| | | |
|---|---|---|
| ఉదా॥ మట్టు | - | తొక్కు |
| నూలు | - | నువులు |
| బైసి | - | సిగ్గు |

(5) కళింగ ప్రాంతంలోని మాండలిక పదాలు పరిశీలిస్తే కొన్ని ప్రత్యేకతలు చాలా స్పష్టంగా కన్పిస్తాయి.

ఉదా॥ ఎ) పూర్వ మండలంలో దూరాన్ని సూచించడానికి 'అల్లక్కడ' అని అనిటారు. దగ్గర సూచించడానికి 'ఇల్లిక్కడ' అని వ్యవహరిస్తారు.

బి) కళింగ ప్రాంతంలో 'ఆవల' అనడానికి 'అవతల' అని అంటారు. ఈవల అనడానికి 'ఇవతల' అని వ్యవహరిస్తారు.

సి) సంఖ్యా వాచకాల్లో 'వంద'కు బదులుగా నూరు అనే పదాన్ని వాడుతారు. 'నూరు' అనేది అచ్చ తెలుగు పదం.

డి) కళింగ ప్రాంతంలో 'నేను' అనే సర్వనామానికి 'నాను' అని వాడతారు.

ఇ) ఈ మండలంలో ద్వితీయ విభక్తికి బదులుగా షష్ఠి విభక్తిని వాడుతారు.

ఉదా॥ నీకు రమ్మనారు / నిన్ను రమ్మన్నారు /

దేవుడికి ఎంత ప్రార్థించినా / దేవుణ్ణి ఎంత ప్రార్థించినా

(6) పూర్వ మండలంలోని పదాల్ని, పదబంధాల్ని పరిశీలిస్తే చాలా వింతగా వుంటుంది. ఇతర మండలాల్లోని వారికి ఈ పదాలు అర్థం కావు.

ఉదా॥ | పూర్వ మండల పదం | - | అర్థం |
|---|---|---|---|
| | మెతుకులు | - | అన్నం |
| | మార్పులు | - | పెద్ద చేపలు |
| | మిట్టలు | - | చిన్న చేపలు |
| | ఈరకత్తి | - | వియ్యపురాలు |
| | పల్లకో | - | మాట్లాడకు |
| | నెయ్యిలు | - | పేలాలు |
| | చీనీ | - | పంచదార |
| | పెన(డ)క | - | ఇంటి పైభాగం |
| | కంప | - | కొబ్బరి చీపురు |
| | గొల్లి | - | అల్లరి |
| | గల్లా | - | కిరోసిన్ పంప్ |
| | తండాగా | - | తృప్తిగా |
| | అప్ప | - | అక్క |
| | నాగులు | - | చెవులకు పెట్టుకునే ఆభరణం |
| | వలం | - | లావు |
| | అరక | - | మంచం |
| | ఇందల | - | ఇందులో |
| | ఇకటం | - | పరాచికం |
| | ఇర్తి | - | వృత్తి |
| | ఎడ్లు | - | గొడ్లు / ఎద్దులు |
| | భోజీ | - | విందు భోజనం |
| | పలకర్ర | - | పళ్ళు తోముకొనే పుల్ల |
| | ఊజు | - | చేపలు పట్టుకొనే ఊత |

(7) పూర్వ మండలంలో ఒరియా పదాలు

పూర్వ మండల ప్రాంతం ఒరిస్సా రాష్ట్రానికి దగ్గరగా వుండడం వల్ల అనేక ఒరియా పదాలు ఈ ప్రాంతంలో చేరాయి.

ఉదా॥ కంబారి, బుగత, భోగట్టా మొదలైన పదాలు ఈ విధంగా చేరినవే.

**బి) మధ్య మండలం / కోస్తా ప్రాంతం**

తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలోని తెలుగు భాషను మధ్య మండలం భాషగా వ్యవహరిస్తారు.

ఉదా॥ వచ్చేడు, ఇచ్చేడు, కొట్టేడు, కాడి, ఏడికర్ర, మోట, తూము, నాగలి, కర్రు, పేడ, చక్రం, గోంగూర, కలుపు, దువ్వెన, పప్పులు, పునాది, పశువులు, బర్రె మొదలైన పదాలు ఈ మండలానికి చెందినవే.

ఈ ప్రాంతం తెలుగు దేశంలో సుభిక్ష ప్రాంతమే సస్యశ్యామల శోభితమై సిరిసంపదలతో వెలుగొందుతున్న కారణంగా ఈ మాండలిక భాష తెలుగు దేశంలో ప్రామాణిక భాషగా వెలుగొందుతుంది. ఈ మాండలిక భాషలోని పదాలు పద సంపుటాలు చలన చిత్రాల్లోనూ, టి.వి.ల్లోనూ, వార్తా పత్రికల్లోనూ, కథల్లోనూ, నవలల్లోనూ వుపయోగించబడుతున్నాయి. ఈ మండల భాషపై సంస్కృత భాషా ప్రభావం బాగా కన్పిస్తుంది. తెలుగులో తొలి అనువాదకవి అయిన నన్నయ ఈ ప్రాంతానికి చెందినవాడే. అంటే మహాభారతం మధ్య మండలం నుంచి వచ్చిందన్నమాట. ఇతర మాండలిక భాషా వ్యవహర్తల కంటే ఈ మండలంలోని భాషా వ్యవహర్తల వ్యవహారంలో సంస్కృత పదాల ప్రాచుర్యం ఎక్కువగా కన్పిస్తుంది.

(1) క్రియా రూపాలు

| ఉదా॥ మధ్య మండలం | | ఇతర మండలం |
|---|---|---|
| తిట్టేడు | - | తిట్టినాడు /తిట్టినవాడు |
| పోయేడు | - | పోయినాడు |
| కొట్టేడు | - | కొట్టినాడు |
| తెచ్చేడు | - | తెచ్చినాడు |
| చేసేడు | - | చేసినాడు |
| గెంతేడు | - | గెంతినవాడు / గెంతినాడు |

(2) బహువచన రూపాలు

| | | |
|---|---|---|
| రోకలి + లు | - | రోకండ్లు |
| పుండు + లు | - | పుండ్లు |
| బండి + లు | - | బండ్లు |
| తిరగలి + లు | - | తిరగండ్లు |

మొదలైన బహువచన రూపాలకు బదులుగా రోకళ్ళు, పుళ్ళు, బళ్ళు, తిరగళ్ళు అనే రూపాలు మధ్య మండలంలో కన్పిస్తాయి.

(3) అచ్చ తెలుగు పదాలు

తూర్పు మండలంలో బాల్చీ, బాల్టీ అని వాడుతుండగా మరికొన్ని మండలాల్లో బొక్కెన అని వ్యవహరిస్తుండగా, ఈ మధ్య మండలంలో 'చేద' అనే అచ్చ తెలుగు పదాన్ని వాడతారు.

**(సి) దక్షిణ మండలం / రాయలసీమ ప్రాంతం**

అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్ని దక్షిణ మండలంగా పిలుస్తారు. తెలుగుదేశంలోని దక్షిణ మండలాన్ని శ్రీకృష్ణ దేవరాయలు పరిపాలించిన కారణంగా 'రాయలసీమ' అని వ్యవహరిస్తారు.

రాయలసీమ ప్రాంతంలో 'మోట'ను 'కపిల' గా వ్యవహరిస్తారు. 'కాడి'ని కాడిమాను / కాడి'మానుగానూ, 'నాగలి' ని నాగేలి/మడక గాను, ఏడికర్రను నాగ/నగ గాను, సజ్జలను సద్దలు గాను, పప్పులను 'బేడ' లు గాను, గోంగూరను గోగాకు గానూ, పునాదిని గునాది / బునాదిగానూ, గొళ్ళేన్ని చిలుకు గానూ, గేదెను ఎనుముగానూ, పులిహోరును చిత్రాన్నంగాను వ్యవహరిస్తారు.

(1) బహువచన రూపాలు

ఈ మండలంలోని బహువచన రూపాలు ప్రామాణిక తెలుగు కంటే ప్రత్యేకమైన విశిష్టమైన లక్షణాలు కలిగివుంటాయి.

| ఉదా॥ ప్రామాణిక తెలుగు | | దక్షిణ మండలం |
|---|---|---|
| ఏరు + లు > ఏళ్ళు | - | ఏర్లు |
| ఊరు + లు > ఊళ్ళు | - | ఊర్లు |
| ఇల్లు + లు > ఇళ్ళు | - | ఇండ్లు |
| గోరు + లు > గోళ్ళు | - | గోర్లు |
| చెల్లెలు + లు > చెల్లెళ్ళు | - | చెల్లెండ్రు |

(2) సంఖ్యా వాచకాలు

| ఉదా॥ ప్రామాణిక తెలుగు | | | దక్షిణ మండలం |
|---|---|---|---|
| 1000 | వెయ్యి | - | వేయి / వెయ్యి |
| 500 | ఆయిదొందలు | - | ఐన్నూరు |
| 400 | నాలుగొందలు | - | నన్నూరు |
| 300 | మూడొందలు | - | మున్నూరు |
| 200 | రెండొందలు | - | ఇన్నూరు |

(3) దక్షిణ మండలంలో శ - స భేదం పాటించకుండా ఇంచుమించు సకారంగానే వ్యవహరిస్తారు.

| ఉదా॥ ప్రామాణిక తెలుగు | | దక్షిణ మండలం |
|---|---|---|
| శీతాకాలం | - | సీతాకాలం |
| శుక్రవారం | - | సుక్రవారం |
| శనివారం | - | సెనివారం |

(4) నూరు - 100.

మధ్య మాండలికంలో 'వంద' అని వ్యవహరిస్తుండగా ఈ దక్షిణ మండలంలో 'నూరు' అని వాడతారు.

(5) క్రియా రూపాలు

| ఉదా॥ | | |
|---|---|---|
| వెళ్ళినాడు | - | ఇచ్చినాడు |
| కట్టినాడు | - | చంపినాడు |
| నవ్వినాడు | - | చూసినాడు |
| తెచ్చినాడు | - | పోయినాడు |
| వచ్చినాడు | - | చేసినాడు |

(6) దక్షిణ మండలంలో

| వ్యతిరేక క్రియా రూపాలు | | అర్థం |
|---|---|---|
| ఉదా॥ లేకుండా వుండింది | - | లేదు |
| చెప్పబడితే | - | చెప్పాల్సిన అవసరం లేదు |
| చెప్పంది ఏమి లేదు | - | చెప్పకూడనిది ఏమి లేదు |
| లేకుండా పోతే | - | లేకపోతే |
| తినేది కాదు | - | తినడం కాదు |

(7) పద ప్రయోగాల్లో దక్షిణ మండలంలోని ప్రత్యేకత

| | | |
|---|---|---|
| ఉదా॥ పొద్దు | - | రోజు, దినం |
| విసురు రాయి / విసుర్రాయి | - | తిరగలి |
| జల్ల | - | అబద్ధం |
| సపారు | - | చిన్నగుడిసె |
| మారుముట్లు | - | పనిముట్లు |

(8) దక్షిణ మండలంలోని పదాలు ఇతర మండలం వ్యవహర్తలకు అర్థం కావు.

| ఉదా॥ దక్షిణ మండలంలోని పదాలు | | అర్థం |
|---|---|---|
| సాబాగా | - | సరిగా |
| కువ్వాడం | - | పక్షపాతం |
| యాసిరిక | - | చేజారు |
| శరాయింపు | - | విరక్తి |
| కద్యాయం | - | తప్పనిసరి |
| సంగ్యాలు | - | ఆచారాలు |
| ములాజ | - | సిఫార్సు |
| అల్లాడించు | - | బాగా తిను |

(9) నైసర్గికంగా ఈ ప్రాంతం సన్నిహితం కాబట్టి దక్షిణ మండలంపై తమిళ కన్నడ భాషా ప్రభావం బాగా కన్పిస్తుంది.

(అ) తమిళ పదాలు

సివిల్ కేసెస్ వచ్చి నేను చూస్తాను / తెలుగు

సివిల్ కేసెస్ నందు నాన్ సాప్పేన్ / తమిళం

(ఆ) <u>కన్నడ పదాలు</u>

| ఉదా॥ | కన్నడ పదం | దక్షిణ మండల భాష | అర్థం |
|---|---|---|---|
| | బేడ | బేడ | పప్పులు |
| | కెలస | కెలసనం | పని |
| | బీగం | బీగ | తాళం |
| | కంబర | కంబార | కమ్మర |
| | హోన్ | హోన్ను | బంగారం |
| | ఎంద్రకాయ | ఎంద్రకాయ | పీత |
| | ఈలకత్తి | ఈలకత్తి | కత్తిపీట |
| | ఉగ్గాణి | ఉగ్గాణి | పోపు |
| | హాళి | హాళి | క్రమం |

**డి) ఉత్తర మండలం / తెలంగాణా ప్రాంతం**

అదిలాబాదు, నిజామాబాదు, కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్, వరంగల్, ఖమ్మం, హైదరాబాదు, నల్గొండ జిల్లాల భాషను ఉత్తర మండలంగా పేర్కొంటారు. తెలంగాణా జిల్లాల్లోని తెలుగు భాష ఉర్దూ ప్రభావానికి లోనై ప్రత్యేక మాండలిక భాషగా రూపుదిద్దుకుంది. ఉదాహరణకు పెండ / పేడ, దుబ్బనేల / ఇసకనేల, పుంటికూర / గోంగూర.

(అ) క్రియా రూపాలు

ఉత్తర మండలంలోని క్రియా పదాలు ప్రామాణిక తెలుగు క్రియా పదాలు కంటే భిన్నంగా వుంటాయి.

| | ఉత్తర మండలంలోని క్రియా రూపాలు | | ప్రామాణిక తెలుగు క్రియా రూపాలు |
|---|---|---|---|
| ఉదా॥ | కట్టిండు | - | కట్టేడు |
| | వచ్చిండు | - | వచ్చేడు |
| | తెచ్చిండు | - | తెచ్చేడు |
| | ఇచ్చిండు | - | ఇచ్చేడు |

(ఆ) వర్తమానార్థక క్రియలు

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | వస్తాండు / వస్తండు | - | / వాడు / |
| | వస్తాన్న / వస్తన్న | - | / నేను / |
| | వస్తాన్నం / వస్తన్నం | - | / మేం / |
| | వస్తాన్నయ్ / వస్తన్నయ్ | - | / అవి / |

(ఇ) నామ విభక్తులు

ఉదా॥ అందు కొరకు

ఎక్కడ నుంచి

వాని దగ్గరకు

వండ్ల వరకైనా

(ఈ) తద్ధర్మ భవిష్యదర్థక క్రియాల్లోని రూప భేదాలు

| | | |
|---|---|---|
| ఉదా॥ వస్త | - | వస్తరు |
| వస్తడు | - | వస్తది |
| వస్తయ్ | - | వస్తన్ |

(ఉ) ఉత్తర మండలంలో అపదాది దీర్ఘాచ్చు చాలా వరకు హ్రస్వం అవుతుంది.

| | | |
|---|---|---|
| ఉదా॥ వస్తాడు | - | వస్తడు |
| చెప్తా | - | చెప్త |
| అంటారు | - | అంటరు |

(ఊ) ఉత్తరాంధ్ర జానపదుల భాష

| | | |
|---|---|---|
| ఉదా॥ వాన | - | ఆన |
| ప్రభుత్వం | - | పెబుత్వం |
| ఒకవేళ | - | ఒకేల |
| లక్షణం | - | లచ్చనం |
| ఇప్పుడు | - | యిప్పుడు |

(ఎ) <u>తెలంగాణా పదాలు</u> <u>ప్రామాణిక తెలుగు</u>

| | | |
|---|---|---|
| ఉదా॥ కాని | - | కాడి |
| తమిదె | - | చోడి |
| చిట్టి | - | చిలాస |
| గారె/గిర్త | - | చక్రం |
| సాలె | - | మేడి |
| పుంటికూర | - | గోంగూర |
| పెండ | - | పేడ |

(ఏ) ఉత్తర మండలంలో నిజాం నవాబుల పరిపాలన చాలాకాలం జరిగింది. ఆ కారణంగా ఉత్తర మండలంలో అనేక ఉర్దూ పదాలు చేరాయి.

ఉత్తర మండలంలో / తెలంగాణా ప్రాంతం / వాడుకలో వున్న ఉర్దూ పదాలు.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | సలామ్ | - | నమస్కారం |
| | షా | - | చక్రవర్తి |
| | కాఫీర్ | - | నాస్తికుడు |
| | అఫేసొస్ | - | విచారం |
| | గులామ్ | - | బానిస |
| | బేఫికర్ | - | నిశ్చింత |
| | ఆఫికు | - | నల్లమందు |
| | ఫౌజ్ | - | సేన |

ఈ విధంగా తెలుగు భాషలో నైసర్గిక రాజకీయ, సామాజికా విషయాల వల్ల ఏర్పడిన మాండలికాల స్వరూపం, భాషలో వైవిధ్యం తెలుస్తుంది.

**17.1.11 మాండలికాలు - భేదాలు**

ఒకే భాష అది వ్యవహరించబడే భౌగోళిక స్థితిగతుల్ని బట్టి, దాని వ్యవహరించే మనుష్యుల వివిధ స్థాయిల్ని బట్టి భిన్నత్వాన్ని సంతరించుకోగా, ఆ భిన్నత్వాన్ని పరిశీలించే శాస్త్రమై మాండలిక భాషా విజ్ఞానం. ఒక మండలం లోని భిన్న జనుల స్థాయి, స్త్రీ పురుషుల, వయస్కుల, పిల్లలు నేర్చుకునే ప్రారంభ దశ వారి భాష, వృత్తి, సంఘ పరమైన వ్యావహారిక పదాల్ని మాండలిక భాషా భేదాల్ని అధ్యయనం చేయడమే మాండలిక భాషా విజ్ఞాన లక్ష్యం.

తెలుగు భాషను మాతృభాషగా సుమారు ఎనిమిది కోట్ల మంది మాట్లాడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అన్ని ప్రాంతాల్లోనూ నేడు ప్రధానంగా మాట్లాడబడేది ఒక (తెలుగు) భాష అయినప్పటికీ ఇందులో ఏక రూపత లేదు. వ్యాకరణంలో వాక్యనిర్మాణంలో, పదాల్లో, పదాల అర్థాల్లో, ప్రత్యయాల్లో, ఉచ్చారణలో, ఒకటేమిటి అన్నింటిలోనూ అనేక భేదాలు కన్పిస్తున్నాయి. ఒక పదార్థాన్ని సూచించడానికి భిన్న మండలాల్లో వేర్వేరు మాటల్ని వుపయోగిస్తున్నారు. ఈ భిన్న పదాలు ఒకటి కంటే ఎక్కువగా వుండవచ్చు. భాషా వ్యవహర్తల్లోని భిన్న భిన్న వృత్తుల్ని బట్టి ప్రాంతీయ భేదాల్ని బట్టి స్త్రీ పురుష భేదాల్ని బట్టి, సంఘంలోని స్థాయిని బట్టి, చదువును బట్టి, సంస్కారాన్ని బట్టి, ప్రాంతీయ భేదాలు ఏర్పడి మాండలికాలు ఏర్పడతాయి.

మాండలికాలు - భేదాలు.

1) వివిధ ప్రాంతాల్లోని మాండలిక భేదాలు.
2) క్రియా రూపాల్లో మాండలిక భేదాలు.
3) భావార్థక "ట" ప్రత్యయం "డ" గా మారడం.
4) ఒకే భావాన్ని సూచించడానికి ప్రయోగించే భిన్న పద సముదాయాన్ని బట్టి కూడ మాండలికాల భేదాల్ని గుర్తించవచ్చు.

5) ఒకే శబ్దం ఉచ్చారణ భేదాల్లో వుండడం.

6) వ్యతిరేకార్థంలో మాండలిక భేదాలు.

7) సమానార్థకంలో వాడుతున్న పర్యాయపదాల వల్ల కూడా మాండలిక భేదాలు ఏర్పడతాయి.

8) పరిసర భాషా ప్రభావం వల్ల కూడా మాండలిక భేదాలు ఏర్పడతాయి.

1) వివిధ ప్రాంతాల్లోని మాండలిక భేదాలు.

| పూర్వ మండలం<br>కళింగ ప్రాంతం | దక్షిణ మండలం<br>రాయలసీమ ప్రాంతం | ఉత్తర మండలం<br>తెలంగాణా ప్రాంతం | మధ్య మండలం<br>ఇతర కోస్తా జిల్లాలు |
|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 |

(అ) <u>వ్యవసాయ పదాలు</u>

| | | | |
|---|---|---|---|
| లాంగలం | నాగలి | నాగేలి / మడక | నాగలి |
| నక్కు | కర్రు | కర్రు | కర్రు |
| మేడి | మేడితోక | సాలె | మేడి |
| మోట | కపిల | మోట | మోట |
| మదం | తూము | తూము | తూము |
| గాబు | కలుపు | కలుపు | కలుపు |
| సొమ్ములు | నగలు | పశువులు | నగలు / డబ్బు |
| పేడ | పేడ | పెండ | పేడ |

(ఆ) <u>చేనేత పదాలు</u>

| | | | |
|---|---|---|---|
| రాట్నం | రాట్నం / రాటకం | రాట్నం | రాట్నం |
| పోము | పోగు | పోగు | పోగు |

(ఇ) <u>ఇల్లుకు సంబంధించిన పదాలు</u>

| | | | |
|---|---|---|---|
| గొలుసు | చిలుకు | గొండ్లెం | గొళ్ళెం |
| చూరు | చూరు | చూరు | చూరు |
| ఎలుగు | కంచె | కంచె | కంచె / దడి |
| పునాది | గునాది / బునాది | పునాది / బునాది | పునాది |
| గునపం | గడ్డపార | గడ్డపార | గడ్డపార / గునపం, గడ్డపలుగు |

2) క్రియా పదాల్లో మాండలిక భేదాలు

| 1 | 2 | 3 | 4 |
|---|---|---|---|
| వచ్చేశాడు | వచ్చినాడు | వచ్చిండు | వచ్చేడు |
| చేసేశాడు | చేసినాడు | చేసిండు | చేసేడు |
| కట్టేశాడు | కట్టినాడు | కట్టిండు | కట్టేడు |

3) భావార్థక 'ట' ప్రత్యయం 'డ' గా మారడం.

భావార్థక 'ట' ప్రత్యయం గుంటూరు మండలంలో విన్పిస్తూవుండగ 'డ' గా మిగిలిన ఆంధ్ర ప్రాంతాల్లో పిలుస్తున్నారు. ఈ రకమైన భేదం చాలా స్పష్టంగా కనబడుతుంది.

| గుంటూరు మండలం | ఇతర ఆంధ్ర ప్రాంత మండలం |
|---|---|
| తినటం | తినడం |
| చూడటం | చూడడం |
| నడవటం | నడవడం |
| పోవటం | పోవడం |
| పాడటం | పాడడం |

4) ఒకే భావాన్ని సూచించడానికి ప్రయోగించే భిన్న పద సముదాయాన్ని బట్టి కూడా మాండలిక భేదాల్ని గుర్తించవచ్చు. భిన్న మాండలిక వారు ఒక సమానార్థకాన్ని తెలియజేయడానికి వేరు వేరు పదాలు వుపయోగిస్తారు.

ఉదా॥ అల్లుని తోలుకొని వస్తా (తెలంగాణా)
అల్లుని తీసుకుని వస్తా (ఇతర ఆంధ్ర ప్రాంతము)

5) ఒకే శబ్దంలో ఉచ్చారణ భేదాల్లో వుండడం.

ఉదా॥ (1) గుండి - బొత్తం - బొత్తాం - బొత్తాను - బొత్తాలు.
(2) దువ్వెన - పన్ని - పన్నం - పన్య - పైన.

6) వ్యతిరేకార్థంలో మాండలిక భేదాలు.

ఉదా॥ కట్టకు, చెప్పకు, తినకు, వినకు, రాకు.

| | | | |
|---|---|---|---|
| (1) కట్టకు | కట్టబాక | - | కట్టబాకు |
| | కట్టమాక | - | కట్టవాక |
| (2) చెప్పకు | చెప్పబాక | - | చెప్పబాకు |
| | చెప్పమాక | - | చెప్పవాక |

| | | | |
|---|---|---|---|
| (3) తినకు | తినబాక | - | తినబాకు |
| | తినమాకు | - | తినవాక |
| (4) వినకు | వినాక | - | వినాకు |
| | వినబొాక | - | వినబోకు |
| | వినబాక | - | వినబాకు |
| (5) రాకు | రాబాక | - | రాబాకు |
| | రామాక | - | రావాక |

7) సమానార్థకాల్లో వాడుతున్న పర్యాయపదాల వల్ల కూడా మాండలిక భేదాలు గుర్తించవచ్చు.

ఉదా॥ దేవాలయం - కోవెల - గుడి - మందిరము.

పాదరక్షలు - చెప్పులు - జోళ్ళు - పాలకోళ్ళు.

8) పరిసర భాషా ప్రభావం వల్ల కూడా మాండలిక భేదాలున్నాయి.

ప్రతిభాషపైన పరిసర భాషా ప్రభావం స్పష్టంగా కనబడుతుంది. ఇందులో ఏ భాషకు మినహాయింపు లేదు. ఆంధ్ర ప్రదేశ్ సరిహద్దుల్లో ఐదు రాష్ట్రాలున్నాయి. దక్షిణాదిన తమిళనాడు, పడమర కర్ణాటక, ఉత్తరాదిన మహారాష్ట్ర మధ్యప్రదేశ్ ఒరిస్సా రాష్ట్రాలున్నాయి. తెలుగు భాషకు మాండలికాలు - భేదాలు.

1) వివిధ ప్రాంతాల్లోని మాండలిక భేదాలు.
2) క్రియా రూపాల్లో మాండలిక భేదాలు.
3) భావార్థక "ట" ప్రత్యయం "డ" గా మారడం.
4) ఒకే భావాన్ని సూచించడానికి ప్రయోగించే భిన్న పద సముదాయాన్ని బట్టి కూడ మాండలికాల భేదాల్ని గుర్తించవచ్చు.
5) ఒకే శబ్దం ఉచ్చారణ భేదాల్లో వుండడం.
6) వ్యతిరేకార్థంలో మాండలిక భేదాలు.
7) సమానార్థకంలో వాడుతున్న పర్యాయపదాల వల్ల కూడా మాండలిక భేదాలు ఏర్పడతాయి.
8) పరిసర భాషా ప్రభావం వల్ల కూడా మాండలిక భేదాలు ఏర్పడతాయి.

### 17.1.12 మాండలికాలు - వర్గీకరణ

ఒక ప్రాంతాన్ని సమగ్రంగా నిశితంగా పరిశీలించాలంటే ఆ ప్రాంత భౌగోళిక, చారిత్రకు, సాంఘీక భాషా మాండలిక విషయాల్ని తెలుసుకోవాలి. మాండలికాల్ని ప్రాంతీయ, సామాజిక, చారిత్రక, జీవశాస్త్రానుసారాలు (వయో, లింగ, భేద) అనే నాలుగు విధాలుగా వర్గీకరించవచ్చు.

1) ప్రాంతీయ మాండలికం (Regional Dialect)

ప్రజల మధ్య వ్యవహార ప్రాబల్యం సన్నగిల్లడం వల్ల ప్రాంతీయ మాండలికాలు ఏర్పడతాయి. వీటినే స్థల మాండలికాలు

అని కూడా అంటారు. వ్యక్తులు పుట్టి పెరిగిన ప్రాంతాల ఆధారంగా ఏర్పడిన మాండలికాలు స్థల మాండలికాలు. ఈ స్థల మాండలికాలు భౌగోళిక కారణాల వల్ల ఏర్పడతాయి. రాజకీయ, సాంస్కృతిక, వాణిజ్యాది రంగాల్లో ఏర్పడిన కొన్ని పదాలు రవాణా సౌకర్యాల వల్ల నగరాలకు, గ్రామాలకు చేరుతాయి. ప్రకృతి సహజ సిద్ధమైన పర్వతాలు, నదులు వంటి అవరోధాలున్న ప్రాంతాలకు రాకపోకలు లేకపోవడం వల్ల ఆ ప్రాంతాల్లో కొత్త పదాలు చేరే అవకాశం లేదు. అలాంటి ప్రాంతాల్లో ప్రాచీన కాలంలోని పదాలే వుంటాయి. అంటే సర్వ సాధారణమైన సామాజిక భాష కంటే భిన్నమైన భాష వుంటుందన్న మాట. ఇలాంటి వాటినే స్థల మాండలికాలంటారు.

| పూర్వ మాండలికం<br>కళింగ ప్రాంతము | దక్షిణ మాండలికం<br>రాయలసీమ ప్రాంతం | ఉత్తర మాండలికం<br>తెలంగాణ ప్రాంతం | మధ్య మాండలికం<br>ఇతర కోస్తాలు ప్రాంతం |
|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 |
| చోడి | రాగి | తమిదె | తమిదె |
| గంటి | సజ్జ / సొద్ద | సజ్జ | సజ్జ |
| ఆనపకాయ | సొరకాయ | ఆనెగెరకాయ | సొరకాయ |
| | అనబకాయ | | అనకపాక |
| జనపకూర | -- | పుంటుకూర | -- |

2) సామాజిక మాండలికం (Social Dialects)

సాంఘికంగా ప్రతిబింబించే భాషా భేదాల్ని సాంఘిక భేదాలు అంటారు. సాంఘికంగా ఏర్పడిన ఈ భాషా భేదాల్ని సాంఘిక వ్యవహార భేదాలు అంటారు. ఈ సాంఘిక వ్యవహార భేదాలనే సాంఘిక మాండలికాలు అని వ్యవహరిస్తారు. సాంఘిక మాండలికం అని కూడ దీన్ని అంటారు. వ్యక్తుల సముదాయమే సంఘం. సాంఘికంగా ప్రతిబింబించే సామాజిక వ్యవహార భేదాలనే సామాజిక మాండలికాలుగా పిలుస్తారు. జీవద్భాషకు మార్పు సహజం. ఈ మార్పు కారణంగా బహురూపత వైవిధ్యం ఏర్పడుతాయి. సాంఘిక మాండలికాల్లో, సామాజిక వ్యవస్థలో వున్న ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరమైన మార్పులు వ్యవహారపు మాటల్లో ప్రతిఫలిస్తాయి. భాషా వ్యవహారాల్ని చక్కగా పరిశీలిస్తే వ్యవహర్తల సాంఘిక హోదాని నిర్ధారించవచ్చు. ఈ సామాజిక మాండలికం మూడు విధాలుగా విభజించవచ్చు.

ఎ) వర్గమాండలికం (Class Dialects)

ఒక వర్గానికి సంబంధించిన వ్యవహారాల్లో ఈ మాండలికాలు వుంటాయి. ఇవి మరల నాలుగు రకాలు.

(అ) ఆదాయాన్ని బట్టి మాండలికం.

(ఆ) విద్యను బట్టి మాండలికం.

(ఇ) నిరక్షరాస్య మాండలికం.

(ఈ) వృత్తిని బట్టి మాండలికం.

(అ) ఆదాయాన్ని బట్టి మాండలికం.

ఆదాయాన్ని బట్టి మాండలికాలు రెండు రకాలు.

(ఎ.ఎ) అధికారాన్ని బట్టి మాండలికం.

(బి.బి) అల్పాదాయాన్ని బట్టి మాండలికం.

(ఎ.ఎ) అధికారాన్ని బట్టి మాండలికం.

దీనికి సంబంధించి అధికార భాషను ఎక్కువగా వాడుతారు. సమాజంలో నాగరికులుగా చలామణి అవుతారు. పరిభాషలో ఆంగ్ల పదాలు విరివిగా చోటు చేసుకుంటున్నాయి.

ఉదా॥ పార్టీ, లంచ్, డిన్నర్, కిచిన్, మటన్, కర్రీ, మీల్సు.

(బి.బి) అల్పాదాయాన్ని బట్టి మాండలికం.

సాధారణంగా చిన్న రైతులు, కూలీలు, రిక్షాతొక్కేవాళ్ళు ఈ మాండలికాన్ని వాడతారు.

| | | |
|---|---|---|
| సందమామ | - | చందమామ |
| రిచ్చా | - | రిక్షా |
| లచ్చ | - | లక్ష |
| బిచ్చం | - | భిక్షం |
| కోక | - | చీర |
| బువ్వ | - | భోజనం |

(ఆ) విద్యను బట్టి మాండలికం

ఈ మాండలికాలు రెండు రకాలు.

(ఎ.ఎ) విద్యాధికుల మాండలికం, (బి.బి) విద్యార్థుల మాండలికం.

(ఎ.ఎ) విద్యాధికుల మాండలికం.

ఉన్నత విద్యను అభ్యసించిన తరువాత చాలామందిలో భాష మారుతుంది.

ఉదా॥ అమూల్యం, శిఖరాగ్రం, ఓ.కే. అచ్చా, హృదయం, ఉన్నతం.

(బి.బి) విద్యార్థుల మాండలికం.

విద్యార్థులు తమ తోటి విద్యార్థులతో మాట్లాడినప్పుడు ప్రత్యేకమైన కొన్ని మాటల్ని వుపయోగిస్తారు.

ఉదా॥ అంత సీన్లేదు, కాకా, బట్టి, బోర్, ఐరన్‌లెగ్.

(ఇ) <u>నిరక్షరాసత్యను బట్టి మాండలికం.</u>

| | | |
|---|---|---|
| పిజ్జీ | - | ఫీజ్ |
| కూటరు | - | స్కూటర్ |
| ఇసక | - | ఇసుక |
| డూటి | - | డ్యూటి |
| ఇస్కూలు | - | స్కూల్ |

(ఈ) <u>వృత్తిని బట్టి మాండలికం.</u>

కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, వ్యవసాయం మొదలైన వారు వృత్తికి సంబంధించిన అనేక పదాల్ని వాడుతారు.

అ. వ్యవసాయం వృత్తిగాగల వాళ్ళ మాండలికం.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | మెట్ట | - | మెట్టపొలం |
| | తొలిగాబు | - | తొలి కలుపు |
| | గుత్త | - | భూస్వామికి డబ్బుకానీ, పంటకానీ ఇంత ఇచ్చేటట్లు అని ముందుగా చేసుకొనే ఒప్పందం. |

ఆ. కమ్మరం, వడ్రంగి వృత్తిగా గలవాళ్ళు కొయ్యబండిలో వాడిన వివిధ భాగాల్ని వివిధ మాండలికంగా మాటలతో పిలుస్తారు.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | ఆకులు | - | బండి చక్రానికి బద్దల్లా వున్న కొయ్యల్ని "ఆకులు" అంటారు. |
| | కుండ | - | బండి చక్రం మధ్యలో గుండ్రంగా వుండి ఆకులు అమరివుండే గుండ్రని కొయ్యను 'కుండ' అని అంటారు. |

బి) కుల / వర్ణ మాండలికం (Caste Dialect)

వ్యక్తులు పుట్టి పెరిగిన కులాలు ఆధారంగా ఏర్పడిన మాండలికాలు కుల మాండలికాలు. మానవుడు సంఘజీవి. సంఘాన్ని విడిచిపెట్టి మానవుడు తన జీవితాన్ని కొనసాగించలేడు. వీలుపడదు కూడా. నేడు మన సమాజంలో అనేక కులాల వారు, వృత్తుల వారు నివసిస్తున్నారు. ఒక్కొక్క కులానికీ, ఒక్కొక్క వృత్తికీ తనకంటూ ఒక ప్రత్యేకమైన జీవన సరళి వుంటుంది. అందువల్ల వాళ్ళ మాటలాడేటప్పుడు ఇతర కులాల వారు వాడిని ప్రత్యేకమైన మాండలికాలు వాడతారు. ఆ మాండలిక పదాలు ఇతర వర్గాల వారికి అర్థం కావు కూడా.

భారత దేశంలో కుల వ్యవస్థ వుండడం వల్ల కుల మాండలికాలు చోటు చేసుకున్నాయి. ప్రపంచంలో ఏ భాషలో కూడా కుల మాండలికాలు లేవు. ఒక్క భారతదేశంలో తప్ప. అయితే ఉత్తర భారతదేశంలో మాండలికాల విభజన వేరు. దక్షిణ భారతదేశంలో మాండలికాల విభజన వేరు. ఉత్తర భారతదేశంలో అగ్రవర్ణాల మాండలికం, దళితజన మాండలికం అనే రెండు మాండలికాలు వున్నాయి. దక్షిణ భారతదేశంలో బ్రాహ్మణ, బ్రాహ్మణేతర, దళితజన అనే మూడు మాండలికాలు చాలా స్పష్టంగా కన్పిస్తున్నాయి.

ఒకే ప్రాంతానికి చెందిన వ్యక్తుల వ్యవహారంలో కుల వృత్తులకు సంబంధించిన భేదాలు ఉచ్చారణలోనూ, పద ప్రయోగాల్లోనూ కన్పిస్తాయి. మన దేశంలో అనేక కుల, మత, వర్గ భేదాలున్నాయి. తెలుగుదేశంలో విభిన్న కులాల, వర్గాల వారి వల్ల కొన్ని ఆచారాలు కట్టుబాట్లు అవాంతర భేదాలతో ఆయా కుల వర్గాల వారి వ్యవహారంలో భిన్నత్వం ఏర్పడింది. ఇలా ఏర్పడే వాటిని మాండలికాలంటారు. భిన్న కులాల్లో పుట్టిన వారు భిన్న రీతులలో మాట్లాడతారు. కొన్ని కులాలు వారు మాట్లాడితే ఇతర కులాల వారికి అర్థం కాదు. బ్రాహ్మణుల భాషా వ్యవహారానికీ చాలా భేదాలు కన్పిస్తాయి.

వైదిక బ్రాహ్మణులు 'వయందేవస్య' ఎక్కడ? అంటే మిగిలిన కులాల వారికి తెలియదు. 'వయందేవస్య' పదానికి భోజనం అని అర్థం. ఇంకో బ్రాహ్మణునికి (పురోహితులు) మాత్రమే ఈ అర్థం గోచరిస్తుంది. ఇది కేవలం సాంకేతికమైన భాష.

ఇరువురు వైదిక బ్రాహ్మణుల సంభాషణ ఇలా వుంటుంది.

"వయందేవస్య" ఎక్కడ?

"దేవావై" లో

"తేజోవా" ఏమన్నా వుంటుందా?

"ప్రక్రాంతం" కదూ? తప్పకుండా వుంటుంది.

పై సంభాషణలోని నాలుగు వాక్యాల్లో నాలుగు సాంకేతిక శబ్దాలు చోటు చేసుకున్నాయి. "వయందేవస్య భోజనమ్" అని శ్రుతి. "దేనానాసత్రమానత" అని నిగమం. "తేజోవా ఆజ్యం" అని సంహిత. "ప్రక్రాన్తమ్ శ్రాద్ధకర్మ కరిష్యే" అని తద్దిన మంత్రం. ఈ నాలుగు వాక్యాలు సాధారణంగా జన వ్యవహారంలో ఈ రీతిగా వుంటాయి.

"భోజనమెక్కడ"

"సత్రంలో"

"నెయ్యి ఏమన్నా వుంటుందా?"

శ్రాద్ధకర్మ (తద్దినం) కదా! తప్పనిసరిగా నెయ్యి వుంటుంది.

బ్రాహ్మణుల తిట్లలో ఇతర కులాల తిట్లలో గల భేదాలు చాలా స్పష్టంగా కన్పిస్తాయి. బ్రాహ్మణులు అప్రాచ్యపు వెధవ, త్రాష్టుడా, శుంఠ లాంటి పదాలు వాడతారు. ఇదే విధంగా కమ్మరి, వడ్రంగి, బెస్త, చర్మకారులు, స్వర్ణకారులు మొదలైన వృత్తిపని వాళ్ళు భాషలో చాలా ప్రత్యేకతలు కన్పిస్తాయి.

తెలుగు భాషలోని కుల మాండలికాల్ని మూడు రకాలుగా విభజించవచ్చు.

(అ) బ్రాహ్మణ మాండలికం.

(ఆ) బ్రాహ్మణేతర మాండలికం.

(ఇ) దళితజన మాండలికం.

(అ) బ్రాహ్మణ మాండలికం

మన సమాజంలో కొన్ని వేల సంవత్సరాల నుంచి బ్రాహ్మణులు అగ్రవర్ణాలుగా పిలువబడ్డారు. అందువల్లే వారి మాండలికాలు తక్కిన వారికన్నా భిన్నంగా వుంటాయి.

ఉదా॥ ఉదయం, తీర్థం, తద్దినం, దద్దోజనం, పులిహోర, ఈ రోజు మడి, జంధ్యం, పోపు, ఇంటి వద్ద / దగ్గర.

(ఆ) <u>బ్రాహ్మణేతర మాండలికం</u>

బ్రాహ్మణులు కానివారు‹ బ్రాహ్మణేతరులు. వీరి మాండలికాల్లో అబ్రాహ్మణ మాండలికాలు వుంటాయి.

| | | |
|---|---|---|
| ఉదా॥ ఇంటికాడ | - | ఉడుకునీళ్ళు |
| ఇయ్యాల | - | పొద్దున |
| తాలింపు | - | పచ్చడి |

(ఇ) <u>దళితజన మాండలికం</u>

దళిత జనులు మాట్లాడే భాషలో అనేక మాండలికాలు వున్నాయి.

ఉదా॥ కౌసు (మాంసం)

కూర (అంటే మాంసం అని అర్థం)

ఎకసెకం (ఎగతాళి)

ఆరె (చెప్పులు కుట్టే సాధనం)

యాశకాలు (వేషాలు)

ఆసికం (హాస్యం)

సి) <u>వైయక్తిక మాండలికం (Individual Dialect)</u>

కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఒక వ్యక్తి భాష మిగిలిన వ్యక్తులు భాష కన్నా వేరుగా వుంటుంది. ఒక్కొక్క వ్యక్తికి వుండే ప్రత్యేకమైన భాషని లేదా మాండలికాల్ని వైయక్తిక మాండలికాలంటారు. అంతే కాక పిల్లలతో, వైద్యులతో, అధికారులతో, అనధికారులతో, మిత్రులతో, స్త్రీలతో, నౌకర్లతో భిన్న విధాలుగా మాట్లాడుతారు. దీనికి మూల కారణం ఆ వ్యక్తి నివసిస్తున్న సాంఘిక పరిస్థితులు అన్న విషయం మనం మరచిపోకూడదు. అవన్నీ ఆ వ్యక్తి యొక్క విభిన్న మాండలికాలుగా గుర్తించవచ్చు. సంతోషం, కోపం, ఆశ్చర్యం మున్నగు సందర్భాల్లో వైవిధ్యాన్ని బట్టి వ్యక్తుల వయో, లింగ, గౌరవ ప్రతిష్ఠాది స్థాయిని బట్టి, వైయక్తిక మాండలికాలు ఏర్పడతాయి.

వైయక్తిక మాండలికాలు పుట్టుకకు అనేక కారణాలు కన్పిస్తున్నాయి.

- వ్యక్తిగత ఉచ్చారణ లోపం.
- భిన్న ప్రాంతాల్లో భిన్న భాషలతో సంవర్గం కలిగి వుండడం లేదా భిన్న భాషా లక్షణాలున్న స్వీయ భాషా వ్యవహర్తలతో సంపర్కం కలిగివుండటం.
- ఒక వ్యక్తి అన్య భాషా ప్రాంతాల్లో దీర్ఘ కాలం వుండి తిరిగి మాతృ భాషా ప్రాంతానికి రావటం.
- వ్యక్తి జీవన స్రవంతికి కలిగే మార్పు.

వైయక్తిక మాండలికాలు కూడా స్థిరంగా వుండవు.

ఉదా॥ పిల్లల్ని పిల్చే సందర్భంలో -
ఒరే చిన్నా, భోజనానికి రా.

నయాన చెప్పే సందర్భంలో -
కాలం వృథా చేయక చదువుకో మంచి మార్కులొస్తాయి.

పెద్దల్ని పిల్చే సందర్భంలో -
నాన్న గారు భోజనానికి రండి.

ఈ విధంగా వ్యక్తుల స్థాయిని బట్టి, సందర్భాన్ని బట్టి, ప్రతి మనిషి మాట్లాడే వైయక్తిక భాషలో మాండలికాలు వుంటాయి.

## 17.2 ప్రామాణిక భాష

### 17.2.1 ప్రామాణిక భాష

మనము ఇంతకు పూర్వము గ్రాంథిక, వ్యావహారిక భాషల గురించి తెలుసుకొనేటప్పుడే ప్రామాణిక భాషను గూర్చి కొంత తెలిసికొన్నాము. ఆధునిక వచన రచనల్లోను, సినిమా, రేడియో, దూరదర్శిని భాషావ్యవహార సాధనాలతోను వాడే తెలుగులో చాలా వరకు ఏక రూపకత కనిపిస్తుంది. ఈ భాష మధ్యాంధ్రలోని విద్యావంతుల వ్యవహారం ఆధారంగా ఏర్పడ్డది. గడిచిన 30, 40, 50 ఏండ్ల నుండి రచనలు అన్నీ ఈ మాండలికములోనే జరగటం వల్ల రచయితలు ఎక్కువగా ఈ ప్రాంతాల వారు కావటం వల్ల ఇదే రాష్ట్రమంతటికి ఆధునిక ప్రామాణిక భాషగా చలామణి అవుతున్నది. ఇతర మాండలిక ప్రయోగాలు ఈ ప్రామాణిక భాషతో కలసి విస్తృతి అవుతున్నది. ప్రామాణిక భాష సాధారణంగా రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక ప్రాధాన్యత కల్గిన రాజధాని నగరాలల్లో నివసించే విద్యావంతులపై ఆధారపడి ఉంటుంది. తెలుగుదేశ చరిత్రలో రాజధాని నగరము ఒక్కటిగా లేదు. విజయనగరం, అర్ధంకి, నెల్లూరు, రాజమహేంద్రవరం, వరంగల్లు, చంద్రగిరి మొదలైనవి. వేరు వేరు కాలంలో రాజధాని నగరాలుగా ఉన్నాయి. కాని ఇతర దేశాలలో పారిస్, లండన్, రోమ్ నగరాలు కొన్ని శతాబ్దాలు పాటు రాజధాని నగరాలుగా ఉండడం వలన అక్కడ ఇన్ని భాషా భేదాలు కన్పించవు. తెలుగునాట అలాంటి పట్టణం ఒక్కటి కూడా లేదు. అందువల్ల భాగ్యవంతమైన కృష్ణా, గోదావరి పరిసర మధ్య మండలము విద్యకి, ధనానికి, సంస్కృతికి విద్యావంతులకు ఆటపట్టయింది. ఈ కారణంగా నేటి ప్రామాణిక భాష అక్కడ రచయితల నుంచి వ్యాపించింది.

### 17.2.2 ప్రామాణిక భాష - లక్షణాలు - ప్రయోజనాలు

1) ప్రామాణిక భాష ఎక్కువ మంది ప్రజలకు సమ్మతంగా వుంటుంది.

2) ప్రామాణిక భాషలోనే విద్యాబోధన జరుగుతుంది.

3) ప్రామాణిక భాషలో విద్య నేర్చుకోవడం వల్ల విద్యావంతులు అనిపించుకుంటారు.

4) మాండలికాలకంటే ప్రామాణిక భాషా ప్రయోగానికి ఎక్కువ వ్యాప్తి వుంటుంది.

5) రేడియోలు, దూరదర్శన్, సినిమా, వార్తా పత్రికలు, వచన రచనలు, ఉపన్యాసాలు మొదలైన వైజ్ఞానిక సాధనాలన్నింటిలోనూ ప్రామాణిక భాషనే వాడుతారు.

6) కొన్ని భాషల్లో ప్రాచీన కావ్య భాషే ప్రామాణిక భాషగా చలామణిలో వుంది. ఇలాంటప్పుడు మాండలికాల ప్రభావం ప్రామాణిక భాషపై పడదు.

ఉదా॥ అరబిక్, తమిళం.

7) ప్రామాణిక భాష, సాంస్కృతిక వైజ్ఞానిక ఐకమత్యానికి ఎంతగానో తోడ్పడుతుంది.

### 17.2.3 భాషా ప్రామాణీకరణం

ప్రామాణీకరణ భాషపై మన దృక్పథం ఈ క్రింది విధంగా వుంటే మంచిదని ప్రముఖ భాషావేత్త ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు తన అభిప్రాయాన్ని ఇలా వివిరంగా వివరించారు.

(ఎ) భిన్న భిన్న ప్రాంతాల్లో భిన్న భిన్న ఉచ్చారణ వున్నప్పటికీ అవగాహణ క్షమత వున్నంత వరకు అలాంటి ఉచ్చారణ వైవిధ్యాన్ని మనం తీసుకోవచ్చు.

| ఉదా॥ | రాత | | ఉచ్చారణ |
|---|---|---|---|
| | పద్యం | పజ్జెం | పద్దెం |
| | సత్యం | సత్తెం | సచ్చెం |

ప్రామాణిక భాషలో కూడ బంధువర్గాన్ని, నిత్యవసర వస్తువుల్ని సూచించే పదజాలంలో అనేక భేదాలు కన్పిస్తున్నాయి. ఇలాంటి వాటిని ప్రాంతీయ భేదాలుగా మనం గ్రహించవచ్చు.

(బి) సాంకేతిక, సాంస్కృతిక పదాల రూపకల్పనలో "ఎరువు" పదాల్ని తీసుకోవడంతో పాటు అందుబాటులో వున్న అన్ని మార్గాల్ని మనం అన్వేషించాలి.

(సి) ప్రామాణిక భాష ప్రజలందరికి అందుబాటులో వుండదు. ఇలాంటి సందర్భాల్లో ప్రామాణిక గ్రంథాల్ని ఆయా ప్రాంతీయ భాషల్లో ప్రకటించడం అవసరం. వెనుకబడిన వారికి అందుబాటులో లేని భాషలో విద్య నేర్పటంకంటే డబ్బును వినియోగించి వారికి అందుబాటులో వున్న వారి భాషలోనే, విద్య నేర్పించడం అన్ని విధాల ఉత్తమమైన పద్ధతి.

(డి) ప్రాంతీయ భాషా పదాల్ని సాధ్యమైనంత వరకు క్రమ పద్ధతిలో తీసుకోవడం వల్ల భాష సమృద్ధియై ప్రామాణికత దృఢపడుతుంది. ఉదాహరణకు సంస్కృతం, లాటిన్ భాషలు ప్రాంతీయ భాషల్ని స్వీకరించక పోవడం వల్ల వ్యవహారానికి దూరమయ్యాయి. ఎప్పటి కప్పుడు ప్రాంతీయ భాషా పదాల్ని గ్రహించిన భాషలు ఎప్పుడూ ప్రజల్లో వుంటాయి.

### 17.2.4 భాషా ప్రామాణీకరణం - పరిశోధనా పద్ధతులు

భాషా ప్రామాణికరణ పరిశోధనకై సుప్రసిద్ధ భాషా శాస్త్రజ్ఞులు ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు ఐదు సూత్రాల్ని ప్రతిపాదించారు. అవి ఇవి.

(ఎ) కృష్ణా, గోదావరి, డెల్టా ప్రాంత వాసులు ఎక్కువ సంఖ్యలో ఆధునిక రచయతలుగా తయారయ్యారు. వీరు తెలుగు భాష ప్రామాణీకరణకు ఎంతగానో దోహదపడుతున్నారు. 20వ శతాబ్దంలో తెలుగు, బెంగాలీలు ప్రాచీన గ్రాంధిక భాషల్ని విడిచిపెట్టి వ్యావహారిక భాషను విస్తారంగా వాడుతున్నారు. ఈ పరిణామం రావడానికి కారకులు మధ్య తరగతికి చెందిన విద్యావంతులు.

(బి) వార్తా ప్రసార సాధనాల ప్రభావానికి లోనైన ప్రజల ప్రామాణిక భాషను నవలలు, కవితలు, నాటకాలు మొదలైన సృజనాత్మక రచనల్ని, శాస్త్రీయ రచనల్ని, వచన రచనల్ని పరిశీలించాలి.

(సి) భాషను ఆధునికీరణం చేసే పద్ధతుల్ని దాని ప్రభావాన్ని విశ్లేషణాత్మక దృష్టితో తులనాత్మకంగా అధ్యయనం చేయాలి.

కళాశాల పాఠ్య పుస్తకాల ఉత్పత్తిని ఏ విధంగా జాతీయ రాష్ట్ర సంస్థలు తెస్తున్నాయో, అదే విధంగా వాటి భాషా ప్రణాళికా పరిణామాల్ని పరిశీలించాలి.

ఆంగ్ల భాషా ప్రయోగోపయోగాలతో పోల్చి మన అధ్యయన సరళి ఏ విధంగా వుందో నిర్ధారించుకోవాలి.

(డి) ఒక రకమైన భాషా సంఘంలో ఎక్కువ మంది చేత అంగీకరించబడినంత మాత్రం చేత దాన్నే అంగీకరించ వలసిన పనిలేదు. వార్తా పత్రికలు, మాస పత్రికలు, దిన పత్రికలు, రేడియో, టి.వీ. లు ఏ విధమైన భాషను ఉపయోగిస్తున్నాయో, పరిశీలించి నిర్ధారించుకోవాలి. ఈ విధమైన సర్వే ఇప్పుడిప్పుడే చేస్తున్నారు.

(ఇ) రాజకీయ శక్తిని గూర్చి, వార్తా పత్రికలు, నవలలు, వ్యాసాల భాషా ప్రభావాల్ని గూర్చి కూడా అంచనా వేసుకోవాలి. కృతకమైన శబ్ద రూపాలు తయారు కాకుండా చాలా జాగ్రత్తగా చూసుకోవాలి.

భాషా ప్రామాణీకరణ కోసం పరిశోధనలో పాటించవలసిన విషయాల్ని వివరంగా వివేచనతో వివరించారు కృష్ణమూర్తి గారు.

### 17.2.5 భాషా ప్రామాణీకరణం - టీనర్

1968లో టీనర్ దేశ భాషల అభివృద్ధికి ఆరు పద్ధతుల్ని చెప్పారు. ఈ ఆరు పద్ధతుల వల్ల భాషా ప్రామాణీకరణంలోని అనేక సమస్యల్ని మనం పరిష్కరించవచ్చు. అంతే కాక పద్ధతులు భాషల ఆధునీకరణకు కూడా ఎంతగానో వుపయోగపడతాయి.

(ఎ) భాషలో వుపయోగంలో వున్న 'ఎరువు' మాటలతో పాటు దేశీయ భావాల్ని ప్రకటించే, నూతన భావాల్ని ఆవిష్కరించే అన్ని పదాల్ని వుపయోగించాలి. భాషలో వున్న పదాలకు కొత్త భావాల్ని కలిగించి ప్రయోగించుకోవాలి.

(బి) దేశీయ పదాలు జనవ్యవహారంలో బాగా వ్యాప్తిలో వుంటాయి. ఆ పదాల భావాల్ని చెప్పే సందర్భంలో ఏ పదాల్ని సృష్టించకూడదు. ఒక పదం భాషా వ్యవహారంలో వుంటే ఆ పదాన్ని అందరూ వాడేటట్లు విస్తృత ప్రచారం చేయాలి. దేశీయ పదాల ప్రాధాన్యం తగ్గించకుండా అన్యదేశ్య పదాలు జనవ్యవహారంలో వున్నప్పుడు ఆ పదాలకు స్వభాషలో స్థానం కల్పించాలి.

(సి) ఒక భాషలో ఒక పదానికి ప్రవేశం కల్పించేటప్పుడు తప్పని సరిగా ప్రయోజనం వుండాలి.

(డి) ఒక భాషలోనికి 'ఎరువు' పదాలు తెచ్చేటప్పుడు గ్రీకు, లాటిన్, ఆంగ్ల మొదలైన భాషల నుంచి పుట్టిన పదాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వాలి.

(ఇ) స్వీయ భాషా గత ధ్వనులకు వ్యాకరణ సూత్రాలకు అనగుణంగా పరభాషా పదాల్ని మార్చుకుని ప్రయోగించాలి.

(యఫ్) నూతన పదాల్ని ప్రవేశపెట్టి వాటిని ప్రజల్లో విస్తృతమైన ప్రచారం చేసి ఆ పదాల్ని ప్రజలు ఏ విధంగా స్వీకరిస్తున్నారో జాగ్రత్తగా గమనించాలి. అంతేకాక ఆ పదాల్ని సంభాషణల్లో, ఉపన్యాసాల్లో, తరగతి గదుల్లో ప్రయోగించి ఆ పదాలకు వచ్చిన స్పందనను తెలుసుకోవాలి. ఇలా జరిగిన తర్వాతే నూతన పదాల్ని ప్రకటించాలి.

టీనర్ చెప్పిన పై పద్ధతులు ప్రపంచంలో అన్ని భాషలకు వర్తిస్తాయి.

### 17.2.6 ప్రామాణిక భాష - ప్రాంతీయ భేదాలు

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవహరించే ప్రామాణిక భాషలోనూ కొన్ని ప్రాంతీయ భేదాలు చోటుచేసుకున్నాయి.

(ఎ) రచయితలు, కవులు ఎంతగా ప్రామాణిక భాషలో రాసినా తమ ప్రాంతీయ పదాల అలవాటు కొద్దీ లేదా అభిమానం కొద్దీ కొన్ని ప్రాంతీయ పదాలు చేరుతుంటాయి. లేదా అనుకోకుండా సహజంగా వచ్చి చేరుతాయి.

ఉదా॥ అలా, అట్లా, అట్టా.

(బి) తెలంగాణా ప్రాంతం వారు "వచ్చిండ్రు", "చెప్పిన్రి" అని వ్యవహరిస్తారు. అయితే రచనల్లోనూ, ఉపన్యాసాల్లోనూ, "వచ్చినాడు", "చెప్పండి" అనే ప్రామాణిక భాషను వుపయోగిస్తారు.

(సి) ఉభయ గోదావరి జిల్లాల్లో శిష్టులు "వస్తూ" "పోతూ" అనే పదాల్ని వుపయోగిస్తారు. రాయలసీమ ప్రాంత రచయితలు కూడా శిష్ట వ్యవహార భాషను వాడుతున్నారు.

### 17.2.7 శిష్ట భాష - ప్రామాణిక భాష

సంస్కారవంతులు మాటలాడే భాష శిష్ట భాష. అదే ప్రామాణిక భాష. ఈ ప్రామాణిక భాష కూడా అన్ని కాలాల్లో ఒకే విధంగా వుంటుందని మనం చెప్పలేము. చెప్పడం తప్పుకూడా. భాషకు మార్పు సహజం. అంచేత కాలానుగుణంగా భాష మారుతుంది.

(ఎ) నన్నయ కాలంలో గసడదవాదేశ సంధి వుంది. ఉదా॥ "వాడుసెప్పె" ఆధునిక కాలంలో 'చ' కారం 'స' కారంగా మారితే పామరజన వ్యవహారం అన్పిస్తుంది. 11వ శతాబ్దంలోనే నన్నయ 'స' కారం వాడాడు. మూల ఘటిక కేతన "తెచ్చినాడు" అనేది గ్రామ్యం అన్నాడు. నేడు "తెస్తాడు" శిష్ట భాషా పదం అయింది.

(బి) ఒక ప్రాంతంలో శిష్ట వ్యవహారంగా వుంటే పదం. మరో ప్రాంతంలో అశిష్ట వ్యవహారంగా కన్పిస్తుంది.

ఉదా॥ రాయలసీమలో శిష్ట వ్యవహారంలోని "వస్తా" "పోతా" అనే శిష్ట రూపాలు ఉభయ గోదావరి జిల్లాల్లో తక్కువ స్థాయి పదాలుగా భావిస్తారు. నేడు శిష్టులు కూడా 'అట్లా' అనడం కంటే 'అలా' అనడం పరిపాటి అయింది.

(సి) ఆధునిక కాలంలో తద్భవాలు, దేశ్యాల కంటే అన్య దేశ్యాలుకు తత్సమాలకు శిష్ట వ్యావహారికత, ప్రామాణికత పెరిగిపోయింది.

ఉదా॥ కూడు, కత, చాకలి, మొదలైన పదాల కంటె అన్నం, కథా, రజక పదాలు శిష్ట వ్యవహారంలో వున్నాయి.

(డి) మాండలిక భేదాలున్న పదాలు సందర్భోచితంగా ప్రామాణిక భాషలో చేరుతాయి.

ఉదా॥ భోగట్టా - సంగతి

సొరకాయ - అనపకాయ

(ఇ) నేడు అన్ని మండలాల రచయితలు ఆయా ప్రాంతాల్లోని భాషను వాడుతున్నారు. మాండలిక పదాలు ప్రామాణిక భాషలోకి చేరతాయి.

ఉదా॥ నీ బాంచను కాల్మొక్తా దొరా!

పై విషయాన్ని బాగా పరిశీలిస్తే విజ్ఞులు, సంస్కారవంతులు, మేధావులు మాటలాడే శిష్ట వ్యావహారిక భాషే ప్రామాణిక భాష.

ప్రామాణిక భాష క్రమక్రమంగా విజ్ఞాన వ్యాపక సాధనాల ద్వారా వ్యాపించి మిగిలిన మాండలికాల వారికి అనుకరణీయం అవుతుంది. లండన్ నగరంలో సంస్కారవంతుల వ్యవహారాన్ని బట్టి 15, 16 శతాబ్దాల కాలంలో ప్రామాణిక ఆంగ్లభాష ఏర్పడింది. నేటి ప్రామాణిక ఫ్రెంచి భాష పారిస్ నగరంలోని సంస్కారవంతుల వ్యవహారాన్ని బట్టి ఏర్పడింది. అదే విధంగా ఫారెన్సు నగరంలోని సంస్కారవంతుల వ్యవహారమే ఇటాలియన్‌గా మారింది. నేటి రోమన్ నగరంలోని సంస్కారవంతుల భాష నవీన ఇటాలియన్ భాషకు ఒరవడిగా వుందని ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారు తెలియజేసారు.

### 17.2.8 ప్రామాణికేతర భాషా లక్షణాలు

ప్రామాణిక భాషకు ప్రామాణికేతర భాషకు వున్న ప్రధానమైన లక్షణాల్ని మనం గమనించవచ్చు. భాషాధ్వనుల్లోని మార్పుల్ని బట్టి, క్రియల్ని బట్టి, నామ ద్వితీయాది విభక్తి స్వరూపాల్ని బట్టి, పద స్వరూపాల్ని బట్టి నిర్ణయించవచ్చు.

ప్రామాణిక భాష - ప్రామాణికేతర భాషా భేదాలు.

(ఎ) అల్పప్రాణత

| | ప్రామాణిక భాష | ప్రామాణికేతర భాష |
|---|---|---|
| ఉదా॥ | ఘోరం | గోరం |
| | ఫలం | పలం |
| | భేదం | బేదం |

(బి) అంతస్థరాహిత్యం

| | | |
|---|---|---|
| | యాగం | ఏగం |
| | యజ్ఞం | ఎగ్గం |
| | లేడి | ఏడి |
| | వచ్చాడు | వొచ్చాడు |
| | వాడు | ఆడు |
| | వీడు | ఈడు |

(సి) సంయుక్తాక్షరాల అప్రయోగం

| | ప్రామాణిక భాష | ప్రామాణికేతర భాష |
|---|---|---|
| ఉదా॥ | కుర్చీ | కురిసీ |
| | ప్రజ | పెజ |
| | పుణ్యం | పుణ్ణెం |
| | వాస్తవం | ఒత్తవం |

(డి) ఉష్మాక్షరాలైన శ, ష, లు లేకపోవడం.

| | ప్రామాణిక భాష | ప్రామాణికేతర భాష |
|---|---|---|
| ఉదా॥ | కషాయం | కసాయం |
| | భాష | బాస |
| | వేషం | ఏసం |
| | శివుడు | సివుడు |
| | శేషం | సేసం |

(ఇ) మూర్థన్య రాహిత్యం

| | | |
|---|---|---|
| ఉదా॥ | గొళ్ళెం | గొల్లెం |
| | తాళం | తాలం |
| | ప్రయాణం | పయానం |
| | వీణ | ఈన |

(యఫ్) స్పృష్టోష్మం ఊష్మాలుగా మారడం.

| | | |
|---|---|---|
| ఉదా॥ | చొక్కా | సొక్కా |
| | చాకలి | సాకలి |
| | చుక్క | సుక్క |
| | చవితి | సవితి |
| | చేదు | సేదు |
| | చూచి | చూసి |

(జి) ఊష్మాక్షరాలు స్పర్మాక్షరాలుగా మార్పు

| | | |
|---|---|---|
| ఉదా॥ | సోఫా | సోపా |
| | కాఫీ | కాపీ |
| | ఫీజు | పీజు |
| | ఫిరంగి | పిరంగి |

### 17.2.9 న్యూన ప్రామాణిక రూపాలు - ప్రామాణికేతర రూపాలు

న్యూన ప్రామాణిక రూపాలకు ప్రామాణికేతర రూపాలకు తెలుగు భాషలో పెద్దగా భేదం లేదు. ఇందులో మహా ప్రాణం అల్ప ప్రాణంగా మారుతుంది.

| | ప్రామాణిక భాష | న్యూన ప్రామాణిక భాష |
|---|---|---|
| ఉదా॥ | కుంభకర్ణుడు | కుంబకర్ణుడు |

| | |
|---|---|
| ధర్మం | దర్మం |
| ధర్మరాజు | దర్మరాజు |
| భారతం | బారతం |

భాషా ప్రామాణికరణం వల్ల అనేక ప్రయోజనాలు వున్నాయి. అందులో ముఖ్యమైన ప్రయోజనం భాషకు ఏకరూపత కలుగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఎవరి భాషను ఇతరులు ఎక్కువగా ఆదరిస్తారో, ఎవరి భాషను అధికంగా ఇతరులు అనుసరిస్తారో, అనుకరిస్తారో, ఎవరి భాష అర్థబోధనలో క్లేశకరంగా వుండదో, అలాంటి భాష ప్రామాణిక భాష. అలాంటి భాష మతానికి, కులానికి ప్రాంతీయ భేదాలకు లోను కాక అతీతమైందిగా వుంటుంది. నేడు సమాచార మాధ్యమం వల్ల అంటే రేడియో, టి.వి., సినిమా, పత్రికలు, ఇంటర్‌నెట్ మొదలైన సాధనాలు భాషలకు ఏకరూపతను సాధించి భాషా ప్రామాణీకరణకు ఎంతగానో తోడ్పడుతున్నాయి. ఈ పరిణామం హర్షించదగ్గది.

ఆంధ్రప్రదేశ్‌లోనూ బయటకూడా గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందినవారు ఎక్కువగా టి.వి. లోనూ, రెడియో, సినిమా రంగాల్లోను ఇంకా వివిధ పరిశ్రమల్లోనూ, రచనా రంగాల్లోనూ కళా రంగాల్లోనూ ఒకటేమిటి అన్ని రంగాల్లోనూ అధిక సంఖ్యలో వున్నారు. కాబట్టి వీరి భాషను ఇతరులు ఎక్కువగా ఆదరిస్తున్నారు, అనుకరిస్తున్నారు. అంచేత ఈ జిల్లాల్లోని శిష్టుల భాష ప్రామాణిక భాష అయింది.

## 17.3 అర్థ పరిణామం

**భాషా పరిణామం (Change in Language)**

భాషలో రెండు ప్రధానాంగాలు వుంటాయి. ఒకటి శబ్దం. రెండు అర్థం. మనిషి పరిణామశీలి. అందువల్ల అతని ఆలోచనా రూపమైన భాష కూడా మారుతుంటుంది. కాబట్టి మార్పు అనేది భాషకు సహజ లక్షణం. కాలాన్ని బట్టి భాష మారుతుంది.

ప్రపంచంలో ఏ భాషలోనయినా ఈ మార్పు తప్పకుండా ఒక క్రమానికి లేదా ఒక నియమానికి లోబడి వుంటుంది. దీన్నే 'భాషా పరిణామం' Change in Language అంటున్నారు.

భాషా సంబంధమైన రెండు అంశాల్లో మొదటిది శబ్దం. అర్థం మారకుండా శబ్ద రూపం మారవచ్చు. రెండోది అర్థం. శబ్దం మారకుండా అర్థం మారవచ్చు. వీటినే భాషా శాస్త్రజ్ఞులు ఇలా పేర్కొన్నారు.

1) ధ్వని పరిణామం (Phonetic Change)
2) అర్థ విపరిణామం (Semantic Change)

### 17.3.1 ధ్వని పరిణామం (Phonetic Change)

భాషకు బాహ్య రూపమైన శబ్ద స్వరూపంలోనూ, నిర్మాణం లోను జరిగే మార్పునే 'శబ్ద పరిణామం' లేక 'ధ్వని పరిణామం' అని అంటారు.

ఉదా॥ భక్తి - బత్తి.

ఇక్కడ శబ్దంలో రెండు మార్పులు జరిగాయి. ఒకటి మహా ప్రాణం (Aspirated Stop) అల్ప ప్రాణం (Unaspirated Stop) గా మారింది. రెండు సంయుక్తం ద్విత్వంగా మారింది (Assimilation).

**17.3.2 అర్థ విపరిణామం (Semantic Change)**

విపరిణామం అంటే మార్పు. భాషలో వర్ణాలూ, ధ్వనులూ, వాక్య నిర్మాణమూ, వ్యాకరణ నిర్మాణమూ ఒకటేమిటి ప్రతీదీ మారినట్లుగానే అర్థాలు కూడా మారుతుంటాయి. ఇలా ఆయా పదాలకు సంబంధించిన అర్థాల్లో కాలక్రమంలో కలిగిన మార్పుల్నే 'అర్థ పరిణామం' అని అంటారు. అర్థబోధను వివరించేది "Semantics". ప్రతీ పదానికి కూడా చరిత్ర వుంది. (Every word has its own history).

ఒకే మాటకు ఒకే అర్థం వుంటుందని అనుకోవడం పొరపాటు. ఒక మాటకు ఒకే అర్థం వుండనవసరం లేదు. అలాగే ఒకే అర్థం వుండటం కూడా మంచిది కాదు. మీదు మిక్కిలి వీలుపడదు కూడా. కొత్త కొత్త భావాలు, ఆలోచనలు, అవసరాలు వచ్చినప్పుడు వున్న పదాలనే కొత్త సందర్భాల్లో వాడటం వల్ల వాటికి కొత్త అర్థాలు ఏర్పడటం ప్రతీ భాషలోనూ సహజంగా జరుగుతుంటుంది.

ఉదా॥ ప్రాచీన కాలంలో 'ఇల్లు' అంటే 'పూరిల్లు' అనే అర్థం ఉండేది. ఆధునిక కాలంలో 'ఇల్లు' అంటే తాటాకు ఇల్లు కావచ్చు, పెంకుటిల్లు కావచ్చు, డాబా కావచ్చు, మేడ కావచ్చు, అపార్టుమెంటు కావచ్చు, ఇలా శబ్దార్థంలో కలిగే పరిణామాన్ని 'అర్థ పరిణామం' అంటారు.

**17.3.3 అర్థ విపరిణామం - నిర్వచనం**

(ఎ) ఆంగ్లం.

Innovations which change the Lexical meaning rather the Grammatical function of a form, are classed as change of meaning or semantic change. - "Bloomfield"

(బి) తెలుగు.

(అ) పదజాలానికి సంబంధించినట్టి అర్థంలో కలిగే మార్పును 'అర్థ పరిణామం' (Semantic change) అని అంటారు.

- ఆచార్య జి.ఎన్. రెడ్డి.

(ఆ) భాష కాలక్రమాన మారే స్వభావం కలది కాబట్టి ఒక భాషలో కాలక్రమాన వర్ణాలు, వ్యాకరణ నిర్మాణమూ మారినట్టుగానే పదాల అర్థాలు కూడా మారుతాయి. ఒక భాషలో పదాలలో కల అర్థాలలో వచ్చిన మార్పుని 'అర్థ విపరిణామం' (Semantic change) అని అంటారు.

- ఆచార్య పి.ఎస్. సుబ్రహ్మణ్యం

**17.3.4 అర్థ పరిణామం - పరిశోధన**

అర్థ పరిణామం అనే విషయం మీద ప్రముఖ భాషా శాస్త్రజ్ఞులు ఆచార్య జి.ఎన్. రెడ్డి గారు చేసిన కృషి పలువురి ప్రశంసల్ని పొందింది. వీరు "A Study of Telugu Semantics" అనే అంశంపై పరిశోధన చేసి మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి 1964లో పిహెచ్. డి. డిగ్రీ పొందారు. ఇది గ్రంథ రూపంలో 1966లో వచ్చింది. తెలుగు భాషలో అర్థ పరిణామంపై ఆర్. రాజగోపాలరావు, టి. ఉషారాణి మొదలైనవారు పరిశోధనలు చేశారు.

### 17.3.5 అర్థ పరిణామం - హేతువులు

'అర్థ పరిణామం' అనేది మానవుని బుద్ధిబలంపై ఆధారపడి వుంటుంది. ప్రతి మనిషికి ఒక పుర్రె వుంటుంది. ఒక్కొక్క పుర్రెకు ఒక్కొక్క బుద్ధి వుంటుంది. అంటే ఒక విషయంపై అందరి బుద్ధి ఒకే రకంగా వుండదన్నమాట. అందువల్ల అర్థ పరిణామం జరగడానికి ఇవి కారణాలని ఖచ్చితంగా చెప్పడానికి వీలుపడదు. ఒక భాషలో జరిగే అర్థ పరిణామ విధానాల్ని గుర్తించ వచ్చుగాని, అర్థ పరిణామ హేతువుల్ని నిర్ణయించటం చాలా కష్టం. ఏది ఏమైనప్పటికి అర్థ పరిణామం జరగడానికి ప్రధానమైన కొన్ని హేతువులున్నాయి. అవి ఇవి -

1) నాగరికతలో మార్పు రావడం.
2) ప్రసిద్ధమైన చారిత్రక కారణాల వల్ల కొన్ని పదాలు ప్రసిద్ధిలోకి వచ్చి అర్థాంతరంలో వాడడం.
3) ఆలంకారిక ప్రయోగాలు.
4) పరిసరాల్లో మార్పు రావటం.
5) భావాభివ్యక్తిలో వినయం, గౌరవం ప్రకటించాలనే కోరిక.
6) లలితోక్తి తత్పరత.
7) అర్థగోపనంలో వుండే ఇచ్ఛ.
8) వ్యంగ్య, వ్యాజ స్తుతుల పట్ల ఆసక్తి.
9) భావావేష ప్రదర్శనా ప్రయత్నం.
10) భ్రాంతి, అజ్ఞానం, అమాయకత్వం వల్ల పదాల్ని ఉదాసీనంగా వాడటం.
11) అస్పష్టార్థాలు గల పదాల్ని వుపయోగించటం.
12) వ్యక్తి భేదాన్ని అనుసరించి అర్థ భేదం కలగటం.
13) కారణకార్యాలు, ఆధారాధేయాలు అంగాంగులు అనే వాటి అర్థాలు తారుమారవటం.
14) ఒక భాషలోని భావాలు మరో భాషలోకి వెళ్ళడం.
15) ధాత్వాదులకు ధాతువులు చేరి విలక్షణమైన అర్థాన్ని బోధించడం.
 వీటిని వ్యాకర్తలు శబ్ద పల్లవాలు అన్నారు.
16) ఒక పదాన్ని అవ్యవహితంగా పునరుక్తి చేయటం వల్ల విశాష్టార్థం సిద్ధించటం.
 ఉదా॥ వాడవాడ, పొడిపొడి.
17) పదాలకున్న సహజార్థాన్ని మరుగు పరచి విలక్షణమైన అర్థంలో ప్రయోగించడంతో ఏర్పడే పదబంధాలు, జాతీయాలవల్ల -
 ఉదా॥ టోపీవేయు, అందెవేసిన చేయి.

### 17.3.6 అర్థాల్లో మార్పులు వచ్చే పద్ధతులు

ఒక మాటకు ఒకే కాలంలో వేరు వేరు అర్థాలు వుంటాయి. అలాంటి పరిశీలనను ఏకకాలిక అర్థ పరిణామం (Symeronics Semantics) అంటారు. అలాకాక, ఒక మాటకు వేరు వేరు కాలాల్లో వేరు వేరు అర్థాలు కూడా వుంటాయి. ఆ అర్థాలు

పరిణామాన్ని "అనేక - కాలిక అర్థ పరిణామం" (Dia-chronics Semantics) అని అంటారు.

**(1) ప్రకరణార్థలు (Contextual Meanings)**

ఒక పదానికి ఒకటి కంటే ఎక్కువ అర్థాలుండవచ్చు. అలాంటి చోట ప్రకరణాన్ని బట్టి ఒక అర్థాన్ని మాత్రమే సరియైన అర్థంగా గ్రహిస్తాం. దీన్నే ప్రకరణార్థం అని అంటారు. సందర్భాన్ని Context బట్టి పదానికి అర్థం చెప్పడం.

ఉదా॥ Bank అనే ఆంగ్ల పదం ఉదాహరణగా తీసుకుందాం.

Bank ఆర్థిక లావాదేవీలు జరిగే వ్యాపార సంస్థ.

Bank నది గట్టు.

Book Bank, Question Bank, Blood Bank

మొదలైన చోట్ల "నిల్వ చేసే చోటు" లేదా 'నిల్వ' అనే అర్థం వస్తుంది.

మరో ఉదాహరణ.

ఒకే పదం అనేక పదాల్తో సమసించినప్పుడు ఆ పదం సందర్భాన్ని బట్టి విశేషార్థాన్ని కలుగజేస్తుంది. "మంచి" అనే పదం తీసుకుందాం.

| | | |
|---|---|---|
| మంచిది | - | Yes |
| మంచివాడు | - | Good fellow |
| మంచి మనసు | - | Kind heart |
| మంచి నీళ్ళు | - | Drinking Water |
| మంచి సరుకు | - | Quality Goods |

ఇక్కడ 'మంచి' అనే పదానికి గల ఈ విధమైన వ్యాప్తిని 'అర్థ క్షేత్రం' (Semantic field) అని అంటారు.

**(2) నానార్థాలు (Multi Meanings)**

సామాన్యంగా ఒక మాటకి ఒకే అర్థం వుంటుంది. అయితే సందర్భాన్ని బట్టి వాడేకొద్ది, ఉద్దేశ్యం బట్టి ఒక మాటకు చాలా అర్థాలు వుంటాయి. ఒకే పదానికి వేరు వేరు అర్థాలుండటాన్ని నానార్థాలు అంటారు.

(ఎ) 'హరి' అనే శబ్దానికి అనేకార్థాలున్నాయి.

ఉదా॥ విష్ణువు, ఇంద్రుడు, చంద్రుడు, సూర్యుడు, యముడు, కోతి, చిలుక, కిరణం, వచ్చినది, మొ॥

(బి) 'శ్రీ' అనే శబ్దానికి అనేకార్థాలున్నాయి.

ఉదా॥ లక్ష్మి, సిరి, సంపద, శోభ, బుద్ధి, కీర్తి, ఒక రాగం మొ॥నవి.

(సి) 'స్త్రీ' అనే శబ్దానికి అనేక అర్థాలున్నాయి.

ఉదా॥ అబల, నారి, వనిత, అంగన, అతివ, మానిని, లలన, రమణి, ఆలు మొదలైన వాటికి / ఆడది / అని అర్థం.

**(3) శ్లేషార్థాలు (Double Meanings)**

పదానికి లేదా పద బంధానికి వున్న వేరు వేరు అర్థాలతో చేసే చమత్కారాన్ని "శ్లేష" అని అంటారు.

ఉదా॥ సుకవులకు సరసుల పట్ల ఆధర మధికం సుకవులు - మంచి కవులు, మంచినీటి పక్షులు అని అర్థం. సరసులు అంటే మంచి హృదయం కలవారు అని, చెరువులు అని అర్థం.

**(4) నైఘంటికార్థాలు (Lexical Meanings)**

నామవాచకాలు, క్రియలు, విశేషణాలు మొదలైన వ్యాకరణానికి సంబంధించిన పదాలకి వున్న అర్థాలు నిఘంటువుల్లో సూచించబడతాయి. ఇలాంటి అర్థాన్ని "నైఘంటికార్థాలు" అంటారు.

ఉదా॥ కలం. విశేష్యం / నామవాచకం /

1. లేఖిని, వ్రాత కుపయోగించే సాధనం.
2. బాణ విశేషం.

హిందీ, ఉర్దూ, పారశీకం - కలమ్

ఉర్దూ, కలమ్.

**(5) వ్యాకరణార్థాలు (Grammatical Meanings)**

నైఘంటికార్థంకన్నా భిన్నమైంది వ్యాకరణార్థం. నైఘంటికార్థాన్ని ఆధారంగా చేసుకుని వ్యాకరణాంశాల సహాయంతో చెప్పే అర్థమే వ్యాకరణార్థం.

ఉదా॥ ఆయన భార్య కొత్త కుర్చీలు కొంది.
ఆయన కొత్త భార్య కుర్చీలు కొంది.

ఇక్కడ మొదటి వాక్యంలో 'కొత్త' అనేది "కుర్చీలు" కి విశేషణంగా వుంది. రెండో వాక్యంలో 'కొత్త' అనేది భార్యకి విశేషణంగా వుంది. ఇలాంటి విశేషణ, విశేష్య సంబంధం అనేది వ్యాకరణార్థంలో ఒక రకం.

వ్యాకరణార్థంలో మూడు రకాలున్నాయి. అవి ఇవి -

(1) ప్రత్యేక ప్రయోగ యోగ్యత లేని అవ్యయాలు / ఏ / వాడే / ఓ / వాడో, వీడో / మొ॥ ప్రత్యయాలు / బహువచన ప్రత్యయం, విభక్తి ప్రత్యయం, కాల ప్రత్యయం మొ॥ / వంటి వాటికున్న అర్థం.

(2) వాక్యంలో పదబంధాలకి వున్న కర్త, కర్మ, విశేషణం మొ॥ వాటి అర్థాలు.

(3) నిశ్చాయకం, విధి, ప్రశ్న మొదలైన వాక్య భేదాలకు వున్న అర్థాలు.

ఒక వాక్యంలో అంగాలుగా వున్న పదాలు అర్థకాల నైఘంటిక వ్యాకరణార్థాలు కలియుటం వల్ల ఆ వాక్యార్థం స్ఫూరిస్తుంది.

**(6) పలుకుబడులు (Idiomatic Expressions)**

పదబంధాల్లో పదాలు ఇచ్చే సామాన్య అర్థానికీ శ్రోత ఆపద బంధాన్ని విన్నప్పుడు గ్రహించే సామూహికార్థానికీ (Total

Expressions) ఏ మాత్రమూ సంబంధం వుండదు. అంటే పదబంధాల్లో ప్రయోగించేటప్పుడు పదాల అర్థాలు మారతాయి.

ఉదా॥ పొయ్యిలో పిల్లి లేవలేదు - వంట చేయలేదు.

ఉప్పు కారం తినని మనిషి - పరమ సాధువు.

ఇక్కడ ఏ ఒక్క పదానికో వున్న అర్థ విశేషాన్ని కాక, మొత్తం వాక్యాన్నంతా లెక్కలోకి తీసుకోవలసి వుంటుంది. అప్పుడే ఆ వాక్యానికి సరైన అర్థం వస్తుంది.

**(7) బహ్వర్థక పదాలు (Polynyms)**

కొన్ని పదాలకు తమకు సహజంగా వున్న అర్థమే కాక, ఆ అర్థాన్ని అనుసరించి అనేక ఛాయార్థాలు పుడతాయి. ఇలాంటి పదాల్ని 'బహ్వర్థక పదాలు' అని అంటారు. వీన్నే అనేకార్థక పదాలు అని కూడా అంటారు.

ఉదా॥ కమ్మ.

పత్రిక, జాబు, మట్టి, కాడ, తాటి ఆకు, తాటాకు మీద రాసిన లేఖ, ఏ లేఖ అయినా, తాటాకుతో చేసిన కర్ణాభారణం, ఏ లోహంతో చేసిందయినా మొ॥వి.

**(8) సారూప్య పదాలు (Homonyms)**

కొన్ని పదాలు రూపంలో ఉచ్చారణలోను సమానంగా వున్నప్పటికి వాటి అర్థాలు భిన్నంగా వుంటాయి. వీటినే సమరూప పదాలు అని కూడా అంటారు.

ఉదా॥ వాడు .. దినం - దేశం - ప్రదేశం

పాడి .. క్షీరం - ధర్మం - న్యాయం

కాచు .. వేడిచేయు - రక్షించు

నీరు .. నీఱు - జలం - నశించు

పన్ను .. నోటి పన్ను - ఇంటి పన్ను - ఆస్తి పన్ను.

ఇవేకాక ఇతర భాషల నుంచి తెలుగులోకి వచ్చిన సారూప్య పదాలు కూడా వున్నాయి. వీటికి మూలం కంటే భిన్నమైన వ్యుత్పత్తి ఏర్పడుతుంది. వీటిని స్థూలంగా మూడు విధాలుగా విభజించవచ్చు.

(ఎ) సంస్కృతాంధ్ర సారూప్య శబ్ద అర్థ భేదాలు.

(బి) ఆంగ్లాంధ్ర సారూప్య శబ్ద అర్థ భేదాలు.

(సి) అరబిక్ ఆంధ్ర సారూప్య శబ్ద అర్థ భేదాలు.

(ఎ) సంస్కృతాంధ్ర సారూప్య శబ్ద అర్థ భేదాలు.

ఉదా॥ <u>సంస్కృతం</u> - <u>తెలుగు</u>

అరి / శత్రువు - అరి / కప్పం

| | | |
|---|---|---|
| కల / కళ, ఆర్ట్ | - | కల / స్వప్నం |
| చారు (అందం) | - | చారు (రసం) |

(బి) ఆంగ్ల, తెలుగు సారూప్య శబ్ద భేదాలు.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | <u>ఆంగ్లం</u> | - | <u>తెలుగు</u> |
| | లేడి (Lady) | - | లేడి / ఆడ జింక / జంతువు. |
| | కారు (Car) | - | కారు / పంటకాలు / ఋతువు. |

(సి) అరబిక్ ఆంధ్ర సారూప్య శబ్ద అర్థ భేదాలు.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | <u>అరబిక్</u> | - | <u>తెలుగు</u> |
| | కలం / లేఖిని | - | కలం / కాలమానం. |

**(9) పర్యాయ పదాలు (Synonyms)**

ఒకే పదానికి అనేక అర్థాలున్నట్లే ఒకే అర్థంలో పెక్కు మాటలు వాడుకులో వుంటాయి. ఒక భావాన్ని చెప్పడానికి సామాన్యంగా ఒక మాట వాడుతుంటాం కాని ఎల్లవేళలా అన్ని సందర్భాల్లోనూ అందరూ ఒకే భావానికి ఒకే మాటని వాడరు. అంటే వేర్వేరు వ్యక్తులు వేర్వేరు పదాల్ని వాడడం లోకంలో మనం చూస్తూవుంటాం. ఇలా ఒకే అర్థం గల రకరకాల పదాల్ని పర్యాయ పదాలు అంటారు. శబ్దాకృతి భిన్నంగా వున్నప్పటికి అర్థం మాత్రం సమానంగా వున్న పదాల్ని సమానార్థకాలు అని అంటారు. ఇవి రెండు విధాలు.

(ఎ) స్వచ్ఛ పర్యాయ పదాలు (pure synonyms)

(బి) పర్యాయ పదతుల్యాలు (quasi synonyms)

(ఎ) స్వచ్ఛ పర్యాయ పదాలు (pure synonyms)

వీటిని ఒకదాని స్థానంలో వేరొకదాన్ని వుపయోగించవచ్చు. ఒక భాషలోని మాండలిక భేదాల్ని బట్టి ఇలాంటివి గుర్తించవచ్చు.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | చెక్కలు | - | వక్కలు |
| | నాగలి | - | మడక |
| | వంద | - | నూరు |
| | పిల్ల | - | గుంట |

(బి) పర్యాయ పదతుల్యాలు (quasi synonyms)

కొన్ని పదాల్ని వాడడానికి ఇష్టం లేకపోవడం వల్ల కానీ, ఇతరేతర కారణాల వల్ల కానీ వాటికి పర్యాయ పదాలు వాడటం.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | చూచు | - | దర్శించు |
| | తిండి, బువ్వ, కూడు | - | భోజనం |

రాత్రిళ్లు 'ఉప్పు' అనే పదాల్ని వుపయోగించడం అశుభ సూచకంగా చాలామంది భావిస్తారు. అలా భావించడం వల్ల ఆ సమయంలో 'ఉప్పు' అనే పదాన్ని పలుకక 'ఉప్పు' అనే అర్థం వచ్చేటటువంటి మరో పదాన్ని ప్రయోగిస్తారు. రాత్రిళ్ళు ఉప్పు అనరాదని రుచి అనో, లవణమనో, బుట్టలోనిదనో అని అంటారు. ఇలాంటివే పర్యాయ పద తుల్యాలవుతాయి.

**17.3.7 అర్థ పరిణామం - రకాలు**

ఒక పదానికి ప్రాచీన కాలంలో ఒక అర్థం వుండగా అనంతర కాలంలో ఆ అర్థంలో మార్పు రావచ్చు. అలా వచ్చే ఈ మార్పుల్ని కొన్ని రకాలుగా భాషా శాస్త్రజ్ఞులు వర్గీకరించారు.

1897 లో ఫ్రెంచి భాషావేత్త మేఖేల్ బ్రెయిల్ (Michael Breall) అనే అతడు "La Semantique" అనే గ్రంథాన్ని ప్రచురించాడు. అర్థ విజ్ఞానానికి సంబంధించిన మొట్టమొదటి గ్రంథం ఇది. ఇతడు భాషలో జరిగే అర్థ పరిణామాల్ని కొన్ని భాగాలుగా విభజించాడు. బ్రెయల్ చెప్పిన అర్థ పరిణామ రీతుల్ని ఆధారంగా తీసుకొని తెలుగు భాషలో జరిగిన అర్థ పరిణామాల్ని భాషావేత్తలు స్థూలంగా ఇలా వర్గీకరించారు. అవి ఇవి.

(1) అర్థ వ్యాకోచం

అర్థం వ్యాకోచం అవడమే అర్థ వ్యాకోచం. అంటే మొదటి పరిమితార్థాన్ని బోధించేటటువంటి ఒక పదం కాలక్రమంలో విస్తృతార్థాన్ని బోధించేటట్లయితే అది అర్థ వ్యాకోచం.

అర్థ వ్యాకోచాన్ని ఆంగ్లంలో Semantic Extension అనీ, Extension of Meaning అనీ, Widening of Meaning అనీ, Generalisation of Meaning అనీ అంటారు.

ఉదా॥ (1) చెంబు.

చెంబు మూలద్రావిడ ధాతువు. * కెమ్. 'చెంబు' అనే పదానికి 'ఎరుపు' అనే అర్థం వుంది. ఎర్రని వస్తువుతో రాగి లోహంతో చేసిన చిన్న పాత్ర. రాగి పాత్రకి వాచకమైన ఈ పదం కాలక్రమేణా ఏ లోహంతో చేసిన పాత్రను తెలియజేయడానికైనా వాడబడుతోంది.

ఉదా॥ ఇత్తడి చెంబు, కంచు చెంబు, వెండి చెంబు, స్టీల్ చెంబు, ప్లాస్టిక్ చెంబు.

(2) నూనె.

నువ్వుల నూనెకు మాత్రమే వాచకమైన 'నూనె' శబ్దం నేడు సామాన్యవాచిగా వాడబడుతుంది.

ఉదా॥ వేరుశనగ నూనే, కిరసనూనె, కొబ్బరినూనె, విప్పనూనె, వేపనూనె.

(3) కమ్మ.

కమ్మ శబ్దం తాటి కమ్మతో వేసిన ఆభరణ విశేషంగానే మొట్టమొదట వ్యవహరించబడింది. చెవులకు ధరించే ఆభరణం అని అర్థం.

ఉదా॥ వజ్రపు కమ్మలు, ముత్యాల కమ్మలు.

(4) నారదుడు.

నారదుడు అనే పదం వ్యక్తి వాచకం. నేడు ఇది 'బలవంతుడు' అనే అర్థంలో ప్రయోగించబడుతుంది. ఇది సామాన్యవాచి అయింది.

(5) అష్టకష్టాలు. "అష్టకష్టాలు" అంటే 8 రకాలైన కష్టాలు అని అర్థం.

1) దేశాంతరగమనం.
2) భార్యా వియోగం.
3) ఆపత్కాల బంధు దర్శనం
4) ఉచ్ఛిష్ట భోజనం
5) శత్రు స్నేహం
6) పరాన్న ప్రతీక్షణం.
7) అప్రతిష్ట
8) దారిద్ర్యం.

నేడు వ్యవహారంలో అష్టకష్టాలన్నప్పుడు ఎక్కువ కష్టాలని, సంఖ్యాపరిమితిలేని కష్టాలని సామాన్యమైన అర్థం.

(2) అర్థ సంకోచం.

అర్థం, సంకోచం చెందడమే అర్థ సంకోచం. అంటే విశాలమైన అర్థాన్ని బోధించే ఒక పదం కుంచితార్థాన్ని లేక తక్కువ అర్థాన్ని బోధిస్తే అది అర్థసంకోచం.

'అర్థ సంకోచాన్ని' ఆంగ్లంలో Semantic Narrowing అనీ, Restriction of Meaning అనీ, Reduction of Meaning అనీ, Specialisation of Meaning అనీ అంటారు.

(1) చీర. ఆ ఋషి పుత్రుడు గట్టిన
చీరలు మృదుల ముల
హారులు నాతని మృదుకటి
భారంబున నొక్క కనక పట్టము వ్రేలున్ (భార. అరణ్య. 3-104)

అని నన్నయ చీర శబ్దాన్ని వస్త్ర సామాన్యవాచిగా ప్రయోగించాడు. నేడు స్త్రీ వస్త్ర విశేషంగా మాత్రమే అర్థం. అర్థ సంకోచానికి ఇది ఒక మంచి ఉదాహరణ.

- విరాట తనయుండు . . . . . . . తల చీర యలవరించికొని
- చీర లేని మగని చెలువ తానీక్షించి

మొదలైన ప్రయోగాల్లో చీర స్త్రీ పురుష సామాన్య వస్త్రంగా ప్రయోగించబడింది. ప్రాచీన కాలంలో ఈ పదం స్త్రీ పురుషులెవరు ధరించిన వస్త్రాన్నైనా సూచించేది. నేటి వ్యవహారంలో చీర అంటే స్త్రీలు ధరించే వస్త్రమని అర్థం వచ్చింది. ఇక్కడ అర్థం సంకోచం చెందింది.

2. కోక. కుల్లాయుంచితి కోక చుట్టితి మెయిం గూర్పాసనముం దొడ్గితిన్
వెల్లుల్లింది లనిష్టమున్ యెసవితిన్ విశ్వస్త వడ్డింపఁగాఁ
జల్లాయంబలిఁ ద్రావితిన్ రుచులు దోసంబంచుఁ బోనాడితిన్
దల్లీ! కన్నడ రాజ్యలక్ష్మీ! దయలేదా? నేను శ్రీనాథుఁడన్ (శ్రీనాథుని చాటువు)

స్త్రీలు మాత్రం కట్టుకొనే వస్త్ర విశేషానికే "కోక" అని నేటి వ్యవహారం. అన్ని విధాలా చీర వంటిదే కోక. చీర శబ్దం సంస్కృతం కాగా "కోక" తెలుగు మాట. రెండింటిలోనూ అర్థ సంకోచమే.

నా కొడుకును నా కోడలు . . . . . <u>కోక</u>
లెరుంగన్ పారిన.

మొదలైన ప్రయోగాలు ప్రాచీన కాలంలో స్త్రీ పురుషులు ఇద్దరూ ధరించే వస్త్ర సామాన్యవాచి, నేడు కోక అంటే స్త్రీలు ధరించే వస్త్రం అని అర్థం పరిమితమైంది.

(3) మధుపర్కాలు.

పూర్వం "మధుపర్కాలు" అంటే "తియ్యని పానీయాలు" అని అర్థం. నేడు వ్యవహారంలో ఈ పదానికి "తెల్లని వస్త్రాలు" అని అర్థం వచ్చింది.

(4) వస్తాదు (పర్షియా - ఉస్తాద్)

"ఉపాధ్యాయుడు" అని ఈ పదానికి అర్థం. కొంత కాలం తర్వాత ఈ పదానికి కుస్తీలు పట్టే విద్యను నేర్పే ఉపాధ్యాయుడని అర్థం వచ్చింది. కాలక్రమేణా కుస్తీలు పట్టువాడు లేక మల్లుడనే అర్థపరిణామం జరిగింది.

(5) తద్దినం.

తద్దినం / తత్ + దినం / అంటే ఆ రోజు, ఆ దినం అనే అర్థం. (Death Anniversary) నేడు అశుభకర్మ అనే అర్థంలో ఈ పదం జన వ్యవహారంలో చోటు చేసుకుంది.

(6) సాహెబు.

ఈ పదానికి చెలికాడు, సహచరుడని అర్థం. నేటి వ్యవహారంలో 'సాహెబు' అంటే మహ్మదీయుడని అర్థం.

(3) అర్థసామ్యత

ప్రాచీనకాలంలో నిందార్థంలో వాడబడిన పదాలూ, సామాన్య అర్థంలో వాడబడిన పదాలు కొన్ని నేడు గౌరవార్థాన్ని సంతరించుకున్నాయి. ఇలా మారడాన్ని అర్థ సామ్యత లేక 'అర్థోత్కర్ష' అంటారు.

ఈ అర్థ సామ్యతను ఆంగ్లంలో "Evaluation of Meaning" అనే Ameliorative Extension అనీ అంటారు.

ఉదా॥ 1. సభికులు.

పూర్వం సభికులు అనే పదానికి జూదం ఆడేవారు. జూదగాండ్రు అని అర్థం. నేడు 'సభికులు' అనే పదానికి వేరే అర్థాలున్నాయి. సభలోనివారని ఒక అర్థం. రాజు గారి కొలువులోని వారు అని మరో అర్థం కూడా వుంది.

2. ముహూర్తం.

ముహూర్తం అంటే నిమిషకాలం, తక్కువకాలం, అల్పకాలం, స్వల్పకాలం అని అర్థం. అమరంలో 12 క్షణాల కాలం 'ముహూర్తం' అని వుంది. నేడు శుభకార్యాలకు నిర్ణీతమైన పవిత్రమైన కాలం అనే అర్థం ఏర్పడి ఈ పదానికి అర్థ గౌరవం కలిగింది.

3. మర్యాద.

'మర్యాద' అనే పదానికి 'హద్దు' అనే అర్థముంది. నేడు మర్యాద అనే పదానికి 'గౌరవం' అనే అర్థం వచ్చింది.

4. అంతస్తు.

దీనికి రహస్యం. మరుగుచోటు, మేడపై భాగం అని అర్థం. అయితే 'అంతస్తు' అనే పదానికి తెలుగు భాషలో మేడపైభాగం అనే అర్థంతో పాటు గౌరవం, పరువు, హోదా అనే అర్థాలు కూడా వ్యవహారంలో చోటు చేసుకున్నాయి. ఉదా॥ వాళ్ళు మన అంతస్తుకు తగిన వాళ్ళు కాదు.

(4) అర్థగ్రామ్యత

జన వ్యవహారంలో వున్న మౌలిక అర్థానికి నష్టం కలిగి / బాధ కలిగి / పరిహాసార్థంలో కానీ, నిమ్నార్థంలో కాని పదం వాడితే దాన్ని 'అర్థగ్రామ్యత' అని అంటారు.

పాతకాలంలోని అర్థం కన్నా తర్వాత కాలంలో అర్థం నీచమైంది. చెడు అయిందీ అయితే దాన్ని "అర్థాపకర్ష" అంటారు.

అర్థ గ్రామ్యతకీ ఆంగ్లంలో "Degradation of Meaning" అనీ, "Pejorative Extension" అనీ అంటారు.

ఉదా॥

1. కర్మ - కర్మ అనే పదానికి కార్యం, పని అని అర్థం. నేడు ఈ పదం పితృ కర్మకు రూఢి అయింది.

2. ఛాందసుడు - ఈ పదానికి 'వేదవేత్త' అని అర్థం. నేడు లోకజ్ఞానం లేని వాడనే నిందార్థం ఏర్పడింది.

3. వ్యంగ్యం - భిన్నమైన అర్థ విశేషాన్ని తెలిపేది వ్యంగ్యం. నేడు వ్యంగ్యం అనేది వేళాకోళం, ఎత్తిపొడుపు అనే చెడు అర్థాల్లో వ్యవహరించబడుతుంది.

4. కంపు - పూర్వ కాలంలో కంపు అనే పదానికి "సుగంధం" సువాసన అనే అర్థముంది. నేడు ఈ పదానికి దుర్గంధం, దుర్వాసన అనే అర్థం వచ్చింది.

5. సన్యాసి - సన్యాసి అంటే రంగు, రుచి, వాసన లేకుండా ఇహలోక సంబంధ బాంధవ్యాల్ని విడిచిపెట్టిన మోక్షగామి అని అర్థం. నేడు ఎందుకు పనికిరాడనివాడు, ఎందుకు కొరగానివాడు అనే అర్థంలో 'సన్యాసి' అనే పదాన్ని వాడతారు.

6. కళావంతులు - పూర్వం 'కళావంతులు' పదానికి నృత్య సంగీతాది కళల్ని అభ్యసించిన స్త్రీలు అనే అర్థముండేది. నేడు ఈ పదానికి వేశ్యలు, భోగం వాళ్ళు అనే అర్థం రూఢమైంది.

7. కైంకర్యం - సేవ, పూజ అని ప్రాచీన అర్థం. నేడు ఈ పదం దొంగిలించు, అపహరించు, మోసగించు అనే చెడు అర్థాల్లో వాడబడుతుంది.

8. నిండుకుంది - నిండుగా వున్నది అనే అర్థంలో ఈ పదం నేడు అయిపోయింది అనే అర్థంలో వాడబడుతుంది.

(5) సభ్యోక్తి.

సభలో కాని, కొందరి సమక్షంలో కాని, సంఘంలో కాని ప్రత్యక్షంగా వాచ్యం చేయడానికి వీలుకాని పదాల అర్థాన్ని

పరోక్షంగా కానీ, నూతన పదబంధ కల్పన వల్ల కాని తెలియజేసే విధానాన్ని "సభ్యోక్తి" అని అంటారు. సభ్యోక్తిని ఆంగ్లంలో Euphemism.

ఉదా॥ 1. చనిపోవు.

అశుభ సూచకంగా భావించబడే మరణం అనే పదాన్ని తెలుపడానికి అనేక సభ్యోక్తులు వాడుతున్నారు.

ఉదా॥ కన్నుమూశాడు, కీర్తిశేషుడయ్యాడు, కైవల్యం పొందాడు, గతించాడు, తుదిశ్వాస విడిచాడు, దివంగతుడు, దీర్ఘ నిద్ర, నూకలు చెల్లాయి, పరమ పదించాడు, మృతి చెందాడు, స్వర్గస్తుడయ్యాడు.

2. మూత్ర విసర్జన, మల విసర్జన.

అశ్లీలంగా భావింపబడే మూత్ర విసర్జనను తెలిపే పదాలు చాలా వున్నాయి. వీనిలో మాండలిక భేదాలు కూడా చోటు చేసుకున్నాయి.

ఉదా॥ ఒకటికి, రెంటికి, లఘుశంక, గురుశంక, చెఱువు కెళ్ళు, బయటికి పోవు.

3. కడుపుతోవుంది.

ఆవిడ నీళ్ళు పోసుకుంది, ఉత్తి మనిషి కాదు, నెల తప్పింది అనే పదబంధాల ద్వారా 'గర్భవతి' అనే అర్థం సూచించబడుతుంది.

(6) మృదూక్తి.

కఠినమైన భావాల్ని దుఃఖ స్ఫోరకమైన అభిప్రాయాల్ని మృదువైన రీతిలో చెప్పటమే మృదూక్తి.

ఉదా॥ దీపం కొండెక్కింది - దీపం ఆరిపోయింది.

సూత్రం పెరిగిపోయింది - తెగిపోయింది.

(7) లక్ష్యార్థాలు.

భాషలో అనేక పదాలు లక్ష్యార్థాల్లో రూఢికెక్కడం సహజం. ఈ లక్ష్యార్థాలకు అనేక మూలాలు వుంటాయి. ఆధారం - ఆధేయం, కార్యం - కారణం, కార్యం - కర్త, ఉపమానం - ఉపమేయం, అంగం - అంగి మొదలైన జంటల్లో ఒకటి ఇంకోదానికి వాచకమై కాలక్రమేణా వ్యవహరించ బడుతుంటాయి. ఆంగ్లంలో దీన్ని Transfer of Meaning అని అంటారు.

ఉదా॥ 1. ముష్టి, 2. దాహం, 3. సూది.

1) ఆధార (Supporter) ఆధేయ (Supported) సంబంధం.



పిడికిలి అనే అర్థమున్న 'ముష్టి' పదానికి ఆధారాధేయ సంబంధం వల్ల 'భిక్షం' అనే అర్థం వచ్చింది. ఇక్కడ 'భిక్షం' పరిణామార్థకం.

2. కార్యకరణ సంబంధం.

దాహం
1. దహించుట, తపించుట.
2. దప్పిక, పానీయం.

దహించుట, తపించుట అనే అర్థముండే దాహం అనే పదానికి కార్యకరణ సంబంధం వల్ల దప్పిక, పానీయం అనే అర్థాలు ఏర్పడ్డాయి. ఇక్కడ దప్పిక, పానీయం పరిణామం వల్ల సంభవించిన అర్థాలు.

3. లక్ష్య లక్షణ సంబంధం.

సూది.
1. బట్టలు కుట్టే సూది.
2. డాక్టర్లు రోగి శరీరం లోనికి మందు ఎక్కించే పరికరం.

ఇక్కడ లక్ష్య లక్షణ సంబంధం వల్ల అర్థ పరిణామం జరిగింది.

(8) కేవల సంకేతార్థాలు.

అర్థసంకేతం - ఒక పదం జన వ్యవహారంలో ఒక అర్థిమిస్తూ వుండగా, ఏదో ఒక వృత్తినో, విజ్ఞాన రంగాన్నో, అంటిపెట్టికొన్న వారికి ఆ పదం ఒక ప్రత్యేక అర్థాన్నిస్తే దాన్ని "అర్థ సంకేతం" అంటారు.

ఉదా॥ 1) వాయువు, 2) ద్రవ్యం, 3) ఇంధనం.

1) వాయువు.

"వాయువు" అంటే గాలి అని సామాన్యమైన అర్థం. ఇదే పదానికి పశు వైద్య శాస్త్రంలో పశువులకు వచ్చే ఒక రకమైన వ్యాధి అని అర్థముంది. దీనినే ఆధునిక విజ్ఞాన శాస్త్రంలో గ్యాస్ (Gas) అని అర్థం.

2) ద్రవ్యం.

"ద్రవ్యం" అంటే ధనం / డబ్బు / అనే సామాన్యమైన అర్థం. ఇదే పదానికి ఆధునిక విజ్ఞాన శాస్త్రంలో పదార్థం అని అర్థం.

3) ఇంధనం.

"ఇంధనం" అంటే చిదుగు, వంట చెఱకు అని సామాన్యమైన అర్థాలున్నాయి. దీనికే ఆధునిక విజ్ఞాన శాస్త్రంలో ఉష్ణశక్తిని ఇచ్చే చమురు, బొగ్గుకట్టె మొదలైన అర్థాలున్నాయి.

(9) వస్తు పరిణామం.

ఒక పదం అది సూచించే వస్తురూపం, నిర్మాణం మొదలైన వాటిలో కాలక్రమేణా వ్యవహారంలో ఎంతో భేదాన్ని సంతరించుకుంది. దీన్ని ఆంగ్లంలో "Subreption" అని అంటారు.

ఉదా॥ లక్కపిడతలు, ఆయుధం.

1) లక్కపిడతలు.

పిల్లలు ఆడుకునే బొమ్మల్ని పూర్వం లక్కతో చేయడం వల్ల వాటికి "లక్కపిడతలు" అనే పదం రూఢి అయింది. ఇప్పుడు కర్రతో చేసిన వాటిని కూడా ఆ పేరుతోనే వ్యవహరిస్తున్నారు.

2) ఆయుధం.

ఆయుధం అనే పదం సూచించే పరికరంలో, పాతకాలానికి ఇప్పటికి ఎంతో భేదం వచ్చింది. విల్లు, గద, కత్తి, తోమరం మొదలైనవి ప్రాచీన ఆయుధాలు. తుపాకి, రైఫిల్, రివాల్వర్, ఫిరంగి మొదలైనవి నేటి ఆయుధాలు.

(10) అలంకారిక ప్రయోగం.

అలంకార ప్రియత్వంతో ఆలంకారికంగా చెప్పటం వల్ల, పోలికలు చేర్చటం వల్ల కూడా అర్థ పరిణామం జరుగుతుంది. ఆంగ్లంలో దీనిని Figurative Use అని అంటారు.

ఉదా॥ ఆమె రంభ, వాడు మన్మధుడు, వాడు నారదుడు.

ఇలాంటి వాక్యాల్లో ఉపమానానికి ఉపమేయార్థం సంక్రమించింది. వీటిని ఆలంకారిక ప్రయోగానికి ఉదాహరణగా తీసుకోవచ్చు.

తీపి మాటలు, చేదు నిజం, పచ్చి అబద్ధం వంటి వాక్యాల్లో తీపి, చేదు, పచ్చి అనే పదాలకీ ఆలంకారికార్థం కలిగింది.

(11) లోకనిరుక్తి.

కొంతమంది తనకు బాగా పరిచయమైన పదాల్ని తనకు పరిచయం లేని పదాల స్థానంలో చేర్చి వ్యవహరిస్తారు. తర్వాత తర్వాత అపరిచితమైన పదమే సామాన్య జనవ్యవహారంలో బహుళ ప్రాచుర్యాన్ని పొందుతుంది. అంటే కొత్తగా ఆ పదం కల్పించ బడుతుందన్న మాట. ప్రజలు తమకు వున్న జ్ఞానంతో ఆ పదంలోని అక్షరాల్ని కొద్దిగా అటూ ఇటూ మారుస్తారు. ఇలాంటి మార్పుని "లోకనిరుక్తి" అని అంటారు. దీన్నే "జన నిరుక్తి" అని కూడా అంటారు. "లోక నిరుక్తి" ని ఆంగ్లంలో Folk Etymology అని అంటారు.

ఉదా॥ 1. Over oiling - Over Hauling, over oiling గా మారింది. అంటే ఒక యంత్రాన్ని విప్పి దానిలోని భాగాలకు నూనె వేసి శుభ్రపరచటం. ఈ పదం తెలియని వారు "hauling" ని "oiling" గా మార్చారు. వ్యవహారంలో oiling పదమే స్థిరమైంది.

2. నారద సింహాచలం.

జన వ్యవహారంలో "North Simhachalam" 'నారద సింహాచలం' గా మార్పు చెందింది. "North Simhachalam" ఒక రైల్వే స్టేషను పేరు. North (నార్త్) పదం తెలియని వారు "నారద" గా మార్చారు. అంతే కాక ఈ పదానికే వ్యుత్పత్తిని కూడా కల్పించారు. నారదుడు ఆకాశం నుంచి దిగి, కొండ మీదకు నడచి వెళ్ళాడని, అంచేతనే నారదుడు దిగిన సింహాచలం కాబట్టి "నారద సింహాచలం" అయిందని జన వ్యవహారంలో వుంది.

3. మొక్క జొన్న - 'మక్కా - జొన్న' - మొక్క జొన్న అయింది. 'మక్కా' నుంచి భారతదేశానికి దిగుమతి అయింది. 'మక్కా - జొన్న'. ఇది తెలియని వారు 'మక్కా' పదం తప్పు అనుకొని దానికి బదులుగా 'మొక్క' వాడారు.

4. చక్రకేళి - 'శర్కరకేళి', చక్రకేళి అయింది. దీనికి తియ్యని అరటి పండు అని అర్థం. ఇక్కడ 'శర్కర' కు బదులుగా చక్ర వాడారు.

అర్థ పరిణామ స్వరూప స్వభావాలు తీరు తెన్నులు ఇవి. భాష అనేక ముఖాలుగా అభివృద్ధి చెందుతుందనటానికి వ్యవహర్త భాషా ప్రయోగంలో ఎప్పటికప్పుడు నూత్నత్వాన్ని అన్వేషిస్తాడనటానికి, అర్థ పరిణామం సాక్ష్యంగా నిలుస్తోంది. నేడు భాషా శాస్త్రంలో ఒక ప్రత్యేక శాఖగా వెలుగొందుతూ పరిశోధకుల దృష్టిని ఆకర్షిస్తున్న విభాగం 'అర్థ పరిణామం'.

## 17.4 సమీక్ష

తెలుగు భాషలోని మాండలికాల గురించి, తెలుగు ప్రామాణిక భాష గురించి, తెలుగులోని అర్థ పరిణామం గురించి తెలుసుకున్నారు.

## 17.5 ప్రశ్నలు

1. తెలుగులోని ప్రధాన మాండలికాలు?
2. ప్రామాణిక భాష.
3. తెలుగు పదాలలోని అర్థ విపరిణామాన్ని వివరించండి.

### చిన్న ప్రశ్నలు

1. వ్యవహార భేదక రేఖలు (Isoglosses)
2. వైయక్తిక మాండలికం (Individual Dialect)
3. అర్థ వ్యాకోచం
4. లోక నిరుక్తి.

## 17.6 ఆధార గ్రంథాలు


1. ఆధునిక భాషా శాస్త్ర సిద్ధాంతాలు - ఆచార్య పి.యస్. సుబ్రహ్మణ్యం.
2. తెలుగు భాషా చరిత్ర - డా॥ వెలమల సిమ్మన్న
3. తెలుగు భాషా చరిత్ర - స్ఫూర్తిశ్రీ టి. భాస్కరరావు.
4. తెలుగు భాషా చరిత్ర - ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి.
5. భాషా విజ్ఞాన పరిచయం - ఆచార్య జి.యన్. రెడ్డి.
6. మాండలిక వృత్తి పదకోశాలు - తెలుగు అకాడమి - ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి.



**డాక్టర్ డొక్కు కృష్ణ డిటెక్టివ్**
ఎం.ఏ., పిహెచ్.డి., యల్.యల్.బి.
లెక్చరర్ (తెలుగు)
యస్.పి. మహిళా కళాశాల
మచిలీపట్నము, కృష్ణా జిల్లా

# పాఠం - 18

# శాసన-కావ్య భాషా పరిణామం

పాఠ్యనిర్మాణక్రమం

18.0 లక్ష్యం
18.1 శాసన భాషా పరిణామం
18.2 కావ్య భాషా పరిణామం
18.3 సమీక్ష
18.4 ప్రశ్నలు
18.5 ఆధార గ్రంథాలు

## 18.0 లక్ష్యం

శాసన భాషలో, కావ్య భాషలో వచ్చిన మార్పులను తెలియజేయడం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## 18.1 గ్రాంథిక - వ్యావహారిక భాషావాదాలు

### ప్రాఙ్నన్నయుగ భాషా విశేషాలు

తెలుగు సాహిత్యానికి సంబంధించినంత వరకూ తొలి ప్రామాణిక గ్రంథం మహాభారతం క్రీ.శ. 11వ శతాబ్దంలో మహాభారతం రచించబడిందంటే అంతకు పూర్వం చాలాకాలం నుంచే తెలుగు వ్యవహార యోగ్యమైన భాషగా స్థిరపడి ఉండాలి. కాని మహాభారతానికి ముందు "రచనలు ఏవైనా ఉండేవో, ఉంటే వాటి భాష ఎలా ఉండేదో తెలుసుకోవడానికి మనకు ఏ ఆధారాలు లేవు. అయితే వ్యవహారంలో ఉండిన తెలుగు భాషను గూర్చి తెలుసుకోవడానికి శాసనాలు ఎంతగానో ఉపకరిస్తాయి.

ఇప్పటికి లభించినంత వరకు క్రీ.శ. 575 లో వేయబడిన ఎఱ్ఱగుడిపాడు శాసనం మొట్టమొదటి పూర్తి తెలుగు శాసనము. దీన్ని వేయించినవారు రేనాటి చోడులు. దీనికి ముందు ఆంధ్రదేశంలో వేయబడిన శాసనాలన్నీ ప్రాకృతాల్లోనే ఉన్నాయి. తెలుగు భాష అప్పటికే వ్యవహారంలో ఉన్నదనడానికి గుర్తుగా గ్రామనామాలు, వ్యక్తుల పేర్లు తెలుగులో కనిపిస్తాయి. ఉదా॥ గొలశర్మ, గడియనబూమ, గొడవుకామ మొ॥ వ్యక్తుల పేర్లు, వేవూరు, ఒంగోడు, మూలకూరు, తాంటికొండ మొ॥నవి ఊర్ల పేర్లు.

క్రీ.శ. 2 శతాబ్దపు అమరావతి శాసనంలో నాగబు అనే పదం ఉంది. ఇక్కడ 'బు' తెలుగు ప్రత్యయం. దీని బట్టి అప్పటికే తెలుగులో పద ప్రత్యయ విభాగం ఏర్పడిందనీ, సంస్కృతం నుండి తత్సమ పదాలను తెచ్చుకోవడం ప్రారంభమైందనీ చెప్పవచ్చు. హాలుని గాథాసప్తశతిలో మామ, మంచం, అత్త, పొట్ట, పిలుఅ (పిల్ల) వంటి తెలుగు పదాలు కనిపిస్తాయి.

క్రీ.శ. 848 ప్రాంతం నాటి పండరంగని అద్దంకి శాసనం మొట్టమొదటి తెలుగు పద్య శాసనం. ఇది తరువోజ ఛందస్సులో వుంది. క్రీ.శ. 898 నాటి యుద్ధమల్లుని బెజవాడ శాసనంలో కవిత్వ పద్ధతి కన్పిస్తుంది. ప్రాఙ్నన్నయ తెలుగు భాషా స్వరూప స్వభావాల్ని తెలుసుకోవడానికి పరమ ప్రామాణికమైన ప్రధానమైన ఆధారాలు శాసనాలు మాత్రమే. శాసనాల్లోని, భాషాధ్వనులు,

వర్ణాలు, సమాసాలు, ఛందో విశేషాలు, ధాతు ప్రత్యయ నిర్మాణం, పద రచన, వాక్య విన్యాసం, సర్వనామాలు, వ్యక్తుల నామాలు, గ్రామనామాలు, సంఖ్యా వాచకాలు, క్రియలు, విభక్తులు, పదజాలం, మొదలైన వాటిని ఆధారంగా చేసుకుని ప్రాఙ్నన్నయ యుగ భాషా స్వరూపాన్ని దాని పరిణామ వికాసాన్ని తెలుసుకోవచ్చు. ప్రాచీనాంధ్ర శాసనాలు - తెలుగు భాషా విశేషాలు.

**(1) ప్రాఙ్నన్నయ యుగ ధ్వనులు**

**వర్ణాలు**

ప్రాఙ్నన్నయ యుగ శాసన భాషలో దేశ్య వర్ణమాలలోని వర్ణాల సంఖ్య ముప్పైమూడు. ఇందులో అచ్చులు పది. హల్లులు ఇరవైమూడు.

(అ) అచ్చులు - 10 (Vowels)

అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఎ, ఏ, ఒ, ఓ.

(ఆ) హల్లులు - 23 (Consonents)

క, గ, ఙ, చ, జ, ఞ, ట, డ, ణ, త, ద, న, ప, బ, మ, య, ర (ఱ), ల, ళ, వ, స, హ, ఴ.

పై ధ్వనులకు సంబంధించిన కొన్ని ముఖ్య విశేషాలు.

అ. అయ్, అవ్‌లతో భేదకత్వం లేని ఐ, ఔ లు ప్రత్యేక వర్ణాలు కావు.

ఆ. ఋ, ౠ, ఌ, ౡ, లకు శాసనభాషలో ప్రయోగం లేదు.

ఇ. ౘ, ౙ, లు చ, జ లకు స వర్ణాలు (Allophones)

ఈ. 'ౘ' ఆనాటి భాషలో వుంది అయితే ప్రత్యేక లేఖన చిహ్నం లేదు. 'త్స' లేఖనం ద్వారా సూచించారు. ఉదా॥ యొడత్స.

ఉ. 'ఞ' కారం నకారానికి స వర్ణం.

ఊ. ఴ, ఱ లు రెండు చారిత్రక కాలంలో తమ వర్ణత్వాన్ని కోల్పోయాయి.

ఋ. ఖ, ఘ, ఠ, థ, ధ, ఫ, భ, శ, ష మొదలైన వర్ణాలు సంస్కృత ప్రాకృత భాషల ప్రభావం వల్ల తెలుగు భాషలోకి ప్రవేశించిన వర్ణాలు.

**ఴ వర్ణం**

ద్రావిడ భాషలకే పరిమితమైంది. ఈ ఴ వర్ణం ప్రాఙ్నన్నయ యుగంలో ఴ అనే అక్షరం కనిపిస్తుంది. ఇది ఇప్పటికి తమిళ భాషలో వుంది. ఈ వర్ణం క్రమ క్రమంగా తెలుగు భాషలో లోపించింది. తెలుగులో 'ఴ' కార స్థానంలో 'డ' కారం రేఫ కూడా కనిపిస్తుంది.

(అ) ఴ - డ గా మారడం

| శాసన రూపం | నేటి రూపం |
|---|---|
| తిచ్చివారు | డచ్చివారు |
| మతిసి | మడసి |
| ఏతువేళు | ఏడువేలు |

(ఆ) తి - ర గా మారడం

| శాసన రూపం | నేటి రూపం |
|---|---|
| ఊత్లు | ఊర్లు |
| బారనాళిచ్చిన | భారనాశి్రవచ్చిన |

(ఇ) వలపల గిలక (ౕ)

నన్నయకు పూర్వం పదానికి ఉత్తర భాగంలో వలపల గిలక చోటు చేసుకుంది. నేడు వలపల గిలక వున్న చోట్ల పూర్వాక్షరానికి ద్విత్వం వస్తుంది. పూర్వం దీన్ని రేఫకు బదులుగా వాడేవారు. దీని గుర్తు 'ౕ' - ఇది 'న్' (ద్రుత) రూపం.

| శాసన రూపం | నేటి రూపం |
|---|---|
| కార్తిౕకేయుణ్డు | కార్త్తికేయుండు |
| స్వగ్గౕ | స్వర్గ |
| శమ్మౕ | శర్మ |

(ఈ) పదాది సరళాలు

ప్రాఙ్నన్నయ యుగంలో పదాది సరళాలు కన్పిస్తున్నాయి. ప్రాచీన ద్రావిడ భాషలో పదాది సరళాలు కన్పించవు.

అ. పదాది పరుషాల్ని సరళీకరించడం వల్ల.

ఉదా ॥ దీని - తీని.

(ఉ) అనుస్వారం

ప్రాఙ్నన్నయ యుగ శాసనాల్లో వర్గ పంచమాక్షరం కానీ దానికి బదులు అనుస్వారం రాయడం కానీ కన్పిస్తుంది.

ఉదా ॥ పణ్డా, కంగూర

కొన్నిచోట్ల ఒకే పదంలో అనుస్వారమూ, వర్గపంచమాక్షరమూ రెండూ కన్పిస్తాయి.

ఉదా ॥ నాం ణ్డు

(ఊ) సాధుశకట రేఫలు

నన్నయ పూర్వం శాసనాల్లో శకట రేఫ ప్రయోగం వుంది. నేడు శకట రేఫ (ఱ) కు బదులుగా సాధు రేఫ (ర) ను

వుపయోగిస్తున్నారు.

| శాసన రూపం | నేటి రూపం |
|---|---|
| ఆఱ్లపఱ్టు | ఆర్లప్రు |
| తూఱ్పు | తూర్పు |
| నిఱ్టజుల | నిట్రజుల |

(ఎ) ణ, ళ, ల ప్రయోగం

శాసనాల్లో వున్న ణ, ళ ల ప్రయోగాల స్థానే నేడు న, ల ప్రయోగాలు కన్పిస్తున్నాయి.

ణ - న గా మారటం.

| శాసన రూపం | నేటి రూపం |
|---|---|
| ఆణతి | ఆనతి |
| గొణిన | గొనిన |
| ఎణ్బాది | ఎనిమిది |

ళ - ల గా మారటం.

| శాసన రూపం | నేటి రూపం |
|---|---|
| చెఱువుళు | చెఱువులు |
| వేళ్పు | వేల్పు |
| ప్రసాదంబుళు | ప్రసాదంబులు |

(ఏ) తాలవ్యీకరణం (Palatalisation)

తాలవ్యాచ్చులకు ముందున్న పదాది ద్రావిడ 'క' వర్ణం. తెలుగు భాషలో 'చ' కారంగా మారటాన్ని "తాలవ్యీకరణం" అంటారు. మూల ద్రావిడ భాషలో తాలవ్యాచ్చులు (Palatalisation Vowels or Front Vowels) అయిన ఇ, ఈ, ఎ, ఏ, లతో కూడిన 'క' కారం తెలుగులోకి వచ్చేటప్పుడు 'చ' కారంగా మారుతుంది.

| | | |
|---|---|---|
| ఉదా ॥ | కెఱుయ్ - చెఱువు | కిఱు - చిఱు |
| | కెయి - చెయి | కీఱు - చీఱు |
| | కెయ్ - చెయ్ | కివి - చెవి |
| | | కిళి - చిలుక |

(ఐ) పదాల సంస్కృతీకరణం

శాసనాల్లో తెలుగు పదాలకు సంస్కృతీకరణం కూడా జరిగింది. "చేంబ్రోలు" అనే తెలుగు పదాన్ని తామ్ర పురీ అనీ శోణపురీ అని శాసనాల్లో వుపయోగించారు. కొలను అనే గ్రామ నామాన్ని "సారసపురీ" అని సంస్కృతీకరించిన ఉదాహరణలు

సంస్కృత శాసనాల్లో కన్పిస్తున్నాయి.

(ఒ) న్ఱ సంయుక్తాక్షరం.

దంత్య నకారంతో కూడిన 'న్ఱ' అనే సంయుక్తాక్షరం శాసన భాషలో కన్పిస్తుంది. ఉదా ॥ త్యాన్ఱికొన్ఱ, తేగొన్ఱమ్.

ఇందులోని "న్ఱ" అనే సంయుక్తాక్షరం తర్వాత కాలంలో న్డ గానూ (బిందు పూర్వక డు వర్ణం) ండు గాను మార్పు చెందింది.

ఉదా॥ అవన్ఱు - వాన్ఱు - వాండు - వాఁడు.

(ఓ) వర్గ పంచమాక్షరాలతో కూడిన సంయుక్తాక్షరాలు.

వర్గ పంచమాక్షరాలతో కూడిన సంయుక్తాక్షరాలు శాసనాల్లో కన్పిస్తున్నాయి. నేడు మనం అనునాసికానికి బదులుగా పూర్ణబిందువును ఆయా వర్గాక్షరాలకు ముందు వాడుతున్నాం.

| <u>శాసన రూపం</u> | <u>నేటి రూపం</u> |
|---|---|
| చిన్తగుణ్ట | చింతగుంట |
| ఏళుచుణ్డి | ఏలుచుండి |
| కట్టిఞ్చి | కట్టించి |

(ఔ) రేఫేతర పదాది సంయుక్తాక్షరాలు

వర్గవ్యత్యయం అచ్చుంకోచం మొదలైన కారణాల వల్ల తెలుగులో పదాదిన ఏర్పడి సంయుక్తాక్షరాలు క్రీ.శ. 4, 5 శతాబ్దాల నుంచీ శాసనాల్లో కన్పిస్తున్నాయి.

ఉదా॥ క్ఱొచ్చె.

పై రూపం 7వ శతాబ్ది నాటికి రేఫ యుక్తంగా మార్పుచెందింది.

ఉదా॥ క్రొచ్చె.

7వ శతాబ్దం నుంచి శాసన భాషలో పదాది సంయుక్తాక్షరాల్లో రేఫరహిత రూపాలు కూడా వున్నాయి.

ఉదా॥ గొచ్చి (గ్రొచ్చి)
పప్పు (ప్రప్పు)

(క) పదాది యవలు

పదాది 'య' కారం క్రీ.శ. 5వ శతాబ్దం నుంచి పదాది 'వ' కారం క్రీ.శ. 9వ శతాబ్దం నుంచి కన్పిస్తున్నాయి.

ఉదా॥ యలమ్మ (ఎల్లమ్మ)
వుద్దిని (ఉద్దిన్ని)

**(2) "నాగబు" పద వివరణ**

క్రీ.శ. 1వ శతాబ్దానికి చెందిన శాతవాహనుల కాలం నాటి అమరావతి స్థూపం (గుంటూరు జిల్లా సత్తెనపల్లి తాలుకా) లో 'నాగాబు' అనే పదం శాసనాల్లో తొలి తెలుగు పదమని మొట్టమొదటిసారిగా ప్రముఖ విమర్శకులు వేటూరి ప్రభాకర శాస్త్రి గారు గుర్తించారు. ఇందులో "నాగ" శబ్దం సంస్కృతం 'బు' అనేది అమహద్వాచక ప్రథమైక వచన ప్రత్యయమైన 'ము' వర్ణానికి రూపాంతరం. నాగబు పదం కాక "నాగబుధి", "నాగబోధి" అనే మాటలు ప్రాకృత శాసనాల్లో కన్పిస్తున్నాయి. "నాగబు" అనేది "నాగబుధి" లోని ఒక భాగం కావచ్చునని కొంతమంది భాషావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా ఈ విషయం ఉత్తమ పరిశీలన వల్ల మాత్రమే నిగ్గుతేలుతుంది.

ము వర్ణమునకు మాముడియే నింబూర్ణ బిందు పూర్వక బు వర్ణం బేని విభాషనగు అనే సూత్రం వల్ల "నాగము" శబ్దం - నాగమ్ము నాగంబు అనే రూపాలు ఏర్పడతాయి. "నాగంబు" లోని బు వర్ణానికి ముందు గల బిందువు లోపించి "నాగబు" అవుతుంది. భాషా శాస్త్రకారుల అభిప్రాయం ప్రకారం 'బు' అనేది తెలుగు ప్రత్యయం. ఈ విషయంలో విమర్శకుల్లో ఎవరికీ ఎలాంటి భేదాభిప్రాయాలు లేవు.

శాతవాహనుల కాలం నాటి వెండి నాణాలు ప్రాకృతంలో వున్నాయి. అయినా తెలుగు మాటలు అక్కడక్కడ కన్పిస్తాయి.

**(3) సంధులు (Morpho-phonemic Changes)**

ప్రాజ్నన్నయ యుగంలో అచ్సంధులు, హల్సంధులు రెండూ చోటు చేసుకున్నాయి.

**అచ్సంధులు.**

**(అ) అత్సంధి.**

పదాంతంలోని అత్తుకు కొన్నిచోట్ల సంధి జరగడం మరి కొన్నిచోట్ల 'అత్తు'కు సంధి జరగక అది స్థిరంగా వుండటం, కొన్నిచోట్ల యడాగమం రావటం గమనించవచ్చు.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | ఇడ్డట్లు | - | సంధి జరిగిన రూపం |
| | పన్నన ఇరువది | - | విసంధి రూపం |
| | కలయన్త | - | యడాగమ రూపం |

(ఆ) ఇత్సంధి

ఇత్సంధిలో సంధి జరిగిన రూపాలు. విసంధి రూపాలు యడాగమ రూపాలు శాసన భాషలో కన్పిస్తున్నాయి.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | శ్రీ కెలన్ | - | సంధి జరిగిన రూపం |
| | ఇరువది యిది ఏను | - | విసంధి రూపం |
| | ఇరువదియాదినాల్కు | - | యడాగమ రూపం |

(ఇ) ఉత్సంధి

ఉత్సంధిలో కూడా సంధి జరిగిన రూపాలు విసంధిరూపాలు, యడాగమరూపాలు కన్పిస్తున్నాయి.

ఉదా॥ ఊఁడ్లండు - సంధి జరిగిన రూపం
రేనాణ్ణు ఏళన్ - విసంధి రూపం
వారు యిఱ్ఱికాసు - యడాగమ రూపం

(ఈ) హల్సంధులు

<u>గసడదవాదేశం</u>

నన్నయకు పూర్వం శాసనాల్లో గసడదవాదేశం, నిత్యంగాను, వైకల్పికంగాను కన్పిస్తుంది.

ఉదా॥ పణి - సేసిన - (సంధి జరిగిన రూపం)
రెండు - తోటళు - (విసంధి రూపం)

<u>ద్రుత సంధి</u>

ప్రారంభంలో శాసన భాషలో ద్రుత సంధి వైకల్పికంగానూ, తర్వాత బహుళంగానూ కన్పిస్తుంది. ద్రుతం యడాగమం, పగాగమం చేసిన రూపాలు కూడా శాసనాల్లో వున్నాయి.

ఉదా॥ విషయంబు - యేళు - (విషయంబు + ఏళు)
రట్టి గుడియు - వుద్దిని - (గుడియన్ + ఉద్దిన్)

<u>విరూప సంధి</u>

కొన్ని సందర్భాల్లో తెలుగు పదాలకు సంస్కృత పద్ధతిలో సంధి చేయడం తత్సమ శబ్దాలకు తెలుగు పద్ధతిలో సంధి చేయడం అక్కడక్కడ కన్పిస్తుంది.

ఉదా॥ మన్ప్యణ్ణ (మని - అణ్ణ) యణాదేశం
నీలీశ్వర (నీల - ఈశ్వర) గుణ సంధికి బదులుగా పరరూపం సంధి రావటం.

<u>పదాంత సంధి</u>

పదాంత సంధి కూడా శాసన భాషలో కన్పిస్తుంది.

ఉదా॥ చెఞ్చఱువ (చెన్ + చెఱువ)

**(4) సమాసాలు** (Compounds)

ప్రాఙ్నన్నయ యుగ శాసనాల్లో మిశ్ర సమాసాలు, వైరి సమాసాలు కన్పిస్తున్నాయి.

<u>దేశ్య తత్సమ మిశ్రమ రూపాలు</u>

ఉదా॥ అమృతపడి, పోర్ముఖరామ.

దేశ్య తద్భవ మిశ్రమ రూపాలు

ఉదా॥ కణ్ణసామి, మొగమాడువు.

తత్సమ తద్భవ మిశ్రమ రూపాలు

ఉదా॥ ఘనరాచమణి, లోహదణ్ణు.

తత్సమ తద్భవ దేశ్యాలు

ఉదా॥ వేణవొజన్ము, దేవొనొజ్జలకూ.

**(5) చందస్సు**

నన్నయకు పూర్వం శాసనాల్లో తరువోజ, సీసం, మధ్యాక్కర, కందం, చంపకమాల, ఉత్పలమాల, ఆటవెలది, తేటగీతి, మొదలైన ఛందో విశేషాలు చోటుచేసుకున్నాయి. శాసనాల్లో వున్న పద్యాలన్నీ దానధర్మాలు మొదలైన విషయాలకు సంబంధించినవి.

**(6) సముచ్చయం (Conjunction)**

నన్నయకు పూర్వం శాసనాల్లో సముచ్చ యార్థక పదాంశం అనేక రూపాలతో కన్పిస్తుంది.

ఉదా॥ అన్నియు, గుళ్ళువు, నాలును, కోటియి, గుడియిని, ఎప్పుడూనూ, మఱియును, కలరేనియు.

**(7) విశేషణాలు (Adjectives)**

విశేషణాల్లో అనేక రూపాలు కన్పిస్తున్నాయి.

(అ) ప్రాఙ్నన్నయ యుగంలో ఒక నామం పదం మరో నామ పదానికి పూర్వం వుండడం వల్ల విశేషణం కావడం వుంది.

ఉదా॥ ఉరువు - పల్లి - చిట్టేరు.

(ఆ) గుణవాచక విశేషణాలు విశేష్యాలకు పూర్వం వస్తాయి.

ఉదా॥ నల్లరాయి, పచ్చిపాలు.

(ఇ) ము వర్ణకాంత పదాల్లోని "ము" ప్రత్యయ స్థానంలో 'వు' చేరి అవి విశేషణాలుగా ప్రవర్తిస్తాయి.

ఉదా॥ వేవూరు, కట్టెవుదుర్గము.

(ఈ) భూతకాలిక ధాతుజ విశేషణాలు

ఉదా॥ ఇచ్చిన, ఉపేక్షించిన.

(ఉ) తద్ధర్మార్థక విశేషణాలు

ఉదా॥ మనువాణ్ణు.

(ఊ) వ్యతిరేకార్థక విశేషణాలు

ఉదా॥ పెట్టనివారు, కొలదిలేని.

(ఎ) విశేషణాత్మక పదబంధాలు

నామవాచకానికి 'అగు' ధాతు భూతకాలిక విశేషణ రూపమైన అయిన చేరిన విశేషణాత్మక పదబంధాలు కూడా కన్పిస్తాయి.

ఉదా॥ ఉత్తమోత్తమున్లయిన్

(ఏ) సంఖ్యావాచక విశేషణాలు

అగు, అవు చేరి పూరణార్థకాలైన సంఖ్యా వాచక విశేషణాలు కన్పిస్తాయి. పది యేడగునేణ్డు, మూణ్డవు నడవు. 'అవ' ప్రత్యయం అక్కడక్కడ కనిపిస్తుంది.

**(8) సర్వనామాలు (Pronouns)**

నన్నయకు పూర్వం శాసనాల్లో సర్వనామాలు కన్పిస్తున్నాయి.

(అ) ఉత్తమ పురుష బోధక సర్వనామ రూపాలు

ఉదా॥ ఏ, వే, నా, నాకు.

(ఆ) మధ్యమ పురుష సర్వనామ రూపాలు

ఉదా॥ నీవు, నీ.

(ఇ) ప్రథమ పురుష సర్వనామ రూపాలు

ఉదా॥ వాన్డు, వాణ్డు, వాని, అతణ్డ్, అతని, వీని, వీన్ణి, వారు, వారల, వీరి, వీరల.

(ఈ) ఆత్మార్థక సర్వనామ రూపాలు

ఉదా॥ తాన్, తమ, తమ్మ.

(ఉ) ప్రశ్నార్థక సర్వనామ రూపాలు

ఉదా॥ ఎవ్వడ్, ఎవ్వర్, ఎవ్వి.

**(9) వ్యక్తుల నామాలు**

ప్రాఙ్నన్నయ యుగంలో వ్యక్తుల పేర్లు కన్పిస్తున్నాయి.

| <u>శాసన రూపం</u> | <u>నేటి రూపం</u> |
|---|---|
| దోణశమ్మ్ర | ద్రోణశర్మ |

| | |
|---|---|
| పాణ్డురాంగః | పండరంగడు |
| కుప్పనయ్య | కుప్పయ్య |
| కట్టియ | కటయ్య |

**(10) గ్రామ నామాలు**

శాసనాల్లో తెలుగుదేశంలోని ఊర్ల పేర్లు కన్పిస్తున్నాయి.

| | | |
|---|---|---|
| ఉప్పయిపాడు | - | ఉప్పక్టూరు |
| గొల్లపూడి | - | గొట్టిబ్రోయి |
| గుంటూరు | - | తిమ్మాపురం |
| బంగినపల్లి | - | గణశాల (ఘంటశాల) |
| పాణ్డూర | - | కాకణ్డివాడ (కాకినాడ) |

**(11) సంఖ్యా వాచకాలు (Numerals)**

శాసనాల్లో సంఖ్యా వాచకాలు చోటు చేసుకున్నాయి.

| | | |
|---|---|---|
| ఒకటి | - | ఒకొటి, వకొట్టి, ఒక, ఒణ్టు మున్నగు రూపాలు నన్నయకు పూర్వం కన్పిస్తున్నాయి. |
| రెండు | - | రెణ్డు, రెంటికి, ఇరు, ఇన్, ఇన్నది, ఇరువది, ఇరువురు అనే రూపాలు వున్నాయి. |
| మూడు | - | మూను, మూణ్డు, మూడ్, మూటికి, మున్నూరు, మువ్వుర అనే రూపాలు వున్నాయి. |
| నాలుగు | - | నాల్కు, నాలువు, నాలు, నల్వురు అనే రూపాలు వున్నాయి. |
| ఐదు | - | నన్నయకు పూర్వం శాసనాల్లో ఏను రూపం కన్పిస్తుంది. |
| ఆరు | - | అఱు, అఱువది, ఆర్వురు అనే రూపాలున్నాయి. |
| ఏడు | - | ఏఱు, ఏడు రూపాలున్నాయి. |
| ఎనిమిది | - | ఎన్మిది, ఎనుబాది, ఎణ్బొది అనే రూపాలున్నాయి. |
| తొమ్మిది | - | తోంభ, తొంభ. |
| పది | - | పది, పదనూఱ్ఱు. |
| నూరు | - | నూర, నూఱు, నూట, నూర్వురు. |
| వేయి | - | వెయి, వేయి, వెయ్యి, వేయు, వేల్, వేగురు, వేవ్రు, అనే రూపాలు ప్రాఙ్నన్నయ యుగంలో కన్పిస్తున్నాయి. |

**(12) క్రియలు (Verbs)**

నన్నయకు పూర్వ యుగంలో తెలుగు శాసన భాషలో క్రియలు మూడు రకాలు.

(అ) సామాన్య క్రియలు - ఇవి దేశ్యాలు. ఏక ధాతుకమైన “అగు” లాంటివి. ఉదా ॥ అగు, అమ్ము.

(ఆ) సంకీర్ణ క్రియలు - నామ ప్రాతిపదికపైన క్రియ కారక ప్రత్యయం చేరి ఏర్పడినవి. ఇవి అన్య దేశ్యాల్లోనూ, దేశ్యాల్లోనూ

వున్నాయి. ఉదా॥ కట్టించి, చెల్లించు, అనుభవించు.

(ఇ) సమస్త క్రియలు - సమస్త క్రియలు మరల రెండు రకాలు.

- క్రియా ప్రాతిపదిక మీద మరో క్రియా పదాంశం చేరి ప్రత్యేకార్థాన్ని ఇచ్చేవి. ఒక రకం సమస్త క్రియలు.

ఉదా॥ నడపంగల, కట్టబడిన.

- నామ ధాతువు మీద అనుబంధ క్రియ చేరి ఏర్పడినవి మరో రకం సమస్త క్రియలు.

ఉదా॥ చేకొని, దయసేయు, నుతికెక్కు.

(ఈ) సమాపక క్రియలు - సమాపక క్రియా రూపంలో ధాతువుపైన కాలబోధక ప్రత్యయం. దానికి సర్వనామ ప్రత్యయం చేరుతుంది. ఉదా ॥ వచ్చెను, వచ్చును.

భూతకాలిక ప్రక్రియ - శాసనాల్లో ఇ, ఇతి, ఇన్, ఇయె, ఎ అనే పదాంశాలు భూతకాలిక ప్రత్యయాలుగా కన్పిస్తున్నాయి.

ఉదా ॥ ఇచ్చిరి, పడియె, పోయె, సొనెదా

వర్తమాన ప్రక్రియ - శత్రర్థ క్రియలకు 'ఉండు' ధాతు రూపాల్ని చేర్చిన వర్తమాన క్రియారూపాలు కన్పిస్తున్నాయి.

ఉదా॥ రాజ్యము సేయుచున్న

వార్ద్రిఁ లుచునుణ్డ.

భవిష్యత్క్రియ - ధాతువు యొక్క తు మర్థక రూపాల్ని ప్రాతిపదికగా తీసుకుని దాని మీద అసంపూర్ణ క్రియ అయిన 'కల' ను చేరిన భవిష్యత్ క్రియలు శాసనాల్లో కన్పిస్తున్నాయి.

ఉదా॥ ఓ యంగల, పొయ్యగల, 'కల' స్వతంత్ర క్రియగా కూడా శాసన భాషలో కన్పిస్తుంది.

ఉదా॥ కలయంతకును.

కర్మణి ప్రయోగం - సంస్కృత భాషా ప్రయోగం వల్ల తెలుగులో చేరిన కర్మణి ప్రయోగాలు గల వాక్యాలు మూడు క్రీ.శ. 9వ శతాబ్ది నుంచి కన్పిస్తున్నాయి. అవి ఇవి.

ఉదా॥ పట్టం కట్టబడిన వాన్డు
అతని చేయంబడిన ధమ్మ్రువు
వైదురంబుళ చేతంబట్టం కట్టిబడియేలి

తద్ధర్మాద్ధక రూపాలు - తు, దు, డు, ఉన్, అనే సపదాంశాలు తద్ధార్మార్థక ప్రత్యయాలుగా కన్పిస్తాయి.

ఉదా॥ కాస్తురు, ఉణ్డుదురు, కొణ్డు, ఏళేవారు.
ఆగు, ఏడి, ఎడు, ఏ, ఏటి అనే సపదాంశాలు తద్ధార్మార్థక విశేషణ ప్రత్యయాలు శాసనాల్లో కన్పిస్తున్నాయి.

(ఉ) అసమాపక క్రియలు

శత్రర్థక - చేదర్థక - విధ్యర్థక - క్త్వార్థక - తుమర్థక ప్రార్థనాద్యర్షక రూపాలు శాసనాల్లో కన్పిస్తున్నాయి.

శత్రర్థక రూపాలు - ధాతువుకి 'చు' ప్రత్యయం చేరిన శత్రర్థక రూపాలు కన్పిస్తున్నాయి.

ఉదా॥ రాజ్యము సేయుచున్న.

చేదర్థక రూపాలు - ప్రాతిపదికకు 'ఇనన్' చేరిన చేదర్థక రూపాలు ఏర్పడటం శాసనాల్లో కన్పిస్తున్నాయి.

విధ్యర్థక రూపం - నడుపునది.

(ఊ) అకర్మక - సకర్మక క్రియలు

అకర్మక ధాతువుపై 'చు' ప్రత్యయం కానీ 'ఇంచు' ప్రత్యయం కానీ చేరిన సకర్మక క్రియలు ఏర్పడతాయి. ఆకర్మక ధాతువులోని చివరి చు, పు గా మారినప్పుడు కూడా సకర్మక క్రియలు ఏర్పడతాయి.

ఉదా॥ చెఱిచిన, రావించి, చమ్మిన.

(ఎ) ప్రేరణార్షకాలు

సకర్మక ధాతువులతో 'ఇంచు', -వు ప్రత్యయాలు చేరడం వల్ల ప్రేరణార్థకాలు ఏర్పడతాయి.

ఉదా॥ కట్టిఞ్చి, కావిఞ్చి

సకర్మక ధాతుగతమైన 'చ' కారానికి 'ఏ' కారా దేశం వచ్చి కూడా ప్రేరణ రూపాలేర్పడతాయి.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | పనుచు | - | పంపు |
| | నడచు | - | నడిపించు (ఇంచు) |
| | ఇచ్చు | - | ఇప్పించు (ఇంచు) |

(ఏ) కృత్ప్రత్యయాలు

క్రియా ధాతువులకు కృత్ప్రత్యయాలు చేరి అర్థాంతరాన్ని తెలిపే కృదంత రూపాలు ఏర్పడతాయి. శాసన రూపాల్లో అము, ఇక, లు, పు, వు, అన్ కృత్ప్రత్యయాలు కన్పిస్తున్నాయి.

ఉదా॥ కూటము, వాడిక, కొల్వు.

(ఐ) తద్ధిత రూపాలు

నామ ధాతువులకు తద్ధిత ప్రత్యయాలు చేరడం వల్ల అర్థాంతరాన్ని తెలిపే తద్ధిత రూపాలు ఏర్పడతాయి. నన్నయకు పూర్వం శాసనాల్లో అరి, ఇక, ఇకము, కాఱు, గార్ అనే తద్ధిత ప్రత్యయాలు కన్పిస్తున్నాయి.

అ. 'అరి' ప్రత్యయం చేసేవాడు అనే అర్థంలో వస్తుంది.

ఉదా॥ తలవరి, కమ్మరి.

ఆ. 'ఇక' ప్రత్యయం 'స్వార్థం' లో వస్తుంది. ఉదా॥ మానిక.

ఇ. 'ఇకము' ప్రత్యయం "సమూహార్థం" లో వస్తుంది.

ఈ. "కాఱు" ప్రత్యయం కలవాడు అనే అర్థంలో వస్తుంది.

ఉదా॥ నింబంధకాఱు, అంకకాఱు, వ్రిత్తికాఱ్.

**(13) విభక్తులు (Cases)**

(అ) ప్రథమా విభక్తి.

| | | |
|---|---|---|
| డు. | శాసన రూపం | నేటి రూపం |
| | పుత్రున్డు | పుత్రుడు |
| | మగన్డు | మగడు |
| | ఇచ్చినవాన్డు | ఇచ్చినవాడు |

'డు' వర్ణం లేని రూపాలు కూడా శాసనాల్లో కన్పిస్తున్నాయి.

| | | |
|---|---|---|
| ఉదా॥ | పణ్డరఙ్గ | పండరంగడు |
| బు. | శాసన రూపం | నేటి రూపం |
| ఉదా॥ | పట్టిన పబున | పట్టినమున |
| | వక్రబు | వక్రము |
| | రాజ్యంబున | రాజ్యమున |

వు. సాసనవు.

ళు. బహువచన ప్రత్యయమైన 'లు' కు బదులుగా శాసనాల్లో ళు, ళ్ల ప్రయోగం కన్పిస్తుంది.

| | | |
|---|---|---|
| ఉదా॥ | శాసన రూపం | నేటి రూపం |
| | తోటళు | తోటలు |
| | చెఱువుళు | చెఱువులు |

అ. ద్వితీయావిభక్తి.

పాఱను గంద్రత్రి నేత్రిని
రేనాణ్డం (రేనాటిని)

ఇ. తృతీయావిభక్తి.

ఒకనాడు చోళచేత శవణ గొణిరి

వారి చేత పట్టంకట్టి బడిన వాన్డు
రాముని తోటి సామత్త పడువతో
నొట్టించి తోటి కయ్యము.

ఈ. చతుర్థీ విభక్తి.

సముద్రంకై నాకు బణి సేసిన
నాధునికి
అరదివి యకు

ఉ. పంచమీ విభక్తి

గద్యంబు వలన
చేంబ్రోలను ణ్డి

ఊ. షష్ఠి విభక్తి

షష్ఠి సూచకమైన ప్రత్యేక విభక్తి ప్రత్యయం కన్పించదు. ద్వితీయాది విభక్తులనే షష్ఠి విభక్తులుగా వాడారు.

ఋ. సప్తమీ విభక్తి.

మహిమిన్వ, ముత్తుళూరిన్, ఊఢ్లందు, ఒక విభక్తికి చెందిన ప్రత్యయాలు వేరొక విభక్తి రూపంలో వాడటం శాసన భాషలో అన్ని కాలాల్లోనూ కన్పిస్తున్నాయి.

**(14) ఔప విభక్తికాలు (Augments)**

ఇ, ట్, త్ అనేవి ఔప విభక్తిక ప్రత్యయాలుగా శాసనాల్లో కన్పిస్తున్నాయి. ఔప విభక్తికాలు చేరిన పదాలు చేరని పదాలు కూడా శాసన భాషలో వున్నాయి.

ఉదా॥ చిఱుంబూరి
నూఱింటికి
విత్తఱ్ఱు

'నూయిని' లాంటి ఔప విభక్తిక ప్రత్యయాలు చేరని రూపాలు కూడా కన్పిస్తున్నాయి.

**(15) పదజాలం (Vocabulary)**

ప్రాఙ్నన్నయ యుగ భాషా స్వరూపాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవాలంటే శాసనాల్లోని శబ్దజాలం కూడా పరిశీలించ వలసి వుంది. ఇప్పుడు మనం వాడుతున్న అనేక రూపాలు ప్రాచీన కాలంలో కూడా వున్నాయి.

| ఉదా॥ | శాసన రూపం | నేటి రూపం |
|---|---|---|
| | ఎఱుంబొది | ఎనిమిది |

| | |
|---|---|
| పణి | పని |
| నాఱ్టు | నాడు |
| సోళ | చోళ |

**(16)** **బహువచనం (Plural Number)**

(అ) ప్రాతిపదికకు 'డు' ప్రత్యయం చేరి మహన్మహతీ బహువచన రూపం ఏర్పడడం శాసన భాషలో కన్పిస్తుంది.

(ఆ) కొన్నిసార్లు మహాదేకవచనంపై 'రు' ప్రత్యయం చేరి బహువచన రూపం ఏర్పడుతుంది.

ఉదా॥ వా(ణ్డు

(ఇ) మహదమ హత్తులకు బహువచన ప్రత్యయంగా 'లు' కన్పిస్తుంది.

ఉదా॥ తమ్ములు, వేలు.

(ఈ) 'లు' కు పూర్వ రూపం 'ళు' 7వ శతాబ్ది నాటికి 'ళ' కారం 'ల' కారంగా మారింది. ఇది ప్రాచీన బహువచన ప్రత్యయమైన 'కళ' కి రూపాంతరం బహువచన 'లు' ప్రత్యయం శాసనాల్లో పూజ్యార్థంలో కన్పిస్తుంది. ఉదా॥ దేవులు, గురులు.

(ఉ) 'కాలు' అనేది శాసనాల్లో గౌరవ బహువచనంగా వుపయోగించారు. రేవణకాలు, పుద్దణకాలు.

(ఊ) 'డు' వర్ణాంత శబ్దాలపై బహువచన 'ల' కారం చేరినప్పుడు ళ కారంగా మారలేదు.

గుడి + లు = గుడ్లు, గుళ్ళగా మారలేదు.

ఉదా॥ రట్ట గుడ్లు, వేగుడ్లు.

**(17)** **వాక్య నిర్మాణం (Syntax)**

సాధారణంగా తెలుగు వాక్య స్వరూపం కర్త కర్మ క్రియ ఒక క్రమ పద్ధతిలో వుంటాయి. నన్నయకు పూర్వం శాసనాల్లో కర్త, కర్మ, క్రియలు క్రమం మారడం కూడా కన్పిస్తుంది.

(అ) క్రియా సహిత వాక్యాలు. ఉదా॥ కమ్మరి నిని యణద్రాసె.

(ఆ) క్రియా రహిత వాక్యాలు. ఉదా॥ నీవు నా ప్రాణ సమానుణ్డు వైన చెలివి.

(ఇ) కర్త, కర్మ, క్రియ గల వాక్యాలు. ఉదా॥ శ్రీ సతికి దత్తి హంగుణువుల దీవణయించే

(ఈ) కర్త లేని వాక్యాలు. ఉదా॥ వాన పోతుల ముచ్చియకు. ఇచ్చిరి - నేల.

(ఉ) కర్మ లేని వాక్యాలు. ఉదా॥ కఙ్చుగార్లు కొట్టిరి. ప్రభు రాముణ్డు కోఱచె.

(ఊ) వాక్యాంతంలో కర్త. ఉదా॥ గణ్డర ముత్రాజు పొడిచి పది. యెఱోజ్కు్ళాకు.

మల్లణ్డేతించె గుడియ మఠంబునంగార్తి చేయునకు.

(ఎ) విశేష్యం - విశేషణం. ఉదా॥ శ్రీ యుద్ధమల్లుణ్డెత్తించె నమిత తీజుండు నిల్పె నిద్దమయ్య విప్రకవచమ్బు.

(ఏ) కర్మణి ప్రయోగం (Passive Voice)

సంస్కృత ప్రభావం వల్ల తెలుగు లోకి వచ్చిన కర్మణి ప్రయోగం గల వాక్యాలు మూడు మాత్రమే కన్పిస్తున్నాయి.

ఉదా॥ పట్టం కట్టబడిన వాన్డు
వైదుంబుళ చేతం బట్టం కట్టబడి యేలి
అతని చేయంబడిన దమ్మృతపుల

(ఐ) యత్తదర్థక ప్రయోగం

సంస్కృత ప్రభావం వల్ల తెలుగు లోకి వచ్చిన యత్తదర్థక ప్రయోగం గల వాక్యాలు నాలుగు మాత్రమే శాసన భాషలో కన్పిస్తున్నాయి.

ఉదా॥ నీకేమి వలయు దాని వేణ్డికొమ్మ
ఎవ్వణ్డేని రక్షిఞ్చు వానిద ధర్మువు

**(18) వ్యావహారిక తెలుగు పదాలు**

ఈనాడు వ్యవహారంలో వున్న పదాలు శాసనాల్లో కూడా చోటు చేసుకున్నాయి. ఉదా॥ ఇస్తిమి, చేస్తిమి.

ఈ రీతిగా ప్రాఙ్నన్నయ యుగ తెలుగు భాషా స్వరూపాన్ని విశ్లేషించవచ్చు.

నన్నయ తరువాత శాసన భాషలో చెప్పుకోదగిన మార్పులు కొన్ని వచ్చాయి. అందులో ముఖ్యమైంది ఱ వర్ణం క్రమముగా అంతరించి పోవడం. అప్పటికే భాషనుండి జారిపోతుండిన ఱ వర్ణం. ఈ కాలంలో పూర్తిగా తొలగిపోయింది అని చెప్పవచ్చు. ఈ కాలం శాసనాలలో చకారం దేశి వ్యవహారంలో కనిపిస్తుంది. ఇచ్చిరి సమర్పించిరి. చ కారానికి దంత్యతాలవ్య ఉచ్చారణలు ఉండేవి. వుత్పుకొని, వుచ్చుకొని.

అకార ఎకారముల మార్పు కనిపిస్తుంది. విజేయువాడ, యెథోచిత, శెంఖు - అ > ఎ. ఎ > అ, యఱ్యనఁ యవ్వరు, యట్లు, యనక.

శాసన భాషలో 'ఋ' సాధారణంగా 'రి' అవుతుంది. రిషభ, ఈ యుగంలో ఋ 'రు' గా కూడా మారింది. పిత్రు, ప్రదివి, రుతు - ఇవి, ఇవి పితృ, పృథివి, ఋతు అని ఉండాలి.

యకారం పరమైతే పదాది ఎ ఏ లు రెండు కనిపిస్తాయి. వేయి, వెయి, నేయి - నెయి. ఈ అనే విశేషణం పర హల్లు ద్విత్వం కాకుండానే హ్రస్వమవుతుంది. ఇదీపము, ఇతోణ్టపట్టు.

రేఫకు పరమయ్యే హల్లులు ద్విత్వాలయ్యేవి. నవ్వన్, చక్రవత్తికి రే చెల్లన్, రేఫ లోపించడం కూడా తరచుగా జరిగేది. అఖండవత్తిఁ , సమప్పించు, కొన్ని శాసనాల్లో శకట, సాధురేఫలు తారుమారు అయ్యేవి. కూతుఱు, నాయకుఱాలు, తాలవ్యాచ్చు పరమౌతుండగా న > శ గా మారేది. వడిశిన, చేశిన, శీతాదేవి. బహువచనంలోడ్ల, ళ్ల రూపాలు రెండూ కన్పిస్తాయి. మాడ్లు, మూడ్లు, మూళ్లు, గుళ్ళు (గుడ్లు) ఈ యుగం నాటికి తెలుగు పూర్తిగా అజంతమైంది. పదాంతంలో ముపర్ణ స్థానంలో అనుస్వారం కనిపిస్తుంది. మాసం, రక్తం వ్యాకరణ విరుద్ధమైన సంధి ప్రయోగాలు కనిపిస్తాయి. తమన్న (తమ + అన్న) మహాదేవైన (దేవి+ఐన)

యడాగమం కొన్నిసార్లు రావచ్చు, రాకపోవచ్చు. కుంభ మాసము, యమావాస్య, నత్త్యైరాజు, యిచ్చిన.

ఈశ్వర శబ్దం పరమయ్యేటప్పుడు గుణసంధికి బదులు తెలుగు సంధి జరిగేది. భీమేశ్వర, నీలీశ్వర, మల్లీశ్వర.

బహువచన 'లు' పరమయ్యేటప్పుడు ము వర్ణాంత పదాలలో ము వర్ణం లోపించి తత్పూర్వ వర్ణం దీర్ఘమయ్యే ప్రక్రియ స్థిరపడింది. కరణాలు, దేశాలు.

పదాది హల్లుతో రేఫ సంయుక్తమై ఉంటే అట్టి చోట్ల రేఫకు లోపం జరుగుతుంది. కొత్త కింది మొ॥వి దీర్ఘం తర్వాత య కారానికి ద్విత్వమూ, దీర్ఘానికి హ్రస్వమూ తరచుగా కనిపిస్తున్నాయి. నెయ్యి, వెయ్యి, చెయ్యి, పొయ్యంగలారు, ఇయ్యంగలారు. ద్విరుక్తాలు అద్విరుక్తాలు కావడం తరచుగా కనిపిస్తుంది. సోమారెడ్డి, పెరుమాళకు, పళెమున్ను, ఇచి, వుచుకొన్న.

చేదర్థకంలో ఇనన్ ప్రత్యయం వాడబడేది. క్రమంగా దీని స్థానంలో ఇతేను, తేను కనిపిస్తాయి. ఉదా॥ వేస్తేను, అంపితేను.

శత్రర్థకంలో చున్ స్థానంలో తు, తున్ను చేరసాగాయి.

ఉదా॥ పాలిస్తున్న, విచ్చేస్తున్న.

ము వర్ణానికి వంపులు రావడం విరివిగా జరిగింది. వుత్తరపు దిక్కు, నారికేళవుంగాయలు.

ఈ విధంగా శాసన భాష ఎప్పటి కప్పుడు మారుతూ వచ్చింది. కాని కావ్య భాషలో నన్నయ భాషకు తరువాత వచ్చిన కావ్య భాషకూ మార్పు అంతగా లేదు. పరిణాయ శీలమైన వ్యావహారిక భాషకు దగ్గరగా సాగిన శాసన భాషా పరిణామంలో మార్పులు సహజమే.

## 18.2 కావ్య భాషా పరిణామం

తెలుగు వాఙ్మయంలో మనకు లభిస్తున్నంత వరకు మొట్ట మొదటి గ్రంథం "భారతం". ఈ గ్రంథం సంస్కృత భారతానికి అనువాదం. దాన్ని అనువదించిన వాడు నన్నయ. అంటే తొలి తెలుగు అనువాదకవి నన్నయ అన్నమాట. నన్నయ కాలం క్రీ.శ. 1020-1060. నన్నయ, భారతంలోని కొంత భాగాన్ని మాత్రమే రాశాడు. మిగిలిన భాగాన్ని తిక్కన, ఎర్రన పూరించారు. ఈ ముగ్గురిని కవిత్రయమని పిలుస్తారు. కవిత్రయ కాలం 11-14 శతాబ్దాల నడుమ. నన్నయ, తిక్కన మధ్యలో శివకవులు వున్నారు. కావ్య భాషలో 14-16 శతాబ్దాల నడుమ ఎక్కువ భేదాలు లేవు. అంచేతనే భాషా శాస్త్రజ్ఞులు క్రీ.శ. 1000 నుంచి 1600 వరకు "కవిత్రయ భాషా యుగం"గా వ్యవహరించారు. కవిత్రయ కావ్య భాషలోని శైలికి అనంతర కావ్య భాషలోని శైలికి చాలా తేడా కన్పిస్తుంది. "తెలుగు భాషా చరిత్ర" లో 1600 - 1900 మధ్య కాలం పరిణామాత్మకమైంది. ఈ కాలంలో అనేక నూతన సాహితీ ప్రక్రియలు వెలువడ్డాయి. భౌగోళికంగానూ, రాజకీయంగానూ ఈ కాలంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ ప్రభావం కావ్య భాషపై పడింది. పై మార్పులు ఈ కింది అంశాల ద్వారా తెలుసుకుందాం.

### (1) వర్ణ నిర్మాణం

11-19 శతాబ్దాల మధ్య కాలంలో వున్న కావ్య భాషని నిశితంగా పరిశీలిస్తే ఈ కింది భాషా ధ్వనులు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

### ఎ. అచ్చులు

అచ్చులు 16. 14 + 2 = 16. అవి ఇవి. అ, ఆ, ఇ, ఈ, ఉ, ఊ, ఋ, ౠ, ఌ, ౡ, ఎ, ఏ, ఒ, ఓ, ం. ఈ పద్నాలుగు

వర్ణాలు 11 - 15 శతాబ్దాల్లో కన్పిస్తున్నాయి. పైన చెప్పిన పద్నాలుగు వర్ణాలే కాక ఐ, ఔ వర్ణాలు కూడా 16వ శతాబ్దం నుంచి కనబడుతున్నాయి.

**(బి) హల్లులు**

హల్లులు 35. అవి ఇవి.

క, ఖ, గ, ఘ, ఙ,

చ, ఛ, జ, ఝ, ఞ,

ట, ఠ, డ, ఢ, ణ,

త, థ, ద, ధ, న,

ప, ఫ, బ, భ, మ,

య, ర, ఱ, ల, ళ, వ, శ, ష, స, హ.

**(సి) ధ్వని విశేషాలు**

(అ) అచ్చుల్లో ఋ, ౠ, ౡ, లు హల్లులలో మహా ప్రాణ వర్ణాలు. ఖ. ఛ, ఠ, ధ, ఫ, ఘ, ఝ, ఢ, ధ, భ, శ, ష, లు సంస్కృత సమూల ద్వారా తెలుగున ప్రవేశించాయి.

(ఆ) దేశ్యాల్లో 'అ ఇ' లు, 'అ ఉ' లు సన్నిహితంగా ఏకవర్ణ స్ఫూర్తి కలిగేట్టు ఉచ్చరించబడగా ఏ, ఔ లు ఏర్పడ్డాయి. ఉదా॥ అయిదు - ఐదు. అవును - ఔను. అంతే కాని ఇవి ఈ భాషకు సహజ ధ్వనులు కావు. సంస్కృతానికివి సహజాలు. ఐరావతము, ఔషధము.

(ఇ) ఙ, ఞ లు వాని వర్గాక్షరాలకు ముందే వస్తాయి. సంయుక్తంలోనే కాని వ్యస్తంగా వానికి ప్రయోగం లేదు.

(ఈ) వర్గాక్షరానికి ముందు వచ్చే వర్గాను నాసికం అనుస్వారంగా వ్రాయటం సంస్కృత భాషా ప్రభావం వల్ల కలిగింది. కాబట్టి దేశ్య శబ్దాల్లో అనుస్వారానికి వర్గాను నాసికం విలువయే ఉన్నది. తద్భిన్నోచ్చారణం సంస్కృత శబ్దాల్లో కానవస్తుంది. ఉదా॥ సంయమి, సంహారము.

(ఉ) (ః) విసర్గ - అనగా శ్వాసహకారం. తెలుగున పద మధ్యంలోనే వస్తుంది. ఉదా॥ దుఃఖము, అంతఃకరణము.

**(2) వర్ణోచ్చారణ విశేషాలు**

**(అ) ఋ, ౡ.**

ఇవి తత్సమాల ద్వారా తెలుగు భాషలోకి ప్రవేశించాయి. నన్నయ రచనలో 'ఋ' కారం 'రి' గా ఉచ్చరించబడేది. కనుకనే ఋ - రి లకు యతి మైత్రి పాటించాడు.

ఉదా॥ ఋత్విజుండని విచారించి పూజించితే (1-2-11)

12వ శతాబ్దం నుంచి 'ఋ' కి 'రు' ఉచ్చారణ కలిగింది.

ఉదా॥ "ఋరువర్ణ దేహంబు ఋగ్వేదమునకు"
- (పాల్కురికి సోమన, సం. చ.)

"సప్తఋషులైరి వారు మరుద్గణంబునకు"
- (తిక్కన - శ.ప. 2 - 160)

(ఆ) ర - ఱ.

నన్నయ రచనలో రేఫ శకట రేఫలు ప్రత్యేక వర్ణాలు. ఈ కాలంలో రెండూ ఒకటి కాదు. మీదు మిక్కిలి ఉచ్చారణలో కూడా తేడా కన్పిస్తుంది. నన్నయ తరువాత 'ఱ' కారం తన ప్రత్యేక ఉచ్చారణాన్ని కోల్పోయింది.

(ఇ) క్ష.

నన్నయ భారతంలో 'క' కారోచ్చరణకే ఎక్కువ ప్రాముఖ్యం వుంది. అంచేత క, ఖ, గ, ఘ లతో నన్నయ యతి మైత్రి వాడాడు. నన్నెచోడుడు మొదలైన వారి కావ్యాల్లో క, ష లు రెండింటికి యతి మైత్రి వుంది. ఇక్కడ మనం అర్థం చేసుకోవలసింది ఏమంటే క్ష కారోచ్చారణలో చాలా మార్పు వచ్చిందని.

(ఈ) జ్ఞ.

నన్నయ దీన్ని క, చ, ఛ, జ, ఝ లతో యతి కలపగా, తిక్కన 'క' కారంతో యతి కలిపాడు.

(ఉ) దీర్ఘం మీద అనుస్వారం.

నన్నెచోడుని రచనలో దేశ్యపదాలు దీర్ఘాల మీద ప్రాస స్థానంలో పూర్ణానుస్వార రూపాలు కనబడుతున్నాయి.

అ. ఉదా॥ మీంగు నపార సత్వగుణ విస్ఫురణం
బరమేశ్వరోరునా, మాంగము నందు .... (కుమార సంభవం 1 - 14)

ఆ. దేశ్య పదాల్లో దీర్ఘం మీద అనుస్వారాన్ని తేల్చి పలికేవారు. ఉదా॥ నాఁడు, మూఁడు.

**(3) ధ్వనుల పరిణామం**

(అ) లోప దీర్ఘత

నన్నయ దీన్ని ప్రయోగించలేదు. వ్యవహార ప్రాచుర్యాన్ని బట్టి తిక్కన మొదలైన వారు అక్కడక్కడ వాడారు.

ఉదా॥ మరాకుము - మరువకుము (భారతం - ఉద్యోగ పర్వం)
సాము - సగము (నన్నెచోడుడు - కుమార సంభవం)
మాజనము - మహాజనము (బసవ పురాణం - పాల్కురికి సోమన)

(ఆ) ఇయి - ఎ

నన్నయ రచనలో అక్కడక్కడ కన్పించే ఇయంత రూపాలు నన్నెచోడుడు మొదలైన కవుల్లో ఎక్కువగా కన్పిస్తున్నాయి. అయినా ఎత్వ రూపాలు కూడా చోటు చేసుకున్నాయి.

| | | | | |
|---|---|---|---|---|
| ఉదా॥ | గద్దియ | - | గద్దె | (భారతం) |
| | పల్లియ | - | పల్లె | (భారతం) |
| | మల్లియ | - | మల్లె | (కుమార సంభవం) |

(ఇ) డ - ద

వర్ణ వ్యత్యయం వల్ల ప్రాఙ్నన్నయ యుగంలో దేశ్య పదాల్లో పదాది 'డ' కారం ఏర్పడింది. ఆ రూపాలు నన్నయ కాలం నుంచి దకారాది పదాలుగా మారడం వుంది. కావ్యాల్లో డ, ద రెండు రూపాలూ కన్పిస్తున్నాయి.

| | | | | |
|---|---|---|---|---|
| ఉదా॥ | డప్పి | - | దప్పి | (నన్నయ) |
| | డాచు | - | దాచు | (నన్నయ) |
| | డాయన్ | - | దాయన్ | (నన్నెచోడుడు) |

**(ఈ) వర్ణవ్యత్యయం**

ఉచ్చారణలో తడబాటుల వల్ల కానీ, తొందరపాటు వల్ల కానీ, కలిగిన రూపాలు కావ్య భాషలో కన్పిస్తున్నాయి.

ఉదా॥ నవ్వుటాల - నవ్వులాట (తిక్కన - భారతం - ఉద్యోగ 3-116)

(ఉ) వర్ణ సమీకరణం

నన్నయ 'మహా భారతం' లోని 'గరుడడు' అనే పదం తర్వాత కాలంలో 'గరుడుడు' అయింది.

(ఊ) వర్ణ వినిమయం

| | | | | |
|---|---|---|---|---|
| ఉదా॥ | పగలు | - | పవలు | (గ - వ) |
| | తీఁగ | - | తీఁగె | (అ - ఎ) |
| | అడగు | - | అణగు | (డ - ణ) |
| | తెంకాయ | - | టెంకాయ | (త - ట) |

(ఎ) పదాది హల్లోపం

పదాది హల్లోపం వల్ల ఒకే రూపం హలాది గానూ, అజాది గానూ కన్పిస్తుంది.

| | | | | |
|---|---|---|---|---|
| ఉదా॥ | నీల్గి | - | ఈల్గి | (కుమార సంభవం) |
| | నెగయు | - | ఎగయు | (కుమార సంభవం) |

**(4) తత్సమ రూప విధానం**

**(అ)** కొన్ని పదాలకు ప్రాఙ్నన్నయ యుగంలో లేని లింగ బోధక ప్రత్యయాలు చేరాయి.

| | | |
|---|---|---|
| ఉదా॥ | పాఱ | (ప్రా. యుగం) |
| | పాఱడ | (నన్నయ యుగం) |

**(ఆ)** నన్నయ భారతంలో వాల్మీకి, దాసి, ద్రోహి, బాలిక లాంటి రూపాలు వుంటే, నన్నెచోడుడు మొదలైన కవుల్లో వాల్మీకుడు, దాసుడు, ద్రోహుడు, బాలకి లాంటి రూపాలు కన్పిస్తున్నాయి.

(ఇ) తత్సమాల విషయంలో నన్నయ భాషలో నాకు, జగము, మిత్రుడు, పాత్రుడు అనే రూపాలు వుండగా, నన్నెచోడుడు మొదలైన కవుల్లో నాక్కు, జగత్తు, మిత్రము, పాత్రము లాంటి రూపాలున్నాయి.

(ఈ) దేశ్య పదాల్లో నన్నయ యుగంలో 'కూతు' ప్రథమా ఏక వచన రూపం. కూతులు, కూతులను అన్నట్లు ప్రథమా, ద్వితీయ బహువచన రూపాలుంటాయి. కానీ తిక్కన కాలానికి 'రు' వర్ణంతో వున్న 'కూతురు' రూపం మీదనే బహువచన ప్రత్యయంతో బాటు ఇతర విభక్తి ప్రత్యయాలు చేరి కనబడుతున్నాయి.

ఉదా॥ కూతుండ్రు, కూతురులు, కూతురిని.

(ఉ) బహువచన రూపాల్లో ము వర్ణలోపం, పూర్వ స్వర దీర్ఘం కలిగిన రూపాలు నన్నయ "భారతం"లో లేవు. అయితే తిక్కన శ్రీనాధుని రచనల్లో కన్పిస్తున్నాయి.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | ముత్యాలు | - | భారతం |
| | కళ్యాలన్ | - | భారతం |

(ఊ) అరుహున్, కలుహారగంధి వంటి అర్థ తత్సమ రూపాలు నన్నెచోడుని "కుమార సంభవం" లో కన్పిస్తున్నాయి. కవిత్రయం వారు ఇలాంటి రూపాల్ని వాడలేదు.

(ఎ) కొన్ని పదాల స్వరూపంలో కూడా పరిణామం వచ్చింది.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | పొదరు | - | (నన్నయ) |
| | పొద | - | (తిక్కన) |

(5) క్రియా ప్రణాళిక

(అ) నన్నయ, నన్నెచోడుని 'చు' కారాంత ధాతువులు కొన్ని 'యు' కారాంతాలు అయ్యాయి.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | వేచు | - | వేయు |
| | త్రోచు | - | త్రోయు |

(ఆ) 'వలయు' వంటి క్రియను కవిత్రయం వారు ప్రధాన క్రియగా ప్రయోగించారు.

ఉదా॥ పోయి రావలయు మాకు (భారతం, 5-142)

(ఇ) నన్నయ, నన్నెచోడాది రచనల్లో కొన్ని ధాతువులు ఎలాంటి రూపభేదం లేకుండానే అకర్మక, సకర్మక క్రియలుగా వాడబడ్డాయి.

ఉదా॥ కురియు, అంగార వృష్టి గురియుచు (భారతం 1-7-107)

వాన - గురిసి (భారతం)

తర్వాత కాలంలో కురియు, కురియించు, కురిపించు లాంటివి ప్రత్యేక ప్రత్యయాలు చేరిన రూపాలు ఏర్పడ్డాయి.

(ఈ) నన్నయలో 'పండినవాడు' వంటి రూపాలు చోటు చేసుకుంటే, తిక్కనాదుల్లో 'పండినాడు' లాంటి రూపాలు కన్పిస్తున్నాయి.

(ఉ) నన్నయ, నన్నెచోడులలో భవిష్యత్ క్రియలు ఎక్కువ, నన్నెచోడునిలో ఒకే ఒక ప్రయోగం 'కల' అనుబంధంతో కనబడుతుంది.

ఉదా॥ మిమ్ము గొల్వఁ గలవాడున్ (కుమార సంభవం 7-134)

(ఊ) భూత, తద్ధర్మార్థక సంపూర్ణ క్రియల్లో ఉత్తమ పురుష ఏకవచనంలో సర్వనామ ప్రత్యయాలు చేరని రూపాలు నన్నయ, నన్నెచోడుల్లో ఎక్కువ భూతార్థక క్రియా ప్రయోగాల్లోనూ "కుమార సంభవం" లో 'ని' అనే ప్రత్యయ ప్రయోగం ఒకదానిలో కూడా కన్పించక పోవడం విశేషం.

ఉదా॥ జడుఁడవై, తెట్లు బ్రాహ్మణ జాతిఁబుట్టి ('నైతినెట్లు' అని అర్థం).

(ఎ) నన్నయ కాలంలో 'కలుగు' ధాతువు సకర్మకంగానూ, అకర్మకంగాను వాడబడింది. 14వ శతాబ్దం నుంచి ఈ ప్రయోగం తొలగిపోయి, అది కేవలం సహాయక క్రియగానే వాడబడింది.

(ఏ) పాల్కురికి సోమన "బసవ పురాణం" లో ఉభయ ప్రార్థనంలో చూసండు / చూతము / చెప్పుదండు / చెప్పుదము లాంటి రూపాలు కనబడుతున్నాయి.

ప్రబంధ యుగంలోనూ, అనంతర కాలంలోనూ కావ్య భాషా క్రియా రూపాల్లో చాలా వైవిధ్యం కన్పిస్తుంది.

1. సమాపక క్రియ
2. అసమాపక క్రియ
3. ఇతర క్రియా రూపాలు

(1) సమాపక క్రియలు

నేడు తెలియు, విడుచు, చంపు, రూపాలకు తెలుసు, నిడుసు, సంపు అనేవి వ్యావహారిక రూపాలు మొదటిది శిష్ట వ్యవహారంలోనూ మిగిలిన రెండు సామర వ్యవహారంలోనూ వున్నాయి. ఈ రెండు రకాల రూపాల్ని ప్రబంధ కవులు ప్రయోగించారు.

ఉదా॥ మాటలు, సూచి వచ్చినారు.
తెలుసు, విరుసు, సంపు / షట్చక్రవర్తి చరిత్రము.

సమాపక క్రియలోని భేదాలు.

(ఎ) వర్తమాన క్రియలు
(బి) భవిష్యత్ క్రియలు
(సి) తద్ధర్మార్థక విశేషణాలు
(డి) ఉభయ ప్రార్దనం.

(ఎ) వర్తమాన క్రియలు.

మెఱచుచు / మెఱయుచు / ఈ రూపం దక్షిణాంధ్ర వ్యవహారంలో వుంది కాకునూరి అప్పకవి "మెఱుపులు మెఱుసుట"

అని వాడాడు.

'వెడలగొట్టుచు' అనే రూపంలోని వెడలు అంతస్సంధి జరిగిన సమీకరణం వల్ల 'వెళ్ళ' అయ్యింది. 'వెళ్ళగొట్టుచు' అనేది శిష్ట వ్యవహార రూపమే కాని లక్షణికులు ఆమోదించిన కావ్య ప్రయోగార్హ రూపం కాదు. అయినా ఈ కాలపు కవులు తమ కావ్యాల్లో వాడారు.

ఉదా॥ వెళ్ళగొట్టింప దలచి

వెళ్ళి, వెళ్ళ దోలిన, వెళ్ళగని.

(బి) భవిష్యత్ క్రియలు

భవిష్యదర్థంలో వచ్చే 'ఎద' ఆగమం బదులు 'ఏను', 'ఈని' 'ఏరు', 'ఏవు' 'ఏము' అనే ప్రత్యయాలు ఆగమాలుగా చేరిన రూపాలు ఈ కాలం కావ్యాల్లో కనబడుతున్నాయి.

ఉదా॥ ఇచ్చేను (ఏను)

వినిపించేరు (ఏరు)

తెచ్చేవు (ఏవు)

చేసేము (ఏము)

(సి) తద్ధార్మార్థక విశేషణాలు

ప్రబంధ యుగ కావ్యాల్లో ఎడి, ఎడు అనే తద్ధర్మార్థక విశేషణాలకు మారుగా వ్యవహారంలో ప్రసిద్ధమైన ఎ / టి / అనే రూపం కనబడుతుంది.

ఉదా॥ ఎదిగేటట్టయితే, నిటకోటి నెనసేటి / ఎ / టి /

తిరిపం బెత్తే వానికి అచ్చట నడిచే వింతలు (ఎ)

(డి) ఉభయ ప్రార్థనం

కావ్య భాషలో ఉభయ ప్రార్థనానికి వచ్చే 'దు' గాగమానికి బదులు / ద / దాము, తము, తాము మొదలైన ప్రత్యయ రూపాలు గల ప్రార్థనాద్యర్థక క్రియలు భిన్న మండలాల్లో భిన్న రూపాంతరాల్లో ప్రచారంలో వున్నాయి. దీనిలో చాలా వరకు నాటి కావ్యాల్లోకి చేరాయి.

ఉదా॥ చూతాముగా (తాము)

వెదకుదాము (ఉదాము)

చందమా (చనుదమా)

(2) అసమాపక క్రియలు

సమాపక క్రియలు లాగే అసమాపక క్రియల్లోనూ ఈ యుగ కావ్య భాషా రూపాల్లో విశేష వైవిధ్యం కన్పిస్తుంది.

అసమాపక క్రియల్లో భేదాలు.

(ఎ) చేదాద్యర్థకాలు

(బి) విధ్యర్థక రూపాలు

(సి) 'అక' ప్రత్యయాంతాలు

(డి) ఇతరార్థకాలు

(ఎ) చేదాద్యర్థకాలు

ఇన / న్ అనే కావ్య భాషా చేదార్థక ప్రత్యయానికి /ఇ / తే / ను / అనేది వ్యావహారిక రూపం. ఈ రూపం ఈ కాలపు కావ్యాల్లో కన్పిస్తుంది.

ఉదా॥ మగవాఁడైతే

అల్లితేనే సరా

మిమ్మంపితే (మిమ్మంపినన్ - కావ్య రూపం)

(బి) విధ్యర్థక రూపాలు

ఈ కాలం కావ్యాల్లో సంప్రదాయ వ్యాకరణ నియమాలకు విరుద్ధమైన వ్యావహారిక స్వరూపం కలిగిన విధ్యర్థక క్రియా రూపాలు కనబడుతున్నాయి.

ఉదా॥ గడియ దీయ్యని (తీయి + అని)

చూడుమటన్న (చూడుము + అటన్న)

(సి) 'అక' ప్రత్యయాంతాలు

ఆత్మనే పదార్థంలో భూతకాలిక అసమాపక క్రియా రూపాల్లో వచ్చే 'కొని' కి, క-కు-కొ అనే పరిణిత రూపాలు చాలా కాలంగా ప్రచారంలో వున్నాయి. ఇందులో కు, మరీ ఆధునిక రూపం. ఈ మూడు రూపాలకు ప్రయోగాలు ఈ యుగ కావ్య భాషలో కనబడుతున్నాయి.

ఉదా॥ ఎత్తుకపోయి, చేతఁబుచ్చక, నిలుపక, అంతక (క)

చూరుబట్టుకు, బుద్దితెచ్చుకు (కు)

కళింగ ప్రాంతానికి చెందిన గోగులపాటి కూర్మానాథకవి 'కు' రూపాలు వాడాడు. 'కొ' రూపం కామినేని మల్లారెడ్డి "షట్చక్రవర్తి చరిత్ర" లో మాత్రమే కనబడుతుంది.

(డి) ఇతరార్థకాలు

వివిదార్థక ప్రత్యయాలు చేరేటప్పుడు అజంత శబ్దాల మీద నిత్యసంధి చేయటం ఈ యుగ కావ్యాల్లో కనబడుతుంది.

అ) సందేహార్థక పదాలు

ఉదా॥ అటో యిటో యెటో

ఎన్నగ పండో కాయో

ఆ) నిశ్చయార్థక పదాలు

ఉదా॥ గ్రహించే యున్నారు.

ఎంతో కరము స్వతిల్ల

ఇ) సంభావ నార్ధక పదాలు

ఉదా॥ అతని వీదిదె బాళియనగుచు నుండి.

ఈ) సముచ్చ యార్థక పదాలు.

ఉదా॥ మఱిమించె

ఎగాదిగ నరసి చూచి

పదివేలయినా

ఉ) అతిశయ ఆధిక్యార్థకాలు

ఉదా॥ చాలానంచకుడు

మిగులానుప్పొంగెడిన్

ఊ) పూరణార్థక పదాలు

ఉదా॥ 'అన', 'ఓ', పందొమ్మిదో ఛందమునకు

**(3) ఇతర క్రియా పదాలు**

(ఎ) ప్రబంధ యుగ కాలంలో స్త్రీ జన వ్యవహారంలో విన్పించే "వినే" వంటి క్రియా రూపాలు కనబడుతున్నాయి.

(బి) సాధారణ సంభాషణాల్లో జరిగే పురుష, వచన, కాల వ్యత్యయాలు ఆ కాలం నాటి కావ్య భాషా రూపాల్లో కనబడుతున్నాయి.

అ) పురష వ్యత్యయం

ఉదా॥ మీరెవ్వరు మేమెవ్వరు (మే మెవ్వరము)

ఆ) వచన వ్యత్యయం

ఉదా॥ ఈ రసమే దోషుల్

(ఈ రసము - ఏకవచనం, దాని విశేషణం దోషుల్ బహువచనంలో వుంది)

ఇ) కాల వ్యత్యయం

ఉదా॥ చూచెదమని వచ్చినారు సుదతీ నిన్నున్

(భూత కాలానికి వర్తమాన రూపం ఇది)

**(6) కారక విశేషాలు**

(ఏ) నన్నయ, నన్నెచోడులు అలుగు, కరుణించు, అనుగ్రహించు మొదలైన క్రియల్లో షష్ఠికారకం వాడారు.

ఉదా॥ యయాతికి నలిగి పౌష్యునకు ననుగ్రహించు (భారతం).

అనంతర కాలంలో కవులు ఇలాంటి సందర్భాల్లో ద్వితీయ కారకం వాడారు.

(బి) అట, ఇట, ఎట అనే ప్రత్యయాల మీద 'క' ప్రత్యయం చేరని విలక్షణ రూపాలు కూడా నన్నయలో కనబడుతున్నాయి.

ఉదా॥ ఇట యేల వచ్చితి.

కావ్య భాషలో అక్కడ, ఇక్కడ, ఎక్కడ మొదలైన పదాలు కన్పిస్తున్నాయి.

ఉదా॥ ఎక్కడం గదల నేరకున్నవాడ.

**(7) సంధి.**

కావ్య భాషలో అచ్చంధి, హల్సంధి రెండూ ఉన్నాయి.

(అ) అచ్చంధి.

నన్నయ 'భారతం' లో క్త్వార్థక ఇ కారానికి సంధి లేదు. తిక్కనలోనూ, శివకవుల్లోనూ ఈ సంధి రూపాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి.

ఉదా॥ పొంగెఱగెడు (పొంగి + ఎఱగెడు) (కుమార సంభవం)

(ఆ) షష్ఠ్యర్థక ఇకారం నన్నయ రచనలో లోపించదు. తిక్కనాదుల్లో లోపిస్తుంది.

ఉదా॥ జమునిల్లు (తిక్కన - భారతం - 2-209)

దీనంఘ్రులు (శ్రీనాథుడు - శృంగార నైషధం)

(ఇ) స్త్రీ వాచక శబ్దాల్లోనూ షష్ఠీ రూపాల్లోనూ, అత్వం లోపించ కుండటం సామాన్య విధి, శివ కవుల్లోనూ, తిక్కనాదుల్లోనూ లోపించిన రూపాలు కనబడుతున్నాయి.

ఉదా॥ అంతవమానము (భారతం సభాపర్వం, 3-203)

(ఈ) అత్తునకు సంధి రాకూడని చోట సంధి చేసిన రూపాలు ఎక్కువగా కనబడుతున్నాయి.

ఉదా॥ ఇక + ఇవి =ఇకివి

కాక + ఈ=కాకి.

(ఉ) ఈ కాలం కావులు క్త్వార్థంబైన ఇత్తునకు సంధి చేశారు.

ఉదా॥ ఒనర్చి + ఒనర్చెటు = ఒనర్చొనర్చెటు

క్రుంకి + అడిగె = క్రుంకడిగె

(ఊ) ఉత్తునకు అచ్చు పరమైనప్పుడు యడాగమం చేసిన రూపాలు కన్పిస్తున్నాయి.

ఉదా॥ బదులు + అనుచు = బదులు యనుచు

(ఎ) ఈ యుగ కావ్యాల్లో వ్యావహారిక సంధి రూపాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి.

ఉదా॥ వెండుంగరము

మెంతాకు

ఎన్నైన

(ఏ) హల్సంధి.

- అచ్చు + హల్లు - ప్రథమ మీద పరుషాలు గసడదవలుగా మారాయి.

ఉదా॥ పెద్దవోయె

ధర్మజుండు దసంబుసేసి (నన్నయ)

తిక్కన కాలం నుంచి చ, త, ప, లకు స, ద, వ లు రాని రూపాలు కావ్యాల్లో కన్పిస్తున్నాయి.

ఉదా॥ రాకపోకలు (భాగ. స్కం. 10)

- హల్లు + అచ్చు - ద్రుత ప్రకృతికాల అచ్చు పరమైనప్పుడు 'న' కారం ద్విత్వం అవుతుంది.

ఉదా॥ నవ్వుల న్నరుల కిచ్చె (కుమార సంభవం, 9-108)

- హల్లు + హల్లు - ద్రుత ప్రకృతికానికి పరుషాలు పరమైనపుడు సరళాలుగా మారాయి.

ఉదా॥ ప్రజఁ బీతి బెంచు చుఁబర నుండ

లంబుల (భారతం, 1-1-7)

ద్రుతానికి 'ను' పరమైనప్పుడు అది మ కారంగా మారింది.

(ఐ) తత్సమ రూపాల్లో సంధులు తెలుగు పద్ధతిలో చేయటం కనబడుతుంది.

ఉదా॥ నిజోషధి / నిజౌషధి (కుమార సంభవం, 1-126)

(ఒ) ప్రబంధ యుగ కావ్యాల్లో హల్సంధులు కనబడుతున్నాయి. ఈ యుగపు కవులు అచే సంధుల కంటే హల్సంధులు వ్యవహారానికి దగ్గరగా వుండేవి ప్రయోగించారు.

ఉదా॥ ఇంట + లోకి - ఇంట్లోకి

రెండు + రాగములు - రెంఁడ్రాగములు

ము ప్రత్యయం మీద పు, ంపు, ఆదేశంగా రాని రూపాలు కనబడుతున్నాయి.

ఉదా॥ బొౘ్కసము + ఇండ్లు - బొౘ్కసమిండ్లు

బాదము + పలుకులు - బాదం పలుకులు

కర్మధారయ సమాసాల్లో ఉత్తునకు అచ్చు పరమైనప్పుడు 'టు' గా గమం రావటం సూత్రం. అది రాని రూపాలు రాయల యుగంలో కనబడుతున్నాయి.

ఉదా॥ పసుపు + ఆకు పందిరి - పసుపాకు పందిరి

**(8) సమాసం**

(అ) విలక్షణమైన సమాస విధానం నన్నెచోడుడు మొదలైన కవుల్లో కనబడుతుంది.

ఉదా॥ సుఖప్రాప్తుండు - ప్రాప్త సుఖుండు (కుమార సంభవం, 10-93)

కవిత్రయ రచనల్లో ఇలాంటి ప్రయోగాలు కనబడవు.

(ఆ) వైరి సమాసాలు శివ కవుల్లో ఎక్కువ గాను, తిక్కన, శ్రీనాథుల్లో అక్కడక్కడ కనబడుతున్నాయి.

ఉదా॥ రాగ దీనియలు, చందన ముద్ద, అమర వేములు - (కుమార సంభవం)

భక్త బండారి, శివమరులు (బసవ పురాణం)

లింగకము, జీవగఱ్ఱ, దిన వెచ్చము (శ్రీనాథుడు)

కావ్య భాషలో నిషిద్ధమైన వైరి సమాసాలు ప్రబంధ యుగంలో కనబడుతున్నాయి.

ఉదా॥ నీటి సంబళులు

మూలబొౘ్కసంబు

శూద్ర బిడ్డ

**(9) విభక్తి విధానం**

(అ) డు, ము, వు, లు అనే ప్రథమా విభక్తి ప్రత్యయాలు నన్నయ నుంచి వున్నాయి.

(ఆ) మెయిన్, మైన్ - నన్నయ తృతీయార్థంలో విభక్తి ప్రత్యయాలుగా ప్రయోగించాడు.

ఉదా॥ రచియింపు మధిక ధీ యుక్తి మెయిన్.

(ఇ) 'గుఱిచి' అనే పదాన్ని నన్నయ ప్రయోగిస్తే తరువాత కవులు గుఱించి, గూర్చి ప్రయోగించారు.

(ఈ) నన్నయ 'తోడ' అనే పదాన్ని వాడాడు.

ఉదా॥ అభిమన్యుడు ధౌమ్యుతోడనేదమంగ యుతముగ జదివె.

(ఉ) నన్నయ నన్నెచోడుని రచనల్లో 'కొఱుకు' లేదు. అయితే 13వ శతాబ్దం నుంచి ఈ ప్రయోగం కావ్యాల్లో కన్పిస్తుంది.

(ఊ) తిక్కన 'కన్నన్' అనే పదాన్ని వాడాడు. నన్నయ ఈ పదాన్ని వాడలేదు.

(ఎ) పంచమీ విభక్తికి ఉదాహరణ.

'జంగమ మల్లయ వరము నందు గనిన వస్తుకవిత' (కుమార సంభవం, 1-49)

ప్రబంధ యుగంలోనూ అనంతర కాలంలోనూ నామ ప్రాతిపదికంపై విభక్తి ప్రత్యయాలు చేరటంలో విశేష వైవిధ్యం గోచరిస్తుంది. అంచేత నామ వాచక రూపాల్లో వైవిధ్యం ఈ కాలపు కవుల్లో అధికం.

(1) ప్రథమా విభక్తి ప్రత్యయాలు.

అ) మహదేక వచన 'డుఙ్' ప్రత్యయం రాకూడని చోట వచ్చిన రూపాలు.

ఉదా॥ నజీరుఁడు.

ఆ) మహదేక వచన 'డుఙ్' ప్రత్యయం రావలసిన చోట్ల రాని రూపాలు.

ఉదా॥ చంద్రు.

ఇ) 'డుఙ్' వర్ణకం 'కా' ప్రత్యయంతో కలసి అనుద్దిష్ట శబ్దాల్లో కనిపించటం మరో విశిష్టత.

ఉదా॥ కాణచి కాండ్లగు, తలారి కాండ్లు.

ఈ) తత్సమ పదాల్లో నిత్యమైన 'వు' గాగమం రాని రూపాలు కూడా వున్నాయి.

ఉదా॥ అంబు మ్రింగిన (అంబవు అని అనాలి)

వస్తులెవ్వని యింట (వస్తువు లెవ్వని యింట అని అనాలి)

ఉ) 'ము' వర్ణకం వైకల్పికంగా రావటం, అసలు రాకపోవటం అవసరం లేని చోట రావటం లాంటి అసాధారణ రూపాలు కనబడుతున్నాయి.

ఉదా॥ సయ్యాట (వైకల్పికం)

నశగాదు, సంసర్గ ఏలిపినావు ('ము' వర్ణ లోపం)

పులకముల్ మెఱసెన్ (గగుర్పాటు అనే అర్థంలో 'ము' వర్ణం చేరదు)

(2) తృతీయా విభక్తి ప్రత్యయాలు

తోడి (తోడ) ప్రత్యయానికి 'తోటి' అని కావ్య భాషలో కన్పిస్తుంది.

ఉదా॥ "హరియించును తోటి హలహల ముంబోలెన్"

(3) పంచమీ విభక్తి ప్రత్యయాలు

అ) పంచమీ విభక్తి ప్రత్యయమైన 'వలన' కు బదులుగా 'వల్ల' వాడడం ఈ కావ్యాల్లో కన్పిస్తుంది.

ఉదా॥ 'కల్లనా వల్ల గోరంత కలిగెనేని'

ఆ) 'నుండి' కి మారుగా 'నుంచి' అనేది ఈ యుగాల్లో కనబడుతుంది.

ఉదా॥ 'పూనిన దాన్యులనుఁ దమ భూముల నుంచి'

(4) షష్ఠి విభక్తి ప్రత్యయాలు

అ) షష్ఠి విభక్తి ప్రతయమైన 'కు' కు ముందు చేరే 'న' గాగమం రాని రూపాలు కావ్య భాషలో కన్పిస్తున్నాయి.

ఆ) 'లోపల' ప్రత్యయానికి 'లో' రూపాంతరం. అయితే దానికి హ్రస్వ రూపమైన 'లో' వాడకం కనబడుతుంది.

ఉదా॥ వార్థిలో

ఇ) కావ్య భాషలో 'బద్ద' అనే అర్థంలో 'కాడ' అనే పదాన్ని ప్రయోగించారు.

ఉదా॥ 'నాకాడ'

**(10) ఔప విభక్తికాలు**

ఇ, టి, తి అనేవి ఔప విభక్తి ప్రత్యయాలు. ఈ ఔప విభక్తి ప్రత్యయాల్లో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి.

అ) భారతంలో ఒక పదానికి రెండు రూపాలు కనబడుతున్నాయి.

ఉదా॥ నీరు - నీరి (భారతం, 1-5-196)

నీటి (భారతం, 1-3-201)

ఆ) నన్నయ కాలంలో అనుహత్ సంఖ్యా వచన విశేష్యం 'ఒకండు' దీని ఔప విభక్తి రూపం 'ఒకంటి'. ఇది 13వ శతాబ్దాంతానికి ప్రథమాంతంగా గ్రహించబడి 'ఒకండు' అనే మహద్వాచక రూపం అయింది.

ఉదా॥ ఒకండు - ఒక ఒన్టు

ఇ) అనంతర కాలంలో ఔప విభక్తాలు అనౌపవిభక్తాలు గాను అనౌపవిభక్తికాల్ని ఔప విభక్తికాలు గాను కవులు కావ్యాల్లో వాడారు.

ఉదా॥ "మఱసనాడు" (మరసటి నాడు - అని ఔప విభక్తిక రూపం)

**(11) సంఖ్యా వాచకాలు**

అ) మొదటి సంఖ్యా వాచకానికి మహత్, మహతి, అనుహత్ మూడు రూపాలు ఏర్పడ్డాయి.

ఉదా॥ ఒకడు, ఒకతె, ఒకటి. దీని ఔప విభక్తి రూపం ఒకటి, ఒక్కంటి.

ఆ) నన్నయ రచనలో ఏను ప్రయోగం వుంది 12, 13 శతాబ్దాల నుండి కావ్య భాషలో ఐదు కనబడుతుంది.

ఉదా॥ ఐదు శరంబులు (తిక్కన - ద్రోణపర్వం, 3-223)

ఇ) పూరణార్థంలో నన్నయ అవు (అగు) ప్రయోగించాడు.

ఉదా॥ నాలవు సర్వంబు (భారతం, 1-1-41)

తిక్కన మొదలైన కవుల్లో దానిపై 'అ' విశేషణంగా చేరిన 'అన' రూపముంది.

ఈ) ప్రబంధ యుగ కావ్యాల్లో ఆధునిక వ్యావహారిక భాషలోని యాభై, ఎనభై, నలభై లాంటి రూపాలు కనబడుతున్నాయి.

ఉదా॥ ఎనభై వేలు.

లక్ష యాభై వేలు

**(12) సర్వ నామాలు**

అ) ఉత్తమ, మధ్యమ, పురుష సర్వనామ రూపాల్లో ఏక, బహువచనాలు రెండింటిలోనూ రెండేసి రూపాలు కవిత్రయ యుగ కావ్య భాషలో కనబడుతున్నాయి.

ఉదా॥ ఏను - నేను

ఏము - మేము

ఈవు - నీవు

ఈరు - మీరు

ఆ) వాడు, అది, ఇది, రూపాలకు నన్నయ కాలంలో నీచార్థ స్ఫురణ లేదు. అయితే తిక్కనాదుల్లో నీచార్థ స్ఫురణ ఏర్పడింది.

ఉదా॥ వాడు భీముడు, నీడుగవ్వడి (నన్నయ భారతం, 2-1-193)

అది సంతసించి (నన్నయ భారతం, 3-2-202)

ఇ) అత్మార్థక రూపం మూడు పురుషల్లోనూ నన్నయ అనంతరం కవుల్లో వాడబడింది.

ఉదా॥ తన్నుబంపుదేవ (ఉత్తమ పురుష) కుమార సంభవం)

ఈ) శాసనాల్లో కన్పించే వాండ్రు అనే పదాన్ని నన్నయ తర్వాత కవులు తమ కావ్యాల్లో వాడారు.

ఉ) ప్రబంధ యుగ కావ్యాల్లో విలక్షణ సర్వ నామ రూపాలు కన్పిస్తున్నాయి.

ఉదా॥ అదేమే (అది + ఏమే)

ఏంది (ఏమి + అది)

ఏందిలె (ఏమిటి + లే)

**(13)** వాక్య నిర్మాణం

అ) సంస్కృత భాషా ప్రభావం వల్ల కావ్యాల్లో యత్తదర్దక వాక్య ప్రయోగాలు, కర్మణి వాక్య ప్రయోగాలు చేరాయి.

ఉదా॥ "సిద్ధులచేతఁ బ్రతిష్ఠింపబడి" (శ్రీనాథుడు - భీమఖండం, 3-111)

ఎవ్వని చిత్తంబున నీవు వర్తింతువు.

ఆ) సాధారణంగా తెలుగు వాక్యం క్రియతో కూడికొని వుంటుంది. అయితే తెలుగు భాషలో క్రియా రహిత వాక్యాలు సహజ సిద్ధంగా చోటు చేసుకున్నాయి.

ఉదా॥ 'తాముదల ధర్మార్థ కామ మోక్ష స్థితికిన్' (భారతం - తిక్కన)

ఇ) సమానాధికరణ నిర్మాణం లాంటి వాక్య నిర్మాణం నన్నయకు పూర్వ శాసనాల్లో ఎక్కువగా కన్పిస్తున్నాయి. అయితే నన్నయ కాలంలో అక్కడక్కడ కన్పిస్తున్నాయి. నన్నయ తర్వాత కాలంలో ఇలాంటి వాక్య నిర్మాణం ఎక్కువగా కనబడుతుంది.

ఉదా॥ "కుపుత్రత్వంబు కంటె నపుత్రత్వంబు మేలు" (శ్రీనాథుడు-కాశీఖండం, 4-110)

ఈ) శ్రీనాథుని కావ్యాల్లో మొత్తం వాక్యమంతా కర్మగానే ప్రయోగించటం కన్పిస్తుంది.

ఉదా॥ ఇలువరసఁ జంద్రశేఖరు
నిలయంబున దీపకళిక నిలుపని వారిన్ (శ్రీనాథుడు - కాశీఖండం, 4-186)

ఉ) ప్రబంధ యుగ వాక్య విధానంలో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ యుగంలో యత్తదర్థక వాక్య విధానం కర్మార్థక వాక్య విధానం, క్రమ నిరహిత వాక్య విధానం కనబడుతుంది. దక్షిణాంధ్ర యుగంలో ముఖ్యంగా యక్షగానాల్లో అసమాపక క్రియా వాక్యాలు, క్రియా రహిత వాక్యాలు విస్తారంగా వున్నాయి. విలక్షణమైన వాక్య రచనా విధానం ఈ యుగ కావ్యాల్లో కన్పిస్తున్నాయి.

(ఎ) యత్తదర్థక వాక్యాలు

ఉదా॥ "ఏ రాజు భుజ శౌర్య మేదులా ఖానాది
నచ్రీల చెలిమికి నశ్య విద్య"
"సాగరము దాఁటి జనంబలరగ
నే ఘనుండా మరు దాత్మజాతుఁడు"

(బి) కర్మణి వాక్యాలు

ఉదా॥ "కొలువు కూటంబు శృంగారింపఁబడిన వార్త విన్న నాఁడై"

(సి) ఒక వాక్యంలో విశేష్యం ఒక వచనంలోనూ క్రియా మరో వచనంలోనూ కవులు వాడారు.

ఉదా॥ "సరివితో నస్తు నిచార్యుకని లేదు
ఎలిమితో నసియింప యిండలేదు"

(డి) లింగ విషయంలో విశేష రూపాలు.

ఉదా॥ అర్మిలి నీశ్వరుండని వేరెకలదా!

(ఇ) పురుషుల్ని స్త్రీ లింగ సంబోధనతో పిలిచే వాక్యాలు.

ఉదా॥ తిప్పా - కాదురా (మంచుగా)

మంచిగాడు - ఏమే (అన్న గారు)

(యఫ్) కర్త మధ్యమ పురుష తోనూ, క్రియ మధ్యమ పురుష తోనూ వున్న వాక్యాలు.

ఉదా॥ తద్దర్శి జలధి హిమాంశుఁడీవు

రామరాఘునాథ నృపచంద్ర

(జి) కర్త ప్రథమ పురుషతోనూ, క్రియ మధ్యమ పురుషతోనూ వున్న వాక్యాలు.

ఉదా॥ శిష్యుడు, వినవోయి (జాతిహీనుండుగా నున్నావే)

(హెచ్) వ్యావహారిక వాక్య రచనా విధానం కూడా ఈ యుగాల్లో బాగా కన్పిస్తుంది.

ఉదా॥ ఓయి తిప్పాభట్లు (మీరు ఎవ్వలెవ్వరు నస్తిరాయి)

**(14) మాండలిక శబ్ద ప్రయోగాలు**

(అ) తిక్కన "భారతం" లో 'కపిల' అనే పదాన్ని వాడాడు. 'మోట' అనే అర్థంలో (కపిల) ఈ శబ్దం నెల్లూరు ప్రాంతంలో వ్యవహారంలో వుంది.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ | "చాటంత మబ్బు దోసె" | - | శుకసప్తతి |
| | ముత్తేలహారములను | - | రాజగోపాల విలాసం |
| | నేతిడి | - | (నేయి + ఇడి) |

(ఆ) కావ్యాల్లో కన్పిస్తున్న మరికొన్ని మాండలిక పదాలు.

ఉదా॥ అవునషే

మళ్ళిరాదా

బతిమాలుకొద్ది నీవు

**(15) పదజాలం**

(అ) నన్నయ 'భారతం' లో తత్సమ పదాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి.

(ఆ) తిక్కన రచనలో త్రాసు (తరాజు - పారశీక) అనే అన్యదేశ పదం మొదటి సారిగా కనబడుతుంది.

ఉదా॥ త్రాసులంబోని చిత్తంబుల తోడత (భారతం-శాంతి, 2-374)

(ఇ) తిక్కన సమకాలికుడైన మూల ఘటిక కేతన త్రాసు అనే పదాన్ని వాడాడు.

ఉదా॥ అచ్చులు ద్రాసులు దూములు బొచ్చెంబుగ జేసి . . . . .

(నిజ్ఞా ప్రాయశ్చిత్తాకాండం. ప. 65)

(ఈ) 'ఉత్తర హరివంశం' లో నాచన సోమనాథుడు 'కోహళి' అనే పదాన్ని వుపయోగించాడు.

ఉదా॥ "పార్వతీ పతికిఁ బభూత భూతపతి
గొన్నయెలరు గెందమ్మి గొన్న కోహళి
యనంగా . . . . . . . " (3 - 66)

(ఉ) శ్రీనాథుడు అసలు / అస్ల్, పారశీ / కాగితము / కాఘజ్, పారశీ, బజార్ / బజార్, పారశీ / హద్దు / హద్, పారశీ లాంటి అన్యదేశాల్ని ఇంచు మించు 150 వరకు వాడాడు.

(ఆచార్య టి. దొణప్ప - భాషాచారిత్రక వ్యాసావళి - పుట 171)

(ఊ) శ్రీనాథ ప్రబంధయుగాల్లో గలడ, జోడు, నకలు, షరతు అమలు మొదలైన అనేక ఉర్దూ ప్రయోగాలు కన్పిస్తున్నాయి.

(ఎ) 'ఆముక్తమాల్యద' లో శ్రీకృష్ణ దేవరాయలు 'బాతు' అనే పోర్చుగీసు పదాన్ని వాడాడు.

ఉదా॥ "తల బక్షచ్చుట గ్రుచ్చి బాతువులు
కేదారంపు గుల్యాంతర . . . . . ." (ఆము. 1-165)

(ఏ) అనంతర కాలంలో సాంఘీక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, వ్యాపార కారణంగా అరబ్బీ ఫారశీ పదాలు కావ్యాల్లో కన్పిస్తున్నాయి.

ఉదా॥ ఫౌజు, ఖుశాలు, తేజీ, షికారు, బందిఖానా మొ॥నవి.

(ఐ) రాను రాను కావ్యాల్లో వ్యావహారిక పదాలు చాలా ఎక్కువగా చోటు చేసుకున్నాయి.

| | | |
|---|---|---|
| ఉదా॥ | తానంబు సేసి - | (స్నానంబు చేసి) |
| | మఱుసనాడు - | (మరుసటినాడు) |
| | యవ్వనాఢ్య - | (యౌవనాఢ్య) |
| | పూలమ్మ్మ - | (పూవు, అమ్ము) |
| | మద్దె వాచియు - | (మద్దెల వాయించియు) |

స్థూలంగా ఇది నాటి కావ్య భాషా స్వరూపం. సజీవమైన భాష ప్రవహించే నది వంటిది. నదీ ప్రవాహం ఒకచోట వెడల్పుగా, మరొక చోట సన్నగా, ఒకచోట లోతుగా, మరొక చోట లోతు తక్కువగా, ఒకచోట సమానంగా, మరొక చోట ఎగుడు దిగుడుగా, ఒకచోట స్వచ్ఛంగా, మరొక చోట మకిలెగా ఉన్నట్లే, భాష కూడ నానా విధాలుగా ఉంటుంది. ప్రాత నీటిలో క్రొత్త నీరు చేరినట్లే ప్రాత తరాల భాషలో క్రొత్త తరాల భాష కలిసిపోతుంది. ముక్కూ మొగమూ సరిగా లేని రాళ్ళు ప్రవాహవేగంతో అరిగి కరిగి సాలగ్రామాల స్వరూపం సంతరించుకొన్నట్లే ఒకప్పుడు అసాధువులు గ్రామ్యాలు ఐన పదాలు కాలక్రమాన జన వ్యవహారంలో నలిగి శిష్టజనులు గ్రహిస్తారు. అందుకొరకే "ప్రవాహినీ దేశ్యా" అన్నారు పెద్దలు.

## 18.3 సమీక్ష

తెలుగు శాసనాల్లోని భాషా పరిణామం గురించి, కావ్యాల్లోని తెలుగు భాషా పరిణామం గురించి తెలుసుకున్నారు.

## 18.4 ప్రశ్నలు

1. ప్రాఙ్నన్న యుగ భాషా విశేషాలు వివరించండి.
2. కావ్య భాషా పరిణామము గురించి వివరింపుము.

**లఘు ప్రశ్నలు**

1. తెలుగు శాసనాలు - వాక్య నిర్మాణం.
2. తెలుగు శాసనాలు - సంఖ్యా వాచకాలు.

## 18.5 ఆధార గ్రంథాలు

1. తెలుగు భాషా చరిత్ర - డా॥ వెలమల సిమ్మన్న
2. తెలుగు భాషా చరిత్ర - ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి
3. ప్రాఙ్నన్నయ యుగ భాషా స్వరూపము - ఆచార్య దివాకర్ల వేంకటావధాని.

**డాక్టర్ డొక్కు కృష్ణ డిటెక్టివ్**
ఎం.ఏ., పిహెచ్.డి., యల్.యల్.బి.
లెక్చరర్ (తెలుగు)
యస్.పి. మహిళా కళాశాల
మచిలీపట్నము, కృష్ణా జిల్లా